తొలి మలితరం

# తెలుగు కథలు

డా॥ అక్కిరాజు రమాపతిరావు

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్
గుంటూరు

# తొలి మలి తరం
# తెలుగు కథలు

సంపాదకుడు

డాక్టర్ అక్కిరాజు రమాపతి రావు

సహ సంపాదకుడు

మోదుగుల రవికృష్ణ

ప్రచురణ

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్

గుంటూరు

# Toli Mali Taram Telugu Kathalu

(Compilation of of Telugu Short Stories)Edited by

Dr. Akkiraju Ramapathi Rao
Ph : 95508 67885

Associate
Modugula Ravi Krishna
Ph : 94403 20580

Published by
Bommidala Srikrishnamurthy Foundation
Guntur

Publication No. 10

Published on : 15.07.2018

Copies : 1000

Price : **250/-**

Cover Setting
Setlem Chandra Mohan
94404 59194

Inner Title
Pemmaraju Ravi Kishore
80080 08790

Page Setting
Palle Venkateswarlu
98660 16690

For Copies

1. Navodaya Book House
   Kachiguda, Hyderabad. Ph : 040-24652387
2. Visalandhra Book House all branches

Printing
Sri Sri Printers
Vijayawada

తొలి మలితరం తెలుగు కథలు సంకలనాన్ని ప్రచురించాలనే

నా కోరికను చెప్పగానే వెనువెంటనే అంగీకరించిన

**శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారికి**

వినమ్రపూర్వక పరశ్శత ప్రణామాలు.

**– అక్కిరాజు రమాపతిరావు**

# విషయసూచిక ...


| | | | |
|---|---|---|---|
| | విశ్వరూప సందర్శనము | – అక్కిరాజు రమాపతిరావు | 9 |
| 1. | అపూర్వోపన్యాసము | – ఆచంట వెంకటసాంఖ్యాయనశర్మ | 13 |
| 2. | లాజరస్ | – భాసుడు | 21 |
| 3. | ప్రేమోద్వేగం | – చిల్లరిగె శ్రీనివాసరావు | 27 |
| 4. | పశ్చాత్తాపం | – అ. రాఘవశర్మ | 34 |
| 5. | అరిసె ముక్కలు | – వర్ఘ్ణు బాబురావు | 42 |
| 6. | వూదా చీర | – మునిమాణిక్యం నరసింహారావు | 50 |
| 7. | గంగన్న | – నందగిరి ఇందిరాదేవి | 59 |
| 8. | గానభంగము | – నోరి నరసింహశాస్త్రి | 67 |
| 9. | పోయిన నగ | – కొడవటిగంటి వెంకటసుబ్బయ్య | 77 |
| 10. | వంశపావనుడగు తనయుడు | – కోటంరాజు పున్నయ్య | 88 |
| 11. | నేను చేసినపని | – గుడిపాటి వెంకటచలం | 96 |
| 12. | ఇంకొక విధము | – విశ్వనాథ సత్యనారాయణ | 107 |
| 13. | సుగాలి కుటుంబం | – చింతా దీక్షితులు | 110 |
| 14. | వెఱ్ఱాసుపత్రి | – గిడుగు వేంకటసీతాపతి | 119 |
| 15. | ఇల్లాలుమాట తప్పుతుందా? | – శేషాద్రిరమణ కవులు | 126 |
| 16. | పట్టు సెల్లా | – సుధాకరుడు | 131 |
| 17. | ఏబదివేల బేరము | – కె. రామానుజరావు | 137 |
| 18. | మన పద్ధతుల నితరులెట్లు భావించుచున్నారు? | – వెదురుమూడి శేషగిరిరావు | 145 |
| 19. | గళ్లచీర | – పురాణం కుమారరాఘవశాస్త్రి | 153 |
| 20. | అధర సుధారసం | – కవికొండల వెంకటరావు | 163 |
| 21. | దేవుడు | – వేలూరి శివరామశాస్త్రి | 169 |

| | | | |
|---|---|---|---|
| 22. | బోధన | – చలం | 175 |
| 23. | లండన్ విద్యార్థి | – ఒద్దిరాజు రాఘవ రంగారావు | 181 |
| 24. | రాజా | – తాతా కృష్ణమూర్తి | 188 |
| 25. | ఎదుగని బిడ్డ | – అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు | 200 |
| 26. | శాస్త్రిగారి సమాచారము | – రాయసం వెంకటశివుడు | 206 |
| 27. | అదృష్టము | – శ్రీనివాస శిరోమణి | 213 |
| 28. | యేప్రిల్ ఒకటవతేదీ | – కాళూరి వేంకటరామారావు | 219 |
| 29. | భామ | – దిగుమర్తి రామారావు | 240 |
| 30. | కాలం కల్పించే మార్పు | – ముద్దుకృష్ణ | 249 |
| 31. | ప్ఛ్! | – మల్లాది రామకృష్ణశాస్త్రి | 259 |
| 32. | మంచిమనిషి | – తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి | 265 |
| 33. | అభాగిని | – విక్రమదేవవర్మ | 278 |
| 34. | లీల | – రాయసం వెంకటశివుడు | 281 |
| 35. | ఏరువాక | – రావూరు సత్యనారాయణ | 297 |
| 36. | షష్టిపూర్తి | – గవని వెంకట కృష్ణారావు | 305 |
| 37. | అంతఃపురోపన్యాసము | – పానుగంటి లక్ష్మీనరసింహారావు | 311 |
| 38. | పశ్చాత్తాపము | – గుమ్మిడిదల దుర్గాబాయి | 315 |
| 39. | దరిద్రనారాయణుడని ఆ జగద్రక్షకుడికి బిరుదైతే! | – కనుపర్తి వరలక్ష్మమ్మ | 330 |
| 40. | సుదర్శనరావు పంతులు | – చిలకమర్తి లక్ష్మీనరసింహారావు | 342 |
| 41. | కరుణకము | – వేటూరి ప్రభాకరశాస్త్రి | 347 |
| 42. | ధనత్రయోదశి | – భండారు అచ్చమాంబ | 358 |
| 43. | తీరని సమస్య | – కొడవటిగంటి కుటుంబరావు | 373 |
| | వందేళ్ల తెలుగు కథకు వందనం | – అక్కిరాజు రమాపతిరావు | 378 |

# కృతజ్ఞతలు

ఇటువంటి సంకలనం ఒకటి కూర్చాలన్న ఆసక్తి శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు (అప్పటి విపుల–చతుర సాహిత్య పత్రికల నిర్వాహకులు) విపుల (కథల పత్రిక) లో 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' అనే శీర్షికతో పాతతరం తెలుగు కథారచయితలను, వారి కథలను పరిచయం చేసే ఒక శీర్షికను కొంతకాలం నిర్వహించే ఉద్దేశం, దీని ఎంపిక నాకు అప్పగించటం వల్ల నాలో జనించింది. సుమారు రెండు సంవత్సరాలు 'విపుల' పత్రికలో ఈ కథలు ప్రచురితమైనాయి. తరువాత తరచు నేను అమెరికా రాకపోకలు చేస్తుండటంవల్ల ఈ శీర్షిక కొత్తరూపం దాల్చింది. ఇప్పటికీ ప్రముఖ కథా రచయితల ప్రశస్తకథలను 'విపుల' ప్రచురిస్తూనే వుంది.

ఈ సంకలనం రూపొందటానికి కారకుడైన శ్రీ రాఘవేంద్రరావుకి కృతజ్ఞతలు. ఇప్పటి విపుల–చతుర నిర్వాహకులు శ్రీ చంద్రప్రతాప్‌కి నా కృతజ్ఞతలు. నేను కొన్ని కథలు ఇందులోవి పోగొట్టుకోగా శ్రీ చంద్రప్రతాప్ వాటిని నాకు తిరిగి అందించి నాకు ఎంతో సహాయం చేసినవారైనారు.

చక్కగా డిటిపి చేసిన శ్రీమతి బలిజేపల్లి కృష్ణమానసకు, పేజ్ సెట్టింగ్ చేసిన శ్రీ పల్లె వెంకటేశ్వర్లుకు, దీనికంతటికీ నేపథ్యంగా వున్న మోదుగుల రవికృష్ణగారికి నా ఆదరాభిమాన ప్రేమపూర్వక ఆశీస్సులు.

ఈ సంకలనం త్వరగా ప్రచురించబడటానికి కారణం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు. వారు ప్రోత్సహించారు. అవసర ఆపన్నహస్తం అందించారు. అందుకు వారికి కృతజ్ఞతలు.

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తిగారికి సాహిత్యంపట్ల ఉన్న నెనరుకు ఎన్ని అభినందనలు తెలిపినా తక్కువే.

ఇంకా నా మిత్రులు, నా పట్ల అభిమానం కలవారు ఈ సంకలనం విషయంలో తోడ్పడ్డారు. వీరందరికీ, మీరందరికీ నా కృతజ్ఞతలు.

30.06.2018 **అక్కిరాజు రమాపతిరావు**
హైదరాబాదు.

# విశ్వరూప సందర్శనం

విశ్వరూప సందర్శనం అంటే తెలుగుకథ విశ్వరూపసందర్శన మన్నమాట. ఆధునికార్థంలో తెలుగుకథ ఆవిర్భావం సుమారు నూటనలభై ఏళ్ళ కింద అని ఉరామరగా లెక్కగట్టి చెప్పాలి. ఈ కాలిక తెలుగుకథ వస్తు రూప శిల్ప పథ ప్రస్థాన వికాసంలో సుమారు లక్షావధికంగా కథారచన జరిగి ఉంటుంది. ఇంకా ఎక్కువ సంఖ్యలో కూడా కథలు వెలువడి ఉండవచ్చు. ఒక వెయ్యిమందైనా ప్రతిభావంతులైన తెలుగు రచయితలు మనకున్నారు. సుమారు నూరుగురైనా కథారచయిత్రులున్నారు. ఇదీ తెలుగుకథ విశిష్టత, విశ్వరూపత.

2010 సంవత్సరంలో తెలుగుకథ శతజయంతి జరిగింది. కాని అప్పటికి ఇరవై సంవత్సరాలకు ముందునుంచే కథారచన ఉందంటున్నారు తత్త్వవివేచకులు. సమాజంతో పాటు తెలుగుకథ కూడా ప్రభావితమైంది. అప్పటి ఆచారవ్యవహారాలు, సామాజిక జీవితం, సమస్యలు, సంఘర్షణలు, కష్టాలు, కన్నీళ్ళు ఇప్పటివారికి వింతగా తోచవచ్చు. తెలుగుకథ ఈ సామాజిక పరిణామ పర్యవసానాలను బలంగా ఇతివృత్తీక రించింది. బహుశా ఈ నూరు నూటయాభై ఏళ్ళలో ఈ ప్రక్రియను అభిమానించిన, అలరించిన విశిష్టరచయితలు మరే ఆధునిక సాహిత్య తెలుగు ప్రక్రియకూ లేరనే చెప్పాలి. ఇంత సంఖ్యలో మరే ప్రక్రియా సంబంధి రచనలు వెలువడలేదు.

అంతేకాదు, సమకాలీన సమాజపు పోకడలను, పరిణామాలను, పర్యవసానాలను మంచిచెడ్డలను ఈ సాహిత్యప్రక్రియ చిత్రించినంత విస్తారంగా, బలంగా, ప్రతిభా శీలంగా మరే ప్రక్రియా చిత్రించగల అవకాశం లేదు కదా! తక్కిన ప్రక్రియలు ఏవైనా సమాజపు ఒడిదుడుకుల ఒక పార్శ్వాన్ని, ఒక ప్రబల సమస్యను మాత్రమే చిత్రించగల సామర్థ్యం మాత్రమే చూపగలవు. కథ విషయం అటువంటిది కాదు. సమగ్ర, సంపూర్ణ మానవసమాజాన్ని కథ ఆవిష్కరించగలదు. కథలో పల్లె జీవ సాక్షాత్కార పాత్రలు నాటకం, నాటిక, నవల వంటి వచన ప్రక్రియలలో చూపగలిగినా అవి వస్త్వాశ్రయాలు

మాత్రమే కాగలవుకాని, ఆత్మాశ్రయాలు కావు. హృదయదఘ్నమైన అనుభూతులను కథ ఆవిష్కరించినంతగా మరి ఏ ఇతర సృజనాత్మక సాహిత్య ప్రక్రియ ఆవిష్కరించటం కుదరదేమో!

అందువల్లనే కథకింత ప్రాముఖ్యం ఆధునిక సాహిత్య ప్రపంచంలో ఏర్పడి ఉండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇది దృగ్విషయం అన్నారు సాహిత్య తత్త్వజ్ఞులు. వెనుకటి కాలంలో నాటకానికీ, కావ్యానికీ ఉన్న ప్రాధాన్యం ఇప్పుడు చిన్న (లేదా) పెద్ద కథ త్రోసిరాజన్నది అన్నాడు ప్రముఖ సాహిత్యవేత్త వి.ఎస్. నయపాల్. ఈయన భారతీయ మూలాలున్న పాశ్చాత్యదేశ రచయిత. ఇంగ్లండులో పెద్ద చదువులు చదువుకున్నవాడు. సాహిత్యంలో నోబెల్ పురస్కారం కూడా పొందినవాడు.

బహుశా ఇందుకు కారణం ఇట్లా ఊహించవచ్చు. అప్పటికాలం ప్రధానంగా రాచరికం. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సమాజాలన్నీ కోరు కుంటున్నాయి. కొన్నిచోట్ల రాజరిక వ్యవస్థ కొనసాగుతూనే ఉండవచ్చు. కాని ప్రజలంతా ప్రజాస్వామ్యం కోసం అర్రులు చాస్తున్నారు. అందువల్ల కావ్యానికీ, పురాణ, ఇతిహాస, ఇతివృత్త నాటక రచనకూ సాహిత్యంలో ఆదరణీయస్థానం లేదనుకోవాలి.

తెలుగునాట, తెలుగునోట ఆధునికత కొంచెం ఇంచుమించుగా రెండు వందల ఏళ్ళనాటిది. భారతదేశంలో వలస రాజ్యపరిపాలనతో ఇది ప్రారంభమైంది. భారతీయ పూర్వకాలపు సాహిత్య ప్రక్రియలేకాక పందొమ్మిదో శతాబ్ది మొదటి దశాబ్దాలు నడుస్తున్న కొద్దీ మనకు పరిచయమవుతూ వచ్చిన ఆంగ్ల సాహిత్య ప్రక్రియల ప్రభావం వల్ల భారతీయ సాహిత్యంలో నూతన సాహిత్య ప్రక్రియల పట్ల దృష్టి మళ్ళింది. ఇట్లా ఇంగ్లీషు సాహిత్య ప్రక్రియలను తెలుగువారికి పరిచయం చేసిన ఆద్యుడు కందుకూరి వీరేశలింగమే అని చెప్పాలి.

నిజానికి చిన్న (పెద్ద) కథ ప్రక్రియను కూడా ఆయనే ప్రారంభించాడనడానికి అభ్యంతరం ఉండకూడదు. 1887 నాటికే వీరేశలింగం 'సత్యవతీ చరిత్ర'మనే పెద్ద కథ మహిళల కోసం తానుద్దేశించిన పత్రికలో ప్రారంభించాడు. దీనిని ఆయన చిన్న నవలగా (నవలిక) భావించాడేమోకాని, ఇది పెద్దకథే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కథలో కచ్చితంగా నిడివి పాటించలేదు. శ్రీపాదవారిని మనం గొప్పకథారచయితగా చెప్పుకుంటున్నప్పుడు కందుకూరివారిని కూడా కథా రచన బీజకుడని చెప్పాలి.

తెలుగుకథ ఉద్భవ వికాస పరిణామ చరిత్రలో అత్యంత విశిష్టమైన విషయం ఏమంటే 20వ శతాబ్ది తెలుగు సాహిత్య చరిత్రలో నూటికి తొంభై తొమ్మిది మంది రచయితలు కథారచనపట్ల సమ్మోహదృష్టి బరపినవారే. వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రివంటి గొప్ప వేదవేత్తలు కూడా కథ రాయడానికి ఆసక్తి చూపటం ఆ విశిష్టత. 20వ శతాబ్ది భారతీయ సాహిత్యచరిత్రలో తక్కిన భాషా ప్రాంతాల వారికి ఇటువంటి విలక్షణత ఉన్నదో లేదో అనిపిస్తుంది. మల్లంపల్లి, నేలటూరివంటి గొప్ప చరిత్ర పరిశోధకులు కూడా చారిత్రకేతివృత్తాలతో కొన్ని కథలు రాశారు. బూర్గుల రామకృష్ణారావు 'ఫూల్‌జానిబేగం' అనే చారిత్రకేతి వృత్తాన్ని కథగా రచించారు. కురుగంటి సీతారామయ్యగారు కథ రాశారు. ఈ కథ పూర్తిగా సాంఘికం. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డివంటి గొప్ప సాహిత్య పరిణితులు కథారచన చేపట్టారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా కథలు రాశారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు కథా రచయితగా ఆనాటి పాఠకులకు తెలుసు.

ఇప్పుడీ తొలి, మలితరం తెలుగు కథలలో గురజాడ అప్పారావుకు ముందు రాసినవారి కథలు, అటు తరువాత ఆయన ప్రభావం వల్ల నవ్యత సంతరించుకున్న తెలుగుకథ రూపరేఖలను మరింత నవీకరించినవారూ అయిన తెలుగుకథా రచయితల కథలు 20వ శతాబ్ది ప్రారంభం నుంచి ఒక అర్ధశతాబ్దకాల వ్యవధిలో ప్రాతినిధ్య సూచకంగా విలక్షణమైన కథలున్నాయి. మహిళలు రాసిన కథలు కూడా సుమారు పదిదాకా ఉన్నాయి. శ్రీశ్రీ మెచ్చిన గొప్పకవి కవికొండల వేంకటరావు గొప్ప కథారచయిత అని ఈ తరంవారికి తెలియకపోవచ్చు.

1920 నాటికే కేవలం కథారచనకే ప్రాముఖ్యమిచ్చిన కథల పత్రిక 'సాహితి' ప్రారంభమైంది. చలం మొట్టమొదటి కథ ఇందులోనే వచ్చిందంటారు – ఈ పత్రిక సంపాదకవర్గంలో సహాయకులైన కొడాలి ఆంజనేయులుగారు. వీరు విశ్వనాథ జంటకవి. కొడవటిగంటి వేంకట సుబ్బయ్య, వఝ్ఝు బాబూరావు, గిడుగు సీతాపతి వంటివారు కూడా కథా రచన చేశారని ఈ తరంవారికి తెలిసే అవకాశం లేదు. బరంపురం నుంచి వేగుచుక్క ప్రచురణల కథా పత్రిక 1910 ప్రాంతం (శ్రీశ్రీ పుట్టిన సంవత్సరం)లో వెలువడిందని ఎందరికి తెలుసు? తాతా కృష్ణమూర్తి చాలా ప్రతిభావంతు డని కథా రచయిత అని కూడా ఇప్పుడీ తొలి మలితరం తెలుగు కథా ప్రాతినిధ్య సంపుటి ద్వారానే తెలుసుకునే అవకాశం కలుగుతున్నది. తాతా కృష్ణమూర్తి

చాలా వస్తు వైవిధ్యంగల కథలు రాసిన అత్యంత ప్రతిభావంతుడైన కథా రచయిత. వీరికి ఇంగ్లీషు సాహిత్యంతోగల సాన్నిహిత్యం అత్యంత ప్రగాఢ శీలమైనదని వడలి మందేశ్వరరావుగారు ప్రస్తావిస్తూ వుండేవారు.

ఒద్దిరాజు సోదర కవులు, శేషాద్రి రమణకవులు, ఆదిరాజు వీరభద్రరావుగారు కథలు రాశారని ఈ తరం కథారచనాభిమానులకు తెలిసే అవకాశం లేదు. కొడాలి ఆంజనేయులుగారు కూడా కథారచయిత అని కొన్ని ఆధారాలనుబట్టి ఈ సంకలనంలో ప్రతిపాదించటం జరిగింది. ఈనాటి పాఠకులకు తెలియని పేర్లు ఇందులో ఇరవై ముప్పైమందివి కనపడతాయి.

ఈ కథా సంకలనం వల్ల తెలుగు కథ వస్తు రూప శిల్ప వికాసం, పరిణామ క్రమం కూడా అవగతమవుతుంది. నూరేళ్ళ నాటి కథా రచనా వస్తువు లేవిధంగా ఉండేవో ఈ సంకలనం స్పష్టం చేస్తుంది. కథా రచనకు ప్రాముఖ్యం కలగజేసిన సాహిత్య పత్రికల భోగట్టా కూడా కొంతవరకు ఈ సంకలనం ద్వారా తెలుసుకోవచ్చు. తొలి, మలి తరం కథా రచయితలలో కొందరు వాడుక భాష నిర్వహించలేక గ్రాంథికంలోనే కథలు రాసినా వారి శైలి సరళమూ, విశదమూ, వ్యావహారిక భాషకు బహు సన్నిహితంగా ఉండటం ఈ కథల ద్వారా గ్రహించవచ్చు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటి గొప్ప సాహిత్యవేత్త కథలు రాసినట్లు ఈ సంకలనం ద్వారా తెలుసుకోవచ్చు. ఆయన శైలి సరళ గ్రాంథికం. విక్రమదేవవర్మ వంటి సంస్థానాధిపతి, గ్రాంథికభాషాభిమాని కథారచనకు ఉత్సహించడం గొప్ప విశేషం. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు 19వ ఏట తలపెట్టిన 'ఆంధ్రి' పత్రికలో విక్రమదేవవర్మగారి 'అభాగిని' అనే కథ ప్రచురించారు. సుమారు నూటయాభైఏళ్ళ తెలుగు కథాసాహిత్య చరిత్రలో ప్రముఖ తొలి మలితరం కథా రచయితల, రచయిత్రుల ప్రాతినిధ్యకథలు ఈ సంపుటిలో సంకలితమైనాయి. ఈ అదృష్టం నాకు దక్కింది.

మీ

**అక్కిరాజు రమాపతిరావు**

విజయదశమి
30.09.2017
హైదరాబాదు.

# 1. అపూర్వోపన్యాసము

– ఆచంట వెంకటసాంఖ్యాయనశర్మ

శ్రీధరశాస్త్రి యిరువదేండ్ల యీడుగల సంస్కారి. కనుముక్కుతీరు గలిగి పోంత విగ్రహమువలెం గనపడువాడు. ధనవంతుండును జదువుకొన్నవాండు నయినను దేశక్షేమము కొఱకుం దన జీవితకాలమును ధారవోయందలచి పెండ్లి మానుకొని సంఘసంస్కరణమును గూర్చి యుపన్యసించుచు దేశాటనము సేయ నిశ్చయించు కొనెను. తిరిగి తిరిగి యమరావతీ నగరమునకుజేరి యచ్చట సంఘసంస్కరణ సమాజమునకుం దోడ్పడం దలంచి సామాజికుండయి దినదినము నుపన్యసించుచు రెండు మాసములు యచ్చట నుండెను. అతి బాల్య వివాహములు విధవావివాహములు సముద్రయానము మొదలగు విషయమలను గుఱించి యుపన్యసించుట కంతవాడు మఱి పుట్టంబోవడనియు నుపన్యసించునపుడు శ్రీరాములు మొదలు చిత్తగించవలెను దాంక గ్రుక్క విడువక గడగడమాటలాడ నలవాటుగలవాండనియు నమరావతీ విద్యార్థు లనుకొనుచుండిరి. పండితులుమాత్రమాతని యుపన్యాసములలో వినందగిన దానికన్నం జూడదగినవె యధికముగా నుండు ననుచుండిరి. ఉపన్యాసకాలమందు సీమసుద్దతో నల్లబల్లమీంద బ్రహ్మాభేద్యములగు సంగతులను దఱచుగా నంతడు వ్రాయు చుండుట చేతను, అభినయముతోనే మనోభావమును దెలియంబఱచుచుండుట చేతను శ్రీధరశాస్త్రి యుపన్యాసములు చూడందగినవేయని పండితు లనుకొనుట కవకాశము లేకపోలేదు. ఏది యెటులున్నను గొప్ప యుపన్యాసకుండను ఖ్యాతి మాత్రము దేశమంతయు వ్యాపించినది.

ఒకనాటి సాయంతరమున సంఘ సంస్కరణ సమాజ మందిరము నందొక గదిలోం గూర్చుండి యాతడు మనుస్మృతిని తదేక ధ్యానముతోం జదువుకొనుచుండగా నతనికిం బరమమిత్రుడంగు హనుమంతరాయండు చిన్నంబోయిన మొగముతో వచ్చి కట్టెదుట నిలువబడెను. శ్రీధరశాస్త్రి మొగమెత్తి చూచి పుస్తకము మూసి, “యేమి హనుమంతరాయా, నీ విచారమునకు శారదాంబయేనా కారణ”మని అడిగెను.

హనుమంతరాయఁ డిరువదేండ్ల యీడుగల చిన్నవాఁడు. చామనఛాయ గల యొంటిపేకమానిసి. నూనూగు మీసకట్టైనను లేకపోవుట చేత ముఖమునందు మగపోలికకంటే నాడుపోలిక యెక్కువ గలవాఁడు. చిన్ననాఁడే తల్లిదండ్రులు చనిపోయి నందున మేనమామ యమరావతికిఁ బంపి చదువు చెప్పించి పదునెనిమిదేండ్లు రాఁగానే తన కొమార్తెను బెండ్లియాడుమని కోరఁగా హనుమంతరాయ డంగీకరింపక మేనమామతోఁ గలహించి పిత్రార్జిత ద్రవ్యమును స్వాధీనపఱచుకుని యమరావతిలోనే కాపురము సాగించి సంఘసంస్కరణము విషయమునఁ బట్టుదలతో బనిసేయఁ దలంచి సమాజములోఁ జేరి విధవావివాహమును జేసికొనక మాననని ప్రతిజ్ఞ చేసెను.

హనుమంతరాయని ప్రతిజ్ఞ నెరవేరుటయే సామాజికుల కోరిక గనుక దానికేమీ భంగము గలుగునోయని వారికి భయము గలిగియుండుట వలన హనుమంత రాయఁడు చిన్నఁబోయి యుండుటకుఁ గారణమాతని వివాహవిషయమేయని శ్రీధర శాస్త్రికి బొడకట్టెను.

హనుమంతరాయఁడు మెల్లమెల్లనఁ గూర్చుండి "శాస్త్రీ! నా విచారమునకు శారద యెన్నఁడును గారణము గానేరదు. నేను శారదను బెండ్లియాడక మానను; శారద నన్ను బెండ్లియాడక మానదు. కాని నా విచారమునకు వేఱొక కారణము కలదు. నీవు దానిని బోఁగొట్టగలవని వచ్చితిని. ఎల్లుండి శారదయు నేనును బెండ్లికి రాజమహేంద్రవరమునకు బోవఁదలంచియున్నామనియుఁ బెండ్లిచేసికొని యచ్చటనే కాపురముందుమనియును మన సమాజమువారికిఁ దెలిసినది. రేపు రాత్రి సభ చేసి నాకేదో యొక వస్తువును బహుమానమీయ నిశ్చయించినారట! నాకు సంగీతమందుఁ గొంచెము ప్రవేశం కలదుగానీ సాహిత్యమునందు లేదని నీవెఱుంగుదువు గదా! రేపు బహుమానమందుకొని దొంగను దేలు గుట్టినట్లూరకున్న యెడల నగుబాటు కదా! కాఁబట్టి నేనొక చిన్న యుపన్యాసము చేయఁదలంచుకొన్నాను; నీవు సాయపడి నాకుపన్యాసమును నేర్పక తప్ప"దని చెప్పెను.

శ్రీధరశాస్త్రి నవ్వి "యిదేనా? ఎంత గొప్పపని?" అని లేచి, "హనుమంతా! రేపు – ఇలాగు– నిలవఁబడు–ఇలాగు నీ చేతులు బల్లఁ మీద ఈలాగు ఆనుకొని– ఈలాగు–; సభ్యులను చూసి– ఈలాగు– ఆరంభించు–ఈలాగు–

"ఆర్యా! సభాపతి! మిత్రులగు సామాజికులారా! నాలోఁ బట్టజాలని సంతోష ముండుటచేత మాటలకుఁ జోటులేదు. కాఁబట్టి నోటిమాటలు రాకున్నవి ఈ ముద్దుగులుకు–"

హను : ఉండు, కూడబలికి వల్లించుకోని – ఊ, సరే కాని –

శ్రీధర : యీ ముద్దుగులుకు చిన్న నగరమునందలి పండితులు సత్పురుషులునగు మీరిచటికి – "

హను : ఆగు; స్త్రీల మాటో!

శ్రీధర : విను 'యీ ముద్దుగులుకు చిన్న నగరమునందలి పండితులు సత్పురుషులు నగు మీరిచటికి దయచేసి పేరును ప్రతిష్ఠయును లేని పామరుఁడగు నన్నిట్లు గౌరవించుటచేత నేను ధన్యుడనగుచున్నాను" అని చెప్పి యాపిమ్మట చెప్పవలసినదాని నాలోచించి చెప్పుము.

హను : నాకంటే నీవే బాగా నాలోచించగలవు.

శ్రీధర : నీకిచ్చిన బహుమానమును జేతఁబట్టుకొని దానిని బొగడుము. అదియే నీకుఁ గావలసిన వస్తువనియు దానియందే నీకుఁ గోరిక యుండెననియు మీరెంతో దూరమాలోచించియే దీనినొసంగినారనియు జెప్పుము.

హను : అదియేది?

శ్రీధర : అదియేదో ఇంకను స్థిరపడలేదు; రామశర్మ నిలువుటద్దమన్నాడు, అదే యిచ్చినయెడల "మీ హృదయమువలె నిర్మలమైన యీ నిలువుటద్దమే నాకు మిక్కిలి యుపయోగించును; నా లోపములను దీని సాయంచేత దిద్దుకొన గలుగుదు" నని చెప్పుము. కేశవమూర్తి బంగరు గొలుసు నిమ్మన్నాఁడు; అదే యిచ్చినయెడల మిసమిసలాడు పసిమిగల యీ గొలుసు నందలి సన్నపుఁదీగలెట్లు పెనగొని యల్లిబిల్లిగా యల్లుకొని యున్నవో యట్లే మీతోడి నా చెలిమియు నుండునని సదా నేను జ్ఞాపకముంచు కొందునని చెప్పుము.

హను : ఆగు; ఏమిటి; "మిసమిసలాడు" అనేనా?

శ్రీధర : అవును; వాసుదేవరాయఁడు మురుగుల జత నిమ్మన్నాఁడు.

హను : అది మంచిది; శారదకుఁ రామునకుఁ బనికివచ్చును; అదే యదే మంచిది.

శ్రీధర : మురుగులcజతయే యిచ్చిన యెడల దాని నెపమున మెలమెల్లగా శారదాంబ పేరెత్తవచ్చును. "యీ మురుగులజత శారదకుc బరమానందము గలిగించును; విజ్జోడు గాకుండ నివి యెట్లుండునో మేము నట్లేయుందుము. ప్రణయకలహం చేత విరహము కలిగినను మాకీ మురుcగుల జత గనుపించిన తోడనే జతగూర్చుచుండునని చెప్పము. ఒకవేళ జతవస్తువు తీయని యెడల నవి యెన్నియైనను సరే వాని వలన నీకుc బ్రేమానురాగము లభివృద్ధిc బొందునని చెప్పి మీ హృదయము లన్నియు నేకీభవించినట్లే మా హృదయముల నేకీభవించునని చెప్పవచ్చును.

హను : శబాసు! శాస్త్రి! అసాధ్యుడవు సుమీ!

శ్రీధర : "నా మనసులో నున్నదంతయుc జెప్పుటకు మాటలనేర్పు చాలదు గనుక మీకు వందనము చేసి ముగించుచున్నాను." అని చెప్పి కూర్చుండుము– ఈలాగు –

హను : సరేకాని బహుమానమిచ్చిన వస్తువునేమి సేయమన్నావు?

శ్రీధర : ఉపన్యసించినపుడు చేతcబట్టుకొని – ఇలాగు– సభ్యులకుc గనపడు చుండునట్లు మీcది కెత్తిపట్టుకొని – ఈలాగు – పిమ్మట నీతోc దీసుకొని పొమ్ము.

అని యీతీరున నుపన్యాసము నేర్పి యింటికిc బొమ్మనెను. హనుమంత రాయcడు మరల మరల నుపన్యాసములో జెప్పవలసిన విషయమును గూర్చి శాస్త్రిని బ్రశ్న చేయుచుc గొంచెము దూరము వెళ్ళి మరలమరలc దిరిగి వచ్చుచు సంశయములను దీర్చికొని యెట్టకేల కింటికిcబోయెను.

మర్నాటి రాత్రి సమాజమందిరమున సభ చేసిరి. శ్రీధరశాస్త్రి రాక కెదురు చూచుచున్న హనుమంతరాయcడు శాస్త్రి రాగానే యతనిని దూరముగా దీసికొనిపోయి, "శాస్త్రీ! ఉపన్యాసమును వల్లించితిని. మనము కలిసి కూడcబలికి కొనవలయు"నని కోరెను గాని యవసరము లేదని శాస్త్రి చెప్పెను. కంఠధ్వని మధురముగా నుండుటకేమి సాధనమని హనుమంతరాయcడడుగగా, 'నీవు సంగీత మభ్యసించినవాcడవు గనుక నీకుc దెలియదా?కొంచెము మదనకామేశ్వరలేహ్యమును సేవించు'మని చెప్పెను. అదివరకు మిత్రులట్లే జెప్పియుండుటజేత సాయంతనమైనది మొదలుకొని 10,15 మోతాదులను సేవించియున్నను శాస్త్రి యుపదేశప్రకారము మఱియొక పెద్దమోతాదును గూడ సేవించెను.

తరవాత సమాజమువారు హనుమంతరాయనికి బంగారు పిడిగల సన్నని బెత్తమొకటి బహుమానమిచ్చిరి. దానిని జేతఁబట్టుకొని లేచి నిలువఁబడి హనుమంత రాయఁడు చేసిన యుపన్యాసమిది.

"సభాపతులారా! ఆర్యా! సామాజికుఁడా!– కాదు కాదు– ఆర్యా! మిత్రులగు సభాపతీ! మిత్రులుకాని సామాజికులారా!

నాలోఁబట్టఁజాలని– మదనకామేశ్వరము– కాదు కాదు–మాటలు– ఉండుట చేత – సంతోషమునకు జోఁటులేదు; గనుక సంతోషము రాకయున్నది. అందుచేత మీకు సంతోషము–కాదు కాదు–మాటలు గలుగవచ్చును; కలుగపోవచ్చును; కలిగీ కలుగకపోవచ్చును; తెలిసినదా?

పేరును బ్రతిష్ఠయులేని యీ చిన్నినగరమునందలి పామరులగు సత్పురుష లిచ్చటికి– అనగా–పేరును బ్రతిష్ఠయును లేని సత్పురుష పామరపండితులు గల యీ ముద్దుగులుకు చిన్న పామర నగరమునందలి మీరిచ్చటికి వచ్చి పండితుఁడనగు నన్ను గౌరవించుటచేత ధన్యుఁడనుగాను. సత్పురుషపండితులని చెప్పుటచేత సత్పురుషులు స్త్రీలు కారని మా తాత్పర్యము; స్త్రీలు–అనగా మగస్త్రీలు కాదు; ఆడస్త్రీలు అని నాయభిప్రాయము.

దీనిని–అనఁగా–యీ బహుమానమును మీరెంతో దూరమాలోచించి గావలసినది యిదేను (అని బెత్తమును మీఁదికెత్తి యాడించుచు) మాలో మాకుఁ గలహము గలిగి విసవిసలాడినప్పుడు మాకు దీనివలన నెంతో లాభము గలుగు చుండును. అనఁగా ముందుగా శారద దీనిని జూచినతోడనే – కాదు కాదు – నేను జూచిన తోడనే మా లోపములను దీని సాయముచేత దిద్దికొనుచుందుము. కాఁబట్టి మా హృదయములు నిలువుటద్దమువలె నిర్మలముగా నుండును. దీనితో రెండేకాదు– యెన్ని యైనను సరే లభించినప్పుడు సన్నపు గొలుసు తీఁగలవలె నల్లిబిల్లిగా నల్లుకొని దీనిని జ్ఞాపకముంచుకొందుము. ఇదే నాకు కావలసినది. శారదకును గావలసినది యిదేను; గనుక వందనము చేయుచున్నాను".

శ్రీధరశాస్త్రి యంతటఁ జప్పున లేచి "యోరి దౌర్భాగ్యుడా! బెత్తమురా యిది" యని చెప్పి బలిమిని గూర్చుండఁబెట్టి పిమ్మటఁదానిట్లు నుపన్యసించెను.

"సభాపతీ! సామాజికులారా!

సంతోషమధికమయ్యెనా సంభాషణము స్వల్పమగుట, మనసులోని మాట మరపురాక మనమిచ్చిన బెత్తము మాట మరచిపోయి మన శారదాంబ మనసులో మాటుపడియుండుట చేత మాటిమాటికి మనలోఁగొందఱియ్యఁదలంచుకొన్న నిలువు టద్దమును బంగరు గొలుసును మురుఁగుల జతయును మనసునందగిలి మన యెడలఁ గృతజ్ఞత గనంబడఁ బొగడఁ దొడంగి నుడివిన నుడువులు గడునదరుటంజేసి యనుఁగుజెలికాని తడబాటున కొడబాటు తగుపాటిదిగాని నగుబాటు గాదు గనుక (అని సీమసుద్దతో నల్లబల్ల మీఁద నేమేమో వ్రాయుచు) నిలువుటద్దమన్నను బంగరు గొలుసన్నను మురుఁగులజతయన్నను బండితులన్నను బామరులన్నను బురుషులన్నను స్త్రీలన్నను సభాపతి యన్నను సామాజికులన్నను బెత్తమన్నను మదనకామేశ్వరమే-కాదు కాదు- ఒక్కటేయని సంఖ్యాశాస్త్ర ప్రకారము సాధింపబడుచున్నది" అని కూర్చుండెను.

సభ వారందరును జప్పట్లు చఱచిరి.

మరునాఁటి సాయంకాలమన శారదాంబ శ్రీధరశాస్త్రిని జూడవచ్చి "మహాత్మా! నిన్న మీ చెలికాని పరువు నిలిపితిరి. నేఁడు మాతో రాజమహేంద్రవరము వచ్చి నా పరువు నిలుపు భారము గూడ మీదేయని" చెప్పిపోయెను.

శ్రీధరశాస్త్రి యా రాత్రి బయలుదేరి నెల్లూరిలో నుపన్యసింపఁబోయెను.

*(1903 డిసెంబరు- కల్పలత సం. 1-సం. 4)*

## కథానేపథ్యం ...

ఇది 102 సంవత్సరాల నాడు రాసిన కథ. వస్తువు, కథాకథనం, నిర్వహణ ఆధునిక కాలానికి సంబంధించినవే. ఈ కథలో సున్నితమైన హాస్యం కూడా ఉంది. సామాజిక నేపథ్యం స్ఫుటంగా ఉంది. తెలుగులో కథారచన అత్యంతాధునిక ప్రక్రియ. బహుశా తెలుగు సాహిత్యంలో అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన ఏకైక ఆధునిక ప్రక్రియ

కథానిక. 20వ శతాబ్దాన్ని కథానిక శతాబ్దమనే చెప్పవచ్చు. తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు. ఆధునికార్థంలో తెలుగులో మొదటి కథారచనా ప్రయత్నం ఎవరు చేశారు? ఆ కథ ఏది? దాని పేరేమి? అది ఎప్పుడు వచ్చింది? అని నిర్ధారణగా చెప్పడంలో కొన్ని చర్చోపచర్చలకు ఆస్కారం కలిగింది. ఇప్పుడీ అపూర్వోపన్యాసమనే కథ తెలుగులో తొలి కథ అని ఎందుకు చెప్పకూడదు? అనే జిజ్ఞాస కలగడంలో అసహజం ఏమీలేదు. ఈ కథ 1903 డిసెంబరులో 'కల్పలత' అనే పత్రికలో (సం. 1–సం. 4) నాలుగు పుటలలో చోటుచేసుకొంది.

ఈ పత్రిక 1903 సెప్టెంబరులో ప్రారంభమైంది. ఈ 'అపూర్వోపన్యాసం' కథ ఆ సంవత్సరం డిసెంబరు సంచికలో వచ్చింది. తెలుగునాట అతిపాత గ్రంథాలయాలలో కూడా ఈ పత్రిక ఇప్పుడు ఎక్కడా కనపడదు.

ఈ పత్రిక నడిపినవారు ఆచంట వేంకట సాంఖ్యాయనశర్మ (1864–1933) గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తిల సమకాలికుడు. గొప్ప ప్రతిభావంతుడు. శ్రీకాకుళం జిల్లాలోని మేరంగి అనే చిన్న సంస్థానానికి దివాన్‌గిరీ నిర్వహించారు. తెలుగులో శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రకటించే ప్రత్యేక పత్రిక నడిపినవారిలో మొదటివారు వీరే. భూగర్భ ఖనిజ విజ్ఞానం, క్రిమికీటక శాస్త్ర విజ్ఞానం, సౌరశక్తి, విద్యుత్తు మొదలైన శాస్త్రీయ విషయములు నూరేళ్లనాడే తెలుగులో చెప్పాలని ఉద్యమించినవారు శ్రీ శర్మగారు. ఆయన మహామహోపాధ్యాయ బిరుదం పొందారు.

అన్నిటికన్నా గొప్ప విషయం ఏమంటే సంస్కృతంలో దశరూపకాలలో ఒకటైన 'ఉత్కృష్టికాంకం' సంస్కృతం సాహిత్యంలో ఎక్కడా లభించదు. 'పార్థపరాజయం' పేరుతో ఆయన దాన్ని రచించారు. 'నాటక విజ్ఞాన సర్వస్వం' రచించారు. 17 సం॥ల వయసులోనే 'సుజనప్రమోదిని' అనే పత్రిక నడిపారు. అన్నిటా ఆధునిక దృష్టి కలవారీయన. చతుర సంభాషణకుశలురు.

గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' 1910 ఫిబ్రవరిలో అచ్చయింది కాబట్టి, అందులోనూ వాక్యనిర్మాణం, వస్తు నిర్వహణలో ప్రాథమికస్థాయి, గ్రాంథిక వాసనలు కనపడతాయి కాబట్టే, పూర్తి సాంఘికేతివృత్తంతో రచితమైన సాంఖ్యాయనశర్మగారి ఈ 'అపూర్వోపన్యాసం' తెలుగులో వచ్చిన మొదటికథ ఎందుకు కాకూడదు? అనకూడదు? అనే విషయాన్ని పరిశోధకులు, సాహిత్యవేత్తలు తేల్చిచెప్పాలి.

## తొలి కథల పత్రిక

తెలుగులో కథల కోసం ప్రారంభమైన మొదటి పత్రిక 'సాహితి' 1920 జనవరిలో ఈ పత్రిక ప్రారంభమైంది. సాహితి ప్రారంభమైన దాకా తెలుగులో పది మంది కథకుల పేర్లుకూడా చెప్పలేము. ఒక పన్నెండు కథలు కూడా లెక్కించలేము అన్నారు. నోరి నరసింహశాస్త్రి అన్నట్లు 'చలం' కథ మొట్టమొదట ప్రచురించిన పత్రిక అదే. చింతాదీక్షితులు, శ్రీనివాస శిరోమణి, వఝ్ఝ బాబూరావు, మునిమాణిక్యం నరసింహారావు, శివశంకరస్వామి వంటి ప్రసిద్ధ కథకుల కథలు 'సాహితి'లో వెలువడ్డాయి. కవికొండల వెంకటరావు కూడా ఆ రోజుల్లో కథలు రాశారు. సుమారు నాలుగు సంవత్సరాలు మాత్రమే వెలువడింది. తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, కొడాలి అంజనేయులు ఈ పత్రిక సంపాదకులు. సాహితీ సమితి అనే సాహిత్య సంస్థ పక్షాన ఈ పత్రిక వెలువడేది. గురజాడ అప్పారావు 1915వ సంవత్సరంలోనే కీర్తిశేషుడు కావడంతో ఈ పత్రికలో ఆయన కథలు రాలేదు. గురజాడ అప్పారావు తర్వాత వెంటనే చెప్పవలసిన తెలుగు కథారచయిత చింతా దీక్షితులు అని కొడవటిగంటి కుటుంబరావు అన్నారు. చింతా దీక్షితులు కథలు పది దాకా సాహితిలోనే వెలువడ్డాయి. సాహితి పత్రిక తెనాలి నుంచి వెలువడేది.

వ్యావహారిక భాషోద్యమం తెలుగుకథ వికాసానికి వ్యాప్తికి ఎంతగానో ప్రోత్సాహ కారకమైంది. 1920ల నాటికే వ్యావహారిక భాషోద్యమం సాహిత్య లోకంలో ప్రతిష్ఠితమైంది.

సాహితి ఆగిపోయిన తర్వాత నవ్య సాహిత్యాన్ని ప్రచారం చేసిన పత్రిక 'సఖి' ఈ పత్రిక గుంటూరు నుంచి 20వ శతాబ్ది మూడో దశకంలో వెలువడింది. ఇందులో కూడా కథలే ఎక్కువ ఉండేవి. సాహితి, సఖి పత్రికలు ఇప్పుడు చూడలేము.

# 2. లాజరస్

– భాసుడు

"**భో** జనకాలే సీతారామస్మరణ గోవిందా గోవింద!"

రామయ్యగారు సప్తాహం మొదలు పెట్టినారు. సప్తాహమల్లా దోసయజ్ఞంగా మార్చారు. గడ్డం పెంచటానికి ప్రారంభించారు. యజ్ఞం ఆరు నెలలకు కాని ముగియదు. బ్రాహ్మణులు పంక్తులు తీర్చి కూర్చున్నారు. వర్తకులు బియ్యం, నెయ్యి బండ్లతో తోల్తున్నారు. వ్యవసాయదారులు గుమ్మడికాయలు తెచ్చి పోగువేస్తున్నారు. ఆ గుట్టలు కొండంతైనవి. రామయ్యగారి పేరు వారి గడ్డంతోపాటు గ్రామం గ్రామం పాకిపోతున్నది. ఈ సంగతి విన్న ఊళ్ళవాళ్లంతా రామయ్యగారికి మొక్కుబళ్లు చెల్లిస్తున్నారు. ఊరంతా పందిరి వేసినారు. రామయ్యగారి భార్య మెళ్లోనున్న పసుపు కొమ్ము, వెల్లి పసుపు లోహాన్ని ఆశ్రయించినది. మంగళసూత్రంతోపాటు చేతికి గాజులు చేయిస్తేనే గాని పీటమీద కూర్చోనని పంతం పట్టింది. వెంటనే రాముడి యనుగ్రహం గాజులుగా మారింది. బ్రాహ్మణులు భోజనం చేస్తున్నారు. భోజనాలు అరిగేటట్టు గోవిందలు కొట్టుతున్నారు. ఇది పందిట్లో వ్యవహారం.

ఇక పందిరి బయట యెట్లావుందో చూద్దాం. చెట్టు కింద వీరదు పండుకొని యున్నాడు. వాడిచుట్టూ వాడి పిల్లలు, పెండ్లాము యేడుస్తున్నారు. లోపల గోవిందలేమి? బయట యేడ్పులేమి? లోపల సంతోషముతో పూర్ణపుండల వడ్డనలేమి? బయట దుడ్డుకర్రల వడ్డనలేమి? వీరదు వీపుమీద రెండు దద్దురులు కనబడుచున్నవి. వాడు శుష్కించిన దేహముతో గద్గదస్వరముతోనిట్లు ప్రసంగించెను. "నాగ! నేను నాకలోకము వెళ్ళుచున్నాను. మెతుకు చూచి మాసమయినది. మానవకోటిలో నొక్కడైనను మనకు పట్టెడన్నము పెట్టువాడు కనపడలేదు. నీవు మన కుటుంబమునకు పెద్దవు. నీ తల్లి తమ్ములను యెట్లు పెంచెదవో తెలియకున్నది. సంఘము నిన్ను చేరనీయదు. పుల్లిస్తరాకుకూడు తిందమన్న కుక్కలు చేరనీయవు. ఇచ్చట గొప్ప సంతర్పణ జరుగును గదా. విస్తరాకులు కొల్లగా దొరుకునని యాశతో వచ్చితిని.

కాని యీలోపుగా నేను మిమ్ములను విడువవలసిన కాలము వచ్చినది. దేవునికి మనమేమి యపకారము చేసితిమి? పిల్లులను లోపలికి రానిత్తురుగాని మనను మన జాతివారు లోనికి రానివ్వరు. మీరు అన్నమని యేడ్వ పట్టలేక పందిరి వద్దకు వెళ్ళితిని– అన్నముకు బదులు దెబ్బల వడ్డన జరిగె. ఇట్టి మృత్యుతుల్యమైన యీ దెబ్బకొట్టిన యాతనికి కృతజ్ఞుడను. నా యూపిరితీయుదెబ్బ నన్ను కొట్టి మీ కష్టపరంపర చూడకుండ చేసె. ప్రేయసీ, పిల్లలను చూచుకొనుము. నా సంఘసోదరులకు విశాలహృదయమును భగవంతుడిచ్చుగాక. తనయా! నా తల పట్టుకొనుము'.

**2**

నాగడు పసివాడైనను ధీమంతుడు, ధైర్యశాలి. పెత్తన భారము వహించి కర్తవ్య మాలోచించుచుండెను. "నా తండ్రికి పిడికెడన్నమివ్వలేక గోవిందలు కొట్టు నీ సంఘము నిర్మూలన చేయుటెట్లు. భగవంతుడందరికి సమానుడు కాడా? లోపల రామయజ్ఞమేమి వెలుపల తిండిలేక నా తండ్రి చచ్చుటేమి? ఈ దేవునికి బుద్ధిలేదు. లోపలజేరి గుమ్మడి కాయలు గతుకుచు, నా తండ్రి మొరవినక ప్రాణములు తీసెను. మా దేవుడికి మతి పోయినది' యని యేమేమో యనుకొనుచుండ – "నిజము కుమారా! నిజము. మీ దేవుడికి మతి లేదు. కాని మా దేవుడు మంచివాడు. అతనిని నేను జూపెదను. నా వద్దకు వత్తువా? నీవేల యేడ్చుచుంటివి?" అని యొక క్రైస్తవారాధకుడు యడుగ తన తండ్రిని దహనము చేయుటకు చేత గుడ్డిగవ్వ కూడా లేక విలపించుచుంటినని చెప్పె. అంత నా యారాధకుడు ధైర్యము చెప్పి ఉత్తరక్రియలకు నవరసు చేత బెట్టి ముందుపోషణభారము తాను వహించెదనని చెప్ప నాగడు విశ్వాసపూరిత బాష్పములచే యారాధకుని పాదముల కడిగి యీ దాసునికి యిప్పటి నుండి తమరే దేవుడని నిశ్చేష్టుడయ్యె.

**3**

కళింగపట్ణం. గొప్ప బస్తి. ఊరా చెన్నపట్టణమంత పెద్దది. సముద్రతీరం. పెద్దపెద్ద మేడలు. పెద్దపెద్ద విహారస్థలాలు. పట్ణం యొక్క గొప్పతనం చెప్పకయె చెప్పుచున్నవి. సముద్రం అంచున పెద్దపెద్ద మేడలు కలవు. సముద్రుడు కరటాలచేత యా మేడలలో యుండేవారికి తీవ్రమైన సందేశము పంపిస్తున్నాడా యన్నట్లు కరటాలు గోడల వద్దకు విశ్రాంతి లేకుండ వస్తూపోతూ వున్నవి. అందులో యొక మేడలో లాజరసు కాపురమున్నాడు. ఆయనకొక తల్లి, భార్య, ముగ్గురు పిల్లలు. ఆయన ఆ

పట్టణానికి కమిషనర్. 4500–0–0 జీతం పుచ్చుకుంటున్నాడు. గొప్పదాత. న్యాయప్రభువని పేరుపడినవాడు. ఆ సమయములో గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమం వచ్చినది. కళింగపట్టణం సహాయ నిరాకరణానికి ముఖ్యపట్టణ మయినది. రోజుకు 300 మంది చొప్పున జైలుకు వెళుతున్నారు. పంపేది లాజరసు గారే. ఒకరోజున లాజరసుగారీ విధంగా సంతాపపడటం ప్రారంభించారు. "నాచేతి మీదుగా యెందరిని జైలుకు పంపినాను! వారు చేసినదేమి? దేశభక్తి తప్ప – దేశభక్తి చూపినవారిని జైలుకు పంపించి గవర్నమెంటువారి పాపం నా నెత్తిమీద వేసుకుంటున్నాను. ఈ యుద్యోగం నేను చేయలేను, ఉద్యోగం చేయకపోతే ఉప్పుకల్లు యెట్లా పుట్టుతుంది? నా తండ్రి అన్నం లేకగదా చచ్చింది? నా తండ్రిని చంపిన సంఘాన్ని జైలుకు పంపితే నాకు పాపమేమి? పిడికెడు అన్నం పెట్టలేనివారికి స్వరాజ్యం యెందుకు? వీరికి స్వరాజ్య మిచ్చిన మా పంచముల గతియేమి? దేవుడు న్యాయము పరిపాలిస్తున్నాడు. పాపం చేసుకున్నవాళ్లకు సుఖజీవన మెక్కడిది? తండ్రీ! నిన్ను పెట్టిన కష్టములు వీరిని పట్టి కుడుపుతున్నవి. సంఘమువారు చేసిన పాపములు సంఘము వారనుభవించెదరు. దేశమును త్యజించుట నాకు ధర్మమా? ధర్మము కాకేమి? దేశము నన్ను త్యజించు నప్పుడు నే నేల దేశమును త్యజించకూడదు. ధర్మసందేహం నన్ను బాధించుచున్నది."

## 4

లాజరసు ముఖము వికాసము తప్పి వెలవెలపారుచుండెను. పూర్వపుచిరునవ్వు తెచ్చుకొన్నను కనుపించుటలేదు. పరాధీనముగా ప్రసంగించుచుండెను. ప్రతిరోజు 11 గంటలకు కోర్టుకు వచ్చువాడానాడు 1 గంటకు వచ్చెను. కమీషనరుగారు రాగానే మొదటికేసు పిలువబడెను. రామయ్య చేతిసంకెలలతో న్యాయమూర్తి యెదుట నిలబడెను. రామయ్య నెక్కడనో చూచినట్లు న్యాయమూర్తికి తోచెను. కాని ముద్దాయి యెవరో తెలియలేదు. రామయ్య న్యాయమూర్తిని చూడగానే గుర్తించెను. తన ప్రథమ రామయజ్ఞము జ్ఞప్తికి వచ్చెను. ఆనాడు జరిగిన దారుణమరణం కన్నులబడెను. తనకొక విధమైన పశ్చాత్తాపము కలుగజొచ్చెను. పశ్చాత్తాపముతోబాటు నూతన వికాసము ముఖమున పొడమెను. న్యాయమూర్తి విస్మితుడయ్యెను. రామయ్య పశ్చాత్తాపముచే నేడువజొచ్చెను. న్యాయమూర్తి యేడుపునకు కారణమడిగెను. రామయ్య ఇట్లు చెప్పదొడంగె.

"మహాప్రభూ! నేను నేరస్థుడను. నేను పాపిని. రామయజ్ఞములచే లక్షలు గణించి యీ పట్టణములో గొప్ప మేడలు కొని తూగుటుయ్యాలలో యూగుచున్నాను. రారాజులకు విందులు చేసి 'సర్' బిరుదములు చూరగొన్నాను. మదాంధుడనై తమ యెదుట నున్న వీరడిని చచ్చునట్లుగా తన్నినాను. దైవవశమున ఆనాడు నొక బీదవానిని కొట్టి చంపినాను. పల్లెటూరగుటచే కేసు కాలేదు. ఈనాడు తిరిగి ఎంత పనిచేసినాను. దేవుడు న్యాయాన్యాయపాలకుడు. దేవుడు విచారణకర్త. దేవుడు సర్వమూ తెలిసినవాడు– విచిత్ర నాటకసూత్రధారి. ఆ మహానుభావుడు నా పాపముల విచారించ నాచే చంపబడినవాని పుత్రుని న్యాయమూర్తిగా పంపి నన్ను తరింపచేసెను. మహాప్రభూ, నే చేయు విన్నపమాలింపుము. మా సంఘము పతితమైనది. నీతి బాహ్యమైనది. అహంకారపూరితమైనది. అందున బానిసత్వము సంప్రాప్తమైనది. తన వారిలో యొక కులమును పంచములని పేరుపెట్టి బహిష్కరింపుటచే తాము ప్రపంచమంతటా బహిష్కరింపబడినారు. నేను తరింప పూర్ణ సంకల్పముతో నా రెండులక్షల యాస్తిని పంచములకు మనఃపూర్వకముగా నిచ్చుచున్నాను. నా శిక్షానంతరం నేను మహాత్ముని పాదములు పట్టి దేశసేవ చేసెదను. పాపపరిహారార్థం వీరన్నకు 50 వేల రూపాయల నిచ్చుచున్నాను. నేను తమ శిక్షకు సిద్ధముగానున్నాను. దేవుడు తమను రక్షించుగాక".

లాజరసు నిశ్చేష్టితుడయ్యె. పదినిముసములకు తెప్పరిల్లి జూచునప్పటికి వీరన్న క్రీస్తు మహనీయుని రూపమున కనబడి, "హైందవులు పాపపరిహార్థము మహాత్ముని యధ్వర్యము కింద జైలుకు వెళ్ళుచున్నారు. త్యాగములో ముక్తి కలదు. నీవు ముక్తి నొందవా?" యని ధ్వని వినబడియె.

అంతట లాజరసు పీఠమునందు నుండి దిగి రామయ్యను కౌగిలించుకొని యిట్లనియె – "ఈరోజు నుండి మనం సోదరులము. మహాత్ముని యనుచరులము. ఈ ప్రాణములు దేశవిముక్తికై యర్పించెద. మానవునికి దేశభక్తియే ముక్తి".

గాంధీ మహాత్మునికి జై.

**కథానేపథ్యం ....**

20వ శతాబ్ది ప్రథమార్ధాన్ని తెలుగు సాహిత్యచరిత్రలో కథాయుగంగా పరిగణించాలి. చిన్నకథ రాయడమే తమ సాహిత్య ప్రతిభకు గుర్తింపుగా ఆనాటి కవిపండితులంతా భావించారు. గొప్ప సాహిత్యపరిశోధకులు, చరిత్ర రచయితలూ, కవులు, విమర్శకులు కూడా ఆ అర్ధశతాబ్దంలో కథలు రాశారు. ప్రముఖులైన కథా రచయితలను ఈ కాల వ్యవధిలో 50మందికి పైగానే పేర్కొనవచ్చు. జాగ్రత్తగా పాత పత్రికలు పరిశీలిస్తే ఒక 1000 దాకా కథలు లభిస్తాయి. కొమర్రాజు లక్ష్మణరావు, కోటంరాజు పున్నయ్య, చిలకమర్తి, పానుగంటి వంటి గొప్పవిద్వాంసులు గ్రాంథిక భాషారచయితలే మొదటితరంలో కథలు రాయగా, విశ్వనాథ, శ్రీశ్రీ, కవికొండల వెంకటరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వెంకటరమణయ్య, చాగంటి శేషయ్య, వేటూరి, మల్లాది, శ్రీపాద ప్రభృతులు స్వాతంత్ర్యం రాకముందు కథలు రాశారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి వంటి ప్రసిద్ధకవులు కూడా కథారచన పట్ల ఆసక్తి కనపరచారు. అయితే తొలితరం తెలుగు కథలన్నీ పూర్తిగా సమకాలీన సామాజిక వాతావరణ సంబంధులు కావు. సమాజవాతావరణమే ప్రాధాన్యం వహించాలన్న ఆశయం రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో బలంగా రూపురేఖలు దిద్దుకొంది. పాశ్చాత్యకథారచనా ధోరణులుకూడా అప్పుడే తెలుగు కథపై తమ ప్రభావం చూపడం కూడా మొదలైంది.

ఇంగ్లీషు శీర్షికతో తెలుగులో వెలువడ్డ మొదటి కథ 'లాజరస్'. లాజరస్ అనే పాత్ర బైబిలులో ఏసుక్రీస్తు కరుణకు పాత్రమైన ప్రముఖపాత్ర. తెలుగులో దళితసమస్య సంబంధిగా వచ్చిన మొదటికథ కూడా ఇదే. 1925 సంవత్సరం 'శారద' అనే సచిత్ర సాహిత్యపత్రికలో ఇది వెలువడింది. 'భారతి' కంటే మూడేళ్లు ముందు వెలువడిన సాహిత్య పత్రిక ఇది. ఇంకొక విశేషం కూడా ఉంది– ఈ కథకు సంబంధించి. తెలుగు కథా రచయితలలో మొట్టమొదట 'గుప్తనామం' అంటే కలం పేరు ఉపయోగించు కున్నాడు ఈ కథా రచయిత. 'భాసుడు' అనేది కలం పేరు. ఈ 'భాసుడు' ఎవరో ఇప్పటికీ తెలియదు. బందరు నుంచి 'శారద' వెలువడేది కాబట్టి వేలూరి శివరామశాస్త్రి గారేమో నని ఊహించాలేమో!

ఈ కథ ఉత్తరాంధ్ర రచయిత ఎవరో రాసి ఉంటారనుకోవడానికి చిన్నచిన్న ఆధారాలున్నాయి. మొదటిది కథ కళింగపట్నం రంగస్థలంగా జరగటం. రెండోది సముద్ర కెరటాలు 'కరటాలు' అనటం ఈ పదం కోస్తాకు చెందినది కాదు. ఇక లాజరస్ కళింగపట్నం కమీషనర్ అని ప్రస్తావించాడు రచయిత. పోలీసు కమీషనర్ అని ఆయన భావమై ఉంటుంది. ఒకప్పుడు పోలీసు అధికారాలు, న్యాయశాఖ అధికారాలు కలిసే ఉండేవి.

ఈ కథలో దోసయజ్ఞం అనే కొత్త పదం కనపడుతున్నది. 'దోసపాదు' సమృద్ధికి సంకేతం చాలాదూరం వ్యాపిస్తుంది. చాలా కాయలు కాస్తుంది. అందుకే పాతతరం వాళ్లు కుటుంబవిస్తారాన్ని, సంపదను దోసపాదుతో పోల్చేవారు. అంటరానివారి దయనీయ జీవితాలకు సంబంధించిన కథ ఇది. అగ్రవర్ణాలవారి అరాచక దౌర్జన్యం ఇందులో కథావస్తువు.

'శారద' పత్రిక మూడేళ్లు వచ్చింది. ప్రమోదకుమార్ ఛటర్జీ చిత్రించిన సరస్వతీదేవి ముఖచిత్రంతో ఎంతో కళాత్మకంగా, చక్కటి కాగితం, లోపల త్రివర్ణ చిత్రాలతో ఈ పత్రిక వెలువడేది. ఆ రోజులలో కలకత్తానుంచి వచ్చే 'మోడరన్ రివ్యూ' ఈ పత్రికకు ఆదర్శంగా ఉండేది అనిపిస్తుంది.

# 3. ప్రేమోద్వేగం

**– చిల్లరిగె శ్రీనివాసరావు**

**నూ**ర్జహాన్ కవాశ్జి చాలా చక్కగ చదువుకొన్నది. యూనివర్శిటీ డిగ్రీ యేదియుఁ దీసుకొనలేదుగాని కొంచెము తక్కువగ చదువుకొన్నది. తండ్రి కవాశ్జి బ్రాంది వ్యాపారంలో చాల డబ్బు సంపాదించియున్నాడు. ఆమెకు విద్యమీదనుండు నభిమానముచే నంతవఱకు చదవుకొన్నదిగాని యేవృత్తి కొఱకును చదువలేదు. ఆమెకిప్పుడు పదునెనిమిదేండ్ల వయస్సు. ఆమెకింకను చదువుకొనవలెనని యాసక్తి యున్నది. కాని ప్రస్తుతము కొంచెము దేహము నందస్వస్థతగ నుండుటవలన చదువు చాలించి విశ్రాంతి తీసుకొనుచున్నది. ఈమెకొక యన్నగారున్నాడు. అతని పేరు బహద్దర్జీ. ఈతడు ప్రవేశపరీక్షయందు కృతార్థుడుకాగానే తండ్రి యొక్క బ్రాందిషాపును జూచుచున్నాడు. కవాశ్జి తన కొడుకుతోడను కూతురుతోడను బొంబాయిలో శాండర్హస్టు వీధిలో నొక భవనమునందు మూడవ యంతస్తులో కాపురమున్నాడు. కవాశ్జియొక్క భార్య కొద్ది దినముల క్రిందనే కాలము చేసినది.

వీరున్న భవనమున కెదురుగ నొక హోలునందొక గదిలో ప్రభల వెంకట సుబ్బారావను నొకయువకుడు బాడుగకు తీసుకొని నివసించుచున్నాడు. ఈతడు చిన్నతనముననే తల్లిదండ్రులను గోలుపోయినాడు. తరువాత బంధువులయొక్కయు నభిమానులయొక్కయు సంరక్షణమాశ్రయించి సంపాదించి గొంతవఱకు విద్యాభివృద్ధి చేసుకొనెను. తరువాత నీతని యదృష్టముచేనొక జమీందారు కుమారుని సహాధ్యాయిత్వము లభించినది. ఆ కుమార జమీందారుని స్నేహముచే నాయన తండ్రిగారి అభిమానము కూడా నాతడు సంపాదించఁగల్గెను. ఆయన యొక్క సహాయముచే నతడు బి.ఏ. పరీక్ష యందుత్తీర్ణుడైనాడు. ప్రస్తుతము బొంబాయిలో ఇంజనీరింగు చదువుతున్నాడు. ఈతఁడచ్చట చదువుచున్న కాలములో సహాయము చేయుచున్న జమీందారుగారు పరలోకగతుఁడయ్యెను. కాని కుమారుడు సంస్థానాధిపతి యైనందువలన ఈతనికి వచ్చుచున్న సహాయమున మఱింత హెచ్చయ్యెను గాని తఱుగ లేదు. అయినను ఈతడు మితవ్యయమును దప్పకుండ, నేర్పుతో తన

స్వగౌరవమును తన స్నేహితుడును అభిమానియునగు కుమార జమీందారుగారి యొద్ద గాపాడుకొనుచు కాలము పుచ్చుచుండెను.

ఈతని యొద్ద లోపము లెవ్వియును లేవుగాని అతని మనస్సీమధ్య కొంచెము రమణీ ప్రణయము వైపు మళ్ళుట, నొక దోషముగా దలచుటకు వీలులేదు. అది నవయౌవనమున సహజముగ వికసించునదియే. చిన్నతనముననే తల్లి దండ్రులు పోవుటవలన నతనికి స్వశక్తి మీద నాధారపడియుండు ధైర్యమలవడినదని చెప్పుట యందాశ్చర్యము లేదు. అట్టి ధైర్యమునకు తోడు వాక్చాతుర్యము కూడ దేవుడిచ్చి యున్నాడు. ఈ సందర్భములో నాతడు కొంచెము యౌవనము యొక్క నవ విలాసమును జూపించినాడనిన వింత కాదు. ఇందులకు మొదటి సూచన యాతడు తన పేరును ప్రభల వెంకట సుబ్బారావు అను దానిని వి.యస్. ప్రభలయని బొంబాయిలో కొన్ని దినములుండగానే మార్చి వేసినాడు. పిమ్మట తనదేశములో జూపుచుండిన లజ్జా భయములు విడిచి యనేకమంది పార్సీ, గుజరాతీ, మహారాష్ట్ర కుటుంబములలో చనువు సంపాదించి మెలగుచుండెను. అందరు నీతనియెడల నాదరము చూపుచుండెడివారు.

మిస్టర్ వి.యస్. ప్రభలకు కవాశ్జీ యొక్క కుటుంబముతో పరిచయము లభించెను. కవాశ్జీ అతనియెడల చాల దయగా నుండెడివాడు. కవాశ్జీ అతనిని మొదట నప్పుడప్పుడు తేనీటికి పిలుచుచుండెడివాడు. ఆ పరిచయము క్రమముగా నభివృద్ధియై వారి కుటుంబములో నొకడుగా నాతడు మెలగుచుండుట తటస్థమైనది. నూర్జహాన్ యొక్క సౌందర్య మనన్యమని చెప్పముగాని చిత్తము నాకర్షింపగల విలాసమామె యందుగలదు.

నూర్జహాన్ తన పార్శీకుల యొక్క సుగుణములనెరుగనిది కాదు. ఆమె తన కులమును ప్రేమించుట యందు వెనుదీయునది కాదు. కులగౌరవమునెడల పారసీకుల కున్న యభిమానము మఱియెవ్వరికిని లేదని యామెకు పూర్ణముగ తెలియును. వారి కులములో నెవ్వరైన పేదవారున్న యెడల తక్కినవారందఱును చందాచేసి వానిని దారిద్ర్య బాధ నుండి తప్పించుటకెంతయో పనిచేయుదురని యీమె మనస్సునందు సంతోషించుచుండును. వారలలో మంచి జాతులును మంచి నాయకులును బుట్టియున్నారు. అట్టి కులమునెడల విద్యావతియగు నామెకు గౌరవమెట్లు లేకుండును? కాని యాచిన్నసంఘమునకు లోపములు కూడ చాలనున్నవి. వానిని చూచిన నామె కసహ్యము. చిన్నసంఘముల కెప్పుడు నట్టిలోపము లుండునని యామె యెరుగును.

అయిన నామె సహింపలేకుండెను. వారిలో మంచివరుడు దొరుకుట చాల కష్టము. ఆ సంఘములో కుటుంబమును సంరక్షించవలెననిన సామాన్యముగా చాల ధనము కావలెను. అందుచేత వరులు వధువుల వైపు నుండి ధన మపేక్షింతురు. చాలమంది యువతులును, యువకులును కుటుంబ భారమును వహింపలేక వివాహము పొంతబోకుందురు. వారు వ్యాపారమునందును, విద్యయందును, నాగరికతయందును సాహసులే. కాని అంత సాహసము వారికి మతమునందును సంఘసంస్కరణయందును ఉన్న వారితో తులతూగువారుండరు. బహుశః చిన్నసంఘములు తమ వ్యక్తిత్వము గాపాడుకొనునని యెప్పుకొనవలసియున్నది. పూర్వమీ సంఘము మహమ్మదీయుల దాడికి జడిసి పారసీ దేశము నుండి మన దేశమునకు వచ్చియున్నది కదా? వారి యొక్క మత విషయమందలి పూర్వాచార పరాయణత్వమే వారినింతవరకు హిందూ దేశములో ప్రత్యేక వైలక్షణ్యము నందు రక్షించియుంచినదని చెప్పవచ్చును. సందేహము లేదు. కాని ఇక హిందూ దేశమునందు జాతి, మత, కుల, వర్ణభేదంబులు పూర్వ కాలమందున్నంత విలక్షణముగ ఉండవలసినయవసరము లేదు. ఉండుటకు వీలులేదు. ఉండుట నష్టము. ఉండునట్లుగ బ్రయత్నము చేయుట తప్పు అని నూర్జహాను అభిప్రాయము. నూతన జాతీయత దేశమునందు బయలుదేరుచున్నది. దానిననుసరించి చిన్న సంఘములు తమ గతి దోషములను సవరించుకొనవలెను. అట్టి సందర్భములలో పారసీలు వారెన్నడో పారసీక దేశము నుండి తీసుకొనివచ్చినారనిన అగ్నిని వారి యాలయములలో పార్శీలు కానివారిని చూడనియ్యమని పెట్టుకొనిన నియమము నూర్జహానకెట్టి సంతుష్టి నియ్యగలదు? అంతేకాక శవ సంస్కార విషములోను నామె యభిప్రాయము వేరైయున్నది. ఈ భావములన్నియు నామెకు చదువువలనను, సహవాసమువలన నబ్బినవి కాని యామె ప్రణయంబునకివి కారణంబులు గావు. ప్రణయంబునకు హేతువాదము చేయుట తగదు.

నూర్జహానునకు ప్రణయచింతన యుదయించినది. ఆమె కన్నులకు మిస్టర్ ప్రభలయొక్క రూప యౌవనంబులు సంతోషదాయకంబులాయెను. అతనియొక్క రూప లావణ్యంబులు వర్ణింప విశేషంబులెవ్వియును లేవు. సర్వసామాన్యమైన యాకృతియు, యౌవనము నతనికిప్పుడుండెను. అంతకంటె మిన్న యేమియును లేవు. కాని యాతని కష్టనిష్టురములు నూర్జహాను మది నాకర్షించి యుండవచ్చును. ఇది మనయొక్క యూహ. కాని ప్రధాన కారణము మన మరయజాలము. అది పూర్వజన్మ ఫలితంబుగా వచ్చును. లేక విధివిహితంబు గావచ్చును. లేక మదనుని స్వేచ్ఛావిహారములో గల్గిన

ప్రమాదము కావచ్చును. ఎట్లయినను వారికిద్దరకును అన్యోన్య ప్రేమ సంఘటించెను. అది కొన్నాళ్ళ వరకు గోప్యముగ నుండవలసిన యవసరముండెను. ఇది వెల్లడియైన యెడల నూర్జహాను తండ్రి యొక్కయు, అన్న యొక్కయు నాగ్రహమునకు వారు గురియగుదురు.

నూర్జహాను యొక్క పాణిగ్రహణంబును గోరి మరియొక పార్శీ యువకుడు కవాశ్జీ యొక్క గృహంబు నాశ్రయించుచుండెను. నూర్జహానతనికి ప్రోత్సాహమిచ్చు చుండలేదు. ఆ కారణముగా నాతడు మిస్టర్ ప్రభల యెడల నసూయాగ్రస్తుడయ్యాడు. అతడు తన యూహచే గొన్ని నేరములను మిస్టర్ ప్రభల మీద గల్పించి బహద్దూర్‌జీతో చెప్పెను. బహద్దూర్‌జీ అతని మాటల తాత్పర్యమును గ్రహించి యొకనాడు మిస్టర్ ప్రభలతో నిఁక తమ యింటికి రావలసిన పనిలేదని కఠినముగాఁ జెప్పెను. అంతట మిస్టర్ ప్రభల వారింటికి పోవుట మానివేసెను. నూర్జహానీతడింతకు పూర్వమువలె నింటికేల వచ్చుటలేదో తెలియక రెండు మూడురోజులు చూచి యొకనాడు ఉదయము టిఫిన్ పుచ్చుకొనువేళ నన్నగారితో నిట్లు పలికెను.

నూ : మిస్టర్ ప్రభలు రెండుమూడు రోజుల నుండి యిచ్చటకు వచ్చుట లేదు. ఏమైన జబ్బుగా నుండలేదుకదా?

అన్న : అతని కిక్కడకు రావలసిన పనియేమున్నది?

నూ : ఇన్ని దినములును ఏపనియున్నదో యిప్పుడు నదియేపనియున్నది. ఒంట్లో యేమైన నస్వత్థతగా నున్నదో లేక యెచ్చటకైన వెళ్ళి యున్నాడో.

అన్న : ఆ రెండును కాదు.

నూ : కాకయున్న నీ సాయంకాల మొక్కసారి రమ్మని చెప్పుము.

అన్న : నేను చెప్పను.

నూ : నేను చీటి వ్రాసి పంపించెదను.

అన్న : వద్దువద్దు

నూ : నీవే పిలిచెదవా?

అన్న : (కొంచెముగ్రముగా) నేను పిలువను. నీవు చీటి పంపవద్దు.

నూ : అతడేమి తప్పు చేసినాడు?

అన్న : అతని తప్పునుగూర్చి విచారణ మెందులకు? నాకిష్టములేదు. నేను మన యింటికి రావద్దని యాతని కోరినాను.

నూ : (పెదవులు కంపించ) నీవాతని నన్యాయముగ నవమానించితి వన్నమాట.

అన్న : అవమానించిన నేమి? మన చుట్టమా? మన కులమువాడా? వానికిని మనకును సంబంధమేమి? పోతేపోయినాడు.

నూ : అటులకాదు. అతనిని చూచిన కాని నాకు తోచదు

అన్న : (ఆగ్రహముతో) అతడు నీకేమి ప్రియుడా?

నూ : (ఒడలంతయును వణకిపోవుచుండ) ఔను. ప్రియుడే. నీవేమి చేసెదవు?

అన్న : అటులనా? నీ తిక్క కుదిరించెదను.

అని బహద్దర్‌జీ వెడలిపోయెను.

నూర్జహాను కారోజేమియు దోచలేదు. ఆవేశములో మాట పారవేసుకొనెను. అన్నగారేమి చేయునో కదా!

సాయంకాలము పదిగంటలకు బహద్దర్‌జీ యింటికి తిరిగివచ్చెను. అతడు బ్రాంది త్రాగి యొడలు మత్తిలియున్నాడు. అతనితో గూడ నింకొక యువకుడున్నాడు. వాడును అన్నగారితో సమానముగా మత్తిలియున్నాడు. అన్నగారింటి లోపలకు రాగానే చెల్లెలను బిలిచి 'నీ ప్రియుని' యొక్క యవస్థను వినగోరెదవా?

నూర్జహాను బదులు చెప్పలేదు గాని కన్నులు విప్పి వినగోరినట్లు లజ్జాభయములు సందడింప నతని వైపు జూచెను. కాని వాడు మత్తిలియుండుటచే స్థిరదృష్టి లేనివాడై అటునిటు చూచుచు తనలో తానిట్లు ప్రేలదొడంగెను.

'రోగము కుదిరినది. ఇక వానిని గూర్చి చావుకబురే వచ్చును. చావు తప్పించు కొనిన ఇక నీ చాయల వాడు కనఁబడడు' అని పిచ్చినవ్వు స్నేహితునితో కూడా నవ్వుకొనుచు తిట్లు తిట్టుచు షాంపెయిను బాటిలు ఒకటి తెచ్చి బల్ల మీద పెట్టి రెండు గ్లాసులలో ముందుగా సోడా పోసి యందులో షాంపెయిను కొంచెము పోసి మిత్రునికందించి తాను రెండవది తీసుకొనెను.

నూర్జహాను తన యావేశము నంతను లోపల నణచుకొనెను. ఒక్కసారి తప్పు చేసెను. మరల తప్పు చేయునా?

'ఇఁక బుద్ధి తెచ్చుకొని ప్రవర్తింపుము' అని బహద్దర్‌జీ యనెను. నూర్జహాను మాటలాడలేదు.

ఆనాటి రాత్రి తండ్రియు, నన్నయు గాఢముగా నిద్రపోవుచుండిరి. నూర్జహాను ఒక కార్డుమీద తన ప్రియునియొద్దకు పోవుచున్నానని వ్రాసి తన పెట్టెమీద నంటించి కట్టుబట్టలతో బయలుదేరి తనకు కావలసిన రొక్కమును దీసికొని వెడలిపోయెను. ప్రభల యింటికి పోయి చూడగా అతడు ప్రక్కమీద మూలుగుచు పడియుండెను. ఒడలంతయు హూనహూనమైయుండెను. అతని యొంటిమీద నిమిరి తన రాక నెరింగించి ధైర్యము చెప్పి యొక మోటారు కారును దీసుకొనివచ్చి యతనినందు మీదనెక్కించి రైలు మీద ప్రయాణమై అహమ్మదాబాదునకు తీసుకొనిపోయి అచ్చట ఆస్పత్రియందు చికిత్స చేయించెను. తరువాత కొన్ని దినములకు వారు ఆర్యసమాజమును స్వీకరించి యా ధర్మప్రకారము పరిణయంబాడిరి.

## కథానేపథ్యం ...

చిల్లరిగె శ్రీనివాసరావుగారు 80 ఏళ్ల కిందట బందరు జాతీయ కళాశాలలో చరిత్రాధ్యాపకులు. జాతీయవాది. ఆ తరం చరిత్ర రచయితలలో పేరెన్నికగన్నవారు. వీరు ఆంధ్రుల చరిత్ర రచించారు. ఈ చరిత్రకు అపూర్వమైన పీఠిక రాశారు టేకుమళ్ళ రాజగోపాలరావుగారనే గొప్ప పరిశోధక విద్వాంసులు. ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన జాతులలో తెలుగువారు ప్రముఖులని పీఠికాకర్త అభిప్రాయం. దీనికాయన ఖండాంతర సాక్ష్యాలు కూడా సేకరించాడు.

తొలితరం  తెలుగు కథా రచయితలలో శ్రీనివాసరావుగారికి ప్రముఖస్థానం ఉన్నట్లు వారి కథల ద్వారా తెలుసుకోవచ్చు. సామాజిక సమస్యలు వాటి పరిష్కారాలు వారి కథలలో కనపడతాయి.

20వ శతాబ్ది ప్రథమ పాదంలో విద్యావంతులలో సంఘ సంస్కరణ భావాలు, ఇంగ్లీష మోజు, వేషభాషలలో ఇంగ్లీషువారి అనుకరణం ఈ కథలోనూ ప్రసక్తం. కాలాన్ని బట్టి సామాజిక ప్రయోజనాలు, సర్దుబాట్లు తప్పవని ఈ కథలోని సందేశం.

తెలుగు కథ పైన, నవలపైన అవి పుట్టిన మొదటి రెండు దశాబ్దాలలో బెంగాలీ ప్రభావం అధికం. రవీంద్రుడి కాబూలీవాలా కథను మొట్టమొదట తెనిగించినవాడు అక్కిరాజు ఉమాకాంతం. బంకించంద్రుడు, రవీంద్రుడు, శరత్‌ల ప్రభావం తొలి దశాబ్దాలలో తెలుగు కథపై, నవలపై ఎంతగానో ఉండేది.

పాంచకడీదేవ్ రచనలను నేను చదివానని శ్రీశ్రీయే చెప్పుకున్నాడు. అబ్బూరి రామకృష్ణారావు వంటి అభ్యుదయ రచయితల సంఘ సంస్థాపన ముఖ్యుడు ఒక అపరాధపరిశోధక నవల రాశాడు. శ్రీశ్రీ కూడా భారతిలాంటి ప్రౌఢ సాహిత్య పత్రికలోనే అపరాధ పరిశోధక నవలతో తన సాహిత్య ప్రస్థానం ప్రారంభించాడు.

'త్రిలింగ' వంటి అచ్చమైన సాహిత్య పత్రిక 1914లో ప్రారంభమైంది. ఈ పత్రికలో కూడా తర్వాత కాలంలో కథలు వెలువడేవి. ఇందులో ప్రచురించిన తన కథలన్నిటినీ త్రిలింగ చిన్న కథల పేరిట అక్కిరాజు ఉమాకాంతం సంపుటీకరించాడు. ఈ కథల సంపుటిని 1950లలో కూడా వావిళ్ళవారు పునర్ముద్రించారు. మన వ్యావహారిక భాషోద్యమం లాగానే బెంగాల్‌లో చలిత్ భాషోద్యమం సాగింది. దీని ప్రవర్తకుడు రవీంద్రనాథ టాగూర్, టేక్‌చంద్‌లు. గురజాడ అప్పారావు కలకత్తా వెళ్ళి రవీంద్రుడితో చర్చించాడు. అక్కిరాజు ఉమాకాంతం కలకత్తాలో చదువుకున్నాడు. కాబట్టి కథానిక వంటి ఆధునిక ప్రక్రియ పట్ల ఆకర్షణ, ఆసక్తి తెలుగు ఆధునిక సాహిత్యంలో వంగ సాహిత్య ప్రభావం వల్ల విశేషించి రూపు దిద్దుకున్నాయని చెప్పొచ్చు.

# 4. పశ్చాత్తాపం

– అ. రాఘవశర్మ

**పి**శుపాటివారు వైదికబ్రాహ్మణులు. వారి వంశంలో అందరూ విద్వాంసులు మంచి కుటుంబీకులు. సంపన్న గృహస్థులు. అమరావతిలో వారి గృహమొక్కటే వుంది. ఇదివరకు వారి పూర్వులది అసలే గ్రామమో, ఎక్కడి నుంచి వచ్చి ఇక్కడ కాపుర మున్నారో ఎవరికీ తెలియదు. కాని మూడు నాలుగు తరముల బట్టి వారి వంశస్థులంతా అమరావతిలోనే వుంటున్నారు.

అమరావతిని కమ్మ జమీందారులు పరిపాలిస్తూ వుండేవారు. ఆ జమీందారులు మంచి కీర్తి సంపన్నులు. అందులో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడుగారి వంటి వారు ఏ జమీందారులలోనూ ఎప్పుడూ జన్మించలేదు. వారు అవతారపురుషులనియే ప్రజల నమ్మకము. వీరు  నిర్మింపజేసిన దేవాలయములు కృష్ణా, గుంటూరు జిల్లాలలో, వారి వంశీయుల ధర్మకర్తృత్వము క్రిందనే నడపబడుతున్నవి. వారికీ బ్రాహ్మణుల యందధిక భక్తివిశ్వాసములు కలవు. అనేకమంది బ్రాహ్మణుల కగ్రహారములు, మాన్యములు ఇచ్చి వేదవిద్యను పోషించినారు. ఇప్పటికీ గుంటూరు జిల్లాలో కొల్లూరు అగ్రహారము లోనున్న బ్రాహ్మణులందరు వారిచ్చిన మాన్యముల వల్లనే జీవిస్తున్నారు.

మన పిశుపాటివారి కుటుంబములో అమరయ్యశాస్త్రి అనే ఆయన దిగ్దంతి వంటి పండితుడు. వేదము చివర అక్షరం ప్రారంభించి మొదటి అక్షరం వరకు పట్టులేకుండా తలక్రిందులుగా కంఠపాఠముగా చదవగల శక్తి గలవాడట. అందువల్ల అప్పటికి అమరావతి ప్రభువైన వెంకటాద్రి నాయుడుగారి సంతతి వారొకరు ఆయన మేధాశక్తికి ఆశ్చర్యపడి అమరావతిలో సుక్షేత్రమైన మాన్యమొకటి వారివంశ పారంపర్యంగా అనుభవించే హక్కుతో దయచేయించినారు.

అమరయ్య శాస్త్రిగారికి అప్పటికి ఇరవైయైదు సంవత్సరములు. అంతవరకు వారు బ్రహ్మచర్యాశ్రమములో నుండి సాంగోపాంగముగా వేదాభ్యాసము చేసినారు.

వారి తల్లిదండ్రులు చిన్ననాడే గతించిరి. వారికి ఒక మేనమామ కలడు. ఆయన చాలా నిరుపేద. పిల్లలు లేరు. కాబట్టి ఇంతవరకు అమరయ్యశాస్త్రి గారి వివాహమును గురించి యెవరు యోచించే వారే లేకపోయినారు. వారి చదువు పూర్తి చేసుకొని కాశీ నుంచి వచ్చి యింకా యేడాది కూడా కాలేదు. దైవానుగ్రహం వల్ల ఇంత తొందరలోనే అమరావతీ ప్రభువుగారి ప్రాపకం లభించింది.

ప్రాపకం వల్ల అమరయ్యశాస్త్రి కీర్తి ఆంధ్ర దేశమంతా వ్యాపించింది. శాస్త్రిగారు తమకు అల్లుడుకావటంకన్న వేరే అదృష్టము లేదని, సోమయాజులు గార్లు, దీక్షితులు గార్లు, చైనులుగార్లు, సంస్కారులు అందరు – 'మా అమ్మాయినిస్తామంటే మా అమ్మాయి నిస్తామని' కబురు పంపడం ప్రారంభించారు.

ఈ విషయంలో కొందరు అమరయ్యశాస్త్రిని తమ పిల్లను చేసుకొనేటట్టుగా చేయండని అమరావతి రాజుగారి దగ్గరకు కూడా పెద్ద పెద్ద సిఫార్సులు తీసికొని రావడం జరిగింది.

పెదకళ్లేపల్లి దేవరకోట సంస్థానములో ఒక అగ్రహారము పుణ్యక్షేత్రము. దక్షిణకాశీ అంటారు. మనము కాశీ ఎంత పుణ్యక్షేత్రమని భావిస్తున్నామో ఉత్తర హిందుస్థానము వారు పెదకళ్లేపల్లి అంత పుణ్యక్షేత్రంగా భావిస్తారట. అక్కడ కూడా పూర్వము పెద్దపెద్ద పండితులున్నారు. దాన్ని పరిపాలించే దేవరకోట సంస్థానాధిపతులు కూడా కమ్మ జమీందారులే. వారు కూడా అనేకమంది బ్రాహ్మణులకు అగ్రహారము లిచ్చినవారే. ఆ జమీందారులకు వాసిరెడ్డి వారికి పూర్వం నుంచి సంబంధబాంధవ్యాలు కూడా వున్నవి.

ఒకనాడు పెదకళ్లేపల్లి నుంచి సుసర్ల విశ్వేశ్వరశాస్త్రులవారు అమరావతి రాజాగారి దర్శనానికి వచ్చారు. విశ్వేశ్వరశాస్త్రుల వారంటే చాలా చదువుకొన్నవాడు, సద్బ్రాహ్మణుడు అని చల్లపల్లి రాజాగారికి చాలా అభిమానం. ఆయన రాజాగారిచ్చిన మాన్యం వల్లనే జీవిస్తున్నాడు. అమరావతి రాజాగారు విశ్వేశ్వరశాస్త్రుల వారి రాకకు కారణమడుగగా తన కుమార్తె వివాహ సందర్భములో శ్రీవారి సహాయము కావలిసి యున్నదని చల్లపల్లి రాజాగారు వ్రాయించి యిచ్చిన సిఫార్సు వుత్తరం చూపించెను. ఆ వుత్తరం చూచి అమరయ్యశాస్త్రి గారికి విశ్వేశ్వరశాస్త్రులుగారే అన్ని విధాలా మామగారవడానికి యోగ్యతగలవాడని భావించి వారి కుమార్తెను అమరయ్య శాస్త్రికిచ్చి వివాహము చేయించెను.

అమరయ్యశాస్త్రి తన అత్తవారి భోగభాగ్యాలు, పరువుమర్యాదలు మాట ఎట్లావున్నా, అమరావతి మోస్తరుగానే పెదకళ్లేపల్లి కూడా కృష్ణాతీరమవడంచేత తాను చాలా అదృష్టవంతుడనని భావిస్తూండేవాడు.

అమరయ్యశాస్త్రికి, భార్య కాపురానికి వచ్చిన పది పదిహేను సంవత్సరాలకు ఒక ఆడపిల్ల కలిగింది. ఆ పిల్ల జన్మించిన వేళా విశేషమో ఏమోకాని ఒక యేడాదిలోనే అమరయ్యశాస్త్రి, భార్యా కూడా గతించారు. అప్పటినుంచి ఆ పిల్ల పెదకళ్లేపల్లిలో తాత ముత్తాతల దగ్గరే పెరుగుతూంది. పిల్లదాన్ని వేదవతి అని పిలుస్తూండేవాళ్లు. విశ్వేశ్వరశాస్త్రిగారికి ఇంకా మగపిల్లలు కూడా ఎవరూ లేరు. మగపిల్లడైనా, ఆడపిల్లయినా, మనమరాలైనా ఆ వృద్ధదంపతులకీ వేదవతి ఒక్కతే. అందువల్ల ఆడపిల్లలకు చదువక్కరలేదనే పట్టుదలలోవాడైనా మనసుపడి వేదవతికి విశ్వేశ్వరశాస్త్రి అక్షరాభ్యాసం చేసింది మొదలు తానే స్వయముగా పాఠం చెబుతున్నాడు. వేదవతికి పది సంవత్సరముల వయసు వచ్చింది. విశ్వేశ్వరశాస్త్రి వివాహం చేయడానికి సంబంధాలు విచారిస్తున్నాడు. రేపల్లెలో వెంకటేశ్వరావధానులు గారి కుమారుడున్నాడని విని తన బావమరిదిని పంపి కనుక్కొన్నాడు. వెంకటేశ్వరావధానులు కొడుకు వెంకటరామయ్యకు ఇరవై ఏండ్లు వుంటవి. కొద్దిగా తెలుగు చదువుకున్నాడు. అంతేకాని ఏ శాస్త్రంలోను విశేషంగా పేరెన్నికగన్న ప్రవీణత లేదు. వెంకటేశ్వరావధానులు పెద్ద కొడుకు పదహారేండ్లు వచ్చేసరికే సంస్కృతంలో మంచి పాండిత్యం సంపాదించి అకస్మాత్తుగా కాలం చేశాడు. అందువల్ల తమ పిల్లలకు చిన్నప్పుడు చదువవేస్తే అచ్చిరాదనే ఉద్దేశముతో వెంకటరామయ్యకు పదమూడేళ్లు వచ్చేవరకు అక్షరాభ్యాసమే చేయించలేదు.

విశ్వేశ్వరశాస్త్రి వెంకటరామయ్య అల్ప విద్యావంతుడైనప్పటికి కొంచెం భూమీ బుట్ర గలవాడవటంవల్ల తల్లిదండ్రులున్న పిల్లవాడవటం వల్ల పిల్ల సుఖపడుతుందని వేదవతిని అతనికే యిచ్చి పెండ్లి చేశారు.

వేదవతి కాపురానికి వచ్చినది మొదలు భర్త వెంకటరామయ్య యెందువల్లనో జబ్బుగా వుంటున్నాడు. పూర్వమువలె ఉత్సాహముగా లేదు. "పెళ్లాన్ని చూసి పెళ్లాం తెలివి చూసి భయపడ్డావా ఏమిటి?' అనీ సిగ్గు వచ్చే పెళ్లాము వచ్చిందిలే నీకన్న బాగా చదువుకున్నది, అనీ యిరుగు పొరుగు వాళ్లంతా అనడం ప్రారంభించారు.

అందువల్ల వెంకటరామయ్య చాలా దిగులు పడిపోయినాడు. ఆ వూళ్లో వున్న శాస్త్రులు గారి దగ్గరకు వెళ్లి తనకన్నా చాలా చిన్నపిల్లలతో చదువుకోవడానికి సిగ్గు పడుతుండేవాడు.

వేదవతి సంక్రాంతి పండుగకు తాతముత్తాతల యింటికి వెళ్లినది. పండుగ వెళ్లిన రెండు మూడు నాళ్లకు వెంకటరామయ్య రేపల్లెలో లేడనిన్ని తల్లిదండ్రులతో చెప్పకుండా యెక్కడికో లేచిపోయినాడనిన్నీ, ఎక్కడ భోగట్టా చేసినా ఏమీ అంతు తెలియడంలేదనిన్నీ వర్తమానం వచ్చింది. విశ్వేశ్వరశాస్త్రి మనస్సులో పెద్ద రాయిబడి పోయింది. తల్లిదండ్రులు లేని బిడ్డను సుఖపడుతుందని కాస్త కలవాడని యిస్తే వెంకటరామయ్య దేశాంతరము పాలయినందుకు మనోవ్యాధిపడ్డాడు. వేదవతి అభం శుభం తెలియని బిడ్డ. భర్త మాట తెలియడంతోనే దిగులు పడిపోయింది. ఇకనా వృద్ధదంపతుల హృదయకల్లోలము, చెప్పడానికి వీలులేదు. ఈ సంగతి విని శాస్త్రులు గారిని స్నేహితులు, బంధువులు, ఎంతమందో చూసి ఓదార్చి పోయినారు. ఎంతమంది వస్తేనేమి! వెంకటరామయ్య వృత్తాంతము చెప్పినవారెవరు లేకపోయినారు.

నాలుగు మాసములు గడచినవి. రేపల్లెలో వెంకటేశ్వరావధానులుగారికి గాని పెదకళ్లేపల్లిలో విశ్వేశ్వరశాస్త్రిగారికి గాని వెంకటరామయ్య వృత్తాంతమేమీ తెలియ రాలేదు. కొందరు చదువుకోవడానికి కాశీ లేచిపోయినాడేమోనని, ఇంకా కొందరు అతనికి ప్రపంచమంటే మొదటి నుండీ విరక్తే. అందువల్ల బైరాగులలో కలిసినాడేమో నని, సన్యసించి వుంటాడని యింకా కొందరు ఎవరి నోటికి వచ్చినట్లుగా వారు తలొకమాట అనడం ప్రారంభించారు. ఇవన్నీ వింటూ మరికాస్త మనోవ్యాధితో వేదవతి అన్నం తిండిలేక శల్యమైపోయింది. తనని భర్త ఫలానిచోట చూశామని చెప్పేవారుగాని, ఫలానిచోట ఉన్నాడని చెప్పేవారు గాని లేకపోయినారు.

వేదవతి దుఃఖం శమించడానికి విశ్వేశ్వరశాస్త్రి ఆమెచేత వేదాంత గ్రంథాలు చదివించడం, ఆమెకు వేదాంత ప్రసంగాలు తాత్పర్యమయ్యేట్లుగా చేయడం ప్రారంభించాడు. వేదవతి సహజంగా చక్కని తెలివితేటలు గలది గనుక, కొన్నాళ్లకు ఆమెకు కొన్ని గ్రంథాలు తనంతటతానే ఎవరి సహాయము కూడా లేకుండా అర్థం చేసుకునే శక్తి సంపాదించింది. నానాటికామెకు ఇక తన భర్త ఎప్పటికీ తన కళ్లపడదని తనకేమీ యీ ఇహలోకంతో సంబంధము లేదనీ గట్టి నమ్మకం కలిగింది. గ్రామంలో హరికథలకు, మాఖపురాణాలకు, ముత్తవతల్లితో కలిసి తాను కూడా వెళ్లుతుండేది.

విశ్వేశ్వరశాస్త్రి భార్యను, వేదవతిని తీసుకొనిపోయి యాత్రలు సేవించి వస్తుండేవాడు. యాత్రాస్థలాల్లో కనుపించిన సన్యాసి దగ్గరల్లా వేదవతికి వేదాంతోపదేశాలు చేయించి యించుమించుగా నామెనీ ప్రపంచకమే మరచిపోయే టట్టుగా చేశాడని చెప్పవచ్చును.

ఇలా నాలుగైదు సంవత్సరములు గడచినవి. గోదావరీ పుష్కరానికి విశ్వేశ్వర శాస్త్రి భార్యను, మనుమరాలిని కూడా తీసుకొని రాజమహేంద్రవరం వెళ్లినాడు. ఆ పండ్రెండు రోజులు రాజమహేంద్రవరం ఇరుకు వీధులలో చీమలబారల్లే జనసమూహం క్రిక్కిరిసిపోయింది. ఎక్కడలేని బైరాగులు, ఎక్కడలేని సన్యాసులు, ముష్టివాళ్లు, రాజమహేంద్రవరంలోనే ఉన్నారు. గోదావరి నిండుగా వచ్చి ఆవతలకట్టకు ఇవతల కట్టకు ఆనుకుని తొణుకులాడుతూంది.

విశ్వేశ్వరశాస్త్రిగారు నాళంవారి సత్రానికి దగ్గరగా ఉన్న ఒక గృహస్తు యింట్లో బసచేశాడు. నాళంవారి సత్రంలో ఎవరో నలుగురైదుగురు స్వాముల వార్లు దిగినారు. వారంతా ఏవేవో వేదాంతపు చర్చలు చేస్తూండేవారు. వేదవతి, ముత్తవతల్లీ పోయి విని వస్తూండేవాళ్లు. వేదవతికి ఎక్కడ స్వాములవారు కనిపించినా వారి మీద అధిక గౌరవం. వారి దగ్గర వేదాంతోపన్యాసాలు వినడమే పని.

వేదవతికి ఒకనాడు తీవ్రముగా జ్వరము వచ్చింది. ఆనాడు సాయంకాలము కనిచీకటిగా వుండగా వేదవతి అమ్మమ్మ ఎవరో ఒక సన్యాసి వాకిట్లో నుంచి పోతూంటే పిలచి మా అమ్మాయికి మంత్రతీర్థమిచ్చి పొమ్మని వేడుకొన్నది.

ఆ సన్యాసి తనకేమియు తెలియదని చెప్పినను వినక 'మీయందు మాకు నమ్మకము కలదు. మీ చేతితో కొంచెము మంత్రోదకమిస్తే మా అమ్మాయికి జ్వరం నయమవుతుంది. ఏదో అర్థాంతరాన వున్నాము. ఈ మాత్రం సహాయం చేయండని' మఱిమఱి బ్రతిమిలాడసాగింది. దానికి మనసు కఱిగి 'అమ్మా అలా అయితే మాతో వున్న ఒక ముసలిస్వాములవారిని తీసుకొనివచ్చి మంత్రతీర్థమిప్పిస్తానని' ఒక ముసలి సన్యాసిని తీసుకొని వచ్చాడు. వారిద్దరు లోపలికి పోయినారు. ముసలి సన్యాసి జపం చేసుకొంటూండగా ముసలమ్మ వేదవతిని తీసుకొని వచ్చింది. వేదవతి జ్వర తీవ్రత చేత తమ బసలోకి వచ్చిన సన్యాసుల నిద్దరిని సరిగా చూడనైనా చూడలేక పోయింది. పడుచుస్వాముల వారు వేదవతిని చూచిన దగ్గర నుంచి ముఖకవళిక మారిపోయింది.

ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయినారు. కళ్ళు బాష్పపూరితములైనవి. కొంతసేపటికి వృద్ధసన్యాసి తన జపం పూర్తిచేసి కళ్ళు తెఱిచేసరికి పడుచుస్వాముల వారీస్థితిలో ఉండటం చూచాడు.

'ఏమి నాయన? ఈవేళ అలా కళ్లనీళ్ళు పెట్టుకొంటున్నావు? మీ యిల్లు, సంసారం, భార్యా జ్ఞాపకం వచ్చారా ఏమిటి? మీవంటి పడుచువాళ్ళు విరాగులుగా అందువల్లనే వుండతగరు' అన్నాడు. ఆ మాట ముసలమ్మ విని 'మా యింటికొచ్చిన పిల్ల మొగుడు ఒకడు యిట్లాగే అయిపోయినాడుగా నాయనా' అంది.

ఆ మాటకు బాలసన్యాసి దుఃఖమాపుకోలేక బావురుమన్నాడు. వేదవతి కళ్ళు విప్పి తేరిపార చూచింది. బాలసన్యాసిని గుర్తుపట్టి 'ఎన్నాళ్లకు కనిపించినారు' అని అకస్మికంగా వెళ్లి వెంకటరామయ్యను కౌగలించుకుని ఒకేపెట్టున దుఃఖించడం ప్రారంభించింది. ఇంతలో విశ్వేశ్వరశాస్త్రులు గోదావరి నుంచి వచ్చి యిదంతా చూచి సంతోషాశ్చర్యములలో మునిగిపోయినాడు.

'కావిపుట్టమ్ము కటిసీమకట్టు భాగ్య
భోగ్యరాహిత్యమైన వైరాగ్యమునకు
జాజిపూ సౌరభంబులు జల్లువిరియు
జవ్వనంబున కెంతటి దవ్వుగలదు'.

## కథానేపథ్యం ...

ఈ కథలో ఎనిమిది, పది దశాబ్దాల కిందటి తెలుగునాటి సాంఘిక స్థితిగతులు చూస్తాము. సమాజంలో కొంచెం పై స్థాయిలో ఉండే వివిధ కులాల మధ్య వర్గాల మధ్య సామాజిక సంబంధాలు, అనుబంధాలు, పరస్పర మర్యాదలు, గౌరవాలు, ఆపేక్షలు, ఉపేక్షలు వ్యక్తమైనాయి. సాంఘిక చట్రంలో చిరకాల పటుత్వం ఇంకా కొనసాగుతున్న వైనం కన్పిస్తుంది. జమిందారీ వ్యవస్థ ఇంకా గౌరవస్థితిని, పాత్రతను కోల్పోలేదు. ప్రాచీన విద్యల పట్ల శాస్త్రాల పట్ల భక్తి ప్రపత్తులు సమాజ సంబంధాలలో

కొనసాగుతూనే ఉన్నాయి. అధ్యాత్మిక విషయాల పట్ల ఆసక్తి, ఆదరణల పాతకాలపు వాసనలు యథాస్థితంగా ఉన్నాయి. ఇది ఒక కరుణగాథ. అప్పుడప్పుడే నూతన సాంఘికాశయాలవైపు ఒక అడుగు వేస్తున్నా పాతతరం పదిలంగానే ఉంది. మూడు తరాల జీవితాల కథను కరుణార్ద్రంగా సంధానించారు రచయిత. ఈ రచయిత పేరు అటు తరవాత కాలంలో ఎక్కడా ఎప్పుడూ కనరాలేదు. వినరాలేదు. సాహితి పత్రిక నాలుగైదు సంవత్సరాలు మాత్రమే వచ్చింది. మధ్యమధ్య ఆగిపోతూనూ వచ్చింది. అన్ని సంపుటాలూ ఎక్కడా దొరకవు. ఆ పత్రిక ప్రారంభ సంపాదకులు తల్లావర్ఝుల శివశంకరశాస్త్రి. తరువాత ఆయన తప్పుకున్నారు. కొడాలి ఆంజనేయులు, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి గారలు అప్పుడు సంపాదకత్వ బాధ్యత వహించారు. తెనాలి నుంచి ప్రకటితమైనా, బెజవాడలో చివరి మూడేళ్ళు అచ్చవుతున్నట్లు ప్రకటన చూడవచ్చు. బహుశా 1924 జనవరి నుంచి భారతి పత్రిక ప్రారంభం కావడంతో సాహితి ఆగిపోయినట్లు ఊహించవచ్చు. సాహితి పత్రిక యౌవన వికాసరూపమే భారతి.

## కథారచయిత కొడాలి?

ఈ కథను రచించిన వారు కొడాలి ఆంజనేయులు గారేనేమో అనుకోవటానికి కొన్ని ఆధారాలున్నాయి. సాహితి పత్రికలో కొడాలి వారి కవితా ఖండికలు ఎన్నో వచ్చాయి. విశ్వనాథవారూ, కొడాలివారూ కలిసి జంటకవులుగా సాహితి పత్రికలో రచనలు వెలయించారు. విశ్వనాథ వారి ప్రసిద్ధ నవల వేయిపడగలలో కొడాలి ఆంజనేయులుగారు ఒక ప్రధానపాత్ర. ఆ పాత్ర పేరు రాఘవరావు. కాబట్టి సంపాదకుడి పేరునే చాలా రచనలు పత్రికలో వేయడం ఇష్టం లేక ఆంజనేయులుగారు ఈ పేరుతో ఈ కథను ప్రకటించారేమోననిపిస్తుంది. ఈ కథలోని సన్నివేశ వాతావరణం కొడాలి వారికి చిరపరిచితం. అన్నిటికంటే బలమైన సాక్ష్యం ఏమంటే కొడాలి వారి 'సన్యాసి' అనే ఖండకావ్య చివరిపద్యంతో ఈ కథ ముగుస్తుంది. ఈ పద్యం చాలా హృద్యం. ఈ ఖండకావ్యగీతిక ముద్దుకృష్ణ సంకలితం చేసిన వైతాళికులలో చేరింది. ఈ పద్యం పరమార్థంగానే రచయిత ఇంకెవరైనా ఈ కథ రాశారనడం స్పష్టం. విశ్వనాథ కథలు కూడా సాహితిలో వచ్చాయి.

1905లో తణుకు నుంచి సువర్ణలేఖ అని సారస్వత పత్రిక ప్రారంభమైన వైనం తెలుగు సాహిత్యపరిశోధకులు గుర్తించారు. పానుగంటి లక్ష్మీనరసింహా రావు గారి 'సాక్షి' వ్యాసాలు ముందుగా ఈ పత్రికలోనే వచ్చాయి. తరువాత ఆంధ్రపత్రిక దినపత్రిక వచ్చిన తర్వాత ఆ పత్రికలో ధారావాహికంగా వెలువడ్డాయి. పానుగంటి వారు సువర్ణలేఖలో కథలు కూడా రాశారు. ఆ రోజుల్లో చిలకమర్తి వారు కూడా కథలు రాశారని చాలామందికి తెలియదు.

చిలకమర్తి వారు కూడా పత్రికలు నడిపారు. కాబట్టి కథారచన అగత్యం ఏర్పడి ఉంటుంది. గయోపాఖ్యానం నాటకం ద్వారా కిందటి శతాబ్ది ప్రథమ దశకం నాటికే ఆయన చాలా ప్రసిద్ధికెక్కారు. సువర్ణలేఖ పత్రిక నిర్వాహకులుగా వెదురుమూడి శేషగిరిరావు కథలు ఆ పత్రికలో ప్రకటించారు. 1918 నాటికే వెదురుమూడి వారి కథా సంపుటి 'సువర్ణలేఖ కథావళి' పేరుతో వెలువడింది. కాబట్టి తెలుగులో వెలువడ్డ మొదటి కథా సంపుటి వీరిదేనేమోనని భావించవలసి ఉంటుందేమో! తరువాత శేషగిరిరావుగారిదే మరో కథా సంపుటం 'మదరాసు కథల్ను పేరుతో వచ్చింది.

దీన్నిబట్టి 20వ శతాబ్ది తొలి దశకంలోనే తెలుగు పత్రికలు కథారచనను ప్రోత్సహించాయని తెలుసుకోవచ్చు.

# 5. అరిసె ముక్కలు

**– వర్ఘు బాబురావు**

**మా** నాన్నకు నేను పెద్ద కుమార్తెను. నేను పుట్టిన యేడో రోజునే మా అమ్మ బాలింత రోగము వచ్చి చనిపోయింది. ఆమె పోయిన పదమూడో రోజునే మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. నాకు బుద్ధి తెలిసేటప్పటికి మా సవతితల్లికి ముగ్గురు బిడ్డలు పుట్టినారు.

నాకు పదేళ్ళు వచ్చేదాకా మా నాన్న నా పెళ్ళిమాట తలపెట్టలేదు. మా అమ్మమ్మ పదేపదే చెప్పడముచేత ఇక సాగదని వరుడి కోసము వెతకడము ప్రారంభించినాడు. ఆ సంవత్సరము తగిన సంబంధము కుదిరింది కాదని మరుసటి సంవత్సరము వైశాఖ మాసములో చెయ్యవచ్చునని మానివేసినాడు. మరుసటి వైశాఖములో మా సవతితల్లి ఖాయిలాపడ్డది. నాలుగు నెలలు మంచాన పడి తీసుకొన్నది. ఆ ఖాయిలాలో ఆమెకు వచ్చే ప్రాణము పొయ్యే ప్రాణముగా వుండేది. చాలామంది వైద్యులను తెచ్చారు. చాలా మందులు వాడినారు. అందులో భూతవైద్యులు తతంగాలూ, తంతులూ చేశారు. వేటివల్లా రోగము తిరిగింది కాదు. గరళముకూడా చివరకు వాడినారు. కొన్నాళ్ళకు నెమ్మదిగా జబ్బు నిమ్మళించింది. ఆమె ఖాయిలాలో వుండగా నా పెళ్ళిమాట ఎవరికి జ్ఞాపకమున్నది? ఇంటికి చూడవచ్చిన వారితో మా అమ్మమ్మ మాత్రము మా సవతి తల్లి జబ్బూ, ఇంట్లో ఇబ్బందులూ చెపుతూ నా పెళ్ళి యిబ్బంది కూడా వాటితో కలుపుతూ వుండేది. వైశాఖ మాసములో వీలుపడ్డది కాదుగదా అని మాఘమాసములో తప్పకుండా వివాహము చేస్తానని అన్నాడు మా నాన్న. ఏ మాసములోనైనా డబ్బు ఖర్చుచేసి వివాహము చెయ్యవచ్చును గాని మా స్థితిగతులకు తగిన సంబంధము దొరకవద్దా?' అనేవాడు మా నాన్న చాలాసార్లు. ఏవో వ్యవహారాల మీద ఆయన దగ్గరికి వచ్చిన ప్రతివారూ, 'బాబూ, అక్కడ సంబంధమున్నది, ఇక్కడ సంబంధమున్నది', అన్న చోటికల్లా కబుర్లు పంపి మా నాన్న విచారిస్తూ వుండేవారు. 'ఈ సంవత్సరము మేము చెయ్యదలచుకోలే'దని కొందరూ, 'అంతవారితో మేము వియ్యం పొందగలమా?'

అని మరికొందరూ, 'మాఘ మాసానికి తూగి రాలేమని' ఇంకో కొందరూ ఇచ్చే జవాబులు వస్తూ వుండేవి. ఈ రాయబారాలతో మాఘ మాసము సగపడ్డది. వరుడు ఎక్కడా దొరకలేదు. నా కప్పటికి పన్నెండేళ్ళు నిండినివి.

నన్ను చూసిన వాళ్ళందరూ, 'ఇంకా ఈ పిల్లకు కన్నెచెర వదిలిందికా'దనే వాళ్ళు. నేను కాస్త కాలు పొడుగు దానను. 'పెళ్ళి అయిందా?' అనే మాట అడగకుండా చాలామంది నన్ను చూసి, 'కాపురానికి వెళ్ళిందా? లేక ఈ యేడు పంపుతారా?' అని మా వాళ్ళతో అనేవాళ్ళు. ఇంట్లో మా అమ్మమ్మ గోల యెక్కువయింది. 'ఇక అమ్మాయికి వివాహము చెయ్యకపోతే ఎలాగు?' అని మా నాన్న స్నేహితులూ, చుట్టాలూ అన్నారు. ఆయనకేమి తోచింది కాదు. 'ఎక్కడైనా వరుడు దొరికితే బాగుండును' అని నిట్టూర్పు విడిచినాడు మా నాన్న. చివరకు మావూరి దగ్గర గ్రామములో ఒక సంబంధము కుదిరింది. ఎక్కువ కట్నమిస్తాననేటప్పటికి ఒక గృహస్థు తన కుమారునికి నన్ను వివాహము చేసుకోడానికి ఇష్టపడ్డాడు.

పెళ్ళికొడుకు కుదిరేదాకా నాకూ మనశ్శాంతి లేదు. వైశాఖమాసములోగా సంబంధము కుదిరితే సరే. లేకపోతే దోవను పొయ్యేవాడిని పిలిచి నాలుగెకరాలు కట్టబెట్టి ముడివేస్తానని మా నాన్న ఒకసారి అన్నప్పుడు నా ప్రాణము చివుక్కుమన్నది. ఎటువంటి భర్త నాకు రాసిపెట్టి ఉన్నాడో అని నాకు దిగులుగా ఉండేది. కుదిరిన పెళ్ళివారికి భూ వసతి కలదనీ, కరిణీకము వున్నదనీ తెలిసి లోలోపల సంతోషించాను.

అటు తరువాత పెళ్ళికొడుకు ఎలా వుంటాడో అని ఆందోళన! పెళ్ళివారి చుట్టాలూ, వారి స్థితిగతులనూ గురించి మా వాళ్ళు చెప్పుకుంటూవుంటే నేను గదిలోనో. గోతాల మెట్టుచాటునో, నిద్రపోయేదానివలెనో వుండి వింటూ వుండేదాన్ని. పెళ్ళికొడుకు సంగతి ఎంత విన్నా ఇంకా వినవలెననే వుండేది.

మా అమ్మమ్మ నన్ను పెంచుతూ మా యింట్లోనే వుండేది. ఆమె పెళ్లికొడుకును గురించి మా నాన్నతో మాట్లాడుతూ, "అయితే, నిరుడు స్వామివారి రథోత్సవమునాడు గుర్రమెక్కి వచ్చినవాడేనా అల్లుడు?' అని అన్నది. ఆ తిరునాళ్ళలో ఆయనను చూచాను గాని ఆయన పెళ్ళికొడుకవుతాడని నాకేమి తెలుసును? తెలిస్తే బాగా చూచేదాన్నే అనుకొన్నాను. అయినా అప్పుడు చూసిన జ్ఞాపకము కొంచెముగా వున్నది. ఆయన ముక్కు, నోరు, కళ్ళు చెవులు, ముందరి జుట్టూ జ్ఞాపకము తెచ్చుకోడానికి చాలా ప్రయత్నము చేశాను.

పెళ్ళిలగ్గము ఆరోజు కారోజుకు దగ్గిరికి వస్తున్నకొద్దీ మా యింట్లో పెళ్ళి పనుల అడావడి హెచ్చింది. మా పశువుల కొట్టాలన్నీ బాగుచేశారు. దొడ్డినిండా పెద్ద పందిరి వేశారు. అప్పడాలు, వడియాలు, పచ్చళ్ళు, ఊరగాయలూ తయారయినవి. పప్పులు, బియ్యాలూ, రకరకాలుగా తయారుచేయించి వంట యింట్లో బిడారు వేశారు. పెళ్ళిరోజుల్లో వర్షము వస్తుందేమో అని గాడిపొయ్యి సావడిలో తవ్వినారు. ఇంకా పెళ్ళి అయిదారు రోజులున్నదనగానే వంట అక్కడే చెయ్యడము ప్రారంభించారు. వివాహము రెండు మూడు రోజుల్లోకి వచ్చేటప్పటికి మా చుట్టాలంతా బళ్ళెక్కి వచ్చారు. గంటల చప్పుడయినప్పుడల్లా వాకిట్లోకి వెళ్ళి చూచేదాన్ని. వచ్చిన చుట్టాలతో మా పెద్దమండువా యిల్లంతా నిండిపోయింది. పెళ్ళికి కొత్తబట్టలు, పోకచూర, లవంగాలు ఇంకా ఏవేవో సామగ్రులు మా తాత గుంటూరు నుంచి తెప్పించినాడు. మా నాన్న గది ఆ మూటలతో నిండిపోయింది. కొట్టు పెత్తనము మా సవతి తల్లిగారి అన్నది.

రేపు లగ్నమనగా మా వాళ్ళు నన్ను పెళ్ళికూతురిని చేశారు. మరి ఇద్దరిని తోడు పెళ్ళికూతుళ్ళను చేశారు. నా నొసట కళ్యాణపు బొట్టు, బుగ్గను చుక్క, కాళ్లకు పారాణీ పెట్టినారు. మా ఊరి మేళగాళ్ళు వాయించినారు. మా చుట్టాలు చీరెలు, రూపాయలు, ఉంగరాలూ చదివించారు.

పెళ్ళికూతురిని చేసిననాటి సాయంకాలము మా మేనత్త, అమ్మమ్మ మరో ముసలమ్మా అరిసెలు వండుతూ ఉన్నారు. అక్కడికి వెళ్ళి నేను పీటమీద కూర్చుని, వాళ్లతో కబుర్లు చెప్పుతూ అరిసెముక్కలు తింటున్నాను. మా మేనత్త కొడుకు వచ్చి నా సరసను నిలవబడ్డాడు. 'అత్తా, రాముడికి కూడా ఒక అరిసె ఇయ్యి తింటూ ఉంటాడు' అని నేనొక పీట చూపించాను. మా అత్త అరిసె యిస్తూ, 'మా రాముడింకా రెండేళ్ళు పెద్దవాడైతే మా సుందరికి మొగుడయ్యేవాడే' అన్నది. మా మేనత్త కొడుకు నాకంటె ఏడన్నర్థము పెద్ద. నా యెత్తు ఉంటాడో, ఉండడో. నేనెప్పుడూ వరసలాడుతూ ఉండేదాన్ని. రాముడు నా సరస పీట మీద కూర్చుని అరిసెతింటూ ఉంటే నా చేతి కంటిన నెయ్యి అతని బుగ్గలకు పూసి, "రాముడూ, నీవు నాకు మొగుడువయ్యేవాడవు కాబోలు' అన్నాను. 'చూడవే అమ్మా, నెయ్యి రాస్తుంది! దీనికి బొత్తుగా భయము లేదు. పెళ్ళి కొడుకుతో చెప్పుతానుండు" అన్నాడు. మా అమ్మమ్మ మా అత్త మాటకు, 'బ్రహ్మ లిఖితము గదా' అన్నది. కొంతసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. నేను అరిసె వంట చూస్తూ ఉన్నాను. ఇంతలో వాకిట్లో ఎద్దుల గంటల చప్పుడయింది. "వెంకమ్మప్ప వచ్చిందేమో చూడు" అని మా అమ్మమ్మ అన్నది. "రాముడూ, తిన్నది చాలుగాని

వాకిట్లోకి వెళ్ళి చూతాము రా' అని చెయ్యి పట్టుకొని అతన్ని లాక్కుపోయి వీధి గుమ్మము దగ్గిర నిలుచున్నాను. మా వెంకమ్మప్పా పిల్లలూ బండి దిగినారు. బండి దిగుతూనే మా అప్ప, ' ఏం రాముడూ, పెళ్ళికూతురికి తోడు జవానువా యేమిరా?" అన్నది. "సుందరిని పెళ్ళికొడుకుకు అప్పజెప్పేదాకా నేనే కావలి, ఎవరూ ఎత్తుకుపోకుండా" అన్నాడు.

"మంచి బంట్రోతు అక్కయ్యా" అన్నాను.

నేను నిద్దర లేచేటప్పటికి ఒకటే అడావిడిగా ఉన్నది. వారినీ వీరినీ బిగ్గరగా పిలవడముతో అప్పటికే చాలామంది గొంతులు బొంగులు పోయినవి. 'పొయ్యి మండిపోతున్నది, చద్దివణ్ణాలకు బియ్యం కొలిపించండి బాబూ' అని వంటబ్రాహ్మణుడు అంటున్నాడు. మా మామ, మా నాన్నతో 'పొద్దెక్కుతున్నది. భజంత్రీలను రమ్మని, వూళ్ళో మనవాళ్లను నలుగురినీ పిలిచిరా. పెళ్లివారు ఊళ్ళోకి వస్తే వారి కోసం వెళ్లడానికి తర్వాత తీరదు. బుచ్చమ్మా ఊళ్ళో పేరంటం పిలవడానికి తొందరగా బయలుదేరు' అని మా సవతితల్లితో కూడా అన్నాడు. కొంచెం సేపటికి మా నాన్నా, అమ్మా, ఇంకా కొంతమంది మేళముతో కలిసి భోజనాలకు పిలవడానికి ఊళ్ళోకి వెళ్ళినారు.

లగ్నపత్రిక పురోహితుడి చేతికిచ్చి ఆ కిందటి సాయంకాలమే పెళ్ళివారి ఊరికి పంపినారు. పెళ్ళివారు రావలసిన వేళ సమీపిస్తున్నది. మామ చాకలివాడి నొకడిని పిలిచి, 'వరే పెళ్ళివారెంత దూరము వచ్చారో చూసిరారా' అని పంపినాడు.

నేను దొడ్లో అరుగు మీద కూర్చుని మొఖము కడుక్కొంటున్నాను. వీధిసావట్లో మా మామ ఎవరితోనో పెద్దపెట్టున కేకలు వేస్తున్నాడు. పనులు చేస్తూ ఉన్న వాళ్ళంతా ఎక్కడి పనులు అక్కడ విడిచిపెట్టి అంతా సావట్లోకి పరుగెత్తారు. వంట చేస్తున్న బ్రాహ్మడు నన్ను చూసి, 'అమ్మా! కుక్కలు, కాకులూ రాకుండా చూడ'మని చెప్పి, చెయ్యి కడుక్కొని, సావట్లోకి వెళ్ళినాడు. నేను ముఖము తుడుచుకుంటూ ఉండగా వంటాయన తిరిగి గాడిపొయ్యి దగ్గిరికి వెళ్ళి, గంటె తిప్పుతూ, 'ఎంత పని జరిగింది! ఎంత సాహసము' అన్నాడు. ఏదో దొంగతనము జరిగింది అని నేననుకొని, 'ఏమిటండి?' అని అడిగాను.

'లగ్నపత్రిక తీసుకు వెళ్ళిన బ్రాహ్మడు వచ్చాడు. పెళ్ళివారు లగ్గానికి రామన్నారట'

‘ఏమైనా ఆటంకం వచ్చిందా?’

‘ఆటంకం లేదు, వాళ్ల బొందా లేదు. మీ పుల్లయ్య మామగారి తమ్ముడు సీమకు వెళ్ళి వచ్చిన వారితో కలిసి భోంచేశాడట. అందుచేత మీ మామకు, ఆయనను బట్టి మీకూ వెలిట. స్నాతకము చేసుకుని లగ్గానికి బయలుదేరడానికి సిద్ధముగా ఉన్నవాళ్లతో ఎవరో ఈ సంగతి చెప్పారట. అందుమీద ఈ సంబంధము మాకక్కరలేదన్నారట పెళ్ళివారు. పీటలమీది పెళ్లిళ్ళు పాడుచేసే ముండాకొడుకుల మాటలు పట్టుకొని ఈ వెర్రిముండావాళ్ళు సంబంధం మానుకోవడమేమిటి? – పాపము, బ్రాహ్మడు ఎంత ప్రయత్నము చేసుకొన్నాడు. ఇంటినిండా చుట్టాలు దిగినారు. ఊళ్ళో భోజనాలకు చెప్పి వచ్చారు. వంటలవుతూ ఉన్నవి. నట్టేట్లో పుట్టి మునిగినట్టయింది.’

నాకేమీ తోచింది కాదు. పెళ్ళి ఇలా ఆగిపోతుందని ఎవరనుకొన్నారు! సంగతి ఏమిటో చూతామని సావట్లోకి వెళ్లాను. సావడినిండా జనము మూగి ఉన్నారు. మా మామ కేకలువేస్తూ అటూఇటూ తిరుగుతున్నాడు. ఆయన ఒంటినిండా చమట పట్టింది. కొంచెము బొర్రకలవాడు కావడము చేత మా మామ రోజుతున్నాడు. ఎక్కడివాళ్ళక్కడ నిశ్చేష్టులై నిలబడ్డారు. మా నాన్న ఖిన్నుడై స్తంభము ఆనుకొని నిలుచున్నాడు.

“సూరయ్యా, నీవిలా ఆలోచిస్తే కార్యము కాదు. ఆ దొంగముండాకొడుకులు రామన్నారని కార్యము మానుకుంటామా యేమిటి! వాళ్ళ ముఖముమీద కొట్టినట్టు ఈ లగ్గము వేళకే వివాహము చేయించకపోతే నియ్యోగ్యపువాణ్ణి కాను” అన్నాడు మా మామ.

ఆ మాటలు విని, మా మామకు మతిపోయిందనుకున్నాను. పెళ్లికొడుకు లేకుండా పెళ్లి ఎలా జరుపుదామని ఆయన వుద్దేశమో అని నేను ఆశ్చర్యపడుతూ వున్నాను.

“సూరయ్యా, చేసిన పని వ్యర్థమవుతుంది. నలుగురిలోనూ నామోషీ! ఇప్పుడు పిల్లకు పెళ్లి జరగకపోతే, పిల్లకేదో వంకని నలుగురి నోళ్లలో పడుతుంది. ఆనక పస్తాయించిన లాభము లేదు. నామాట విను. రాముడికీ సుందరికీ ఏడ్నర్థము వార ఉన్నదిగదా. వాడికి తలంటి నీళ్లు పోసి, స్నాతకము కానివ్వండి. పదమూడు ఘడియల పై చిలుకు దివ్యమైన లగ్నముంది. ఆ లగ్నానికి ముడి పెట్టుదాము’ అన్నాడు మా మామ.

మా నాన్న ముఖముకేసి చూస్తూవున్నాను. ఆయన ముఖానికి తెలివి వచ్చింది 'సరే, జరుపుదాము' అన్నాడు. నేను ఇటూ అటూ చూచేటప్పటికి నా పక్కనే గోడ కానుకొని మా బావ నిలుచున్నాడు. ఆయనను చూచేటప్పటికి నాకెక్కడ లేని సిగ్గు వచ్చింది. తొందరగా దొడ్లోకి వెళ్లుదామని బయలుదేరేటప్పటికి మా బావ నా కొంగు పట్టుకొని, 'ఎక్కడినించి వచ్చిందే సిగ్గు?' అన్నాడు. ఇంతలో మా మామ ఆయనను చూసి, 'పురుషోత్తం, మరదలితో తర్వాత సరసాలాడవచ్చుగాని ముందిటురా' అన్నాడు. ఒక్క పరుగున నేను గదిలోకి వెళ్లిపడ్డా.

నేను మంచము మీద పడుకొని గోడమీద సావిత్రీ సత్యవంతుల బొమ్మ చూస్తూ ఉన్నాను. కొంచెము సేపటిలో నాకు కునుకు పట్టింది.

మెళకువ వచ్చి నేను కళ్లు తెరిచేటప్పటికి మా సవతితల్లి నన్ను చేతితో తట్టుతూ, 'సుందరీ, ఇక్కడున్నావటే! లేచి రా, తలంటి నీళ్లు పోస్తాను. గౌరిపూజ చేతువుగాని' అన్నది.

కొంతసేపటికి మా మామ నన్నోతట్టలో కూచోబెట్టి, సావట్లోకి ఎత్తుకొని వెళ్లాడు. సావడినిండా జనము కూర్చున్నారు. ఆడవాళ్లంతా ఒకచోట నిలబడి వున్నారు. ఇద్దరు బ్రాహ్మలు మంత్రాలు చెప్పుతూ కొత్తబట్ట అడ్డముగా పట్టుకొని నిలుచున్నారు. నాకాపొద్దున జరిగినదేమీ జ్ఞాపకము లేదు.

అయితే పెళ్లికొడుకు ఎలా వుంటాడో చూతామనుకొన్నాను. మా యిద్దరికీ మధ్య అడ్డముగా వున్న బట్టలోనుంచి పెళ్లికొడుకు రూపురేఖలు కనబడతవేమో అని ప్రయత్నము చేసి చూచాను. కొంతసేపటికి లీలగా ఆకారము కనబడ్డది. మరికొంత సేపటికి అడ్డముగా పట్టిన బట్ట చప్పున తీసి వేశారు. పెళ్లికొడుకును చూచేటప్పటికి మా మేనత్త కొడుకే! నాకు చాలా ఆశ్చర్యము వేసింది. నేనింకా నిద్రపోతూ వున్నానేమో అనుకున్నాను. ఇలా అనుకొని ఒక మాట కళ్లు తుడుచుకునేటప్పటికి పెళ్లికుమారుడు లేచి నా కంఠాన మంగళసూత్రము కట్టినాడు. నాకు నిద్ర పట్టక ముందు జరిగిన సంగతులన్నీ జ్ఞప్తికి వచ్చినవి.

ఆ రాత్రి స్థాలీపాకము చేయించారు. తల వంచుకొని కూర్చున్నంత సేపూ పెళ్లికొడుకును నఖశిఖపర్యంతము చూస్తూనే వున్నాను. అదివరకున్నట్టు లేరు వారు. పెళ్లికొడుకయిన దగ్గరినుంచీ ఏమో వింతగా కనబడ్డారు.

మరునాడు మేజువాణి, మేమిద్దరము పూలబంతులాడినాము. ముత్తైదువలు పాటలు పాడినారు. బోగము మేళము కూడా ఉన్నది. నా మనస్సు వీటిమీద లేనేలేదు. పెళ్లికొడుకే నా హృదయమంతా ఆక్రమించుకొన్నారు.

ఇంతలోకే ఎవరో నా దగ్గరికి వస్తున్నట్లు తోచింది. తిరిగి చూసేటప్పటికి పెళ్లికొడుకు నా దగ్గరిగా వచ్చి నిలుచున్నారు. నేను లేవబోయినాను.

'ఏం, పెళ్లికొడుకును అయినానా లేదా' అని నవ్వుతూ అన్నారు. సిగ్గుపడి పరిగెత్తినాను.

తర్వాత చాలా కాలమునకు కాపరానికి వెళ్లినాను. మా అత్తగారు ఒకనాడు అరిసెలు వండుతూ వున్నది. నేనామె దగ్గిరగా కూర్చుని తింటున్నాను. ఇంతలోకే మావారు సావట్లోనుంచి చప్పున వచ్చి నన్ను చూసి, 'నాకు కూడా అరిసెముక్కలు పెట్టించవూ?' అన్నారు.

నేను కూర్చున్న చోటునుంచి వెంటనే లేచాను. చేతిలో అరిసెముక్క కిందపడ్డది. నేనక్కడ నిలవక సావట్లోకి వెళ్లినాను. వారు నా వెంటనే సావట్లోకి వచ్చి, 'బుగ్గలకు నెయ్యి రాస్తావా యేమి?' అన్నారు.

పెళ్లినాటి సంగతి జ్ఞాపకము వచ్చి నాకు చాలా సిగ్గు వేసింది. అరిసెలు వండవలసివచ్చినా, తినవలసివచ్చినా ఇప్పటికీ నాకు అపరిమితమైన సిగ్గు! ఇంతలో వారు నా దగ్గరికి వచ్చి, ఏమేమో నెమ్మదిగా నా చెవిలో అన్నారు. ఆ మాటలేవీ నా బుర్ర కెక్కలేదు. ఈ స్థితిలో మావారి బుగ్గలకు అప్రయత్నముగా నా చేతి జిడ్డు అంటింది.

## కథానేపథ్యం ...

నూరు సంవత్సరాల కిందటి కథ ఇది అని గుర్తుంచుకోవాలి. ఆనాటి మధ్య తరగతి కుటుంబాల స్థితిగతులు ఈ కథలో చక్కగా ప్రతిబింబితమైనాయి. అప్పటి పల్లెటూళ్లలో పెళ్లి హడావిడులు కూడా తెలిసివస్తాయి. ఈ కథను ప్రచురించిన సాహితి పత్రికే ఈ కథను చక్కటి కథ అంది. కథలో ముఖ్య (ప్రధాన) పాత్ర తన కథను తానే

చెప్పుకొనే కథా కథనాన్ని తెలుగు కథా సాహిత్యంలో ఈ కథే ప్రారంభించిందేమో ననుకోవాలి. దీనిని ఉత్తమ పురుష కథనం అంటారు. 'పురుష' అంటే పురుషుడను కోకూడదు. స్వ లేదా స్వీయ కథనం అని అర్థం. సంస్కృత సాహిత్యంలో ఇట్లా నిర్వహించిన రూపకాన్ని 'భాణము' అంటారు. కన్నెతలపుల మృదు మనోజ్ఞత, పెళ్లి ఊహలు, ప్రేమ స్పర్శలు ఈ కథను చాలా ఆకర్షకంగా రూపొందించాయి. ఆనాటి పెళ్ళి సంబంధాల ప్రయత్నాలు, సవతి తల్లులు, దూర ప్రాంతాలకు పిల్లనివ్వక పోవడాలు, ఆచారం, సంప్రదాయం పేరిట చాదస్తాలు, అవివేకాలు ఈ కథలో చక్కగా నిరూపితమైనాయి. విదేశాలకు వెళ్ళిన వాడి కుటుంబానికి 'వెలి' అని సంప్రదాయ కుటుంబాలమని అనుకొనే వాళ్లు నీలిగేవాళ్ళు. వాళ్ళతో వియ్యమందేవారు కారు. ఆ కుటుంబంతోనే కాదు, వాళ్లతో భోజనం చేసినవాళ్ళకు కూడా ఈ బహిష్కారం తప్పేది కాదు. అటువంటి అపహాస్యపు సాంఘిక నిర్బంధాలు కొందరు పాటించేవాళ్ళు. వధూవరుల మధ్య వయోతారతమ్యం కనీసం ఐదారేళ్ళైనా పాటించేవారు.

'అరిసె ముక్కలు' అని ఈ కథకు పేరు పెట్టడం ఇది తియ్యటి కథ అని కాబోలు. గడుసుకత్తె అయిన ఓ పన్నెండేళ్ళ బాలిక కాపురానికి వెళ్ళిన తర్వాత గడచినకాలపు మధురస్మృతులను కథగా చెబుతుంది. ముగింపు పులకింపు సన్నివేశంతో ఎంతో అందంగా, సుకుమార సుందరంగా ఈ కథ రచితమైంది.

వఝ్ఝు బాబురావు ఆనాటి సాహితీ సమితి సభ్యుడు. తెనాలి నవ్య సాహిత్యో ద్యమంలో ప్రముఖుడు. కవి కూడా. ఈయన రాసిన కవితా ఖండికలు, ఇంకా కొన్ని కథలూ తొంభై ఆరేళ్ళనాటి సాహితిపత్రికలో కన్పిస్తాయి. భట్టిప్రోలు, పొన్నూరు ప్రాంతం వాడేమోని ఆనాటి సంగతులు తెలిసినవారు చెబుతారు. అయితే జీవిక కోసం తెనాలి విడిచిపెట్టి ఉత్తరాంధ్రం వైపు వెళ్ళినట్లు తెలుస్తోంది. కలకత్తా వైపు వెళ్ళి ఖర్గపురం లోనూ, తాతానగర్ వైపున ఉద్యోగించినట్లు భోగట్టా. తొలితరం తెలుగుకథా రచయితలలో బాబూరావుకో మంచి పేరున్నది. కాని ఆ తరువాత ఆయన్ను ఎవరూ పట్టించుకున్నట్లు కనపడదు. రచనలేవీ పుస్తకంగా వచ్చినట్లు లేదు.

# 6. వూదా చీర

– మునిమాణిక్యం నరసింహారావు

వెంకట్రావు భార్యతో ఏమే, కాంతం, రేపు సుబ్బి వస్తుంది.

– ఏసుబ్బి?

– మా అత్తయ్య కూతురు.

– ఎందుకో?

– ఎందుకంటావేమిటి? మొన్న మీ అక్కయ్య ఎందుకొచ్చింది?

– చూడటానికి

– అల్లాగే ఇది.

– ఎవరిని చూడటానికి?

– నిన్ను

– నన్నెందుకు చూడటానికి వస్తుంది. మీరు ఉండగా –

వెంకట్రావు సుబ్బిని చూచి చాలా కాలమైనందున ఉవ్విళ్ళూరుతున్నాడు. మరునాడు తెల్లవారుఝామున 4 గంటలకు తెలతెలవారుతుండగనే సుబ్బి వెంకట్రావు ఇంటి ముందు బండి దిగింది. కాంతం ముందు వచ్చి పలుకరించి యింట్లోకి తీసుకొని వెళ్ళింది. వెంకట్రావు మాట్లాడక ఊరుకున్నాడు. సుబ్బి ఇంత చక్కనిదౌతుందని ఎప్పుడూ అనుకోలేదు. పల్లెటూరులో పెరగటంచేత ముఖం బస్తీ పిల్లలవలె కాంతిహీనంగా లేదు. కన్నులు కాంతులను వెదజల్లుతున్నవి. ఆ బింబఫలములబోలు అధరము. నొసట పెద్ద సాదు బొట్టు. ఆమె సౌందర్యమునకు వన్నె దెచ్చెను. బాలసూర్యుని అరుణరాగ ప్రసారము ఆమెకొక వింత సౌందర్యమును దెచ్చెను.

వెంకట్రావు సుబ్బమ్మను చూసి నిలువున నిలబడ్డాడు. నోరు విప్పి పలకరించ లేదు. ఆమె సౌందర్యం తనని వశపరచుకొన్నది. సౌందర్యమునకు వశీకరణశక్తి ఉందని వెంకట్రావు తెలుసుకొన్నాడు. సౌందర్య శకటమునకు వెంకట్రావు తెంపరాని గొలుసులతో బంధింపబడ్డాడు. ఆ సౌందర్యమును ఆస్వాదించినకొద్దీ ఆకలెక్కువ. తాగినకొద్దీ దాహమెక్కువ.

సుబ్బమ్మ కాంతమ్మలు ఒకరికొకరు సహాయం చేసుకొంటూ వంట తయారు చేశారు. సకాలానికి సుబ్బమ్మ "బావగారూ వంట అయింది. అక్కయ్య స్నానం చేయమంటున్న"దని మృదు మధుర స్వరంతో కోయిలలాగ పలికింది. ఆ పలుకులు అతని హృద్విపంచిపై తగిలినవి. తంత్రులు కదలి మోగినవి. నిశ్చేష్టుడయి చూస్తూ స్వప్నావస్థలో ఉన్న వెంకట్రావును సుబ్బమ్మ మళ్లీ యిట్లు లేపింది.

–స్నానానికి లేవచ్చునంటున్నది అక్కయ్య

–సరే, వస్తాగాని అత్తయ్యకు ఉబ్బసం నయమేనా?

–ఏం నయం బావా అల్లాగే బాధపడుతున్నది. ఎండకాలం నాలుగు కాస్త తెరిపి, వానకాలంలో దాని బాధ చూడలేము.

–తరువాత ఏ మాటా తోచక వెంకట్రావు– తెనాలిలో మీ అత్తగారు కులాసాగా ఉన్నారా?

–ఆ విషయమై సుబ్బమ్మకు మాట్లాడటం ఇష్టం లేక కాబోలు 'అల్లాగే' అని మూడు అక్షరాల్లో కొట్టివేసింది.

–నిన్ను జూచి చాలా రోజులయింది. ఇంతలో ఎంత పెద్దదానవయినావు.

–మీకు నా మీద దయవుంటే...

అని ఏమో చెప్పబోతుండగా కాంతం గుమ్మంలో కనిపించింది. 'ఏమిటో మరదలుతో సరాగాలాడుతున్నారు. భోజనానికి లేవండి ముందు తరువాత మీ యిష్టం'.

వెంకట్రావుకు కాంతం ఇట్లా రావటం ఇష్టం లేకపోయినను వెంటనే భోజనానికి లేవక తప్పింది కాదు. అతను "అది కిన్నెర స్వరం. ఇది బొంగురు గొంతు" అని ఏమో గొణుగుకొనుచు లేచి స్నానం చేసి భోజనం దగ్గర కూర్చున్నాడు.

సుబ్బమ్మ గడప అవతల భోజనం చేస్తున్నది. కాంతం వడ్డిస్తున్నది. వెంకట్రావు సుబ్బిని చూస్తూ భోజనం చేస్తున్నాడు. అట్లా చేయటం తప్పని తెలుసును.కాంతం అనుమానిస్తుంది అని భయపడ్డాడు. కాని ఏమిచేయగలడు? సౌందర్యము అతనిని వశపరచుకొని అట్లా యీడుస్తున్నది. కాంతంవైపు చూసి ఎందుకో ఒక చిరునవ్వు నవ్వాడు. కాని ఆ చిరునవ్వు కాంతులు సుబ్బమ్మపై ప్రసరించినట్లు కాంతమ్మకు అనుమానం కలిగింది.

“మీరు సరిగా భోజనం చెయ్యడం లేద”న్నది కాంతం.

వెంకట్రావు మాట్లాడలేదు. అప్పుడే సుబ్బి పెదవులు ఎందుకో కదలుతున్నవి అది చూస్తున్నాడు. పెదవులు కదలినవి. ధ్వని బయలుదేరింది.

“మేము వస్తే బావగారికి దిగులేసిందేమో” అని పల్లెటూరు హాస్యపు మాట ఒకటి అన్నది.

వెంకట్రావు మాట్లాడక ఆ మాటలు వినటంలో శ్రవణసౌఖ్యం అనుభవిస్తున్నాడు.

నిజంగా వెంకట్రావు ఆ రోజు ఏమీ భోజనం చెయ్యలేదు. ఇంతలో సుబ్బమ్మ భోజనం కావటంవల్ల తానుకూడ మజ్జిగతో పూర్తిచేసి లేచినాడు. భోజనాంతరం ముగ్గురు చాపమీద కూర్చున్నారు. కాంతం తమలపాకులు యీనెల తబుకులో పెట్టుకొని వచ్చి వారి ముందు పెట్టి తాను కూర్చుండెను. వారు ముగ్గురు ఏమేమో మాట్లాడుకొన్నారు. సుబ్బమ్మ చుట్టి ఇచ్చిన తమలపాకులు వెంకట్రావు పుచ్చుకొన్నాడు. కాంతం అక్కడే కూర్చుని తమలపాకులు వేసికొంటున్నది. వెంకట్రావు తనను తమలపాకులు చుట్టి యివ్వమనలేదని కాంతమ్మ మనస్సులో అసూయతో మండి పోతున్నది. ఎందుచేతనోగాని వెంకట్రావు సుబ్బమ్మవైపు చూచినపుడెల్ల కాంతం హృదయంలో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుతున్నవి. ఇప్పుడు జరిగిన మరొక విషయం అట్టి అగ్నిని మరింత ఎక్కువ జేసెను. తమలపాకులు అందిచ్చేటప్పుడు సుబ్బమ్మ చిటికెనవ్రేలు వెంకట్రావు చేతికి సూక్ష్మంగా తగిలింది. కాంతం అది కళ్లార చూచింది. వెంకట్రావువళ్ళు పులకరించింది. దేహం చిరుచెమ్మటలు గ్రమ్మినవి. సుబ్బమ్మకు పాపం ఆ విషయం తెలియదు. కాంతానికి అసూయాగ్ని కోపానలము హృదయసీమ అంతా కారుచిచ్చులాగ కమ్ముకొన్నది. అక్కడ నుంచి చప్పున లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

గదిలో పరుపుపైబడి ఏడ్వమొదలిడెను. కాంతం హృదయంలో కోపానలము ప్రజ్వరిల్లుచుండెను. కాంతం వళ్ళు కంపరమెత్తెను. ఏమేమో కాంతం తలపోసెను. ఎన్నో భావతరంగములు ఆమె హృదయములో నుప్పొంగుచుండెను. కాంతానికి ఎందుకంత విచారము? సుబ్బమ్మతో మాట్లాడినంత మాత్రాన కాంతానికింత విచార మెందుకు, ఆమె తలంపులేమో ఎవరు చెప్పగలరు. ఆమె ఏమేమో తలపోసి ఏడ్వ జొచ్చెను. ఇంతలో వారిలో నుంచి పకపకమని నవ్వు వినవచ్చినది. కాంతం ఏడ్పుమాని ఆ నవ్వు విన్నది. ఆ నవ్వు దొంతరలు ఒకటి తరువాతనొకటిగా బయలుదేరి మెల్లగా సన్నగిల్లి అంతరించినవి. అప్పుడు కాంతానికి హృదయం పగిలిపోవునట్లు దుఃఖం పొంగిపొరలివచ్చింది. ఒక్కమారుగా సుబ్బమ్మ బుర్ర బద్దలు చేద్దామని బుద్ధి పుట్టింది. కాని తిరిగి ఏడ్వ మొదలెట్టింది.

మరికొంచెం సేపటికి వెంకట్రావు బయటికి వెళ్ళుటకై బయలుదేరి కాంతం గదిలోకి వచ్చాడు. కాంతం యీ లోకంలో లేదు. దుఃఖ సముద్రంలో మునిగి ఉన్నది. ఇతనివైపు చూడలేదు. వెంకట్రావు దరిని గూర్చొని గడ్డం పట్టుకొని కాంతం, ఎందుకే కోపం? అన్నాడు. అతని రెండు చేతులను కాంతం విదిలించివేసింది. ఇంకానయం, కృష్ణుణ్ని సత్యభామ చేసినట్లు ఎడమకాలుతో తన్నిందిగాదని వెంకట్రావు మనస్సుకు సమాధానం చెప్పుకొని తిరిగి ఓదార్చటానికి ప్రయత్నం చేశాడు.

–అయ్యో పిచ్చిదానా ఎందుకే విచారం?

–ఎందుకా? నా కర్మానికి, నేను చక్కనిదానిని కానని.

–కాకపోతే ఇప్పుడు ఏమీ నీకు లోపం?

–ఏమిలేదు ఎవరైన చక్కనివాళ్ళు వస్తే నన్ను జూడరు.

–అయ్యో వెర్రిదానా ఇదా నీ గొడవ. సుబ్బమ్మవైపు చూచాననా? చూచినంత మాత్రాన తప్పేమిటి?

–తప్పేమిటి చూచినా తప్పులేదు. తమలపాకులు చుట్టించి పుచ్చుకొన్నా తప్పులేదు. మరి అని ఏమో చెప్పబోయి ఏడ్చింది కాంతం.

–సరేలే. కాంతం ఊరుకో. నీ విచారంలో నాకేమి అర్థం కనపడదు. సుబ్బమ్మ సౌందర్యవతి. దానిని నేను చూచాను. అది తప్పా! ఎవరివంకా చూడనే కూడదా! రోజు ఎన్ని సౌందర్యమైన వస్తువులను చూస్తున్నాము. ఎన్నిటి

సౌందర్యాన్ని అనుభవిస్తున్నాము. అందులో తప్పేమి. గులాబి పూవును జూచి ఆనందించడంలేదా? దానిని వాసన జూడటం లేదా? అట్లే ఇది. గులాబి పువ్వును జూస్తే ఎట్టి ఆనందమో సుబ్బమ్మను జూచినా నా కట్టి ఆనందం కలిగింది. ఇందులో నాదోషం లేదు. నాకేమి పాపచింత లేదు.

అని ఏమేమో లెక్చెరు ఇచ్చాడు. కాంతం విని ఊరకుండి – "మీరు చెప్పిన విషయం, ఆడవాళ్లకు కూడానా. ఒక స్త్రీ మరొక పురుషుని సౌందర్యాన్ని మెచ్చి అతనితో సరసాలాడవచ్చునా?"

"ఆహా! అందులో ఏమి తప్పులేదు. మాట్లాడినంత మాత్రాన లోపము లేదు. ప్రకృతిలో సౌందర్యము గల ఏ వస్తువునైనను సౌందర్యము కొరకే ప్రేమింప వచ్చును".

'సరే లెండి' అన్నది కాంతం. వెంకట్రావు షికారు వెళ్లాడు.

కాంతం మరునాటి నుంచి యథాప్రకారం గృహకృత్యములు నిర్వహించు కొంటున్నది. ఆడవాళ్ళకు కోపం పోగొట్టే మార్గంలో ఒకటి ఏమైనా కొని యివ్వటం. వెంకట్రావు కొత్త చీర ఒకటి కొని ఈయదలచి బజారుకు వెళ్లాడు. షాపులలో తిరిగి బేరంచేసి మంచి అందమైన ఊదా చీర ఒకటి బేరం చేసి కొన్నాడు. ఆ చీర కాంతానికి చాలా బాగుంటుందని తోచింది. ఎప్పుడు కాంతానికి ఆ చీర చూపుదామా అని ఆతుర పడుతూ వేగిరం నడిచాడు. దారిలో ఒక ముసలమ్మ, ఒక యువతీ వస్తున్నారు. ఆ చీర చూచి యువతి, ముసలమ్మతో ఏమో అంది. ముసలమ్మ వెంకట్రావును ఆపి "నాయనా, ఆ చీర ఎంతకు కొన్నావు" అన్నది. పది రూపాయలు అన్నాడు వెంకట్రావు. ఆమె ముఖకమలము ముకుళించింది. నిరుత్సాహంతో కాబోలు, ఆమె నిట్టూర్పు విడిచింది. వెంకట్రావు చీరను అటుత్రిప్పి ఇటుత్రిప్పి చూస్తూ యింటికి పరుగెత్తాడు. దారిలో మరి ఇద్దరు యువతులు ఆ చీరవంక చూచారు. కాని అడగటానికి భయంవేసి ఊరుకొన్నారు. ఇంటికి రావటంతోనే కాంతం వికసించిన హృదయంతో భర్త తెచ్చిన బహుమానాన్ని అందుకొని, చాలా బాగుందని తన సంతోషమును వెలిపుచ్చింది. వెంటనే కట్టుకోమని వెంకట్రావు బలవంతపెట్టాడు. వర్జ్యం జూచి భోజనానంతరం కట్టుకొంటానని కాంతం అన్నది. సాయంత్రం జెడ వేసుకొని మల్లెపూలు పెట్టుకొని చీర ధరించింది. భర్త పాదములకు నమస్కారము జేసింది. వెంకట్రావు కాంతం ముఖమును పైకెత్తి ముద్దెట్టుకొన్నాడు. ఆ ప్రణయకలహం ఈ సంధితో ముగిసింది.

ఆ చీరయందు కాంతానికి మక్కువ ఎక్కువ అయింది. ఎల్లప్పుడు ఆ చీరనే కట్టుకొనేది. పగలెల్ల పనిలో ఏ చీర కట్టుకొన్నా సాయంత్రం కావటంతోనే ఆ చీర ధరించేది. వెంకట్రావు కూడ ఆ చీరను జూచి భార్యను గుర్తించేవాడు.

ఒకరోజున కాంతం సోదరి వచ్చింది. కాంతం అక్కకు కాంతానికి అట్టే వయస్సులో వ్యత్యాసము లేదు. కొంచెం హెచ్చుతగ్గుగా ఒక్కరూపునే ఉంటారు. దూరాన్నించి చూస్తే పోల్చుకోవడం కష్టం. ఆ రోజున క్లబ్బులో సభ జరగటంచేత వెంకట్రావు ఆలస్యంగా యింటికి వచ్చాడు. రోజూ వీధి తలుపు తెరచియుండేది. కాంతం గడపలోనే లాంతరు పెట్టుకొని కూర్చునే వాడుక. ఈ రోజున తలుపు వేయబడి యుండెను. లోపల ఏమైనా పనిలోనుండవచ్చునని తలుపు నెట్టబోవు సమయంలో నుంచి నవ్వు వినవచ్చెను. తన పడకగది కిటికీ తలుపు తెరువబడి యుండెను. లోని బెడ్‌లైట్ మాంద్యముగా వెలుగుచుండెను. కాంతం ఊదా చీర గట్టుకొని గోడనానుకొని యుండెను. గది వాకిట కాంతానికి ఎదురుగా పురుష విగ్రహము కానవచ్చెను. అతను గడపపై నిల్చుండి కాంతంతో ఏమో మాట్లాడుచుండెను. కాంతం నవ్వుతూ తల వూపెను. ఇంతలో ఆ పురుషవ్యక్తి కాంతం చెయ్యి పట్టుకొని చిటికెన వ్రేలినున్న ఉంగరమును పరీక్షించెను.

“కాంతం!తలుపు తలుపు” అని వెంకట్రావు అరచెను. ఊదాచీర గట్టుకొన్న కాంతం వచ్చి తలుపుతీసి వెంటనే పెరటిలోనికి పరుగెత్తెను. ఆమె దొంగతనము చేయుచుండగా పట్టుబడిన దొంగవలె మొగమావలకు తిప్పి పరుగెత్తెనని వెంకట్రావు తలచెను. కాంతం వైఖరి చూస్తే తప్పు చేసిన మనిషిలాగ కనిపిస్తున్నది. రోజూ నవ్వుతూ వచ్చి ఏమేమో మాట్లాడేది. ఈరోజు తనవద్దకు రాలేదు. తనతో మాట్లాడలేదు. అంతరాత్మ బాధపెట్టక తప్పదు అనుకున్నాడు. కాంతంను యిప్పుడు మాట్లాడించినను లాభములేదని ఆ వచ్చిన పురుషుడెవడో కనుగొనవలెనని వదినగారిని పిలిచెను. వదినగారు దొడ్లోనుంచి “వస్తున్నా వెంకట్రావు! మడిగట్టుకొంటున్నా” అన్నది.

– కాంతం ఏది?

– దొడ్లో ఉన్నది.

వెంకట్రావు లోన కోపాగ్ని ప్రజ్వరిల్లుతున్నది. ఎవరో ఒకరు కాంతం చెయ్యి పట్టుకొని వ్రేలినున్న ఉంగరమును పరీక్షించెను. ఆ మాట తలచుకొన్నప్పుడెల్లా ఒళ్లు మండిపోయినది. ఇద్దర్ని కొడదామని బుద్ధిపుట్టి ఒళ్ళు తెలియని కోపంతో గదిలోనికి

తూలుతూ వెళ్లాడు వెంకట్రావు. అక్కడ అటు ముఖంపెట్టి కుర్చీలో కూర్చుని ఉన్న పురుషుడిని చూచాడు. అతను ఒక మూల మంచానికి అనుకుని కుర్చీ వేసుకొని కూర్చున్నాడు. ఇతరులు వచ్చినను కనపడకుండుటకు కాబోలు దోమతెర కొంచెము తనను మరుగు పరచునట్లు వేసుకొన్నాడు. కాని పైన వేసుకొనిన ట్వీడుకోటు సిల్కు తలగుడ్డ కనబడుతూనే ఉన్నవి. పాదములు కనిపించడం లేదు. వెంకట్రావు లోన ప్రవేశించి

– ఎవరోయి నీవు?

మాట్లాడలేదు.

– ఎవరు నీవు మాట్లాడవేమి?

జవాబు లేదు.

వెంకట్రావుకు దేహం కంపించిపోతున్నది.

–నా గదిలో జేరి మాట్లాడవేమి రాస్కెల్

అని చెయ్యితో గొట్టాడు.

కాని అది గురితప్పి మంచం స్థంభమునకు తగులుటచే తీవ్రమైన కోపం గలిగి నిమిషమాత్రంలో తూలి అతని పైబడుతూ లాగి కొట్టెను. ఆ దెబ్బ ఆ పురుషుని తల గుడ్డపై తగిలి తల గుడ్డ ఊడి వ్రేలాడెను. అప్పుడు వెంకట్రావు నిర్ఘాంతపోయినాడు. అతనికిప్పుడు మెళకువ వచ్చినట్లయింది. తాను దేనిమీద తూలెనో ఆ మూర్తి స్త్రీ విగ్రహం కాని పురుష విగ్రహం కాదు. తలపైన నాగరం వుంది. ఆవిడ జారుజడ వేసుకొన్నది. మొగమున చిరుచెమ్మటలు గ్రమ్మినవి. వెంటనే ఆమె కోటు విడిచి పారవైచి పొంగిపొంగి వస్తూన్న నవ్వును ఆపుకొనుటకై నోటిలో చెయ్యి పెట్టుకొని పెరటిలోనికి పరుగెత్తెను.

పెరట్లో వదినగారు “కాంతం కాంతం ఆగవే! ఇంకా ఎక్కడికి పరుగెత్తుతావు? అయ్యో ఇల్లా కూర్చో” అని మంచం మీద కూర్చోబెట్టి ఏమిటే అన్నది.

–ఏముంది మనం అనుకొన్నట్లు

అని నవ్వింది.

– అబ్బ! నవ్వు ఆపుకొని చెపుదూ!

– అక్కయ్యోయి! వారు నన్ను కొట్టబోయి

అని చెప్పలేక పక్కలు పట్టుకొని కాంతం  నవ్వెను.

– కొట్టబోయి ఆ చెపుదూ

– తానె స్థంభానికి కొట్టుకొన్నాడు

అని విరగబడి నవ్వెను.

పడకగదిలో వెంకట్రావు నిర్ఘాంతపోయి కూర్చున్నాడు. అతనికిఈ నవ్వుమాత్రం వినవచ్చెను. ఆ నవ్వు అలలు అలలుగా బయలుదేరి గాలిలో కొట్టుకొని పోతున్నవి. వెంకట్రావు చిరునవ్వు నవ్వెను.

"మీ ఆయన్ని భోజనానికి పిలవ్వె" అన్నది కాంతం సోదరి. "నేను పోలేనమ్మ నీవు పో. నాకు మాట రావడం లేదు. నువ్వేపో! నేను నవ్వు ఆపుకోలేను. నవ్వితే బాగుండదు. నేను పోను."

కాంతం సోదరి తప్పనిసరిగా వచ్చి భోజనానికి పిలిచింది. భోజనానంతరం తమలపాకులుచుట్టి పరుపుపైన పెట్టి కాంతం విరగబడి నవ్వుతున్నది.

– కాంతం, సరేగాని నువ్వు మొగవేషం వేసుకొంటే నీ చీర కట్టుకొన్నది మీ అక్కయ్యా!

– అవును. మీకంత కోపం ఎందుకు? పరపురుషునితో మాట్లాడితె కోపం లేదుగా!

– సర్లే ఊరుకో ఎవరికైనా ఒళ్ళు తెలియదు

– ఇప్పుడైన బోధపడ్డదా?

– దెబ్బ తగిలిందా?

– దెబ్బ తగిలితే ఎరగరూ. ఈ తమలపాకుల ప్రాప్తి లేకపోయేదే మీకే యీ దెబ్బ.

**కథానేపథ్యం ...**

సమాజ సుస్థితికి కుటుంబమే కుదురు. కుటుంబ సౌఖ్యానికి భార్యాభర్తలే శబ్దార్థాలు. దాంపత్యంలో ప్రేమానురాగాలు సంగీతానికి సరిగమల వంటివి. సంసారమన్న తర్వాత పొరపొచ్చాలు రాకమానవు. అయినా ఒకరికొరకు కాక మరెవరు ఆసరా అవుతారు భార్యాభర్తలకు? సరసంగా సరాగాలతో తప్పొప్పులు సరిదిద్దుకోవాలి. రూపుదిద్దుకోవాలి అని మునిమాణిక్యం కథలు మురిపెంగా బోధిస్తాయి. ఒకవైపున చలం కథలు ఆనాటి సంఘంలోని క్రౌర్యాన్ని, విషాదాన్ని, ఆక్రోశాన్నీ గ్రీష్మాతాపంలాగా ఫెళ్లున్న పెళపెళలాడిస్తుంటే అదే కాలంలో మునిమాణిక్యం దాంపత్య లలిత శృంగార ఘట్టాల చాంద్రీ రోచులను శరత్కాలం తలపింపజేస్తూ రాశాడు. మృదువైన హాస్యం మునిమాణిక్యం కథల ప్రత్యేకత. పరిహాసంలో ఎత్తిపొడుపు, ఓటమిలో గెలుపు, మాటకారితనం, ఆహ్లాదకరమైన సంవాదశైలితో ఒక తరం పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాడు మునిమాణిక్యం. సుమారు నూరేళ్ళనాటి కథ ఇది. అయినా ఎంతో తాజాగా ఉంది. మానవ ప్రవృత్తిలోని సహజాతాలను, చెరుపు చేయని బలహీనతలను హాస్య స్ఫోరకంగా కథలో అల్లడం వల్ల ఆయన కథలంటే అందరూ ఇష్టపడేవారు ఆ రోజులలో.

ఈ కథలో వూదా చీర కీలక సన్నివేశాల్ని నిర్వహిస్తుంది. అందుకే రచయిత ఈ కథకీ పేరు పెట్టి ఉంటారు. భార్య భర్తకు నేర్పే గుణపాఠం ఈ కథ. ఆ నేర్పటం లోనూ నవ్వు పుట్టించే కథ ఇది.

# 7. గంగన్న

– *నందగిరి ఇందిరాదేవి*

గంగన్నను ఇంక రెండు రోజులకు గాని జైలు నుండి వదలరు. ఆ పాలమూరు జైలు నాలుగు గోడల మధ్య పదకొండేండ్ల బట్టి పాతకాపు అయిపోయిన గంగన్నకు పాపిష్టి రెండు రోజులు గడపటం దుర్భరంగా ఉన్నది. ఆ పుణ్యదినం ఎప్పుడు వస్తుందా అని ఉత్సుక హృదయంతో ఎదురు చూస్తున్నాడు. రామి తలపుకు రాగానే అతనిలో ఉడిగిపోయిన ఉత్సాహం రేకెత్తింది. తన రామి! తన రామిని చూచి పదకొండేండ్లు అయినవి. ఎంత మారిపోయిందో ఈ పదకొండేండ్లలో. జైలు నుండి వదలగానే గడ్డం గొరిగించుకొని, పాపం పెరిగినట్లు పెరిగిన జుట్టును కత్తిరించుకొని, తెల్లటి ధోవతి, కుర్తా వేసుకొని దాని తల్లిగారింటికి వెళ్లాలి. రామి ఏం చేస్తుంటుందో వెళ్లేటప్పటికి. తన అత్తగారు తనను చూడగానే "వచ్చావా నాయనా! ఇన్నాళ్లకి" అని కంటనీరు పెట్టుకొంటుంది. మామ "రామి నీ కోసం దిగులు పెట్టుకొని సగం అయింది" అంటుండవచ్చు. రామికి చిన్న తమ్ముడు అప్పుడు యేడాది లోపుగానే ఉండేవాడు. ఆ గుంటవెధవకు పదకొండేండ్లు నిండి ఉంటాయి. వాడు తనను వెర్రిచూపులు చూస్తాడేమో! వాడికి చెప్పాలి. తాను బావనని, లోపలికి వెళ్లాక రామి అమాంతం తనమీద పడి "వచ్చావురా! నా గంగూ" అని తనపై ముద్దుల వర్షం కురిపిస్తుంది. "నేను తప్పు చేయబట్టే నువ్వు జైలుకు వెళ్లవలసివచ్చింది. ఆనాటి సంఘటన చెప్పకుండా ఉంటే నీకీ కష్టం వచ్చేది కాదు" అని అంటుంది. "నీ కోసమే కష్టాలు సహించుకొని తిరిగి వచ్చాను" అని తానంటాడు. రామి బాగా అందంగా తయారయి ఉంటుంది ఇప్పటికి! తాను కూడా ఎంత మారిపోయినాడు. తినేది జొన్నరొట్టె అయినా, అది బాగా అరగి ఒంటబట్టేటట్టు చాకిరి చెయ్యాలి. ఒళ్లు వంచి పనిచెయ్యటం వల్ల కండలు తీరి ఉన్నది గంగన్న ఒళ్లు. ఒక మాటు తన అంగసౌష్టవాన్ని కలయచూచుకున్నాడు గంగన్న. రామిని ఊపిరి సలుపకుండా తన బలమైన రెట్టల్లో బంధించినట్లే ఊహించుకొని మహదానందం అనుభవించాడు.

తాను ఇదివరకు చుట్ట తాగేవాడు. రామికి అది అసహ్యం. గంగన్నను ముద్దు పెట్టుకోబోతూ "నీ పెదిమలు చుట్టకంపు కొడుతున్నాయిరా" అనేది. దాని కొరకు వదిలి పెడదామనుకున్నా కూడా చిన్నప్పటి నుండి అలవాటయింది కనుక వదలలేక పొయ్యేవాడు. రామి మనసుకు బాధ కలుగుతుందని చాటుగా, పనికి వెళ్లినప్పుడు తాగేవాడు, మరచిపోవాలనే యత్నంలో. ఇప్పుడో! తన పెదిమలు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయి. పదకొండేండ్ల నుండి పూర్తిగా మరచిపోయినాడు గంగన్న చుట్ట తాగటం. మొదటి రోజుల్లో బాధగానే ఉండేది కాని క్రమంగా అలవాటయిపోయింది.

చాలా సంతోషిస్తుంది రామి చుట్ట వదిలేశానని చెప్పితే. అబ్బ ఎంతకీ గడవవు రెండు రోజులు. ఇంకా ఆనాడు పది గంటలే. ఆ రోజు గడవాలి. ఇంకా రెండు రాత్రిళ్లు....

## 2

గంగన్న పదకొండేండ్ల క్రింద ఒక పోలీసు కానిస్టేబులు. గంగన్నకు తల్లీ దండ్రీ పోయారు. అన్నలు ఇద్దరుండేవారు. అన్నలు చెప్పినట్లు వినేవాడు కాడు గంగన్న. ఏదో రెండు పుట్ల ధాన్యం పండే పొలం ఉండేది అన్నలకు. వాళ్లు తాము చెప్పిన పని చేస్తూ పొలం కాపెట్టుకొని ఉండమంటే గంగన్నకు చిర్రుమనేది. ఆ లేత వయస్సులోనే. వీళ్ళు మహాగొప్ప నాకంటే! వీళ్లు చెప్పిన పని చేస్తూ పడి ఉండటానికి నౌకరును కాబోలుననుకునేవాడు. ఎట్లాగైనా ఉద్యోగం సంపాదించుకొని తాను కూడ స్వతంత్రంగా బతకాలన్న ఉద్దేశం కలిగి జానంపేట నుండి ఒకనాడు అన్నలకు చెప్పకుండా పాలమూరు పారివచ్చాడు. అన్నలు కొన్నాళ్ళు చుట్టుప్రక్కల వెదకించారు గాని చెప్పినట్టు వినని వాడు విరగడైపోయాడని విసుగుకొని ఊరుకున్నారు.

పాలమూరులో కూడ ఎక్కడికి వెళ్ళినా ఒకని కింద తాబేదారి. ఏ పనీ నచ్చింది కాదు. తన ప్రత్యేకత చూపించే పని కావాలి. పోలీసు ఉద్యోగం వచ్చింది చివరకు. అందరినీ బెదిరించవచ్చు. అందరిమీద అధికారం చెలాయించవచ్చుననుకున్నాడు. జానంపేటలో పోలీసువాళ్ళు సాధారణంగా అట్లా చెయ్యడం చూచాడు కనుక.

పాలమూరులో తన తండ్రి స్నేహితుడు పాపన్న పోలీసు ఉద్యోగి. చిన్నతనంలో తన తండ్రితో వచ్చినప్పుడు చూచాడు అతని ఠీవి. ఒక్కసారి అతని రూపు మనన మయింది. చక్కని చినగని ఖాకీనిక్కరు, పైన కోటు, బూట్లు, వానకాలంలో ఉన్నికోటు, ఎండకాలంలో గొడుగు అన్నీ ఇస్తారు. ఆయన దగ్గరకు వెళ్ళితే తనకు సాయం

చెయ్యవచ్చుననుకున్నాడు. కాని ఆ యిల్లు ఎక్కడో? తనను గుర్తుపట్టాడో లేదో అని వెతుక్కుంటూ అతని దగ్గరకు వెళ్లాడు. గంగన్న తండ్రి మీద ఉండే విశ్వాసం చేత పాపన్న సూపరింటెండెంటు దగ్గరకు తీసికొని వెళ్లాడు. అంతకు ముందు నాలుగురోజుల క్రిందట ఒకనిని డిస్మిసు చేసినందుచేత గంగన్నను ఉద్యోగంలో ఉంచటానికి అభ్యంతరం చెప్పలేదు సూపరింటెండెంటు. అనుకున్నట్లుగా డ్రెస్సు దొరికింది గంగన్నకు. మొదటిసారి ఆ డ్రెస్సులో తన్ను తాను చూసుకొని మురిసిపోయినాడు. ఆ డ్రెస్సులో ఒక్క పరుగున జానంపేట వెళ్ళి అన్నలకు పొలం దగ్గర పడిఉండే మనిషిని కానని రుజువు చేయాలనిపించింది.

ఉద్యోగంలో అడుగు పెట్టాడే కాని పోలీసు ఉద్యోగంలో తాను అనుకున్నంత స్వాతంత్ర్యం లేదని రానురాను తెలియవచ్చింది గంగన్నకు. తనమీద అధికారం చెలాయించేవాడున్నాడని అనుకునే వరకే ఒంట్లో గగుర్పాటయింది. తనపై నున్న పోలీసు అమీను తను సరిగా డ్యూటీ చేసినా కూడ అనవసరంగా తనపై అధికారం వినియోగించటం వల్ల ఎందుకు ప్రవేశించానురా భగవంతుడా అని అనుకునేవాడు.

ఆనాడు రోడ్లో చౌరస్తా పైన నిలబడే డ్యూటీ. అంతవరకూ అక్కడే నిలబడి వచ్చేపొయ్యే బండ్లను డైరక్టు చేస్తున్నాడు. అక్కడి నుంచి కదిలి అయిదు నిమిషాలయింది. పోలీసు అమీను సందర్భవశాత్తు చేతులో కర్ర ఆడించుకుంటూ, నోట్లో సిగరెట్టు తీసి చేతిలో పట్టుకొని చౌరస్తా చేరాడు. గంగన్న ప్రక్కసందులో నుండి వస్తున్నాడు. మళ్ళీ ఎప్పటట్లే నిలబడటానికి.

“ఎక్కడికి వెళ్ళావు” అని గర్జించాడు అమీను. గంగన్న మాటకు మాట జవాబిస్తాడని అమీనుకు మంట మొదటి నుండి. గంగన్నవి చిన్న చిన్న లోపాలైనా సరే కంచు కాగడా పెట్టి వెతికి సూపరింటెండెంటుకు రిపోర్టు చేస్తాడు. గంగన్నకు కూడ అమీనంటే నిర్లక్ష్యం. తన పనిని తాను చేశాక అనవసరంగా కలగచేసుకుంటాడని. “బయటికి వెళ్లాను. అయిదు నిమిషాలయింది”అన్నాడు గంగన్న.

“బయటికి గియిటికి జాంతానహీ. కామ్ బరాబర్ కర్నా. ఆజ్ గైర్‌హాజరీ లిఖ్‌దేతాహూఁ సంఝే” అని రీవిగా కర్రాడించుకుంటూ వెళ్ళిపోయాడు. గంగన్నకు ఆపాదమస్తకం మండింది. ఆ నెలలో దాదాపు వారం రోజులు తాను పగలు రాత్రీ డ్యూటీ చేసినా కూడా గైర్‌హాజరీ అయినది.

## 3

రామి కాపరానికి వచ్చి నెల తిరిగింది. గంగన్నకు స్వర్గతుల్యంగా గడిచాయి ఆ నెల రోజులు. అమీను కోపపడినా సూపరింటెండెంటు తిట్టినా ఇంటికి వచ్చేటప్పటికి రామి కళకళలాడే ముఖం చూచి అంతా మరచిపొయ్యేవాడు. రామి పల్లెటూరి గాలి పోసుకొని పెరిగిన పిల్ల. అప్పుడప్పుడే నూతన యవ్వనదశలో అడుగుపెట్టింది. చెవులకు గంటీలు, చేతులకు వెండి మురుగులు, ముక్కుకు ముత్యాలపుడక చేవగా పెరిగిన ఆమె ఒంటికి అందాన్ని తెచ్చిపెట్టాయి.

ఒకనాడు మేడిబావి నుండి మంచినీళ్ల కడవ ఎత్తుకొని వచ్చేటప్పుడు పాత ఊరు వంక వెళ్లివస్తున్న అమీను కంట్లో పడింది. ఆనాడు నీళ్లు తేవటానికి ఆలస్యమయి నందువల్ల మిట్టమధ్యాహ్నమయినది. దారి వెంబడి మనిషి సంచారము పల్చబడింది. ఆమీనులో ఉండే పశుత్వము రామి గుండ్రటి ఒళ్లును చూడగానే కెళ్లగించినట్లయినది. ఆమె కెదురుగా వెళ్లి చూడనట్టు తగిలాడు. తురకవాడు ముట్టుకోవడం వల్ల రామి నీళ్ళు పారబోసి అమీనును తేరిపార చూసి తొలగిపోతున్నది. అమీను ఎవ్వరూ లేకుండా చూసి ఆమెను పారిపోకుండా పట్టుకున్నాడు. రామికి చెడ్డ భయమయింది. బలవంతాన వదిలించుకుని చేతిలో ఉన్న కడవను అమీను మీదకి విసిరి ఇంటికి ఒక్క పరుగు పెట్టింది. ఇంటికి వెళ్లగానే గంగన్న ఇంటికి తాళం ఉండటం వల్ల అప్పుడే డ్యూటీ మీది నుండి వచ్చి అరుగుమీద కూచున్నాడు. రామి ఏడుస్తూ సంగతంతా చెప్పింది. ఆనాటి ఉదయం తనకు జరిగిన అన్యాయం మనసులో మెదలుతున్నది. దానికితోడు రామికి జరిగిన పరాభవం రాజుతున్న నిప్పులో నెయ్యి పోసినట్లయినది. గంగన్నకు మనసు స్వాధీనం తప్పింది. హృదయాలలో పరాభవానలం ప్రజ్వరిల్లుతున్నప్పటికీ ఎట్లాగో గంజి కాచుకొని తాగారు గంగన్న, రామి.

గంగన్న ఆరోజు దృఢనిశ్చయం చేసుకున్నాడు. రాత్రి రామిని దగ్గరకు తీసుకొని "రామీ, నువ్వు రేపు ప్రొద్దున బండికి పుట్టింటికి పో, మీ అన్న రమ్మని చెప్పి పంపించాడు" అన్నాడు.

అప్పడే పుట్టినింటికి వెళ్లటానికి మనస్కరించలేదు. అదికాక అకస్మాత్తుగా అట్లా అనేటప్పటికి

"ఎందుకూ?" అని అడిగింది.

గంగన్న చెప్పింది అబద్ధం. తానై తాను పొమ్మంటే అనుమానపడుతుందని అన్న రమ్మన్నాడని చెప్పాడు. గంగన్న హృదయంలో బరువుగా ఉన్న భావోద్రేకము పొంగి రామి చెంపమీద కన్నీటి చుక్కలు పడ్డాయి.

"ఏం ఎందుకేడుస్తావురా నా గంగూ" అన్నది రామి అతని ముఖంలో ముఖం పెట్టి.

గంగన్న "ఆఁ ఏం లేదు.. నిన్ను వదిలిపెట్టాల్సి వస్తుందని" అన్నాడు.

"నేను వెళ్లితే కదూ" అంది రామి అతని జుట్టు నిమురుతూ.

"అయ్యో వెళ్లకపోతే వీల్లేదు. రేపు ప్రొద్దున గాడీకి పంపించేస్తాను" అన్నాడు గంగన్న చివరకు తెప్పరిల్లి.

రామి పుట్టిల్లు బాదేపల్లి. పాలమూరు నుండి పది పదిహేను మైళ్లుంటుంది.

రామి వెళ్ళిన మరునాడు గంగన్నను కోర్టుకు ఇనుప సంకెళ్లతో ఇద్దరు పోలీసుల కాపలాతో తీసుకొని వచ్చారు. అమీనును ఆ రోజు రాత్రి చంపే యత్నము చేశాడని నేరమారోపింపబడినది. గంగన్న మనస్ఫూర్తిగా శిక్షకు వెరవకుండానే సిద్ధపడ్డాడు కనుక ఏ మాత్రం చలనం లేకుండా నిలబడ్డాడు. వకీలును పెట్టుకొనుమంటే అక్కర లేదన్నాడు. కేసు తొందరగానే తీర్పు అయింది, పదకొండేండ్ల శిక్షతో.

పుట్టినింటికి అకస్మాత్తుగా ఎందుకు పంపించాడో గంగన్న మరునాడు తెలిసి పోయింది రామికి. పదకొండేండ్ల శిక్ష అయిందని తెలిసి రామి కుమిలి కుమిలి ఏడ్చింది. తానే ఆ నేరానికి కారకురాలనయినాననుకొని ఆనాటి సంఘటన చెప్పకుండా ఉంటే బాగుండునని పశ్చాత్తాపపడింది. కాని ఏం లాభం? అంతా జరిగిపోయింది.

రామి తల్లి, తండ్రి, అన్న అందరికీ గంగన్న మీద ఏ మాత్రం సానుభూతి లేక పోయింది. దోషమంతా గంగన్నదేనని అటువంటి బుద్ధిహీనుడికి, పొగరుబోతుకు తమ పిల్లనిచ్చినందుచేత తమ పరువు పోయిందని నలుగురిలో తలెత్తుకొని తిరుగలే మని బాధపడ్డారు. గంగన్న గుణదోషాలు రామి మాత్రమే గ్రహించింది. గంగన్నలాంటి మొగుడు దొరకటం తన పూర్వపుణ్యం అని గర్వపడేది పాపం.

ఇప్పుడు ఇంట్లో ఒక్క పనీ ముట్టుకోకుండా నిద్రాహారాలు మాని ఒక మూలకు కంటికి కడవడేడుస్తూ కూచునేది రామి. గంగన్నను తల్చుకుంటూ అట్లా యేడుస్తూ

ఉండటం ఇంట్లో అందరికి వెగటుగా ఉండేది. "ఇవ్వాళ మాట రేపటి మాటా? పదకొండేండ్లు గడవాలి. ఒకవేళ వచ్చినా కూడా వాడిని కులంలో వెలి పెట్తారు. జేలుకి పోయినవాడితో సంసారం ఏం జేస్తావు. ఆ వెధవ కోసం ఏడుస్తూ కూచోటం కంటే మారుమనువు కట్టుకొని హాయిగా ఉండమంటే చెవికెక్కదు" అని విసుగుకునేది తల్లి.

"ఇది చెయ్యబట్టి మాకు కూడ కులంలో తలెత్తుకొనేటట్టు లేదు" అని తండ్రి అనేవాడు.

తన మీద ఎవ్వరికీ సానుభూతి లేదు. నూతిలో బడ్డవాని మీద నూరురాళ్లు. అందరు తలొక మాట అనేవారు. జేలుకు పోయిన మొగుడి కోసం ఏడుస్తారా అని వదిన పరిహాసం జేసేది. దీని మొగుణ్ణి జేలుకు పట్టుకుపొయ్యారు అని ఊళ్లోవాళ్లు తాను కనబడటంతోనే తొలగిపోతూ గుసగుసలు చెప్పుకుంటుంటే భరించలేకపొయ్యేది. ఊళ్లో అల్లరిచిల్లర మగవాళ్లందరు తాను బజారుకు వెళ్లినప్పుడు గాని, నీళ్లకు వెళ్లినప్పుడు గాని, లోకువగా దొరికిన ఆడదాన్ని చూసినట్టు చూస్తే రామికి చాల బాధ అనిపించేది.

సాధ్యమయినప్పుడల్లా మారుమనువు కట్టుకోమని తల్లి పోరాడేది. రామి కూడ మొదటి రోజుల్లో దిగులు పడినట్లు దిగులు పడక క్రమంగా నెల రోజులు నేస్తం చేసిన ప్రాణవల్లభుని మరచిపోయింది మరచిపోవటమే కాకుండా తక్కిన వాళ్ళందరు అవహేళనగా, నీచంగా చూడటం వల్ల గంగన్నతో మళ్ళీ సంసారం చెయ్యటం అసాధ్యమని చివరకు మారుమనువుకు ఒప్పుకున్నది.

## 4

చూస్తుండగానే పదకొండేండ్లు గడచిపోయాయి. గంగన్న శిక్ష కూడా అయిపోయింది. ఆ రోజు ఉదయం వదిలారు గంగన్నను. వదిలిన సాయంకాలం వరకు ఊహా సౌధాలు నిర్మించుకుంటూ అత్తవారింటికి చేరుకున్నాడు.

అక్కడికి వెళ్లేటప్పటికి ఇల్లంతా కోలాహలంగా ఉన్నది. ఇంటిముందర పందిళ్ళు వేశారు. సన్నాయిలు, డప్పులు వాయిస్తున్నారు. చుట్టాలు పక్కాలు చాలామంది ఉన్నారు. గంగన్న ఏదో ప్రయోజనం అవుతున్నదనుకొన్నాడు. లోపలిదాక వెడితే అంతా తెలుస్తుందనుకొని పందిట్లోకి వచ్చాడు. గంగన్నను చాలామంది గుర్తు పట్టనే

లేదు. గుర్తుపట్టినవాళ్ళు రామి పాత మొగుడు అని అనటం గమనించాడు. గుండెలు చెదిరిపోయినాయి గంగన్నకు.

ఆనాడు రామి పెద్దబిడ్డ ఏడేండ్లదానికి వివాహం. గంగన్న అత్తమామలు తెరపి లేకుండా ఉన్నారు. గంగన్న లోపలికి వెళ్లేటప్పటికి గంగన్న మామ పసుపుబట్టలు, కర్జూరపు పండ్లు తాంబాళంలో అమరుస్తున్నాడు. అత్త కూరగాయలు తరుగుతున్నది. తదేకదీక్షగా పనిలో మునిగిఉన్నవాళ్ళు గంగన్నను చూడగానే అట్లాగే ఆశ్చర్యంతో చూశారు. కాసేపు అయ్యాక కూడా గంగన్నను పలకరించలేదు. పానకంలో పుడకలాగ వచ్చినట్టు ఈర్ష్యగా చూచిన వారిచూపులు గంగన్న హృదయానికి బాధ కలిగించాయి. రామి అన్నకు నోటి దురుసు. అప్పుడే బజారు నుండి రవిక కణుముల మడకతో వచ్చి, రావటంతోనే గంగన్నను చూచి, "ఓహో గంగన్నా! కాని పనిచేసి జేలుకు వెళ్ళి తగుదునమ్మా అని తలెత్తుకు తిరగటానికి తిరిగి వచ్చినట్లున్నదే" అన్నాడు.

తనకా యింట్లో స్థానం లేదని గంగన్న తెలుసుకున్నాడు. ఎవ్వరినేమీ అనకుండా "రామి లేదా" అని అడిగాడు. "కులంలో వెలి పడ్డ నీతో రామి సంసారం చేస్తుందనే" అని రామి అన్న అంటుండగానే ఎడబిడ్డను చంకన వేసుకొని పెండ్లిమురిపాలు అన్నీ తీరాలని గట్టిపట్టుదలతో పనులు చేస్తున్న రామి హడావిడిగా లోపలికివచ్చింది. గంగన్న రామి చేతులో ఉన్న బిడ్డని చూశాడు. రామి గంగన్నను చూడటంతోనే విస్తుపోయింది. చంకనున్న బిడ్డ జారిపోయినాడు. దిగాలుగా నిలువబడింది. "రామి" అన్నాడు గంగన్న. మాట పెకల్లేదు. కొంతసేపయినాక "న-న్ను- మరచిపొయ్యావా" అన్నాడు.

రామి పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ "గంగన్నా నేను పెరదాన్ని అయి పోయినాను, నన్ను మరిచిపో" అన్నది.

పదకొండేండ్ల తరువాత అత్తవారింటికి వస్తే అఖండ స్వాగతం లభిస్తుందని కొండంత ఆశతో వచ్చిన గంగన్న నెత్తిన కొంగు వేసుకొని వెళ్లిపోయాడు.

## కథానేపథ్యం ...

నందగిరి ఇందిరాదేవి తెలంగాణ తొలి తరం కథా రచయిత్రులలో ప్రముఖురాలు. ఇంకా వివరంగా చెప్పాలంటే తెలంగాణ రచయిత్రులలో ఆమెది రెండో స్థానం. మొదటి రచయిత్రి జె.వనాంబ. ఈమె రాసిన ఒకే ఒక కథ లభ్యంకాగా నందగిరి ఇందిరాదేవి కథలు అనేకం లభిస్తున్నాయి. 1919లో హన్మకొండలో జన్మించిన ఇందిరాదేవి నిజాం కాలంలో గృహమిత్ర, గోలకొండ, ప్రజామిత్ర వంటి పత్రికలో కథలు రాశారు. ఆ తరువాత 1984 వరకు ఆమె రచనా వ్యాసంగం కొనసాగింది. అనేక పత్రికలలో ఆమె కథలు ప్రచురింపబడ్డాయి. ఇందిరాదేవి భర్త నందగిరి వెంకటరావు. తెలంగాణ కథకులలో ప్రముఖుడు. ఇందిరాదేవి రేడియో ఆర్టిస్టుగా కూడా మొదటితరం వారే. నిజాం కాలం నుంచే రేడియో కోసం ఎన్నో కార్యక్రమాలను కథలను అందించారు. 1984 వరకు రేడియోతో ఆమె సంబంధం కొనసాగింది. బాలలకోసం అమ్మమ్మ కథలు పేరుతో అనేక ఏకాంకికలు రూపొందించి ప్రసారం చేశారు. రేడియో ప్రసంగాలు, ఇతర రచనలు కలిపి 'మసక మాటున మంచుముత్యాలు' అనే సంకలనం వెలువరించారు. రచయిత్రిగా ఆమెకు భర్త ప్రోద్బలం, సహకారం ఎంతగానో ఉండేవి. ఇందిరాదేవి తండ్రి వడ్లకొండ నరసింహారావు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ కార్యదర్శిగా ఉండేవారు. సామాజిక కార్యకర్త కూడా. హైదరాబాద్ లో మొదటి దళిత పాఠశాలను ఏర్పాటుచేసిన ఘనత ఆయనదే. భాషా నిలయం రజతోత్సవ, స్వర్ణోత్సవాలు ఆయన సారథ్యంలోనే జరిగాయి.

నందగిరి ఇందిరాదేవి, జీవిత భారాన్ని తేలిక చేసే సరదా రచనలు చేసేదాన్ని అని చెప్పుకున్నారు. ఆ రోజుల్లోనే, ఊహాలోకాలలో విహరించి కథలు సృష్టించడం కాకుండా వాస్తవికంగా ఉండి సమకాలీనత ప్రతిబింబించే హృద్యమైన రచనలు చేశారు. ఆమె పలు కథలలో ఊహించని మలుపు ఆ కథలకు ఆయువుపట్టుగా ఉంటుంది. పాఠకుల్ని ఇట్టే ఆకట్టుకుని కట్టిపడేస్తుంది. తెలంగాణ తొలితరం రచయిత్రి అయినా మాండలికం ఛాయలు ఏమాత్రం కనిపించవు. ఏవో కొన్ని పదాలు మినహా. అప్పటి రచయితలందరూ ఆ ఛాయలు లేకుండానే రచనలు సాగించారు. అదే ఒరవడిలో ఇందిరాదేవి కూడా సాగారు. ప్రస్తుతం ఆమె అమెరికాలో మనువడి దగ్గర ఉంటున్నారు. అక్కడి తెలుగువారు వెలువరించే పత్రికలలో అప్పుడప్పుడు రచనలు చేస్తున్నారు.

# 8. గానభంగము

–నోరి నరసింహశాస్త్రి

సాయంత్రమయినది. అష్టమి చంద్రుడు నడిమింట వెలుగుతున్నాడు. రుక్మిణి పెనిమిటి వచ్చేందుకు ఇంకా చాలా ఆలస్యముంది. ఆమె దొడ్లో తులసికోట మీద కూర్చుని నెమ్మదిగా పాడుకుంటున్నది. ఆపాట సగము మాత్రమే వినవస్తున్నది. ఆమె చంద్రుణ్ని తన కళ్ళ కాంతితో వివశుణ్ణి చేయవలెననుకున్నదేమో! అటువైపే చూస్తున్నది. మాటిమాటికీ చంద్రుని పేరు పలుకుతున్నది. అది చంద్రుణ్ణి పొగడేపాట అయుంటుంది. అలా ఉన్న రుక్మిణికప్పుడు వాకిట్లో శ్రావ్యమైన సంగీతము వినపడ్డది. ఆ గొంతు రాజగోపాలముది.

రాజగోపాలము చదువుకోడానికి వాళ్ళ తల్లితో ఆ ఊరు వచ్చి నాలుగేళ్లయింది. అప్పటినుంచీ వీళ్ళ ఇంట్లోనే పక్క భాగంలో అద్దెకున్నాడు. అతను సంగీతము చాలా బాగాపాడేవాడు. కంఠము వేరే చెప్పనక్కరలేదు. కిన్నెర కంఠము. సాయంత్రమింటికి రాగానే అతనికి ప్రతి రోజూ కొంతసేపు పాడే అలవాటు. రుక్మిణికి సంగీతమంటే చాలా ఇష్టము. రాజగోపాలం పాడేటప్పుడు ఆమె తప్పకుండా అక్కడికి వచ్చి వినేది. ఆమె వింటున్న కొద్దీ రాజగోపాలం ఉత్సాహంతో పాడేవాడు.

రాజగోపాలం సంగీతము వినబడగానే మామూలు చొప్పున రుక్మిణి వినడానికి వాకిట్లోకి వెళ్లింది. అక్కడ రాజగోపాలమూ అతని తల్లీ తప్ప మరెవ్వరూ లేరు. రుక్మిణి సద్దు చేయకుండా పోయి, రాజగోపాలం తల్లి దగ్గర కూర్చున్నది.

ఆ రోజు రాజగోపాలం పాడుతున్న పాట మునుపెన్నడూ పాడింది కాదు. గానము కూడా కూడా ఎప్పటికంటే మధురముగా ఉన్నది. ఆ గానామృతాన్ని రుక్మిణి వివశత్వముతో ఆస్వాదిస్తున్నది. రుక్మిణి రావడం చూసి రాజగోపాలం మరీ బాగా పాడుతున్నాడు.

మబ్బేమీ లేక ఆకాశం నిర్మలంగా ఉన్నది. నక్షత్రాలు ఒక్కటొక్కటిగా వచ్చి ఆకాశాన్ని అలంకరిస్తున్నవి. అంతటా ప్రశాంతంగా వెన్నెల కాస్తున్నది. ఆ వినబడుతున్న సంగీతము రాజగోపాలముదో లేక ఆ ప్రశాంతపుసంజాత మేనో!

గీతమైపోయింది. కొంత సేపటికి సంగీతము కూడా నెమ్మదిగా ఆగింది. సంగీత మాగగానే ఎప్పుడూ లేనిది ఆరోజు రుక్మిణి ఒళ్ళు ఝల్లుమన్నది. రాజగోపాలం వేపే చూస్తున్నది ఆమె. ఎప్పటివలే లేదా చూపు, ఆమె ముఖము సిగ్గు తెర కప్పినట్లున్నది.

రాజగోపాలం తల్లి పెద్దది. పూర్వ కాలపు మనిషి. వట్టి అమాయకురాలు. ఆమె "నాయనా, రుక్మిణి నీ పాట మొదటినుంచీ వినలేదు. మళ్ళీ ఇంకోసారి పాడరా వింటుంది" అన్నది.

రుక్మిణి ఆ మాటే అడగదలిచి కూడా అడగలేక ఊరుకున్నది. అది రాజగోపాలం తల్లే అడిగినందుకు తన సంతోషము రుక్మిణి చిరునవ్వుతో స్ఫుటంగా తెలిపింది. రాజగోపాలానికి రుక్మిణి తన సంగీతము వినడం కంటే కావలసిందేమీ లేదు. రుక్మిణి కన్నుల వైపు ఒకసారి అతి ప్రేమతో చూసి అతడు పాట మళ్ళీ ప్రారంభించాడు.

మురళి ముద్దిడు నీ మోవి మురువు జూచి
తమము తెరచీల్చి ప్రకృతి చైతన్యమూనె
స్వరము వెలువడినంత గోపాలకృష్ణ
పులకరించె బృందావన పుణ్యభూమి.
గోవులను వీడి యరుదెంచె గోపజనము
కుడుచు లేగల విడివచ్చె గోగణంబు
పరుగు పరుగన నీ పాద పదముజేర
ప్రియుని విడనాడివస్తి గోపీ మనోజ్ఞ
యమునతో జేరు వారి లేశము విధాన
రాగమున నేకమైన స్వరమ్ము రీతి
తన్మయతనొంది కల సమస్తమ్ముతోడ
లీనమైపోతి నీ దివ్యగానసుధను!

రాజగోపాలం గీతము స్ఫుటంగా తెలుస్తున్నది. రుక్మిణిని సంతోషపెట్టడానికి అతను తన చేతనైనంత బాగా పాడుతున్నాడు. సంగీతము ఏ లోపము లేక దివ్యముగా

పాడవలెననే తప్ప అతనికప్పుడు వేరే స్మృతి లేదు. రుక్మిణి ఆ సంగీత తరంగాల మీద ఊగులాడుతూ పరవశయై తేలిపోతున్నది.

పాట మళ్ళీ అయిపోయింది. తర్వాత కొంతసేపటిదాకా వాళ్ళు ముగ్గురూ ఆ నాదానుభవంలో నిశ్శబ్దంగా ఉన్నారు. అప్పుడు రాజగోపాలం తల్లి సంతోషముతో నవ్వుతూ, "ఇది కృష్ణమూర్తి వేణునాదాన్ని గురించి" అన్నది.

"అవును ఇవ్వాళ నే భాగవతంలో కృష్ణుడు వేణునాదం చెయ్యడము చదివినాను" అన్నది రుక్మిణి.

రాజగోపాలం తల్లి "ఆ నాయన పిల్లంగ్రోవి ఊదుతూ ఉంటే వినడానికి గోపికలంతా వచ్చేవాళ్ళుట. ఎక్కడెక్కడి ఆవులూ పరుగెత్తుకుని వచ్చేవిట. చిన్ని కృష్ణుడు లోకాన్ని అంతా తన మాయతో కప్పి వేసేవాడు"

రుక్మిణి, "మీ రాజగోపాలం చాలా బాగా పాడుతాడు. మరీ ఇవ్వాళ వింటూంటే సాక్షాత్తు ఆ కృష్ణమూర్తి జ్ఞప్తికి వచ్చాడు" అన్నది.

తన కొడుకును పొగిడినందుకు రాజగోపాలం తల్లి సంతోషించి, "ఇవ్వాళ చాలామంచి పాటే పాడినాడు" అన్నది.

రాజగోపాలానికి ఆ రుక్మిణి మాటల్లో ఏదో చాలా ధ్వనించింది. తన కోరిక పక్వానికి వస్తున్నదని రుక్మిణి ముఖం వంక చూశాడు. రుక్మిణి చూపువల్ల అతని ఆశ మరి కాస్త దృఢపడ్డది. ఎప్పుడూ గంభీరముగా ఉండే ఆమె చూపులో ఆ రోజు రాజగోపాలానికి మార్దవం కనిపించింది. రుక్మిణి, "బృందావనంలో యమునానది ఒడ్డున కూర్చుని వెన్నెల రాత్రిళ్ళలో పిల్లంగ్రోవి ఊదుతుంటే గొల్లపిల్లలు ఆవులను కాయడము విడిచిపెట్టి వచ్చేవాళ్ళుట. ఆవులు దూడలను విడిచి వచ్చేవిట. అది ఇవ్వాళ రాజగోపాలం పాడిన పాటలోకూడా ఉన్నట్లుంది. 'గోవులను వీడి యరుదెంచె...' ఏదీ?" అని రాజగోపాలాన్ని ఆ భాగం మళ్ళీ పాడమన్నది.

రాజగోపాలం ఒళ్ళు పులకరించి అక్కడనుంచి గీతం పాడినాడు. అతనితో రుక్మిణి కూడా తన మధుర కంఠం కలిపి పాడింది.

'పరుగు పరుగున నీ పాద పదము జేర
ప్రియుని విడనాడి వస్తి గోపీమనోజ్ఞ'

అనే భాగం దగ్గరికి వచ్చేటప్పటికి రుక్మిణి కంఠము వణికినట్టుగా చదివింది. రాజగోపాలం తల్లి, “అమ్మాయీ నోరు తిరగడం లేదా?” అని అడిగింది.

ఆ మాటలకు రుక్మిణి ఉలిక్కిపడ్డది. ఆమె ఏం జవాబు చెప్పుతుందో వినవలెనని రాజగోపాలం ఆతురపడుతున్నాడు. తన దౌర్బల్యము రాజగోపాలము తల్లి తెలుసు కున్నదా అనే క్షోభతో ఒక క్షణం గడిపి రుక్మిణి స్థైర్యము తెచ్చుకుని “ఆడవాళ్ళకు మరి బాగా నోరు తిరుగుతుందా” అని తప్పించుకొని, “పాట మహా బాగున్నది. రాజగోపాలం నాకు కాస్త అది వ్రాసి పెడతావా?” అన్నది.

రాజగోపాలం నవ్వుతూ చప్పున ‘పాట వ్రాసి పెడితే ఏమిస్తావు?” అన్నాడు.

“ఏమి కావలెనంటే అది ఇస్తాను”

“ఏమి కావలెనంటే అదే ఇస్తావా?”

“ఇస్తా”

“ఏం కావలెనన్నా?” అనేప్పుడు “ఏం” అని ఒత్తి పలికినాడు రాజగోపాలం.

రుక్మిణి, “ఏం కాలెనన్నా!” జవాబు చెప్పింది.

రాజగోపాలము, నీ కళ్ళ వంక చూడనియ్యడము కంటే మరేమీ అక్కరలేదని మనస్సులో అనుకొని “నవ్వులకన్నాను. అట్లాగే రేపు మధ్యాహ్నము వ్రాసి పెట్టుతాలే” అన్నాడు.

రుక్మిణి సంతోషించి మళ్లీ పాట పాడమన్నది. రాజగోపాలం పాడుతున్నాడు. చంద్రుడు చల్లటి వెన్నెల కురిపిస్తున్నాడు. రుక్మిణి కలవరిస్తున్నట్లుంది. వీధి తలుపు చప్పుడైంది. రుక్మిణి పెనిమిటికి తలుపు తీయడానికి పరుగెత్తుకుపోయింది. పాట కాగానే రాజగోపాలం లేచి భోజనానికి వెళ్ళాడు.

## 2

రుక్మిణి పెనిమిటికి రెండో పెళ్ళి. ఆయనకు మొదటిభార్య ముప్ఫైయైదో ఏటనే పోయింది. విరక్తి చేత కొన్నాళ్ళు పెళ్లి చేసుకోనని పట్టుపట్టాడు. కానీ చివరకు ఒప్పుకోక తప్పింది కాదు. త్వరలోనే రుక్మిణ్ణి ఆయన పెళ్ళి చేసుకున్నాడు. ఆ పెళ్లిలో వరకట్నమే లేదు. రుక్మిణి తల్లిదండ్రులకే కొంత ధనం ముట్టిందని నిజమో అబద్ధమో కాని, ఒక వదంతి మాత్రమున్నది.

రుక్మిణి కాపరానికి వచ్చి ఐదేళ్ళయింది. ఆ సంసారములో కలత అనేదే లేదు. పెనిమిటి అంటే రుక్మిణి చాలా భక్తితో ఉపచారం చేస్తుండేది. ఆయనకు నలభై యేళ్ళు దాటినా రుక్మిణి తన పెనిమిటి పెద్దవాడని ఎవ్వరినీ అననిచ్చేది కాదు. ఆ భార్యాభర్తలు అదృష్టవంతులని అందరూ అనేవాళ్ళు.

వాళ్ళ ఇంట్లో రాజగోపాలమూ, తల్లీ వచ్చి ప్రవేశించి నాలుగేళ్ళయింది. వాళ్లకు మనస్సు బాగా కలిసి ఒకరికొకరు సహాయంగా ఉండేవాళ్లు. చాలాకాలం నుంచీ ఉండడం చేత వాళ్ళు బంధువులకంటే ఎక్కువ స్వతంత్రంగా నీవంటే నీవని పిలుచుకునే వాళ్ళు. రాజగోపాలమూ రుక్మిణీ అన్నా చెల్లెలూ వలే సిగ్గుపడకండా మాట్లాడుకునే వాళ్ళు.

రుక్మిణి చాలా అందగత్తె. అందమంతా ఆమె కళ్ళల్లో మూర్తీభవించి ఉండేది. చూచిన వాళ్ళంతా ఆమె కళ్లలో గొప్ప తేజస్సు ఉన్నదనేవాళ్ళు. ఆ కళ్ళు చంచలమైనవి కావు, అవిఎప్పుడూ శాంతముగానూ గంభీరముగానూ ఉండేవి.

ఆ రుక్మిణి కళ్ళు రాజగోపాలాన్ని ఆకర్షించక ఊరుకోలేదు. కాని అతడక్కడికి వచ్చిన నాల్గేళ్ళదాకా తన్నవి ఆకర్షించినట్లు తెలుసుకోలేదు. కాని అవి మొదటినుంచీ అతన్ని ఆకర్షిస్తూనే ఉన్నవి. అంతకంతకు వాటి ఆకర్షణ బలం పెరిగింది. తాను రుక్మిణిని ప్రేమిస్తున్నానని తెలుసుకున్న తర్వాత మనస్సు మరలించుకోవలెనని ఎంతో ప్రయత్నం చేశాడు. అటునుంచి తప్పించవలెనని ప్రయత్నం చేసిన కొద్దీ అతని బుద్ధి ఆమె వైపు మరింత పోయేది. ఆ వాగులో దిగిన తర్వాత దానికి ఎదురీదటమతని తరం కాకపోయింది.

రుక్మిణికి తన పైన ప్రేమ ఉన్నదేమో తెలుసుకోవలెనని రాజగోపాలం చాలా ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిరోజూ అతని పాట వినడానికి వచ్చేది. ప్రతిరోజూ వాళ్ళు ఇదీ అదీ మాట్లాడుకునేవాళ్ళు. రుక్మిణి ఎప్పుడూ గంభీరంగా ఉండేది. రాజగోపాలం ధైర్యము చాలక తన ప్రేమ ఎప్పుడూ ఆమెకు సూచనగా కూడా తెలియ జేయలేదు. రుక్మిణికి ప్రేమ తలంపు కూడా ఉండేది కాదు.

చివరకు ఆ సంగీతము పాడిన రోజు రుక్మిణికి తన పైన ప్రేమ పుట్టినట్లు తెలుసుకొని రాజగోపాలం సంతోషించాడు. అప్పటిదాకా శాంతముగా ఉండే రాజగోపాలం మనస్సు ఆపైన నిల్వలేకపోయింది. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ఆమె కనపడుతుందా; ఎప్పుడామెకు పాట వ్రాసి పెట్టుతానా అనే ఆత్రంలో అతనికా

రాత్రి కునుకు పట్టలేదు. మర్నాడు తన ప్రేమ అంతా రుక్మిణికి తెలియజెప్పేందుకు తెల్లవార్లూ మాట లాలోచించుకుంటూ పడుకున్నాడు.

**3**

మర్నాడు మధ్యాహ్నం గదిలో కూర్చుని రాజగోపాలం పుస్తకం చూస్తున్నాడు. రాజగోపాలం పుస్తకము వంక చూస్తున్నాడే కాని అతని మనస్సు అక్కడ లేదు. ఎక్కడన్నా చీమ చిటుక్కుమంటే తలుపు తీసి చూస్తున్నాడు. కాస్తసేపే రాజగోపాలానికి చాలాసేపుగా కనబడుతున్నది. ఎంతసేపు ఎదురు చూసినా రుక్మిణి పాట వ్రాయించుకోడానికి రావడం లేదు. కొంతసేపటికి అతనికి అడుగుల చప్పుడు వినవచ్చింది. ఆత్రంతో రాజగోపాలం తలుపు తెరచి చూశాడు. ఆ వచ్చింది అతని తల్లి. ఆమెను చూచి తన తొందర అణచుకొని అతను, "ఏమమ్మా?" అన్నాడు.

"అబ్బాయీ, ఇవ్వాళ పొద్దు కూకేదాకా పురాణం చదువుతారట. ఆ బ్రాహ్మడు పుస్తకం బాగా చదువుతున్నాడు. నేను వచ్చేటప్పటికి కాస్త ఆలస్యమవుతుంది. ఎక్కడికీ వెళ్ళక ఇంట్లోనే ఉండు" అని తల్లి రాజగోపాలానికి ఇల్లునప్పగించి పోయింది.

రాజగోపాలం పుస్తకము అవతలపారేసి అటూ ఇటూ తిరుగుతున్నాడు. అకస్మాత్తుగా గది తలుపు తెరుచుకున్నది. అప్పుడు రుక్మిణి స్వతంత్రంగా గదిలోకి వచ్చి "ఇప్పుడు పాట వ్రాసిపెడతావా?" అని అడిగింది. రాజగోపాలం సరే అని విడిగా పెట్టి ఉన్న కాగితమూ కలమూ పట్టుకున్నాడు.

రుక్మిణి చిరునవ్వు నవ్వి, 'పాపము! నా కోసము కాగితమూ, కలమూ సిద్ధంగా పెట్టుకున్నట్టున్నావు. విడి కాగితము మీద వ్రాస్తే ఇక్కడా అక్కడా పడిపోతుంది. నా పాటల పుస్తకం మీద వ్రాసి పెట్టు" అన్నది.

రాజగోపాలం రాత్రినుంచి అందామనుకున్న మాటల్లో ఒక్కటీ అనలేకపోయి నాడు. మంత్రగాని చేతులో బొమ్మవలె అతను ఇంట్లోకి వెళ్ళుతున్న రుక్మిణి వెంటనే బయలుదేరిపోయినాడు.

వాళ్ళు వెళ్ళేప్పటికి సావట్లో ఒక చాపమీద కలమూ, సిరాబుడ్డి సిద్ధముగా పెట్టి ఉన్నవి. రుక్మిణి తనపాటల పుస్తకము తీసుకొని వచ్చి రాజగోపాలానికిచ్చింది. రాజగోపాలం ఆ చాపమీద కూర్చుని గీతము వ్రాస్తున్నాడు. రుక్మిణి నవ్వు మొగంతో అతని పక్కనే కూర్చుని అతను వ్రాస్తున్న గీతము మెల్లిగా పాడుతున్నది.

నాలుగు బంతులు వ్రాయడమైనది. ఐదో బంతి రాజగోపాలం వ్రాయ బోతున్నాడు. రుక్మిణి చెయ్యి అడ్డంగా పెట్టి, "కాసేపు పుస్తకం అవతల పెట్టి నేనడిగే దానికి జవాబు చెప్పు" అన్నది.

రాజగోపాలం పుస్తకం కింద పెట్టి "నీప్రశ్న ఏమిటి?" అన్నాడు.

"నీ కిప్పు డెన్నేళ్ళు?"

"ఇరవై రెండేళ్ళు"

"చాలా సంబంధాలు తిరిగి పోతున్నవి కదా, ఈ యేడు వివాహం చేసుకోవా?"

రాజగోపాలం సిగ్గుతో కొంతసేపు జవాబు చెప్పక చివరకు ఆమె వైపు తలయెత్తి "చేసుకోను" అన్నాడు.

రుక్మిణి గంభీర ముఖంతో రాజగోపాలాన్ని చూసి, "పెద్దవాడివయ్యేదాకా ఉండబోకు. చిన్నవాళ్ళు పెద్దవాళ్ళను చేసుకుంటే సుఖపడరు" అన్నది.

"నీవు సుఖపడడం లేదా?" అనే ప్రశ్న మాటి మాటికీ రాజగోపాలానికి నోటి దాకా వస్తున్నది. ఆ మాట అంటే రుక్మిణి సంతోషిస్తుందో లేక నొచ్చుకుంటుందో! ఆమె ముఖాన గాంభీర్యము ఎంతకూ తగ్గలేదు. ఆ మాట బిగ్గరగా అనడానికి సాహసించక రాజగోపాలం పుస్తకము తీసుకొని మళ్లీ వ్రాయ మొదలుపెట్టాడు.

ఇంకో నాలుగు బంతులు వ్రాయడమైంది. రుక్మిణి రాజగోపాలం చేతిలో నుంచి పుస్తకంలాక్కుని అతని వైపు తిరిగి ఆ గీతం బహుశ్రావ్యంగా పాడింది. అది పాడేటప్పుడు రుక్మిణి కళ్ళు అభినయం చేస్తున్నట్టు రాజగోపాలానికి తోచింది. అతడు ఆనందంతో వివశుడైనాడు. ఏమేమో మాట్లాడవలెననుకుంటాడు కాని ఎంతకూ అతని నోట మాట రాదు. చివరకు అతను అతి ప్రయత్నం మీద వినపడకుండా "ఇంకోసారి" అన్నాడు.

రుక్మిణి చిరునవ్వు నవ్వి ఇంకోసారి పాడింది. ఈ మాటు పాడేటప్పుడు అభినయం మరింత స్ఫుటంగా కనిపించింది. పాట కాగానే ఆమె "సరీగా పాడినానా?" అని అడిగింది.

రాజగోపాలం ఆమె ముఖాన్ని తదేక దృష్టితో చూస్తూ మెల్లిగా "దివ్యంగా ఉంది" అన్నాడు.

ఆ మాటలు రుక్మిణి వినిపించుకోక నవ్వుతూ "ఎప్పుడూ అట్లా మాట్లాడకుండా నా కళ్ల వంకే చూస్తావేం? నా కళ్లకు దిష్టి తగులుతుందేమో" అన్నది.

రాజగోపాలం ఉలిక్కిపడి వణకుతూ చప్పున తల వంచుకున్నాడు. రుక్మిణి పక్కుమని నవ్వి అతని వీపు తన చేతితో తట్టి "భయపడకు ఇట్లా ఔతే రేపు కాపరమెలా చేస్తావు? అని అతని చేతికి పాటల పుస్తకమిచ్చి పాట పూర్తి చెయ్యమన్నది.

పువ్వు వంటి ఆమె చెయ్యి తన వంటికి తాకగానే ఒక్కక్షణం సేపు రాజగోపాలం పరవశత్వం పొందినాడు. కాని రుక్మిణి మాటలకు మాత్రము అతను చాలా సిగ్గుపడి వంచిన తల ఎత్తకుండా భయమేమిటి? అంటూనే మళ్లీ గీతము వ్రాస్తున్నాడు.

గీతము వ్రాయడము పూర్తికాగనే 'అయింది' అని రాజగోపాలం కలమూ, పుస్తకమూ నెమ్మదిగా కింద పెట్టాడు.

"అప్పుడే అంతా ఐపోయిందా? అందులో తప్పులు లేకుండా చూడు" అన్నది రుక్మిణి రాజగోపాలం చదివి చూసి తప్పు లేమీ లేవన్నాడు.

రుక్మిణి అప్పుడా పుస్తకం తీసుకుని 'అంతా ఇదేనా' అంటూ రెండు మూడుసార్లు చదివి చూసుకున్నది. తప్పులేమీ లేవు.

ఇంతలో వీధి తలుపు వద్ద కొద్దిగా అలికిడి ఐంది.

'రాజగోపాలం ఇక వెళ్లేదా' అని లేచి వెళ్ళబోతున్నాడు.

రుక్మిణి అతన్ని ఆపి, "కాస్త ఆగు, పాట వ్రాసినందుకు ఏమియ్యమంటావు?" అన్నది.

"నీకు పాట వ్రాసి ఇచ్చినందుకు ఏం తీసుకుంటాను?"

"నిన్న అడిగితివి కాదా? ఏం కావలెనో అడుగు"

"నాకు కావలసింది ఏముంది? నిన్న నవ్వులకన్నాను"

"నిన్న అన్న మాట నవ్వులకేనా? నీకు కావలసిందేమీ లేదా?" రుక్మిణి స్వరం కఠినంగా ఉన్నది. రాజగోపాలం 'లేదు' అనలేకపోయినాడు. కొంతసేపుండి తలయెత్తి అతనామెను సాభిప్రాయంగా చూచి "ఆ కళ్లు...." అని ఏదో గొణుక్కున్నాడు.

రుక్మిణి ముఖం పైకెత్తింది. రాజగోపాలం పెదవి రుక్మిణి కళ్ళను తాకబోతుంది. వీధి తలుపు పగిలేట్లు దడదడ చప్పుడైంది. రాజగోపాలం మెల్లిగా తన గదిలోకి వెళ్లిపోయినాడు. రుక్మిణి పోయి తన పెనిమిటికి తలుపు తీసింది.

✿ ✿ ✿

"మునుపు కాస్త సంగీతము పాడేవాడివి. ఇప్పుడు పాడనే పాడడం లేదేమిరా?" అని ఒకనాడు సాయంత్రము రాజగోపాలాన్ని తల్లి అడిగింది.

"అమ్మా పరీక్షలు వచ్చినవి కావటే" అన్నాడు రాజగోపాలం.

## కథానేపథ్యం ...

'గానభంగము' కథ మధురగాయని పాడిన లలితసంగీతం బాణీలాగా పాఠకులను అలరిస్తుంది. సంప్రదాయ సాంఘిక జీవన ఆంక్షలకు, తారుణ్యోద్వేగ తరుణీ తరుణుల కాంక్షలకూ ఘర్షణ వచ్చినప్పుడు, ఆ ఉద్విగ్నతల పర్యవసానాన్ని ఎంతో సుకుమారంగా, పరమార్థంగా, ఎంతో సహనంతో, సానుభూతితో, హృదయోద్వేగాలను అర్థం చేసుకుంటూ, మృదువుగా, మనోజ్ఞంగా రచితమైన కథ ఇది. ఆనాటి సాంఘిక వాతావరణంలో ఈడూజోడూ లేని పెండ్లిండ్లు ఎన్నో ఉండేవి. భార్యాభర్తల మధ్య వయస్సు తేడా ఎక్కువగానే కన్పించేది. మొదటి భార్య చనిపోగా మగవాడు రెండో భార్యను చేసుకోవటం అత్యంత సహజంగా, సాధారణంగా కన్పించేది. ఆశలు, అభిరుచులు, ముద్దుమురిపాలు, అన్యోన్యత – ముఖ్యంగా మగువల విషయంలో కొనసాగేవి కావు. సమాజ జీవనం ఆ విషయాలకు ప్రాధాన్యం ఇచ్చేది కాదు. రెండో పెళ్ళి భార్యలు సంఘంలో తద్వారా సాహిత్యంలో తరచు కన్పించేవారు. పురుష ప్రాధాన్య వివక్షకు ఎక్కువగా చోటుండేది. ఆ సంఘపు విలువలలో, స్త్రీ పురుషుల సగటు ఆయుఃప్రమాణం ఆరోజుల్లో తక్కువగా ఉండటం వల్ల దాంపత్య జీవితంలో ఎన్నో కడగండ్లు కన్పించేవి. గురజాడ అప్పారావు, ఇంకా నోరివారి సమకాలీన కథా రచయితల కథలలో ఈ అంశం స్పష్టమే. కథలో కవిత్వం, రాధాకృష్ణుల ప్రణయానురక్తి

ప్రసక్తి, కథా రచన అప్పుడప్పుడే వస్తువరణం, శిల్పం, నిర్వహణ పరంగా ప్రయోగ దశలోనే ఉండటంవల్ల, ఈ కథేతివృత్తంలో కొంత భావకవితా ప్రభావం ఉండి ఉండవచ్చు. ప్రత్యక్షంగా కనపడే మూడే మూడు పాత్రలతో ముచ్చటైన కథ ఇది. వేడుక గొలిపే పాట అర్ధాంతరంగా ఆగిపోతే పాడుతున్న వారికీ వింటున్న వారికీ, కలిగే విషాద సౌకుమార్యం, సున్నిత హృదయ స్పందన దఘ్నంగా ఈ కథ రచించారు నోరివారు. ఈ కథ రచించే నాటికి నోరివారి వయసు ఇరవై ఏళ్ళే. ఈ కథలో పాత్రలందరి పట్ల సానుభూతి, జాలి, అనుకంప కలుగుతాయి. అట్లా రచించడమే నిజమైన ప్రతిభ.

**విశిష్ట కథకుడు నోరి**

ఇరవయ్యో శతాబ్ది తెలుగు సాహితీ మూర్తులలో నోరి నరసింహశాస్త్రి విశిష్ట వ్యక్తిత్వ శోభితుడు. ఒక 20మంది గొప్ప రచయితలను 20 వ శతాబ్ది తెలుగు సాహిత్యం నుంచి ఎంపిక చేయవలసివస్తే నోరి వారు చేపట్టినన్ని ప్రక్రియలు రాణింప జేసిన వారు ఒక ఐదారుగురు కన్న ఎక్కువమంది కన్పించరు. తెలుగు సాహిత్యంలో చారిత్రక నవలా రచయితగా ఆయనకు ప్రసిద్ధి ఉంది. అందులోనూ ఒక ప్రత్యేకత ఉంది. తెలుగు సాహిత్యంలో యుగకర్తలని మెప్పుపొందిన మహా కవుల జీవిత గాథలను ఇతివృత్తంగా నవలీకరించినవారు నోరి వారు తప్ప, ఇంతటి గొప్ప ప్రతిభావంతులు మరి లేరు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రగడ, శ్రీనాథ, పోతన, ధూర్జటి వంటి గొప్ప మహాకవుల సాహిత్య వైభవం ప్రధానంగా ఇతివృత్తీకరిస్తూ నోరివారు నవలలు రాశారు. పద్య, గేయ నాటికలు, సంగీత రూపకాలు, కథలు, సంప్రదాయ కవితా రచనలు, విమర్శ, మహా పురుషజీవిత సార్ధకత, సాహిత్య చరిత్ర, సమీక్షలు శతాధికంగా రచించి పేరు తెచ్చుకున్నారు.

# 9. పోయిన నగ

*–కొడవటిగంటి వెంకటసుబ్బయ్య*

"అయ్యో, బావా, గులాబిపువ్వెవరో కోసుకువెళ్లారు" అని కమల ఆకస్మికముగా నరచెను. రామారావు సంపెంగ పొదలో దూరి ఆకులలో దాగి పరిమళించుచున్న పూవులకయి వెదకుచుండెను. అతడామె మాట వినగానే పొద నుండి చప్పున వచ్చి ఆమె యొద్దకేగెను. పోరగాపోరగా వాళ్ళ బాబు అంటు తెచ్చి వేసినాడు. చేతులు కాయలు గాయునట్లు తాను నీళ్ళు పోసి పెంచినది. ఎప్పుడు మొగ్గ తొడుగునా యని ప్రతిదినము చిగుళ్ళన్నిటిని విప్పి చూచుచుండెడిది. ఇదే మొదటిపువ్వు, ఇదే దొంగలు అపహరించినారు.

"నిన్న సాయంకాలము చూశానే" అని అతడు కొంత ఆశ్చర్యముతో బలికెను.

"నేనూ చూశాను. చక్కగా నా చేతి మీదిగా కోసుకుందామనుకున్నా. ఎవళ్ళ మొహానో పెట్టుకున్నారు". రామారావు కొంచెము మందహాసము చేసెను. అది చూచి కమల ముఖము వికసింప, "ఆ, నువ్వే కోశావు, ఎక్కడ దాచావో చెప్పు" అని అతని చొక్కా పట్టి లాగసాగినది. అతడామె చేతిని తన రెండుచేతులతో బట్టుకొని వత్తుచు, "ఎందుకు? నవ్వుతున్నాననా? నేను కోయలేదు. కోస్తే కోశానని చెప్పనా" అని పలికెను.

కమల మొగము చిన్నబోయెను. తన చేయి మెల్లగా వదల్చుకొని ఆమె గులాబి తొడిమెను స్పృశించుచు కన్నుల నీరు గార్చజొచ్చెను.

వారిర్వురకు ప్రేమ ఈనాటిదా? మొదట కమల బావయొడిలో గూర్చుని మాటలు చెప్పుచుండేదే, కాని ఇప్పుడిప్పుడు కొంచము యౌవనోదయమగుచున్న కొలది నతనితో నంత చనవుగా ప్రవర్తించుటలేదు. రామారావును ఆమె యభిప్రాయ మెఱిగి మెలగు చుండెను. కాని ఇప్పుడామె దీన ముఖమును జూచి అతడూరకుండలేక యేది యో చెప్పబోయెను. ఇంతలో నెవ్వరో వెనుకనుండి పిలిచిరి.

"ఏమిటండి చిన్న బాబుగారూ, అమ్మాయిగారి పూవుకోసి దాచిపెట్టి పైగా ఓదారుస్తున్నారు?" – ఆ వచ్చినది దాసి.

ఇంతకుముందు ప్రేమ పూరితములయి యున్న అతని కన్నుల నుండి అంతలో నగ్నిస్ఫులింగములు వెలువడెను.

"ఇదుగో సుబ్బీ, ఇలాటి మాటలంటే నేనూరుకోను"

"ఊరుకోకపోతే", అని మెల్లగా "ఉరెట్టుకోండి" అంది

"ఏమిటీ?"

వెంకటేశ్వర్లుగారు బహుసమర్థులు– అన్ని విషయములలోను. ఆయన కూడా అలాగే తరచుగా అనుకొనుచుందురు. పుట్టినది బ్రాహ్మణ వంశమైనను, చేసే వృత్తి, మాట్లాడే మాటలు, చేసే ఆలోచనలు, అన్నియు పక్కా కోమటి లాగుననే. ప్రపంచమున ఏ వస్తువుతోను ఆయనకవసరము లేదు, డబ్బే కావలెను. ఒక వరహా ఇచ్చేమాట యున్నచో ఒకచేయి కోసికొని రెండవ చేయి జూపగలడు. ఆయనకు ఒక్కతే కూతురు, కమల, చాలా చక్కనిది. పూర్వజన్మ సుకృతమువల్ల ఆమెకు తండ్రి పోలిక రాలేదు. సౌందర్యమునకు తోడు సుగుణ సంపన్నత కూడ కలదు. ఆ కారణముచేత పరమలోభి యగు తండ్రి ప్రేమకు అంతగా నామె పాత్రురాలు కాలేదు.

కమలకు మేనరికమున్నది.

వెంకటేశ్వర్లుగారి చెల్లెలి కుమారుడు రామారావు. పిల్లవాడు అందగాడే, చదువులో తెలివితేటలు కలవాడే కాని ఆస్తి ఎక్కువగా లేదు. పైగా పోలీసు ఇన్‌స్పెక్టరు పనిచేయవలెనని సంకల్పమట. దగా వర్తకమన్న ఒళ్ళు మంటయట. వెంకటేశ్వర్లుగారు చాలా ఆందోళనలో పడినారు. పిల్లను ఇద్దామా వద్దా అని. వేరే ఇంకొక సంబంధమున్నది. చదువుసంధ్యలు లేవు. లేకపోయినను కావలసినంత ఆస్తి ఉన్నది. బాగా టక్కు టమార విద్యలలో గడితేరినవాడు. కుఱ్ఱవాడు తమ వ్యాపారములో మిక్కిలి సహాయభూతుడు కాగలడు. వాని కిచ్చిన బాగుండునని యున్నది వెంకటేశ్వర్లు గారికి.

ఇట్లుండ రామారావు తల్లి కాలధర్మము నొందెను. కుమారుని మూడవ యేటనే యామె భర్తను గోలుపోయెను. అప్పటి నుంచి ఆడుదియైనను మిగుల సమర్థతతో వ్యవహారములు చూచుకొనుచు కొడుకును వృద్ధిలోకి దెచ్చెను. ఎన్ని చిక్కులు పడు

చున్నను వెంకటేశ్వర్లగారు మాత్రము చెల్లెలికి ఏ సాయమును జేసినవారు కారు. ఆమెయు పౌరుషము వహించి అతనినేదియు కోరలేదు. సంబంధము చేసికొనుట విషయముల్లో కూడ అన్న వచ్చి బ్రతిమాలితే చేసికొందునని ఆమె యనుచుండెను. అదియే దొడ్డదీవనయని అన్నగారు లోలోన సంతసించుచుండిరి.

చెల్లెలి చావు వల్ల వెంకటేశ్వర్లు గారి నెత్తిమీద పిడుగు పడ్డటయినది. తనకంటే మేనల్లున కాత్మబంధువులు లేరు. ఏకాకిగా పిల్లవానిని విడిచినచో చాలా అపయశమును, బంధువిరోధమును కలుగునట్టు తోచెను. కావున ఆయన చేయునది లేక దైవమును నోటికి వచ్చినట్లెల్ల తిట్టుచు బోయి మేనల్లుని మెల్లగా నోదార్చి తన వద్దకు తెచ్చుకొనెను. కాని కొంత ఆలోచనమీద ఇది మేలే యని ఆయన తలచెను. రామారావు చిన్నవాడగుట వల్ల అతని ఆస్తి కాపాడుభారము తన యందుండును. మేనల్లుని నేలాగైన వంచినచో ముందు ముందు చాలా లాభమున్నది.

ఇప్పుడు వెంకటేశ్వర్లుగారి వర్తక వ్యాపారమునందు రామారావు జీతము బత్తెము లేని గుమాస్తా.

"అమ్మా, నాగరం ఎక్కడ పెట్టావు?"

కమల ఇవతల గదిలో సోఫాపై పరుండి బాలనాగమ్మ కథ చదువుకొను చుండెను. తల్లి మాట ఆమె వినలేదు.

"అమ్మా"

"ఆ"

"నాగరం ఎక్కడ పెట్టావు?'

"చందువా పెట్టెలోనే"

"లేదే"

"ఏమై పోతుందేమిటి? తిన్నగా చూడు"

"చూశాను, కనబడలేదు"

"ఏమో, అక్కడే పెట్టాను"

"ఇలారా"

"ఎందుకు?"

"రా, చెబుతాను"

"అబ్బ ఎందుకే?"

"రమ్మంటూంటే!"

'ఊంః"

కమల విసుగుతో పుస్తకము నేలకు కొట్టి పరుగెత్తివెళ్ళి తల్లి దగ్గర నిలిచెను. "ఊఁ, ఎందుకమ్మా?"

"ఏదీ చూడు, పెట్టెలో లేదు"

"ఉండు. లె" అని కమల పెట్టెలో వస్తువులన్ని తీసి అటు నిటు పారవైచి గబగబ వెతకసాగెను. నగ లేదు.

నిజముగా లేదు. తల్లి, కూతురు ఎన్నిసార్లు వెతికినను కనబడలేదు.

"నేను ఇక్కడే పెట్టానమ్మా" అని వ్రేలితో పెట్టె సొరుగులో పొడుచుచు కమల చూపించెను.

"ఏమైపోతుందే, ఎవరు వస్తారే"

కమల గుండెలు తటతట కొట్టుకొనసాగెను. ఆమె ఒక సంగతి చూచినది. దూరము యోచించిన కొలది హృదయము చెదరిపోవుచుండెను. తల్లితో చెప్పుదునా వద్దాయని ఆమె మనస్సు కలవరపడసాగినది. ఇరువురును కొంతసేపు ఆలోచించుచు నిలుచుండిరి.

తుదకు కమల మెల్లగా తల్లి దగ్గరకు చేరి మెడలో పట్టెడ సవరించుచు, "అమ్మా, బాబుతో చెప్పనని మాటయిస్తే ఒక సంగతి చెప్పుతాను" అనెను.

"ఏమిటి?"

"ఇందాక బావ నాగరం తీసి చూస్తున్నాడు. దొడ్లోకి వెళ్లుతూ చూశాను. మళ్లీ ఇంట్లోకి వచ్చేసరికి బావ కనపడలేదు. ఎక్కడికో వెళ్ళాడు. ఒకవేళ ఎందుకైనా తీసుకెళ్ళాడేమో కనుక్కో"

"ఏమి ఈ మాత్రము మాట నేను వినకూడనివాడనా?" అనుచు వెంకటేశ్వర్లు గారు గదిలో ప్రవేశించిరి. కమల గుండెలు పగిలిపోయెను.

"నేనంతా విన్నాను. మీరా దొంగ వస్తే మాటాడకూడదు. తెలిసిందా?"

నగ పోయినందుకు వెంకటేశ్వర్లుగారికి అంత ఎక్కువ చింతగానుండెనని చెప్ప జాలము. దానిని పారవేసుకొన్నందుకు ఆ దుఃఖమంతయు ఆయన భార్యదే. తిరిగి దానిని ఆయన ఎన్నటికిని చేయించి ఈయబోడు. కావున అది యున్నను లేక పోయినను ఆయన కొకటే. కాని రామారావుపై పూర్తిగా కోపము ప్రజ్వరిల్లుచుండెను. మేనల్లుడు చౌర్యము చేసినాడాయను శంక వారికెంతమాత్రమును లేదు. వానిని తన వద్ద నుంచు కొనవలెనన్న ప్రథమ సంకల్పమును అంత జయప్రదముగా కొనసాగుట లేదు. రామారావు తన ఆస్తి విషయమై పదేపదే కనుగొనుచు బహు జాగరూకత కనబరచు చుండెను. పైగా తనకు విద్య కొనసాగింపుమని మేనమామను చాలా బలవంతము పెట్టుచుండును. అందువలన వెంకటేశ్వర్లుగారికి మేనల్లునిపై లౌకిక సంబంధమయిన ప్రేమ కూడా గతించి వానికి త్వరలో ఉద్వాసన జెప్పుటయే శ్రేయస్కరముగా దోచు చుండెను. ఇట్టి సమయమున నీ నగ పోయినది. ఇప్పుడు దురాగ్రహ పరవశుడై యజమాని కర్తవ్యము నాలోచించుచు మేనల్లుని రాకకై వేచి యుండెను.

కొంతసేపునకు అపరాధి వాకిట నెవరితోడనో మాటాడుచున్నట్లు విన వచ్చెను. అతడు లోనికి రాగానే వానితో నెట్లు సంభాషించవలెనో ఎట్లు దూషింపవలెనో అన్నియు నిరూపించుకొనుచు వెంకటేశ్వర్లుగారు తయారుగా నుండిరి. రామారావు మాటాడుట ఆగిపోయెను. కొంతసేపటికి ఎవరో తన గది వంకకు వచ్చుచున్నట్లు చప్పుడయ్యెను. వెంకటేశ్వర్లుగారి ముఖమగ్నికురియ దొడగినది. ఆయన గుమ్మమువైపు వీపు త్రిప్పి కూర్చుండెను. గది తలుప తెఱచుకొని ఎవరో మెల్లగా లోపల బ్రవేశించిరి. అపర దూర్వాసునివలె యాజమానుడు చివ్వున లేచి తిరిగి చూచెను. అది దాసి!

"ఏమి, ఎందుకు వచ్చావు? ప్రొద్దుటినుంచి ఎక్కడికి వెళ్ళావు?"

దాసి చేతిలోని కాగితము తటతట కొట్టుకొనుచుండెను. ఆమె ప్రత్యుత్తర మీయలేదు.

"ఏమిటా కాగితము?" ఆయన చేయి చాచెను

దాసి వినయపూర్వకముగా దానినందిచ్చెను. చూడగా నది పది రూపాయల నోటు!

"ఎక్కడిది నీకు?" అని యజమాని గద్దించి అడిగెను.

దాసి నిలువెల్ల కంపించుచుండెను. అది తడవుకొనుచు "చిన్న బాబుగారు సామీ, వాకిట్లో ఎవరో కంసాలి లాగున్నాడు ఆయనతో మాట్లాడుతూ జేబులో కాగితాలు తీసుకోవడంలో ఇది క్రింద పడిందండి. నేను తోటలో మొక్కలకు నీళ్ళుపోస్తూ చూశాను సామీ. వారు తీసుకుంటారనుకున్నాను. తీసుకోకుండానే వెళ్ళిపోయారు. నేను వాకిట్లోకి వెళ్లేసరికి వీధి మలుపు తిరిగిపోయారు కామోసు కనబడలేదు. ఏం కాగితమో అని తెచ్చాను సామీ!" అని ప్రత్యుత్తరమిచ్చెను.

రామారావు జేబులో పది రూపాయలనోటు! ఎక్కడి నుండి వచ్చినది? ఇట్టి వింకెన్ని కలవో! అవును. నగ విషయమున ఇక ననుమానపడనవసరము లేదు.

"సరె. నీవు వెళ్ళు. వాకిట్లోనే ఉండి రామారావు రాగానే సరాసరి నా దగ్గిరకు రమ్మని చెప్పు పో"

"రామారావుగారూ, తమరు చాలా పెద్ద మనుష్యులు. ఇలా దయచేయండి తమ ఆస్తి విషయమై చాలా ఆదుర్దాపడుతున్నారు. ఇదుగో జమా ఖర్చు లెక్క అంతా తేదీవారీగా వేసిఉంచాను. మైనారిటీ వెళ్లిపోతుంది గనుక తమరు శ్రద్ధగా ఆస్తి వప్పజెప్పు కొని తమ యింటికి వేంచేయవచ్చును. ఈనాటి మీ చర్యతో మన సంబంధ బాంధవ్యము లన్నీ అంతరించినవి."

రామారావు నిర్ఘాంతపోయెను. ఆ ఉదయమాతడు కమలతో కొంచెమధికముగా సరసమాడి యుండెను.

"నీవు వట్టి అమాయకునివలె నటింపనవసరము లేదు. కమల చెప్పినది నేను విన్నాను"

"కమల చెప్పినదా నేను తప్పు చేశానని"

"కమల ఎందుకు చెప్పుతుంది? దాసి చూచింది"

"దాసి పరమ దుర్మార్గురాలు" రామారావు మొగము నెత్తురు కండ అయ్యెను. దాసి అపుడచ్చటనున్నచో దాని ప్రాణములు దక్కియుండవు. రెండు నిముసములు నిశ్శబ్దముగా గడచెను.

"మామయ్యా, నేనేమీ కూడని పని చెయ్యలేదు. కమలను పిల్చి మళ్లీ అడగ వచ్చును. మొదట నుంచీ నాకాశగొలుపడం చేత నేనలాటి భావముంచాను కాని లేకపోతే"

"అవును. మొదటినుంచీ నా ధనమిస్తానని నీకాశ గొలుపుతున్నాను. చాలా నిజము. దానిమీద నీకంత ప్రేమ గలిగినందుకు నాకు ఎంతో సంతోషము"

"నీ ధనమెవ్వరికి కావలె?"

"నా కూతురు నగలు మాత్రమే కావలె"

"అవ్వీ వద్దు తీసుకో"

"ముందే నీవు జాగ్రత పడుతూంటే నాకెక్కడ అవకాశము?"

"నాకెందుకు?"

"ఇవ్వాళ నాగరమెందుకు కావలసి వచ్చింది?"

"ఏమి నాగరం?"

"ఇందాక నీవు చందువాపెట్టిలో నుంచి తీసుకుని జేబులో వేసుకున్నది'

రామారావు మొగము వెలవెలబోయెను. అతడు తడబడుచు, "నాగరము పోయినదా?" అనెను.

"అబ్బే పోలేదు. కంసాలి వద్ద ఉండవచ్చును"

"నాకేమీ అర్థము కావడం లేదు"

"అవును ఎలాగా కావడం! కాని నీ కాగితాలనుంచి ఈ నోటు జారిపడింది. ఇది నా కర్థమవుతూంది"

"నా కాగితాల్లో ఇది ఎక్కడిది?"

"నీకే తెలియాలె, వీధి గుమ్మంలో పడితే సుబ్బి తెచ్చి యిచ్చింది" రామారావు దాసి కోసము చూచెను. కాని అది లేదు.

"ఇదంతా సర్వఅబద్ధం"

"నీవు పెట్టెలో నాగరం తీసినది కూడా అబద్ధమేనా?"

"కాదు చందువా మూత తెరిచి ఉంటే వెళ్లి చూశాను. నాగరం కనబడితే తీసి చూచి మళ్లీ పెట్టి వేసినాను"

"నీవు చాలా బుద్ధిమంతుడవు, నిన్ను పోలీసుకు వప్పజెప్పక ఊరికే పంపడమే మహోపకారము, ఇక వెళ్ళిపో"

రామారావు హృదయమున బల్లెము గ్రుచ్చినట్లయ్యెను. అతడు మేనమామ వంక కఠినముగా జూచి అనెను.

"మీరు చాలా పొరబడుతున్నారు. ఇంత కాలము నుంచీ"

“అధిక ప్రసంగము చేయకు. నడు” వెంకటేశ్వర్లుగారి కంఠస్వరము అతి కఠోరముగా నుండెను.

రామారావు శరీరమాపాద మస్తకము మండిపోజొచ్చెను. “ఎన్నటికైనా నీవు దీనికి పరితపిస్తావు” అని అతడు అస్ఫుటముగా బెదరించుచు కమల కోసమైన నాగక చఱ్ఱున ఇల్లు వెడలిపోయెను. వెనుక నెవ్వరో చల్లగా నవ్విన శబ్దమయ్యెను. కాని అతడు తిరిగి చూడలేదు.

ఒకనాటి ఉదయమున వెంకటేశ్వర్లు గదిలో పచారు చేయుచు దీర్ఘాలోచనలో మునిగి యుండిరి. కమలకు పెండ్లియీడు వచ్చినది. వరుని విషయమున నేదియు పాలుపోవుట లేదు. ఇంటిలో భార్యాభర్తలు నిత్యమును జగడమే. ఇక కమల విచారమునకు మేరయేలేదు. బావ పేరు ఉచ్చరించుటకైన నింటిలో వీలులేదు. అతని గూర్చి వార్త కూడ తెలియుటలేదు. ఎక్కడున్నాడో, తనను ఎన్నడైన తలచుకొనునో లేదో, పెండ్లి చేసుకొనెనేమో! ఆమె కన్నుల నుండి అశ్రువులేకధారగా ప్రవహించు చుండెను. అతని దప్ప ఇతరుని పెండ్లియాడవలసి వచ్చినచో ఆత్మహత్య చేసుకొనుటకు ఆమె లోలోన స్థిరపఱచు కొనుచుండెను.

రామారావుపై చౌర్యమారోపింపబడినను ఆమె మాత్రమది నమ్మలేదు. నగ ఏమైపోయినదో పరమేశ్వరునకెఱుక. తన బావ అలాటి పనిచేసి యుండడని ఆమె నిశ్చయము. అతని కష్టములన్నిటికీ తానే కారణమని ఎల్లప్పుడు తనను నిందించు కొనుచుండును. కాని ఎప్పటికైన అతడు నిరపరాధిగా బయలువెడలునని ఆమెకొక పిచ్చి నమ్మకము కూడా కలదు.

✿ ✿ ✿

ఆనాడు యజమాని సంబంధము నిశ్చయించుటకు ఉద్యుక్తుడగుచుండెను. ఇంతలో ఎవ్వరో తలుపు దట్టిరి. తలుపు తెఱవగా పోలీస్ ఇన్‌స్పెక్టరు గారు ప్రవేశించిరి.

“సాహుకారుగారూ, మీ దాసి యెక్కడయ్యా?”

“ఎవరు సుబ్బియేనా? ఎందుకండి?”

“ఎందుకైతే మీకెందుకు? ఇలా వేగిరం పిలిపించండి”

దాసి వచ్చెను. వెంటనే ఇన్‌స్పెక్టరు దాసిచేతులకు చల్లగా సంకెలలు తగిలించిరి.

అది పెద్దపెట్టున బొబ్బలిడుచు గొల్లున నేడువసాగెను. కాని పోలీసు బెత్తము దాని నోరు మూసినది. ఇన్‌స్పెక్టరుగారు యజమాని వంక దిరిగి "ఏమయ్యా దిగాలుపడి చూస్తారు? ఇలాటి ధగిడీల మాట విని రత్నం వంటి మేనల్లుణ్ణి వెళ్లగొట్టారు కారూ. ఇదిగో మీ నగ. ఇక తృప్తిపొందండి" అని చూపిరి.

"ఏమిటి?" వెంకటేశ్వర్లుగారి సంతోషమునకు ఆశ్చర్యమునకు మేర లేదు.

"మీకెక్కడ దొరికింది ఇది? సుబ్బినెందురు ఖయిదు చేశారు? నాకేమీ బోధ పడడం లేదు" అన్నాడు.

"పెద్ద పెద్ద వ్యవహారాలు చేస్తారు, ఏమిటయ్యా మీ తెలివితేటలు. ఈ ముండ కంసాలివాడితో ఏకమై నాగరం కొట్టేసి రామారావు జేబులోదని నోటు తెచ్చి మీకిచ్చింది. రామారావు వచ్చి తనకు జరిగిన పరాభవం మాతో చెప్పుకుంటే మెల్లిగా కూపీతీసి చోరీ అంతా పైకి లాగాం. నగ అప్పుడే మీకివ్వడానికి వీలులేదు. విచారణ జరగాలె. మీకు సమన్సు వస్తాయిలెండి" అని ఇన్‌స్పెక్టరు గారు వెళ్ళుటకు సిద్ధమైరి.

"చిత్తం చాలా తెలివితక్కువ పనిచేశాను"

"మెల్లిగా అంటారేం?"

"చిత్తం చిత్తం. ఇంతకూ మేమదృష్టవంతులము. మహాప్రభువులు దయచేశారు కనుక మా మర్యాద దక్కింది. మావాడు ఎక్కడ వున్నాడండి?'

"మా యింట్లో ఉన్నాడు. ఇక మీ యింటికి రాడట"

"మా ప్రాప్తం. సెలవు, నమస్కారం"

"ఈ వంకర దణ్ణాలకేమివచ్చెలే" అనుకొనుచు ఇన్‌స్పెక్టరు గారు దాసిని స్టేషనుకు ఈడ్చుకొనిపోయిరి.

✲ ✲ ✲

"ఎందుకు కమలా, నవ్వుతున్నావు?"

"ఒకమాట జ్ఞాపకం వచ్చింది"

"ఏమిటా మాట?"

"చెప్పను"

“చెప్పవూ”

“చెప్పుతా చెప్పుతా ఉండండి. మరీ పెండ్లిమాట మాటాడడానికి మా బాబు మీ యింటికి వస్తే, మీరు, ‘ఎవరా వచ్చేది? ముందు వీధిలోకి గెంటెయ్యి’ అంటూ కేకలేశారట కాదూ”?

“నేను కలగన్నానాయేం పెండ్లి మాటమీద వచ్చాడని? చోరీ ఆస్తి ఏమైనా వెతకడానికి వస్తున్నాడనుకున్నాను”

“ఎలాగైనా మామగారు కదా, అలా”

“మామగారు కాదు దోమగారు! ఇక ముందు ఆయన మాట ఎత్తబోకు.”

“అబ్బాయీ, మా యింట్లో వచ్చి ఉండు మా అమ్మాయిని ఇస్తాము, అంటే నేను మీ యింటికి రాను, పిల్లనివ్వదలచుకొన్నారా, తీసుకువచ్చి ఇక్కడ దిగఢ్చండి, అన్నారట కాదూ? మేమంత తీసివేసి ఉన్నామా యేం మీ ముందు” అని చిరునవ్వుతో అన్నది.

“ఇదిగో పిల్లా! నవ్వులాట కాదు సుమా! ఈ తడవ మీ నాయన పేరు ఎత్తావంటే నిన్ను పుట్టింటికి తగలేసి ఇక ఈ జన్మకు తీసుకురాను”

“వద్దు. ఇక మాట్లాడితే అప్పుడనండి”

**కథానేపథ్యం ...**

కథలకు సాహితి పత్రిక ప్రముఖ స్థానం ఇచ్చేది. ఈ సంచిక యీ కథతోనే మొదలవుతున్నది. విషయసూచిక గమనిస్తే ఇది తెలుస్తుంది. ఇక రచయితను గూర్చీ, రచనను గూర్చి సంక్షిప్త వివరణ.

కొడవటిగంటి వెంకటసుబ్బయ్య కవి, కథారచయితా కూడాను. ఆయనది తెనాలి. 1920 ప్రాంతంలో ప్రారంభమైన సాహితీ సమితి సభాపతి శివశంకరశాస్త్రి గారికి ఆత్మయమిత్రుడీయన. 20వ శతాబ్ది తెలుగు కథాసాహిత్యంలో ప్రసిద్ధరచయితగా

ఎన్నికకెక్కిన కొడవటిగంటి కుటుంబరావుకు అన్నగారు వెంకటసుబ్బయ్య. ఈయన కిందటి శతాబ్ది చివరలో పుట్టి ఉంటారు. అందువల్ల భావకవులకు సన్నిహితుడు. ఇష్టుడు. కొడవటిగంటి కుటుంబరావు 20 వశతాబ్ది రెండు ప్రపంచయుద్ధాల మధ్య సాహితీవ్యక్తిత్వం రూపొందించుకున్నాడు. కాబట్టి ఆయన కథలలో సామాజిక రుగ్మతలు, దోపిడి, సామాజిక వర్గాల ఆత్మవంచనలు, వర్గకలహాలు, శ్రామికజన పక్షపాతం కన్పిస్తాయి. ఇక వెంకటసుబ్బయ్య కథలలో ప్రణయం, ప్రకృతి సౌందర్యం, స్నేహం, వలపు, తారుణ్యోహలు, సంప్రదాయసంస్కృతి కన్పిస్తాయి. పాతికేళ్ల వయసుననే ఈయన ఇల్లు విడిచి ఎటో వెళ్లిపోయినాడు. ఎనభై అయిదేళ్లు కావస్తున్నా వెంకటసుబ్బయ్య గూర్చి ఇప్పటికీ ఎవరికీ ఏమీ తెలియదు. ఇంగ్లీషు సాహిత్యం బాగా చదువుకున్నాడనీ, ఆకళించుకున్నాడనీ నోరి నరసింహశాస్త్రి వంటి మిత్రులు వీరి గురించి రాశారు. అత్యంత అభిమానించే సాహిత్యాన్ని, కవిత్వాన్ని, ప్రాణమిత్రులను వదిలిపెట్టి ఏం సాధించాడో, ఏమి గవేషించి ఇల్లు వదిలాడో! ఈనాటికీ అజ్ఞాతంగా ఉన్నాడని ప్రశస్తి. కవితా సంకలమైన 'వైతాళికుల'లో ఈయనను పరిచయం చేస్తూ సంకలనకర్త ముద్దుకృష్ణ రాశారు :

కొడవటిగంటి వెంకటసుబ్బయ్య కవితా రచనల సంపుటి 'సాంధ్యరాగం' పేరుతో ఒకటే వచ్చింది. ఆయన రచన, 'ఆగుమాగుము తెరువరీ ఆయాస ఖేదమునను పయింపుము, మా గృహాంగణ ప్రాంగణమ్మున కుసుమసముదయ మధుప మియ్యదియే' అనే కవిత చాలామంది మెప్పు పొందింది.

ఈ కథలో ఆనాటి సామాజిక వాతావరణం చక్కగా ప్రతిఫలింపచేశారు కొడవటిగంటి. బహుశా తెలుగు కథలలో నేర నిరూపణ ఇతివృత్తంతో పరిశోధక (పత్తేదారీ) స్పర్శకలిగిన మొదటి కథ ఇదే కావచ్చు. ముగ్ధప్రణయం, తారుణ్యోహలు, తరుణ దాంపత్య మనోజ్ఞ శృంగారం, యువతీ యువకుల అభిమానాలు, పట్టుదలలు ఈ కథలో ప్రసక్తం.

# 10. వంశపావనుడగు తనయుడు

– కోటంరాజు పున్నయ్య

మహారాష్ట్రులకును, ఆంధ్రులకును సంవత్సరాది పండుగ ఒక్కటే. హైందవు లలో ధనాఢ్యులు వెళ్ళి భుజించునొక సుప్రసిద్ధి భోజనశాలకు తాము దొరలు కాకపోయినను, గావలయునని కోరు కొందరు పెద్ద మనుష్యులు వెళ్లియుండిరి. వారి యాశ సంవత్సరాది భోజనమునిచ్చుట బ్రాంది వైనులతోను, మాంసాహారముల తోను జేయవలయుననియే. అచ్చటనున్న దొరలు, దొరసానులు, పెద్దలు, పిన్నలు సొగసైన విలువగల వస్త్రములను ధరించి తమ జన్మాధిక్యతనో, విద్యాధిక్యతనో రెండును లేనప్పుడు ధనాధిక్యతనో ప్రకటించుచుండిరి. ఎచ్చట చూచినను సంతోషముతో గూడిన ముఖములే. ఎచ్చట వినినను బ్రాంది బుడ్ల చప్పుళ్ళే!! ఏవి తినినను మాంసము కలిపిన వస్తువులే!! ఎవరు చెల్లించినను గినీలే!!

ఈ హోటలు జగత్ప్రఖ్యాతిని గాంచిన తాజ్‌మహలు హోటలని చెప్పవలయునా? కష్టపడి రొక్కమును గడించు సాధారణ హైందవులిందు భుజించుట కసమర్థులు గాన పిత్రార్జితము మెండుగా గల భారతీయు లిందలి రుచులను జవిచూచుచుందురు. నిజమే! ఒకరి సంపాదనను ఖర్చుపెట్టు టతిసులభముగదా!

ఈ మందిరమునందొక విశాలమైన గదిలో నలుగురు యౌవన హైందవులు గూరుచుండిరి. ఇందిద్దరు భాగ్యవతులయిన మేనత్తలను గలిగి వారికి వారసులయినట్టి వారు, హోటలులో కావలసిన వస్తువుల కింగ్లీషు పేరులను బహుకాల పరిచయమువలన నేర్చుకొనుటయే వారికున్న ఇంగ్లీషు విద్యాపాండిత్యము. మూడవవాడు అవివేకపు తండ్రి సతారానుండి నెలనెలకు బంపు సొమ్ముతో పూలరంగనివలె బొంబాయి నగర మందు కాలక్షేపము జేయుచున్నట్టి వాడు. ముప్పది సంవత్సరములకు బయిగా ఈడు గల మహాత్ముడు. ఇక నాలుగవ వాడో మన కథానాయకుండగు దినకరరావు. ఈతని పేరు దినకరరావైనను మిత్రులు ముద్దుకై సర్దారని పిలుతురు. సర్దారుయొక్క బాహ్య వేషములను జూచినవారు నిరభ్యంతరముగా

నట్టి పేరున కర్ర్వుడనియే జెప్పి తీరగలరు. వాని సుందరమైన మహారాష్ట్ర వీరులంబోలిన ముఖము, చక్కని మీసముల కట్టు, విశాలమైన నేత్రములు, పటుత్వమయిన శరీరమును జూచినవారు సర్దారని పిలువక మరేమని పిలువగలరు. కాని దినకరరావు యొక్క గొప్పతనమంతయు నాతని పై వేషమునందు మాత్రమే గలదని వ్రాయుటకు చింతించుచున్నాను. ఇంక మొదటి యిద్దరు పడుచువాండ్రును ప్రతిదినమును మొమ్మాదేవికి జేయు ఒక్క ప్రార్థన యేదనగా ఎప్పుడత్తలు జచ్చెదరా, ఎప్పుడాస్తి వశమగునా తల్లీయని! మూడవవానికి తండ్రి చావవలయునని లేకున్నను ప్రతినెలయు జేతికందవలసిన మనీఆర్డరాలస్యముగా జేరినప్పుడు ముసలిముండ వాడింతకాలమేల బ్రతుకవలయునురా శంకరాయని పండ్లు పటపట కొఱకుచుండును. నాలుగవ వాడగు మన సర్దారుకు నెలకు పోలీసు సబ్ఇన్సెపెక్టరుగా వచ్చు జీతము తప్ప ఒక్క పగులగొట్టిన గవ్వయయినను పిత్రార్జితము లేదు. వాని జీతము వానికి సరిపోదు. కాని వీని పూర్వులు వారి దినములలో గొప్ప రణశూరులని ఖ్యాతివహించి పేష్వాల పక్షమున బోరి దేశమునకు సేవ చేసినట్టివారు. వారార్జించిన జాగీరులన్నియు దినకరుని తండ్రి కాలమునాటికే ఎక్కడివక్కడ సర్దుకొనినవి. దయ గల బ్రిటిషు గవర్నమెంటు వారాయన కొక పోలీసు ఇన్సెపెక్టరు ద్యోగము నిచ్చుట వలన, దానివలన వచ్చు స్వల్పాదాయముతో దనపూర్వుల వలెనో జీవింపబోయి అప్పులపాలయి, ఏమున్నను, ఏమి లేకపోయినను, దనపూర్వుల కందరికిని జన్మమొసంగిన స్వగృహమునుసయితము గోలుపోయి, మృతినొందు నప్పటికి దినకరరావును నిస్సహాయునిగా జేసిపోయెను. దినకరరావుకున్న ఇద్దరు చెల్లెండ్ర కెట్టెట్లో బంధువులు పెండ్లిచేసి వారిని భర్తల యింటికి సాగనంపిరి. ఈతని తల్లి యొక అద్దెకొంపలో దక్కనులో నొక గ్రామమందు పడియున్నది. వీని తండ్రియందు గౌరవముగల యొక దొరగారు వీనికి సబ్ఇన్సెపెక్టర్ పని నిప్పించెను. సర్దారు యొక్క నిజస్థితి యిట్టిదైనను దనపూర్వుల నామమును ధరించుచున్న వాడగుటచే వారి పౌరుషమునకు గాకపోయినను వారి డాబు డంబములను మాత్రము విడిచిపెట్టలేదు.

నేడు మహారాష్ట్ర సంవత్సరాది పండుగయగుటం జేసి బొంబాయిలోని తన ముఖ్య స్నేహితులలో ముగ్గురిని ఈ హోటలులో విందుకై పిలిచెను. కన్నతల్లి అన్నము లేక మాడుచుండగా నీనిర్దయుని కామాటయే మనస్సునకు బట్టలేదు. కాని తానాదినము మార్వాడీవాని వద్ద నుండి అప్పుగా బుచ్చుకొనిన యేబది రూపాయలను బొంబాయిలో

బ్రహ్మాండమైన భోజన మందిరమునందు పాడుచేయుటకు మాత్రము వెనుకాడలేదు. ఈ సొమ్ము వాని తల్లికి బంపినయడల నామె కారుమాసముల గ్రాసమునకు సరిపోవునుగదా?

"అహో, ఈవేళ ఏమయినదో తెలుసునా? ఆ మార్వాడి పిసినారి గాడిదె 15 దినములు తెగద్రిప్పి ఈనెల జీతమంతయు వ్రాసి యివ్వనిది అప్పుగా నేబదిరూప్యము లీయననెను. నాకప్పుడెంత కోపము వచ్చినదో ఏమి చెప్పగలను. నా పూర్వుల దినము లలోనైనచో వానిని చెట్టుకు వ్రేలాడగట్టి పేముబెత్తముతో చెండాడి యుండకుందునా! ఇది పాడు బ్రిటిషు గవర్నమెంటు. సాక్షులు, ప్లీడర్లు, లాలు, మేజిస్ట్రేటులు, అపీలులు ఇంకనెన్నో వల్లకాటి లోనివి గలవు. ఇంతజేసినను సుఖముగా జెయిలులో తినమని శిక్ష. ఈ బ్రిటిషు ప్రభుత్వమువారి అమితదయవలెనే వారి ఐశ్వర్యము పోవునని నాకు తెలుసును" అని సర్దారనెను.

'ఓహో! పోలీసు సబ్బినస్పెక్టరుగారా ఈ మాటలు అనవలసినది' అని మొదటి స్నేహితుడు హేళనము జేసెను.

"ఫర్వాలేదులే. మనము మరాఠీలో మాటలాడుచున్నాము. ఈ తెల్లదొరలకు మనగొడవ ఏమి తెలియగలదులే అయినను ఈ పాపిష్టి రోజులలో గోడలకు చెవులున్నవి. ఆ రవ్వంత యుద్యోగము పోయెనా భవతీ భిక్షాందేహి అనుచు బయలుదేరవలసినదే" అని సర్దారు మారు పల్కెను.

'అయితే మార్వాడీవాని సంగతేమయినది'

"ఇంకేమున్నది ఇది బ్రిటిషు ప్రభుత్వము కాదు. కాని మార్వాడి ప్రభుత్వము. కై కై అంటే దస్త్రము కట్టలు స్మాలుకాజు కోర్టులు, డిక్రీలు వారంటులు, జప్తులు కావలసినన్ని పాడుపీడలు. జీతము వ్రాసియిచ్చి రూపాయికి పండ్రెండణాలే పుచ్చుకొంటిని."

"వడ్డీయో"

"నెలకు రూపాయికీ ఒక అణ"

"ఇంతకష్టపడి యీ విందు మాకెందుకు"

"అబ్బో ఎంత కనికరము. మీ తావున సొమ్మేడ్చినట్లు. ఆ అత్తముండలిద్దరు చచ్చినప్పుడు గదా మనమందరము భాగ్యశాలులము" అని దినకరుడెత్తిపొడిచెను.

"అట్లయినచో, సర్దారూ, అప్పులు పెట్టిన మార్వాడీ వాండ్రనందరిని ప్లేగు పట్టుకొని పీకి దిగమ్రింగుగాక" యని రెండవ స్నేహితుడు దొరలు పోయు విధమును సారాయిని గ్లాసులో బోసి ఒక క్షణములో కడుపులోనికి జారవిడిచెను. దీనినే ఆంగ్లేయులు 'డ్రింకింగ్ ది టోస్టు" అని అందురు.

ఇట్టి సరససల్లాపములలో నారితేరినవాడు గాన సర్దారు "మన త్రోవ కడ్డమున్న ముసలి అత్తముండలు త్వరగా జచ్చెదరుగాక" యని గ్లాసును ద్రాక్షసారాయితో నింపి లోపలికి జారవిడిచెను. అందరును ఇట్టి సమయోచిత సంభాషణమునకై పకపక నవ్విరి. అంతట ఈ నలుగురి స్నేహితుల యొక్క ధోరణియు గుఱ్ఱపుబండ్లు, మోటరు బండ్లు, వారుముందు నివసించదలచిన సుందర మందిరములు, నాటకములు, గుఱ్ఱపు పందెములు, లాటరీలు, అన్నిటికంటె ముఖ్యముగా స్త్రీలు మొదలగువాని మీద ఈ నలుగురి నోటిలో గొప్ప యుద్యోగియులందఱును లంచగొండులయిరి. గొప్ప సత్పురుషుల కీర్తియంతయు వినాశమయినది. మహాపతివ్రతలగు స్త్రీలు సయితము వ్యభిచారిణులుకాగా సాధారణ స్త్రీల సంగతిదియని వ్రాయనేల? వారు త్రాగిన పదార్థము వారి నాలుకలను విచ్చలవిడిగా వదలివేసెను.

ఆహా! నిందింపబడిన యుద్యోగులుగాని, స్త్రీలుగాని పురుషులుగాని ఆ గదిలో సమయమందుండి వినినచో ఎవరివో గొందరివి ప్రాణములు పోయి యుండ వలసినవేగదా?

ఇంతలోనొక భోజనగృహ సేవకుడు వచ్చి "దేవరా, తమ కొరకెవరో వచ్చి నారండి" యని సర్దారుతో మనవి చేసెను.

"ఎవడో వానిని ఇక్కడకు రమ్మనుము. నేను లేచివెళ్ళి చూచు స్థితిలో లేను"

"చిత్తమండి"

అంతట సర్దారుయొక్క ఆర్డర్లీ పోలీసు  కానిస్టేబిలు లోపల ప్రవేశించెను.

"ఏమోయి, ఏమి ముంచుకొని పోయినదని యిచ్చటికి పరుగెత్తుకొని వచ్చినావు" అని యజమాని యడిగెను.

"చిత్తమండి, తాము కొనమనిన పండ్లు, సారాయి బుడ్లు, పుష్పహారములు, పెద్దదొరగారికి బంపుటకయి తెచ్చినానండి"

"ఓహో, ఇదియొకటి తగలబడినదే, ఈపూట. మన పండుగ మనకుగాని మన దొరలకెందుకీ బహుమతులో! ఇది డిపార్టుమెంటులో లేనిపోని పాడు రివాజు" అని విసుగుతో సర్దారు పలికి "సరే, విక్టోరియా నొకటి బాడుగకు గుదిర్చి అందు నీవు తెచ్చిన సామానులను బెట్టి కూర్చునుము. నేను తరువాత వచ్చెదను" అని కానిస్టేబిలును వెళ్లమనెను. కాని వాడు కదలలేదు.

"పోవేమి, అటు యిటు ఏల చూచెదవు. జన్మములో ఇట్టింటిని జూడలేదు కాబోలును"

"కాదండి, తమకొక యుత్తరము వచ్చినదండి"

"ఇటుల పారవేసిపో" అని సర్దారు గర్జింపగా దాని నిచ్చి కానిస్టేబిలు నడిచి పోయెను. ఈ యుత్తరము జదువగానే సర్దారుయొక్క ముఖము వెలవెల బోయినది. తన స్నేహితులు లాగుకొని చదివి నవ్వెదరని నెమ్మదిగా దానిని క్రిందికి జారవిడిచి బూట్సు కాలుకింద నణచియుంచెను. ఇంతలో నలుగురు స్నేహితులును, మూడు నాలుగు వైను బుడ్లను తిరిగి ఖాళీచేసిరి. తరువాత సిగరెట్ల వాసనలతో గదియంతయు నిండియుండెను. దినకరరావుకు నిషా హెచ్చినది. అట్టి సమయమందెట్టి మధుర భాషణలు నోటినుండి వచ్చునో మనకందరికి దెలుసునుగాన విస్తరించి వ్రాయ నవసరములేదు. ఏలాగుననో హోటలులోని నౌకరుల సాహాయ్యమువలన ఆ నలుగురును అద్దె బండ్లలోబడి వారివారి యిండ్లకు జేరిరి.

వీరు వెళ్ళిన తరువాత ఆ గదినూడ్చుటకయి వచ్చిన యొకపనికత్తెకొక యుత్తరము దొరికినది. దానిని దీసుకొని వెళ్ళి ఆ స్త్రీ యొక గుమాస్తాకిచ్చెను. ఆ యుత్తరమునందు అయిదురూపాయల నోట్లు రెండును, తెల్లతెల్లబోయిన సిరాతో నొక స్త్రీ వలన వ్రాయబడిన మరాఠీ యుత్తరమును గలవు. ఆ యుత్తరములోనిట్లున్నది.

"నా ముద్దులబిడ్డా,

నీవు చెప్పిన ప్రకారము చేసితిని. నే చేసిన పనికి నీవు ముందెన్నడును తప్పులు పట్టకుందువుగాక. ఏమున్నను ఏమి పోయినను మనపూర్వులతిభద్రముతో వంశ ధనముగ గాపాడుకొనుచున్న పేష్వాబాజీరావిచ్చిన అమూల్యధనమును నేటికి మన హయాములో బోగోట్టుకొన వలసివచ్చెను గదా యని దుఃఖించుచున్నదానను. నేజేసిన యీ మహాపరాధమునకయి వారు దయ్యములై నన్ను బట్టుకొనకుందురుగాక యని

భవానీ తల్లికి మ్రొక్కుచున్నాను. అయినను నా తప్పేమి కలదు? నీ విప్పుడింటికి పెద్దవుగదా? నేనాడుదానిని, నీ యిష్టప్రకారము జేసితిని. ఆ వీరఖడ్గమునకు బంగారు పూతయు, కెంపులును ఉన్నను కాబూలీవాడు ప్రాతపడిపోయినదని 50 రూపాయల కెక్కువ సొమ్మీయలేదు. వీడుతప్ప మరెవ్వడును దానిని గొనలేదు. రహస్యముగా కొంగులో దాచుకొని రాత్రిపూట వానియింటికా కత్తిని దీసుకొనివెళ్ళుచుండగా నింకొక దారిని భవానీ దేవాలయమునకు బోయి అచ్చట నేల ఈ ఖడ్గముతో ఆ మాతయెదుట నా దరిద్రపు ప్రాణమును దృజింపరాదని పలుమాఱనుకొంటిని. ఇంతలో భవానీ యాలయ మెదుట ఎవరితో నేమి ఇట్టి మోసమును గురించి చెప్పినను మన పరువు పోవునని కుక్కిన పేనులా గూరకుంటి. నాయనా, నా దురదృష్ట మింతటితో దీరలేదు. ఏలాగుననో నా వద్ద రూపాయలున్న సంగతి బియ్యపువానికిని, ఇంటివారికిని, గుడ్డలిచ్చిన వానికి, పాలవానికిని దెలిసి వారి వారి సొమ్మీయమని బాధపెట్టిరి. వారిని బంపివేయుటకు దీర్ఘకాలపు టప్పులగుటచేత ముఖము జెల్లక ముప్పది రూపాయలిచ్చి పంపి వేసితిని. నీకు బంపవలసిన సొమ్ములో దక్కువ యయినను, నాయబ్బాయ, నేను ఋణవిముక్తనై నిబ్బరముగా నిద్రింప జాలినందులకు నీవయినను సంతోషించ కుందువా? అయ్యో! దేవుడా! సుఖమైన నిద్రా, యీ పాపికి!! అట్టి వంశ ధనమును యమ్మిన పాపిష్టిదానికి సుఖనిద్ర పట్టునా. ఆ ఖడ్గము చేతి నుండి పోయినను హృదయములో జేరి పొడుచుచున్నది, కుదవయయిన బెట్ట కేల యమ్మితిని? అప్పుడు నీవు పంపమనిన యేబది రూప్యములను తాకట్టు క్రింద నీయనని నాడు. ఇక మిగిలిన యిరువది రూప్యములును నీకు బంపవలయు ననుకొంటిని. ఇంతలో సంవత్సరాది పండుగ యగుట వలనను, వారును నీవలెనే నా కడుపున బుట్టిన వారగుట చేతను, అత్తవారింఢ్లకు బంపినది మొదలు ఒక్క పండుగకైనను బిలిచి యింత పసుపు కుంకుమ మనమింత వరకు బెట్టనందువలనను, ఇదియే నా కడపటి సంవత్సరాది పండుగయని నా దృఢ నమ్మకమగుట చేతను, ఇక దిరిగి వారినీలోకములో బిలిచి పెట్టబోనుగదాయని చెరి యయిదు రూపాయల చీరలను గొని పంపితిని. నీ ముద్దుల చెల్లెంద్రకిట్లు పంపినందుకై నన్ను శపించకుందువు గాకయని వేడుకొనుచున్నాను. నాకును గట్టి బట్టలు లేవు. అన్నియు చినుగులే. అతుకులు వేసుకొని కాలక్షేపము జేయుచున్నాను. నేను మూడు రూపాయల కయినను ఒక్క చీరెను కొనుక్కొన వలయుననుకొంటిని కాని నీ స్వభావము చేత నా కొరకయి చీరెను కొననయితిని. మిగిలిన అయిదు రూపాయల రెండు నోటుల నిందుతో జతపరచి పంపితిని. నాయనా,

ఈ పది రూపాయలతో సంవత్సరాది పండుగకు క్రొత్త బట్టలను కొనుక్కొనుము. వానిని కట్టుకొనునప్పుడు ఒక్కసారి యయినను నీ ప్రియమయిన తల్లిని తలంచుకొంటివేని ఆమె కృతకృత్యురాలు.

బొంబాయి వంటి మహా నగరములో పది రూపాయలొక లెక్కలోనివి కావు. నీ వనేక పర్యాయములనునట్లు అవి ఆ వెధవ పదిరూపాయలే. కాని, సర్కారు వారిచ్చుచున్న ఆరు రూపాయల వితంతువుల పింఛనులో నెలకు సగము భాగము మూడు రూపాయలు నీకు బంపుచు మిగిలిన మూడు రూపాయలతోనే ఈ పాడు కఱవు దినములలో బ్రతికియు బ్రతుకక, చచ్చియు చావక, కాలక్షేపము జేయుచున్న నీ తల్లి అట్టె నిందార్హురాలు కాదని నీ యంతరాత్మ చెప్పక పోవునా?

తండ్రీ, నేను చేసిన దానిలో నేదయిన తప్పున్నచో నన్ను క్షమించుము. దేవుడు నిన్నెల్లప్పుడును రక్షించుచుండును గాక! నేను చచ్చిపోవు లోపల ఒక్క సారయినను వచ్చి చూచి ముద్దిచ్చెదవేని శాంతముతో జచ్చిపోగలను.

ఇట్లు

నీ ప్రియజనని

## కథానేపథ్యం ...

కోటంరాజు పున్నయ్య (1885–1948) స్వాతంత్ర్యోద్యమం నాటి అఖిల భారత పత్రికారంగంలో అత్యంత ప్రతిభావంతుడు. 'కలమే నా కత్తి' (పెన్ ఈజ్ మై స్వోర్డ్) అని స్వీయ చరిత్ర రచించిన సుప్రసిద్ధ పత్రికా సంపాదకుడు కోటంరాజు రామారావు పున్నయ్యగారి సోదరుడే. ఆనాటి పత్రికా సంపాదకులలో రామారావు జాతీయ స్థాయిలో ప్రాముఖ్యమూ, కీర్తి పొందినవాడు. వీళ్ళ స్వస్థలం చీరాల. కోటంరాజు పున్నయ్య స్వయంకృషితో స్వావలంబనతో పత్రికారంగంలో ఉన్నతోన్నత స్థానాన్ని అధిరోహించాడు. ఆయన ఉన్నత పాఠశాలలో కాని, విశ్వవిద్యాలయాలలో కాని

ఉన్నతవిద్య నార్జించలేదు. అంతా స్వయంకృషే. బొంబాయిలో కాయకష్టం కూడా చేసి బతికినవాడు. 'సాధువాస్వానీ' అనే జాతీయోద్యమ ప్రముఖులు, స్వాతంత్ర్యోద్యమ కాంక్షాశీలి పున్నయ్య ఇంగ్లీషు శైలీ, భావావేశ తీవ్రత మెచ్చుకొని 1918లో తాను స్థాపించిన 'న్యూ టైమ్స్' అనే వార పత్రికకు పున్నయ్యను సంపాదకుణ్ణి చేశాడు. ఆ తరువాత అదే 'సింధ్ అబ్జర్వర్' అనే దినపత్రికగా వెలువడింది. ఆ పత్రిక సంపాదకుడూ పున్నయ్యే. నిర్భయంగా, కొరడాతో కొట్టినట్లు బ్రిటిషు ప్రభుత్వాధికారులను గురించి పున్నయ్య తన పత్రికలో వ్యాఖ్యలు చేసేవాడు. ఆయనకు గవర్నరులే భయపడేవారు. పున్నయ్య ప్రతిభను, సామాజికసేవను మెచ్చి కరాచీ నగరంలో ఒక ప్రాంతానికి 'పున్నయ్యపూర్' అని పేరు పెట్టినట్లు ఆయన గురించి వివరాలు రాసినవాళ్ళు చెప్పారు.

పున్నయ్యకు బ్రహ్మసమాజం పట్ల తాదాత్మ్యం ఉండేది. ఆంధ్రపత్రికలో కూడా పున్నయ్య నాలుగైదు సంవత్సరాలు పని చేసినట్లు తెలుస్తున్నది. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిని కథారచయితను చేసింది పున్నయ్యగారే. శ్రీపాదతో మొదటికథ రచింపచేసింది కూడా ఆయనే.

ఈ కథ వ్యంగ్యాత్మకం, కులం ఉద్ధరించేవాడు పుట్టాడు అని ధ్వని. ఇంగ్లీషు విద్య నాగరికత, వేషభాషలు, భారతీయ విద్యాధికులను తొలినాళ్లలో ఎలా ఆకర్షించాయో, వాటి మీద మోజుతో ఎలా అనుకరించేవారో వాళ్ళు ఎంత పతనావస్థకు దిగజారిపోయారో ఈ కథ అత్యంత కరుణాస్పదంగా వర్ణించింది. కథా రంగస్థలం ఆనాటి బొంబాయి నగరం కాబట్టి ఒకనాడు పరువు ప్రతిష్ఠలతో, ఆత్మశీలంగా బతికిన మహారాష్ట్రుల కుటుంబాలు ఎంతటి అధోగతికి, ఎంతటి దయనీయ స్థితికి, పరితాపకర పర్యవసానానికి చేరుకున్నాయో బలంగా చిత్రించారు పున్నయ్య. ఆయన కథారచన కొనసాగించి ఉంటే మరెన్నో ఉత్తమకథలు రాసి ఉండేవారనిపిస్తుంది, ఈ కథ చదివినప్పుడు.

# 11. నేను చేసినపని

*– గుడిపాటి వెంకటచలం*

**జ**డ్జీగారూ, నాకు మీరు ఉరిశిక్ష వేస్తారు అంతేనా? కానీండి! నేను చేసిన పనికది తగిన శిక్షేనని నేనిప్పుడే ఒప్పుకుంటున్నాను. కాని తక్కినవాళ్ళు చేసిన పనులకి యేం శిక్ష వేస్తారు? వాళ్ళనసలు కోర్టుకి రప్పించనేలేదే? మీ 'లా' ప్రకారం వాళ్లు చేసినవి తప్పులన్నా కావే? పోనీండి. హత్య చేశాను. కాని చేసినందుకు నాకు ఒక్కరవ్వ దిగులు లేదు. నేను పుట్టిన తరువాత చేసిన మహా సుకృతమదొక్కటే. స్వర్గమే వుంటే, న్యాయం విచారించే దేవుడే వుంటే, నాకు వెంటనే స్వర్గమిస్తాడు. నేను చేసిన పని నన్నానందంలో ముంచేస్తోంది.

ఈ ఘోరానికంతా నా భార్య కారణం. నా చెల్లెలిని బీద కుటుంబం వాళ్ల కిచ్చాము. దానికి ఒక్కడే కొడుకు. నా చెల్లెలిని నా బావని చూస్తే నాకెంతో ప్రేమ. నా కిద్దరు కూతుళ్ళు. నా పెద్ద అమ్మాయిని తన కొడుకు రాముడికిమ్మని అడిగింది. నాకు చాలా సంతోషమయింది. కాని చివరకు వీలయింది కాదు. కారణం నా భార్య అల్లరి. యేం చెయ్యను? సంసారములో శాంతి వుండాలా? వేరే సంబంధము చేశాను, డబ్బున్న వాడికి. యింతలో మా బావ పోయినాడు. నా చెల్లెల్ని వొచ్చి మా యింట్లోనే ఉండమన్నా. కాని తెలివి కలది. నా చెల్లెలొప్పుకుంటుందా? నా భార్య సంగతి తెలియదూ? నమస్కారం పెట్టి రానన్నది. కాని పాపం భర్త పోయిన యాడాది లోపలనే ఆ దిగుల్లోనే అదీ పోయింది. పోయేముందు, నాకు తన కొడుకుని పదహారేళ్ళ వాణ్ణి అప్పగించి, చిన్నమ్మాయినిచ్చి అతనికి పెండ్లి చెయ్యమని కాళ్లు పట్టుకుంది. తలుచుకుంటే నా కళ్ళంబడి యిప్పుడు నీళ్లు కారుతున్నాయి. సిగ్గుతో నా మొహం మాడిపోతోంది. ఆ పెళ్లీ, నా భార్య పడనీదని నాకు అప్పుడే తెలుసు. అయినా చావు మంచం మీదా నా చెల్లెలట్లా వేడుకుంటే నేనేం చెప్పను? అంది కదా, "తల్లీదండ్రీ లేని వాడికి నువ్వుగాక దిక్కెవ్వరన్నయ్యా! నీ హృదయం మంచిదే. కాని వొదిన అట్లా విరుద్ధంగా వుంటే నువ్వేం చెయ్యగలవు? రాముణ్ణి యింట్లో ఉండనిస్తుందా? అమ్మణ్ణిచ్చి చేస్తే అల్లుడని వదినకు కూడా దయ వొస్తుంది. నా మీద వొట్టెయ్యిస్తానని" అంది.

రాముడు మా యింట్లోనే పెరిగాడు అప్పణ్ణించి. నా రెండో అమ్మాయి అమ్మన్న మీద నాకు చిన్నప్పటినించి చాలా ప్రేమ. తండ్రీ కూతుళ్ళ కంటే స్నేహితులలాగుండే వాళ్ళము. యిద్దరం భారతం, రామాయణం కలిసి చదువుకున్నాము. ఒక్కరోజు నేనూళ్ళో లేకపోతే గిజగిజలాడేది. యిప్పుడు మాతో రాముడు కూడా కలిశాడు. నా భార్యకి రాముణ్ణి చూస్తే నిష్కారణంగా ద్వేషం. ఆమె తిట్లు తప్పించుకోడానికి ముగ్గురం యే మూలో, దొడ్లో యే చెట్టుకిందో చేరేవాళ్ళం. కథలూ, కబుర్లూ, నీతులూ, మహాత్ముల చరిత్రలూ అన్నీ చదివి, చర్చించుకునేవాళ్ళం. రాముడంత మంచి కుర్రవాణ్ణి నేనెన్నడూ చూడలేదు. చాలా బాగా చదువుకునేవాడు. వూళ్ళో అందరికీ అతని మీద ప్రేమ, నా భార్యకి తప్ప. అతనడకువగా వున్న కొద్దీ ఆమెకు కోపమెక్కువయ్యేది.

మొదటి నుంచీ అందరితోనూ అమ్మడికీ రాముడికీ సంబంధం నిశ్చయమైనట్లే మాట్లాడుతూ వచ్చాను. నా భార్య మాత్రము మాట్లాడేది కాదు ఆ విషయమై. అమ్మడికి పదకొండేళ్ళొచ్చాయి. వైశాఖ మాసంలో ముహూర్తం పెట్టాను. నా భార్య ఆ విషయమై యేమీ జోక్యం కలుగచేసుకోలేదు. నాకు చాలా సంతోషమయింది. అంత సులభంగా పోనిస్తుందని యెన్నడూ నేననుకోలా.

మాఘమాసంలో నా భార్యా, అమ్మన్న బావమరిది పెళ్ళికి వెళ్ళారు. రాముడూ నేనూ ముసలమ్మా మాత్రమే ఇంట్లో వున్నాము. నా కుటుంబము తిరిగి వొచ్చారు. అమ్మడు బండిలోంచి దిగింది. నా కళ్లు తిరిగిపోయినాయి. కిందపడిపోయినాను. పసుపుచీరా, మెళ్ళో బంగారు చిప్పలూ, నల్లపూసలూ, అమ్మన్న తయారయింది. రాగానే నన్ను కావిలించుకుని బిగ్గరగా యేడ్చింది. చిరునవ్వు నవ్వుకుంటూ, కులుకుతూ, బనారసు చీర కట్టుకుని, ఆ బట్టతలా, పీచు జుట్టూ, చీకిరి కళ్లేసుకుని, యిప్పటికలల్లో యే మొహం మహాద్వేషం పుట్టిస్తో వుంటుందో, ఆ భార్య దగ్గరికొచ్చింది. 'మీతో చెప్పకుండా యీ పని చేసినందుకు క్షమించాలి' అంది. అనకుండా యింటోకి పోతే సహించేవాణ్ణే యెట్లాగో వొకలాగు. ఆ మాటతో తోచింది నాకు, మొగవాడికి బలమెందుకుందో, రోడ్డుమీదే యీడ్చి దవడమీద కొట్టాను. అదిరి కిందపడ్డది. అదే నేను మొదటిసారీ, ఆఖరుసారీ ఆడదాన్ని కొట్టడం.

పాపం, నాన్నతో చెపుతానని అమ్మడు పెళ్లిముందు చాలా యేడ్చిందట. ఆ పెళ్లి నేను రద్దు చేయించవొచ్చని కూడా అన్నారు కొందరు. కాని ఆ ధైర్యం నాకు లేకపోయింది. అంతమాత్రం ధైర్యముంటే సంగతులిట్లా యెందుకు తటస్థిస్తాయి?

కనపడ్డప్పుడల్లా రాముడు దిగులుతో నావొంక చూస్తున్నాడు. అమ్మన్న ఒకటే యేడుపు. వాళ్ళయిద్దర్నీ నా భార్య ఒకటే తిట్లు. రాముడి మొహం చూసినప్పుడల్లా, నా చెల్లెలూ, ఆమె మరణశయ్యా, నా వాగ్దానం, అన్నీ జ్ఞాపకమొచ్చేవి. అమ్మన్నా రాముడూ ఒకరితో వొకరు మాట్లాడుకోడం మానేశారు. రాముడి స్థితి మా యింట్లో మరీ దుస్సహమయి పోయింది. నా భార్య వాణ్ణి యెదురుగా నానాతిట్లూ తిట్టడం మొదలుపెట్టింది. యేమన్నా అంటే రాగాలూ, రోడ్డుమీద అరవడమూనూ? యేం చెయ్యను? రాముడు నా యింట్లోంచి వెళ్ళి వేరే గదిలో వుండి, భోజనానికి మాత్రం వొచ్చేవాడు. ఇంకా రోజులెట్లా గడిచాయో తెలియదు.

పెళ్లయిన యేడాదిలోపుగానే నా భార్య చనిపోయింది. కాని ఇప్పటికీ దానిమీద నాకు కోపం పోలేదు. ఈ దుర్దశకంతా అదే కారణం. ఇంక ఆ అల్లుడితో వ్యవహారాలు నా నెత్తిన పడ్డాయి. ఆయన పేరు నాగేశ్వర్రావు. వకీలు. ఆయన తాతో, ముత్తాతో, డిప్యూటీ కలెక్టరు పని చేశాడట. అదీ గర్వం. అతనొక్కడే ఈ లోకంలో బి.యల్. అయినట్లు మాట్లాడేవాడు. అమ్మన్నకి నా ఆస్తిలో సగం భాగం వ్రాయించి యిస్తానని నా భార్య అతన్తో చెప్పిందట. రాముడికి ఈ ఆస్తి యిస్తానేమోనని ఆ అల్లుడికి బెంగ పట్టుకుంది. ముందే తనకు సగం ఆస్తి వ్రాసియ్యమన్నాడు. వీల్లేదంటే, పోట్లాడాడు. అడ్డమైన తిట్లూ తిట్టాడు. దావా తీసుకొస్తానన్నాడు. యేం చెయ్యను? ఛండాలుడు, పరమనీచుడు. బానిస కావడం మంచిది, ఈ దేశంలో ఆడపిల్ల తండ్రి కావడంకంటే. అన్ని తిట్లూ తినీ వూరుకున్నా.

అమ్మన్న నత్తవారింటికి పంపాను. నేను ఆస్తి వ్రాసియ్యలేదనే కోపంతోనూ, అమ్మన్న మెత్తని స్వభావాన్నీ చూసి, అత్తమామలూ, తోడుకోడళ్ళూ బాధించడం మొదలుపెట్టారు. నన్ను బతిమాలి ఆస్తి వ్రాయించి యియ్యమని అమ్మన్నని బలవంతం చేశారు. దాని చాతే, పెడుతున్న బాధలూ, పెట్టనివీ, అన్నీ నా గుండె బద్దలయ్యేట్టు వుత్తరాలు వ్రాయించారు. నేనావూరు వెళ్ళి దాన్ని పంపమని అడిగాను. ఆస్తి రాసిస్తే పంపుతామన్నారు.

ఒక యాడాది అయింతరవాత అమ్మన్న గర్భిణితో ఉందనీ కాన్పుకి తీసికెళ్లమనీ వ్రాశాడు. చాలా సంతోషంతో తీసుకొచ్చాను. అమ్మన్న అత్తవారింటికెళ్లింతరవాత నా ఒంటరితనాన్ని చూసి జాలిపడి, రాముడు నా యింట్లోనే ఉన్నాడు. ఆ ఊళ్లో కలెక్టరాఫీసులో హెడ్ గుమాస్తా ఉద్యోగం. అతను పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి సంగతెత్తితే

మాట్లాడేవాడు కాదు. యెదిగిన కూతుళ్ళకి మొగుళ్ళని వెతికే దౌర్భాగ్యుల్ని గుమ్మం తొక్కితే తిట్టి వెళ్ళకొట్టేవాడు. యెదిగినవాడు ఒంటరిగా అట్లా బ్రహ్మచారిగా కాలం గడుపుతో వుంటే నాకు యెంతో దిగులేసేది.

అమ్మన్నని తీసుకొచ్చినరోజు మా యిద్దరికీ పెద్ద ఉత్సవం లాగుంది. అమ్మన్నకి పరిచర్య చెయ్యడానికి ఒక ముసలమ్మని తీసుకొచ్చాము. రాముడు ఆఫీసునించి రాగానే, ముగ్గురం, యేవో, పిచ్చి ఆటలు ఆడేవాళ్ళం. చదువుకునేవాళ్ళం. మాట్లాడుకొనేవాళ్ళం. అమ్మన్న యేమన్నా చెయ్యమని అడిగితే చాలు. యిద్దరం పరిగెత్తుకెళ్ళేవాళ్ళం. యేది కావాలంటే అది యిద్దరం కొనుక్కొచ్చి యిచ్చేవాళ్ళం. ఒకరోజు అమ్మన్న "నాన్నా, పుట్టినప్పణ్ణించి యింత సౌఖ్యము యెరగను. యిద్దరు మొగాళ్ళు నాకిట్లా సేవ చేస్తూవుంటే రాణిలాగుంది నాపని" అంది అమ్మన్న వెళ్ళి పొయ్యేరోజు తలుచుకుని వొణికాను.

కొద్ది రోజుల్లో కొత్త విషయం ఒకటి సంభవించింది. ప్రేమ దాగడం కష్టం. మధురస్వరాలతో మోగుతుంది. మృదుదృష్టులతో ప్రకాశిస్తుంది. అమ్మన్నకీ రాముడికీ యెప్పుడూ ఒకరిమీదే ఒకరికి కళ్ళు. నాకు భయమేసింది. కాని తండ్రిని నేనేమనను? అయినా మునిగిపోయిందేముంది? వాళ్ళకి చెడ్డ తలపులున్నాయని నేను ముందే యెందుకనుకోవాలి?

ఇంతలో కాన్పొచ్చింది. మేమిద్దరం ముసలమ్మల్లాగ గది తలుపు దగ్గర కూచున్నాము. వొణుకుతో, అమ్మాయి ఒక మూలుగు మూలిగినప్పుడల్లా మేమిద్దరం చెరివొక పెద్దమూలుగు మూలిగేవాళ్ళం. ఇద్దరం చెరో మంత్రసాన్నీ, చెరో డాక్టర్నీ యేర్పరిచాము. యేమీ అక్కర్లేకపోయినా. యేదో అమ్మన్న కాన్పుకి మా యిద్దరి అవసరం వున్నట్లే యిల్లంతా పరిగెత్తాము. నేను వేణ్ణీళ్లుమంట పెట్టాను. రాముడు కాఫీ కాచాడు. యిద్దరం తలుపు దగ్గరికెళ్లి 'వేన్నీళ్ళు కావాలా', 'కాఫీ కావాలా?'అన్నాము. వాళ్ళు నవ్వారు. రెండూ అక్కడ పారేసి యెవరికోసమో వెళ్ళినట్టు వూళ్ళో కొంచం తిరిగేదీ, మళ్ళీ పని ముంచుకపోయినట్లు ఇంటికొచ్చి "యెట్లావుంది?" అని అడిగేదీ. అట్లా గడిపాము ఆ రాత్రంతా. "రేపుగాని కానుపు గాదు. వెడతానని' మంత్రసాని అంటే బయట తలుపు తాళమేసి, ఆ లావాటిదానికి అడ్డమయిన చాకిరీచేసి యింట్లోనే వుంచేశాము. చివరికి ఆట్టే కష్టం లేకుండానే కన్నది. ఆడపిల్ల పుట్టింది. కాని నాలుగో రోజునే అమ్మన్నకి వాతం కమ్మింది. మా యిద్దరిలో వొకరికంటే వొకరికి మతిపోయింది.

అత్తవారికి టెలిగ్రాము యిచ్చాము. ఒకరూ రాలేదు. ఆ డాక్టర్లని కదలనియ్యము. పదిరోజులు మేముపడ్డ వేదన యింతంత కాదు. చివరికి నెమ్మదించింది. ఇద్దరం మొక్కుబళ్ళూ, సమారాధనలూ, పూజలూ చేయించాము.

రాముడు నెలరోజులు సెలవుపెట్టి అమ్మన్న నిద్రపోకుండా చదువుతో అక్కడే కూచునేవాడు. అమ్మన్నని వొక్క నిముషం వొదిలి వుండడు. వాడి కళ్ళల్లోనే వాడి మోహమంతా తెలుస్తోంది. కాని అమ్మన్న మా యిద్దరినీ మరిచిపోయింది. ఆ బిడ్డే లోకం. ఒకరోజు నేనట్లావెడుతోవుంటే అమ్మన్న కోపంతో అంటున్న యీ మాటలు వినపడ్డాయి. "వొద్దన్లేదూ? అట్లా చేస్తే యిక్కడికి రావొద్దు". అప్పటినుంచి అమ్మన్నని చూస్తే నాకో విధమైన భక్తి యేర్పడ్డది. రాముణ్ణి చూసినకొద్దీ జాలివేసేది. వాడు సంతోషంగా వుండడమే మానేశాడు.

ఇంతలో అత్తవారు బారసాల చెయ్యమని వుత్తరం రాశారు. మంచిరోజూ అది చూసి వుత్తరం రాయాలనుకొంటూ వుండగా, హఠాత్తుగా చంటిపిల్లకి జబ్బుచేసి పోయింది. అమ్మన్న చాలా యేడ్చింది. దాన్ని చూస్తే మా యిద్దరికీ యేడుపాగలేదు. అత్తవారు ఒక్కరూ రాలేదు. బారసాలకైతే వస్తామన్నారు. కొత్తబట్టలొస్తయ్యనేమొ? యిప్పుడెందుకొస్తారు? యిట్లా మరికొన్ని రోజులు గడిచాయి. అమ్మన్నని అత్తవారింటికి పంపవొద్దా అని ఆలోచన తట్టింది.

ఇట్లా వూరుకుంటే వాళ్లు పంపమని అడిగేట్టే లేరు. అమ్మాయితో ఆ మాటంటే వాళ్లకి లేని తొందర నీకెందుకంది. అవును యెందుకు పంపడం అడిగింది. యిట్లా వుంటేనేం అనుకున్నా? అమ్మన్న వెళ్ళడం నాకూ యిష్టం లేదు. అమ్మన్నకీ యిష్టంలే. వాళ్లకది అక్కర్లేదు. యింక వెళ్లటం యెవరికోసం? సంబంధంలేని యీ లోకం కోసం. పొరుగింటి పుల్లమ్మ యేమనుకుంటుందో అని పంపాలి. అదిగాక అమ్మన్న యిప్పుడు అట్లా అంటుందిగాని, భర్తని వొదిలి యెన్నాళ్లని యిట్లా వుండగలదు?

యింతలో యింకో విషయం తెలియడం మొదలువెట్టింది నాకు. పిల్లపోయిం తరవాత సందర్భాలు మారాయి. అమ్మన్న రాముణ్ణి వొదలడం లేదు. తన బిడ్డమీది ప్రేమంతా రాముడికిచ్చేసింది. వాణ్ణి కచేరికెళ్లనీదు. యింకొక పని చెయ్యనీదు. తనతో నవ్వాలి. కబుర్లు చెప్పాలి. యిద్దరూ నన్ను మరిచిపోయినారు. నేను దగ్గిర లేకపోతే బావుంటుంది. మోహమంత స్వార్థపరమైనది. యింకోటి లేదు. యేమవుతుందో అని నాకు భయం చాలా యెక్కువయింది యెట్లానన్నా విడతియ్యాలి కాని ఆ సంతోషాన్ని

యెట్లా చేతులారా చెడగొట్టను? తప్పే కావొచ్చు నాకున్నదల్లా వాళ్ళిద్దరు. వాళ్ల సౌఖ్యం కాకపోతే, నాకింకేం కావాలి? యిద్దరినీ యెడబాపి ఆ దుఃఖం చూసి సంతోషించనా? నీతి కోసం ఆ పనిచేసి ధైర్యవంతులమని, నీతివంతులమని సంతోషించేవారుంటారు. కాని నాకు చాతకాలేదు ఆ పని. చివరికి రోజూ మించిపోతున్న ఆ అన్యాయాన్ని చూసి ఓర్చుకోలేక కళ్ళుకుట్టి నీతికీ ప్రతిష్ఠకీ జడిసి, హృదయం రాయి చేసుకుని, అత్తవారికి అమ్మాయిని వెంటనే తీసికెళ్ళమని రాశాను. జవాబు రాలేదు. మళ్లీ మళ్లీ రాశాను. చివరికి అంత జరూరయితే తీసుకొచ్చి దిగపెట్టమన్నారు. వాళ్ళిద్దరితోనూ అత్తవారు తొందరచేసి రాస్తున్నారని అబద్ధాలు చెప్పినాను. అటు తరువాత నా మీద నాకే గౌరవం పోయింది. కటికవాడి పని, నీచమైన దొంగపని చేసినట్లయింది. కళ్లెత్తి వాళ్ల మొహాలు చూడలేకపోయినా. కాని అమ్మన్న యెన్నాళ్లకీ కదలలేదు. యెంత బలవంతం చేసినా ప్రయాణం కాదు. చివరికి నేనింట్లో వుండడం నీకిష్టం లేనట్టుందే నాన్నా! అని, వెడతాలే నిశ్చింతగా వుండు, అని ప్రయాణమయింది. నాకేడుపొచ్చింది. యిద్దరూ ఒక దేహం చీలిపోయినట్లు బాధపడుతున్నారన్న సంగతి నాకు తెలుసు. నీతి, ధర్మం, పాతివ్రత్యం యీ పేర్లు జపం చేస్తో నేను నా మనసులోంచి, కరుణనీ ప్రేమనీ చంపేసి, అమ్మన్నని తీసికెళ్ళి అత్తవారింట్లో దిగపెట్టి వొచ్చేశాను.

రాముడు నాతో సరిగా మాట్లాడం మానేశాడు. యేం చెయ్యను? లోపల కుళ్ళుతూ వూరుకున్నా. నేను చేసిన పాపం నా పెళ్లాన్ని తెచ్చిపెట్టిన దౌర్భాగ్యం. నా యిద్దరు పిల్లల గొంతుగోసింది. అమ్మడు రాముడికి ఉత్తరాలు వ్రాయడం మొదలు పెట్టింది. అతను ఆ వుత్తరాలలో భాగాలు కత్తిరించి నా ముందర పడేసి వెళ్లేవాడు. అమ్మన్న భర్తకు ఒక తమ్ముడుండేవాడు. అతను చనిపోయిన తరువాత నా అల్లుడు తమ్ముడు భార్యను తన యింట్లో అట్టిపెట్టేసుకున్నాడు. యిప్పుడు అమ్మన్న మొహాన తిట్లు చివాట్లు తప్ప యింకేమి లేవు. కొట్టడం కూడా మొదలు బెట్టాడని వ్రాసింది. యిక్కడ రాముడు రోజురోజుకూ చిక్కిపోతున్నాడు. నాతోయేదో మాటలాడడానికి చూస్తాడు. మళ్లీ మానేస్తాడు. నాకు భయమేసింది. ఉద్రేకములో యేమి మాట్లాడేస్తాడో అని. చివరకి ఒకరోజు రాత్రి యెత్తాడు.

“అమ్మన్న స్థితి చూశారు కాదూ? తీసుకురారేం?”

“తీసుకొచ్చి యేమి చేసుకోను? భర్తని వొదిలి యెన్నాళ్లని వుంటుంది?”

“ఆ భర్త దగ్గరవుండి లాభమేమిటి? చాకిరీ, దెబ్బలాట తప్ప”

"లోకం"

"వెధవలోకం. అమ్మన్నని ఆ పెనిమిటి సరిగా చేసేట్లు చెయ్యదేం? వెళ్లనో అని యేడుస్తున్నదాన్ని లాక్కెళ్లి దిగపెడితిరి. యిప్పుడిట్లా వూరుకుంటారా?"

నేనేమీ మాట్లాడలేదు. నేను పడే బాధ రాముడికేం తెలుసు? నా యిద్దరు పిల్లలూ నామీద విరోధం కడితే నేను బతకడమెందుకు? నాకింక లోకమేముంది? అన్యాయంగా నా మూలంగా లోకాన్ని చూస్తే నాకున్న జడుపు మూలంగా కద నా బిడ్డలిద్దరూ యిట్టా కష్టపడుతున్నది? నీతి అని పేరుపెట్టి వాళ్ల ఖర్మమని సమాధాన పరచుకుని వూరుకునే తల్లిదండ్రులున్నారు. కాని యెందుకో నేనూరుకోలేక పోయినా అమిత బాధపడ్డాను. వారం రోజుల్లో అమ్మన్న నాకే రాసింది తన భర్త డొక్కలో తన్నాడనీ, యీసారి వాత పెడతానన్నాడనీ. తను బావిలో పడిపోతాననీ. యింక ఆ రోజల్లా యమబాధ పడ్డా. దాన్ని తీసుకురావాలని కూడా అనుకున్నా. కాని లోకం?

ఆ రాత్రి రాముడు యింటికి రాలేదు. యెవరినడిగినా తెలియదన్నారు. యీ భూమిమీద యెందుకున్నానా అనిపించింది నాకా రాత్రి. మర్నాడు సాయంత్రానికి అమ్మన్నని తీసుకొని రాముడు వొచ్చేశాడు. నాకు చాలా సంతోషమూ భయమూ వొచ్చాయి. అత్తవారు పంపనంటో వుంటే బలవంతముగా యిద్దరూ వొచ్చేశారు. యేమీ అనకుండా వూరుకున్నా. మళ్లీ అమ్మన్నని పంపే వుద్దేశ్యం నాకు పోయింది. వీళ్ళిద్దరూ కలిసి యెందుకుండకూడదు? అతను వేరే మనిషితో వున్నప్పుడు నా కూతురక్కడే యెందుకు పరిచర్య చేస్తో పడివుండాలి? భార్యగా యిచ్చానా దాసిగానా; నీతి శాసనంలో దాసిగా వుండననడం తప్పు గావచ్చు. కాని నా హృదయ శాసనంలో తప్పుగా కనపడటం లేదు. వీళ్ళిద్దర్నీ మళ్లీ విడతియ్యనా? నాకూ కరుణ వుంది. కొయ్యని కాదు. నేను ప్రేమ అంటే కొద్దో గొప్పో యెరుగుదును. పాతివ్రత్యంలో ప్రేమ యింకా చావలా.

రెండోరోజుకల్లా నా అల్లుడు వొచ్చాడు. అమ్మన్నని నొక్క నిముషం వొదలి వుండలేనట్లు వెంటనే పంపమన్నాడు. అమ్మన్న వెళ్లనంది. రాత్రి పడుకోవటానికన్నా అతని గదిలోకి వెళ్లలేదు. రమ్మన్నాడు. బలవంతం చెయ్యపోయినాడు. రాముడిమీద అతనికి చాలా అనుమానముంది. తన హక్కులో వున్న యీ నరమృగాన్ని తన బానిసని, తనకెంత మాత్రమూ అక్కర్లేకపోయినా సరే, తను పెట్టే తిప్పలన్నీ పడుతూ పడి

వుండలసిందేగాని, యింకోడు తీసుకోకూడదు. యింకొకరిమీద మనసు ఆ భార్యకు పుట్టకూడదు. దేహమే కాదు. మనసు, ఆత్మ. అన్నీ తనవే. తనకి కావలసినా సరే అక్కర్లేకపోయినా సరే.

చిన్నప్పుడు మా గ్లాసులతో మాకక్కర్లేనప్పుడు కూడా. యింకోళ్లని మంచి నీళ్ళు తాగనిచ్చేవాళ్ళం కాదు. మాకక్కర్లేకుండా పారేసిన పీలికనైనా సరే. యింకోడు మహాభాగ్యమని యేరుకుంటే, యిచ్చెయ్యమని పోట్లాడి దాచుకునేవాళ్ళం. మేము పెంచుతున్న కుక్కపిల్ల మేం దాన్ని తన్నినాసరే యింకోళ్ళవెంట పరిగెత్తితే వూరుకో గలమా? స్త్రీల విషయంలో యీ యెదిగిన మొగాళ్ళు కూడా చిన్న బిడ్డల స్థితిలో, అడవి మనుష్యుల స్థితిలో వున్నారు. అట్లాంటి స్థితిలోనే నా అల్లుడూ వున్నాడు. గదిలోపలికి అమ్మన్నని నెట్టాడు. రాముడు అడ్డుపడ్డాడు. యింక సరేసరి. తిట్లూ, నువ్వెవడవంటే నువ్వెవడవనడం. కొట్టుకోవడం కూడాను. నేనడ్డుపడి వొదిలించాను.

మర్నాడె అల్లుడు యెవర్నో పెద్దమనుషుల్ని తీసుకొచ్చాడు. అమ్మన్న వెళ్ళనంది. నేనూరుకున్నా. పోలీసు రిపోర్టు చేస్తానన్నాడు. యింకేం చెయ్యను? అమ్మన్నతో విశదంగా చెప్పి, వెళ్ళక తప్పదన్నా. వెడుతూ రాముడి వంక అమ్మన్న చూసిన చూపు మీరు నన్ను వురి తీసిన తరువాత కూడా జ్ఞాపకముంటుంది. ఆ చూపుతో నా మనస్సు పూర్తిగా మా అమ్మాయి దయిపోయింది. యింక రాముడు పడ్డ బాధ సరేసరి. తనదాన్ని చిన్నప్పటినించి తనని ప్రేమించినదాన్ని గొడ్డులాగా లాక్కుపోతే వాడికెట్లా వుందో? మా అమ్మాయి యెట్లా వోర్చుకుందో?

మూడోరోజుకి అమ్మన్న పరిగెత్తుకొచ్చింది. వాడు నా బిడ్డని పెట్టిన కష్టాలు మీతో నేను చెప్పగలిగితే చెవులు మూసుకొని పారిపోని వారుండరిక్కడ. ఆ నరహంతకుడు నా బిడ్డని తీసుకొని పోతూవుంటే చూస్తో వూరుకున్నానే అనే పశ్చాత్తాపంతో దహించుకుపోయినాను. రాముడు అన్నీ విని నా ముందరే అమ్మన్నని కావలించుకున్నాడు. యేమైనాగాని యింక నిన్నువదలను. లోకమంతా కలిసినా సరే. మన్ని వేరుచెయ్యలేరు. వెధవనైపోయి ఓసారి వూరుకున్నా. యీసారి ఈ గుమ్మములో అడుగుపెట్టాడంటే వాణ్ణి రివాల్వర్‌తో కాల్చిచంపి నిన్ను రక్షిస్తానన్నాడు. కాని ఆ పని వాడుచేస్తే తరువాత వాడు బతుకుతాడా వాడికి వురిపడుతుంది. యింక నేనా మిగిలేది? ఆ నిమిషంలోనే నేను చెయ్యవలసిందేమో నిశ్చయించుకున్నా. నా భార్య దొంగపెళ్ళిచేస్తే

వూరుకున్నా. నా బిడ్డని వాళ్ళు కష్టపెడితే వూరుకున్నా. రాముడి ప్రేమ పెరగకుండా అబద్ధపు వుత్తరాలు రాశా. నా అమ్మాయిని ఆ కటికివాళ్ల దగ్గిరికి పంపా. ఈ పరమ నరకపు కార్యాలకి లోబరచడానికి తీసుకుపోనిచ్చా. రాముడూ, అమ్మన్నా పడ్డ బాధలన్నిటికి నేనే కారణం. యీ పాపాలన్నిటికి యిప్పుడు పరిహారం కావాలి.

మర్నాటికే పోలీసువాళ్లని వెంటబెట్టుకుని నా అల్లుడు సిద్ధమైనాడు. అమ్మన్న రాకపోతే, ఆస్తి రాదని అతనికి బెంగ పట్టుకుంది. యిట్లా రమ్మని నా అల్లుణ్ణి పిలిచి అందరూ వినేటట్టు యిట్టా అన్నా. నీవంటి తుచ్ఛుడు యీ లోకంలో లేడు. దాన్ని ఆ బాధలన్నీ పెట్టిన కిరాతుడవు నువ్వు. ఆడదాని మొర వినే దిక్కులేని దేశం గనక నీ ఆటలన్నీ సాగాయి. 'లా' నీ పెళ్ళామని దాన్ని నీకిస్తుంది. యింకో పెద్ద కోర్టుంది. దానికి నిన్ను పంపిస్తున్నా. గదిలో రాముడు రివాల్వర్ కోసం వెతుకుతున్నాడు. తను సిద్ధంగా గుళ్ళుపెట్టి వుంచుకున్నది. నా చేతిలో వుందయ్యేను. పోలీసు యిన్‌స్పెక్టరు పని నేను చేసివుండటం యిప్పుడు పనికొచ్చింది. అల్లుడి గుండెల్లో కాల్చాను. చచ్చి కిందపడ్డాడు. రివాల్వరవతల పారేసి అమ్మడు వంక చూశాను. అది ఆ చచ్చినవాడి వంకన్నా చూడలేదు. అయ్యో నాన్నా! యేం చేశావంది.

"చావబోయే ముందు ఒక పుణ్యకార్యం చేశాను" అన్నాను. అంతే!

వురి తియ్యండి నాకేం చింతలేదు.

## సంపుటాలలో దొరకనికథ

చలం కథల సంపుటాలలో ఈ కథ దేంట్లోనూ చేరలేదు. ఆయన మొదటి కథల్లో ఇది కూడా ఒకటి కావచ్చు. స్త్రీ పురుషుల కామోద్వేగ ప్రవృత్తులకు సంబంధించిన కథ కాదు ఇది. ఆనాటి సమాజంలో కొందరు ఆడపిల్లల గృహ నరక యాతనలకు సంబంధించినది. సంప్రదాయ వివాహాల మేడిపండు తత్త్వం. బాల్య వివాహాలు, వాటి తాలూకు క్రౌర్యం. మరబొమ్మలలాగా మగువలు బతకాలని మగవాళ్ళు కోరుకోవడం, నిరంకుశమైన వాళ్ళ దురధికారం, నైచ్యం, అహంకారం,

కపటం, గృహహింస ఈకథలో వర్ణితం. అంతేకాదు. చాలా మంది ఆడవాళ్ళు కూడా అందుకు దోహదం చేసేవారు. అట్లానే బతుకులీడ్వాలని కోరుకొనేవారు. సాధారణ సంసారాల గృహవాతావరణం ఇట్లా ఉండేదని చలం కథల ఫిర్యాదు. వ్యక్తుల మధ్య నిష్కారణమైన ద్వేషాలు చిత్రించాడు. అజ్ఞానం, అసూయ, అణచివేతకు గురి అయ్యే సహజ ప్రవృత్తులు, జీవన్మరణ జీవచ్ఛవ నైరాశ్యాలు అప్పట్లో కొన్ని కుటుంబాలలో చోటుచేసుకున్నట్లు చలం తన కథలలో చిత్రించాడు. యథార్థ జీవన వ్యధార్త దృశ్యాలను బలంగా చిత్రించాడు కాబట్టి ఆయన కథలకంత గుర్తింపు వచ్చింది. నవవధువును ఆస్తి కోసం ఆరళ్ళు పెట్టే సన్నివేశాలు, అన్నిటికీ తెగించిన ఇప్పటి కొన్ని కుటుంబాలలో ఉన్నట్లే అప్పట్లోను ఉండేవి. కాకపోతే అటువంటి ఉదంతాలు అప్పుడు ఎక్కువగా ఉండేవి అనుకోవాలి. గృహహింస ఇప్పటికన్నా అప్పుడు సర్వసాధారణంగా ఉండేదని అనుకోవాలి. పురుషుడు ఎన్ని చెడుతిరుగుళ్ళు తిరిగినా అది సహజమే అనుకొనే వాళ్ళు. స్త్రీల నిర్బంధం కొన్ని సంసారాలలో దుస్సహంగా ఉండేది.

ఈ కథ ఒక కరుణజలపాతం. చలం రచనలలోని ఆవేశోద్వేగాలు ఈ కథలోనూ కనపడతాయి. తొలితరం తెలుగు కథలలో నిర్వహణ శిల్పం అట్టే కన్పించేది కాదు. అవి ముడిసరుకుతోనే తృప్తిపడేవి అనుకోవాలి. లేకపోతే ఈ కథకు ఈ పేరు పెట్టేవాడు కాడు చలం. ఈ కథను 'చలం' వాఙ్మూలంగా కోర్టులో జడ్జి ముందు చెపుతున్నట్లు రాశాడు. అప్పటి సమాజాన్ని తలచుకొంటే ఇప్పటికీ భయమేస్తుంది.

ఆడదాని మొర వినే దిక్కేలేని దేశం ఇది అని తన సమకాలీన సమాజాన్ని గూర్చిన చలం తీర్పు ఈ కథ. హృదయమున్నవాళ్ళను కదిలించి వేస్తుంది. స్త్రీని అజ్ఞానంలో ఉంచడం వల్లనే ఏ దేశానికైనా ఏ సంఘానికైనా విషాదకరమైన దుర్గతి అని ఈ కథలోని సందేశం. మహిళకు వివేకంతో కూడిన స్వాతంత్ర్యం ఆ సమాజ అభ్యున్నతికి ప్రధాన హేతువు అని చలం విశ్వాసం.

## తొలి కథల వివరాలు అలభ్యం

ఇంచుమించుగా ఇరవయ్యో శతాబ్ది ప్రారంభంలోనే తెలుగు కథ కూడా పుట్టిందని చెప్పాలి. అయితే ఇప్పుడు తొలి దశాబ్దపు తెలుగు కథల వివరాలు ఇదమిత్థంగా తెలుసుకొనే అవకాశాలు లేవు. ఆ పత్రికల్ని ఏ సంస్థలు కాని, వ్యక్తులు

గాని భద్రపరచలేదు. ఒకవేళ మచ్చుకు కొన్ని సంచికలు దొరికినా వాటిపై ప్రచురణ సంవత్సరం, మాసం, విషయసూచిక మొదలైన వివరాలు లభించవు. సాహితీ పత్రిక ప్రచురణ సంవత్సరం ప్రచురించేది కాదు. ఒకవేళ తెలుగు సంవత్సరమైనా ప్రకటించేదా అంటే కొన్ని సంచికల్లో ఆ వివరాలు కూడా ఇచ్చేది కాదు. కృష్ణా పత్రిక 1903లోనే ప్రారంభమైనా ఆ పత్రిక ముఖ్యంగా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చేది. పందొమ్మిదో శతాబ్ది చివరి దశకంలోనే 'తెలుగు జనానా' అనే పత్రిక వచ్చింది. ఈ పత్రిక సంపాదకులు మల్లాది వెంకటరత్నం. ఆ తరవాత నడపలేక ఆయన రాయసం వెంకటశివుడుగారికి ఈ పత్రికను ఇచ్చివేశారు. వెంకటశివుడుగారు వీరేశలింగం పంతులు అనుయాయి. శిష్యుడు. మహిళాభ్యుదయంపట్ల స్త్రీల విద్యా వికాసంపట్ల చాలా ఆసక్తి కలవారు. ఆయన కథా రచయిత కూడాను. ఆయనవి ఒకటి రెండు కథా సంపుటాలు వెలువడ్డాయి. వెంకటశివుడుగారి ఆత్మచరిత్ర 1933లో వచ్చింది. దీని ద్వారా ఆ కాలపు పత్రికా నిర్వహణ విశేషాలు చాలా తెలుస్తాయి. వీరేశలింగం పంతులు తెలుగు జనానా సహాయక సంపాదకులుగా కూడా బాధ్యత నిర్వహించారు.

తెలుగు జనానా ద్వారా ఇవటూరి కనకాచలం అనే కథారచయిత పేరు తెలుస్తున్నది. ఈయన పెద్ద కథ ఒకటి ఆ పత్రికలో వచ్చింది.

# 12. ఇంకొక విధము

**- విశ్వనాథ సత్యనారాయణ**

గోపీనాథుఁడు మలయగిరియును నెప్పుడును గలిసియే తిరుగుచుందురు. మలయగిరి కుడిచేయి గోపీనాథుని బుజమున కెడముగానున్న నిముసము మనము చూడలేము. మలయగిరి గోపీనాథుని "ఏమండీ"యని పిలుచును. ఇతరులతో చెప్పు నపుడు "వారు" అని ప్రశంసించును. గోపీనాథుఁడు మలయగిరిని "ఏమిరా" యని పిలుచును. గోపీనాథునకు సుమారు ముప్పదియేండ్లు. మలయగిరి పదునైదేండ్లవాడు.

వీరిరువురకును దేహములు మాత్రమే రెండు. మలయగిరికి గోపీనాథుఁడు తల్లిదండ్రులకన్న మాననీయుఁడు, ప్రేమాస్పదుఁడు. మలయగిరి సుకుమారమైన మొగముపైని వెన్నెల కసుగందకముందు గోపీనాథునకుఁ బ్రళయము చూచుటయైన నిష్టమే. గోపీనాథుఁడు మలయగిరితో మాటలాడుచున్నప్పుడాతనివదనము మలయగిరి మొగమున కెంతదూరముననో యుండదు. గోపీనాథుని చేతులకు పిన్నగాలికి కదలు మలయగిరి ముంగురులను సవరించుటయే పని.

సాయంసమయమందు బజారులోని గులాబి పువ్వులకు గోపీనాథుఁడు మలయగిరి కురులయందు ముడుచును. అప్పుడిరువురు నొకరినొకరు చూచుకొని నవ్వుకొనుచుందురు. ఎవరితోనైన గోపీనాథుఁడు మాటలాడుచు పోవుచున్న మలయగిరి యతని మోచేతికి తన మోచేయి తగుల్చును. ఒక్కొక్కప్పుడు మాటలాడుచునే తల్లిని బిల్లవలె మలయగిరి గోపీనాథుని యెదురుఱొమ్ముపై తన తల మోపును.

ఎప్పుడును తనమీద నొరిగి నిదురించు మలయగిరి కదలికల వలననే గోపీ నాథుఁడడిగిన కొలది మలయగిరి యియ్యక తానే యొలుచుకొనుచు నతని మొగము జూచి నవ్వుచుండును. గోపీనాథుఁడు బజారున నే వింత వస్తువు చూచినను నది మలయగిరికి తెచ్చిపెట్టకున్న నతనికి నిద్దురపట్టదు. ఒక్కొక్కపుడు గోపీనాథుని పైన దేనికేని కోపమువచ్చి తన్నినను గోపీనాథుఁడు పోనిమ్మని సంధికి చేయిచాచును.

మలయగిరిని కన్నీళ్ళతోఁ గవుగలించుకొనుచు అతఁడు పసివాఁడని గోపీనాథున కెక్కడలేని ప్రేమ.

గోపీనాథుఁడు ప్రసిద్ధనటుఁడు. సంగీతము లేదు కాని యతనియభినయము నభినందించని విద్యాధికుఁడు లేడు. అతని పేరు చెప్పిన డబ్బు కురియును. నాటక రంగమున నతని ప్రీతి భయప్రతిమానము. స్వభావసిద్ధముగ నతడు నటకుఁడగుటఁ దక్కినవాని కేమిగాని విద్యరానివాఁడైన యతని వాచకము ప్రశంసకందదు. అతడెప్పుడు నాటక మాడినను ప్రధాన పాత్ర యతనిది. తక్కిన వారినినెవరినో కూఁడగట్టి. తక్కిరిబిక్కిరిగా నాటకమాడును. నాటకము రక్తికట్టని రాత్రిలేదు.

ఈసారి "పారిజాతపహరణ" మాడుతలంపతనికి జనించినది. పాత్రలందరికిఁ బంచినాఁడు. మలయగిరి సత్యభామ వేయునట్లు. మఱునాటి నుండి మలయగిరిని తయారుచేయ మొదలుపెట్టినాఁడు. పాపమాతఁడు నోటమాట బట్టలేఁడు. వయస్సు చాలదు. ఎన్ని విధములనో ప్రయత్నమైనది. నాటకారంభమైనది. నిన్నటి నుండియు గోపీనాథునకు దిగులె. సత్యభామకు దగినవాఁడు దొరకలేదు. మలయగిరి పాడుచేయును.

నాటకమైపోయినది. జనులందఱు గుంపులు గుంపులుగా నిండ్లకేగుచున్నారు. ఎవ్వరినోట చూచినను "ఆ కుఱ్ఱవాడెవరు? ఆహాహా! ఎంత బాగుగానున్నది. ఆ మౌగ్ధ్యము. ఆ స్వభావానురక్తి. ఆ మధురిమ, ఆయమాయకత్వము ఇంత చిన్న వయసులో నింత నటుఁ డెట్లయైనాడు. భార్యాభర్తల యనురాగమువలెనున్నదే వారి నాటకము" అనుమాటయే.

## కథా నేపథ్యం ...

ఈ కథ రాసేనాటికి విశ్వనాథ సత్యనారాయణగారికి ఇరవై ఆరో, ఏడో ఏళ్ళుంటాయి. ఆయన ఇటువంటి కథ రాయడం విచిత్రమే. విపరీతమే. ప్రభావశీల మైన వయసున ఆయనకు నాటక సమాజాలతో బాగా పరిచయం ఉండి ఉంటుంది. ఆయన తెరచి రాజు అనే నవల ఒక ప్రముఖ నటుడి కథ అనే అంటారు. ఆధునిక

తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సృష్టించినన్ని పాత్రలు మరి ఎవరూ సృష్టించి ఉండరు. వెయ్యికిపైగా ఆయన తన సమస్త రచనలలోనూ పాత్ర సృష్టి చేసి ఉంటారు. మానవ అంతరిక, బాహిరప్రవృత్తులను ఆయనలాగా అర్థం చేసుకున్నవారూ, పాత్రీకరించినవారూ కూడా ఈ వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో అరుదుగానే కనపడతారు. ఈ కథ సాహితిలో వచ్చింది.

సాహితిలోనే ఇటువంటిదే ఆయన ఇంకొక కథ వచ్చింది. ఆ కథ పేరు 'భావనాసిద్ధి' స్త్రీలకే అంతటి సౌందర్యం, నైజమైన తళుకుబెళుకులు, మృదుత్వం, ఆకర్షణ ఎందుకు? నేను మాత్రం సాధించలేనా అని ఒక తరుణ యువకుడు రూపాంతర సిద్ధిని (మార్ఫోసిస్) సాధించిన కథ అది.

ఇప్పుడు ఈ కథ కూడా అటువంటిదే. స్వలింగ ప్రణయం అనేది ఊహకు కూడా సాహితీ లోకంలో చోటులేని ఆ రోజులలో విశ్వనాథ ఇటువంటి కథలు రాశాడు. అయితే ఈ కథకీ పేరు పెట్టడంలో ఆయన కథా రచన ప్రాథమికావస్థ వెల్లడవుతున్నది. అప్పట్లో వస్తువుపైననే కాని కథారచన శిల్పంపై ఆ తరం రచయితలకు సరి అయిన అవగాహన ఉన్నట్లు తోచదు. ఇద్దరు స్నేహితులమధ్య భార్యాభర్తల ప్రవృత్తి నిరూపించారీ కథలో విశ్వనాథ. అప్పటికిది విపరీత వస్తు నవ్యత. విశ్వనాథ సాహితీ సమితిలో కొన్నాళ్ళు సభ్యులు. ఆయన కవితాఖండికలు గిరికుమారుని ప్రేమగీతాలు సాహితిలోనే వచ్చాయి. ఇంకా కొన్ని కథలు కూడావచ్చిఉంటాయి. సాహితి సంపుటాలన్నీ ఇప్పుడు దొరకవు.

# 13. సుగాలి కుటుంబం

– చింతా దీక్షితులు

పాత అధికారివెళ్ళి కొత్త అధికారి వచ్చినాడన్న వార్త చుట్టుపట్లనున్న గ్రామముల కన్నింటికీ తెలిసింది. ఇంత త్వరలో తెలియడానికి కారణము లేకపోలేదు.

ఈ ప్రాంతపు దేశమంతా అడవిమయము. ఆ అడవిలో ఒక భాగమునకు ఈయన అధికారి. ఏ వూరివాడో తెలియదు. అధికారము చెలాయించేటప్పుడు ముక్కు సూటిగా వెళ్ళడం ఈయన మతము. ఈ సంగతి ఈయనే పలువురితో చెప్పటం కద్దు. లోకులు ఈ సన్మార్గమును కాఠిన్యమన్నారు.

ఒకనాటి సాయంకాలము–ఈయన పాత్రకు పేరు వుండవలెను, గనుక ఈయనను మునుస్వామి అందాము– కంసాలివానికి వర్తమానము చేసినాడు. ముప్పది తులముల బంగారముతో చేయబడిన కంఠె ఒకటి ఆయన భార్య పెట్టుకునే అలంకారములలో ఒకటి. ఈ కంఠెను చెరిపించి నలభై తులాల బంగారపు కంఠె చేయించిపెట్టమని భార్య అడగడము కంసాలిని పిలిపించడమునకు కారణము.

కంసాలి వచ్చినాడు. అతనికి చెప్పవలసిన మాటలు చెప్పుతుండగా అడవి కాపరులు ఒక మనిషిని పట్టుకొని మునుస్వామి వద్దకు తీసుకువచ్చినారు. అడవిలో నల్లమద్ది కొమ్మ కొట్టి యీ మనిషి తీసుకొని పోతుండగా కాపరులు పట్టుకొన్నారు.

మునుస్వామి విచారణలో తేలిన విషయమిది. ఈ మనిషి బండిచక్రమునకు కొన్ని ఆకులు విరిగిపోయినవట. కొనడానికెక్కడా కర్రలు దొరకలేదట. బండి తోలుకొని జీవించడమే అతని ప్రధాన వృత్తిట. అందుచేత అడవిలో కొమ్మ కొట్టిన మాట వాస్తవమట.

సన్మార్గగామియైన మునుస్వామి అతనిపై కేసు చేసినాడు. అడవి కేసులకు సాక్ష్యము మొదలైనవి అక్కరలేదు. అధికారి మాటా, మేజస్ట్రీటు శిక్షా నేరస్థుని కొంప గుండము. అడవి పరిపాలనలో న్యాయచక్రము పై మూటి మీద ఎప్పుడూ వర్తించుచుండును.

ఆ మనిషికి రెండు సంవత్సరముల కఠిన నరకము పడినది. మునుస్వామి వచ్చిన నెలలోపుగా ఇట్టివెన్నో జరిగినవి. ఆయన కీర్తి చంద్రికలు నాల్గువేపులా వ్యాపించిన వంటే ఆశ్చర్యమేమి!

**2**

రాక్షసనామ సంవత్సరమున సకాలమున వర్షములు లేకపోవుటచేత కొన్ని చోట్లా, వర్షములు వెనక బట్టుటచేత కొన్నిచోట్లా కాటకము సిద్ధించినది. పచ్చని చేలుండవలసిన తావులందు పత్రభూములు కానవచ్చుచున్నవి. సూర్యుని వేడిమి నానాటికి సహింపశక్యము గాకున్నది. నాగళ్ళు, గొఱ్ఱులు, జడ్డిగాలు, పాపటలు, మెట్టులు అన్నియు మూలకొదిగినవి. నూతులందు నీరు నానాటికి లోనికి పోవుచున్నది. చెరువు లెండుకుపోయినవి. విత్తనముల కొరకై వెనకటి సంవత్సరము దాచుకొన్న ధాన్యము, జొన్నలు,కొఱ్ఱలు, ఈసంవత్సరము గ్రాసమునకు వినియోగపడుచున్నవి. భూమిపై గడ్డి మొలవలేదు. అడవిలో చెట్లు చిగుర్చలేదు. ఆవులకు మేతలేదు. మనుష్యుల కావుపాలు లేవు.

“ఈ యేడు వర్షములు లేక పంటలు లేవు. తినడానికి తాటిపళ్ళేనా పడడంలే” దని ఒక మాలవాడు విలపించినాడు.

ఈ కాలమున మునుస్వామి అధికారములోనున్న అడవికి సమీపమున ఒక వూరిలో ఒక సుగాలీ కుటుంబము కాపురముండెను. ఈ కుటుంబము ఆ వూరికి రావడమునకు పూర్వము ఎర్రకొండలలో వుండేదిట. అక్కడ వున్న చెంచువాళ్ళు వీళ్ళ కొంపలో పడి దోచుకొనడముచేతనూ, వీళ్ళ పశువులను తోలుకుపోవుట చేతనూ జీవనాధారము లేక యిక్కడకు వచ్చినారు. అడవిలో నివసించినచో చెంచువాళ్ళు బాధ పెట్టుదురనే భయము చేత వూళ్ళోనే కాపురమున్నారు.

ఈ కుటుంబము కడు బీదస్థితిలో వున్నది. భార్యా భర్తా ఏడుగురు పిల్లలూను. వీరిపై దయదలచి ఒక బ్రాహ్మణుడు తన దొడ్డిలో వీరి నుండనిచ్చెను. ఆ దొడ్డిలో పాక వేసుకుని వీళ్లున్నారు.

సుగాలీవాళ్ళు అడవిజాతికి చేరినవారు. చెంచులు, ఎరుకలు,కోయిలు, లంబాడీలు, ఒడ్డలూ ఇట్టి అడవిజాతులే.

సుగాలులకు కొండలూ, అడవులూ నివాసస్థానము. వీళ్లు అడవులకు పిల్లల వంటివారు. అడవులు వీరిని కనును, అడవులు వీరిని పోషించును. అడవులు వీరిని భరించును. అడవులకు వీరు తమ అసువులనర్పింతురు.

సుగాలీ స్త్రీలు అలంకారప్రియులు. వివాహితయైన సుగాలీ స్త్రీ చేతులకు ఎముకలతో చేసిన కంకణములను మోచేతివరకు ధరించును. బొంతలలో చిన్న చిన్న అద్దములను కుట్టి బొంతలకతికించి ఆబొంతలను లంగావలె కట్టుకొనును. ఉరస్థలిపై కప్పుకొనును. రంగురంగుల గుడ్డలతో నీబొంతలను చేయుదురు. రంగులన్న వారికి ప్రీతి. వారీ బొంత టోపీ తలపై ధరించుట కూడ కద్దు. సుగాలి స్త్రీలు సొగసుగా నుందురు. ఆరోగ్యము సౌందర్యమునకు వన్నె తెచ్చును. వీరికి ఆరోగ్యము, సౌందర్యము కూడా కలవు.

పురుషులును స్త్రీలును కలసి పండుగ దినములలో నృత్యము సల్పుదరు. సుగాలీ భాషలో పదములు పాడెదరు.

అడవులలో కట్టెలను కొట్టి మోపులుగా గట్టి ఊరూరా దిరిగి వాటి నమ్మి జీవింతురు వీరు. ఇది కొందరి వృత్తి. కొందరు అడవులలో పశువులను మేపుకొని జీవింతురు.

ఈ సుగాలులు ఇతర అడవి జాతుల వలెనే అప్పుడప్పుడు దారులు కాచి దొంగతనము చేయుట కద్దు. అందు స్త్రీలు గూడ పాల్గొందురు. వీరిలో సాధారణముగా స్త్రీలు పురుషులకన్న బలాఢ్యులు.

కాటకము నానాటికి తీవ్రమై పోయింది. మర్యాదగా కూలి పని చేసుకొని గుక్కెడు అంబలి త్రాగే వాళ్ళందరికీ చిప్ప చేతికి వచ్చింది. ఊళ్ళల్లో యాచకుల సమ్మర్ధము ఎక్కువ అయిందని పత్రికలలో మొరలు వినిపించెను. వీధులలో పాటలు పాడుకొనుచూ యాచకులు సంచారము చేయుచుండిరి. “వానదేవుడు పదములు” ఎల్ల తావుల వినవచ్చు చుండెను.

వాన దేవుడా ఓ వాన దేవుడా
ఇగ నెందు కున్నావు జగమేలు నాసామి

చిన్న చిన్న మొలకలు జింకల పాలాయె
వేసిన చేలన్ని ఎండెండి పోయె
చుక్కటి మొగవాళ్లు సూదులై పోయిరి
ఏకంత మొగవాళ్ళ ఎదవాడి ఉండిరి
గుంటిక కొట్టెవాళ్ళ గుండెలారుకు పోయె

నాగలి పట్టేవాళ్ళ నడుము లెందుకుపోయె
నెత్తిమీద సూర్యుడా దండంబు నీకు
ఏనుగంతెద్దులూ ఎత్తుబడి పోతాయి
గాడి కట్టిన పసర కడేంకు పోలేదు
ఎక్కడా వున్నావో గ్రక్కునా కదులయ్యా
కురిపించు నాసామి కుంభ వర్షాలు
కురవాక మాతోడ కువ్వారమేల
వానలు కురిపించి ప్రాణాలు రప్పించు
వంకలూ నిండంగ వాగులూ నింద
కురిపించు నా సామి కుంభ వర్షాలు
వాన దేవుడా ఓ వాన దేవుడా
ఇగ నెందుకున్నావు జగమేలు నాసామి

**3**

ఈ సుగాలీ కుటుంబము కూలి పనులున్న రోజులలో కూలి పనిచేసుకొని పొట్ట పోసుకునే వాళ్ళు. కాటకము వచ్చుట కూలి పనులు పోవుట ఒక్క మారు తటస్థించినది. కట్టెలు కొట్టుకొని అమ్మి జీవిస్తామంటే అడవి స్వాధీనములో లేదు. పశువులను కాచుకుందామంటే పశువులు లేవు. అడవిజాతివాళ్లని అడవిని అనుభవించ వద్దనడం పిల్లను తల్లి వద్ద పాలు తాగరాదనడమే.

ఈ సుగాలీ కుటుంబమున యజమాని పేరు రూపల్ నాయక్. అతని భార్య పేరు చంద్రి. వీనికి కొడుకులు కూతుళ్లూ పాలు త్రాగు పిల్ల మొదలుకుని పదిహేనేళ్ళ వరకు వయస్సు వచ్చిన పిల్లలు ఏడుగురు. సూర్యనాయక్, రామనాయక్, పొటేల్ నాయక్, లక్ష్మి, సీత, బద్ది, భారతి వాళ్ళ పేర్లు. తండ్రీ తల్లీ పాటుపడి పిల్లల నందరనూ పోషించవలెను. పెద్ద పిల్ల లక్ష్మికి పండ్రెండవ యేట వివాహమయినది. అత్తవారు తీసుకుపోయి బాధలు పెట్టడం వల్ల అత్త వారింటి నుంచి పారిపోయి వచ్చి తల్లి ఉన్న ఊళ్ళోనే ఒక శూద్ర కుటుంబములో చాకిరీకి ప్రవేశించి పొట్టపోసుకుంటూంది లక్ష్మి.

తొలి కోడి కుయ్యడంతోనే రూపల్ నాయకుడు చంద్రీ బయలుదేరి కొండల మీదకి అడవులలోకి పోతూ ఉండడం వాడుక. పిల్లలందరూ ఇంటి వద్దనే ఉందురు.

అడవికి పోయి అక్కడే దేవదారు కూర, పింకికాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు ఏవి దొరికితే అవి తీసుకువచ్చి ఊరూరా తిరిగి జొన్నలు, కొఱ్ఱలు పోగుచేసుకొని మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వచ్చే వాడుక. అప్పుడు కొఱ్ఱన్నమో, జొన్న సంకటో, జొన్నరొట్టో తయారు చేసి తామింత తిని పిల్లల కింత పెట్టి ఆ రోజు గడుపుకునేవాళ్ళు.

సుగాలీ వాళ్లు కష్టపడి పనిచేసి యింత తింటారు గాని ఒకరిని దేహి అని చెయ్యి చాపి అడగరు, ఇస్తే వద్దనరు.

కొంతకాలం ఈ రీతిగా జరిగింది. ప్రజలలో క్షామము ప్రవేశించినది. ఆకు కూరలూ, పండ్లూ కొనేవాళ్ళ సంఖ్య నానాటికీ క్షీణించింది. ఇక చేయవలసి దేమి? చేయుటకు కూలి పనులు లేవు. కాయుటకు పశువులు లేవు. ఆకుకూరలు కొనుటకు మనుష్యులు లేరు. ఇట్టి స్థితిలో నున్నవారే కొందరు యాచకులౌదురు. ఇట్టి స్థితి నున్నవారే కొందరు దారులు కొట్టుటకు మొదలు పెట్టుదురు. ఎవరిది తప్పు? వారిదా?

## 4

అయిదారుగురు పిల్లలు రోటి చుట్టూ మూగినారు. వారెవరు? మోకాలిపై తలనుంచి ధ్యానము చేయుచు కూర్చున్నా డొకమూల అతడెవరు? వారి ముఖములు తేజోఃహీనమై ఉన్నవేల? వారి కడుపులు నడుముల కంటుకుపోయినవేల? రోకలి చేతబూని ఒక్కరీతిగా దంచుచున్నది. అవియేమి? ఆమె ఎవరు?

ఈత పండ్ల నక్కడక్కడ పోగు చేసుకొని వచ్చి వాని నెండబెట్టి తరువాత నా పళ్ళను దంచి గింజలను పారవేసి ఆ పొట్టుతో రొట్టెలను గాల్చుకొనుచున్నారు రూపల్‌నాయక్ కుటుంబము. మార్గము లేని వారికి భగవంతుడొక మార్గమును కల్పించక మానునా! కాలినది ఈత పొట్టుతోనయిన రొట్టె ఒకటి తినుటకు సిద్ధముగా నున్నవారు ఎనమండుగురు.

కొంతకాలమిట్లు గడచినది. ఈత పళ్ళు కూడ కొన్నాళ్ళకు కరువైనవి. కావా! చెంచువాళ్ళు మాలమాదిగెలు సుగాలీవాళ్ళు ఇందరికీ ఎంతకాలము ఈతపళ్ళు ఆధారమై ఉండగలవు? ఇంక సాధనమేమి?

ఒకనాటి ఉదయమున రూపల్‌నాయక్ చంద్రీ యిద్దరూ తట్టలు చేతితో పట్టుకుపోయినారు. వాళ్ళ పిల్లలు ఊరిలో వీళ్ళ గడపలూ వాళ్ళ గడపలూ పట్టుకొని కాలము బుచ్చుచున్నారు. మాధ్యాహ్న మగుసరికి భార్యాభర్తలిద్దరూ తట్టెడు చింత

గింజలను తెచ్చినారు. అవి యేల! ఆ చింత గింజలను రోటిలో ఇద్దరూ దంచినారు. నీళ్ళల్లో నానవేసి కడిగినారు. ఎండబెట్టి తిరుగలితో విసరినారు. నల్లటి పిండి తయారైనది. వీరు చేయు పనులను పంద్రెండు కన్నులు చూస్తూ ఉన్నవి. ఈ పిండితో సాయంత్రమగుసరికి రెండు రొట్టెలు తయారైనవి. మెడ పట్టులు పట్టుకొనుచూ తమకు తక్కువైనదని కొట్లాడుచూ పిల్లలూ దంపతులూ ఆ రొట్టెలను తిన్నారు. ఇంత నీరు త్రాగినారు. ఆ దినమునకు భగవంతుడింత యిచ్చినాడు. హాయిగా రాత్రి అందరూ వెన్నెలలో విచారము లేకుండా నిద్రపోయినారు.

కొంతకాలమీ రీతిగా జరిగినది. చింతగింజలకు కూడా కరవైనది. కొన్నాళ్ళకు చింతగింజలను వర్తకులు అమ్మమొదలుపెట్టిరి. పడి అర్ధణా!అర్ధణా! ఆ సుగాలీవాళ్ళకు ఎక్కడినుంచి వచ్చును? ఇక చేయునదేమి?

ఒకనాటి సాయంకాలము ఒక సుగాలీ కుటుంబము ఆరు బయట ఆకులలో నల్లటి పదార్థము పెట్టుకొని ఆత్రముగా తినుచున్నారు. ఆ నల్లటి పదార్థమేమి? చింత చిగురూ చింతపండూ బూడిదలో కలిపి పొయ్యిమీద ఉడికించగా తయారైన పదార్థము ఈ అంబలి త్రాగి కడుపు నిండా నీళ్ళు త్రాగి చింతలేక హాయిగా నిద్రపోయిరి ఇట్లు కొన్నాళ్ళు. అడవిలో చింతపండు తెస్తూ ఉన్న వాళ్ళకు శిక్ష పడుతూందని వదంతి పుట్టింది. ఇక చేయవలసినదేమి?

దేవదారు కూర మిగిలిన ఆకుకూరల వలె గాక కొంత సువాసన కలిగి యుండును. దీనిని బ్రాహ్మణులు పప్పులో వేసి వండుకొందురు. ఇది మెంతికూర పప్పువలె నుండును. అడవులలో తిరిగేవాళ్ళు ఈ కూరను ఊరివారికి బియ్యమునకూ, జొన్నలకూ అమ్ముదురు. కొనువారు లేనప్పుడో?

అడవి సమీపమున నున్న దేవదారు చెట్ల నాశ్రయించి మధ్యాహ్నమగుసరికి ఒక తట్టెడు దేవదారు కూర తెచ్చినారు. ఈ సుగాలి దంపతులు కుండలో ఆ కూరను బోసి నీళ్ళు పోసి ఉడకబెట్టి దించినారు. ఆకులలో బెట్టుకుని పిల్లలూ తల్లీ తండ్రీ కడుపునిండా తిన్నారు. హాయిగా నిద్రపోయినారు.

ఈ రీతిగా కొన్నాళ్ళు జరిగింది. అడవియంచుల నున్న కూర నానాటికీ తరిగిపోయినది. ఇక చేయవలసినదేమి?

నడి రాత్రి బయలుదేరి ఎవ్వరూ చూడకుండా యింత దేవదారు కూర దూసుకొని వచ్చి తెల్లవారుసరికి ఇల్లు చేరి ఆరోజు గడుపుకొనవలసి వచ్చింది. ఇట్లు కొంతకాలము

గడచినది. ఒకనాడు తోవలో నలుగురు మాలవాళ్ళు కనిపించినారు. రెండు రోజులకు ముందు వారు దేవదారు కూర ఆ రీతిగా తీసుకుపోవుచుండగా అడవి కాపరులు పట్టుకొనిరట. నూతనోద్యోగి కడకు తీసుకుపోయిరట. బొటన వ్రేలి ముద్రలను వేయించుకొన్నారట. ఈ వర్తమానము సుగాలి దంపతులకు తెలియ వచ్చినది. ఇక అడవికి పోవుట ఎట్లు? పొట్ట పోషించుకొనుటెట్లు? పిల్లలను పోషించుట ఎట్లు?

రెండు రోజులపాటు సుగాలీ కుటుంబమునకు తిండి లేదు. దిగుడు బావిలో నుంచి తెచ్చుకున్న నీళ్ళే తిన్నారు. ఆ నీళ్ళే త్రాగినారు. వెన్నెలలో సుఖముగా నిద్రపోయినారు. రెండు రోజులు గడచినవి. ఇట్లెన్ని రోజులు గడుచును?

మరింత జాగ్రత్తగా దేవదారు కూర అడవులలో నుంచి వారు తెచ్చుకొనక తప్పినది కాదు. కొంతకాలము సరిగానే జరిగినది. ఒకనాడు రూపల్ నాయక్ అడవిలో దేవదారు కూర కోయుచుండెను. చంద్రి కొండలలో ఒక చరియలో ఈత చెట్టుకు పళ్ళున్నవని విని ఆ పళ్ళ కోసము అక్కడకు వెళ్ళినది. రూపల్ నాయకుడు ఒడి నిండా కూర కోసుకుని అడవి దాటి వస్తూ ఉన్నాడు. ఇద్దరు అడవికాపరులు అతనిని అడ్డగించినారు. పారిపోయినాడు. పరుగెత్తి వానిని పట్టుకొన్నారు. అతనిని పరీక్షించి నారు. దేవదారు కూర కోసినట్లును కొమ్మలను విరిచినట్టును కేసు. కూర కొయ్యడం తప్పు కాదు. కొమ్మలు విరవడం నేరము. కొమ్మలు విరవడం ఎందుకు? పట్టుకుపోయి అమ్ముకుందామనే కదా, అడవికి నష్టము కలుగజేయవలెననే ఉద్దేశ్యమే కద. మేజస్ట్రీటు వద్ద కేసు జరిగింది. రూపల్ నాయకుడు దీనముగా చెప్పుకున్నాడు. తనకు ఏడుగురు పిల్లలనీ, కూలి పనిచేసుకోవడము వృత్తనీ, కూలిపనులు లేవనీ, తిందామంటే ఈత పళ్ళు కరవయినవి. బూడిద తాగుదామంటే చింతపండు కరవయింది. చింతపిక్కలు తిందామంటే ఖరీదైనవి. దేవదారు కూరపై అతని కుటుంబమంతా ఆధారపడి యున్నది. అతడు కొమ్మలు వివరలేదట. కూర కోసుకున్నట్లు ఒప్పుకున్నాడు.

మేజస్ట్రీటు నూతనోద్యోగి చాకచక్యమును మెచ్చుకున్నాడు. సుగాలీవానికి నాలుగు ఏళ్లు ఖయిదు విధించినాడు.

## 5

చంద్రి ఈతపళ్ళను ఇంటికి తెచ్చుసరికి రూపల్ నాయకుడు ఇంటికి రాలేదు. ఎక్కడైనా కూలికి పోయినాడేమో అని సంతోషించింది. ఈతరొట్టెలను పిల్లలకు పెట్టి తాను తిన్నది రెండు మూడు రోజులపాటు రూపల్ నాయకుడు ఇంటికి రాకుండడము అలవాటే.

రెండు రోజులు పోయిన మీదట తన భర్తకు ఖయిదు వేసినారని చంద్రికి తెలిసింది. ఏమి చేయగలదు? తన రెక్కలతో ఇందరిని పోషించగలదా! ఎడపిల్లను పెద్దపిల్లకు అప్పగించి చంటిపిల్లను చంకబెట్టుకొని ఒకనాడు ప్రయాణమై తెల్లగొండల కేసి పోయింది. తెల్లకొండలలో దాని చుట్టాలున్నారట. ఈ సంగతి వూరివారికి తెలియదు.

పాకలో నలుగురుపిల్లలు తల్లిదండ్రులకోసము ఆనాటి మధ్యాహ్నమువరకు వేచియుండిరి. ఎవ్వరూ రాలేదు. పాకను విడిచి వూరిలో ఆ నలుగురూ వేర్వేరు దిక్కులకు బోయిరి. వారేమయిరో ఎక్కడుండిరో ఎవరికీ తెలియదు. భూదేవి వారిని కన్నది. భూదేవి వారిని మరల స్వీకరించినది.

రూపల్ నాయకుడు నాలుగేండ్లయిన తర్వాత ఆ వూరు వచ్చినాడు. తన కుటుంబము లేదు. భార్య తెల్లకొండలకో ఎక్కడికో పోయిందనీ పిల్లలెక్కడకో పోయినారనీ పొరుగువాళ్ళు చెప్పినారు. రూపల్ నాయకుడు ఆరోజునే బయలుదేరి తెల్లకొండలకు పోయినాడు. అక్కడ వాని భార్య కానరాలేదు.

మునుస్వామి నానాటికి ధనము గడించడము మొదలు పెట్టినాడు. సాలుకు ఇంత యిచ్చేపద్ధతి మీద తనకు తెలియకుండా అడవి సరకు తెచ్చుకొనవచ్చునని లోపాయికారిగా అడవి మనుష్యులతో రాజీపడ్డాడు. కేసులు తక్కువైనవి. అధికారి సామర్థ్యమునకు దొరతనము సంతోషించినది.

అది విషజ్వరముల కాలము. ఊరూరా, దేశదేశములా విషజ్వరములే. ఎందరో దాని వాతబడిరి. మునుస్వామి యింట ప్రవేశించినదీ విషజ్వరము. భార్యా ఇద్దరు పిల్లలూ పదిరోజులలో ఎగిరిపోయినారు.

మునుస్వామి ఒక్కడు, నా అన్న వాళ్ళు లేరు. ధనమునే చుట్టముగా చూచుకొన మొదలుపెట్టినాడు. క్రమక్రమముగా మునుస్వామి ప్రవర్తనపై అధికారులకు తెలియవచ్చినది. విచారణ జరిగినది. మునుస్వామిని ఉద్యోగము నుండి తొలగించిరి. చిన్ననాటి బంధువులతోను, మిత్రులతోను జీవితము గడపవచ్చునని స్వగ్రామము పోయినాడు. మునుస్వామి మిత్రబంధుకోటి ఆ గ్రామమున నతనికి కరవైనది.

## కథానేపథ్యం ...

తొలితరం తెలుగు కథా రచయితలలో శ్రీ చింతాదీక్షితులు విశిష్టమైన రచనలు చేసినవాడు. కథలు రాసిన వాడు. గురజాడ తర్వాత వెంటనే చెప్పుకోవలసిన గొప్ప కథారచయిత చింతాదీక్షితులు. కృష్ణశాస్త్రి దీక్షితులను ముత్యాలసరాలలో ప్రస్తుతించాడు కూడాను.

వనజన, గిరిజన కుటుంబ జీవితాన్ని గూర్చి తెలుగులో మొట్టమొదటి కథరాసిన వాడు దీక్షితులే. దీక్షితులుగారు కథలు రాయడం మొదలుపెట్టేనాటికి భారతదేశంలో గిరిజన, వనజాతుల సంఖ్య కోటిన్నరను మించి ఉన్నట్లు ఆనాటి జనాభా లెక్కలు చెబుతున్నాయి. వీరిని ఆనాటి వర్తకులు, ప్రభుత్వం ఎంత దగా చేస్తున్నదీ విషాద భరితంగా ఈ కథలో వర్ణించాడు దీక్షితులు.

చలం అంటాడు, తానొక ముల్లు. దీక్షితులు ఒక గులాబిపువ్వు అని. దీక్షితులను కథక చక్రవర్తి అని ఆనాడే నవ్యసాహిత్యపరులు ప్రశంసించారు. "గ్రామీణుల నిరాడంబర జీవితమంటేనూ, పేదల కష్టాలంటేనూ శ్రీ దీక్షితులకు పక్షపాతము. వారి కథలలో ఏ సంఘజీవితము చిత్రించినా ఆ సంఘజీవితము చక్కగా అవగతము చేసుకొనిగాని మరీ చిత్రించడు" అన్నారు నోరి నరసింహశాస్త్రి.

'సుగాలీ కుటుంబం' కథ అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ తెలుగు కథలలో చాలా గొప్ప కథ 'సాహితి' (కథల పత్రిక) రెండో సంపుటం, మూడో సంచికలో ఈ కథ వచ్చింది. 1921 ఆగష్టు, సెప్టెంబరు సంచిక అది. శిల్పంలో, వస్తువులో, భావ నవ్యతలో, సాఫీతనంలో, సాంఘిక ప్రయోజనంలో ఎన్నవలసిన మంచికథ ఇది. కథలో వ్యంగ్యం, కరుణ సమపాళ్లలో ఉన్నాయి. 1915 రాక్షసనామ సంవత్సరం నాటి కరువు పరిస్థితి – ప్రతీకాత్మకక కూడా కావచ్చు.

ఈ కథలో విషాదమరణం పాలైన వారి నుద్దేశించి 'భూదేవి వారిని కన్నది, భూదేవి వారిని మరల స్వీకరించినది' అన్నారు దీక్షితులు.

తొంభై అయిదేళ్ళ నాటి కథ ఇది. అయినా ఎంతో తాజాగా ఉంది.

# 14. వెర్రాసుపత్రి

– *గిడుగు వేంకటసీతాపతి*

"అయ్యా! ఇన్నిసార్లు విశాఖపట్టణం వచ్చినానుగాని వెర్రాసుపత్రి నేనిదివరకు చూడలేదు. నేటి సాయంకాలము అక్కడకు పోదాం వస్తారా" అన్నాను.

"ఊళ్ళో ఉన్నవాడను నేనూ ఇదివరకు చూడలేదు. అలాగే పదండి" అన్నాడు నా స్నేహితుడు కూర్మారావు

సాయంకాలము మూడు గంటలకు బయలు దేరినాము. త్రోవలో మరియొక స్నేహితుడు కలసి "ఎందాకా?" అన్నాడు 'వెర్రాసుపత్రి చూడవలెనని' అన్నాము.

"సరే వెళ్లండి, నేనిదివరకు ఎన్ని పర్యాయములో వెళ్లి చూచినాను" అన్నాడతడు.

"అలాగునా! రంగయ్యగారూ! అయితే మీరు తప్పకుండా రావలెను. మా ఇద్దరిలో ఎవరూ అక్కడకు పోలేదు. మీరు ఇదివరకు అనేకసార్లు పోయి ఉంటిరి గనుక అక్కడ చూడతగిన చిత్రములు మీరు మాకు బోధపరచగలరు" అన్నాము.

"మీ ఇల్లు బంగారంగాను! నేనక్కడకు పోయి ఉండలేదయ్యా!..." అని రంగయ్య చెప్పగానే ముగ్గురము ఫక్కున నవ్వుకొన్నాము. మా బలవంతము పైన రంగయ్య కూడా మాతో ఎలాగైతేనేమి వచ్చినాడు.

"వెర్రాసుపత్రికి బయలుదేరే వాళ్ళు చుట్టలు ఒక కట్టయినా పట్టుకోవాలి పట్టుకొన్నారా?" అన్నాడు రంగయ్య

'ఎందుకూ? నేను తాగను. పోనీ ఇక్కడ పుచ్చుకుందాము' అన్నాను.

"నేనూ తాగను – అయితే రంగయ్యగారూ మీ ఒక్కరి కోసమూ కట్ట చుట్టలెందుకూ? ఒక అణాచుట్టలు చాలవా?' అన్నాడు కూర్మారావు.

'బాగుందండోయి! బాగుంది! వెర్రాసుపత్రికి వెళ్తూవున్నందుకు మనకు కూడా వెర్రిలాగే ఉన్నది. నేను మాత్రము చుట్టలు తాగుతానా? వెర్రివాళ్ళకివ్వడానికి చుట్టలు

పట్టుకొండంటున్నాను. వాళ్ళకు ఒక్కొక్క చుట్ట పారవేస్తే మరి మన జోలికి రారు. అది ఒక ఆచారమయిపోయింది' అన్నాడు రంగయ్య.

'అలాగునా? మాకేమి తెలుసును?' అన్నాము మేము.

త్రోవలో ఒక దుఖాణము వద్ద కట్ట చుట్టలు కొని పట్టుకున్నాము.

సుమారు నాలుగు గంటలకు మేమా ఆసుపత్రి ప్రవేశిస్తూ ఉండగా ఇరవై మంది వెర్రివాళ్ళు భుజాన కావిళ్ళు వేసుకొని బయలుదేరినారు. వాళ్ళ వెనుకను ఒక బంట్రోతు ఉండెను.

'వీళ్ళు వెర్రివాళ్ళే' అన్నాడు రంగయ్య.

వాళ్ళందరూ నా చేతిలో వున్న చుట్టలకట్ట చూచి చేతులు చాపగా ఒకొక్కరికి ఒక్కొక్కటి ఇచ్చినాను.

'వీళ్ళ చేతను నీళ్ళు తెప్పించి పూవుల మొక్కలకు పోయిస్తారు. ఈ వెర్రివాళ్ళకు ఏదో ఒకపని కల్పనచేసి చేయిస్తూ ఉంటేనేకాని వీళ్ళకు వెర్రికుదరదు' అన్నాడు రంగయ్య.

ఆసుపత్రి లోపలకు పోయి నడుస్తూ ఉండగా ఒక వెర్రివాడు అదే పరబ్రహ్మం ... మగ రి, సగా, గరిగా,,గా. గమగరి॥ పమగరి॥ మగరిసగా॥ ఇదే, ప–రా–బ్రా, హ్మా....।ము॥....ఇదే॥ అని పాడుతూ మాకెదురుగా వస్తూ ఉండెను.

అతన్ని తప్పించుకొందామని మేము మరియొక దారిని పోతూంటే అతడు కూడా ప్రక్కకు తిరిగి మళ్ళీ మా కెదురుగానే వస్తూ ఉండెను. మాకేమి హానిచేస్తాడో అని భయపడుతూ పైకి మాత్రము ధైర్యంగా కనిపిస్తూ నడిచినాము. అంతటిలో ఆ వెర్రివాడు మమ్ము కలసికొని

'మనదేవూరు?' అన్నాడు

'చెన్నపట్టణం' అన్నాను.

'కాదు–మీ మొగాలు చూస్తే ఈ జిల్లావాళ్లలాగే కనిపిస్తున్నారు. బహుశా మీరు చెన్నపట్టణంలో చదువుకొంటున్నారేమో' అన్నాడు వెర్రివాడు.

ఇంత చక్కగా మాట్లాడుతున్నాడు–ఇతని కేమివెర్రి అని తలచి "నిజమే నండి చెన్నపట్టణంలో చదువుకొంటున్నాను' అన్నాను.

అప్పుడతనికీ నాకు జరిగిన సంభాషణ

"బాబూ! ఈత వచ్చినవాడు ఈదుకొంటే తప్పా?" అన్నాడు

"లేదు"

"పాట వచ్చినవాడు పాడుకొంటే తప్పా?"

"లేదు"

"పాడుకొంటూ ఈదుకొంటూ, ఈదుకొంటూ, పాడుకొంటూ, వెళితే తప్పా?"

"లేదు" అన్నాను. మేము ముగ్గురము నవ్వుకొన్నాము.

"చెరువు మధ్యనున్న మంటపం వద్దకు పాడుకొంటూ, ఈదుకొంటూ, వెళ్ళి మంటపం పంజరమెక్కి, పాడుకొన్నాను. వీళ్ళ కొంప ఏమి మునిగింది? నేను మళ్ళీ ఒడ్డుకు వచ్చేటప్పటికీ నన్ను పట్టుకొన్నారండీ మా వాళ్లే. పట్టుకొని నన్నిక్కడకు పంపించినారండి! చూచారా! నాకు వెర్రిట! చెప్పండి బాబూ మిమ్ములని చూస్తే నా పెద్దకుమారుడు జ్ఞప్తికి వచ్చినాడు. మీ అంతే ఉంటాడు. తిన్నగా చదువుకొంటున్నాడో లేదో?" అని ఆ వెర్రివాడు ఏడవడానికి ఆరంభించినాడు. 'పాపము' అన్నాము మేము.

ఇంతలో ఆ వెర్రివాడు మళ్ళీ 'అదే పరబ్రహ్మం' అని పాడి, "ఎవరిని చూదామని వచ్చినారు?" అని అడిగెను.

"మా స్నేహితుడొకడిక్కడున్నాడు" అన్నాడు కూర్మారావు

"ఎవరు నాయనా? ఏవరో మొసలికంటి ఆయన ఉన్నాడు, అతనినా?'

"అవును" అన్నాము.

"పాపము! అతడికి వెర్రి. మనమీద దృష్టి లేనేలేదు. పూర్వజన్మ ప్రారబ్ధము. పూర్వాజన్మమునందూ, ధా సా ధ ధ పా" అని మరల పాడడానికి ఆరంభించి "బాబూ! పదండి నా పాటకెక్కడికి, పాడుతూ ఏడుస్తాను. ఏడుస్తూ పాడతాను. అయితే–నాకు వెర్రిలేదు సుమండీ" అన్నాడు.

ఇంతలో ఆసుపత్రి మేనేజరుగారు వచ్చి "పరబ్రహ్మం పంతులూ!వెళ్ళి పుస్తకానికి రూళ్లు వెయ్యి" అని అతనిని పంపించి వేసినాడు. ఆసుపత్రి అంతా చూడడానికి అనుజ్ఞ ఇమ్మని మేమతనిని కోరినాము. అందుకతడు సమ్మతించి వెళ్లండి అని చెప్పెను.

ఒక అరుగుమీద పదిమంది పిచ్చివాళ్లు కూర్చుండిరి. ఒకడు గోడవైపు తిరిగి, "మృణాల సూత్రాంతర మప్యలభ్యం – బిసతంతు మాత్రావ కాశోపి అలభ్యం అశక్యం" అని వల్లిస్తూ ఉన్నాడు. సుమారు ఇరువై ఏళ్లవాడు! ఎందుకు పిచ్చివాడైనాడో తెలుస్తూనే ఉందనుకొన్నాను.

మరి ఒకడు సుద్దముక్కతో నేలపై పరపర రాశి చక్రం గీసి "లగ్నానకు దశమ మందు రవిరాహులుండడం చేత వీడికి గంగాయాత్ర కలుగవలె ఎందుకు జరగలేదూ" అంటూ కూర్చున్నాడు.

మరి ఒకడు పంచ పాషాణం పాలుతాగే పిల్లవాణ్ణి తీసుకువచ్చి తల్లకిందుగా వేళ్లాడ వెయ్యవలెను. ముక్కులో నుండి పాలు ఓడితే ఆ పాలతో ముక్కచుర్కు ఇవ్వాలి. రాగి మీద వేస్తే వెండి అవుతుంది.

ఎందుకు కాదు? అయ్యా బతికున్న మనిషి తాలుకు కేళికట్లు ఇస్తే బంగారం చేసి ఇస్తాను' అంటూ ఉండెను.

మొసలికంటి వారి అబ్బాయి అరుగుమీద ఒక మూల కూర్చున్నాడు. పంచా, కోటూ, తలపాగా, వోణీ అన్నీ ధరించుకొన్నాడు. తొడమీద భాగవతం పెట్టుకొని చదువుకొంటూ ఉన్నట్లు కనబడ్డాడు గాని చదవడం లేదు. ఒకసారి పుస్తకం వైపు, మరి ఒకసారి మా వైపు చూస్తూ మాటా మంతీలేక తనలో తాను నవ్వుకొంటూ కూర్చున్నాడు.

అప్పుడు ఒక కోమటి వచ్చి "చింతపండు ధర ఇంకా హెచ్చలేదు, బాబూ!" అని మా జవాబుకు ఎదురుచూడకుండానే "పోనీ హెచ్చకపోతే వెయ్యి రూపాయలు పోయినాయి, ఇంతేనా పోనీ పోనీ" అని నా చేతిలో చుట్టలు చూచి "ఒక చుత్త ముక్కియ్యవ్" అన్నాడు. ఒక చుట్ట ఇస్తే తీసుకుపోయి మరి రెండు నిమిషములకు మళ్లీ వచ్చి "మరి ఒక చుత్తముక్క ఇయ్యవ్" అన్నాడు. పోనీగదా అని మరి ఒకటి ఇచ్చినాను. మరి రెండు మూడు నిమిషములకు మళ్లీ వచ్చి 'చూచావా! నువ్వు రెండు చుత్తలిస్తే నేను మూడు చుత్తలు చేసుకొన్నాను. ఈలా చేసుకోకపోతే వెయ్యి రూపాయల నష్టం ఎలా కలిసొత్తాది' అని ఆ పిచ్చి కోమటి వెళ్లిపోయినాడు.

ఇంతలో మరిఒకడు వచ్చి "అయ్యా! చక్రవర్తి గారి వద్ద నుండి నాకేమైనా ఉత్తరం వచ్చిందా? యుద్ధం సంగతి నేను తెలియజేయగలనని వారికి వ్రాశాను. నా

మాటలు నమ్మని వాళ్లు నాశనమై పోతారు. నమ్మినవాళ్లకు జయం. ఎవళ్లూ నమ్మకపోతే ఎవళ్ళకీ జయం లేదు. ఎవళ్లు గెలిస్తే వాళ్లు నా మాట నమ్మినట్లే. జయానికి నమ్మకం. నమ్మకానికి జయం; ఆధారాధారేయాలు. మళ్లీ వ్రాస్తాను. గాలిలో ఎగరవేస్తే ఉత్తరం వెళ్లదూ! ఎందుకు వెళ్లదు? మంత్రిస్తే వెళ్లుతుంది' అన్నాడు.

అక్కడ నుండి మరి ఒక చోటకి వెళ్లినాము. ఒక ఆడమనిషి "హా!ప్రియా! నిను" అని పాడుతూ ఉండెను. మేమక్కడకు వెళ్లగానే "నన్ను పెళ్లాడరాదూ? మీతో వెళిపోవస్తాను" అన్నది. ఇక్కడ ఉంటే మంచిది గాదని వెళిపోతూ ఉంటే, మీరూ నాలాంటి ఆడవాళ్లేనా! పొండి–పొండి–మీరేమి మగవాళ్లు" అన్నది.

మరియొక ఆడుది–కోమటిది "బాబూ! బాబూ! నాకింత బంగారం పిసరివ్వవ్– ఇంత – ఇంత పిసరు చింతాకంత" అంటూ నిలబడినది.

మరియొక దగ్గర ఇద్దరు ఆడవాళ్లున్నారు. ఒకదానికి వంటి మీద బట్టలేదు. అప్పుడు రెండోది "అదేమిటే! మగవాళ్లు వస్తూ ఉంటే సిగ్గు లేదే! బట్ట విప్పుకొన్నావు ఇంద! ఇది కట్టుకో'" అని తాను కట్టుకొన్న బట్ట విప్పి వేసి విసరి కొట్టినది. మేము నవ్వుకొంటూ అక్కడి నుండి మరి ఒకచోటికి పోయినాము.

అక్కడ ఒక చిన్న పర్ణశాల ఉన్నది. అందొక కుర్చీపై ఒకడు పంచా కోటు తలపాగా ధరించి కూర్చున్నాడు. మేము వెళ్లడంతోడనే 'గుడ్ మార్నింగ్" అని కుర్చీలో ఒక ప్రక్క కాస్త చోటు చూపించి 'దయచేయండి' అని "చూచినారా? అన్యాయం! స్వామిద్రోహం! పోలిసెట్టిని చీవాట్లు పెట్టి నా భూములు నాకిప్పించివేయరూ? సర్కారు అనుమతి లేనిదీ కొనుక్కోకూడదంటేను, నా బావమరిది వాడితో ఏకమవుతాడను కొన్నానా? కాగితం ముక్క ఉంది. నాలిక గీసుకోనా? దొంగల తల్లికి ఏడవ భయం" అని యేమిటో చెప్పడానికి ఆరంభించి ఏడుస్తూ కూర్చుండెను. నేరకపోయి ఇక్కడకు వచ్చినామనుకొని, అక్కడ నుండి బయటకు మెల్లగా జారిపోయినాము.

అంతట ఆరుగంటలు కావచ్చినది. ఇంటికి పోదామంటే పోదామనుకొని గేటు దగ్గరకు వచ్చేసరికి, ముగ్గురు పిచ్చివాళ్లు – మొదట భుజాల కావిళ్ళు వేసుకొని కనబడ్డ వాళ్లే – మా దగ్గరకు గబగబా వచ్చి పువ్వుల గుత్తులు నేర్పుగా కట్టి మా ముగ్గురికి ఇచ్చి రెండు దండం పెట్టినారు. వాళ్ళకొక అణా బహుమానంగా ఇచ్చి ఇంటికి మరలినాము.

## కథానేపథ్యం ...

గిడుగు సీతాపతి వ్యవహార భాషోద్యమ మార్గదర్శీ, మహర్షీ అయిన రామ్మూర్తి పంతులుగారి పెద్ద కొడుకు. భాషా సాహిత్య పరిశ్రమలో, పరిశోధనలో తండ్రి అంతటి వాడు. పరాసుదేశం వెళ్ళి పారిస్ నగరంలో సవరల సంగీత వాయిద్యాల ప్రాచీనతను గూర్చి ప్రదర్శన పూర్వక ప్రసంగం చేసిన ధీశాలి. సంగీతంలో ప్రజ్ఞాశాలి. సప్తస్వరాల అట్టుపుట్టు ఆనవాళ్ళు పరిశీలించిన ప్రజ్ఞావంతుడు.

సీతాపతి కథలు రాసిన విషయం ఈ తరం పాఠకులకు కాదు. ఆయన తరం సాహిత్యపరులకైనా తెలుసో లేదో! ఏమంటే ఆయన ఛందశ్శాస్త్రం గూర్చీ, తెలుగు కావ్యాల గూర్చీ, భాషా పరిణామం గూర్చీ చేసిన అపూర్వమైన కృషి ముందు వెల్లడించిన పాండిత్యం ముందు, తండ్రిగారికి బాసటగా, గురజాడ అప్పారావుకు సైదోడుగా నిలిచిన వ్యవహారిక భాషా ప్రయోజన ప్రచార తత్పరత్వం ముందు, సీతాపతిని కథా రచయితగా ఆయన తరంవారు ఎరిగి ఉండరు.

టేకుమళ్ళ కామేశ్వరరావు అనే ఆనాటి ప్రముఖ కథా రచయిత తన కథల సంపుటిని ఒకదానిని గిడుగు రామమూర్తి పంతులుగారికి అంకితమిచ్చినప్పుడు రామమూర్తి పంతులు ఆ కథలు చదివి "ఇలాంటి కథ ఒకటి రాసినా నా సాహిత్య కృషి చరితార్థమై ఉండును. ఎందుకు నా భాషా సాహిత్య పరిశ్రమా, పట్టుదలానూ" అని ఆ కథా రచయితను మెచ్చుకొన్నారుట. అంటే ఆధునిక తెలుగు సాహిత్య విస్తృతిలో, సృజనాత్మక ప్రతిభా నిరూపణలో 20వ శతాబ్ది ప్రథమ పాదానికే 'కథానిక' ఎంత ప్రాముఖ్యం సంపాదించుకొందో, ఎంత ఆకర్షించిందో తెలుసుకోవచ్చు.

ఈ కథలోని ఇతివృత్తం మానసిక వ్యాధుల చికిత్సాలయం. ఆ రోజుల్లో ఒక్క విశాఖపట్నంలో మాత్రమే ఈ చికిత్సాలయం ఉండేది. దాంతో అది ఆ నగరానికి ప్రతీకగా కూడా మారిపోయింది. తెలుగులో ఇలాంటి ఇతివృత్తాన్ని ఎంచుకోవడం ఆయన ప్రయోగశీలతను ప్రతిబింబిస్తోంది.

ఈ కథ బరంపురం నుంచి 1919వ సంవత్సరంలో వెలువడుతూ వచ్చిన 'వేగుచుక్క కథావళి' అనే పత్రికలో వెలువడింది. ఈ పత్రిక ముఖ్యంగా కథా ప్రక్రియకే ప్రాధాన్యమిచ్చినట్లు కనబడుతుంది. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి అపరాధ

పరిశోధక రచయిత, తెలుగు సాహిత్య నవీన ఉద్యమశీలి అయిన దేవరాజు వెంకట కృష్ణారావుగారు ఈ పత్రికా సంపాదకుడు. బరంపురం కలకత్తాకు దగ్గర కాబట్టి ఈ పత్రికపై ఆధునిక బెంగాలీ సృజనాత్మక రచనల ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. రవీంద్రనాథటాగూర్ కథల అనువాదం కూడా మొట్టమొదట ఈ పత్రికలోనే ప్రారంభ మైందేమో. సంపాదకులకుండే అపరాధ పరిశోధక ప్రక్రియ అభిమానం వల్ల ఇంగ్లిషు నుంచి కూడా 'డిటెక్టివ్' సాహిత్యం అనువాద రూపంలో ఈ పత్రికలో చోటుచేసుకుంది. ప్రతి సంచికా ఒక ప్రత్యేక ప్రచురణగా ఉద్దేశించామన్నారు. కాని అది నెరవేరినట్లు కనపడదు. ఈ పత్రిక తనను గూర్చి తానే ఇట్లా చెప్పుకుంది. "ఇయ్యది 1914-15 సంవత్సరములలో నాల్గు నెంబరులు ప్రచురించి యుద్ధముచే కాగితము కరవగునప్పటికి ఆపివేయవలసి వచ్చినది. మరల 1919వ సంవత్సరమున యుద్యమము నడిపింప జూచి 5, 6, 7, 8 నెంబరులు ప్రచురించినాము." దేవరాజు వెంకటకృష్ణారావుగారి ప్రభావం శ్రీశ్రీపై కూడా ఉంది. తన వచన రచన (చిత్ర రహస్యము) అపరాధక పరిశోధక నవలతోనే ప్రారంభం చేశాడు శ్రీశ్రీ. అంతేకాదు, "ఏక్ దో తీన్ చార్, పాంచకడీదేవ్, వాడే వీడు వీడే వాడు, శ్రీనివాసరావ్" (అప్పటి ప్రసిద్ధ అపరాధ పరిశోధక బెంగాలీ రచయిత పాంచకడీదేవ్) అని ప్రాసక్రీడలు కూడా రాశాడు.

# 15. ఇల్లాలు మాట తప్పుతుందా?

– శేషాద్రిరమణ కవులు

**మేం** చెప్పేది నాలుగేండ్లనాటి సంగతి. ఆ యేడు బలే కాటక మొచ్చింది. మరీ అలగావాళ్లు కూటికి మొహం వాచారు. దొంగతనం యెరుగని వాళ్లంతా పాతర్లు తవ్వటానికి సాగించారు. ఆరాత్రి దొరగారి వైద్యుడి యింట్లో కన్నం వేశారు. బట్టలైతేనేం, పాతలైతేనేం రెండు మూడు వందలకు సొమ్ము పోయింది. దొంగోడికి ఆశ తీరక దొడ్డిగుమ్మములో నుంచి మోచేతి మలుపుగా గదిలోకి దూరాడు. దాంట్లో కొడుకు, కోడలు పండుకొనున్నారు. వాళ్లది కలతనిద్ర. ఇంతలో ఆ ఇంటి పడుచువాడు లేచి చూచేవరకు తలగడ దిక్కున దొంగ ఉన్నాడు. ఆమయిన్నే జుట్టు లంకించుకోని దొంగోణ్ణి బాగా తన్నేవఱకు వాడు చెయ్యికొరికి పాఱిపోయినాడు. ఇంట్లో వాళ్లంతా గొల్లు మన్నారు. చూచుకొంటే పోయిన మొత్తం చీరలైతేనేం, బట్టలైతేనేం మూడొందల రూపాయలవి. అప్పుడే దివాణంలో చెప్పి బయలు దేరేరయ్యా దొంగల కోసం.

దొరగారు, సువారం దొరగారు, ఇద్దరు కాసాలు, పెద్ద కాపు, వైద్యుడు ముందు మాలపల్లికి పొయ్యారు. కుక్కలు వెంట పడ్డయి. ఒక కుక్క వహాణ్ణి కరిచింది. "ఓరే మాలోడా మాలోడా కుక్కని పిలవండిరా" అన్నాడు వహాడు. కుక్కల గోల్లో వినపడుతుందా యేడుస్తుందా! అక్కడ మాలపల్లెకు పోయి లాభము లేదని వడ్డెర గుడిసెల దోవబట్టారు. చిన్న పూరిగుడిసె. దానికన్ని కంతలే. సూర్యుడు, చంద్రుడు లోపలనే ఉంటారు. అది చీకటి రాత్రి కాబట్టి చుక్కలు పారా యిస్తున్నవి. పేరిగాడికి పెండ్లై రెండేండ్లయింది. ఈతాకుల చాపమీద మొగుడు పెండ్లాము పండుకోని గుడిసె కప్పించుకొనే మాటలు చెప్పుకుంటున్నారు. ఇంతలో యమకింకరుల్లాగా ఆరుగురు వచ్చి పేరిగా "పేరిగా బయటికి ర"మ్మన్నారు. వాడులిక్కిపడి బయటికి వచ్చేవరకు పెడరెక్కలు విరిచికట్టి దివాణంలోకి లాక్కెళ్లారు. అయ్యో! యేం అన్యాయమయ్యా అంటూ బావమరిది వస్తే వాణ్ణి కట్టేశారు. వాణ్ణి చూచి పెండ్లాము నలుగురు పిల్లలు గొల్లుమని యేడ్చారు. పాపం వాళ్ల ఘోష వాళ్లది. కటికివాడు మేకను లాక్కపోయ్యేటట్టు

పేరిగాణ్ణి దివాణానికి తీసకపొయ్యేవరకు తెల్లవారింది.  వీళ్ళిద్దరు పాత నేరస్తులు. దొంగలు చిక్కారని యిద్దరిని చెట్టుకు వ్రేలాడదీశారు. దొరగారు నౌకరులు, తోవన పొయ్యే వాళ్లు, "సొమ్ములు అప్పగిస్తావా! అప్పగించవా' అని సాయంకాలం దాకా తన్నారు. వాళ్ల దేహం ఈ ఆస్తిన వాచిపోయింది. వాళ్ల పెళ్లాలు బిడ్డలు యేడుస్తూ యిది చూడలేక విడిచిపోలేక అల్లాడుతుంటే జాలి కలవాళ్లకి కండ్లు వాచిపోయినవి. మా పిల్లలతోడు, మా దేవరతోడు, గురువుతోడు, తల్లితోడు చంపవాకండయ్యా! మేమెరుగమయ్యా అని వీరిగాడు పేరిగాడు యేడుస్తుంటే దివాణం నౌకర్లంతా విసుకుపుట్టిందాకా తన్నారు. చేతులు పైకి వ్రేలగట్టారు. కాబట్టి పాపం దెబ్బల్లో ఒహటీ తప్పలేదు. దేహమునిండా నెత్తురు కమ్మింది. ఆరోజల్లా వడ్డెరగూడెము అంతా నిరాహారమువుంది. సరే వాళ్ళ పెండ్లాము పిల్లలగతి చెప్పే వీలులేదు. పత్తి రాటము పిట్టల్లాగా యేడ్చారు. సాయంకాలమైనాక వీళ్ళిద్దరిని కొట్లోవేసి తాళం వేశారు. దివాణం బంట్రోతులు నలుగురు బైన కావలి, వాళ్ళ పెండ్లాలు, పిల్లలు బైట అల్లాడిపోతున్నారు.

మర్నాడు సిరస్తా మేజిస్ట్రీటు దగ్గిర కేసు పెట్టారు. వైద్యుడు ఫిర్యాది. వీరిగాడు పేరిగాడు ముద్దాయిలు. తక్కిన పెద్దలంతా సాక్షులు. విచారణ కర్మకాండంతా గడచింది. సాక్ష్యం, వప్పజెప్పినట్లు నదురు బెదురు లేకుండా అందరు చెప్పారు. ఇంకేముంది మేజిస్ట్రీటు కేసు నమ్మారు. ఉత్తరసాక్ష్యం తెచ్చుకోమన్నాడు. దిక్కుమాలినవాళ్లు. ఈ పూటకుంటే రేపటికి లేదు. కట్టుబట్టలు లేవు. నిలువనీడ లేదు. మోతుబరు సాక్ష్యం కావాలా! దివాణానికి యెదురు సాక్ష్యం చిక్కుతుందా! వీరిగాడు పేరిగాడు ప్రమాణం చేసి మేము యెరుగమన్నారు. 'ప్రభువులు దయచూడండి. మా పెండ్లాం బిడ్డల్నీ దిక్కు మాలినవాండ్లని చెయ్యకండి. యివాళకి మూడు రోజులనుంచి వొహపూట తిండే తింటున్నాము. మా మాట నమ్మండి. ఒక్కొక్కరం నలుగురైదుగుర్ని పోషించాల. చీమల పుట్టలో చిచ్చు పెట్టవద్దని, యేడ్చారు. మేజిస్ట్రీటు యేం చేస్తాడు. సాక్ష్యం బలంగా వుంది. అందులో దొరగారి కుమ్మక్కు, వడ్డెర వాళ్ల యేడ్పు యెవరిక్కావాలా! క్రిమినలు లా ప్రకారం వీరిగాడికి పేరిగాడికి చెరి ఆర్నెల్లు కఠిన శిక్ష వేశానన్నాడు మేస్ట్రీటు. 'అన్యాయం, అన్యాయం' అని వడ్డెర వాళ్ళిద్దరు వలవల యేడ్చారు.

పోలీసువారు వీరిగాణ్ణి పేరిగాణ్ణి సంకెళ్లు వేసి తీసుకపోతుంటే వాండ్ల పెండ్లాము పిల్లలు ఆలగోడు బాలగోడు. నిజం దేముడికి తెలుసుగాని వాళ్లని చూచి యేడవని వాండ్లులేరు. దిక్కుమాలిన పక్షులైపోయినారు. నాలుగుకోసులు రైలు స్టేషనునుంటె అక్కడిదాకా పేరిగాడి పెళ్లాము వీరిగాడి పెళ్లాము పిల్లలు యేడుస్తు వచ్చారు.

రైలెక్కిచ్చేటప్పటి దృశ్యం చూచి తీరవలసింది. కోటి చక్కనిచుక్క, ఏడెనిమిది నెల్ల కడుపు. రెండుమూడు రోజులనుంచి తిండి తిప్పలు లేవు. మొగడి కాళ్లమీదపడి యేడుస్తూ అట్లాగే మొద్దయిపోయింది. పేరిగాడు నిలువు నీరైపోయినాడు. వీరిగాడు పెండ్లాము, బిడ్డలు వీరిగాడు యేడ్చే యేడ్పు మితములేదు. ఇంతలో రైలు కూసింది. వారి విధి వారు నెరవేర్చవద్దా! పోలీసువారు బలవంతముగా వీరిగాణ్ణి పేరిగాణ్ణి రైలులో పడేశారు. కూ అని రైలు కూసింది. లబలబలు, దిబదిబలు. కోటి లేచేవఱకు రైలు సాగింది. దిక్కుమాలిన మమ్మలిని అల్లాడించిన ఆ దిక్కుమాలినవాళ్ళకి ఈ పాపం కట్టికుడుపుతుంది. పోలేరమ్మా గంపంత కన్ను పెట్టుకొని చూస్తున్నావు గందా అన్నది. కోటి వాళ్ల యేడుపు చూచి యేడవని వాడు లేడు.

నానుకోపరేషను వచ్చింది. అందరికి దీంట్లో నాయకత్వము వచ్చింది. కాంగ్రెసు సూత్రాలు అర్థంచేసుకోలేని వీరాంక వీరులు నాయకత్వము కోసము ముందుకు రాసాగారు. వడ్రెవాళ్లను జైలుకు పంపి జయధ్వజం నిలిపిన దొరగారు సువారం దొరగారు ఇద్దరు కాసాలు పెద్దకాపు వైద్యుడు మీటింగులకు తయారుపడ్డారు. తిలకు నిధికి వసూళ్లు ఆరంభించారు. చందాలివ్వని వాళ్లని చావకొట్టుతూ వడ్రెవాళ్ల గతిపట్టిస్తామని బెదిరింపమొదలు పెట్టేరు. వూరంతా వహాటి అయింది. అందరు చాటున వూళ్లో వాంళ్లు కలిసే పలుక్కున్నారు. దొరగారిని విడిచి పెట్టి దొమ్మి చేస్తున్నారని ఈ అందరిమీద కేసు పెట్టేరు. మేజిస్ట్రేటు కేసు నమ్మి ఒక్కొక్కరికి ఆరునెలలు కఠిన శిక్ష ఈ అయిదుగురికి వేశారు. వాళ్ల పెండ్లాలు వాళ్ళ పిల్లలు వడ్రెవాళ్ల పెళ్లాము బిడ్డలు లాగానే యేడ్చారు. అప్పటికైన వీండ్లకు పూర్వజ్ఞానము కలుగలేదు.

రాజమండ్రికి వడ్రెవాళ్ళున్న బ్లాకులోకి యీ అయిదుగురిని తరలించారు. వడ్రెవాళ్ళు 'దొరగార్లు దండాలు దొరలు మీరు. మీరు గూడా వచ్చారా! యిక్కడ మనమందరము సమానమే'యని, పల్కారు. జైలువారు వీళ్లందరికి సమానంగా బొచ్చెలు బొంతలు బట్టలు ఇచ్చి కంకర పనిచేసే గాంగులో వేశారు. వడ్రెవాళ్లు మామూలుగా చేసేవాళ్లు. మనవాండ్లు అయిదుగురు పనిలో పాలుమాలేవాళ్లు. మొత్తం మీద వడ్రెవాళ్లు తిన్నన్ని దెబ్బలు జైల్లో వీళ్లు తిన్నారు. పాపం అనుభవించండి అని వీరిగాడు పేరిగాడు శిక్షపూర్తిపొయ్యేనాడు వీళ్లందరికి చెప్పి యింటిమొహము పట్టేసరికి తమాషా జరిగింది. దొరగారు దోసువేసి పోలీసుజవాన్ను కొట్టారు. వాడు కలక్టరు దగ్గర కేసు బెట్టాడు. దొరగారికి సంవత్సరము శిక్ష వేశారు. వీరిగాడు పేరిగాడు రైలు దిగుతుండేవఱకు సంకెళ్లతో జవానుతో దొరగారు రైలు యెక్కడానికి తయారయినారు.

దొరగారి ప్రాణం వీరిగాణ్ణి పేరిగాణ్ణి చూచేవఅకు నిలువునపోయింది. వాండ్లు రైలు దిగారు. ఈన రైలెక్కాడు. గ్రంథం ముగిసింది. కోటికి కొడుకు పుట్టాడు. కోటి కొడుకుతో వీరిగాడి పెండ్లాము పిల్లతో వీరిగాడికి పేరిగాడికి యెదురుగా వచ్చి కావలించుకున్నారు. వాళ్ళ సంతోషం చూడటానికి ఊరు ఉహం పోగయింది. కోటి అమ్మవారికి వడపప్పు పానకము చేయించి కులము వాళ్ళందరితో గుడికిపోయి అమ్మవారి ముందు తన బిడ్డను పడవేసి తాను ప్రాణాచారంపడి దిక్కుమాల్న మమ్మల్ని యేడిపించిన ఆ దిక్కుమాల్నివాళ్లకే పాపం కట్టి కుడిపింది గందా! గంపంతకన్ను పెట్టుకొని న్యాయం అన్యాయం చూస్తూన్నావుగదా పోలేరమ్మా తల్లీ అన్నది కోటి. అక్కడున్న జనమంతా ఒహరిమొహమొకరు చూచుకొన్నారు.

వడ్రెవాళ్లని జైలుకు పంపిన వినాయకులో నాయకులో కొంపలు చేరినారు. ఒహనాడు విదేశవస్త్ర దహనం సాగించారు. మంట నిలువెడెత్తున లేచింది. ఇంతలో ఆ వూరి పెద్దకాపు వచ్చి కల్లుదుకాణంలో పోతుచెరువు మాలోండ్లు కుదువపెట్టితే నేను పదిరూపాయలు ఇచ్చి విడిపించుకొన్నాను. ఇదిగో చినిగిపోయిన బట్టలని మూటెడు బట్టలు నిప్పుల్లో పడవేశాడు. పదిమంది చూశారు. ఎక్కడవవి? వైద్యుడు గారింట్లో పోయినవాబట్టలే. నిజము తెలిసింది. దొంగలేడు. ఇల్లాలు మాట తప్పుతుందా! కోటి యేమందో తెలుసునా? మళ్లీ–మళ్లీ దిక్కుమాల్ని మమ్ముల్ని అల్లాడించిన ఆ దిక్కుమాల్ని వాంళ్లకీ పాపం కట్టికుడిపింది. పోలేరమ్మ తల్లీ! గంపంత కన్ను పెట్టుకొని సూశావుగందా అన్నది కోటి. ఒక వడ్డెర ముసలిది 'ఇల్లాలు మాట తప్పుతుందా' అని గుంపులో నుంచి అనేసింది.

## కథానేపథ్యం ...

శ్రీ శేషాద్రిరమణ కవులు తెలంగాణా ప్రాంతానికి చెందిన గొప్ప కవిపండిత పరిశోధకులు. ప్రాచీన తెలుగు సాహిత్యంలో గొప్ప ప్రజ్ఞ కలవారు. ఎర్రాప్రెగడ హరివంశానికి గొప్ప పీఠిక కూర్చారు. తెలంగాణా శాసనాలను పరిశోధించి వివరించారు. చారిత్రక నవలలు రచించారు. వీరు జంటకవులు.

ఇటువంటి శేషాద్రిరమణ కవులు-కథానిక రచన పట్ల మోజు చూపడం ఆశ్చర్యమే. ఈ ఇతివృత్తం కథారంగం తెలంగాణా ధనిక స్వామ్యసమాజంలాగా కనపడుతున్నది. ప్రాస్తావికంగా కాంగ్రెసు సత్యాగ్రహంలోని డొల్లతనం కూడా కొంతలో కొంత వీళ్లు ఆక్షేపించినట్లు ఈ కథలో కనపడుతుంది.

'ఇల్లాలు మాట తప్పుతుందా' అనే పేరు చాలా నవీనంగా, నాణెంగా ఉంది. అయితే గడసరితనం ఉంటుందేమో ననుకుంటాం కథలో. కాని అటువంటిది ఏమీ లేదు. దుర్భర విషాదం నుంచి సుఖాంత పరిణామం ఈ కథావస్తువు. ఇంగ్లిషులో 'పొయెటిక్ జస్టిస్' అనే భావానికి ఈ కథ ఉదాహరణ. కథలో పాత్రలు, సంభాషణలు, సన్నివేశాలు, పరిణామ ఘట్టాలు వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయి. శేషాద్రిరమణ కవులు మరి కథలు రచించినట్లు కనపడదు. నాలుగు దశాబ్దాలు వాళ్లు కావ్య పరిష్కర్తలుగా, శాసన పరిశోధకులుగా, పండితులుగా,చెప్పుకోదగిన కవులుగా వాసికెక్కారు.

అమాయకురాలు, అన్నెం పున్నెం ఎరుగనిదీ అయిన ఇల్లాలి మాట జరిగి తీరుతుందని ఈ కథలో భావం. పనిపాటలు చేసుకుంటూ సమాజ జీవనపు అట్టడుగు స్థాయిలో జీవించేవారి యాతనలు సహజస్థితిలో ఈ కథలో పొందుపరిచారు శేషాద్రిరమణ కవులు.

'ఇల్లాలు మాట తప్పుతుందా' కథ 1920ల నాటిది. రుధిరోద్గారి (1924) సాహితి పత్రిక దీనిని ప్రచురించి ఉండవచ్చు.

# 16. పట్టు సెల్లా

– సుధాకరుడు

**వం**ట యింటి ప్రక్కని వసారాలో తోడికోడండ్రు మువ్వురును మధ్యాహ్నమున గూర్చుండి మాట్లాడుకొనుచుండిరి. లలితమ్మ తాను కట్టుకొనిన ధర్మవరం చీర యెక్కడ మాసిపోవునోయని పీట దెచ్చుకొని దానిపై నాశీనయై యుండెను. కమల మల్లుపావడ సెల్లాగట్టుకొని, సగముపైట దొరగియేయుండ స్తంభము నానుకొని యుండెను. పార్వతి చీటీ పావడ, చెంగావి పైటతో నొదుగుకొని మెట్టుపై కూర్చుండి యుండెను. మువ్వురును సుందరులే. గాని వారి సౌందర్యమున భేదము లేకపోలేదు. లలితమ్మ కోలముక్కు, కలసిన కనుబొమ్మలు, సగము చిరునగవు పై నాడుచుండు నధరమును, ఒకవిధమైన బిగువు సూచించుచుండెను. దానికి కారణము ఆమె గొప్పవారింటి యాడుబిడ్డ యగుటయే. ఆ హేతువుననే అత్తగారికీమె యనిన నెక్కడలేని యాశ. పనిచేయఁ బోయినను చేయనీయదు. కమల యింటివారు అంత ధనికులేగారు, గాని యొక మాత్రమువారే. కమల ముఖమున ధనగర్వము లేదు. అలక్ష్యమనునది తాండవ మాడు చుండెను. చెదిరిన పాపట, చెరిగిన బొట్టు, సగము జారిన పయ్యెద, ఒక్కచోట నిలువని చంచల దృక్కులు– ఆమె సౌందర్యమే వేరు. పార్వతి బీదయింటివారి పడుచు. ఆమె చూడ్కుల నెమ్మది, కమలచూడ్కుల చాంచల్యమునకు నెదురుకోలు. ఆమె యవయవ సౌభాగ్యమున నిర్మలమై నిష్కంళంకమైన సౌందర్యము నెలకొని యుండెను.

"ఒసే! లలితా! రేపు నీ పుట్టిన దినం కదానే. మీ నాయన ఏం పంపిస్తాడో" అని కమల యనెను.

"ఏదైనా పంపనీ. నగలు పంపక లక్షణంగా చీరలు పంపకూడదూ. నగ నేడు పంపితే రేపు మాయం గదా. మీ బావ దగ్గఱ"

ఈ మాటలకు గొంతయర్థము చెప్పవలెను. లలిత భర్త వేంకటేశమునకు నుద్యోగమనునది నిలకడలేదు. పేరునకు వర్తకుండైనను, లాభములను మాట రుచికైనను

ఎరిగి యుండడు. పెట్టుబడికై తండ్రీ ధనమియ్యనని చెప్పుటచే భార్య నగలపై బడెను. లలిత యొసగునదికాదు గాని భర్త భర్తయేగదా. కోపముతో నొక మారును, విసుగుతో నొకమారును, ఎట్లో యొక విధమున నగలు అదృశ్యము లగుచుండెను.

కమల నవ్వుచు "మా నాయనకు ఆకుంకంబరిణెలె తప్ప వేరుదొరకదు గాబోలు. ప్రతి యేడు అదే, చాలుచాలునని" అక్కడనుంచి వెళ్ళిపోయింది.

పార్వతి యొడలు చచ్చిపోవుచుండెను. తల్లితండ్రులను చిన్ననాఁడే గోల్పోయెను. వారు ఆశీర్వాదములదక్క ఆస్తివేరు వదలిపోలేదు. ఉన్న పినతండ్రి కొంత డబ్బుగల వాడైనను కూతురిపైనంత ప్రేమ లేదు. కావున పార్వతికి తన పుట్టినదినము జ్ఞాపక ముండినను ఏమి ప్రయోజనము. ఆ మరునాఁడు లలితకు మంచి బంగారు కంటెయో, గొలుసో వచ్చును. అప్పుడు, ఎప్పటియట్లు అత్తగారు లలితమ్మను దీవించుచు పార్వతి వెనుక మొటికలు విరచును.

ఆనాటి సాయంత్రము పార్వతి మగడు నరసింగరావు కాలేజీ నుండి షికారునుఁ బోయి ఇంటికి వచ్చి తన గదిలో బట్టలు తీయుచుండినపుడు భార్య చిన్నబోయిన మోము గాంచియోచించెను. దుఃఖకారణ మతనికిఁ గోచరించలేదు. అయినను అప్పుడు అడుగు సమయము గాదని రాత్రికై వేచియుండెను. అతఁడు రాజమహేంద్రవరం ఆర్ట్సు కాలేజీలో హిస్టరీ లెక్చరరు. నెలకు నూట ఇరవై రూపాయలు జీతము. అయినను ఆ మొత్తమున కొద్దిగ సెలవు చేయుచు మిగత చేర్చుచుండెను. కొంత డబ్బు పోగయిన వెనుక వేరు కాపురము పోవలయునని అతని యభిప్రాయము. అతఁడు తన యన్నదమ్ములతో నిప్పుడొక్కటిగా నుండినను, ఇఁక నెన్నియో దినములట్లుండట సంభవింపదని యెఱుగును.

ఆరాత్రి భోజనానంతరము ఆకులు చీల్చి తెచ్చిన భార్య చేయి పట్టుకొని నరసింగరావు "ఏమే! మొఖం వేలవేశావు?" అని యడిగెను. అతనికిని పార్వతికిని అన్యోన్యప్రేమ దినదిన ప్రవర్ధమానమగు చుండెను. ఎవరు తిట్టినను, ఎవరు కష్టపెట్టి నను, భర్తను దలంచి ఏమి లక్ష్యము సేయదు.

చిరునవ్వుతో "ఏముంది లెండి? బిచ్చపుదానిని పెండ్లి చేసికొన్నారు గదా. మీకే విచారం వుండవలె".

"ఏమే క్రొత్త మాటలు నేర్చుకొన్నావు? ఏమయిందేమి? లలిత గాని వేళాకోళం చేసిందా. ఆమెకేమి వెంకటేశం కంపెనీకి డైరక్టరు అందు ప్రొప్రయిటరు" అని నవ్వెను.

పార్వతి ముఖమున సంతోషము చేఁగల్గిన వెలుగు కన్పట్టెను, గాని వెంటనే విచారము. "ఏమోలెండీ నా కండ్లు మీరెంత తుడిచినను, మా అత్తగారికి చులకనే గదా. రేపు లలిత పుట్టిన దినం ఆమె తండ్రి బంగారు ముద్దలు బంపును. పైనెల నాల్గవతారీఖున నా పుట్టినదినం. ఉన్న పినతండ్రి బొంబాయి గాజైన పంపు భాగ్యముంటే ఎంత బాగుండును! అంత నోచుకుంటే గదా" యని కండ్లనీరు గ్రక్క బదులిడెను.

నరసింగరావు నవ్వుచు "ఒసే! పిచ్చిదానవు సుమా" యని బుజ్జగించెను. లలిత పుట్టినదినము వచ్చిపోయి నెలయాయెను. కెంపులు పొదిగిన బంగరు టుంగరము వచ్చెను. అత్తగారి యానందమునకు మేరలేదు. తన కొడుకు ఆ నగ నేయేటిపాలో చేయునని విచారము లేదు. ఆమెకుఁ గావలసిన దంతయు గౌరవము, హోదా. అందు చేతనే పార్వతి నిష్టపడి చేసికొనిన కడగొట్టు కొడుకనిన కోపము.

ఆనాఁడు పార్వతి పుట్టినదినము. ఎప్పటివలె నామధ్యాహ్నము వసారాలో ముగ్గురు కోడండ్రును మాట్లాడుకొనుచుండిరి. అల్లరి యనిన పరమప్రీతిగాన కమల పార్వతి నెత్తి పొడుచుచు "ఒసే! నేడు నిశ్చయంగా మీ చిన్నాయన పంపిస్తాడు చూడు. నా జ్యోతిషం చూడు యేం పంపిస్తాడో చెప్పను" అనెను. పార్వతి కేడ్చునంతటి దుఃఖము.

"పార్వతీ"

అత్తగారు పార్వతి నంత మర్యాదతో ఆదరముతో పిలిచినది లేదు. సహజ వినయముతో, నాశ్చర్యము పెనుగొన లేచి త్వరితముగ వీధి ప్రక్క నున్న హాలులోనికిఁ పోయెను. లలితయు, కమలయు వెంటాడిరి. సీతమ్మగారు ఒక బోయివానితో మాట్లాడు చుండెను. ఆమె యెదుటనున్న కుర్చీపై హిందూ పత్రికతో జుట్టిన వస్తువేదో యుండెను.

"పార్వతీ! మీ చిన్నాయనగారు ఏమో పంపినారే. నేడు నీ పుట్టిన దినం గదా"

పార్వతి నమ్మలేదు. ఇది పెద్ద హాస్యమనుకొనెను. ఇంతలో కమల తొందరగా నా కాగితము విప్పి లోనున్న సన్నని పచ్చపట్టు సెల్లా పైకి తీసెను. దాని వన్నెల నభినందించుచు నొక్క కేక వేసెను. పార్వతి గుండె తటతటమని గొట్టుకొనం జొచ్చెను. లలిత కనుబొమ్మలనెత్తి దింపలేదు. సీతమ్మ "ఛీ అరవకు" మని కమలని మందలించి "ఒసే! అడగవే! ఎట్లా వున్నారో! ఏమి చెప్పినారో, అడగవే" యని పార్వతిని నెట్టెను.

అప్పటికి పార్వతి తెప్పరిల్లి, ఇదంతయు నిజమనియు, కల గాదనియు దృఢముగ నెఱిగి సంతోష మొక ప్రక్క తల ద్రిప్పుచుండ, బోయిని చూచి "ఒరే! చిన్నయ్యగారు ఎలా వున్నారురా? విశాల ఇంట్లో వుందా?" అనెను. బోయి తల గోకుకొనుచు "యాందమ్మా! ఎవరికి తెలుసమ్మ. మీ చిన్నాయనగారెవరో! ఈ యింటి సిన్నయ్యోరుండ్లె! బడిపంతులు...ఆయన "ఒరే! ఎంకా ఇలారా! అని పిల్చి ఈడ పొట్లాం చేతికిచ్చి మీ ఇంటి కెల్లి పార్వతమ్మ గారికి ఆమె సిన్నాయన గారంపారంట" మని సెప్పమన్నారు. తల్లీ ఇంతకంటే నానేమ యెరగని తల్లీ. సూడండి, ఆయనిచ్చిన బేడ" అను మాటలు నిత్యాది చెప్పఁదొడగెను. ...పార్వతి నిర్ఘాంతపడి నిలిచిపోయెను. నోట మాట రాలేదు. ఎక్కడి సంతోషమక్కడనే పారిపోయెను. ఇఁకనత్తగారి నెట్లు తల యెత్తి చూచుట? లలిత చిరునవ్వులతోనే చంపివేయును గదా. కమల పొడుపు మాటల కెట్లోర్చుట? అయ్యయ్యో! భర్త తన్నెంత నగుపాటు చేసెను.

అత్తగారు అనవసరముగ నాలుగు కసరి బోయిని పంపివేసెను. పార్వతి కమల చేతులనున్న సెల్లాను లాగుకొని పరుగెత్తుకొని పోయి భర్త మందిరమున తలుపు మూసికొని శయ్యపై గూర్చుండి ముఖమును హస్తయుగముతో గప్పుకొని యేడువ దొడంగెను. ఆనాడు రాత్రి భర్తతో మాట్లాడనే లేదు. నరసింగరావు విధి చిత్రమునకు విచారించుచు బుజ్జగింప జూచెను. గాని వీలు గాలేదు...

రెండు మూడు రోజులాయెను. పార్వతి అయిన దానికి వగచి ప్రయోజనము లేదని ఎప్పటివలె తన పని చేసికొనుచు తిరుగుచుండెను. గాని భర్తతో మాత్రము ఎప్పటివలె మాట్లాడుట లేదు.

లోకమునందలి చిత్రములలో నొకటి ఏమనగా ఒకే వస్తువు, ఒకే కార్యము ఒకనికి విషమగును. మరియొకనికి అమృతమగును. ఒకనికి సంతోష ప్రదంబగును. ఇంకొకనికి దుఃఖభాజనమగును. ఈ వ్యతిరేక భావసరణి వింత వింత మార్గము లనుసరించును. మరియొక చిత్రము ఒకేవిషయము ఇర్వరుకు దుఃఖకరముగ నుండును. వేర్వేరు విధముల దుఃఖకారణమగును. ఉన్న యిల్లు కాలిపోయెను గదా అని సొంతగాడు విలపించుచుండ లాభము పోయనే అని ఇనిష్యురన్సు వాడు నోరు గొట్టుకొనును. అట్టి చిత్రమే మన కథా పాత్రములకు జరిగెను.

తన సిగ్గు చేటునకు గారణమైందున పార్వతి చింతించుచుండ, లలితకును, కొంత కమలకును, తమ కట్టి పుట్టము తమ భర్తలు కొనిపెట్టరు కదా యని చింతింప

దొడగిరి. లలిత భర్తను తూలనాడెను గాని "ఎందుకే అంత మంచి గుడ్డ? వాడు పిచ్చివాడు" అని బదులు చెప్పెను. కమల మగడు, రైల్వేలో క్లర్కు. "మన భవిషికి ఇంతెందుకే" యనెను. గాన వారికి పార్వతిని జూచుకొలది ఈర్ష్య హెచ్చదొడగెను. మునుపువలె పరిహాస మొనర్చుటయే లేదు. పార్వతి మొదట కొంత యచ్చెరువంది కుశాగ్రబుద్ధితో నిజము గ్రహించి తనలోతాను నవ్వుకొనెను. "నీకేం నీ మగడు పట్టు సెల్లాల మీదనే నడిపిస్తాడు' అని లలిత యనునప్పుడు పార్వతి మనస్సు చివుక్కు మనెను. తన భర్త వర్తనమందింతవరకు జూడని క్రొత్త యంశము పరిశీలించెను. ఆహా! తన మీద ప్రేమచేతనే గదా అతడు ఆ పట్టు పుట్టమును కొని పంపించెను. తుదకబద్ధమునకు సైతమొడిగట్టెను. అట్టి ఇతనితో మాట్లాడుటయే లేదు. తానెంత క్రూరురాలు. అని ఆకస్మిక జనిత భావోద్రేకమున తన్నుదాను తిట్టుకొనెను. కాని యెట్లతని ప్రేమార్పణకు బాత్రయగుట.

నరసింగరావు భుజించి శయ్యపై గూర్చుండి దీపపు వెలుతురున హిందూ పత్రిక చదువుచుండెను. పార్వతి తనతో మాట్లాడి దాదాపు వారమయ్యెను. అతని జీవితమును సంతోషజ్యోతి యుక్తముగ నొనర్చుచుండిన దీపకళిక యారిపోవునట్లతని కుండెను. ఎంత మాట్లాడక పోయినను వేళకు తాంబూలము గొనివచ్చు వాడుక వీడలేదు. దర్శన భాగ్యమైనను లభించినందులకే కొంత సంతసించు చుండెను. తలుపు తీయు శబ్దము...పార్వతి వచ్చుచున్నదని పత్రిక పడవైచి చూచుచుండెను...ఏమియా దివ్య సుందర విగ్రహము నిత్యము చెంగావి బట్టలతో మొగము వాల్చుకొని వచ్చెడు పార్వతియా యిది! కాదు పట్టుపావడ, పట్టు సెల్లా....హృదయమా? శాంతింపుము... తానుగొని పంపిన పట్టు సెల్లగాదాయిది.... ఆ మోవిచుట్టు పొరలి పొరలి వచ్చు మందస్మితము లెక్కడివి. చేతదట్ట వడకుచుండెను. నరసింగరావునకు పై వర్ణించిన భావములన్నియు నొక్క క్షణమున దోచినవి....దిగ్గున లేచెను. పార్వతి రెండు చేతులు తన చేతులతో గట్టిగా పట్టుకొనెను. తట్ట సంభ్రమమున క్రింద పడిపోయెను.

"పార్వతీ! ఏమి ఈ మార్పు ఎప్పటి నుండి ఈ దయ" యని తొందరగ నడిగెను.

పార్వతి కనులనుండి యశ్రుకణములుఁ దొరలుచుండెను. రెండు బొట్లు సెల్లా పైబడెను. "నన్ను క్షమించెదరా" యని గద్గద స్వరమున యడిగెను.

నరసింగరావు నానందమునకు మేరలేదు. రెండు చేతులతో ప్రియురాలిని దగ్గరకు నీడ్చుకొని కౌగలించుకొనెను. పాపము పట్టు సెల్లా యంతయు నలిగిపోయెను.

## కథానేపథ్యం ...

శ్రీ పాకాల రాజమన్నారు సంపాదకత్వ నిర్వహణంలో వెలువడిన 'కళ' అనే సాహిత్య పత్రికలో ఈ కథ వచ్చింది. 1925, 26లలో 'కళ' వచ్చేది. ఆనాటికి ఈ పత్రిక నవీనమైన భావాలకు, అభిరుచులకు నిదర్శనంగా ఉండేది. తొలితరం తెలుగు నాటక రచయితలలో పాకాల వెంకటరాజమన్నారు ప్రముఖులు.

ఈ కథ రచించిన 'సుధాకరుడు' ఎవరో, ఏ ప్రాంతం వారో చెప్పడం కష్టం. ఊహించాలి అంతే. బహుశా బరంపురం ప్రాంతం వారై ఉండవచ్చు. ఏమంటే 1920 ప్రాంతంలో బరంపురం నుంచి వెలువడిన 'వేగుచుక్క కథావళి' అనే పత్రికలో కథా రచయితగా ఈయన పేరు కనపడుతుంది. ఆనాటి అవిభక్త కుటుంబాలు, పుట్టింటి వారి సిరిసంపదలు ఆస్తిపాస్తులను బట్టి కొత్త కోడళ్ళను అత్తవారింట గౌరవించడం, కోడళ్ళు అత్తగారి అజమాయిషీలో ఉండడం, ఒదిగి విధేయంగా మసలుకోవడం, జీవన తారుణ్యపు కాపురపు తొలి రోజుల భార్యభర్తల అచ్చట్లు, ముచ్చట్లు ఎంతో నాజూకుగా ఈ కథలో చిత్రించారు రచయిత. పుట్టింటి వారి సంపదతో అతిశయం ప్రదర్శించే కొత్తకోడళ్ళు, ఇతర తోడికోడళ్ళ పుట్టింటివారు పట్టించుకోని వారైతే వాళ్లపట్ల తక్కిన కోడళ్ళు చూపే అలుసుతనం, భార్యాభర్తల అన్యోన్యం ఎంతో హృదయంగమంగా ఈ కథలో కనపడుతుంది. పాత్రోచిత భాష, వాడుక భాష సొగసు కథారచనలో కూడా అప్పుడే కొత్తగా కనపడే వైనం ఈ కథ ద్వార స్పష్టం. ఈకథలో 'భవిషి' అనే కొత్త పదం కనపడుతుంది. సందర్భాన్ని బట్టి 'తాహతు' అని అర్థం చేసుకోవాలి. స్థాయి అనేమో! ఏమైనా వివిధ స్థాయుల నుంచి వచ్చి, వివిధ స్థాయుల భర్తల ఆదరణ, అత్తరికం చవిచూస్తున్న ముద్దరాంఢ్ర ముగ్గురి పుట్టింరోజు ముద్దు ముచ్చట్ల కథ ఇది.

# 17. ఏబదివేల బేరము

కె. రామానుజరావు

చెన్నపట్టణమందలి షాహుకారుపేట లక్ష్మికి నివాస స్థలము. సూర్యోదయము మొదలు రాత్రి పండ్రెండు గంటల వఱకును, ఆ వీధిలో నింటింట లక్ష్మి తాండవ మాడుచుండును. ఆ వీధిలో ధనవంతులగు కోమటుల యొక్కయు, వారి కంటె ధనవంతులగు గుజరాతీల యొక్కయు, వారి కంటెనెక్కుడు లక్ష్మీపుత్రులు మార్వాడీల యొక్కయు నిండ్లుండుటచే వర్తకమునకు ఆ వీధి పుట్టిల్లనుటకు సందియము లేదు. రవ్వలు, కెంపులు, మొదలైన విలువ గల రాళ్ళు మానికలతో గొలుచునట్టి వర్తకులచ్చట నున్నారని చెప్పినచో నచ్చటి ప్రతి ఇంటను రూపాయలు, కాసులు, సవరసులు మొదలైన వెండి బంగారు నాణెములెల్లప్పుడును ఘల్లుఘల్లునుచుండునని వేరుగ జెప్పవలెనా?

ఒకనాఁడుదయము ఏడు గంటలవేళ జగజీవన్‌లాల్ షాహుకారు యొక్క నాలుగంతస్థుల మేడ యెదుట రెండు గుఱ్ఱముల కోచి బండి యొకటి వచ్చి నిలచెను. ఆ బండిలో వెనుక ప్రక్క నొక  పురుషుడును, అతని భార్యయు గూర్చుండియుండిరి. వారికి నెదుట నైదారు నెలల పిల్ల వాని నెత్తుకొని యొక దాసి కూర్చుండి యుండెను. బండి వెనుక చిత్రమైన దుస్తులు ధరించిన గుఱ్ఱపు వాండ్రిద్దరు నిలిచి యుండిరి. బండికి ముందుభాగమున నెత్తుగనున్న యాసనముపై గూర్చున్న సేవకుఁడు దిగి యొద్దకు రాగానే యజమానుడు తనజేబులో నుండి తన పేరు గల విజిటింగ్ కార్డు నొకదానిని తీసి వానికిచ్చెను. వాఁడు ఆ యింటి గుమ్మములో కూర్చున్న సేవకుని చేతికిచ్చి నీ యజమానునకీ కార్డు చూపుమని వానిని లోనికి బంపెను. జగజీవన్‌లాల్ ఆ కార్డును చూచుకొని రాజా ఆఫ్ నర్సాపూర్ అని చదివి తత్తరపాటుతో లేచి బండి యొద్దకు వచ్చెను. ఈ వర్తకుడు గొప్ప రాళ్ళ వర్తకుఁడని విఖ్యాతి జెందినవాఁడు. రవ్వలు, కెంపులు, పచ్చలు, వైఢూర్యములు మొదలైనవి విలువైన మాణిక్యముల వర్తకమే యెల్లప్పుడును చేయుచుండును. పుష్యరాగముల వంటి తక్కువ వెలగల రాళ్లను గాని, వెండి బంగారములను గాని ముట్టనేముట్టడు. అతని పద్దులన్నియు వేలు లక్షలు గల

సంఖ్యలతో నిండియుండును. గొప్ప గొప్ప రాజులు, మహరాజులితని యొద్ద లక్షల కొద్ది వెలగల రాళ్ళను నమ్మికగా తీసికొని పోవుచుండిరి. ఆ రాజులు తగిన మర్యాదలు చేసి వారిని సంతోషపఱచి,వారెక్కుడు రాళ్ళను గొనునట్లు చేయు సామర్థ్య మీముసలి షాహుకారునకుం గలదు. అందుచేతనో ఒకానొక రాజువచ్చెనని తెలిసిన తోడునే మన షాహుకారు తత్తరపాటుతో లేచి ఎదురేగెను. అతఁడు బండి సమీపమునకు వచ్చిన తోడనే, అచ్చట నిలుచున్న సేవకుడు బండి తలుపుల దీసెను. బండిలో నుండి జమీందారుగారు దిగివచ్చి షాహుకారుతో, షేక్‌హాండు చేసి "మీరేనా జగజీవనలాలు షేట్జీగారు" అని యడిగెను. అందుకాతడు 'చిత్తమని' తలయూపఁగా "నేడు బహు సుదినము. ఎన్ని దినముల నుండియో యనుకొనగా నేడు మీ దర్శనము లభించినది. కుబేరుని తరువాత తామే కుబేరులని వినియున్నాను"

"చిత్తము. మీ వంటి రాజాధిరాజుల యనుగ్రహముండ నేను కుబేరుఁడనే. లోనికి దయచేయుడు" అని మాట్లాడుకొనుచు వారిద్దరునులోనికి పోయిరి. వారి వెంటనే జమీందారుగారి భార్యయు, పిల్లను నెత్తుకొన్న దాసియు, షాహుకారు నింటిలోనికి బ్రవేశించిరి. సాధారణముగా జమీందారుల భార్యలకు ఘోషా ఉన్నప్పటికిని ఈ జమీందారుఁడు ఇంగ్లిషు ఫ్యాషన్ గలవాడగుటచే తన భార్యకు ఘోషా లేకుండఁ జేసినట్లు కానవచ్చుచున్నది. ఘోషామాత్రము లేదు కాని, యీమెకు వంటిమీద నగలు మాత్రమపరిమితముగా నుండెను. మెడలోనున్న సూర్యహారమే యొక పదివేలు, చంద్రహారమే పదియైదు వేలు చేయవచ్చును. కాళ్ళకున్న బంగారు పాంజేవులు అయిదువేలయిన ఖరీదు చేయవో? అట్టే దాసి భుజముపై నిద్రించుచున్న బాలునికి మిక్కిలి విలువగల నగలు పెట్టబడెను.

వారందఱును లోనికివెళ్ళిన తరువాత, ఆ షాహుకారు, మేడమీద గొప్ప గొప్ప రాజుల కొఱకై వెలగల కుర్చీలతోను, సోఫాలతోను, పటములతోను, అలంకరింపబడిన హాలులోనికిఁ దీసికొనిపోయి జమీందారుగారి నొక కుర్చీమీద కూర్చుండబెట్టి అతని భార్యకు కొంచెము చాటుననున్న యొక స్థలమును కూర్చుండటకు చూపించెను.

తానును జమీందారుగారి నెదుట నున్న యొక కుర్చీమీఁద గూర్చుండి నిట్లు సంభాషింపఁదొడఁగెను.

జగ : "అయ్యా మీరు మా యింటికి వచ్చుట సుకలిత విశేషము. తమ రాజధాని ఏ జిల్లాలోదండి"

జమీం :"మా సంస్థానము గోదావరి జిల్లాలోనున్నది. మిక్కిలి గౌరవము గల సంస్థానము. ఇతర జమీందారులకులేని యనేక గౌరవములు మాకు కలవు. మేము కలెక్టరును చూచుటకు వెళ్ళినపుడు పదిహేను ఫిరంగులు కాల్చెదరు. వెండి కుర్చీల మీఁదగాని మేము కూర్చుండము. కాని నేనింగ్లీషు యెడ్యుకేటెడ్. జంటిల్‌మన్ అయినందున ఈ పిచ్చి ఆచారములు పాటింపను. టట్ నాన్సెన్సు అని మా అడవారి ఘోషా కూడ తీసి వేసితిని. అంతా నొక్కసారిగా తీసివేసిన బాగుండదని మా వాండ్రు మగవారినెదుటనే కూర్చుండక కొంచెము ప్రక్కగా కూర్చుండుదురు. సంస్థానమునకు పేష్కష్ పోగా మూడు లక్షల ఆదా కలదు. ఈ సంగతులకేమిగాని నిన్నటిదినము జయపురము మహారాజుగారు మీ వద్ద నుండి కొన్న లక్ష రూపాయల జవాహిరి చూచితిని. వారికి నాకు మిక్కిలి స్నేహము. బాల్యము నుండి ఒక ప్రక్కన పెరిగినట్లు పెరిగినాము"

జగ :"చిత్తము, మహారాజులంగారికి నాయందు మిక్కిలి అనుగ్రహము. ఈ సంవత్సరము వారు నావద్ద ఎంత లేదన్నా పది లక్షల జవారి కొన్నారు"

జమీం :"రవ్వలంటే మీ వద్దనే రవ్వలు. ఏమి ఆ కాంతి? ఇదివఱకు రవ్వలనేకము కొంటినిగాని ఇట్టి వెన్నుఁడును చూడలేదు. ఇంకను మీ వద్ద అట్టి రవ్వలు గలవా?"

జగ :"ఎన్ని కావలయునో అన్ని కలవు. కొనువారుండిన రవ్వలకేమి తక్కువ. తెప్పించెదనా?"

అని అడిగి జమీందారుగారు తల యూపగానే లేచి లోనికిఁ బోయి సేవకునిచే నొక పెద్ద ట్రంకు పెట్టెను పట్టించుకొని వచ్చి బల్లమీద పెట్టి దానిందెఱిచి రవ్వల పొట్లము నొకటి వెనుకనొకటి తీయుచు జమీందారు గారికి చూపదొడఁగెను. అతఁడు ఇవి బాగున్నదని బాగుండ లేదనియు, అవి బాగున్నవి బాగుండలేదనియు జెప్పుచు దీని వెల యెంత దాని వెల యెంత అని అడుగుచు "మీరు మిక్కిలి సత్యసంధులని జయపుర మహారాజుగారు నాతో చెప్పినంతనే వచ్చితిని. క్రమమైన వెలఁ జెప్ప వలయును సుమా"యని నడుమ నడుమ ననుచు తనకు చక్కగ గానుపించిన వానిని భార్య వద్దకి తీసుకొనివెళ్ళి చూపుచు మరలదెచ్చును. ఒక గంట వఱకు రవ్వల బేరము చేసెను. తుద కేబదివేల గల రవ్వలను బేరము చేసి విడిగా తీయించెను. వర్తకుఁడు ధర కొంచెమధికముగా జెప్పుచున్నను మన జమీందారు మాత్రము వాని

ధరలు చక్కగ నెఱింగినవాఁడగుటచే మోసపోలేదు. షాహుకారు జమీందారుగారి రత్నపరీక్ష జ్ఞానమునకు మిక్కిలి యాశ్చర్యమందుచు నడుమ నడుమ అతనిని పొగడుచుండెను.

ఇట్లు సిసలు పఱచిన రవలనన్నిఁటిని చిన్న చిన్న పొట్లములుగా గట్టి ఆ పొట్లముల నన్నింటినీ జమీందారుగారు తనయొద్దనున్న పెద్ద మనీబాగ్‌లో పెట్టి దానిని తనజేబులో నుంచుకొని షాహుకారుతో నిట్లనియె.

“అయ్యా, అప్పనగా నాకు చీఁదఱ. కొన్న సరుకులకు వెలవెంటనే ఇయ్యవల యునని నా తాత్పర్యము. మేము ఇంటి నుండి బయలుదేరునప్పుడు మీ వద్దకు రావలెనని యనుకొనలేదు. రేపు రావలెనని తలంచితిమి. ఈ త్రోవన నేడు మఱియొక చోటికి పోవుచుండగా నదియే మీ యిల్లని మా బండివాడు చెప్పెను. అందుచే మిమ్ముల చూడవలెనని యాగితిమి. సరే చూచినందుకు లాభమేయైనది. మొదటనిచ్చటికి వచ్చెదమని తలంపనందున పైకము వెంట తేలేదు. నేను యింటికి వెళ్ళి పైకము తీసుకొని వచ్చెదను. అంతవఱకు మనవాండ్రిక్కడనే యుండెదరు. తండియార్పేట వఱకు మనవాళ్లను తీసుకొని వెళ్ళవలసిన పనివున్నది. కావున ఇప్పుడు వీరినింటికి తీసుకొని పోవుట యెందుకు” అని చెప్పి యాతండు వెంటనే లేచి భార్యతో –

‘నే వచ్చువఱకు నీ విక్కడనే యుండు’ మనిచెప్పి కోచిబండి నెక్కి వెంటనే వెళ్ళిపోయెను. భార్యాపుత్రులను తన ఇంటనే యుంచి వెళ్ళుటకు జమీందారు గారొక కారణము చెప్పినను, జగజీవనలాలు మాత్రమా కారణమును నమ్మక, జమీందారుగారు మిక్కిలి మర్యాదగలవాడగుటచే, తన నమ్మకమునకై వారిని తన ఇంట దించిపోయెనని తలcచి, అతని యుక్తికిని, మర్యాదకును, మిక్కిలి సంతసించెను.

జమీందారుగారు వెళ్ళి అరఘంటయిన తరువాత వాని సేవకుడు పరుగెత్తుకొని మేడమీఁదికి వచ్చి ‘దొరసానిగారూ! ఖజానా తాళపుచేతుల గుత్తి మీవద్దనే యున్నదఁట. దొరగారు మఱచి ఇంటికి వెళ్ళినారు. తొందరగా తీసుకొని రమ్మని నన్ను పంపినారు. నా చేతికిచ్చిన నేను త్వరగా వెళ్ళెదను. ప్రొద్దెక్కుచున్నది. పైకము తెచ్చి షాహుకారు గారికిచ్చి మనము తండియార్పేట వెళ్ళవలసి యున్నది” అని తొందరగా పలికెను. అంతనామె తాళపు చేతుల గుత్తి వానిపై వేసి తొందరగా పొమ్మని యాజ్ఞాపించెను. వాఁడు పదియడుగులు వేయcగా మఱల వానినిఁబిలిచి ఏమో యాలోచించి ‘గుత్తి నిటుతే’ యని తీసికొని “దినములు మంచివి కావు. ఈ దినములలో ఎవ్వరిని నమ్మ

కూడదు. లక్షల కొలఁది ధనమున్న ఖజానా తాళపుచేతులు వీనికిచ్చి పంపిన వీడేమి చేయునో? ఇది వఱకు వీఁడు నమ్మిక కలవాఁడే గాని ధనముఁజూచిన ఎట్టి వారికి దుర్బుద్ధి పుట్టకమానదు. ఏమండీ షాహుకారుగారూ నిజమేనా?" అని యడుగగా నాతండు "నిజమే నిజమే. డబ్బుయెడల బహు జాగ్రత్తగా నుండవలెను" అని గంభీర వాక్కుతో తల యూపెను. అంతనామె "అట్లయిన నేనే తాళపుచెవుల గుత్తిని తీసుకొని వెళ్ళి పైకము తీసుకొని మేమిద్దఱము వచ్చెదము. నేను వచ్చు వఱకు అబ్బాయి పాలకేడ్చునేమో కావున కొంచెము పాలిచ్చి వెళ్ళెద" నని, "సీతా సీతా" యని దాసిని పిలిచెను.

అంతవఱకా దాసి పిల్లవానిని జోలపాడి నిద్రబుచ్చుచు మేడ క్రింద నొంటరిగా నుండెను. దాని జోల పాట మాత్రము పైకి చక్కగ వినఁబడుచుండెను. యజమానురాలు పిలిచిన తోడనేయది పిల్లవానిఁదీసికొని యజమానురాలి వద్దకు వచ్చెను. పిల్లవాని శరీరమంతయు నగలతో నిండి యుండెను. ముఖము మీద గూడ రవ్వల పతకములు, కెంపుల పకములు, పచ్చల పతకములు వ్రేలాడుచు ముఖమును కప్పివేసి యుండెను. ఆ పిల్లవానిని తెచ్చి యిచ్చిన తోడనే, యామె వానికి పాలిచ్చి యొక చిన్న పరుపు దెప్పించి యచ్చట వేయించి వానినచ్చటఁబరుండఁబెట్టి భద్రమని దాసికిఁజెప్పి తన శరీరము మీది యేబది యరువది వేల విలువగల నగలను తీసి యా పిల్లవాని ప్రక్కనే యుంచి "మీ నమ్మిక కొఱకు వీనినిక్కడ నుంచుచున్నానని" షావుకారుతో చెప్పెను. అంతనాతఁడు నవ్వి "కోటి వెలగల మీ కుమారునే ఇచ్చట నుంచుచున్నపుడు వేరె నగలుంచవలయునా? ఒకరిపై నొకరికి నమ్మిక లేనియెడల కలియుగ మెట్లు సాగు"నని, "మీరు వెళ్ళుటకు నా కోచిబండిని తెప్పింతునా?" అని యడిగెను. అందుపై అచ్చటనున్న సేవకులు "అక్కరలేదు, నేను నడచివచ్చిన తాళపు చేతిగుత్తి తీసికొని వచ్చుట కాలస్యమగునని నా యజమానుఁడు నన్ను కోచిబండి మీదనే పంపెను. అది వాకిట సిద్ధముగా నున్నది" అని చెప్పెను. అంత నా యజమానురాలును, సేవకుఁడును బండిలో నెక్కి వెడలిపోయిరి.

యజమానురాలు వెడలిన కొంతసేపటికి యాదాసి షాహుకారు వద్దకు వచ్చి "అయ్యా, బీదదానిని నన్ను మఱవకుడు. మా దొరవారు మీ యొద్ద నెన్నో రాళ్ళు కొన్నారు. మీకింత లాభమైనప్పుడు నాకు కొంచెము యీనామియ్యకూడదా? దొరసాని గారితో చెప్పి యింకా రాళ్ళు కొనునట్లు చేసెదను" అని పెక్కుమాటలు చెప్పి ఎప్పుడెవ్వరి కేమియు నియ్యని లుబ్ధాగ్రేసర చక్రవర్తియగు జగజీవన్‌లాలు యొద్ద నుండి యొక

రూపాయి బహుమానము వడసెను. రూపాయి చేతిలో పడగానే అది "అయ్యా మాది శూద్రజన్మము. కల్లుగాని సారాగాని త్రాగనిది యుండలేము. మా దొరగారికి దొరసాని గారికీ పేరన్న గిట్టదు. నెలదినముల నుండి లేక చచ్చిపోవుచున్నాను. వారు వచ్చువఱకు ఈ ప్రక్క యంగడిలోనికి పోయి మీరు దయచేసి రూపాయితో పావులా సారా తాగి వచ్చెదను. నిముసములో వచ్చెదను. అంత వఱకు చిన్నదొరగారిని కొంచెము చూచుచుండుడి. నిద్రలో ఏడ్చెనేని కొంచెము జోకొట్టుడి" అని చెప్పి దాసి సారాయి అంగడి కొఱకు వెలుపలకు వెడలిపోయెను.

జగజీవన్‌లాల్ షాహుకారు తనకా దినమున మంచి లాభము వచ్చెనని సంతసించుచు జమీందారుగారి రాకకెదురు చూచుచుండెను. పది ఘంటలాయెను. పదునొకండు ఘంటలాయెను. పండ్రెండు ఘంటల సమయమై 'ధమ్మ'ని ఫిరంగి మోత వినఁబడెను. దాసిగాని, జమీందారుగాని, అతని భార్యగాని, సేవకుఁడు గాని తిరగి రారైరి. షాహుకారుకు గొంత సంశయము పుట్టఁదొడఁగెను. కాని కడుపునపుట్టిన బిడ్డను, ఇంత ధనమును విడిచి వారేల పోయెదరని యాతఁడు కొంతవఱకు సమాధానము చేసికొనెను. ఇంతలో నొంటిగంటయ్యె. రెండు వేసిరి. అప్పటికైనను ఎవ్వరు తిరిగి రాలేదు. పరుండి నిద్రఁబోవుచున్న పిల్లవాడైనను లేవలేదు. కొంత యేడ్వనైనను, యేడువలేదు. అయ్యో! పాపము పిల్లవాఁడు ఆహారము లేక సొమ్మ సిల్లెనేమో యని ఆ షాహుకారు ఆ పిల్లవాని యొద్దకుపోయి వాని నెత్తుకొని చూడ బోవనేమి యాశ్చర్యము! వాడు పిల్లవాఁడు కాఁడు. అది పిల్లవాని యంతయాకారము గల యొక జాతిబొమ్మ. అందుకా షాహుకారాశ్చర్యపడి తమ సేవకులనంతిని పిలిచి దానిని చూపెను. తుదకు వారందఱును అదియొక మోసమని తెలిసికొని "మోసమైన మనకేమి మన రాళ్ళ వెలకంటె మించిన నగలున్నవి. వారెక్కడకుఁ బోయినమనకేమి" యని తలఁచి నగలకు మదింపు వేయసాగిరి. ఒక్కొనగ తీసి చూచిన కొలఁదిని అవి గిల్టునగలేకాని నిజమైనది కావని స్థిరపడెను. ఆ నగలన్నియు నూరు రూపాయలకంటె నెక్కుడు వెలచేయవు. ఇదంతయుఁ జూచి జగజీవన్‌లాలు గుండె కొట్టుకొని యేడువ సాగెను. పోలీసువారికీ సమాచారమును తెలిపిరి. రహస్యపు పోలీసువారు కొందఱును జగజీవన్‌లాలు సేవకులు కొందఱును మారువేషములతో నర్సాపురము వెళ్ళి విచారించి నర్సాపురపు జమీందారీ సృష్టియందెచ్చటను లేదని నిశ్చయించి తిరిగివచ్చిరి.

ఎంతమంది జమీందారులనో మోసపుచ్చిన తనను ఈ బూటకపు జమీందారు మోసపుచ్చెఁ గదాయని చింతించుట తక్క జగజీవనలాలుకు మఱియేమి యుపాయమును లేకపోయెను.

## కథా నేపథ్యం ...

ఇరవయ్యో శతాబ్ది తెలుగువారి సామాజిక, సాహిత్య సాంస్కృతిక జీవితాన్ని బాగా ప్రభావితం చేసిన ఐదుగురిలో కొమర్రాజు లక్ష్మణరావు ఒకరు. తక్కిన నలుగురు కందుకూరి, గిడుగు, గురజాడ, కాశీనాథుని నాగేశ్వరరావు. భారతీయ భాషలలోనే మొట్టమొదటి విజ్ఞానసర్వస్వ నిర్మితిని తలపెట్టినవాడు లక్ష్మణరావే. ఆయన స్థాపించిన విజ్ఞాన చంద్రికా మండలికి శతజయంతి (1906–2006) జరపాలి. పుస్తక పఠనం ఉద్యమ ప్రబోధంగా నిర్వహించాడాయన. నూరేళ్ళ కిందటనే విజ్ఞానచంద్రికా మండలికి పదివేలమంది చందాదారులుండే వారంటే ఆయన తెలుగువారిని ఎంతగా ప్రభావితం చేశాడో ఊహించవచ్చు. నాగపూరులో చదువుకున్నందున జాతీయ సంస్కృతి ఉద్యమ ప్రభావం ఆయనపై చాలా ఉంది. మరాఠీ భాషలో ఆయన పండితుడు. మరాఠీ భారతంలో ఒకపర్వం ఆయన పరిష్కరించి ఇచ్చారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ వంటి మహనీయులతోనే ఆయన ఐతిహాసిక ప్రదేశాల, పురాణ విజ్ఞాన విషయాలవాద వివాదాలలో పాల్గొన్నారు. భారతీయ భాషలు ఏడెనిమిదింటిలో ఆయనకు చెప్పుకోదగిన పాండిత్యం ఉండేది. ఆధునిక తెలుగు సాహిత్య నిర్మాతలలో, వ్యవస్థాకృతమైన కృషి సాగించినవారిలో, పరిశోధకులలో ఆయన తొలి తరంలో గొప్పవారు.

ఈ కథ ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలో వెలువడింది. తెలుగు సాహిత్య చరిత్రలో ఓం ప్రథమంగా ప్రత్యేక సంచిక అంటూ వెలువడటం అదే మొదటిసారి. 1910లో ఈ సంచిక బొంబాయి నుంచి వెలువడింది. ఆనాడు వివిధ రంగాలలలో విశిష్ట వ్యక్తిత్వం గల మూడు వందలమందికిపైగా తెలుగువారి శతాధిక ఛాయాచిత్రాలతో ఈ సంచిక ఆంధ్రపత్రిక చందాదారులకు ఉచితంగానూ, తక్కినవారికి రెండున్నర రూపాయలకూ లభిస్తుందని ప్రకటన చేశారు. విజ్ఞాన సర్వస్వంలాగా తీర్చిదిద్దిన

ఇంత గొప్ప సంచిక ఉచితంగా చందాదారులకివ్వటం, తెలుగువారి మొట్టమొదటి దిన పత్రికను ఎంత వ్యాపార దక్షతతో తాదాత్మ్యంతో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు నిర్వహించారో తెలుస్తుంది. ఈ తొలి ఉగాది సంచిక వెలువరించడంలో, రచనల ఎంపిక, ప్రమాణాలు, సాహిత్య విషయ ఆకర్షణల విషయంలో కాశీనాథుని వారు కొమర్రాజు వారిపై చాలా ఆధారపడినట్లు తోస్తున్నది. ఏమంటే ఈ సంచికలో కొమర్రాజు లక్ష్మణరావు గారివి ఐదు రచనలదాకా ఉన్నాయి. భాషా సాహిత్య చరిత్ర, జాతీయైక్యత విషయాలతో కొమర్రాజువారు అప్పటికి అత్యంతాధునిక ప్రక్రియ అయిన కథను కూడా రాశారంటే ఇవాళ మనకు ఆనందమూ ఆశ్చర్యమూ కలుగుతాయి. మొహమాట పడినందువల్లనేమో ఈ కథను అసలు పేరుతో కాకుండా అదే స్ఫూర్తినిచ్చే 'రామానుజరావు' (లక్ష్మణరావే కదా) అనే పేరుతో ఈ ఉగాది సంచికలో ప్రచురించారు కొమర్రాజు వారు. ఇది ఇంచుమించుగా గురజాడ వారి 'దిద్దుబాటు' కు సమకాలికమే. వీటి ప్రచురణలో కేవలం ఒకటి రెండు నెలలు మాత్రమే తేడా. బహుశా తొలితరం తెలుగు కథా రచయితలంతా, కథలో కొసమెరుపు కాంక్షించినట్లున్నది.

కొమర్రాజు వారు సరళ గ్రాంథికమే రాసినా ఎంతో హృద్యంగా ఉంది ఆయన భాషా శైలి. చాలా సరళంగా, స్పష్టంగా ఉంది కథాకథన నిర్మాణం కట్టుదిట్టంగా, చాకచక్యంగా, చమత్కారభరితంగా నిర్వహించారు. ఇప్పుడు చదువుతున్న పాఠకులు కూడా చివరిదాకా చదివిన తరువాత విస్తుపోతారు. ఈ ముగింపు ఎవరి ఊహకూ అందదు. తెలుగులో కథాప్రక్రియ ప్రారంభమై వెలువడిన మొదటి రెండు మూడు కథలలోనే ఇటువంటి కథలు రావటం విస్మయకరమే. సుమారు నూరేళ్ళనాటిది ఈ కథ. కథా రచయిత లోకజ్ఞానం, పరిశీలన శక్తి, మానవ స్వభావ నిశిత పరిశీలనం, సంఘటనల కూర్పు, నేర్పు ఈ కథను గొప్పకథ చేయకపోయినా మంచికథను చేస్తాయి.

అంత గొప్ప పండితుడు, పరిశోధకుడు అయిన లక్ష్మణరావు కథ రాయడమే గొప్ప. గురజాడ వీరికన్నా 15 సం.లు పెద్ద. ఈ కథ రాసేనాటికి లక్ష్మణరావుకు 33 ఏళ్ళు. ఆ రోజుల్లో ఇటువంటి మోసం ఒక పత్రికలో ప్రచురితమైంది. ఆ ఆధారంగా ఈ కథ శ్రీ లక్ష్మణరావు రాసి ఉంటారు.

# 18. మన పద్ధతుల నితరులెట్లు భావించుచున్నారు

*– వెదురుమూడి శేషగిరిరావు*

కలక్టరు గారును అసిస్టెంటు కలక్టరుగారును సర్కీటు బయలుదేరిరి. మామిడి తోటలో డేరాలు వేయబడెను. సాయంతరమైనది. ఎండ వేడిమి తగ్గినది. సమీపమున నున్న పడవల కాలువలపై నుండి చల్లగాలి వీతెంచుచున్నది. డేరాలకు ముందుగ రెండు కాన్వాసు మడత పడుక కుర్చీలు వేయబడినవి. మడత చేతులు విప్పి కాళ్లు చాచుకొని పండుకొనుటకు కూడా ననుకూలమైన కుర్చీలవి. పొట్టలావు పొగచుట్టల రెంటి నిరువురును కాల్చుచు నా కుర్చీలపై దొరలిద్దరు గుప్పు గుప్పుమని విడుచు పొగ యాస్థలమంతయు నావరించుచుండ సగము పడుకొనియు సగము కూర్చుండియు నుండిరి. ఇద్దరును సీమదొరలే. వారే కలెక్టరును, అసిస్టెంటు కలక్టరును. కలెక్టరు విక్సు దొరగారు జిల్లా కంతటికిని నధికారి. అయిసిలీ దొర సివిలి సర్వీసు పరీక్షలో కృతార్థుడై పని నేర్చుకొనుటకు యీ జిల్లాకు పంపబడిన వారుగాన నసిస్టెంటు కలక్టరుగ పని నేర్చుకొనుచున్నారు. కలక్టరుగారు ప్రసంగమిట్లారంభించిరి."నా సిరస్థదారుని సంగతి ఏమో చిత్రముగా నున్నది. నాకేమియు తెలియకుండనున్నది"

"అగునగును, నాకతడేమియు నచ్చనే లేదు. అతని దొంగచూపులను, అతి వినయములును జూడనెవరికైనా నసహ్యము కలుగకపోదు. మనమే మాట చెప్పినా నా మాట మననోట రాకమునుపే యతడు చిత్తము చిత్తమని యన్నిటికి తలయూపును. చుంచువలె నడుగుజాడ వినబడకుండ నడుచుచు వంగి వంగి సలాములు చేయు చుండును" అని అసిస్టెంటు కలక్టరనిరి.

"మీరతని స్వభావమును బాగుగ కనిపెట్టలేరు. లేకున్న మీరట్లనరు. అది నిజమైన సౌమ్యత గాదు. ఒక్కొక్కప్పుడతడు పెంకెతనమును చూపించును. అట్టి తరుణముల యందెట్టి శాంతునకైనను కినుక రాకమానదు. అతడెల్లపుడును వినయము కలిగియుండువాడుకాడు – మనయెదుట నాతని ప్రవర్తనమంతయు మాయ నటనము. నేను చెంత లేననుకొని యొకసారి యతడొక గుమాస్తాతో "బుద్ధిమంతుడు నన్ను

గౌరవము చేయడు. బుద్ధిహీనుడు నన్ను గౌరవము చేయలేడు" అనియనగ నేను వింటిని. నేనదియాలోచించుట లేదు. అతని నమ్మదగని ప్రవర్తనమును మరియు నీ విషయమున నేనతని నేరము గల ప్రవర్తనమును దలచుకొని న నాకచ్చెరువగుచున్నది.

"అది యేమి. అతడేమి చేయ సాహసించెను"

"మీరు రాక ముందతడిచటికి వచ్చెను"

"దరిశనము చేయుటకు గాబోలు. ఆ దరిశనములకు హద్దును పద్దును కనపడుట లేదు"

"కాదు, ఐదురోజులు (కాజుఅలు లీవు) సెలవు కావలెనని యడిగినాడు. నేను మొదటనీయ నంగీకరించలేదు. జమాబందిలో సెలవియ్యనంటిని గాని యతడట్టే పట్టి బ్రతిమాలి పీకులాడగ చివరకిచ్చితిని. ఇప్పుడతనికీ సెలవెందుకో"

"తిరుపతికి పోయి యతని కొడుకు తల వెండ్రుకలు గౌరగించుటకో లేక అతని ముసలమ్మకిరువదియవ తద్దినము పెట్టుటకో కాబోలు"

"అదియు నిదియు కూడా గాదీ రెంటికన్న తెలివి తక్కువయైనట్టియు యపాయ కరమైనట్టియు వేరొకపని చేయుటకు. అతడట్టి పనిచేయుట కెట్లంగీకరించునో నేనెంత మాత్రమూ ఊహింపజాలకున్నాను. అతడు కేవలము మూర్ఖుడేమో అనుకొన్న కాదని మీకు గూడ తెలిసియుండవచ్చును.

"వెస్ట్రను ఫిలాసఫీ" ని గూర్చి యొకనాడు నేను ప్రసంగవశమున ముచ్చటింపగ నతడెంతయు నుత్సాహమున నా విషయమున ముచ్చటించుటచే నాకెంతయు సంతసము కలిగినది. అతడు హైందవమత కర్తల భాష్య రచనను గురించి యిచ్చిన యుపన్యాసము విద్వాంసులందరు మెచ్చదగియున్నది. ఆ యుపన్యాసమిచ్చు నావేశమున నొకటి రెండు గంటలతడు నన్ను "యు, యు" అని సంబోధించెనే కాని "యువరానరు" అని పిలుచుటకు గూడ మరచిపోయెను. పిమ్మట నేను చాల మెచ్చితి నని చెప్పగ నతడు తనకు "ఫిలాసఫీలో గోల్డు మెడలు" యివ్వబడినదనియు తాను బి.ఏ. పరీక్ష ఫస్టుక్లాసులో "ప్యాసై"నాననియును, యిప్పటికిని పురాతన సంస్కృత గ్రంథములను చదువుచుందుననియును అతడు చెప్పెను.

అయిసిలీగా రచ్చుటకూర్చుండినది మొదలు గాల్చినవి మూడు చుట్టలు. మరల నాల్గవ చుట్ట నంటించుచు "అతని లంచగొండితనమును గూర్చి మనము విన్న

సంగతులు నిజమేయగునెడల యతని వేదాంత విద్యా పరిశ్రమ యంతయు బూడిదలో పోసిన పన్నీరగునని పలికిరి."

"మొదట నావిషయమున గూడ నేను సందేహ పడియుంటిని గాని యతడు మొదట పనిలో ప్రవేశించుసరికతనికి మిక్కిలి కొద్ది జీతము. ఈ దేశమున మామూళ్ళ నడుగకుండ బలవంతమున పైన బడవేసెదరు. గాన సులభముగా ప్రతివాడును లంచముల కలవాటు పడును. అతడు చేసిన సిఫారసులును ఏర్పాటులును నేను చాలవరకు మనస్సాక్షికముగ విచారించి నాకు న్యాయమని తోచినట్లు చేయుచుందును గాని అతని యిష్ట ప్రకారము చేయను. అంతకన్న నేనేమి చేయుటకు నవకాశము కనుపడుట లేదు. ఇక్కడి ప్రజలు లంచములిచ్చుటకును యిచ్చి లేదని నేరస్థులను కప్పి పుచ్చుటకును వెనుదీయని వారగుటచే కక్కుర్తిని మానిపించుట మిక్కిలి కష్టము. అది యటుండనిండు. ఇంత చదువు చదివితిననియు, యింత గొప్ప వేదాంతి ననియును బడాయి చెప్పుకొను నీతడు కట్టుబోతు మంత్రములను, దయ్యములను నమ్మి తన యేక పుత్రిక నకాల మరణము వాత బడద్రోయుటకు తాను గూడ సహకారి యగు నంతటి యవివేకియగుటకు నాకు మరింత వింతగనున్నది.

"ఇది మరింత ప్రమాదకరముగ నున్నదే. ఇతడిప్పుడేమి చేయుచున్నాడని" యధికమైన యాసక్తితో అయిసిలీ దొర యడిగెను.

"ఇతని కొక్కతెయె ఆడుపిల్ల. ఆ పిల్లయనిన నితనికి పంచప్రాణములు. ఆమె సౌఖ్యమునకై యిదివరకు తాను వేలకొలది రూపాయలు వ్యయము చేసితినని యతడే నాతో చెప్పెను. ఆమె తన యత్తవారింటనున్నది. అక్కడనామె నొక క్రూరమైన యాడు దయ్యము పట్టుకొనినదట. ఈ సంగతి నాతో నా భార్య మొదట చెప్పినది. ఇతడు తన కష్టసుఖములను నాతో చెప్పుటకు కొంచెము భయపడును గాని నా భార్యతో నెక్కువ ధారాళముగ చెప్పుచుండును. నేనది విని దయ్యముగాదు రోగమని గ్రహించి పెద్ద డాక్టరు గ్రీసు గారికి చూపించుమని చెప్పితిని. అందులకతడు సందేహించెను కాని నా మాట మీరలేక చూపించెను. గ్రీసుగారీ విషయమున వ్రాసిన ఉత్తరమిదుగో చూడు" డని కలక్టరు గారు అయిసిలీ గారి కిచ్చిరి.

మదనపల్లి
20వ జ్యూన్ 1909

మీరు మీ శిరస్తదారుని బహు మంచివానిని నా చెంతకు బంపితిరి. చాలా సంతసించితిని. ఇతనిని మీరు వినోదార్థము నాకడకు బంపితిరేమోయని తోచుచున్నది.

మీ చీటి నాతడు మొన్నటియుదయమున నాకు చూపించెను. మరల సాయంతరమే తన పుత్రికను జూచుటకు నన్నుగొని పోవచ్చెను. వారింటికి పోతిమి. ఆరంభమునందే ద్వారబంధము శిరస్పర్శన పూర్వకము నాకాతిథ్యమొసంగినది. నేను తల తడిమి చూచుకొనుచు తలకు దెబ్బ తగిలినను నీ గడియకు నా క్రొత్తటోపీ మాత్రము పాడు కాలేదంతే చాలునని, సంతసించుచుండగ నపశకునమైనదని మీ శిరస్తదారుడు బిగ్గరగా సణుగు కొనసాగెను. ఒక చిన్న చీకటి కొట్టులో నారోగియున్నది. నా బలవంతము మీద కొంత సేపటికామె నీవలకు తీసుకొని వచ్చిరి. ఆమె మిక్కిలి యర్భకురాలు. ఆమె నేత్రములు కళావిహీనములై యుండెను. ఆమె యౌవనవతియనుటకన్న పిల్లయని పిలుచుటయే యుక్తమని నాకు తోచినది. ఆమెకు పండ్రెండేండ్లకన్న నెక్కువ లేవు. ఆమె భర్త కూడ నచటనే యుండెను. అతడిరువది రెండేండ్లవాడు. మిక్కిలి బలశాలి. మీరు నమ్ముదురో లేదోగాని వారిద్దరును కాపురము చేయుచున్నారట. ఆమె కాపురము నకు వచ్చి ఆరు మాసములైనదట. ఆమెకు మూత్ర కృచ్ఛా సంబంధమగు నీరసరోగము కలిగినది. ఆ రోగము వలననే నరములలో బలహీనత కలిగి నాలుగు నెలలనుంచి బలమయిన "హిస్టీరియా" క్రింద మారినది. నేనుండగనే ఆమెకొక "ఫిట్టు" వచ్చినది. ఆమె తన గొంతు తానే పిసికికొనుచు కేకల వేయుచు బాధ చేత నేలబడి దొరలసాగెను. నేను సహజముగ మనశ్చలనము గల వాడనుగాను గాన యుంగరాల తన వెండ్రుకలు ముడివీడియొడలెల్ల వ్యాపింప బాధచే పొరలాడు నాసుకుమార గాత్రి పడుచున్నబాధ చూడ నా గుండె ఝల్లుమని పోయినది. ఆమె అత్తగారట. కొంచెము మోటుతనము గల యొక స్త్రీ యామెను ప్రశ్నలడుగ సాగెను. అప్పుడామెను పట్టుకొనిన దయ్యము తానొక చింతచెట్టు మీద నుంటిననియు నొక మంగళవారము సాయంతన మీ పిల్ల యొంటరిగ నచటికి వచ్చెననియును తాను పట్టుకొంటిననియు వరుసగ పూర్వోత్తర సంబంధము చెడకుండ నొక కథ చెప్పసాగెను"

ఇంతలో నామెకు చికిత్స చేయుచున్న భూతవైద్యుడు వచ్చెను. అతడు భయంకరాకారము గలిగి ఒడలి నిండ విభూతి పూసుకొని చేత వెండికట్లు గల నొక భూత బెత్తమును పట్టుకొని యుండెను. అతనిని చూడగనే ఆ పిల్ల లేచి కూర్చుండి పాటపాడినట్లు కూనిరాగముతో మాటలాడుచు తన తలనొక వింతరీతి నాడింపసాగెను. అతడేమో తనలో తాను సణుగుకొని ఆమెను కొన్ని ప్రశ్నలడిగెను గాని అవి నాకు సరిగ తెలియలేదు. నేనింక చూచుచుండగనే యతడామె నా బెత్తముతో మోద సాగెను. నాకికనొడలు తెలియలేదు. ఆ బెత్తము ఊడబెరికి వానిని తాడించితిని. నాదెబ్బ తిని

యా భూతవైద్యుడు తానిదివరకెన్నడును చూడని యొక శంఖిణి దయ్యము నాకు పట్టినదని యనుకొనునట్లుగ నేను వానికి నా బాహుశక్తినించుక చూపితిని. అప్పటి కప్పుడే వాడు కొట్టిన దెబ్బలచే నామె యొడలినిండ తట్లు తేరినవి.నేను వాని నాపక పోయినచో వాడామెనింకను కొట్టియేయుండును. నేను వాని భూతబెత్తమును ముక్కలు ముక్కలు చేసి పారవేయుసరికి మీ సిరస్తదారును తక్కిన యింటివారును నిశ్చేష్టులైరి. ఆ వైద్యుడామె మేలుకొరకే కొట్టుచున్నాడని తనకు తెలుసును గాన తానూరకుంటి ననియు లేకున్నచో తన బిడ్డను తన కనులయెదుటనొకడు కొట్టుచుండ తాను చూచి యూరకుందునా యనియును శిరస్తదారుడేమో చెప్పసాగెను. నీవామెకు నాయనమ్మ తల్లివగుటకు మాత్రము తగుదువని యతనితో చెప్పి యామెకు బాధ యగుపడకుండ నుండునట్లు క్లోరోఫారమిచ్చి మందునకు సీసా పంపుమని చెప్పి వచ్చితిని గాని సీసా పంపలేదు సరిగదా మీ వైద్యమవసరము లేదు క్షమించవలెనని యేవో లేనిపోని పిచ్చి వ్రాతలతో మీ శిరస్తదారు వ్రాసిన యుత్తరమొకటియు, తన్ను గొట్టినందుకు మూడు రోజుల లోపున రు.200లు పంపని యెడల నా మీద ఛార్జీ తెచ్చెదనని భూతవైద్యుడు వ్రాసిన యుత్తరమొకటియును యిప్పుడే చేరినవి. పాపమాతడు దయగలవాడు గనుక మూడు దినములైన గడువిచ్చినాడు. అందుల కాతనికి నేను కృతజ్ఞుడనై యుండితీర వలయును. మీ శిరస్తదారుని యుత్తరము పెద్దల యస్తికల వలె జాగ్రత్త చేసి వంశ పరంపరగ దాచుకొనదగినంత చక్కగ వ్రాయబడినది. మీరిటువంటి కేసులు మరి నాలుగంపించిన సొమ్ముకు లోటుండదు. ఆ భూతవైద్యుడు దావా చేయుటగాని, డిక్రీ చేయుటగాని తటస్తించినచో వైద్యపు ఖర్చులకు నేను మిమ్మడుగవలెను. మీకు మనసు కుదురు లేకున్నది. మీ వంటి యధికారులు పరిపాలకులుగ నుండి యీ దౌర్భాగ్య దేశమున నిట్టి మోసగాండ్లు శిక్షాపాత్రులని శాసింపకున్న మీరు మీ విధ్యుక్తమును దైవసాక్షి నెట్లు నెరవేర్చిన వారగుదురో నేనూహింపజాలకున్నాను. మీకు పని తక్కువ, జీతమెక్కువ. మీకును విక్సుదొరసాని గారికిని శుభ లాభములను మా బోంట్లనిన కొంచెము జ్ఞాపకమును కలుగగాక యని కోరుచున్నాను.

మీ నమ్మదగిన స్నేహితుడు
డబ్లియు. హెచ్. గ్రీసు

ఈ యుత్తరమంతయును చదివి అయిసిలీ దొరగారట్టి దుర్మార్గుల యెడలనట్టి శాసనమవసరమేయని నుడివిరి. “శాసనము మాటయటుంచుడు. విద్యానిధిని

శాస్త్రవేత్తనని చెప్పుకొని నీ శిరస్తదారుని బుద్ధి విశేషమునకెంతో సంతోషింపవలెను. నేనెంత వాదించిన నతడు సమ్మతింపడే. ఎక్కడనో మరియొక భూతవైద్యుడున్నాడచటికి గొనిపోయెద నైదు రోజులు సెలవిమ్మని నన్ను బాధించినాడు. మొదటి వాడొక బెత్తముతో నొంటి చేతితోడనే కొట్టెను. గాని వీడు రెండు బెత్తములతోను రెండు చేతులతోను గూడ కొట్టును గాబోలు"

"అది సరేగాని యతడు తన పనినెట్లు యుక్తి యుక్తము సమర్థింపగలిగెను?"

"నేనేమో తెలివి తక్కువ వాడనన్నట్లు స్పష్టముగ ననకపోయిన నతడు భావమున తేల్చినాడు. ఎవరెవరో పాశ్చాత్యులు గూడ యొప్పుకొని యున్నారని చెప్పుచు యేదో కర్మానుభవమట. ఇంకనేమేమో వాదనకనుకూలము గాని మాటలు చెప్పసాగెను. గాని రోగమునకు సరియగు కారణమిదియని చెప్పిన గూడ నతడొప్పుకొనలేదు.

"ఎవరో జోతిష్కుడామె పూర్వ జన్మ వృత్తాంతమంతయు పూసగ్రుచిన్నట్లు తనకు చెప్పెననియు ఆ పాపమువలన నిప్పుడామె యిట్లనుభవించుచున్నదనియును దీనికి నివారణ మార్గమును గూడ నాజ్యోతిష్కుడే చెప్పెననియు గాన వైద్యము చేయించిన రోగము మరింత హెచ్చుటయేగాని లాభములేదని యతని మొండివాదము.

"మనము వీనినెందుకు శిక్షించి లోకమునకు మేలు చేయరాదు.

"సరిసరి. మీకిక్కడి న్యాయశాసనము లింకను చక్కగ నవగాహన కాలేదు. మనమిట్టి విషయములలో తటస్థముగ నుండవలెను. విద్యాభివృద్ధియే యిట్టి మూఢాచారముల క్రమక్రమముగ నివారింపవలెను గాని వేరు దారి యేదియును కనుబడుట లేదు"

"విద్యాభివృద్ధియూ, ప్రత్యక్షముగ నీతని చూచుచు గూడనట్టనిదవిదేమి. ఇతని విషయముననున్నత విద్య గూడ నెంత నిరర్థకమైనదో తెలిసెనుగదా. విద్యాధికులగు హిందువులందరిట్టి యూహలు గలవారేయైనచో సొమ్మంతయు నిట్టుదగుల బెట్టి యీ పాఠశాలల నేర్పరచి విద్యాభివృద్ధిచేయుట కేవలము నిరర్థకము. ఈ పాటికీ పాఠశాలలన్నిని మూయుట సర్వోత్తమము"

కలక్టరు గారు లేచి మరియొక చుట్టను బల్లమీద నుండి తీసి "నేనీ విషయమున మీతో నేకీభవింపను. విద్యాభివృద్ధి వలన కొంతకాలమగుసరికి మేలు చేకూరగలదు. కలిగిన మరికొన్ని యనర్థములు మనకు తెలియనివి గూడ కలుగవచ్చును.

కాని కొంతవరకైన లాభము మాత్రమీ విషయమున కలుగకమానదు. అప్పుడే దేశీయ వార్తాపత్రికలు కొన్నియును సభాస్థలంబున వక్తలు కొందరును, న్యాయవాదులు, నిట్టి సదభిప్రాయముల వెలిబుచ్చుచుండుట మనకు తెలియుటలేదా! ఏదియెట్లున్నను మన విధాయకము స్పష్టముగనున్నది. దానిని మనము నిర్వర్తించెదము.

"వింత దేశము వింత మనుష్యులు. సరేగాని యీ పిల్లదాని పెనిమిటి యేమనును. అతడు గూడ తన మామగారి వేదాంతమునే నేర్చుకొనెనాయేమి"

"అతనికీ భూతవైద్యమందంత నమ్మకమున్నట్లు లేదు. డాక్టరుగారి చేత ఔషధ మిప్పింపవలయునని యాతని యభిప్రాయముగాని, యతనిమాట సాగదు. తల్లిదండ్రు లును మామగారును బంధువులు గూడ నొక్కత్రాటిమీదనే యుండుటచే వారి నెదురించు పాటి స్వతంత్రమతని కున్నట్లగపడడు.

"అతడు గూడ విద్యాధికుడేనా"

"అబ్బో యతడు ఫిజికలు సైన్సులో యమ్.ఏ.పరీక్ష పాసు అయినాడు. ఇప్పుడు బి.యల్ పరీక్షకు చదువుచున్నాడు. నాశిరస్తదారుడు 3000లు కట్నమిచ్చి యీ సంబంధమును చేసినాడని తెలిసినది. ఒకసారి తనయల్లుని నాకు చూపించుటకు తీసుకొని వచ్చినాడు. "తాను యమ్.ఏ. పరీక్ష నిచ్చియు తన బాలభార్యను కాపాడి ఆమెకు మెల్లమెల్లగ కలుగనైయున్న దారుణమరణమును తొలగించుటకైన తాను స్వతంత్రించనిచో యతని యంతరాత్మనతడు బుద్ధిపూర్వకముగ నతిక్రమించిన దోషము చేయువాడగుచున్నాడు గద"

"అగును. అతడు యంతరాత్మనలక్ష్యము చేయువాడైనచో నిజముగనెంత మనఃక్షోభమునొందుచున్నాడో నేను తెలుసుకొనగోరను. కానిండు మనము విద్యా బీజము నాటుచున్నాము. ఈ బీజమన్నిచోట్లను మొలకెత్తలేదని మనము విచారపడరాదు. కొన్ని యూషరక్షేత్రములలో ఫలము కలుగకపోయినను, మొత్తముమీద ఫలము కనపడకపోదని నా నమ్మకము. పురుషకారము మనమొనరించి ఫలము దైవాధీన మొనరించుటయే మన విధి".

## కథానేపథ్యం ...

నూటపదేళ్ళ కిందట తెలుగులో ఒక కథలపత్రిక ప్రారంభం కావడం ఆశ్చర్య కరమే కాక ఆనందదాయకం. అందునా ఒక చిన్నఊరి నుంచి. అప్పట్లో పట్టణమూ, నగరమూ అని చెప్పటానికి వీల్లేని ఊరు తణుకు. ఆ తణుకు నుంచి 1905లో వారపత్రికగా ప్రారంభమైన ఆ పత్రికపేరు సువర్ణలేఖ. పానుగంటి లక్ష్మీనరసింహారావు, చాగంటి శేషయ్య లాంటి ప్రసిద్ధరచయితలు ఇందులో కథలు రాశారు. 1911లో మదరాసు కథలు అనే కథలసంపుటి వెలువడింది. అందులోని కథలు "సువర్ణలేఖ' పత్రికలో అంతకుముందే ప్రచురితమైనాయి. ఆ సంపుటిలోనిదే 'మన పద్ధతుల నితరులెట్లు భావించుచున్నారు' కథ. దీని రచయిత వెదురుమూడి శేషగిరిరావు. ఈ కథలో 1909వ సం॥ జూన్ 20వ తేదితో ఒక లేఖ ప్రసక్తి వస్తుంది. అంటే 1909లో కాని, అంతకు కొంచెం అటుఇటుగాని ఈ కథ రాసి ఉంటారు అని ఊహించవచ్చు. సువర్ణలేఖ పత్రిక మేనేజర్ కూడా శేషగిరిరావే. ఈ పత్రికలో ఆయన రాసిన కథలను మదరాసుకథలపేరిట పుస్తకరూపంగా 1911కే ప్రచురించడం, ఈ కథలను మదరాసు కథలనడంలోని ఆయన ఆంతర్యం ఆశ్చర్యకరంగా ఉన్నాయి.

ఏదిఏమైనా గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' కన్నా (1910 ఫిబ్రవరి ఆంధ్రభారతి) ముందే శేషగిరిరావు కథలు రాసినట్లు స్పష్టమవుతున్నది. బహుశా తెలుగు సాహిత్యంలో వెలువడిన మొట్టమొదటి కథాసంపుటం కూడా ఈ మదరాసు కథలే కావచ్చు అంతకుముందు ఏ కథా రచయిత తన కథలను సంపుటంగా తెచ్చిన సాక్ష్యాధారాలు లేవు. ఈ కథ 'దిద్దుబాటు' అంత శిల్పసమన్వితంగా లేకపోయినా సాంఘిక ప్రయోజన ఉద్దేశంలో గురజాడవారి రచనకేమీ తీసిపోదు. భాషాశైలి కూడా తాజాగా, సరళంగా, నవీనంగా వ్యావహారిక భాష అభివ్యక్తికి దగ్గరగా ఉంది. ఆనాటి ఇంగ్లిష్ విద్యాధికులలో కూడా ఇంకా మూఢనమ్మకాలు, అజ్ఞాన అవివేక జీవన పద్ధతులు, చాదస్తపు మూర్ఖాచారాలను పట్టుకొని పాకులాడుతూ ఉండడం ఏవిధంగా కొనసాగుతూ ఉండేవో ఈ కథ తెలియజేస్తుంది.

అన్నిటికన్నా చెప్పుకోదగిన సంగతి ఏమంటే గురజాడ అప్పారావు కన్నా, కాలికంగా ముందుగా చెప్పవలసిన రచయిత వెదురుమూడి శేషగిరిరావు. ఆధునిక తెలుగు కథా సాహిత్య సమీక్షలలో కాని, విజ్ఞాన సర్వస్వం వంటి సంపుటాలలో కాని ఈయన పేరు ఎక్కడా కనపడదు. కథ పేరు మాత్రం తెలుగు కథా సాహిత్య తొలిదశను, ప్రాథమిక రచనా శిల్ప రీతులనూ సూచిస్తున్నది.

# 19. గళ్లచీర

– పురాణం కుమారరాఘవశాస్త్రి

**నా**కు సిగరెట్లు అలవాటైన వేళావిశేషమేమోకాని అది నన్ను వదలకుండా వచ్చింది. వదిలేద్దామన్న అభిప్రాయం నాకేకోశానా లేదులెండి. పూర్తిగా దమ్ము పీల్చి షోకుగా పెదవుల చివరనుంచి పొగ వదిలివేయడమంటే నాకు చాలా సరదా. కాని నా భార్యకు మాత్రం కొద్దిగా కొఱ్ఱుగా ఉన్నాది. "మీరు సిగరెట్లు కాలవకపోతే మనకు మామూలు ఆఫీసు గుమాస్తాకిచ్చే జీతమాదా కాగలదు. నాకు నెలకొకటి మంచి చీర అమరుతుంది" అంటూంటుంది అప్పుడప్పుడు. మంచి చీరలంటే పాపం పిల్లకు ఉబలాటమే. దీనికితోడు సొమ్ములమీద కూడా ఆపేక్ష ఉంటే చచ్చిపోయేవాణ్ణి. అది లేదు. ఒడలునిండా బంగారం దిగవేసుకుని బంగారు బొమ్మలాగా తయారగుదామన్న ఉద్దేశమామెకు లేదు. పచ్చి నాగరీకం. అయితే అయింది. అందుకోసం నేను సిగరెట్టు కాల్చడం మానేయాలట.

ఆనాడు పొద్దున్నే స్నానం, గీనం చేసుకుని మేజా ముందున్న కుర్చీలో వ్రాలి షేక్స్‌పియర్ మహాకవి వ్రాసిన నాటకం హేంలెట్ చదువుకుంటున్నాను. ఊరికే కులాసాగా కాలం గడిపేటందుకు కాదు; పరీక్షలు నడ్డిమీద తంతున్నాయి వెనుకనించి. సరిగ్గా నెలరోజులున్నాయో లేదో. ఈవరకు మూడుసార్లు తప్పివున్నాను. అయితే ఏం? తప్పిన తప్పు మాత్రం నామీద లేకుండాపోయింది. "పెళ్ళైంది. తప్పుతున్నాడు పాప" మనేశారంతా. అపరాధమంతా ఇంతవరకూ నా భార్యే మోస్తున్నది. ఈతఫా అన్నా ప్యాసై బి.ఏ. డిగ్రీ తెచ్చుకోకపోతే ఆమెకు బరువెక్కువయ్యేలాగున్నది.

ఐదు నిమిషాలు బుర్ర వంచి జాగ్రత్తగా చదివేను చూపుడు, బొటనవ్రేళ్లతో పట్టుకున్న పెనసలు కొసతో క్రాపింగు పాపట తీసికుంటూ. ఇంతలో అకస్మాత్తుగా సిగరెట్టు జ్ఞాపకం వచ్చింది. ఈరోజు పక్కమీద నుంచి లేచిన లగాయతు అగ్నిహోత్రం వెలిగించలేదు. అలమారలో ఉన్న సిగరెట్ పేకట్టు తెచ్చుకుందామని కుర్చీలోనుంచి లేచాను. కుర్చీవెనుక ఎంతసేపటినుంచీ అలా నిల్చివున్నదో లీల చిరునవ్వు నవ్వుతున్నది.

నేనలాగే చూస్తూ నిలబడిపోయాను. "ఏమిటి? అలా చూస్తారు? భయపడ్డారు కాబోలు వీపు చరచనా?"

ఒక్కసారి లీల తన్ను తాను సింహావలోకనం చేసికొన్నది. చీరకొంగు రెండు చేతులా పట్టుకుని తలవంచి చూసుకుంటున్నది.

ఆమె కట్టుకున్న చీరమీది గళ్లు పెద్దపులి మచ్చల్లాగా ఉన్నవి. అందుచేతే మొదలు నేను కొంచెము భయపడవలసి వచ్చింది. చీరలు వర్ణించడం నాకు చేతగాదు కాని నాకా చీర బాగుండలేదని మాత్రం చెప్పగలను. 'ఛీ, బాగులేదు చీర' అని ముఖాన అనేసి లీలను ఉడికిద్దామనుకున్నాను. గాని ఆపూట చదువుకునే ప్రాప్తి ఉండదు. ఆమె చేసినపని ఏదైనా కూరలో ఉప్పుచాల్లేదనిగాని, అన్నం మెత్తపడిందని గానీ, అంటే ఆమెకు ఎక్కడలేని కోపం వస్తుంది. ఆ మీద ఉపన్యాసమనే జడివానొకటి నేను ఎదుర్కోవలసి ఉంటుంది. జంతువులవలె మూగచేష్టలతోనే భావప్రకటన చేసికోవలసిన దశపోయి మానవుడు భాష కల్పించినపుడు నాగరిక ప్రపంచమున చాల దూరము నడిచినాడు. అందు వివేచనా జ్ఞానము తెచ్చినప్పుడు పై మెట్టెక్కినాడు. ఈ ద్వితీయ దశకు మాత్రమింకను స్త్రీ రాలేకున్నది.

మేజామీద ఓరగా కూర్చోటానికి ప్రయత్నిస్తూ అన్నాను. "నేను పరధ్యానంలో ఉన్నప్పుడల్లా వెనుక నుంచి వచ్చి కళ్లుమూసే దానివి. ఇదేమిటిప్పుడు కిక్కురు మనకుండా వెనక నిల్చున్నావు దొంగలాగా"

"ఔను, దొంగను గనకనే" అని ఒక కురుచ జవాబు

"నా కోటు జేబులో అయిదు రూపాయల నోటు మాయమయిందా ఏం"

లీల నవ్వుతున్నది.

"అది చీరలు కొంటానికి కాదు ఉంచాను"

"మరి సిగరెట్ కొట్టువాడికివ్వాలనా?"

"అన్నట్లు జ్ఞాపకం చేశావు. అలమారులో సిగరెట్ పాకెట్టు వున్నది తెచ్చిపెట్టు"

"మీరివ్వాళ కాఫీ మాటే అనుకోలేదే ఇంత ప్రొద్దెక్కినాను"

"నీవు చేసి ఇస్తేకదూ! గళ్లచీరలు సింగారించుకోటంతోనే కాలచక్రం తిరిగి పోతున్నది"

"కాచే ఉంచాను. మీరేమీ మాట్లాడకపోతే ఈరోజు నుంచి కాఫీ మానేస్తారేమో అనుకున్నాను"

"ఓహో. ఇన్నాళ్లూ సిగరెట్ మానమనీ, ఇప్పుడు కాఫీ మానమనీనా. బాగుంది. నీకేం, రేపు అన్నం కూడా మానేయమటావు. తన ముడ్డి కాకపోతే కాశీదాకా డేకేయమన్నాట్ట ఒక ప్రజ్ఞావంతుడు"

నవ్వుకుంటూ కాఫీ పట్టుకరాబోయింది లీల. నేను అలమార వైపు నడిచేను. అక్కడ తగిలించి వున్న కోటు జేబులు వెతికేను. ముందర అయిదురూపాయల నోటు ఉన్నదో మాయమైనదో అని. పాపం దాని ఆయుష్యం బాగున్నది కాబోలు, ఇంకా దాని కళ్లపడలేదు. పడితే ఏ చీరలమ్మేవాడి దగ్గరకో పోయేదే. నేనేమన్నా అంటానేమో నన్న భయం లేకపోతే లేకపోయింది. వెనకాముందు ఆలోచనా కూడా లేదు లీలకు. పైసా కనిపిస్తే బ్రతుకనీదు. పూర్వార్జితంపూర్తిగా ఉన్నందున బ్రతికిపోతున్నాను. కాని, మామూలుపాటి వాడినే అయితే, మూడోనాటికల్లా చిప్పాకర్రా చేతికి వచ్చేవే. సాయిబయ్య సంపాదనంతా బూబు చెవిపోగులకన్నట్లు, వచ్చే ఆదాయమంతా భార్య చీరలకు ఖర్చుచేస్తుంటే, మరేమిటి? అందులో మా లీలకు సామాన్యపు చీరలు పనికి రావు. విలువగల పట్టువి పెట్టెలో చాలా వున్నవి అనిలేదు. అధికస్య అధికం ఫలం.

సరే, నా భార్యను గుఱించి చెప్పదలస్తే చాలా ఉన్నది. ఆమెకు కోపం వస్తుందేమో మానేస్తాను. ఈ రోజుల్లో భార్యకు కోపం వస్తే మగవాడికి చలి పుట్టుతుంది. గజగజ వణికిపోతాడు.

అలమార తెరిచి చూస్తే సిగరెట్ పెట్టే లేదక్కడ. ఇంకేం. దాచేసిందన్నమాట. "ఔను దొంగను గనుకనే" అన్నమాటకిదే అర్థం. పొడుముకాయ తీసి దాస్తే తాతకు కోపం వచ్చినట్లు నేను మండిపడతాననుకున్నది కాబోలు. నిన్న తన ఊలు తీసికొని గంటసేపు ఏడ్పించినందుకిది ప్రతీకారం. తానంటే అల్లుతున్న జడకొస పట్టుకొని ఊలు కోసరం నన్నే ప్రార్థించవలసి వచ్చింది. నాకేం! బజారువెళ్లి కొనుక్కుంటాను; పీల్చేస్తాను.

ఏమెరుగనట్లుగా కుర్చీలో వచ్చి కూర్చున్నాను మళ్లీ. కుర్చీ చేయిమీద ఓరగా కూర్చొని నా సాసర్‌లో కాఫీ పోస్తున్నది లీల. నాకు చిలిపిచేష్టలంటే కాస్త సరదా. చెప్పద్దూ; సాసర్ కొంచెమొక ప్రక్కకు వంచి, కొంత కాఫీ ఆమె చీరమీద పడేలాగా చేశాను. చీరమీద ఆస్ట్రేలియా పటములాగా మరక పడింది. నేనే పాపమూ తెలియని

వాడనువలె అవతలవైపు కిటికీలో నుంచి చూస్తూ "మన జామచెట్టు ఈ సంవత్సరం కాయలు బాగా కాసినవి సుమా!" అన్నాను.

"ఔను కళ్లకూ కాసినవి కాయలు. ఏమీ కనుపించదు" అన్నది లీల కోపంతో. ఎఱ్ఱనెండ కాస్తున్నదామె కటాక్ష వీక్షణాల్లో. కండనిప్పులు చిమ్మే పడమటి కొండగాలి వీస్తున్నదామె నిట్టూర్పులో.

లీలకు కోపం వచ్చినప్పుడు నాకేదో ముద్దుగా ఉంటుంది. ఆమె సౌందర్యమంతా నేనప్పుడే గ్రహింపగలుగుతాను. ఆ భ్రుకుటి నటనా, ఆధరచనలనమూ, ఆ కంటిచూపూ నన్ను ముగ్ధుణ్ణి చేసివేయగలదు. ఆమె నన్ను తదేక దృష్టితో చూస్తున్నది. నేనామెను చూచీ చూడకుండా తత్సౌందర్యమంతా త్రావేస్తున్నాను. ఇవతల గుమ్మము వద్దకు వచ్చి నిల్చుని. చివరకు పెరటిలో ఏవో మొక్కలు నాటుతున్న మా నౌకరు వెధవను పిల్చి, "సిగరెట్టు పెట్టె ఓటి తీసికొని రారా" అని చిల్లర డబ్బులిచ్చి పంపించాను. లీల కుర్చీ చేయిమీద నుంచి లేచి ఏమో అస్పష్టముగా గొణుగుకుంటూ చీర మీద కాఫీ తుడిచేసికుంటున్నది. నేనన్నాను. "అదేమిటి చీరమీద కూడా పోసేసుకున్నావు కాఫీ అయినా, ఆ మరక చంద్రుడికి కళంకం లాగా చీరకు వన్నె తెస్తున్నాదిలే"

"చాల్లెండి కవిత్వం" అని చురచురా లోనికి పోయింది వంట చెయ్యాలిగా.

* * *

భోజనంచేసి కూర్చున్నాను, మా గదిలో క్రింద చాపమీద పరచివున్న పరుపుమీద. ప్రొద్దుననగా సిగరెట్లు కొనితెమ్మని నేను పంపిన కుఱ్ఱవాడింతవరకూ రాలేదు. ఇక నేనన్నా పోయి కొనితెచ్చుకోవాలి. ఆరోజే ఎండ అతితీవ్రంగా కాస్తున్నది బైట. ఎలాగా అని ఆలోచిస్తున్నా. భోజనానంతరం సిగరెట్ పీల్చకపోతే హాయిగా ఉండదు.

"ఇంతవరకూ ఎందుకు రాలేదబ్బా వాడు నేనిచ్చిన చిల్లర డబ్బులు నాలుగూ తన స్వంతఖర్చుల కుపయోగపరుచుకోలేదు గదా! ఇంట్లో భార్యకు మల్లేనే నౌకరు కుంక కూడా అల్లాంటివాడే అయితే ఇక చెప్పాలీ! కాని వాడల్లాంటివాడు కాడు. ఇన్నాళ్ళనుంచీ చాలా నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఆనక వచ్చినప్పుడు నాలుగు చీవాట్లు తగిలిస్తాను. ప్రస్తుతం మా ఆవిడ దగ్గరనుంచే లాగాలి ఎలాగైనా తాను దాచిన పేకట్టు" ఇదే నాలో రేగిన ఆలోచనా పరంపర.

కిటికీలో నుంచి వస్తున్న వెచ్చని గాలికి గోడకు తగిలించివున్న 'క్యాలెండరు' కాగితాలు అల్లరి చేస్తున్నవి. ఏవో రెండు సాలీళ్ళు అక్కడ 'ఫొటో' చాటుకు పోయినై. అంతా నిశ్శబ్దంగా ఉన్నది. కాని లీల భోజనం కూడా అయింది కాబోలు అన్నీ సర్దుతున్నదేమో, చెంబూ తప్పేలల చప్పుడు మాత్రం వినిపిస్తున్నది.

చేతులు తుడుచుకుంటూ వచ్చి కూర్చున్నది నా దగ్గరే. ప్రొద్దుటి కోపమంతా ఈలోపుగానే పోయిందిగా. భార్యాభర్తల కోపం ఎంతసేపుంటుంది.

ఆమె తమలపాకులు మడుపులు చుట్టి ఇస్తుంటే నమలుతున్నాను చాలనకుండా. నేను నములుతున్నకొద్దీ ఆమె ఇస్తూనే వున్నది. చివరకు విసుగెత్తి అన్నది. "ఈ కట్టాకులూ మీరే నమలేలాగున్నారే" అని.

"పోనీ, మానేయమంటే తమలపాకులు వేసుకొనడం మానేస్తానులే. వాటికయ్యే ఖర్చు చీరలకు పెట్టుదువుగాని" అన్నాను.

"అబ్బ! చమత్కారం! ఏం మానక్కరలేదులెండి"

"ఏమీ, ఎందుకని? అవి లేకుంటే నీకు సాగదు కనుకనా? అల్లాగే అనుకోరాదూ ఇతరుల సంగతి కూడా పో తీసుకొనిరా నీవు దాచిన సిగరెట్ ప్యాకెట్"

"ఔను కానండీ! నిన్న మీరు తెచ్చిన సైకిలెక్కడిది?"

"ఒక స్నేహితుడిది. ఎందుకు నీకు?"

"మరేమీ లేదు. మీకు తొక్కడం వచ్చీ కూడా సైకిల్ లేకపోవడము"

"మర్యాదహీనంగా ఉన్నదా? నీవు చీరలు కొనడం మానేస్తే, ఎప్పుడో వీలు చూచుకుని ఒకటి కొనుక్కుంటాను మరి"

"అదికాదు. వచ్చే సంక్రాంతి పండక్కు మా నాన్నతో చెప్పి మీకు సైకిలిప్పిస్తాను. లేకపోతే దాని కిమ్మత్తైనా సరే. అదీ మీరీ ఆటలో గెలిస్తేనే" అంటూ అక్కడ ముక్కాలి పీటమీద ఉన్న చతురంగపుబల్లా, కాయలభరిణా అందుకున్నది.

"నీవే గెలిస్తే నేనేమన్నా చీర ముడుపు చెల్లించుకోవాలా?"

"పందేనికి పందెం లేకపోతే ఎలా?"

నాకు చతురంగపాట అంటే సరదా. ఆ ఆట ఆడుతున్నప్పుడు నాకు బాహ్యస్మృతి ఉండదు. నిజంగా తన్మయుణ్ణైపోతాను. కానీ మా లీలతో ఆడుతున్నప్పుడల్లా

ఓడిపోతూనే ఉంటాను. ఆమె అద్భుతమైన తెలివితేటలు చూపిస్తుంది. ఎత్తులు వేయడంలో "పూర్వం రణరంగంలో చతురంగబలాలు నడిపిన వీరవనితల రక్తం నీలో కూడా కొంత ప్రవహిస్తుంది, లీలా" అని నవ్వుతూ అంటుంటాను అప్పుడప్పుడు. "ఆ తేజస్సు తగ్గిపోవడానికి మగవాళ్ళు మీరేకదా కారణం" అంటూంటుంది తాను.

అలాగా పందెం చరచి ఆట మొదలెట్టేము. ఎలాగైనా సైకిల్ కొట్టాలని తీవ్రంగా

బుర్ర వంచి ఆడుతున్నాను సిగరెట్టు మాట మాత్రం మరచిపోయాను చెప్పద్దూ. మూడుగంట లాడేమావిధంగా సిగరెట్ మీద మాత్రం ధ్యాస పోలేదంటే నమ్మండి. అబద్ధం చెప్పటానికి నాకు మించిపోయిందేమీ లేదు.

ఆట మొదలెట్టినప్పుడు ఆమె పొడుగాటి జడ కుడిభుజము మీదుగా జారి బల్ల మీద పడింది. నా రాజు ఆదరిబోర్లపడ్డాడు. "మొదలే అపశకునము. మీరు ఓడిపోవడమే నిజ" మన్నది లీల. చివరకామె అన్నట్లే అయింది. నేనే ఓడిపోయానని చెప్పుకోవడం సిగ్గుగానే వున్నది. లీలతో ఆడి ఓడటమిది ప్రథమం కాదు గనుక అభిమానపడలేదు. ఎప్పటిమాదిరి నవ్వుతూనే ఉన్నాను.

"ఇంతకూ మీకు సైకిల్ ప్రాప్తి లేనట్లున్నది" అన్నది లీల నా చూపుల్లో ఆమె చూపులు మిళితం చేస్తూ.

"అయితే, సంక్రాంతికి పుట్టింటికిపోయే ప్రాప్తి నీకు లేదన్నమాట" అన్నాను పెదవులుమీద ఒక గమ్మత్తు నవ్వు వెలిగిస్తూ.

ఇంతట్లో బైట 'అయ్యా' అని ఎవరిదో పిలుపు. బయటకు వచ్చి చూస్తే అతనొక చీరల వర్తకుడు.

"సరిగ్గా సమయానికి వచ్చాడులెండి" అంటున్నది లీల నా వెనకాల నిల్చుని. వర్తకుడు "అయ్యా! నిన్న సాయంకాలం, అమ్మగారొకచీర తీసుకొన్నారు; అప్పుడు మీరింట్లో లేనందున మళ్ళీ రమ్మన్నారు. ఇప్పుడు వచ్చా" నన్నాడు.

వెనక్కు తిరిగి మా ఆవిడవైపు చూచాను. కొంటెతనమంతా వ్యక్తీభూతమౌతున్న దామె ముఖంలో. నన్ను తృణీకరిస్తున్నట్లు నవ్వుతూన్న తన పెదవుల మీద చీరకొంగు అడ్డం పెట్టుకుని నాముఖం చూడలేకనో ఏమో చూపులు త్రిప్పుకుని,ముఖం వంచి కట్టుకున్న చీర చూచుకుంటూ "ఇదే చీర" అన్నది.

అదే నేను ప్రొద్దున కాఫీ పోసిన గళ్ళది. నిన్న తాను కొని ఇవ్వాళ నాచేత డబ్బులిప్పిస్తున్నది. ఇదొక క్రొత్త యెత్తు. ఇదివరకల్లా ఎక్కడన్నా పైకముంటే తానే తీసికొని నాకు చెప్పకుండా చీరలు కొనుక్కుండేది. అలా కాకుండా ఇదొక విధంగా నాచేతనే కొనిపించడం నాకు మండిపోయింది ఒళ్ళు. ఆమె దృష్టిలో నేనొక విలువ లేనివాడనైనానుగదా అనే భావమొకటి నన్ను కలవరపెట్టింది. అప్పటి నావుద్రేకమంతా చెప్పలేనుగాని నా ముఖఫలకంలో ప్రతిఫలించింది. అది గ్రహించలేకపోలేదు లీల

నేనేమీ మాట్లాడలేదు. వర్తకుడికి డబ్బిచ్చి పంపక తప్పదు. వాడడిగినంతా ఇచ్చాను. ఒకసారి కట్టుకున్నదీ, కాఫీ మరక పడ్డదీ, మళ్ళీ వాడికి వాపసు చేయడమెలాగా? అలా చేస్తాననే కాబోలు మొదలే జాగ్రత్తపడింది లీల.

వర్తకుడు వెళ్ళిపోయిన తరువాత నా స్నేహితుడొకడు వస్తే వాడితో కొన్ని అవసర కార్యాలను గూర్చి మాట్లాడుతూ డాబా మీద కూర్చున్నాం. చివరకతడు వెళ్ళిపోయేటప్పటికి తాలూకా కచ్చేరిలో కొట్టిన గంటలు అయిదు వినుపించినవి.

డాబామీద నుంచి తిన్నగా మెట్లు దిగివస్తూ ఆనాడు చదువేమీ సాగలేదు కదాఅని ఆలోచించుకున్నాను. ఒక్కసారి నాటిచర్య అంతా మనస్సులో పరువెత్తింది. చతురంగపాట మూలాన్న, నా స్నేహితుడు వచ్చినందున, అంతవరకూ అణగివున్న సిగరెట్ మీది కాంక్ష కుతి అంటే బాగుంటుందేమో తలెత్తింది.

మెట్లు దిగి దక్షిణపు వైపు గది గుమ్మందాకా వచ్చాను. అది మనోహర సందర్శనము, సౌందర్యదేవతా ప్రత్యక్షము. హాలులో పెరటి వైపు కిటికీముందు అద్దం చూసుకుంటూ జడలో పూవులు పెట్టుకుంటున్నది లీల.

నన్ను చూడగానే నావైపు నడచివస్తూ "ఇందాక మీకు కోపం వచ్చినట్లున్నది. మీ మనస్సు నొప్పించిన దాన్నైతే క్షమించండి. ఇక నుంచి నాకు నేనెన్నడూ చీరలు కొనను. మీరు కొన్నవే పుచ్చుకుంటాను. క్షమించారా" అన్నది నా ముఖభావాలు పరీక్షిస్తూ. నేను ప్రసన్నత్వమే కనబరచేను.

ఇక్కడ నా భార్యలో వున్న ఉత్తమగుణం ఓటి సూచిస్తాను. నాకు కోపం వచ్చినప్పుడెప్పుడూ ఆమె కూడా కోపం తెచ్చుకుని రసాభాసం చేయదు. తానే కొంచెం తగ్గి అనునయవాక్యాలు పల్కటం ఆమెకు అభిమానకరము కాదు. అందుకనే నా జీవితమొక నందనవనం. అందులో నా లీల సౌందర్యకుసుమం.

నిమిషమాత్రం మేమిద్దరమూ మట్లాడలేదు. అప్పుడే మా యిద్దరి ఆత్మలూ, ఒకటినొకటి మన్నించుకున్నవి.

చివరకు లీల తనవ్రేళ్ళతో నా గుండీలు త్రిప్పుతూ, 'ఇవ్వాళ సినిమాకు తీసికొని వెళ్ళరూ" అంది.

"నన్ను మాత్రం ఈరోజల్లా సిగరెట్లు త్రాగనిచ్చేవు కావు కదా లీలా" అన్నా ఆమె బుగ్గ మెల్లిగా తట్టుతూ.

"ఐతే ఉండండి" అంటూ లోనికి పోయి రెండు సిగరెట్ ప్యాకెట్లతో ప్రత్యక్షమైంది. నేనాశ్చర్యపోయాను. "అలా చూస్తారేం. రెండో దెక్కడిదనా? నౌకరు వాడిని తెమ్మన్నారు కదూ ఒకటి. అదే ఇది. ఇది ప్రొద్దున నేను దాచింది"

"నువ్వేలాగు తీసికున్నావు వాడి దగ్గర నుంచి?"

"వాడు ప్యాకెట్ తీసికొని వీధిగుమ్మం దాకా రాగానే నేనందుకుని ఇవ్వాళల్లా మనింటి చాయలే రావద్దని చెప్పి పంపేను"

"నీ కిల్లాంటి తెలివితేటలున్నందు చేతనే లీలా నేనాందమయుణ్ణి – మరి వంట చేశావా; సినిమాకు మొదటి ఆటకే పోదాం పోతే"

"వంటెంతసేపు నిముషం. మీరు కూడా రండి కూర్చుందురు గాని" అంటూ కుర్చీ తీసికెళ్ళి వంటింట్లో వేసింది.

కుర్చీలో కూర్చొని సిగరెట్లు పీల్చడం మొదలెట్టేను, మా ఆవిడ కుంపటి రాజేస్తుంటే. ప్రొద్దుటి నుంచీ లేనందున సిగరెట్లు చాల రుచిగా వున్నాయి. ఒకదాని కోసం మొదట కొంత ఆర్తి అనుభవిస్తేనేగాని తరువాత తదనుభవము ఆనందమయంగా వుండదు.

ఆరాత్రి సినీమాకు వెళ్లేము. అందుమూలాన్న రాత్రి కూడా చదువులేదు. తక్కిన విద్యార్థులంతా అన్నం నీళ్ళు మానేసి రాత్రింబవళ్ళు ఒకటేచదువు చదువుతూంటే నేను నా లీలతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాను.

పాఠకుడా! విన్నావుగా నా ఆరోజు చర్య అంతా.అదేవిధం అనుకో ప్రతిరోజూను. ఇక నేనెలా ప్యాసౌతానో ఊహించుకుందూ నువ్వే.

## కథా నేపథ్యం ...

స్వాతంత్ర్యం రాకపూర్వం కథారచయితలుగా ప్రసిద్ధులైనవారు పురాణం కుమార రాఘవశాస్త్రి. ఈయన మద్రాసులో ఉండేవారేమో. ఏ ప్రాంతంవారో ఇదమిత్థంగా తెలియదు. తెలుగు కథారచయితలను గూర్చి భోగట్టా. సేకరించిన వారెవరూ ఈయన గూర్చి వివరాలు ఇచ్చినట్లు కనపడదు. వీరి కథా సంపుటాలు కూడా వచ్చినట్లులేవు. అయితే కథావస్తువులో కుటుంబానురాగాలకు ప్రాధాన్యమిచ్చిన తొలితరం రచయితలలో ఈయన చెప్పుకోదగిన వారు.

ఆధునిక సాహిత్యంలో మహిళకు, అందునా గృహిణికి మానవీయమైన స్థానాన్నే ఆశించారు. తెలుగు కథారచయితలు. "మగడు వేల్పన పాతమాటది' అనే గురజాడవారి ప్రబోధానికి ఆధునిక తెలుగు కథారచయితలు వారసులు. కుటుంబ సంబంధాల నాజూకుతనం, భార్యాభర్తలు ఇచ్చిపుచ్చుకునే గౌరవాలు నవ్యసాహిత్యంలో ఒక మోజుగా ముఖ్యంగా కథారచనలో కిందటిశతాబ్ది మొదటి దశాబ్దాలలో దర్శనమిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంపై ఠాగూర్, శరత్‌ల ప్రభావం కూడా ఇందుకు కొంత దోహదం చేసి ఉంటుంది. ప్రేమ కథలకు ఎక్కువగా భార్యాభర్తలనే ఆలంబనం చేసుకునేవారు అప్పట్లో తెలుగు కథారచయితలు అనిపిస్తుంది.

"గళ్ళ చీర" అని కథకు పేరు పెట్టడమే నాజూకుగా ఉంది. దాంపత్యంలో ఆలుమగల మధ్య అధికారం కాక, అనురాగం దృఢబంధానికి ఆస్కారమవుతుంది. అని గురజాడ అప్పారావే తన మొదటి కథలోనే సందేశపూర్వకంగా చెప్పాడు. మగణ్ణి దిద్దుకునే అధికారం మగువకు ఉంది అని ఆయన తీర్పు. ఈ కథలో భార్య భర్తతో చదరంగమాడి 'ఆయన'ను ఓడిస్తుంది. మురిపించి సినిమాకు తీసుకొని వెళుతుంది. 'అందుకే నా జీవితం నందనవనం' అనుకుంటాడు భర్త. ఇటువంటి లలిత శృంగార కథలలో ఉత్తమపురుష కథనం కూడా ఆ రోజుల్లో ఎక్కువగా కథారచయితల అనుసరించే వారేమోననిపిస్తుంది. కథానాయిక పేరు లీల. ఎనభైనాలుగేళ్ళ కిందట ఎంతో నాజూకుతనం, కొత్తదనం ఉట్టిపడుతున్నదా పేరులోనే. ఏమైనా పురాణం కుమార రాఘవశాస్త్రి ఈ తరం కథాభిమానులకు ఒక విస్మృత కథారచయిత. అన్నట్లు రాఘవశాస్త్రి శరత్‌బాబు నవలలను కొన్నిటిని తెలుగులోకి అనువదించాడు కూడాను. బెంగాలీ భాష నేర్చుకున్నాడేమో తెలియదు 'పురాణం' వారిని గూర్చి ఏదైనా కొంత భోగట్టా తెలియచేయడానికి పురాణం సుబ్రహ్మణ్యశర్మ కూడా ఇప్పుడు లేరు.

విపుల ఏప్రిల్ సంచికలోని కథాముత్యం శీర్షికలో వచ్చిన 'గళ్ళచీర' కథా రచయిత పురాణం కుమార రాఘవశాస్త్రి గురించి రచయిత శ్రీవిరించి కొన్ని వివరాలు తెలియజేశారు. వాటిని పాఠకులతో పంచుకోవాలని అభిలషిస్తున్నాను. కుమార రాఘవశాస్త్రి కృష్ణాజిల్లా జగ్గయ్యపేటకు చెందినవారు. శ్రీవిరించి తండ్రికి సహాధ్యాయి. 1956 ప్రాంతంలో విజయవాడలోని గవర్నర్ పేట నుంచి వెలువడే 'గ్రామ స్వరాజ్యం' అనే పత్రికలో పని చేస్తుండేవారు. అప్పట్లోనే 'సాగర మథనము' అనే చిన్న పద్య కావ్యాన్ని కూడా ప్రచురించారు. తరువాత ఎల్.టి.చేసి విస్సన్నపేట జిల్లాపరిషత్ పాఠశాలలో లెక్కల మాస్టారుగా పదవీ విరమణ చేశారు. బెంగాలీ కూడా వచ్చిన ఈయన శరత్ నవలలు సుభద్ర, గృహదహనం వంటి కొన్నిటిని తెలుగులోకి అనువదించారు. మరో సాహితీమిత్రుడు, అడ్వకేటు ముత్యం ప్రసాద్ తిరువూరు (కృష్ణాజిల్లా) నుంచి ఫోన్ చేసి, రాఘవశాస్త్రి సుమారు మూడు దశాబ్దాల క్రితం తిరువూరులో ఉన్నారనీ, తాను ఆయన వద్ద ఇంగ్లీష్ చదువుకున్నానన్నారు. ప్రస్తుతం వారి కుటుంబసభ్యులు ఎవరూ తమ పట్టణంలో లేరని అన్నారు.

# 20. అధర సుధారసం

– కవికొండల వెంకటరావు

"నేను మీకు పెదవి పూర్తిగా అందిస్తూవుంటే సగం దగ్గరకే కొఱికి వదిలేస్తూ వుంటారేమిటి, మంగళగిరి పానకాలస్వామి వారిలాగు?" అంది విరజాజిమాణిక్యం తన విభునితో. ఒక్కొక్క ఆడదాని శఖాళీతనానికి, చమత్కారానికీ అంతూ పొంతూ వుండదు. అందులోనూ సర్వసామాన్యంగా ఆడవాళ్ళకు వచ్చిన దేవుళ్ళను గురించిన కథలూ గాథలూ, మగవాళ్ళకు రానేరావు.

విభుడు, వెంటనే "మంగళగిరి పానకాలు! వాడెవడు?" అని అడిగాడు.

కొంచెమెడమై విరజాజిమాణిక్యం ఇలా చెబుతూవుంది. "చూడండి మీరేమను కుంటే వున్నారో? భూమీ్మదవుండే మగవాళ్ళు మీరొక్కరే అనుకుంటూ వున్నారేమో? కారు సుమండీ! చాలామంది మగవాళ్ళున్నారు. అందులో పానకాలు వొకడు" అంది.

విభుడు "ఓసి పెంకెఘటమూ, ఆ సంగతి నాకు తెలియదనా?" అన్నాడు కొంచం ముఖం గంటు చేసుకొని.

ఇఖంతకంటే పాకం ముదిరితే బాగుండదని ఆ కొంటెపడుచు చిరునవ్వు నవ్వి "ఇలా చూడండి? మీరు నిజంగా మంగళగిరి పానకాలస్వామివార్నే ఎఱుగరూ? వార్నెప్పుడూ చూణ్నేలేదూ?ఎందుకొచ్చిన చదువులండీ మీ మగాళ్ళవి. ఎందుకొచ్చిన పోకిళ్ళండీ మీవి. మంగళగిరి స్వామివారి వంటి దేవుడీ జగత్తులో లేరనుకోండి" అంది గొంతెత్తి వొత్తి చెప్పే వొకానొక మత్త కాసిని యొక్క యుపన్యాస ధోరణిగా.

విభుడు "కాస్తంత చోటియ్యి, మంచమంతా నీవే ఆవరించుకుంటూ వున్నావు" అని భార్యను జరిపి "నీవు అన్న మనిషి దేవుట్టే. ఆ ముక్క ముందుగానే అఘోరిస్తేం? నీ సొమ్మేం పోయింది?" అన్నాడు.

"ఏమో సుమండీ, నాకు దేవుడు వేఱుగాను, మనిషి వేఱుగాను తోచదుసుమండీ. మొగుణ్ణి దేవునిగా చూచుకోమని శాస్త్రాలు ఘోషిస్తూ వుండటం వింటూ మనిషికీ దేవునికీ తారతమ్యం కనిపెట్టడం ఏలాగండీ?" అంది మాణిక్యం.

పోనీలే నీరీతినే చెప్పు దేవుడైతేం మనిషవితేం, పని నడవాలి" అన్నాడు విభుడు.

మాణిక్యం చెప్పదొడగింది. తన మంగళగిరి యాత్రను గురించినదైన ఒకానొక వినోదం.

"నేనప్పటికి చాలా చిన్న పిల్లను. చాలా చాలా చిన్న పిల్లను. అమ్మ ఒడిలో నుంచి నాన్న వొళ్ళోకి, నాన్న వొడిలోనుంచి అమ్మ వొళ్ళోకి మారాం పెట్టి పాకులాడే నా రోజులవి. రోజులనవలసినవి కావు అవి రోజాపుష్పాలు అని అనవలసినదిగాని. చూడండీ అప్పుడు చింతాచీకూ, ఆడసంతా, మగసంతా; అదుందీ, ఇదిలేదూ, మొగుణ్ణి సంతోషపెట్టామా లేదా? ఇలాంటి పెద్దదిగాక అడ్డదిడ్డంగా అల్లుకుపోయ్యే వల్లీమ తల్లులేవీ లేని తియ్యని కాలం అది. అసలు నిజంగా యిష్టంగా తినేదాన్నిట కూడాను. మిఠాయివుండలా ఇలా చేతికిస్తే ఒకళ్ళను చితపనియ్యక పోవడమేకాదు గద నేను కూడా చిదుపుకునేదాన్ని కాదుట. ఆ పాళంగా నోరట్టినాసరే నోరట్టకపోయినాసరే ఏలాగో వోలాగుతిసేసే దాన్నిట. అటువంటి నన్ను మానాన్న, మా అమ్మా తమతోకూడా ప్రయాణం చేసి, ప్రయాణం చేయటం అంటే ఏమిటో తెలుసునా మీకు? బొట్టెట్టి, కాటుకెట్టి పెళ్ళాడే బొమ్మలాగు తయారు చేయడన్నమాట. ప్రయాణం చేసి "పానకాల స్వామి దగ్గఱరెడుతున్నామేవ్?" అని మా అమ్మ నన్ను బులిపిస్తూ వుంటే మానాన్న బండీతీసుకురాగా, బండీఎక్కాం. వింటున్నారా? నిదరోతున్నారా? బండీఎక్కాం, బండీ దిగాం, బండీదిగాం, రైలూఎక్కాం, రైలూఎక్కాం, రైలూ దిగాం, నడిచీ వెళ్ళాం, నడిచీ వెళ్ళాం, కొండాఎక్కాం– ఏకొండో అప్పుడు నాకు తెలియలేదుగాని తరువాత మంగళగిరి కొండ అని బోధకు వచ్చింది. అప్పుడల్లా తెలిసింది గుడి వున్న కొండ అనే.

గుడి అంత ఎత్తయిన గుడి కాదు లెండి. మా అమ్మ నన్ను దింపి "ఎక్కమ్మా నీ అంతట నీవు" అంటే నాలుగుమెట్లు నా అంతట నేనే ఎక్కేశాను. ఇంకా ఎక్కగలనే అంటే మా అమ్మ "ఇప్పట్నుంచి ఎందుకు తల్లి నీకీకష్టం నేనున్నానుగా" అని నన్ను నడుమునేసుకు గబగబా కొండపైకి తాను నడిచింది. మా నాన్న బస్తా సంచీ అతడూ వెనకబడి ఓ నిమిషం అటూ ఇటూగా మమ్మల్ని కలుసుకున్నాడు. బస్తా సంచీ ఏమిటి అనుకుంటున్నారు? బెల్లం సంచీనిండా బెల్లమే. పోల్నాటిసరుకో. అసలైన ఆస్కా చక్కీవో కూడాను ఆమాట కొస్తే.

"ఎందుకు నాన్నా ఇంతబెల్లం?ఎందుకునాన్నా ఇంత బెల్లం?" అని అడిగాను, బస్తామూతి విప్పి పైకితీసి నన్ను తిననివ్వకుండా తాను దాన్ని ముక్కముక్కలుగా చితక్కొడుతూ బిందెలో పడేస్తూవుంటే "పానకం చేస్తారే" అంది మా అమ్మ.

"పానకానికి నీళ్ళో?" అన్నాను.

"అన్నీ వస్తాయి తొందఅపడకమ్మా" అన్నాడు అక్కడున్న అర్చకుడు. బెల్లం ముక్క చూచినప్పట్నుంచి నాకూరికే నోరూరిపోయింది. తొల్త అయినా ముక్కకంటే పానకం గడగడా తాగెయ్యవచ్చుననో ఏమో, తొల్త బుట్టిన ఉబలాటం మళ్ళా వెనక్కి పోయింది. అలానేను నాలో క్షోభపడుతూనే వున్నాను.

"స్వామివారు సగం పానకం త్రాగి బొళుక్కుమన్నారు. సగం పానకం వదిలేశారు. చూచావుటే! అని మా అమ్మతో మా నాన్న ఊ ఇదవటం మొదలెట్టాడు.

మా అమ్మ నివ్వెరపోతూ "ఏమి మహత్తు! ఏమి మహత్తు" అని లెంపలేసుకొని సాష్టాంగపడిపోయింది. బిందెలో మిగిలివున్న సగం పానకం తొంగిచూడ్డం పనిలో నిమగ్ననై పోయివున్నాన్నేను.

"సగానికి సగం అప్పుడే అయిపోయిందిటే? అమ్మా!" అని అడిగాను.

అమ్మలేచి నిలబడుతూ "అలా అనకూడదమ్మా! స్వామివారు సగం ఆరగించి సగం మన కట్టేపెట్టారు. భక్తవత్సలుడు" అని అంది.

అంతట మా నాన్న మా అమ్మ దగ్గరకు వచ్చి చెవిలో ఊదినట్టు ఇలా అనసాగాడు. "చూశావుటే! మనం మరి పోస్తామన్నా అక్కర్లేదన్నట్టు బొళుక్కుమన్నాడు" అన్నాడు. పోస్తాను అంటే అక్కర్లేదనడం నా ప్రకృతిలో అప్పటికీ లేదు ఇప్పటికీ లేదు. అందుచేత మా నాన్న మా అమ్మతో ఆ మాట అంటూవుంటే వాళ్ళిద్దరికేసి చూసి "వీళ్ళేం వెర్రివాళ్ళా?" అని తలపోశాను.

అర్చకుడంతలో మా చెంతకు వచ్చి నీళ్ళూ, పూవులూ, దళం, ఫలం, తీర్థం, శఠకోపం, అన్నీ ఇచ్చి వెళ్ళవచ్చునన్నాడు.

వెళ్ళవచ్చునంటే మా అమ్మా మా నాన్నా మళ్లు మొగంపట్టి "వెడదాం! రా! అమ్మా?" అన్నారు నన్ను.

నేను బిక్కమొగం వేసుకొని గుళ్ళోనేల జతికిల బడ్డాను. మా అమ్మ "చీమలే! చీమలు కుడతాయే!" అంది.

అంటే మా నాన్న ఇటూ అటూ చూసి– "ఒసేవ్ ఇక్కడ చీమల్లేవు. చిత్రమే. ఇంత బెల్లపునీరు ఇలా ఆరి అంటుకుపోయినా ఈ రాళ్ళమీదొక్క చీమా లేదు. చిత్రంగా వుంది" అన్నాడు.

నేనామాటతో క్రిందపడి ఆ రాళ్ళమీద బోర్లాపడి దొర్లడం ప్రారంభించాను పెద్ద ఏడుపుతో.

"ఎందుకే" అన్నారు మా నాన్నా అమ్మా

ఎందుకో నాకు తెలిస్తేగా? చెప్పడానికి ఉత్త మంకుపట్టు! ఇప్పుడు మనం చూడ్డంలేదు పిల్లలుత్తినే మంకుపట్టు పట్టడం. అలాంటి మంకుపట్టె పట్టాను. ఆపాళంగా మా నాన్నా మా అమ్మా నా చెరోరెక్కా దొరకబుచ్చుకొని కిందకు దించేశారు. వాళ్ళు నాతోపాటు కొండ దిగుతూ, నేను కాళ్లల్లల్లాడిస్తూ "దిగనేవ్! దిగను" అని అన్నాగానీ దించేశారు.

కొండకింద ఆసమయానికి గుడ్డపరుకూర్చున్న వో బైరాగి "చూడండి. ఈ అమ్మాయికి ఎలాంటి మొగుణ్ని తీసుకొచ్చి పెళ్ళి చేస్తారో! మంచి ఘట్టి మొగుణ్ని పెళ్ళి చెయ్యాలి. ఆషామాషీ వాణ్ని చేశారా అంటే వాణ్ని బతకనివ్వదు" అన్నాడు. అసలు మొగుడంటే అర్థం కాని కూచిని నాకు ఘట్టిమొగుడు అంటే ఏమిటి బోధపడి ఏడుస్తుంది చెప్పండి. కొండమీద దాకా బెల్లంకొట్టిన రాయి కంటే ఘట్టి వస్తువు ఆనకు మనసుకు తట్టలేదు. బైరాగి అంత అలా అన్నాగాని మాట్లాడరే? ఇంతగా నా చేత ఏకరువు పెట్టించి మాట్లాడరేం" అంది మిక్కిలి చలాకీగా.

విభుడు నిశ్చేష్టుడై భార్యా మాణిక్యాన్ని చూస్తూ అన్నాడు "ఇంత ఉద్రేకం నీలోవుంది అని ఎన్నడూ నేను అనుకోలేదు" అని.

అంటే ప్రియురాలు ప్రియుణ్ణి మనసుకొద్ది కావులించుకొంటూ "చూడండీ! ఈ నా ఉద్రేకం అంతా మీ దగ్గరే. మరోచోట సున్నసుమండీ. అయినా ఒకటి వుంది. మంగళగిరి వెళ్లినప్పట్నుంచి నా ఉద్రేకం సగం చచ్చింది" అంది.

"అదేమిటి?" అన్నాడు పెనిమిటి

"పానకమే గడగడా సగానికి సగం తాగేసిన మహానుభావుడు. ఆ పానకాల స్వామి, మీరూరికే పొగడే నా యొక్క అధర సుధారసంలో సగం, ఆనాడు పీల్చేసి ఉండడంటారా?" అంది.

మొగుడు వెంటనే ఆమెను పొదివికొని తనలోకి తీసికొని "చూడు! ఎప్పటికప్పు డూరే నీ యొక్క అధర సుధారసంలోంచి సగం తీసుకు సగం మిగల్చటమనేది ఎలా జరిగి వుంటుందని నీ యూహ?" అని చొక్కిపోయి ఆ మాణిక్యం యొక్క మాణిక్యం లాంటి దిగు పెదవిని గట్టిగా కొరికి విడిచిపెట్టాడు.

అద్దము ముందు చూచుకొని యయ్యువతీమణి – మీరుగాన నీపద్ధతి నొవ్వ ముద్దిడిరి. వద్దొకొ యింద్రియ నిగ్రహంబు? సంసిద్ధము సేసి ముందిడగ! జేకొని త్రావెనె దైవమైనదా!హద్దును పద్దులేక?" యని యయ్యధరమ్మె నివాళిద్రిప్పెబో!

## కథా నేపథ్యం ...

ఒకసారి రాజమండ్రిలో ఔత్సాహిక సాహిత్య సంఘాలు, యువ రచయితలు శ్రీశ్రీకి సన్మానం తలపెట్టినప్పుడు, ఆయన అన్నారుట 'మీ ఊళ్ళోనే కవికొండల వేంకటరావు (1892–1969) గారనే గొప్ప కవి ఉన్నారు. ముందుగా వారికి సన్మానం చేయకుండా నాకు సన్మానం ఏమిటి?' అని. తన సమకాలీన శ్రీశ్రీ గొప్పగా అభిమానించింది కవికొండల వేంకటరావుగారినే. శ్రీశ్రీ దృష్టిలో కవికొండలవారు కొండంతకవి. వారి శివరాత్రిప్రభ, గడ్డిపూలు శ్రీశ్రీకి ఎప్పుడూ జ్ఞాపకమే. రాజమండ్రిలో సన్మానం పొందినప్పుడు శ్రీశ్రీ ముందుగా కవికొండలవారి శివరాత్రి ప్రభను చదివి వినిపించాడని ఆనాటి ముచ్చట్లు తెలిసినవారు చెపుతారు. కవికొండల వారి విశిష్టత ఏమంటే ఆయన కవితా వస్తువూ, రూపమూ కూడా విలక్షణమైనవి ఆయన ప్రకృతిని ఆరాధించేవాడు. అందుకే కవితా రహస్యాలు తెలిసినవాళ్ళు ఆయనను 'ఆంధ్రా వర్డ్స్ వర్త్' అన్నారు. రాజమండ్రి ఆర్ట్స్‌కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఆస్వాల్డ్ జెన్నింగ్‌కూల్ట్రే (ఒ.జె.కూల్ట్రే) దొర కవికొండల వారిని ఎంతగానో అభిమానించేవారు. శిష్యరూపుడైన గురువు అని కూల్ట్రే దొర కవికొండలవారిని గౌరవించారు. అందుకే ఆయన ఉదయకాంతుల రాగాలు, రంగులు అనే అర్థం వచ్చే తన పుస్తకాన్ని శిష్యులకు అంకితం చేశాడు. కవికొండల వారు ఇంగ్లీషులో కూడా కవిత్వం రాశారు. అవి ఇంగ్లీషు విద్వాంసుల మెప్పు పొందాయి.

కవికొండల వారు గొప్ప కథారచయిత అని ఈ తరం తెలుగు వారికి చాలా మందికి తెలియదు. కుమ్మరిచక్రం, కమ్మరికొలిమి, నూనెగానుగలను గూర్చి శ్రమైకజీవన సౌందర్యపు కథలు కవికొండలవారు రాశారు. "పెనుమంచిలి జైనదేవుడనే' ఆయన కథ మన చారిత్రక సాంస్కృతిక పరిణామాలను పల్లెటూళ్ళు ఇంకా ఏవిధంగా పరిరక్షిస్తున్నాయో హృద్యంగా చెపుతుంది. కవికొండలవారు శృంగార కథలు అభిమానించరు. శ్రామికుల జీవితాలనే కథావస్తువుగా ఇష్టపడతారు. అయినా ఈ కథ చెరుకు పానకంలా రాశారు. చలం, మునిమాణిక్యం, శ్రీపాద, మల్లాది, వేలూరి వంటి కథారచయితల సమకాలికుడు కవికొండల. కాబట్టి వైవిధ్యం కోసం ఈ కథను పరిశీలించవచ్చు. వారి కథారచన విశిష్టత ఏమంటే ఈ కథా బీజం, స్ఫురణ వికాసం తనకు ఎక్కడ, ఏ నేపథ్యంలో ఎట్లా స్ఫురించిందో నమోదు చేయడం. కవికొండలవారు రెండు వందల కథలు రాశారని ఈ తరంవాళ్ళు ఊహించగలరా? ఆయన కథలు రమణీయ భావుకమైన వర్ణచిత్రాల్లాగా ఉంటాయి. భాషా, శైలీ ప్రత్యేకం. ఆ కాలంలో సుధ, విజయలక్ష్మి వంటి పత్రికలు వచ్చేవని ఆయన కథల చివరన ఆ పత్రికల పేర్ల ప్రస్తావనల వల్ల తెలుసుకోవచ్చు.

పడుచుతనపు భార్యాభర్తల శృంగార లీలావిలాస విజృంభణ కథ ఏకాలంలోనైనా ఎవరికైనా ఉల్లాసకరమే. పూలతోట చూదామని పోతే ఒక్కసారి పదిరకాల పూలు మాదకం కలిగించి ఉక్కిరిబిక్కిరి చేసినట్లుగా ఉంటుంది ఆలుమగల తారుణ్యోద్వేగపు అందమైన శుభ్రమైన కథ, భార్యాభర్తల మనోజ్ఞ శృంగారం కన్నా ఈ సృష్టిలో సౌందర్యాపాదకం సాహిత్యంలో ఊహించగలమా?

కవికొండలవారు కవి కాబట్టి కథ చివర పద్యం కూడా వినిపించకపోతే ఆయనకు తృప్తికలగలేదు. తనివితీరలేదు.

✿

# 21. దేవుడు

**– వేలూరి శివరామశాస్త్రి**

పార్వతి పల్లెటూరి పడుచు. ఆమె తండ్రి తాతలెడమచేత లౌకిక సంపత్తిని, కుడిచేత వైదిక సంపత్తిని పెట్టుకొని పుట్టిరి. ఆమె మేనమామలు కొందఱధ్యాపకులు, మఱికొందఱు వకీళ్ళు.

పార్వతి వీధిబడిఁలో జదివికొని నాలుగవ క్లాసు ప్యాసాయెను. వీధి నాటకములును పగటివేసములును జూచి మానవలీలలను గ్రహించెను. పురాణముల నన్నియు విని ఐహికాముష్మికముల వెలను దెలిసికొనెను.

పార్వతికి యథాసమయమునఁ బెండ్లి యాయెను. దానికి ఫలముగా పట్నమునకు వలస పోయెను.

పార్వతి మగని పేరు శివరావు. అతఁడు వకీలు. ఆ దంపతుల కొక కుఱ్ఱఁడు. వాని పేరు రాముఁడు.

రాముఁడుని గర్భస్థుడై సీతారామంజనేయమును వినెను. తత్త్వముల వినుకలితో శైశవము గడపెను. రామనామముతో అన్నప్రాశ మొనరించెను.

పార్వతి తన రాముని లీలలను కృష్ణలీలలతో దిద్దెను. రాముడుఁ క్రమక్రమముగా బాలుఁడాయెను.

రాముఁడు పట్టుగోఁచితో వెండి కంచముముందుఁ గూరుచుండెను. రెండు కబళములు తినెను. పిదప నేదో పనిమీఁద పార్వతి పాకశాల లోని కేఁగెను.

నోటినుండి కంచమునకును, కంచమునుండి నోటికిని మరవలెఁ దిరుగవలసిన రాముని చేయి ఈ రెంటికిని నడమనినున్న యాకాశమున విశ్రాంతి తీసుకొనియెను. షడ్రసములను పిండవలసిన దంతయంత్రము హఠాత్తుగా నాఁగిపోయెను. రాముఁడు రాతిబొమ్మవలెఁ గూరుచుండి యుండెను.

కొలఁదిసేపటిలోనే తల్లి వచ్చి చూచి– 'మీ నాయనగారికివలెనే నీకును మఱపు. అన్నము తినుట మఱతురటరా?' అని యనెను. రాముఁ డులికిపడి 'కాదే అమ్మా! రాత్రి నీవు చెప్పిన గజేంద్రుఁడు ఆ కీకారణ్యములోని ఆ పెద్ద చెఱువులోనికి దిగక మన పంపుదగ్గఱకు వచ్చి నీరు తాగలేకపోయెనేమి?' అని ఆలోచించుచుంటిని అని యనెను.

'ఇదియా ఆలోచన? మొనమొన్ననేకదా మనయింటఁ పంపు పెట్టినది' అని పార్వతి యనెను.

'అవు నవును'

'ఇఁక నన్నము తిను'

రాముని చేయి మరల నాడఁదొడఁగెను.

పార్వతి రామునకు లాగు తొడిగెను. రామనామము లద్దిన రుమాలు తీసి చొక్కా వేసెను. రామరక్ష పఠించి భటునికిచ్చి బడికిఁ బంపెను.

రాముఁడు రామకవచమును బఠించుకొనుచు బడికిఁ బోయెను.

ఉపాధ్యాయుఁడు వచ్చి బాలుర నమస్కారములందుకొనెను. కొంతసేపటికి ప్రవచన మారంభమాయెను. ఉపాధ్యాయుడు వేలు పయికెత్తి యిటు లడిగెను 'మన నెత్తిమీద నేమున్నది'?

'జుట్టు' అని తడుముకొనకుండ నొకడు సమాధానము చెప్పెను.

ఉపాధ్యాయుడు నవ్వి చేయి కొంచెము పయికెత్తి 'మనమీఁద యేమి ఉన్నది?' అని ప్రశ్నించెను.

'ఇల్లు'

ఉపాధ్యాయుడు విసువుతో నిటులనెను 'నిన్న చెప్పిన పాఠములో నేమున్నదో అది చెప్పవలెను. కృష్ణా! నీవు' కృష్ణుడు నీళ్లు నమలెను.

ఉపాధ్యాయునకు కోపము వచ్చెను. అతఁడు రివ్వున వాకిటిలోనికిఁ బరువెత్తి – బెత్తముతో ఆకసము చూపి – 'అక్కడ! రామా! నీవు చెప్పు' అనెను.

'దేవుడు'

'విధవ, కనఁబడునవి చెప్పలేవు. కనఁబడనివానిని కనఁబడినటులు చెప్పవత్తువు. మాటకుముందు నీకు దేవుఁడు, ఆఁగు. నీకు దేవుఁడు కనఁబడునటుల చేయుదును' అని ఉపాధ్యాయుడు వచ్చి కుర్చీలో కూరుచుండెను.

రాముఁడు గబగబ ఉపాధ్యాయునికడకేఁగి – 'నాకు దేవుని జూపింపుడు' అని అడిగెను.

బాలుర మనస్తత్వ మెఱుఁగని ఉపాధ్యాయుని శాంతి యెంతసేపు? పంతులవారి యెఱ్ఱని కన్నుల కొలిమినుండి కెంపులు రాలెను. అతఁడు రాముని చేతిమీద బెత్తము నుపయోగించి– 'దెబ్బలో దేవుఁడున్నా'డని అఱచెను.

'రామ రామ రామ' అని రాముఁడాక్రందించెను.

రాముఁ డెటులో మధ్యాహ్న భోజన మొనరింపఁగలిగెను గాని మఱి సాయంతర భోజన మొనరింప జాలకపోయెను. అతఁడొడలు తడుముకొనియు అఱచేయి చూచికొనియు లోలోపలనే యేడ్చెను. తుద కా రహస్యము నతఁడు దాఁపజాలక పోయెను. ఏడ్పు క్రమముగా బెద్దదై వెక్కులలోనికి దిగెను.

పార్వతి బెదరుచు వచ్చి చూచి గువ్వ కుత్తుకతో 'ఏమి కావలయునురా నాయనా?' అని యడిగెను.

'అమ్మా దేవుఁడు దే–వుడు, క–కనఁబడ–కనఁబడలేదే'

"దేవుఁడు కనబఁడునా నాయనా? తాతగారి ఊరు పోదము. అచట కొండమీద గుడిలో దేవుఁడు కనఁబడును'

'అమ్మా నే నక్కడికి వెళ్లితినే. కనఁబడలేదే. అమ్మా నీవు చెప్పితివే ఆ యాకాశములో – అక్కడ – అక్కడే– దేవుఁడున్నాఁడని నే ననగా పంతులుగారు దెబ్బలో దేవుఁడున్నాఁడని కొట్టిరి. ఇదిగో దెబ్బ ఇందులో యెంత వెతికినను దేవుఁడు కనబడలేదే' అని చేయి చూచుకొనుచు వెక్కివెక్కి యేడ్చెను.

పార్వతి రాముని చేతిని పరికించెను. అది పూరీవలె పొంగియుండెను. ఆమె కన్నులు జలజల వర్షించెను.

'కనఁబడఁడూ కనఁబడఁడూ? ఇంతేనా?' అని రాముడు విలపించెను.

'కనఁబడును కనఁబడును' అని పార్వతి మగనికడకు వెళ్లెను. దెబ్బలోఁ చూపుల గ్రుచ్చి చూచుకొనుచు– 'ఏఁడి ఏఁడి' అని రాముఁడాక్రందించెను.

పార్వతి తన యెదుట నున్నటుల శివరావు వెఱుఁగడు. అతఁడొక బండెఁడు కాగితములలో తల పాతుకొని కూరుచుండియుండెను. తుపానురానీ భూమి బద్దలుగాఁ పగులనీ అది అతనికిఁ దెలియదు.

'చూచితిరా యెంత పని జరిగినదో'

'రెస్ జూడికేటా' అని మొగమెత్తి చూచి – 'ఆఁవడ్డించు' అని యనెను.

'ఎప్పుడును, పరధ్యానమె. ఇది వడ్డించు వేళయేనా? పంతులుగారు అబ్బాయి చేతిమీఁద వడ్డించిరి. చేయి పగిలినది'

'ఆఁ! పాడు పంతులు. అబ్బాయిని ఆ బడి మానిపించు. నేఁజెప్పఁగా వింటివా? కిరస్తానీ బడి యనియు మాలబడి యనియు మడిగట్టుకొని కూర్చుంటివి. ఇపుడు తెలిసి వచ్చినదా? అబ్బాయిని మిషన్ బడిలోనికిఁ బంపినచో 'పూవువలె జక్కగా నింటికి వచ్చెడివాఁడు పో' అని శివరావు మరల దస్తావేజులలో గూరుకుని పోయెను.

పార్వతి కిపుడు రామునికన్న నెక్కువ దెబ్బ తగిలెను. దానికి మందుగా ఆమె యింటిలోనికిఁ జనెను.

శివరావునకపుడు జ్ఞప్తి కలిగెను. అతఁడు చిన్నయి రాముని దాపునకు దీసికొని చేయి చూచి – 'అయ్యొ బాబో! ఇంతవరకును డాక్టరును పిలువలేదా. ముందు మందు వేయించు. సరియకాని రామా! పంతులెందులకు కొట్టెను?' అని అడిగెను.

'ఆకాశముపై నేమున్నదని పంతులుగారడిగిరి. మబ్బుల పాఠము మఱచి అమ్మ చెప్పిన పాఠము ప్రకారము 'దేవుఁడు' అని సమాధానము చెప్పితిని. పంతులుగారు గుడ్లెఱ్ఱజేసి– 'కాదురా దెబ్బలో దేవుఁడున్నాడని' పళపళ కొట్టె. కాని దేవుఁడు మాత్రము కనబడలేదు.

'దేవుఁడు దెబ్బలోఁ గనఁబడునటరా?'

'నాయనా, నీవు ప్రతిదినమును కోర్టుకుఁబోవుదువే– అక్కడ దేవుఁడుండునా?'

'మీ యమ్మ నీ కీదేవుని పిచ్చి నూఱిపోసినది. కోర్టునందే దేవుఁడు లేనిచో మఱి ఎక్కడ నుండును?'

'నాయనా నాకును జూపుదువా?'

'పోరా. నీవు కామారపు జీడివి'

కోర్టులో దేవుcడుండును గనుకనే తన తండ్రి దైనందినమును కోర్టుకు వెళ్ళుచుండవలయును అని రాముc డాలోచించుకొనుచుండెను.

పార్వతి 'రామా! ఇcక జాలుc గాని ముందు మందు వేయించెదనిటురా' అని అనెను.

'ఆc ఆ పని ముందు చెయ్యవలెను' అని చెప్పి శివరావు తన కర్తవ్యము నంతయు ఆ వాక్యముతోడనే సమాప్తించి ఆఫీసుగదిలోనికి వెళ్లిపోయెను.

✿ ✿ ✿

రాయల గ్రామమున వేంచేసియున్న శ్రీ మల్లికార్జునస్వామి వారి యీనాము భూముల హక్కుల గుఱించి ధర్మకర్తలకును రైతులకును దావా సంఘటించెను.

వాదులు: శివుని శంకరయ్య యీ శరభయ్య యీ ధూర్జటి వగైరా

ప్రతివాదులు: శ్రీ ముక్కంటి జంగమలింగము అయ్యవార్లు.

'శిస్తు హక్కు మాత్రమే ధర్మకర్తలద'ని శివరావు వాదము

'పది పదియేనేండ్ల యీ నడుమ నాలుగయిదు తడవలు వాదులు ధర్మకర్త ఇచ్ఛానుసారముగా కొన్ని భూములనుండి తొలగిరి. మరల అని శివరావనుచుండగా అతని కొడుకు రాముcడు ఎటులు లోనికి వచ్చెనో యెవరు నెఱుcగరు– శివరావు ముందరి బల్లయెక్కి శివరావునకెదురుగా నిల్చి 'నాయనా కోర్టులో దేవుడు కనబడునని చెప్పితిరి. ఇపుడు దేవుcడే లేcడని యనుచుంటిరి. దేవుడు లేడా? లేడా?' అని స్మృతి తప్పి ఆ బల్లపైc బడెను.

## కథానేపథ్యం ...

'సమత' అనే మాసపత్రిక అరవై ఏళ్ళ కిందట రాజమండ్రి నుంచి వచ్చేది. వేటపాలెం సారస్వత నికేతనంలో మచ్చు సంచికలు మాత్రం రెండు మూడున్నాయి.

తెలుగు కథను ఆధునీకరించి 'సుసంపన్నం చేసిన కథక శాస్త్రి త్రయంలో వేలూరి శివరామశాస్త్రి అసదృశ పండితులు 20వ శతాబ్ద తెలుగు సాహిత్యంలోనే

ఆయన వంటి దార్శనికుడు, షట్ఛాస్త్ర పండితుడు, నవీన భావసంపన్నుడు అరుదుగా కనపడతారు. బెంగాలీ శరత్‌బాబును మొట్టమొదటిసారి తెలుగువారికి పరిచయం చేసింది శివరామశాస్త్రిగారే. తిరుపతి వెంకటకవుల శిష్యులలో ప్రముఖుడు. చిన్నతనంలో శతావధానాలు కూడా చేశారు. 'మహాపండితులు కథారచయితలు కాలేదన్న లోటు వేలూరి వారి వల్ల తీరింది' అని కురుగంటి సీతారామయ్య నవ్యాంధ్ర సాహిత్య వీధులలో అన్నారు.

మానవ మనస్తత్వ పరిశీలనాత్మకమైన కథలు శిల్పసుందరంగా రాయడం మొదలుపెట్టినది శివరామశాస్త్రిగారేననుకోవాలి. సుమారు 50 దాకా కథలు రాశారు. అవి సంపుటాలుగా రాలేదు. గొప్ప కథా సంకలనాలలో ప్రాతినిధ్యంగా శాస్త్రిగారి కథలు కనపడతాయి. ఈయన కథలలో 'డిప్రెషన్ చెంబుకు' బాగా పేరు వచ్చింది. రెండు ప్రపంచయుద్ధాల నడిమి కాలంలో ఆంధ్రదేశంలో సంభవించిన ఆర్థికసంక్షోభం (డిప్రెషన్) గూర్చిన కథ ఇది. విదేశీ భాషలైన ఇంగ్లీషు, ఫ్రెంచిలలోనేకాక దేశ భాషలైన బెంగాలీ, గుజరాతీలలో కూడా ప్రావీణ్యం గడించారు శాస్త్రిగారు.

'దేవుడు' అనే ఈ కథలో రాముడనే బాలుడి దేవుడి పిచ్చి కథా వస్తువైంది. ఆ పిల్లాడి కన్నతల్లికి గల దేవుడి చాదస్తం కొడుక్కి బాగా వంటపట్టింది. అమాయకమైన కౌమారదశలో మనసుని బాగా ప్రభావితం చేసిన భావాలు, విశ్వాసాలు ఎట్లా పని చేస్తాయో చెప్పడమే ఈకథ ఉద్దేశం అనుకోవాలి. దేవుడెక్కడా లేదు, ఉన్నా కనపడదు, పిలిస్తే పలకడు, ఉలకడు, తన ఉనికి నిరూపించుకోడు అని ఆ పసివాడు ఆవేదన చెందటం ఈ కథలోని వ్యంగ్య స్ఫురణం. అదే విచికిత్స ఇతివృత్తంగా ఈ కథ రూపు దిద్దుకుంది. 1920 సాహితి పత్రిక వెలువడ్డ కాలం నుంచి 1947 వరకూ శివరామ శాస్త్రి కథారచనలో మనో విశ్లేషణ, సమాజ సంబంధ పరిశీలన, వింత మానసుల ప్రవర్తన, సాంఘిక వాస్తవికత చోటు చేసుకున్నాయి. వారి కథలు గొప్ప కథలు కాకపోయినా మంచి కథలు.

# 22. బోధన

(ఎనభైఏళ్ళనాటి శృంగారకథ)

– చలం

హనుమంతరావు జాడ్యం ప్రణయతత్వమూ, ప్రబంధపారాయణా, విరహ వర్ణనలూ, ప్రేయసీ స్మరణలతో ప్రారంభమై, చప్పున వారం రోజులకింద వేదాంతచర్చా, విరక్తోపన్యాసాలూ, సీతారామాంజనేయ పఠనమూ, స్త్రీ ద్వేషములోకి దిగింది. భర్తృహరి శృంగారశతకం ఆఖరు పేజీ తిప్పి, వైరాగ్య శతకం ప్రారంభించినట్లయింది. వాడి వాగుడంతా వినే గతిపట్టిన నేను, పది పదిహేనురోజులు శాంతంగా భరించి, చికిత్సలు ప్రయత్నించాను. కాని యీ జాడ్యపు అసలు కారణం కనిపెడితే గాని స్వస్థత కలగదని, అతను ఆ జాడ్యంలోనూ, అంతకుముందూ చేస్తున్న ప్రదక్షిణాలవల్ల కారణం విష్ణ్వాలయం ప్రాకారసామీప్యంలో వుండాలనుకుని వెతికాను. అతనిని వొదిలిన శృంగారజాడ్యం నన్నావరించింది.

**2**

ఈ శరీరం అసహ్యపుమాంసమనిన్నీ, దీన్ని జాగ్రత్తగా అలంకరించడమంత పరిహాస్యాస్పదమైన పనిలేదనీ, యెన్నడో కట్టెలలో కాల్చేదేననీ పాడుతున్న హనుమంతరావు ఉత్సాహవాక్యాలను వీలయినంతవరకు పెడ చెవినిబెట్టి షోకు చేసుకుని, విష్ణ్వాలయం వేపు వెళ్ళాను. సంధ్యమసకలో తెల్లగన్నేరు చెట్లకిందికి లలిత వొచ్చింది. నాలుగు రోజుల్లో యెవరితోనూ నాకింత స్నేహం కాలేదు. మొదటి రోజునే నాతో "నన్నొక్క సందేహం బాధిస్తోంది. మీరు మీ జ్ఞాన విశేషంవల్లా, విద్యాధిక్యతవల్లా తీర్చగలరని నా ఆశ. మీ కీర్తి మీ పుస్తకాలవల్లా, కొందరు స్నేహితులవల్లా విన్నాను" అంది. ఆ స్నేహితులలో ఒకడు హనుమంతరావు కాడుకదా అని సందేహం కలిగి, అతనెరుగుదువా అని అడిగాను లలితను. చాలా నాజూకుగా తల వంచుకుని, "నాకు బాగా తెలీదు. మా అక్కయ్య నెరుగునాయన" అంది. నా గుండె నిబ్బరం పడి, రాత్రికి వాడి గొంతుక పిసకడమా? కత్తితో నరకడమా? యేది సులభమనే ఆలోచనను ఆపుకున్నాను. ముసలిభర్తని వొదిలి రావడమా? కష్టపెట్టే తలిదండ్రుల దగ్గిర్నించి

పారిపోవడమా? యేమిటీమె సందేహమని ఆలోచించాను. కానీ ఆమె నా దగ్గిర్నించి సందేహం తీర్చుకునే పద్ధతి చాలా మనోహరంగా వుండడం వల్ల దాన్ని తీర్చడానికి నేనేమీ తొందరపళ్ళేదు. దేవాలయ పుణ్యక్షేత్రంలో, లక్ష్మీదేవి సాన్నిధ్యమందు, తెల్ల గన్నేరు వాసనలలో నానిన నూనెప్రమిదలూ, వాడిన తులసీదళాలూ కలిసి పంపే సుగంధంలో లేతరాత్రి చిన్ని చీకట్లలో దొరికిన యీ శృంగారం నాకెంతో వుల్లాసాన్నీ, మాధుర్యాన్నీ యిచ్చింది. ఈ స్నేహానికి పర్యవసానమేమిటి? ఈమె యెవరు? ఎందుకిట్లా వొస్తుందని యోచిస్తే ఆ కల యెక్కడ మాయమౌతుందోనని భయంతో, ఆనందంతో కళ్ళు మూసుకుని మునిగిపోయినాను. హనుమంతరావు వేదాంత శ్రవణం ప్రారంభించ గానే గదిలోనించి పరిగెత్తేవాణ్ణి.

**3**

ఆరు రోజులయింది. లలితతో పరిచయం పెదిమలదగ్గిరే ఆగింది. ఎందుకు? ఆటంకమేమిటో తెలీదు. “లలితా! నిన్ను వొదిలివెళ్ళినా, రోజల్లా నువ్వే తలపుకు వొస్తావు. స్కూల్లో వున్నా తటాలున నీ రూపం జ్ఞాపకమొచ్చి పిచ్చెక్కుతుంది. నీ ముఖం పోలిక పుస్తకంలో గీస్తోవుంటే మా లెక్చరర్ చూశాడు. నా హృదయానికి దగ్గిరిగా! నా వల్ల నేరమేమిటో చెప్పు ఎందుకట్లా కళ్ళు కిందికి వాల్చి జవాబు చెప్పక హృదయంలో యేదో, రహస్యమైన బాధవున్నట్లు తోపిస్తావు? నేను నీవాణ్ణే. నన్నిట్లా తోసేస్తా వెందుకు?” నిదానంగా వాల్చివున్న ఆ ముఖంవంక చూశాను. ముక్కు దగ్గరనించి చంపలమీద పొడుగ్గా కణతల వరకు పరుచుకుని కను వెంట్రుకలని చేత్తో తాకి చెంపమీద మెల్లిగా కొట్టాను.

“నా సందేహమే అది. మిమ్మల్ని ఆ రోజునే అడగాలనుకున్నాను. చూడండి. పాపం కదండీ! పెళ్ళికాని వాళ్లతో సహవాసం? పోనీ, యిట్లా కూచుంటే తప్పేముంది కాని....అసలు భార్యగా వుండడం పాపం కదూ! ఈ కాస్త సుఖానికి వెయ్యేళ్లు నరకంలో అగ్నిగుండంలో కాలడం.

ఇంతేనా యీ సందేహం అనుకున్నాను. కాని లలిత మనసులో యీ వూహ బాధిస్తున్నట్టూ, యీ ఆలోచనే ఆమెని ఆటంకపరుస్తున్నట్లూ తట్టింది. కాని ఇంత గాఢంగా ఆలోచించడానికి వ్యవధానమెక్కడిది? వయసులో వున్న పిల్ల తన వాంఛనీ, ధర్మాన్నీ విడదీసి యోచించ కలిగినంత అవసరమెట్లా కలిగిందని ఆశ్చర్యం వేసింది. నేనూ ఆలోచించ తలుచుకోలేదు. “లలితా! నన్నడగడం మంచిదయింది. ఈ విషయమై

నేను దీర్ఘంగా ఆలోచించాను. నాకంటే యెవరికీ యెక్కువ తెలీదు. ఇంకెవరినన్నా అడిగితే నీకు తప్పు అభిప్రాయాలు చెప్పివుందురు"

నోరు సన్నగా చంద్రవంకలాగు చేసి చిరునవ్వుతో, వోరకంటితో నా వంక చూస్తో– 'మీ పుస్తకాలు చదివాను. అంతమాత్రం మీ అపారజ్ఞానము, ఉత్తమ మేధాశక్తీ, కనిపెట్టలేకపోయినా నంటారా? తరవాత మిమ్మల్నెదారుసార్లు చూశి. మీ పుస్తకంలో మీ 'ఫొటో' నించి పోల్చుకున్నాను'

నేను దేవేంద్ర సింహాసనాన్నధిష్ఠించి త్రైలోకాధిపత్యం వెంటనే వహించాను. ఒక్క స్త్రీ హృదయంలో ఇంత వున్నత భక్తినీ, ప్రేమనూ వెలిగించిన నా కవిత్వం, నా వంశము, నాజన్మం, నా పద్యాలు అచ్చువెయ్యమని 'భారతి'ని బతిమాలుకుంటో నేను రాసిన వుత్తరాలు, అన్నీ సఫలమైనాయి.

"నీ మెత్తని మనసులో ఇట్లాంటి దుర్మార్గపుటూహలు యే రాక్షసులు కల్పించారు?"

"చిన్నప్పణ్ణించి మా యింట్లో పురాణాలు విన్నాను. అప్పణ్ణించి నాకీ భయం పట్టుకుంది. మీ పుస్తకాలు చదివి యెంత ప్రయత్నించినా మనసు కుదుటపళ్లేదు."

"స్త్రీ పురుష వాంఛ సహజం. మృగాల్లో పుణ్య పాపాలున్నాయా? మనుష్యుల్లో పాపమని యెవరన్నారు? దేవుడొచ్చి చెప్పాడా? పుస్తకాల్లో రాశారు. ఎవరు? సంఘ క్షేమం కోసమని కొందరు మహానుభావులివి యేర్పరచి పాపాలని పేరు పెట్టి మూఢుల్ని దడిపించారు. ప్రతీవారూ లేచిపోయి సంఘం గోల అయిపోతుందేమోనని, యిట్లాంటి నిబంధన లేర్పరచి నరకమనే భయంతో మనుష్యుల స్వభావసిద్ధమైన వాంఛల్ని కట్టి వెయ్యాలని ప్రయత్నించారు"

"మరి యముడూ, చిత్రగుప్తుడూ వీళ్ళందరూనో?"

"యోచించు. ఆ చిత్రగుప్తుడు నోటు పుస్తకం పట్టుకుని, యిన్నికోట్ల ప్రజల గదుల్లోనూ దూరి 'యెలక్ట్రిక్ టార్చి' వెలిగించి, ప్రతి జతకీ పెళ్ళి జరిగిందో లేదో సాక్ష్యాలు విచారించుకుంటో తిరుగుతాడా"

"నిజం చెపుదురూ"

"నిజమే"

"అయితే యింక నీతీ, దేవుడూ యేమీ లేవూ"

"లేకేం? నీతంటే ఏమిటి? అంతా మన మేర్పరచుకున్నదే! దేవుడున్నాడు. కాని యీ నీతులన్నీ యేర్పరచింది దేవుడు కాడు..."

ఈ ప్రకారం అరగంట మాట్లాడాను. ప్రతివాక్యం గురుబోధవలె భక్తితో విని వెళ్ళేటప్పుడు నా విద్వత్తును ఒక ముద్దుతో సత్కరించింది.

మర్నాడు నా పుస్తకాలమీద "నా హృదయేశ్వరికి" అని రాసి, ఆమెకి సమర్పించాను. ఆ సాయంత్రమంతా హిందూమతముమీదా, ముక్కోటి దేవతలమీదా, త్రిమూర్తులమీదా ఉపన్యాసమిచ్చి దేవుడు వొక్కడే అనిన్నీ, ఈ ప్రపంచం చాలా విశాలమయిందనిన్నీ, క్షుద్రులమైన మన చిన్న కార్యాల నీతీ అవినీతులు కనిపెట్టడం కన్న యీశ్వరుడికి చాలా పనులున్నాయనీ రూఢిపరిచాను. నీతనగా మనసులో ప్రేమించినవాడికి సర్వమూ అర్పించడమేనని బోధించాను. ఆ మాటలకోసమే తనెదురు చూస్తున్నట్లు అతిశ్రద్ధతో వింది.

"పోనీ యీ పనులకి–అంత ప్రాముఖ్యం లేనప్పుడు, అనేకమందిని యిద్దరు ముగ్గురికి సంతోషమిస్తేనేమండి?

నాహృదయం భగ్గుమంది.

"అట్లా కూడదు. ఎవరిని ప్రేమించావో వారిని తప్ప యితర్లని తాకడం మహాపాపం"

"పాపం లేదన్నారు"

"అదే, ఆ నరకం పాపం కాదు– మన అంతరాత్మలకి..."

"అంటే అంతరాత్మలకైనా, పాపమూ పుణ్యమూ వున్నాయన్నమాట"

చర్చ చాలా యిబ్బందిగా దిగింది. చీకటయింది. ఇంకా యెన్నాళ్ళు? ఈ సౌందర్యం నా పక్కన కూచుని నన్ను దూరాన్నుంచి యేడిపిస్తోంది. ఇంటికి వెడితే యిట్లా మాట్లాడి, అట్లాచేసి, లోబరుచుకోక, మూర్ఖుణ్ణై కాలమంతా యెందుకు వ్యర్థం చేశానా, అని బాధపడి యెంతో నిశ్చయపరుచుకుని, యెంత ప్రయత్నించినా నన్ను చమత్కారంగా తప్పించుకొంటోంది.

"అదంతా రేపు ఆలోచిద్దాములే. నీ మీద ప్రేమతో కాలిపోతోవుంటే, నన్నెందుకింత నిర్దయగా...."

"ఉండండి. మరి ముందు నే చెప్పేమాట వినండి. నిన్నణ్ణించి నా మనసులో మీ మాటలే ఆలోచిస్తున్నాను. మీరు యెంత బాగా విడదీసి చెప్పారండీ నాకీబాధ యెందుకు కలిగిందంటే...రేపు తెలియచేస్తాను లెండి. రేపే మీ సలహా ఆచరణలో పెడతాను. యీ యింట్లో నా బతుకు చాలా కష్టంగా వుంది. నా మనసు యెన్నడో ఒక అద్భుత వ్యక్తికి సమర్పితమయింది"

(నా వంక అతి నాజూకుగా చూసింది)

"ఎవరంటారా? మీకే తెలుసు? తెలీకపోతే రేపు చెపుతాను. ఈవేళ పొద్దుపోయింది. మీకు అతను బాగా తెలుసు. మీ అంత బాగానూ"

(నా వొళ్ళుప్పొంగింది. చమత్కారం మనిషి)

"ఉండండి...వొదలండి...ఈ ఇంట్లోంచి వొచ్చేస్తేనేగాని నాకేమీ తోచదు"

నా నుంచి తప్పించుకుని మామూలు ముద్దన్నా ఇవ్వకుండా వెళ్ళిపోయింది.

దోవలో ఒకటే ఆలోచన, నా స్వర్గసౌఖ్యాన్ని గురించి. రేపు సాయంత్రం ఈ అమ్మాయిని యెక్కడికి లేవతీసుకుని వెళ్ళను. ఇన్ని పద్యాలు రాసి, ఇంత బోధించి వెనక్కి తగ్గనా? నా చదువేమైతేనేం, అమ్మాయేమైతేనేం? ప్రేమ యెదుట అన్నీ తొలగి పోవలసిందే, ఇంటి దగ్గర్నించి నాలుగువొందలు సంపాదించవొచ్చు వారంలో – చెన్నపట్నం వెడితే.

మర్నాడు సాయింత్రం గదిలో షోకు చేసుకుంటో నుంచున్నా. ఈ హనుమంతరావు రోజల్లా కనపడలేదు. ఏమైనాడో? వాడితో చెప్పనా? వాడి వేదాంతం గోలలో ఈ రసికత్వం వినపడుతుందా? దరిద్రుడు యిరవైయేళ్ళకే ఆ వేదాంత మేమిటి? పాపం యెంతకర్మం పట్టిందో వెధవ వాడి గోలెందుకు? వెళ్ళాలి కిటికీ కింద వుత్తరముంది.

"నా జాతకం తిరిగింది. ఉత్తసందేహాలతో నన్ను పొమ్మన్న సుందరి నన్నరాత్తుగా నీ బోధనచేత అంగీకరించింది ఈవేళ. మా యిద్దరి వందనాలు. ఇద్దరం వెళ్ళిపోతున్నాము. కాఫీ హోటలు బాకీకి పైకం లేదు. నువ్విచ్చెయ్యి"

– హనుమంతరావు

## కథానేపథ్యం ...

ఈ కథ ఎక్కడా చలం కథా సంపుటాలలో వచ్చినట్లు లేదు. ఇది పరమ చమత్కారమైన, సున్నిత సుకుమార హాస్యపూరితమైన చిన్న కథ. తెలుగులో వచ్చిన కొసమెరుపు. ఈ కథలాంటి కథ మరొకటి ఉండదేమో. వో. హెన్రీ కథల వంటి కొసమెరుపు ఈ కథలో కనపడుతున్నది. చాలా నవ్వు పుట్టించే కథ ఇది. శృంగారపు బరువుకన్నా హాస్యపుసోయగం ఈకథ చివరి సంతకంతో వెల్లివిరుస్తుంది. ఇదేమిటి చలం ఇట్లా వాదిస్తున్నాడు? అవి విస్తుపోతూ కుతూహలంగా, ఉత్కంఠగా చదువు తుండగా 'నీవు నేర్పిన విద్యమే నీరజాక్ష' అన్న నీతిని హరాయించుకోలేక పోతాడు ఈ కథారచయిత. తనదాకా వస్తే కాని ఆ తపనయేమిటో తెలియదు అని ఈ కథ బోధిస్తున్నది. ఇందులో కథానాయిక లలిత చలం గారికన్నా గడుసరి అనిపిస్తుంది. 'ఏకో రసంఃకరుణ ఏవ' అని భవభూతి చెప్పాడుట. 'ఏకో రసః శృంగారమేవ' అంటాడు చలం. అంటే వైరాగ్యం (శాంతం), బీభత్సం, భయానకం, హాస్యం అన్ని శృంగారం లోంచే ఉత్పత్తి అవుతాయని చలం సిద్ధాంతంకాదు కదా అనిపిస్తుంది. ఇందులో కథానాయకుడు హనుమంతరావు. "నేనే" ననుకుంటాడు చలం చివరిదాకా? చివరికి తాను కాదని తెలుసుకుంటాడు హనుమంతరావు వైరాగ్యానికి, వేదాంత శ్రవణానికి, 'ఇహ' విముఖకూ తల్లివేరు శృంగారమే అని ఈ కథ చెపుతుంది. చలం పాఠం చలానికే అప్పజెప్పింది ఈ కథలో కథానాయిక లలిత.

ఈ కథ తొంభైఏళ్ళనాటిది. కాని భాషాశైలివిషయంలో ఇప్పటిలాగా కన్పిస్తుంది. అందుకే ఆయన్ను ఇష్టపడని వాళ్ళుకూడా చలాన్ని మెచ్చుతారు. ఈ కథ తొంభైఏళ్ళ కింద రాజమండ్రి నుంచి వచ్చే 'సుభాషి' అనే పత్రికలో వచ్చింది. ఈ పత్రిక సంపాదకుడు శ్రీ పందిరి మల్లికార్జునరావు. ఈ మల్లికార్జునరావే 1950లలో మద్రాసు నుంచి కిన్నెర అనే పత్రిక ఆరేడేళ్ళు నడిపారు. ఈ విధంగా రెండు పత్రికలు కొంత కాలం నడిపి, పందిరి మల్లికార్జునరావు ఆధునిక సాహిత్యానికి విశిష్టమైన సేవ చేశాడని చెప్పాలి.

# 23. లండన్ విద్యార్థి

– ఒద్దిరాజు రాఘవ రంగారావు

గురురావు గొప్ప జమీందారుడు. అతని మిరాసి గ్రామములు పల్లెలగుట బట్టి పల్లెలయందుండుట కిష్టము లేక పట్టణమున నివాసము చేయసాగెను. పల్లెల అధికార మంతయు దివానుగారే దివానుగారి వలన భూతాది పూర్వకముగా జీవించు నౌకరు. ఎవని సొమ్మువానికి నష్టము కాకుండా అభివృద్ధిగావలయునని మనస్సుండును. కాని యితరునికేమి? జమిందారుని జమీను చెడితే దివానుకేమి? బాగుపడితే దివానుకేమి? "ఊరుపాయె హుసేన్ సాయిబు" అంటే "పోతె పాయె బడే సాయబు" అన్న సామెత యెవరెరుగనిది. చెరువులు మరమ్మతు చేయించుట, బావులు తీయుంచుట, కాల్వలు గట్టించుట మొదలయిన సౌకర్యములు రైతులకు కలుగచేయుట యేమి లేదు. కాని యెండలో నిలువబెట్టి మీద బండలెత్తి మాఫిరకం అను పేరు లేక సేద్యం అయినా కాకున్నా సిస్తు వసూలు చేయుట ఆయన పని. దివానుకు దయవచ్చి సిద్ధం చేసినంత రకముతో పట్టణములో సౌఖ్యపడుట గురురావుగారి పని. గురురావుగారికి కుమారరత్నం కలిగినాడు. రూపమేమయినా లోపమా? తెలివి యేమయినా లోపమా? నగరములో చదివినాడు. బి.ఎ. ప్యాసు అయినాడు. సెకండరీ చదువుచున్నప్పుడే వివాహం అయింది. ఇక కావలసినదేమి? బ్రతుకు దెరువునకు మార్గము కలదు. వృత్తివిద్య అంత అవసరంలేదు. కాని అంత మాత్రమున తృప్తియెక్కడిది? వృత్తి విద్య యుంటేనో? అదిమాత్రము దేశమున లేదా? వైద్యము చదువ వలయునన్న ఎం.డి. మట్టున కిక్కడనే గలదు. న్యాయవాదము ఎల్.ఎల్.బి. మట్టున కిక్కడనే గలవు. ఇట్టులనే అన్నియు నిక్కడనే గలవు. ఎంత చదివి ఎంత జ్ఞానమార్జించినను సీమకు వెళ్ళి వచ్చిన దర్జాయే వేరు.

రామాచారి, విశ్వనాథశర్మ, లతీఫ్ సాహెబ్ మొదలయినవారలు కొందరు గురురావుగారింట నొకనాడు కూడిరి. పయివారంతా నగరములో ఉద్యోగమో, న్యాయమో చేయుచు కాలము గడిపే గౌరవనీయులే. వారందరు గురురావుగారి కుమారుడగు తుకారాంగారి విద్యాభ్యాసమును గురించి చర్చ చేయుచుండిరి.

'ఈ దినములలో లండను, కేంబ్రిడ్జి మొదలగు విశ్వవిద్యాలయములలో చదివిన వారలకే కీర్తిప్రతిష్ఠలు గాని మన దేశీయ విశ్వవిద్యాలయములలో చదివిన వారలకు లేదండి' అని రామాచారి గారనిరి.

'అయితే మా తుకారామును ఎక్కడికి తోలించవలయును' అని గురురావుగారనిరి. 'సీమ చదువే పాడండి. మన ఆచార వ్యవహారాలు బొత్తిగా పాడు కావడమే కాక పిల్లలు మళ్లీ మనకక్కరకు రాకుండా అయి వస్తారు. ప్రతి సంవత్సరము ఇండియా నుండియే రెండు వందలమంది విదేశములకు వెళ్ళి డబ్బంతా పాడుచేసి వస్తున్నారు కదా! వారిలో ఇండియాకు వచ్చి వెలుగబెట్టినదేమిటి? అని విశ్వనాథశర్మ నుడివెను. 'సీమ బారిష్టరులకు గౌరవమెక్కువండి' అని రామాచారి వక్కాణించెను.

'పళ్లూడగొట్టుకొనుటకు పర్వతానికి పోయినారట రాయి కొరకు. ఇన్ని వేలు ఖర్చు చేసి సీమకు పోయి మళ్లీ వకాలతయేనా? మొన్న నొక బారిష్టరు ముక్తారునామా తీసుకొని వచ్చిన సువ్వందర్జా వకీలుతో వాదించలేక గుటకలు మింగినాడు. మన దేశములో చదివిన వకీళ్లు పిడుగులాంటి వారు లేరనా? సీమకుపోయి వస్తే షోకులకు కర్చులెక్కువ చేయడము తప్ప తక్కిన వానిలో యెందుకు పనికిరారు' అని శర్మ తీక్షణముగా పలికెను.

సీమకు పోయివచ్చిన వాండ్లకు తెల్లదొరసానులు తమ డాన్సులో నిరాటంకముగా చేర్చుకొంటారు. తక్కినవారికెంత పాండిత్యమున్నా చేర్చుకొనరు. ఇదియొక సదుపాయము' అని లతీఫ్ సాయబనెను.

'సరె! ఎలుకను బట్టుటకు గుట్ట త్రవ్వినారుట. దొరసానుల ఆటలలో చేరుటకు వేల రూపాయలు పాడుచేసుకొని సీమకు పోయి రాకడయా! బాగు బాగు. ఈ పోవు విద్యార్థులు సీమకుబోయి తెచ్చెడి యోగ్యత ఏమి? వాయు విమానముల చేయు నేర్పా? మోటారు బండ్లు చేయునేర్పా? తుదకు కుట్రపు మిషన్‌లో సూదిని చేయు తెలివి సైతము కొనివచ్చుట లేదు. ఇక యేమి తెచ్చెదరంటే ఇంట గల ద్రవ్యమంతయు వ్యయము చేసి దరిద్రపు పెద్దమ్మవారిని తెచ్చెదరు. ఒక్కొక్కడయితే దానికి తోడు శేష భాగము గుల్ల చేయుటకు సీమ దొరసానిని తెచ్చును. ఇంతకంటే విశేషమేమియు నాకు కనపడలేదు' అని శర్మ పరిహసించెను.

'అందరంతేనా? కొందరు నీతిగా మెదలివచ్చుట లేదా? మీ అబ్బాయిని తోలించి చూడండి. కుర్రవాడు మంచి తెలివి తేటలు గలవాడు. వినయవిధేయతలు మంచిగా

గలవు. చెడిపోగూడదు' అని రామాచారి నుడివెను. 'మంచి మనస్సుంటే యెక్కడికి వెళ్ళినా యేమి ఫర్వాలేదు' అని లతీఫ్ సాహెబు చెప్పెను. 'గురువుగారూ! పిల్లవానిని పంపించుట నాకెంత మాత్రము నచ్చదు చూడండి. ఈ వినయ విధేయతలు మారి వ్యర్థుడయి రాకుంటే నా పేరు తీయించుకుందును. పోయినందుకేదో పరీక్షలలో నెగ్గినట్లు కమ్మల తెచ్చుకొనక పోడు. ఆ కమ్మలతో రాగానే కడుపు నిండదు. మళ్లీ యిక్కడ తంటాలు పడి జీవనోపాధికి మార్గం కల్పించుకోవలసిఉంటుంది. చూడండి! వాలకం. పైసా కర్చు లేకుండానే ఆ తంటాలు ఇక్కడ పడితే బాగని నా యభిప్రాయం. పిల్లవాడంతగా చెడదు' అని శర్మ చెప్పి యూరకుండెనెను.

ఎవరెంత చెప్పినను గురురావుగారికి తుకారామును సీమకు పంపితీరవలయు నని నిశ్చయముండెను. కావున తదితరుల మాట నెగ్గలేదు.

తుకారాం లండన్ విశ్వవిద్యాలయములో చేరెను. ఇండియానుండి వచ్చెడి వారంతయు యే రాజులో ఏ కోటీశ్వరులోయని అక్కడి వారి విశ్వాసము. ఎట్లయిన గౌరవము సంపాదించుకొనవలెనని వారలు వీరిని భాగ్యవంతునుకొనియెదరు. అణా చీటి వేసి అత్మారాం సేటువద్ద ప్రాంసరీ నోటువ్రాసి చేయుచున్న వైభవమని పాపము వారలకే మెరుక? ఇదియు గాక ఇక్కడినుండి చదువబోవు వారలొక బిడ్డో కొడుకునో కనియో లేక యీడేరిన పెండ్లాము నింట నుంచియో చనియెదరు. ఈ సమాచారమక్కడి సుదతులతో చెప్పరు. ఆ దేశమున యాకాలమునకు ప్రాయశఃవచ్చిన వారలు అవివాహితులనియే వారు తలచెదరు. వివాహితులని వారికి తెలిసినచో వారెవరును దగ్గరికి చేరరు. ఎన్ని తమాషాలు! గాంధి మహాత్ముని వంటి ఒకరిద్దరు నిప్పచ్చ రావతారాలు అక్కడి రహస్యాలు బట్టబయలు చేస్తే మాకెరుక అయింది. తాను లండన్ యూనివర్శిటీలో చేరినానని రెండుమూడు విషయములలో తంటాలు పడుచున్నానని తనకు సహాధ్యాయులుగా మిస్ కొంగా దొరసాని చేరినదని జాబు వ్రాసెను. అన్నియు సరికాని కొంగ మాట వినగానే గురురావు గుండె గుభాలుమనెను. ఏమి చేయగలడు? తుకారాం భార్యకు మాత్రమా సమాచారము తెలియకుండునా? ఆమె యిక మగడు రాడనియె నిరాశ చేసుకొన్నది.

కొంగా దొరసానికి తుకారాం అను పేరు పొడవుగాను ఉచ్చారణ సౌకర్యము లేనిదిగాను కనుపించెను. కావున తత్ ప్రత్యామ్నాయము 'మిస్టర్ తూ' అని పేరు వచ్చినది. కొంగ దొరసాని కూడా 'మిసెస్ తూ' అను పేరు మార్చుకొనెను.

వారుభయుల మిత్రులు యెరిగిన వారలు 'తూ' అనసాగిరి. ఇండియాయైన యెడల తుకారాము 'తూ' అనుబడుచున్నప్పుడు అభిమానపడవలసి యుండెడిది. కాని అది ఇంగ్లండు. అక్కడ 'తూ' అన్నను మరేమన్ననూ  అభిమాన పడవలసిన అవసరము లేదు. అదిగాక తానొక్కడే 'తూ' అనబడుచున్నాడా? తనజంటకు 'మిసెస్ తూ' ఒకతె లేదా? ఉభయులు ఏకరీతి 'తూ, తూ' అనబడుటయు నొకవిధమయిన గౌరవముగానే ఉండెను.

పరీక్షలు ముగిసినవి. తుకారాంగారు పత్ర యోగ్యతకు పాత్రుడైనాడు. ఇండియాకు ప్రయాణమైనాడు. మిసెస్ తుకారాం (కొంగాదొరసాని) తోడ రాదలచినది. కాని ఇండియాకామెను తీసుకొని వచ్చి యేమి పెట్టగలడు? ఇకముందు తండ్రి డబ్బీయునా? అన్నది పాడుజేయు తెలివికంటె ఇంకొక తెలివే అతని దగ్గరలేదు. అక్కడనున్న దినములన్నియు డిన్నరులలో, డ్యాన్సులలో, షికారులలో, డ్రామాలలో, సినిమెటోగ్రాపులలో గడచిపోయెను. ఇక యేమియోగ్యత కొరకాతడు శ్రమ పడవలసి యుండెను. కాని కష్టమనిన చేతగానివాడుగా మారెను. ఇకముందిండియా వచ్చి సంపాదన మార్గము నేర్చుకొనవలయును.

నాల్గు సంవత్సరములు సీమలో నుండి సంపాదించిన మాయమర్మము కుత్ర కుహకములు వినియోగించి వెనుక నుండి పిలిపించుకొనియెదనని కొంగనొడంబడిక జేసి యీవలబడుసరికి తుకారాంగారికి తల ప్రాణము తోకకు వచ్చినది. కాని ఇండియనులకు ధైర్యము లేదు. సాహసము లేదు. పిరికిపందలు. ఇక ఆడుదాని సాదలేరు. అని కొంగపోట్లు తల వాయునట్లు తినక తప్పులేదు. చేజేత అనుభవించక యెవనికి తప్పదు.

"క్యాష్ బ్యూటి" అను పడవ బొంబాయిరేవులో దిగినది. గురురావుగారు రెండు దినములకు ముందే బొంబాయికి దివాన్‌గారితో వచ్చి రేవునకు బోవు టికటు కొని యుండెను. పడవ వచ్చినదని తెలిసినది. నాలుగు సంవత్సరముల నుండి చూడక కండ్లు కాయలు కాచినట్లుండుటచే యెప్పుడు కొడుకును చూచెదనాయని మనస్సున నున్న గురురావు  రేవునకు పరుగెత్తుకొని వెళ్లెను. ఇంకను తుకారాం పడవ నుండి దిగలేదు. రెండు మూడు దినములు పడవలోనే విశ్రాంతిగొననుండెను. మొదలే తానేగుట బాగుండదనియో లేక మరో కారణమునో దివానును పంపించెను. గురురావు. దివానులోనికేగి మీ తండ్రి నిన్ను చూచుటకు రేవులోనున్నాడని జెప్పెను. అందుకాతడు

"ఇది విశ్రాంతి సమయము గాదు సాయంకాలము అయిదు గంటలకు రమ్మనమని చెప్పినాడు. "సీమకుబోయి యెంత గౌరవమర్యాదలు నేర్చుకొని వచ్చినాడు. ఎంత ప్రేమ విశ్వాసములు నేర్చుకొని వచ్చినాడు? తండ్రి గది గుమ్మము వద్ద నిలిచియుండ తను చూడమన్నప్పుడనవలసిన మాటయిదియేనా? నాలుగు సంవత్సరముల శిక్షకు ఫలమా యిది?" అనుకొని గురురావు వద్దకు వచ్చెను. కాని మంత్రికి చెప్పుటకు నోరెక్కడగలదు? కొమారుడన్నమాట లేనోటితో చెప్పగలడు? మంత్రి యింకనూ సీమకు వెళ్ళిరాలేదు గదా? "సరిచూచెదను. యుక్తి చేయనిది కుదరదు' అని గురురావును వెంటనిడుకొని పోయెను. తండ్రి వెళ్ళువరకు కొడుకు పడుకొని యుండెను. తండ్రిని చూచిన పిమ్మటనైన లేచి ప్రత్యుత్థానము చేయలేదు. తండ్రి పట్టరాని దుఃఖముచే కొడుకు పయిబడి దుఃఖించెను. ప్రేమా విశ్వాసముల నడుమ పెరిగినవాడు తండ్రి. నల్లతోలు సంచిలో తెల్ల విజ్ఞానమును నింపుకొని వచ్చినవాడు కొడుకు. ఉభయులకెంత తారతమ్యములు? "అమ్మ బాగున్నదా? తమ్ముడు చదువు కొంటున్నాడా? కోడలక్కడనే యున్నదా?" అను కుశల ప్రశ్నలేవియూ లేవు. మీటనొక్కిన పిడి వలె తటాలున లేచి గదిలో నొకమూలన "షూషు షూషు" అని యీలబాడుచు నిలుచుండెను. ఈ చర్యను చూచి తండ్రికి మరింత దుఃఖము వచ్చినది. కాని కడుపు తీపి చెడ్డది. మాలిన్యము కలదయినను లేనట్టు దోచును. ఈ చర్యనంత సహించుకొని "తుకారం బసకు పోదామురా వంట సిద్ధముగా నున్న"దని పిలిచెను. కొడుకుతో కలిసి తినక తండ్రికెంత కాలమయినది? 'నో' అన సాహసించెను. అనగా ఆ భోజనము నాకు సరిపడదు అని అర్థము. తల్లిపాలు చేదయినపుడెవడేమి చేయగలడు.

## పడక గది

సర్వాలంకార భూషితయగు భార్య అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య పడక గదిలోనికి వచ్చి నిలిచెను. తుకారామామెను ఎగాదిగా చూచి 'who are you' అని ప్రశ్నించెను. అనగా నీవెవరివని అర్థము. ఆ రవంత ముక్క తెలుగున అనలేకపోయెనా? నాలుగు సంవత్సరములకే తెలుగు బొత్తిగా మరచెనా? తల్లిదండ్రులను, చేసుకొనిన భార్యను మరచెనా? మాతృభాషలో మాటలాడిన మానహానియా? విదేశమునకేగి వచ్చుట యన జాన్మాంతర మంది వచ్చుట కాబోలు!

ఆ ఇంగ్లీషు ముక్కలు పాపమా బాలకేమెరుక! ఈ నాలుగు సంవత్సరములలో క్షేమముగానున్నారా? నన్నెప్పుడయినా తలచుకొనుచుంటిరా! అని కుశలప్రశ్నలు

వేసెను. ఆ ప్రశ్న ప్రేమలో ముంచి పాతివత్ర్యమద్దినట్లున్నది కాని ప్రయోజనమేమి? ఇక తుకారాంనకు తెలుగు మాట్లాడక తప్పలేదు. 'నీవెవరు?' అని ప్రశ్నించెను. "అయ్యో! నన్నెరుగననుచున్నారా? మీ భార్యనుగానా! మీ రాక కొరకెదురు చూచుచున్న దాననుకానా? నన్నీతీరు..." ఆ పయిన మాట అనలేక యేడువసాగెను. ఆ యేడుపునకు హిమాలయమంతటిది కరిగిపోవలసినదే. కాని ఇది హిమాలయముగాక ఆలెవ్ ఆయెను. 'ఓ...ఓ....నా వైఫ్! షేం నాకు వద్దు పో' అనెను. ఆమెకక్కడనికయేమి కలదు? ఆ పై ఏడ్చుచు పోయి అత్తమామలతో నీ సోదె చెప్పెను. వారామెననుకరించుట కంటే యేమి చేయగలరు.

రెండు పూటలింట ఒక పూట డియాంజలిస్టు హోటలులో భోజనము చేయుచు ఈ ప్రకారము మూడు మాసములు గడిపినాడు. ఒకనాడు బొంబాయికి చెప్పకుండా వెడలినాడు. కారణము విచారించగా కొంగా దొరసాని వచ్చినట్లు కబురు రాకడయే. 'మిస్ తూ', 'మిస్టర్ తూ' లు కలిసినారు. ప్రస్తుతము పిన్న మొదలు పెద్దదాకా వారినందరు 'తూ, తూ' అనే అంటారు. లండను నగరములో రహస్యముగా పెట్టుకొనిన పేర్లు హిందువులకెట్లు తెలిసినవి? వారికి దివ్యజ్ఞానము కలదుగా...ముందు అవకాశముంటె 'తూ, తూ' దాంపత్యమని వారి అనంతర జీవితము వ్రాయబడును.

## కథా నేపథ్యం ...

ఆధునిక తెలంగాణా సాహిత్య మూర్తులలో ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు గారలది విశిష్టస్థానం. మానుకోట అనే చిన్న పల్లెటూర వీరు 'తెనుగు' అనే మాసపత్రికను 80 ఏళ్ళకిందటే స్థాపించి, పదేళ్ళు అవిచ్ఛిన్నంగా నడిపారు. ఈ అన్నదమ్ములు సాహిత్యరంగంలో ఒద్దిరాజు సోదరులుగా ప్రసిద్ధులు. ఆధునిక సాహిత్యంలో అన్ని ప్రక్రియలూ వీరు ఇంచుమించుగా సుసంపన్నంచేశారు. ప్రౌఢకావ్య రచనతో పాటు ప్రహస రచనలూ చేశారు. నాటకాలు రచించారు. తీరాంధ్రంలోనూ కనపడని విశేషమేమంటే వీరు ఆ పల్లెటూళ్ళోనే ఒక ఫొటోస్టూడియో నెలకొల్పి, ఫొటోగ్రఫీని గూర్చి ఆ రోజులలోనే తెలుగులో ఒక ప్రామాణికమైన గ్రంథం రచించడం. సమాజానికత్యంతావశ్యకమైన చేతివృత్తులను, హస్తకళలను, సాంకేతిక

విద్యలను గూర్చి ఎనభై ఏళ్ళనాడే వీరు తెలుగులో పుస్తక రచన చేశారు. విద్యుదుత్పాదనం చేశారు. ఆయిల్ ఇంజన్‌లు నడిపారు. స్వయంకృషితో ఇంగ్లీషు నేర్చుకొని అందులో కవిత్వం కూడా రాశారు. వీరితల్లి గొప్పపండితురాలు. ప్రాచీనకావ్యాలలో సాహిత్య ప్రస్తావనలలో ఈ సోదరులకు ఏమైనా అర్థస్ఫురణ కలగనప్పుడు, సందేహాలు వచ్చినప్పుడు వీరి తల్లిగారు పరిష్కరించేవారుట. వడ్రంగ కళలో వీరెంతో నైపుణ్యం సాధించారు. ఇంజనీరింగ్ విద్యలో మహాప్రతిభావంతులు. తమ భవనం ఆ పల్లెటూళ్ళో తామే నిర్మించుకున్నారు.

పల్లెటూరులో ముద్రణాలయం స్థాపించి పదులు పుస్తకాలను, వ్యాఖ్యానాలను, ఆధ్యాత్మిక మతగ్రంథ ప్రచురణలనో తేవడం వీరి అసామాన్య ప్రతిభా నిరూపకం. నిదర్శనం. ఈ సోదరులలో చిన్నవారైన రాఘవరంగారావుగారు నిరంతరహాస్య సంభాషణ కుశలురు అని వారిని తెలిసిన వారు చెపుతారు. ఆయన వెంట ఎప్పుడూ పదిమంది గుమిగూడి నవ్వుతూ ఉండేవారుట. అంత చమత్కారంగా, హాస్యరస పూరితంగా శ్రీరంగారావు మాట్లాడేవారుట.

ఎనభైఏళ్ళ కిందట రాసిన ఈ కథలో ఆనాటి సంపన్న కుటుంబాలలో విదేశీ వేషభాషా వ్యామోహం ఎట్లా ఉండేదో ఈనాటి తరం పాఠకులకు వినోదప్రాయంగా, హాస్య విషాదభరితంగా వర్ణితమైంది. ఇది తెలంగాణా ప్రాంత సామాజికేతి వృత్తంతో రచితమైంది. ఈ కథకు 'తూ....తూ' అని పేరు పెట్టినా ఇంకా హాస్యస్ఫోరకంగా ఉండేదేమో! తుకారామ్ అనే కథానాయకుడి పేరు కోస్తాలోనూ, రాయలసీమలోనూ వాడుకలో ఉన్నట్లు కనపడదు. కాని తెలంగాణంలో బాగా పరిచయంగానే కనపడు తుంది. మరాటీ భాషా సంస్కృతులు, పాండురంగడి ప్రభావమూ ఆంధ్రదేశంలోని ఇతర ప్రాంతాలకన్నా తెలంగాణంలో ఎక్కువ. అదీగాక ఈ కథలో వ్యంగ్యమంతా ఆ పేరును ఆశ్రయించుకొని ఉన్నదే కాబట్టి రాఘవ రంగారావుగారి హాస్య ప్రవృత్తికది బాగా తోడ్పడింది. ఈనాటి అభిరుచులకు, సామాజిక సంబంధాలకు అనుగుణం కొంత సంక్షిప్తత ఈ కథలో అవసరమైంది.

# 24. రాజా

– తాతా కృష్ణమూర్తి

కరీమ్ సాయిబుగారి మేడలో బసచేశారు, సర్కస్ మెంబర్లు. ఇంచుమించు పాతికమంది. చుట్టూ పడిపోతూ ఉన్న కురుచైన ప్రహరీగోడ, విశాలమైన పదునులేని పచ్చిక తిన్నెలు, ఎత్తుగా పెరిగిన చెట్లు,సంరక్షణ లేక కృశిస్తూ వున్న పువ్వులమొక్కలు అన్నీ ఆ యింటి ప్రాకారానికొకవిధమైన శోభ కూర్చేవి. ఒకప్పుడు జనంతో క్రిక్కిరిసి, కళకళలాడుతూ ఉండే రమ్యమైన సౌధమిప్పుడు క్రమంగా పాడుపడి బూజుపట్టింది. అందులో కాపురముండే వాళ్ళెవరూ లేక, యేళ్లకొలదీ తలుపులు మూసేవుండేవి. పూనా సర్కస్ కంపెనీ వాళ్ళందులో ప్రవేశించగానే, మళ్ళీ కొత్త కళ వచ్చింది మేడకు. ఇంటినిండా కిటకిటలాడుతూ మనుషులు, సామానులు, మెరుపుదీపాలు, అలికిడి ఉండేసరికి మృతకళేబరానికి ప్రాణం వచ్చినట్లయింది ఆ ఇంటికి.

తమ బసకో పర్లాంగు దూరంలో ఉండే మైదానంమీద, ఆటకు పెద్ద డేరా వేసుకున్నారు సర్కస్‌వాళ్లు. సుమారు పదివేలమందికి సరిపోయినంత డేరా అది. దానిచుట్టూ కొన్ని చిన్న చిన్న డేరాలు కూడా వేసుకున్నారు. గుర్రాలు, ఏనుగులు, కోతులు, కుక్కలు, ఎలుగుగొడ్లు, కంగోరాలు, జీబ్రాలు, పులులు, సింహాలు– యింకా యేవేవో జంతువులు కొన్ని ఆ డేరాలకు దగ్గిరగాను, కొన్ని లోపల బోనులలోను, కొన్ని వెలుపలను ఉండేవి. ఈ మృగాలను, డేరాలను, చూడడానికి పురజనులు గుంపులు గుంపులుగా వచ్చిపోతూ ఉండేవారు. ఆ నాలుగు రోజులూ ఊరంతా మహా అలికిడిగా ఉండేది. ఏ గోడమీద చూసినా మంచి మంచి రంగుల బొమ్మలతో సర్కస్ వాళ్ల ప్రకటన పత్రికలే కానవచ్చేవి.

ఆట ప్రారంభించడానికింకా ఒకరోజు వ్యవధి ఉన్నదనగా కంపెనీ వాళ్ళ యేర్పాటులన్నీ పూర్తి అయినవి. అది శీతకాలం. డిసెంబరు నెల. వెన్నెల రాత్రులు. చలి మిక్కుటంగా ఉండేది. నాడు దీపాలు పెట్టే వేళప్పుడు సర్కస్ మెంబరు తారాబాయి మేడ దిగివచ్చి ఆవరణలో ఉన్న బాదం చెట్టుకింద నిల్చుంది. చంద్రుణ్ణి చూస్తూ ఆ

పదహారు పదిహేడేళ్ళ జవ్వని చలికి పొడుగైన ఉన్నికోటు తొడుగుకుంది. అందంగా దువ్వుకున్న జట్టులో గులాబీ పువ్వులు పెట్టుకుంది.

గాలికి చెదరి కళ్ళలో పడుతూ వున్న ముంగురులను సవరించుకుంటూ. రోడ్డు దీపాలను, దారిని నడచే జనులను, మోటారు కార్లను పరీక్షిస్తూ. యేదోఆలోచిస్తున్న దానివలె పరధ్యానంగా నిల్చుంది. దూరంగా ఎక్కడో గంటలు కొట్టిన చప్పుడు వినవస్తే చేతినున్న రేడియమ్ రిస్టువాచీ చూసుకుంది. ఏడుగంటలయిందప్పుడు. ఇంతట్లో ఎవరో తన భుజంమీద చెయ్యి వేసినట్లనిపించి త్రుళ్ళిపడి తిరిగి చూసిందామె.

'ఒక్కర్తవే ఏంచేస్తున్నావిక్కడ యీ చలిగాలిలో?" అంటూ చనువుగా చిరునవ్వుతో కుశలప్రశ్న చేశాడు జమన్సింగ్.

కళ్ళెత్తి అతడి వేపు చూసి, ముసిముసిగా నవ్వి ఊరుకుంది. అతడు ఆమె ఇద్దరూ సర్కస్ మెంబర్లే. ఇద్దరూ పొట్టకోసం కంపెనీలో చేరి నౌకరీకున్నవాళ్ళే.

తారాబాయి మంచి అందకత్తె. ఆమె నిజమైన కులం యెవరికీ తెలియదు. క్షత్రియకన్య అని చెప్పుకుంటారు. గుర్రపుస్వారి చేస్తుంది. కత్తి తిప్పుతుంది. విలువిద్యలో మంచి ప్రవీణురాలు. తీగె మీద నేర్పుగా బైసికిల్ తొక్కుతుంది. నాట్యంచేస్తూ చిత్రంగా మొగ్గలు వేస్తుంది. ప్రేక్షకులను రంజింపచేసే శక్తులు ఎన్నో ఉన్నాయి ఆమె వద్ద. ముఖ్యంగా ఆమె రూపం, యౌవనం, పురుషుల నాకర్షించి భ్రమింపజేస్తాయి. కేవలం ఆమెనే చూడడానికి సర్కస్‌కు వచ్చేవాళ్ళెందరో ఉంటారు. అట్టి మోహనాకార మామెది.

జమన్సింగ్ సుమారు 30 యేళ్ళవాడు. మంచి రూపవంతుడు. సర్కస్ విదూషకుడి వేషం వేసి, నవ్వుతాలతోను, వికార చేష్టలతోను, చూపరులను మెప్పిస్తాడు. జంతువైద్యం నేర్చిన డాక్టరు. కనుక అడవి మృగాలను చూసే పూచీ కూడా అతనిదే. వాటికి తిండి పెట్టినప్పుడాయన దగ్గిరుంటాడు. ఎప్పుడైనా అవి ఆరోగ్యంగా ఉండ నప్పుడు వాటికి మందులు మాకులు యిస్తాడు.

తారాబాయి అంటే సింగుకు ప్రాణం. ఆమె నెట్లాగైన వశపరచుకొని, తనదాన్ని చేసుకుందుకు యెన్నోవిధాల యత్నించేవాడు. కాని తార బలే పెంకిది. అతని హృదయారాటం తానర్థం చేసుకోనట్లు నటించేది. జమన్సింగ్‌వలె తనకోసం యెందరెన్ని విధాల తహతహలాడినా ఆమె కానందమే. వాళ్లను పిచ్చివాళ్లను చేసి, ఆడించి తనలో నవ్వుకునేది. పురుష స్నేహితులందరితోను చనువుగానే ప్రవర్తించేది. మగవాడంటే

భయం, బిడియం లేవామెకు. తానొక స్త్రీ అన్న సంగతి మరచిపోయినట్లు నడుచుకునేది వాళ్లతో. పురుషులతో స్నేహం, అగ్నితో చెలగాటమన్న సంగతి ఆమెకింకా విశదం కాలేదు.

తారాబాయిని వెన్నెలలో ఒంటరిగా చూసేసరికి జమన్సింగుకు వొళ్లు పులకరించింది. వెర్రి వెర్రి కోర్కెలతో హృదయం గెంతులాడింది. పట్టరాని మోహో ద్రేకంతో కౌగలించుకొని చెట్లనీడ నామెను ముద్దు పెట్టుకున్నాడు.

"సింగ్, నీకేం మతిపోయిందా?..వొదులు" అంటూ సిగ్గుతో పెనుగులాడింది తార.

కాని, ఆనందంతో కులుకుతూ గుండె కామెను మరింత గట్టిగా అదుము కున్నాడు సింగ్. తారకు కోపం వచ్చింది. శక్తికొలదీ పెనగులాడ ప్రారంభించింది. కొప్పులో ఉన్న పువ్వులు నలిగి, క్రింద రాలాయి. ఒళ్ళు వేడెక్కి మొహం ఎర్రబడింది. తల తిరిగి కళ్లు చీకట్లు కమ్ముతున్నట్లు తోచిందామెకు. బుగ్గలు, పెదవులు, కళ్ళు, వక్షం – అన్నీ ముద్దులాడుతున్నాడు సింగు. బలాత్కారంగా పులిపిల్లవలె రక్కడం ప్రారంభించింది తార. రోడ్డుమీద దూరంగా యెవరో నవ్వుతున్నట్లు చప్పుడు విన వచ్చింది. మేడలో దీపాలు కూడా ఆమె అవస్థను చూసి, నవ్వుకుంటున్నట్లే తోచింది తారకు. చెట్లు, చంద్రుడు, పిట్టలు లోకంయావత్తూ తన్నుచూసి నవ్వుతున్నట్లనిపించిం దామెకు. ఉదాసీనంతో ముఖం దించుకుంది. పోట్లాటమాని, బలహీనంగా ప్రాణం లేని బొమ్మవలె వొరిగింది. అతని చేతులలో దిగులు, ఆశ్చర్యం జనించాయి సింగుకు పశ్చాత్తాపం కలిగి, కౌగిలివదలి, బిక్కచచ్చి నిల్చున్నాడు. తల పైకెత్తి ఒక్కక్షణం తీక్షణంగా అతనివేపు చూసిందామె. యేమీ అనకుండా. చేతిరుమాలుతో పెదవులు, బుగ్గలు, తుడుచుకుంటూ. గిర్రున తిరిగి మేడవేపు వెళ్లిపోయింది.

ఇదివరలో తారాబాయి యెన్నడూ ఇట్టి అవమానం పొంది ఉండలేదు. తుదకు కంపెనీ మానేజరు సూర్యాభాన్ కూడా ఆమె నీవిధంగా హింసించి యెరుగడు. అతగాడంటే తారాబాయికి కొంచెం యిష్టం కూడా. తక్కినవాళ్ళ నెన్ని వేళాకోళాలు చేసినా సూర్యభానును మాత్రం గౌరవంతో చూసేది. అతని ప్రేమనెన్నడూ తిరస్కరించేది కాదు సిగ్గుతో. కౌగిలించుకొని ముద్దులాడుకునే వారిద్దరూ కాని....

సూర్యభాన్ చాలా చిన్నవాడు. తారాబాయికంటే రెండు మూడేళ్ళు పెద్దవాడేమో. మీసం కూడా బాగా నల్లబడలేదు. తండ్రి గతించిన వెనక సర్కస్ వ్యవహారాలన్నీ తనే

చూసుకుంటున్నాడు. వొల్లమాలిన ధనం ఉంది అతనికి. అన్నివిధాలా స్వతంత్రుడే. తారాబాయిన పెళ్లాడి, సర్కస్ గొడవ వదలుకొని, హాయిగా ఆమెతో సుఖించాలని అతని ముచ్చట....కాని ధైర్యంగా ఆమెతో తన మనోభీష్టం చెప్పడానికి సిగ్గు.

సూర్యాభాన్ అంటే యిష్టమే కాని, బాదల్బంద్‌ను చూస్తే తారాబాయికి మతి పోయేది. అతన్ని తల్చుకున్నంతమాత్రాన హృదయం ఆనందంతో సందడించేది. అర్థం కాని కోర్కెలతో మనసు కలవరపడేది. నిజమైన ప్రేమంటే, ఆమెకిదివరలో అంతగా అనుభవానికి రాలేదు. కాని, యిప్పుడిప్పుడు చాలా సంగతులు బోధపడుతున్నాయి. ఏదో స్పష్టంగా తెలియని బాధతో మనసు అప్పుడప్పుడు కలత పడడం, ఏవో పిచ్చిపిచ్చి వాంఛలతో గుండె బరువెక్కడం, నిద్రలో తియ్య తియ్యని కలలు వచ్చి తృప్తి తీరకముందే మెలకువ రావడం, తిండి తిన్నగా హితవు కాకపోవడం మొదలయిన అవలక్షణాల వలన తనలో జనించిన రుగ్మతను గుర్తుచేసుకుందామె. బాదల్బంద్‌ను మనసారా వలచి, ప్రేమతత్వం అర్థం చేసుకుంది కొంతవరకు.

బాదల్బంద్ పహిల్వాన్. ఆ సర్కసుకు ఆయువుపట్టు వంటివాడు. రూపంలో మన్మధుడు కాకపోయినా. కంపెనీకి పేరు ప్రతిష్టలు సంపాదించిన వాళ్లలో అతడు ముఖ్యుడు. నల్లగా ఉన్నా, మెలి తిరిగిన కండలతో అతని శరీరం మెరిసేది బలంతో పెద్ద కళ్ళు, కరుడైన మీసం గంభీరంగా ఉందేదతని ముఖం. మనిషి చిన్నవాడే. పాతికేళ్ళుంటాయి. మోటైన గొలుసులుతెంచడం, ఛాతీమీద పెద్దపెద్ద బరువైనరాళ్ళు పెట్టించుకుని సుత్తులతో పగలగొట్టించడం మొదలైన పనులు గాక, అడవి మృగాలతో వింత వింత వినోదాలు చేసేవాడు. పెద్ద ఇనపగజాల బోనులో పులులు, సింహాలు, ఆవులు, మేకలు, కోతులు అన్నిటినీ ఒకచోట చేర్చి వాటిచేత అద్భుతమైన పనులు చేయించేవాడు. ఒకే పళ్లెంలో అన్నిటికీ పలహారాలు పెట్టి తినిపించేవాడు. సింహంచేత తుపాకి పేలిపించేవాడు. పెద్ద పులులను దుమికించేవాడు. మండుతూ ఉన్న చక్రాలలో నుండి సాధారణంగా ప్రతీ సర్కస్‌వాళ్లూ చూపించే చిల్లరవినోదాలు గాక పెద్దపులుల తోను, సింహాలతోను, కొన్ని కొన్ని భయంకరమైన ఫీట్లు చేసి చూపించే వాడతడు. బోను గీను యేమీ లేకుండానే 'రాజా' అనే పెద్దపులిని బయటికి తెచ్చి గుర్రం మీదవలె దానిమీద స్వారీ చేసేవాడు రంగ స్థలంలో! ప్రేక్షకులు భయంతో ఊపిరి బిగపట్టుకొని చూసేవారాచిత్రాన్ని. మనిషితోవలె పులితో కుస్తీపట్టి, దానితో కిందా మీదా పడి దొర్లేవాడు. అమాంతంగా దాన్ని భుజంమీద యెత్తుకొని మోసేవాడు. నిర్భయంగా పులి నోట్లో తలదూర్చి తీసేవాడు. చూసేవాళ్లకు కంపం పుట్టించేది ఆ దృశ్యం.

ఎన్నోసార్లు తారాబాయి అతన్ని బతిమాలుకుంది. ఆ ఫీటు మానవలసిందని. "పిరికిదానా" అంటూ ఆమె నెగతాళి చేసి, నవ్వి ఊరుకునేవాడు బాదల్బంద్.

తారాబాయి జమన్సింగ్‌తో కలహించి ముఖం ముడుచుకొని మేడ మీదికి వెళుతున్నప్పుడు, బాదల్బందామెకు యెదురుగా వస్తున్నాడు. మెరుపు దీపం వెలుగులో ఆమె ముఖవైఖరి కనిపెట్టి త్రుళ్ళిపడ్డాడతడు. పలకరిస్తే బదులు చెప్పకుండా ఆమె తనగదిలోకి వెళ్ళిపోయి తలుపులు మూసుకుంది. కాని లోనుండి గడియవేసుకునే లోపున, బాదల్బంద్ చప్పున లోపలికి వచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

అతడెన్ని విధాల ప్రార్థించి, అడిగినా ఆమె మొదట యేమి చెప్పలేదు కాని, క్రమంగా ఉన్నదున్నట్లుగా జమన్సింగ్ ప్రవర్తనను తెలియజేసింది. శిరము ముద్దాడి గుండెమీద కామెను వాల్చుకొని ఓదార్చాడు బాదల్బంద్.. సహజంగా సింగుమీద అతనికి పట్టరాని కోపం వచ్చింది.

మరికొంతసేపటికి కొరడా పట్టుకొని సింగు కోసం వెతుక్కుంటూ బయలు దేరాడు. సింగును చూసేసరికి వెర్రికోపంతో వొళ్లు మరచిపోయాడు బాదల్బంద్. కొరడాతో అతడిని కుక్కను కొట్టినట్లు చావగొట్టి కసి తీర్చుకున్నాడు.

"ఈ మాటు దానివేపు కన్నెత్తి చూశావంటే పీక నులిమి చంపేస్తాను నిన్ను. జాగ్రత్త" అని పళ్ళు కొరుకుతూ, తాటించాడు కూడా.

బాదల్బందు నెదిరించడం మదపు టేనుగుతో పోట్లాడడమన్నమాట ఆ సంగతి తెలిసే ఊరుకున్నాడు జమన్సింగ్. కాని దెబ్బలు తిని పగ తీర్చుకోకుండా ఊరుకునే నైజం కాదతనిది. మనసులో రగిలేమంటను మనసులోనే అణచుకొని తరుణం కొఱకు నిరీక్షిస్తూ మిన్నకున్నాడప్పటి మట్టుకు. పగ సాధించుకునేందుకు మార్గాలాలోచిస్తూ, రాత్రల్లా నిద్రపోక తన గదిలో యిటూఅటూ పచారు చేశాడు. గ్లాసుమీద గ్లాసు బ్రాందీ తాగేడు. తారాబాయి మీద అతనికి గల మోహమంతా ద్వేషంగా పరిణమించింది. బాదల్బంద్ మీద కసితీర్చుకునేందుకు సరియైన ఉపాయమేది తోచక, మెదడు వేడెక్కి, పిచ్చెత్తినట్లయిందతనికి. తీవ్రంగా ఆలోచిస్తూ తల నొక్కుకున్నాడు. చేతులతో కళ్ళు మంట. నరాలు పీకు. గుండెలో భారం కొరడాదెబ్బలకు వొళ్ళంతా నొప్పి సారా మత్తుకు కడుపులో యేదో వికారం. కోపం, మోహం, తాపం, అవమానం. అన్నీ కలిపి అతని హృదయాన్ని నలిపి, పీడించి దహించి పిప్పిచేశాయి.

ఆ మర్నాడే సర్కస్ ప్రారంభమవుతుందన్న సంగతి జ్ఞాపకం వచ్చింది సింగుకు. యే ఊళ్ళోనూ నాలుగాటలకన్న అధికం చెయ్యడం, ఆ కంపెనీ వాళ్ళకు మామూలు లేదు. "ఈ ఊరునుండి కదిలే లోపునే వీడి పని పట్టించితీరాలి" అని మనో నిశ్చయం చేసుకున్నాడు సింగు.

మొదటి రాత్రితో సర్కస్‌వాళ్ళ కీర్తి ఊరంతా వ్యాపించింది. వాళ్ళ ప్రదర్శన చూడతగినదని అందరికీ విశదమైంది. ఎవరినోట విన్నా. తారాబాయి పేరు, బాదల్బంద్ పేరు వినవచ్చేవి. ఈర్ష్యతోను, ద్వేషంతోను, వొళ్ళు మండుకొచ్చింది జమన్సింగుకు. కాని వాళ్ళనణిచే సాధనం కానరాలేదు. నిద్రాహారాలు కూడా తిన్నగా లేక, జమన్సింగు కెప్పుడూ ఒకటే ఆలోచన, బాదల్బంద్ మీద కసి తీర్చుకోవడమెట్లానా అని. జమన్సింగును తాను గట్టిగా శిక్షించిన సంగతి బాదల్బంద్ నవ్వుతూ తారాబాయితో చెప్పినపుడు సంతోషం వెలిబుచ్చడానికి బదులుగా నిట్టూర్పు విడిచిందామె.

"ఛా. మనిషంత మనిషిని అమాంతంగా మీదపడి కొట్టడం తప్పు కాదూ! ఇట్లా తొందర పడతానని తెలిస్తే, అసలు నీతో యేమి చెప్పకనే పోదును"

"నిన్నట్లా అవమాన పరచినందుకు వాడిని నిలువునా చీల్చెయ్యాలనిపించింది నాకు. ఇంకా పస్తాయించి ఊరుకున్నా నంతటితో. సంతోషించు" అన్నాడు బాదల్బంద్

"సింగు చాలా కార్పణ్యం గల మనిషి. నీచేత దెబ్బలు తిని, ఊరుకుంటా డనుకోకు. పాముపగ వాడిది" అన్నదామె.

"ఏడిశాడు" అంటూ బాదల్బంద్ విరసంగా నవ్వి "తారా, నువ్వవట్టి పిరికిపిల్లవు సుమా"" అంటూ ప్రేమతో ఆమె నెత్తుకొని, వక్షాన్ని కదుముకొంటూ, ముద్దులతో నోరు మూశాడు.

"బలం ఉన్నదని మోటసరసం కూడదు. నొప్పి కాదూ. అట్లా నొక్కేస్తే"

✿ ✿ ✿

రెండోనాటి ప్రదర్శనానికి సర్కస్ డేరా తొమ్మిదిగంటలసరికే నిండిపోయింది. టిక్కెట్లు దొరకక. కొందరు ఆశాభంగులై యిళ్ళకు మరలవలసివచ్చింది.

తీగెమీద తారాబాయి తన చాకచక్యాలన్నీ చూపి, ప్రేక్షకులకు మెప్పించి, రెండు బంగారు పతకాలు సంపాదించింది. చప్పట్లతో డేరా ఊగిపోయింది. సభాసదుల సన్మానం పొంది, ఆమె లోనికి వెళ్ళిపోయిన పిమ్మట, మానేజరు సూర్యాభాన్ ఆమెను

సమీపించి, షేక్‌హాండ్ చేసి, తన సంతోషం వెల్లడి చేస్తూ హెచ్చుగా పొగడి పొంగవేశాడు.

పిదప, ఆమెను తోడ్కొని తన గుడారంలోకి తీసుకొనిపోయి, ఫలహారాలు మేపి, ఒక గ్లాసు ఛాంపెనీ త్రాగించాడు. ఆనందంతో కులుకుతూ తారాబాయి తన క్రీగంటి చూపులతోను, ముసిముసి నవ్వులతోను కృతజ్ఞతను చూపించింది. అతని దయకు ఆమె మోహన రూపానికి పరవశుడై అట్టే ఆమెముఖం వేపు చూస్తూ మీద చెయ్యివేసి కూచున్నాడు సూర్యాభాన్.

"తారా, ఈవాళ నీ ప్రదర్శనం, నీ చక్కదనం అద్భుతంగా ఉన్నాయి"

ఇద్దరూ లేత్రాయమువారు. రూపవంతులు, ప్రియులు. సర్కస్ గొడవ మరిచి పోయి ప్రియాలాపాలలో పడ్డారు. నవ్వులు, ముద్దులు, కౌగిలింతలు, నిట్టూర్పులు ఒకరి కౌగిట్లో ఒకరు వొళ్ళుమరచి కళ్ళు మూసుకున్నారు.

బాదల్పంద్ ఆ డేరాకు సమీపంగా యెక్కడికో వెళుతూ...అప్రయత్నంగా లోనికి తొంగి చూశాడు మానేజరు. కంఠాన్ని కౌగలించుకొని, ప్రేమతో అతనికి ముద్దులిస్తూ ఉంది తార.

కోపంతోను, జెలసీతోను హృదయం మండిపోయింది బాదల్పందుకు. తననెంతో ప్రేమిస్తూఉన్నట్లు చెప్పిన తార యీవిధంగా ద్రోహంచేస్తుందని అతడెన్నడూ అనుకోలేదు కలలోనైనా. అతనికేమీ అర్థం కాలేదామె ప్రవర్తన.

"వాడావిధంగా మీద చెయ్యివేస్తే ఎట్లా సహించుకుంటూ ఉంది తార. ఒళ్ళు కాలినట్లనిపించదూ? లేక....'

అధికం ఊహించుకుందుకు కూడా యిష్టపడలేదు, అతని మనసు!

జమన్సింగును కొట్టినట్లు కాదు! సూర్యభానునెట్ల యెదిరించడం? కొండతో ఢీకొని పోట్లాడితే గొఱ్ఱెపోతుకే ముప్పు. తలపగిలి చస్తుంది. ఏం చెయ్యడానికీ పాలుపోలేదు బాదల్పంద్‌కు. దుర్భరమైన యీర్ష్యతో బాధపడ్డాడు. తారాబాయి నసక, సూర్యాభాను ననవలసిన పనియేముంది? కాని ఆమెమీద బాదల్పందుకు గల అధికారమేమిటి? అన్నిటికి స్వతంత్రురాలామె. కాని...

తల గిర్రున తిరుగుతూ వుంది. నిద్రలో నడిచేవాడివలె తూలిపోతూ అక్కడి నుండి వెళ్లిపోయాడు బాదల్పంద్.

నాడు సర్కస్‌లో తాను చేయవలసిన పనులలో యేమీ ఉత్సాహం లేకుండె నతనికి. ఏదో విధిలేక, మొక్కు తీర్చుకున్నట్లు నెరవేర్చాడు, కొన్ని ఫీట్లను. అడవి జంతువులచేత వినోదాలు చేయించినప్పుడు, అతనికత్యంత ప్రియమైన రాజా అన్న పులి అల్లరి ప్రారంభించింది. చెప్పినమాట వినకుండా బద్దకించి మూలిగేది. యజమానిని సమీపించడానికి, ఉత్సాహం వెలిబుచ్చడానికి బదులు, గుర్రుపెట్టి దూర దూరంగా జరిగేది. వెర్రికోపం వచ్చింది బాదల్పందుకు. లోకమంతా అతన్ని హఠాత్తుగా ద్వేషించి, హింసించి, పరాభవించడాని కుద్యమించినట్లు తోచిందతనికి. మనసిచ్చి ప్రేమించిన తారాబాయి తుదకు మోసం చేసి, అతని ప్రేమను అవమాన పరచింది. ఇప్పుడీ పులి కూడా అతని స్నేహాన్ని అగౌరవిస్తూ వుంది. ఇన్నివేలమంది చూస్తూవుండగా అతని ఖ్యాతికి భంగం తెస్తూ, అసందర్భంగా ప్రవర్తిస్తూవుంది 'రాజా'. అవమానం సహించుకోలేకపోయాడతడు. తాగినవాడివలె వొళ్ళు మరచిపోయి, కొరడా తీసుకొని పులిని కొట్టడం ప్రారంభించాడు. ప్రేక్షకులకు భీతి పుట్టింది. కాండ్రు కాండ్రు మని పులి అరుస్తూ ఉన్నప్పుడల్లా భూమి వణుకుతున్నట్లనిపించేది. కొరడా చప్పుడుతో డేరా మారుమ్రోగింది. ఎన్ని దెబ్బలు తిన్నా, పులి తన మూర్ఖతను వదలలేదు. కోరలు చూపి, కస్సుమని యెదురు తిరిగింది.

'రాజా' సామాన్యమైన పులికాదు. తెలివితేటలు, చురుకుదనం, హృదయం గల అపూర్వమైన జంతువు. బాదల్పందునెంతో ప్రేమిస్తూ మిక్కిలి అణకువతోను, మర్యాదతోను మెసలేది. అతని వద్ద. నాడు మామూలుకు వ్యతిరేకంగా ప్రవర్తించడానికి, తగిన హేతువేదో ఉండవచ్చునని గ్రహించలేకపోయాడు బాదల్పంద్. సాధారణంగా సర్కస్ వాళ్ళు సింహాలకు అప్పుడప్పుడు నల్లమందు తినిపిస్తూ ఉంటారు. మత్తు చేత వాటి ఘాతుక స్వభావం కొంతసేపైనా అణగి ఉంటుందని అభిప్రాయం కాబోలు. 'రాజా' శరీరతత్వం యెట్టిదో కాని, నల్లమందు వాసనే పడేదికాదు దానికి. బలవంతం మీద యెప్పుడైనా తినవలసివస్తే ఆరోజల్లా పిచ్చెత్తినట్లు ప్రవర్తించేది. జమన్సింగుకు దాని ప్రకృతి తెలుసు. నల్లమందు మాత్రం యెన్నడూ దానికి పెట్టనిచ్చేవాడు కాడు. కాని, ఆ రోజున ఉద్దేశపూర్వకంగా మాసంలో నల్లమందు తనే స్వయంగా కలిసి 'రాజా'కు పెట్టించాడు. కడుపులో వికారం పుట్టి, వమనం చేసుకుందుకు యత్నించింది పులి. జమన్సింత్ నీళ్లలో యేదో మందు కలిపి మళ్ళీ తాగించాడు పులిచేత. 'రాజా'కు ఒంట్లో సరిగాలేదన్న సంగతి మానేజరుకు కూడా చెప్పలేదాయన.

రంగస్థలంలోకి వచ్చి మనుషులను, దీపాలను చూసేసరికి, 'రాజా'కు గిర్రున తల తిరుగుతూ ఉండెను. మత్తుగా బద్ధకంగా, ఉండెను. ఒంట్లో 'ఈవాళ నాకు సరిగా లేదు. నన్ను బాధపెట్టకు' అని దీనంగా వేడుకొని గుర్రుతో తెలియజేసింది యజమానికి. కాని బాదల్బంద్ దాని ప్రార్థన నర్థం చేసుకునే స్థితిలో లేకుండె.

ఎన్నడూ శిక్ష యెరగని జంతువుకు వీపుమీద దెబ్బలు పడగానే, కష్టం తోచింది. పౌరుషం కలిగి 'రాజా' యెదురు తిరిగింది. అమాంతంగా మనిషిని చీల్చేస్తుందా అన్నంత ఆగ్రహం చూపింది కళ్ళలోను, కోరలలోను ప్రేక్షకులు భయపడి గొల్లుమన్నారు. మానేజరు ముందుకు వచ్చి ఫరవాలేదని వాళ్ళకు ధైర్యం చెప్పి అల్లరి, కేకలు కూడదని మందలించాడు.

బాదల్బంద్‌ను, పులిని, భయదృష్టులతో చూస్తూ దగ్గిరగానే నిల్చుంది తారాబాయి. అతనికపాయం రాకుండా కాపాడమని దేవుణ్ణి వెయ్యివిధాల మొక్కుకుంది మనసులో. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే పులిని చంపడానికి పక్కనే ఇద్దరు భటులు నిల్చున్నారు. తుపాకులు పట్టుకొని రౌద్రాకారంతో పంజా తెరచి, వ్యాఘ్రం తన్నెదిరించడానికి వచ్చినప్పుడు బాదల్బంద్‌కు గుండెలో దడ పుట్టింది. అప్రయత్నంగా చేతిలోవున్న కొరడా కిందికి జారిపోయింది. 'రాజా' అని బిగ్గరగా అరచి, నిస్సహాయుడై నిల్చున్నాడు చావుకు సిద్ధపడి.

అతని కేకతో మెలకువవచ్చింది పులికి. రౌద్రం అణగి పశ్చాత్తాపంతో నిల్చుంది. అతని పాదాలు మూచూస్తూ! ధైర్యంగా మెడమీదతట్టి వీపునిమిరి 'రాజా'ను బుజ్జగించా డప్పుడు బాదల్బంద్. అతని కరస్పర్శవలన మంత్రింపబడినట్లు పిల్లివలె లొంగిపోయింది పులి. అద్భుతమైన ఫీట్లు చేయించాడప్పుడు దానిచేత. ఊపిరి బిగపట్టుకొని చూస్తూ ప్రాణాలు లేని ప్రతిమలవలె కూచున్నారు ప్రేక్షకలు. కిక్కురు మన్న ధ్వని కూడా లేక డేరా అంతా నిశ్శబ్దం.

పన్నెండు గంటలు కావచ్చింది. ఇంకో ఐదు నిమిషాలలో ఆట ముగుస్తుంది. 'రాజా' చేత ఆఖరు ఫీటు చేయించడానికి కుద్యమించాడు బాదల్బంద్. కాని పులి అయిష్టతను సూచించింది.

అలసి, రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు బాదల్బందు. ఆ క్షణంలో యెదురుగా నిల్చున్న తారాబాయిని చూశాడు. ఆమె దృష్టి అంతా తనమీదనే ఉన్నట్లు విశదమైందతనికి. అభ్రమర నేత్రాలనుండి వెలువడిన ప్రేమ కిరణాలతని హృదయాన్ని

దూసుకుపోయి, మనసును కలవర పెట్టినవి. దీర్ఘమైన నిట్టూర్పు విడచి, ఆమె నుండి దృష్టి మరల్చుకున్నాడు.

పులిని కొంతసేపు బుజ్జగించి, నోరు తెరవమని ప్రోత్సహించాడు. దవడలు బిగపట్టి మూర్ఖంగా నిల్చుంది రాజా. తల పైకెత్తి జిగజిగలాడే పచ్చని మెరుపు కళ్లతో అట్టే చూసిందతనివేపు దీనంగా...“వొద్దు..నన్ను బలవంతపెట్టకు. నా తల తిరుగుతూ ఉంది. తెలివి తప్పి. యేమక్రమం చేస్తానో అని దిగులుగా ఉంది. నన్ను క్షమించి, నేటికి విడిచిపెట్టు’ అన్న భావం వెలిబుచ్చింది, ఆ చూపులో బాదల్బంద్ మన్నించలేదు దాని ప్రార్ధనను దవడమీద చరిచి, నోరు తెరవమని ఆజ్ఞాపించాడు.

విద్యుద్దీపాల కాంతిలో తళతళ మెరిశాయి కోరలు. మృత్యుద్వారం వలె తెరువ బడిన పులి నోట్లో చప్పున తల దూర్చాడు బాదల్బంద్. పెట్టె కప్పు మూతపడినట్లు దవడలు మూసుకుపోయాయి ‘రాజా’కి. వెచ్చని రక్తంతో నోరు తడిసింది దానికి. అదిరిపడి కళ్ళు విప్పి నోరు తెరచింది కంఠం కత్తిరించుకుపోయింది బాదల్బంద్‌కు. స్మృతిలేక కిందపడ్డాడు. జరిగిన ప్రమాదమప్పుడు విశదమైంది పులికి. దుఃఖంతో అతని ముఖం చూస్తూ కన్నీరు విడిచింది రాజా. రెండు సారులు తుపాకి మ్రోత మారు మోగింది డేరాలో. ఒక్కసారి మూలిగి, గుండె నుండి వరదలుగా రక్తం కార్చుకుంటూ వెంటనే నేలకొరిగింది పులి. గొల్లుమన్నారందరూ.

బాదల్బందును రంగ స్థలమునుండి లోనికి తీసుకుపోయినారు. పెద్ద పెద్ద డాక్టర్లు వచ్చి తమ శక్తి సామర్థ్యాలన్నీ వినియోగించారు కాని లాభం లేకపోయింది.

నెత్తీ నోరూ కొట్టుకొని, అతని మృత కళేబరంమీద పడి యేడ్చింది తారాబాయి. సర్కస్ మెంబర్లందరూ కంటతడి పెట్టుకున్నారు. మానేజరు సూర్యాభాన్ తారాబాయిని మెల్లగా లేవనెత్తి పడిపోకుండా ఆమెను తన వక్షంమీదికి వాల్చుకొని, శిరం నిమురుతూ, జేబురుమాలుతో కన్నీళ్ళొత్తి ఓదార్చాడు.

### కథా నేపథ్యం ...

స్వాతంత్ర్యం రాక పూర్వం మూడు దశాబ్దాలు తాతా కృష్ణమూర్తి గారి పేరు సాహిత్యలోకంలో చిరపరిచితమే. ఆ మూడు దశాబ్దాలు ఆయనను గొప్ప కథా రచయితగా సాహిత్యపరులు చెప్పుకున్నారు. ఆయన స్వాతంత్ర్యం రాక పూర్వమే కీర్తి శేషులైనారు (1945). ఆధునిక సాహిత్యానికి బంగారు దశాబ్దమైన పందొమ్మిదో శతాబ్ది చివరి దశాబ్దంలోనే జన్మించారాయన (1897). రాయప్రోలు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, అబ్బూరి, నాయని, అడవి,రాళ్ళపల్లి ఇలా చాలా పేర్లు గుర్తువస్తాయి. ఆ దశాబ్దంలో జన్మించిన వాళ్ళవి. తాతాకృష్ణమూర్తి గారు కూడా ఆ బంగారు దశాబ్దంలోనే పుట్టడం విశేషం. అంతేకాదు కథా రచయితలలో ఆయన లాగా ఇంగ్లీషు సాహిత్యాన్ని మథించినవారు అప్పటికీ ఇప్పటికీ మరొకరు లేరు. తరుణ వయస్కుడై కథారచన ప్రారంభించేనాటికి అత్యంతాధునికమైన ఇంగ్లీషు సాహిత్య పత్రికలను ఆయన ఇంగ్లండు నుంచి తెప్పించుకునేవారు. వీరి స్వస్థలం బరంపురం. ఆధునిక తెలుగు సాహిత్యానికి వేగుచుక్క. బరంపురంలోనే పుట్టింది. వేగుచుక్క గ్రంథము అక్కడే ప్రభవించింది. తాపీ ధర్మారావుగారి లాంటి సాహిత్య భావుకులు వేగుచుక్క ప్రచురణల ద్వారా ప్రభావితమైనారు. తెలుగు వాళ్ళకు అపరాధ పరిశోధక సాహిత్యాన్ని తొలుత పరిచయం చేసింది బరంపురమే. శ్రీశ్రీ కూడా ఈ అపరాధ పరిశోధక (పత్తేదారు సాహిత్యం) నవలల వల్లా, కథలవల్లా సమ్మోహితుడై ఆ బాపతు రచనలు చేసినవాడే. 1915 ప్రాంతాలకే బరంపురం నుంచి వేగుచుక్క కథావళి అనే పత్రిక వెలువడుతుండేది. ఇందులో శ్రీ తాతా కృష్ణమూర్తిగారు అపరాధ పరిశోధక సాహిత్యం దిగుమతి చేశారు. దిగుమతి అనడం ఎందుకంటే అవి సుప్రసిద్ధ ఇంగ్లీషు అపరాధ పరిశోధక రచయితల నుంచి అనువాదాలు కాబట్టి. ఈ పత్రిక పట్టుమని పదేళ్ళు కూడా రాలేదు. తాతా కృష్ణమూర్తిగారు విజయనగరం కళాశాలలోచదువుకున్నారు. భద్రాచలంలో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగానూ, ప్రధానోపాధ్యాయులుగానూ రెండున్నర దశాబ్దాలు పనిచేశారు. ఆయన చాలా స్ఫురద్రూపి. సూటు వేసుకుంటే యూరోపియన్‌లు కూడా ఆయన దర్జాను తేరిపార చూసేవారు. వాళ్ళు మెచ్చుకునే ఇంగ్లీషు మాట్లాడేవారాయన. పెద్ద పెద్ద ఇంగ్లీషు అధికారులు కూడా ఆయనతో మాట్లాడడానికి ముచ్చట పడేవారు. ఆయన చేసిన ఉద్యోగం బడిపంతులే అయినా ఆయన ప్రతిభకు గవర్నర్ దగ్గర నుండి అటవీశాఖ అత్యున్నతాధికారి, జలవనరుల పెద్ద పెద్ద ఇంజినీర్లు ఆయనను

గౌరవించేవారు. తాతాకృష్ణమూర్తి కథలు చాలా మౌలిక ప్రతిభతో ఉండేవి. సున్నితమైన హాస్యం, కరుణ, మాటకారితనం, వేగవంతమైన శైలి, సజీవపాత్ర చిత్రణకు కృష్ణమూర్తి గారి కథలు ఉదాహరణలు. మునిమాణిక్యం నరసింహారావు, చలంగారిలా రాయాలను కుంటేనూ, చలం, మునిమాణిక్యంలా రాస్తేనూ తెలుగుకథ ఎంతనేవళంగా, హృదయో ద్వేగభరితంగా ఉంటుందో అలా ఉంటుంది తాతా వారి రచన. తొలితరం, మలితరం, తెలుగు కథా రచయితలలో వైవిధ్యభరితమైన ఇతివృత్తాలతో తాతా కృష్ణమూర్తిగారి లాగా కథలు రాసినవాళ్ళను చూపలేము. సర్కస్ ప్రదర్శనను, ఆ ప్రదర్శనలను నిర్వహించే వృత్తినిపుణులను, వాళ్ళ బహిరంతర ప్రవృత్తులను, ఉద్వేగాలను మానవ జీవన రాగాలను, పగలను, పట్టుదలలను ఇతివృత్తంగా రూపొందించిన మొట్టమొదటి తెలుగు కథ తాతాకృష్ణమూర్తిగారే రాశారనుకోవాలి. సర్కస్ ప్రదర్శన వృత్తి నిపుణులను గూర్చి పది కూడా వచ్చాయో లేదో. తాతావారి ఈ కథలాంటి కథ మాత్రం ఇంకోటి లేదు. మునిమాణిక్యం వారి కాంతంలాగా లక్ష్మీ కథల పేరిట తాతావారు కొన్ని కథలు రాశారు. కాని, అవి పుస్తకరూపం పొందలేదు. యాభైఏళ్లు కూడా రాకుండానే కీర్తిశేషులైన తాతా కృష్ణమూర్తి తొలితరం, మలితరం ప్రతిభావంతులైన తెలుగు కథారచయితల ఇతివృత్త వైవిధ్యం శిల్ప పరిణతికి ఒక చూపుడువేలు. అంత చిన్న వయసులో (1897–1945) మరణించపోతే ఆధునిక తెలుగు సాహిత్యానికి తాతావారు మరెన్నో సింగారాలు కూర్చేవారు.

# 25. ఎదుగని బిడ్డ

– అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు

**సం**తానహీనులు కొందరు దారిద్ర్య పీడితులు కొందరు. రోగ బాధితులు కొందరు. క్షుధాహతులు కొందరు. ఎవరి మొరల నాలించగలము? అని తలంతురు. నిజమే గాని నా కథనమును పూర్తిగా వినవలసినది.ఆలకింపదగినవి కొన్ని గలవని మీరే అనుకొందురు. నేను బిగ్గరగా మాటలాడలేను. పెద్దదానను. ఈ కాలపుదానను గాను.

సుమారెనిమిది వందల యేండ్ల క్రిందటఁ గంటిని. అసత్యము కాదు. రాజరాజ నరేంద్రు నంతటివాడు బిడ్డ రూపురేఖలుఁజూచి నాలుక కొఱుకుకొనెను. ఎత్తుకొనెను. సొమ్ములు పెట్టెను, రుమాళ్ళు కప్పెను.

ఇతరుల స్తోత్రములకేమి? తెలిసి నుతించువారొకరు. తెలియక నుతించు వారొకరు. నన్ను నేనే పొగడుకొంటిని.

బిడ్డ రాజుల తూగుటుయ్యేలలో ఊగును. రాజుల బంగారు చేతులలోఁ బెరుగును. రాజుల రత్నాల మేడలలోఁదిరుగును అని సంతోషపడితిని. ఇది పూర్వజన్మ సుక్రుత ఫలమని అందురు గాని యే జన్మము దైననేమి? ఆ విచారణ అవసరమని నేననుకొనను. బిడ్డ యెప్పుడును అక్కడనే చంక దిగి యెఱుఁగదు. దాది వలెఁ బోయిచూచి వచ్చుచుంటిని. అయమ్మ చేతిలో, ఈయమ్మ చేతిలో బిడ్డ నలిగిపోవునని భయపడితిని. కడుపు తీపిగాని రాజులు బిడ్డను నలఁగనిత్తురా.

ఒక యేఁటికొక యేడు పైనబడినకొద్దీ, బిడ్డకు ఆకారము మారినది. దేశదేశాలా బిడ్డ పేరు మ్రోగినది. రాజులకేమి నిల్కడ? లేచినను బడినను ఎత్త గోడలే. ఈ రాజునుగొట్టి ఆరాజు, ఆరాజును గొట్టి యింకొకరాజు మహారాజు రాజరాజు ఏమని యెత్తుకొన్నాఁడో. ఏ రాజు వచ్చినను నా బిడ్డను జంకదింపలేదు.

రాజులు విడువఁగా మంత్రులు, మంత్రులు విడువఁగా రాజులు బిడ్డను కాలు క్రిందఁబెట్టనిచ్చినారనుకొన్నావా? ఏమి బిడ్డరా? ఏమి బిడ్డరా అని నెత్తినిఁ బెట్టుకొనని వారు లేరు.

సొమ్ములమీద సొమ్ములు, గుడ్డలమీద గుడ్డలు. శిరస్సు దగ్గఱనుండి చీలమండల దాఁకా దిగవేసినారు. బిడ్డ ముఖారవిందము అటువంటిది.

నాబిడ్డ కేండ్లన్నీ యేతీరున గడచినవో పూసగ్రుచ్చినట్లు చెప్పి విసిగింపను. ఏండ్లు పైనిఁ బడ్డవి. ఆకారము మాఱినది. కాని బిడ్డ యెదిగినట్లగపడదు. పెట్టిన సొమ్ములు, తొడిగిన గుడ్డలు బిడ్డను ముంచివేసినవి. అవి చూచియే అందఱూ భ్రమపడ్డారు. బిడ్డకు జక్కిలిగిలి పెట్టెడువాడు. బిడ్డను నవ్వించెడువారు, బిడ్డని వచ్చీ రాని మాటలు వినెడువారు, ఎవరి ముచ్చట వారు తీర్చుకొన్నారే గాని బిడ్డ యెదుగు చున్నదా లేదాయని విచారించిన వారు లేరు. ఏ రాజున్నాడు గనుక పది కాలాలపాటు, బిడ్డ పెరుగుడు కనిపెట్టుటకు? మంచి బిడ్డ. రాజుల మేడల కలవాటైన బిడ్డ. అని యేరాజు పట్టిననూ పంచ ప్రాణము విడిచెడువాఁడు.

ఏరాజు వచ్చినప్పు డారాజుకు బిడ్డ క్రొత్తదిగానే కనబడ్డది. ఈ బిడ్డ పుట్టిన దెప్పుడు? ఎన్నేండ్లు గడచినవి? పెరుగుడేవిధముగా ఉన్నది? అను విచారణ యేరాజునకుఁబట్టినది? రాచకార్యాలన్నీ విడిచిపెట్టి?

నేనూ నా బిడ్డా అంతవఱకదృష్టవంతులమే. బిడ్డను జూచి రోఁతపడుదురేమో అని యెంత భయపడ్డాను. వారి ధర్మాన గుడ్డల చాటున. సొమ్ముల చాటున ఉన్న మొగమంతా పరీక్ష పెట్టి చూడలేదు గాని.

నిజమెందుకు దాచిపెట్టవలె? బిడ్డ ముఖమునకు అందమే చెడినది. వికారపు రూపు పడ్డది. కళకళలాడుచు మల్లెపువ్వు వలె ఉన్న మొగము ముదురఁబాఱి పోయినది. నీవే చెప్పు. ఏండ్లేమో పైనిఁబడె. ముదిరినదన్న ముదరదూ? అన్ని యెదిగితేనే మొగము తగ్గట్లుండి యింపూ సొంపూ కాళ్ళు కట్టెలైనవి. పొట్ట లావైనది. బిడ్డను జూచుకొన్నపు డెల్ల నా కడుపుకుమ్మరావము వలెఁ గుమిలిపోవుచున్నది నాయనా ఏమనుకొన్నావో.

ఇంత అంబాడకపోయె, తప్పటడుగులువేయకపోయె. బిడ్డకు దయ్యమే పట్టినదో, భూతమే పట్టినదో, యెవరాదిక్కు? అని ప్రాణము ఎన్ని విధాలనో తపించినది. రాజుల చేతిబిడ్డ. తక్కువ లేదు అని అనుకోవచ్చును. గాని బిడ్డ యెదగడని రాజులకు

జెప్పితే వారి కేమిరోఁత పుట్టి బిడ్డను విడుతురో అని భయము. ఒక వడుగు చూచినను, ఒక పెండ్లి చూచినను, నా కడుపు తఱుగుకొని పోయెను. లేక యొక దుఃఖము, ఉండి యొక దుఃఖము బిడ్డను దెచ్చి దగ్గఱఁ బెట్టుకొందునా అని యుండును గాని రాజులతోఁగూడిన పనే అని త్రొక్కులాట రామచిలుకను బెంచినట్లు బిడ్డను బెంచు చున్నారు. మహారాజుల మందిరాలలో బంగారు గిన్నెలతో పాలుత్రాఁగిన బిడ్డను నేను దెచ్చుకొని మాత్రమేమి సుఖ పెట్టుదును నాయనా!

మొలలోతు దుఃఖములో మోకాలిలోతు సంతోషము పాలేకాదు; పండ్లేకాదు; అన్నమేకాదు, ఏవి పెట్టిననూ ఇంకా నోరు తెఱచి తినుట యున్నది. పన్నీటి స్నానాలు, కస్తూరి వాసనలు, పూలహారాలు, ఏమిచెప్పుదును ఆరాజులనందున నా బిడ్డకు జరిగిన వైభవము?

టంకాలకుప్పలు వరహాలరాసులు! బంగారుగంటలు బిడ్డముందుపోసెడువారు. రాజులు అందలాలెక్కితే అందలాలు, అమ్బారీలెక్కితే అమ్బారీలు. బిడ్డకు రాజభోగాలన్నీ సాగినవి. రాజే బిడ్డను భుజాలమీద పెట్టుకొన్నప్పుడు, అందలాలు అమ్బారీలు లెక్కా? ఎంత యదృష్టము! ఎంత యదృష్టము! ఎంత యదృష్టము అని అననివారులేరు. ఏంటిమీఁద ఏఁడు ఎన్నో యేండ్లు గడచినవి. ఒక యేఁడుగాకున్న ఒకయేఁటనైనా బిడ్డ యెదుగునేమోయని చూచితినిగాని యేనాఁటికిని ఎదగదు.

బిడ్డకు రోగమువచ్చినదని యేడ్చితిని. మొదటి నుండి నా యింటిలో ఉన్నను బాగుపడుననుకొంటిని. ఈ ముసలిది సోది చెప్పుచున్నదని తలఁపకుము. నాయనా! దినములొక తీరునజరుగవు. రాజులపోరు బలమాయెను. తురకరాజులు వచ్చినారు. ఈయడావుళ్ళలో బిడ్డనెక్కడ గొంతుకోయుదురోయని నా ప్రాణాలలో ప్రాణాలు లేవు. వారికేమి దయాదాక్షిణ్యాలు? అదీ యిదీ యెత్తి ధూ, యిదేమిబిడ్డరా! అన్నాఁడు ఒక తురక వాఁడు. తిన్నఁగా నా బిడ్డను నేను ఇంటికిఁ జేర్చుకొన్నాను. ఒక తురకరాజు వద్దని. ఒక తురక రాజు దగ్గరకు దీసి, ఈతీరుగా దినాలు గడచినవి. అందఱ నోళ్ళలో నానిన బిడ్డ గనుక సంస్థానాలకుఁ దీసికొనిపోయినను, ఒక కాపుకుఁ జూపినను, ఒక కరణమున జూపినను, పూర్వపువానిఁబట్టి బిడ్డకు ఇంత ఆదరణ చూపెడువారు. బిడ్డను ఇంటిలోనే పెంచుకొంటిని. బిడ్డ వ్రేలెడు కూడా పెరుగలేదు. మొగము పెంకైనది. బట్టతల పడ్డది. కాళ్లు చెడి పోయినవి. చేతులు మొద్దులైనవి. బిడ్డనుజూచిన కొద్దీ గుండె నీరైపోవునే కాని ధైర్యముకలుగదు.

నా బిడ్డ రోగము కనుఁగొన్న వారు లేరు. మఱుగుజ్జు బిడ్డా అని చూచితే కదలనేలేదు. మఱుగుజ్జుబిడ్డ సగముగాకున్న సగమైనా పెరుగదూ? ఏమిరోగమో యెవరును జెప్పలేరు. ఏనాఁడు పట్టినను పుట్టెడు దిగులు నాయనా! తెల్లరాజులు వచ్చినారని చెప్పుకొన్నారు. మంచిరాజులు, మంచిరాజులు అని అందరు అనుకొను చుండఁగా, ఎవరైనను నా బిడ్డగతి చూతురేమో అని ఎంత పరితపించితిని? పూర్వపు వాసివిని తలయూచిన వారొకరు. దూరముగాఁజూచి బిడ్డపై ఒకకాసు, రెండుకాసులు పడవేసిన వారొకరు. పాపము తలఁచినవారొకరు. మొగము చిట్లించు కొన్న వారొకరు. ఎత్తుకొన్న వారులేదు. చంకను బెట్టుకున్న వారు లేరు. ఎందుకు నాయనా!భ్రమ! బిడ్డకు వెనుకటిరోజులు తిరిగి రావు. ఆ దినాలు రావు, ఆ రాజులు రారు. నిజమున నేమి? బిడ్డ ఏమంతశృంగారముగా ఉన్నదని నెత్తినిఁబెట్టుకొందురు నాయనా ఇతరులు నాయేడుపేకాని.

పోనీ! ఆ వైభవము రమ్మన్న రాదు. బిడ్డనుదగ్గఱకు దీసి యీ బిడ్డ యింట్లున్న దెందుకు? రోగమేమి? నొప్పేమి? అన్న వారైనా ఉన్నారా? అదీ లేదు. ఎవరేమను కొన్ననూ కడుపుగదా బిడ్డ పెరుగునేమో బాగుపడునేమో, ఒకరు గాకున్న ఒక రాజైనా నాపాలిటిదైవమై బిడ్డగతి కనుఁగొనునేమో అని ఆశతో పరమాత్మునిమీఁద భారమువేసి రోజులు గడుపుచుంటిని.

ఇటుచూడఁగా నాబిడ్డ కేడు వెనుకలఁ బుట్టిన బిడ్డలు పెరిగి పెద్ద వారైనారు. తల్లుల కడుపు చల్లఁగా కళకళలాడుచున్నారు. నలుగురిలో పేరు, ప్రతిష్ఠ సంపాదించు కొన్నారు. సిరి, సంపద, ఫలానివారనఁగా ఎక్కడకుఁ పోయినను ఘనత గౌరవము, వారికేమి? మహారాజులు అని అనిపించుకొన్నారు. దేశదేశాలు తిరిగినారు. లోకములో ఉన్న విద్యలన్నీ నేర్చుకొన్నారు. ఏమేమి శాస్త్రాలో చదివినారు. గాలిని కదలకుమన్నారు, నీటిని నిల్వుమన్నారు. అగ్గిని ఆగుమన్నారు. భూదేవతలనఁగా వీరేనని అందఱూ పొగడుచున్నారు.బ్రహ్మకు బ్రహ్మలై నిల్వఁబడ్డారు. ఆ బిడ్డను జూచి నా బిడ్డను జూచుకొన్నప్పుడు నాగుండె కోసికొని పోవుచున్నది.అందివలెనే నేను గంటిని. రాజుల చేతిబిడ్డ నాయంత అదృష్టవంతురాలు లేదు అని అనుకొంటిని. నాయనా! యేమి రోగమో యేమో నా బంగారు వంటి బిడ్డను పాడుచేసి కూర్చున్నది. ఆ రోజుకు ఆరోజుకు బిడ్డ బొత్తిగా చెడిపోయినది నాయనా!

ఏడుపు ఆరంభమైనది, ఎడతెగని యేడుపు మనుష్యునిఁ జూచిన తోడనే మఱిమఱి యేడ్చును. జాలిపడి యెవరైనా ఏదైనా పెట్టినఁదినును. మరల ఏడుపు

మొదలుపెట్టును. గొప్పగా బ్రతికిన బిడ్డ. ఈ రోజులలో ఏడ్పులు వినెడువారెవరు? భోగభాగ్యాలూ, కీర్తి ప్రతిష్ఠలూ, గొప్పతనాలూ లేకపోఁగా, అన్నమునకు అగచాట్లుపడు చున్నది. అనఁగూడదుగాని నాయనా! చచ్చినదానిలోను బ్రతికినదానిలోను జమ గాకున్నది. పడఁగలపాట్లన్నీ పడితిని. బిడ్డ రోగము చెప్పినవారు లేరు. బిడ్డ యెదగదు. ఏండ్లు గడచినవి. పూఁడ్లు గడచినవి రాజులు మాఱినారు రాజ్యాలు మాఱినవి. నాయనా! బిడ్డ యెదుగుడు పుట్టినప్పుడెంతయెత్తో, ఇప్పటికిని అంతే యెత్తు.

కనకమువంటి మొగము. నాయనా! గడ్డలయిపోయినది. తెల్లడాక్టర్లు ఘన వైద్యులని చెప్పినారు. బిడ్డను దీసికొని పోయి చూపి జరిగినదంతా చెప్పితిని. బిడ్డయిఁక ఎక్కువదినములు బ్రతుకదని కొన్దఱన్నారు. నా గుండెలవిసిపోయినవి. ఎంత కష్టపడి కంటిని, ఎన్నాళ్లు పెంచితిని అని యేడ్చుచుంటిని. ఏడువకు రాజుల యిండ్లలోఁ జిన్న తనముననే తినరానిదెల్లఁ దినుటవలన బిడ్డకు పొట్ట పాడైనది. ఇంకఁబెరుగదు గాని బ్రతుకును అని కొందరోదార్చిరి. పాపము శస్త్రముచేసి, మందులిచ్చి బిడ్డకు తగిన వైద్యము చేసిన బాగుపడును. ఎందఱు బిడ్డలు బాగుపడలేదు? మేము చేయఁగలది చేసెదము అని కొందఱనుచున్నారు.

తెల్లవైద్యము నేర్చిన మనవారికిఁజూపితిని, బిడ్డ పెంపు ఆగిపోయినది. ఈ తల, ఈ కాళ్లు, ఈ చేతులు, ఈ పొట్ట తీసివేసి క్రొత్త తల,క్రొత్త కాళ్లు,క్రొత్త చేతులు, వేయవలెనని కొందరు చెప్పిరి. అక్కఱలేదు, మందులువేసి చూచెదము, అవసరమైతే కొంచెముగా తలను, పొట్టను, శస్త్రము చేసెదము చెడిపోయినవి. పడిపోయినవి, తీసివేసి క్రొత్తవి పెట్టెదము. బిడ్డను బాగుచేసెదము అని కొందఱనుచున్నారు. ఏమి తోఁచినది కాదు నాయనా! మొద్దోమొగరమో చూచుకొనుటకైనా లేకుండా ఏమి చేయుదురో అని భయము. రోగము పోవునేమో బిడ్డ బాగుపడునేమో అని ఆశ ఏమి చేయుదునా అని త్రొక్కలాడుచున్నాను. కడుపుమంట ఆ విధమున బాధ పెట్టుచున్నది. చూచుచుఁ జూచుచుఁగోయించుటకు చేతులాడవు నాయనా!

ఈ కథలో కథ చెప్పుచున్న ముసలి స్త్రీ తెలుఁగు.

### తెలుగుకు పట్టిన 'తెగులు' పై విసుర్లు

అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు (1889–1942) గురజాడ సమకాలికులైన తొలితరం కథారచయితలలో ఒకరు. వీరి త్రిలింగ చిన్న కథలు ఇప్పటికి మూడు ముద్రణలు పొందింది. త్రిలింగ పత్రికను వావిళ్ళవారు 1914లో స్థాపించారు. ఈ పత్రిక వ్యవస్థాపక సంపాదకుడు ఉమాకాంతమే. రవీంద్రనాథ

టాగూర్ కాబూలీవాలా కథను మొట్టమొదటిసారి తెలుగువారి చేత చదివింప చేసినవాడు ఉమాకాంతమే. ఉమాకాంతంగారు 1912-14 మధ్యకాలంలో కలకత్తాలో చదివారు. అప్పుడు బెంగాల్ సాహిత్య పురోగమనాన్నాయన పరిశీలించి ఉంటారు. వాడుక భాష విషయంలో తన కళ్ళు తెరిపించినవాడు గురజాడ అప్పారావని ఉమాకాంతం చెప్పినట్లు తల్లావఝుల శివశంకరశాస్త్రిగారి సాక్ష్యం ఉంది. ఆనాటి వ్యవహారిక భాషశైలీ నిర్మాతలలో ఉమాకాంతం అగ్రగణ్యుడు. నవద్వీప పండితులు ఈయనను మెచ్చి విద్యాశేఖర్ బిరుదిచ్చారు. 1914 మే సంచిక "త్రిలింగ' లో ఈ కథ వచ్చింది. తెలుగు పత్రికలలో 'కార్టూన్'లు ప్రారంభించినవాడు కూడా ఉమాకాంతమే అనిపిస్తుంది. ఏమంటే 'త్రిలింగ' పత్రికలో కార్టూన్‌లు ఉన్నాయి. ఈ పత్రిక తెలుగులో అర్థశతాబ్దం పైనే వెలువడింది.

ఈ కథ ప్రతీకాత్మకమైంది. ఇంగ్లీషులో ఇటువంటి రచనలను 'అలిగరి' అంటారు. తెలుగులో అర్థవాదం అని కూడా అంటారు. అంటే తెలియచేసే విషయాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పడం. తెలుగు సాహిత్యం ఎప్పుడూ పోతపాలతోనే పెరిగింది. వయసుకు తగ్గ ఎదుగుదల, వికాసం, స్వావలంబన కనపరచలేదని తెలుగు తల్లి మొరపెట్టుకోవడం ఈ కథ ఆక్షేపగర్భంగా చెపుతున్నది. తొమ్మిది దశాబ్దాలనాటి కథ కదా ఇది. భాష శైలిలో కొంత చాదస్తం ఇంకా కనపడుతుంది.

తనకు నచ్చిన తాను మెచ్చిన రచయితలలో అక్కిరాజు ఉమాకాంతం ఒకరనీ, రోజూ తానొకసారి చూడాలని కుతూహలపడే ఛాయాచిత్రాలలో ఉమాకాంతం గారిది కూడాతప్పనిసరి అని శ్రీశ్రీ తన వ్యాసక్రీడలలో చెప్పుకున్నాడు. తెలుగుపట్ల మమకారం, ఆదరణ, అభిమానం తగ్గిపోతున్నాయని ఆలోచనపరులంతా అనుకుంటున్నా ఈ రోజులలో దానికి కారణాలేమిటో ఉమాకాంతం ఊహించగలిగాడు తొంభైఏళ్ళనాడే. అబ్బూరి రామకృష్ణరావుకు అక్కిరాజువారంటే ఎంతో గురి. తెలుగుభాష, సాహిత్యం ఎప్పుడూ రాజుగారి అందలాలలో, అధికారుల అండదండలలో అలరారాయే కాని స్వీయవ్యక్తిత్వం పెంపొందించుకోలేదని ఉమాకాంతం విద్యాశేఖరుల అభియోగం. ఇంగ్లీషు ఈ దేశంలోకి వచ్చిందాకా సంస్కృతమే తెలుగుమీద పెత్తనం సాగించింది. ఇక ఇంగ్లీషు విద్యా విధానం ప్రారంభమైన తర్వాత ఇంగ్లీషు నెత్తినెక్కికూచుంది. ఉన్నతవిద్య మాధ్యమంగా తెలుగు ఏనాడు మర్యాదా, మన్ననా పొందలేదని తెలుగుతల్లి హృదయ విదారకంగా బాధపడటం ఈ కథ ముగింపులోని ప్రతీక.

# 26. శాస్త్రిగారి సమాచారము

– ఆచంట సుందరరామయ్య

**సూ**ర్యనారాయణశాస్త్రిగారు, రమారమి నలువదిసంవత్సరముల వయస్సు గల వారు. ఈయన దైవభక్తిగల శుద్ధశ్రోత్రియుఁడు. ఈయన దేహచ్ఛాయ యెఱ్ఱగ నుండును. నలువది పైఁబడిన వయస్సుగలవాఁడయ్యును, పొట్టివాఁడగుటచేతను, కాయ శరీరము గలవాఁడగుటచేతను, రమారమి ముప్పది, ముప్పదిరెండు సంవత్సరముల వానివలెఁ గనఁబడును. మొగము ముడుతలు లేక, గుండ్రముగను, స్నిగ్ధముగను నుండును. ఈయన నైసర్గికముగా సంతోషస్వభావము కలవాఁడయ్యును, ఏకారణము చేతనోగాని, ఇతని మోము పూర్వపువికాసము తగ్గియున్నది. నుదురునఁ బడెడు ముడుఁతలితని మనస్సున నేదో యొకగొప్ప విచారమును సూచించుచున్నవి. కొద్ది దినములనుండియు నీతనిని బూర్వము చూచిన వారిలో, "శాస్త్రిగారు వ్యాధిగ్రస్తులైనట్టుఁ గనఁబడుచున్నార" నని వారు లేరైరి. ఇంకఁ గొంచెము పరిశీలించి చూచిన యెడల, శాస్త్రిగారి కనులనుండి యశ్రుబిందువులుఁ గూడఁ బయలువెడలునట్లు చూపట్టును. శాస్త్రిగారు ధైర్యవంతులుగావున, తన దుఃఖమునంతను లోపలనే యణగ ద్రొక్కుచు, నితరులకుఁ దెలియకుండఁ గప్పుచుందురు. కాని ముఖారవిందము, నిర్మల దర్పణమువలె, మనో విచారమును వ్యక్తపరుపకమానదుగదా?

పాప మీతనిపూర్వపు నెమ్మదికి భంగము గలుఁగుటకుఁ గారణమేమై యుండునో? మొదట నీతనిగృహస్థితిని గొంతవరకుఁ బరిశీలింతము.

శాస్త్రిగారికి సాలునకు పాతిక ముప్పదిగరిసెల రాఁబడిగల యినాంభూములు గలవు. ఈయనకుటుంబమున, శాస్త్రిగారు, భార్యయు, నిద్దఱుకూఁతులు, నొక్క కొమరుఁడు, నొకకోడలును మాత్రమే.

కొమారునిపేరు కృష్ణమూర్తి. ఇతఁడు మహాబుద్ధిమంతుఁడు. ఇరువది సంవత్సరముల చిరుతప్రాయముననే రాజమహేంద్రవరమునఁ, బట్టపరీక్షకుఁ జదువు

చున్నాఁడు. జ్యేష్ఠపుత్రిక శాంతము, ఈమె సుగుణవతియు, సార్థకనామయు, సత్స్వభావము గలదియునై పెద్దలకడ నధిక వినయవిధేయతలతో మెలఁగుచుండును.

ఈమెను, నారాయణ సోమయాజులుగారి ద్వితీయపుత్రుఁడగు రామమూర్తికిచ్చి సింహాచలమున శ్రీనృసింహస్వామివారి సాన్నిధ్యమున వివాహ మతివైభవముగ జరిపిరి. ఈ సోమయాజులుగారికినిఁ గూడ రమారమి యిరువది గరిసెల ధాన్యము వచ్చు నగ్రహారపు భూములు పిత్రార్జితమైనవి కలవు. సోమయాజులుగారి కిరువురుపుత్రులు. స్త్రీ సంతతి లేదు. పెద్దవానికి, తమ యింటివిద్యను మాత్రము సోమయాజులు గారే స్వయముగఁ గఱపుచుండిరి. ద్వితీయపుత్రరత్నమే మన శాంతము యొక్క భర్త. తండ్రి వేదపాఠి యగు సోమయాజియైనను, ఇప్పటికాలముననుసరించి యీతని హూణవిద్యనే యభ్యసింపఁజేసెను. ఈయన క్రమముగ , తరగతికి రెండేసి సంవత్సరముల చొప్పున విశ్రమించుచు, ప్రవేశపరీక్షలో మొదటి సంవత్సరము. తేలిపోఁగా, పేరచ్చి వచ్చినది కాదని, తన పేరును "రామశాస్త్రి" యని మార్చుకొనెను! రెండవసంవత్సరమునఁగూడ పరీక్షపోఁగా 'మూర్తి, శాస్త్రి' యును గూడ నచ్చినచ్చినవికావని, 'రావు' బిరుదాంకమును వహించెను! పేరులో నేమిగలదు? పేరుమారినను మనస్సుమారదుకదా? చదువవలెను. పరీక్షలో జయమందవలెను. మూడవమారుకూడఁ బరీక్షలో నపజయమందుటచే, పేరచ్చివచ్చినదికాదనుట యనునది కల్లయనియును, తనకా చండాలపు విద్యయే, అచ్చివచ్చినది కాదనియును దలపోసి అతఁడు చదువుసంధ్యలకొకధార విడిచి, ఏఁబది రూకలు లంచముఁబోసి, తహసీల్దారువారి కచేరిలోఁ బదునేను రూకల వేతనమున కొక లేఖరిగఁబ్రవేశించెను. ఇట్లు మన రావు విద్య తుదముట్టెను. ఇంక, సూర్య నారాయణశాస్త్రిగారి ద్వితీయపుత్రిక మాణిక్యము సంగతి చెప్పెదను. మంచి సంబంధములు దొరకక, శాస్త్రోక్తమగు "అష్టవర్షాద్భవేత్కన్యా" ప్రాయము తప్పి, పదిసంవత్సరములవరకు నీమె కన్యకగానుండుఁగా, గత సంవత్సరమామె నొకమాల్కు దారు పుత్రునకిచ్చి వివాహ మతివైభవముగ, శాస్త్రిగారు తమ యింటనే జరిపిరి.

ఇంక నితని కేమికొదువ? కుమారుఁడు బి.ఏ. చదువుకొనుచున్నాఁడు. కొమార్తెల కిరువురకును సంపన్నులగు వరులు దొరకిరి.

తానా సంపన్నుఁడు. ఇఁక లోకములో మనుష్యుఁడు గోరఁదగిన సౌఖ్యమే మున్నది? కొద్దికాలము క్రిందటివరకును మనశాస్త్రిగారును గూడనట్లే తలంచు కొనుచు, మిక్కిలి హెచ్చరికతో, తన కట్టిసౌఖ్యముఁ గలుగఁజేసినందునకు దయా మయుఁడగు సర్వేశ్వరుని సదా స్తోత్రము చేయుచునేయుండెను.

ఐనచో నిప్పుడానెమ్మదికి భంగము గలుగుటకుఁ గారణమేమైయుండునోకదా? పాపము!

ఈ నెమ్మదిభంగమునకు మన శాంతమే కారకురాలై యుండవచ్చును. అయ్యో! పాపము సాధ్వియగు శాంతమేమి చేసినది? కాదు. కాదు. కారణము మన రామారావు పంతులగారేమో? ఈయనయు నంతగాకాదు. మనశాస్త్రిగారి స్వయంకృతాపరాధమే వారి మనస్తాపమునకు ముఖ్యహేతువు.

చదువరులగు సోదరీమణులారా! ఈ చెప్పినది మీకు వ్యాసఘట్టమై తోచెడును గాఁబోలు. సావధానలై వినుండు.

చదువరులారా! మనశాంతమిపుడు రెండు సంవత్సరముల ప్రాయముగల ముద్దులు గుల్కు కొమరుని దోడుకొని, భర్త యిల్లు వదలి, తన పుట్టినిల్లు చేరెను.

సర్కారు పనిలోనుండు మన పంతులుగారు, ఆయూరనందఱును రామారావు డాంబికవేషమునుబట్టి యతనిని 'పంతులుగార'నియే పిలుతురు. రావు కూడ నా బిరుదునే యామోదించెను. కాబట్టి మనమేలయా బిరుదును వాడరాదు. దుస్సహ వాసముచే గండుమీరి, తలిదండ్రులను నిరాకరించుచు, దుర్వ్యాపారములందు ప్రవర్తింపఁజొచ్చెను.

కొద్దిదినములనుండి పంతులుగారు చాటుచాటున సురాపానమభ్యసించుచు వచ్చిరి. ఒకటి రెండు పర్యాయములది మన శాంతము కటంబడెనుగాని, "కడుపునొప్పి కౌషధమ"ని పంతులుగారు సమాధానము చెప్పుటే నామెకు సంశయవిచ్ఛేద మాయెను. ఈ విద్య వీని సహోద్యోగియగు వెంకటస్వామి సహవాసమువలన నబ్బినదేకాని, వేఱు కాదు. ఏలనన, పూర్వము, రెండు సంవత్సరముల క్రిందట, కృష్ణమూర్తి వివాహమునకు వచ్చునపుడు పంతులుగారికిట్టి దురభ్యాసము లేమియును లేవు. ఇప్పుడైన నీతఁడు మద్యపానమునం దారి తేరినవాఁడు కాఁడు.

గత సంవత్సరము మాణిక్యము వివాహోత్సవమున కాహూతులై, పంతులుగారు దారాపుత్రసమేతులై మామగారి గృహము నలంకించిరి. మాణిక్యము వివాహలగ్నము నాటిసాయంకాలమున శాస్త్రిగారు, తాను భాగ్యవంతుఁడుగావున, లౌకికుల నానందింపఁజేయుటకై నూటపదునారు కట్నమీయ నిశ్చయించి, కృష్ణమూర్తి యెన్ని విధములవారించినను లక్ష్యముఁజేయక, రాజమహేంద్రవరము నుండి నత్తినోటి మంజువాణి యొక్కయు, 'చికిలికన్నుల చకోరాక్షి' యొక్కయు మేళమును రావించిరి.

విజయనగరములో ననేక ప్రసిద్ధికెక్కిన గొప్పమేళములుండగా, రాజమహేంద్రవరము నుండి యీమేళము నేల రప్పించిరని చదువరులలోఁ గొందఱికి సందియ ముండు నేమో? ఇందుకుఁ గారణము మ–రా–శ్రీ రావుబహద్దూరు కందుకూరి వీరేశలింగము పంతులవారీ మేళమునే రావించి, 'బ్రాహ్మవివాహ' మహోత్సవకాలమందు తత్సభికుల నమితానంద భరితులఁజేయఁ గలుగుటయేయని యెఱుంగునది.

లగ్నము నాటిసాయంకాలమైదుగంటలకు, మేజువాణి యేర్పరచఁబడినది. ఆ సభకు విచ్చేయువారిలో మనపంతులవారే యగ్రగణ్యులు. నాటి, మంజువాణి యాట పాటలకేమి, చకోరాక్షి యభినయకటాక్షవీక్షణముల కేమి, సభికులందఱు నానంద పాథోధినోలలాడిరి! చకోరాక్షి భ్రూవిభ్రమణము పంతులవారి చిత్తభ్రమణమునకుఁ గారణమయ్యెను. సభికులందఱు నొకటి రెండురూకల కట్నములు చదివించిరి. మన పంతులవారన్ననో, పదిరూకల కట్న మొసంగిరి! నాఁడు మొదలు నేటివఱకును వేశ్యానురక్తుఁడై, చకోరాక్షిలోలుఁడై రామారావు శాంతము వైపునకుఁ గన్నెత్తి చూడఁ డాయెను. దినదినమును వేశ్యానురాగమధికమై వేశ్యను దనయింటిలోఁ బ్రవేశింపఁ జేయఁ బ్రయత్నించెనుగాని, తల్లిదండ్రులొప్పమిచే, నా ప్రయత్నమున విఫలుఁడయ్యెను. కొన్ని నెలల వఱకును, సర్కారు నౌకరిచేయుచు, వేతనఁపురూకలఁ జారపత్ని చేత విడుచుచువచ్చెను. కాని నెలలతఱబడి, యన్యవ్యాపారములయందు కాలము వ్యర్థపుచ్చ మనసోపనందున, చీటినైన వ్రాయక పంతులుగారు వేశ్యావిహారము సలుపుచుండ, నుద్యోగమునుండి తొలఁగింపఁబడిరి.

**శాంతముయొక్క దుస్థితి**

'ఇఁకనేమిగతి! వేశ్యాపాదపూజకు రొక్కమెక్కడిది? ఇంటి వ్యవహారమంతయు పితాభ్రాతలు చూచుకొనుచున్నారు. కాని వేశ్యకు వారు సొమ్మీయరుగదా? ఏమి గతి దైవమా! ఈ యిక్కట్టెట్లు తీరును' అని పంతులుగారు వితర్కించుచుండఁగా, 'ఏమీ! భార్య యొడల నగలున్నవే' యనునూహ సమయోచితముగ నాయనకు స్ఫురించెను.

ఒకనాఁడు శాంత, తనగదిలోఁ బండుకొనియుండ, పంతులువారు నడురేయి నిల్లుచేరి, గదిలోఁ బ్రవేశించి, శాంతము మెడలోని కంటెను కాసులపేరునుఁ దీయు చుండ నామె మేల్కాంచి, కన్నులఁదెఱచి, భర్తను గుఱ్ఱెఱిఁగి, "నాథా! జడియకుఁడు. నా సొమ్ములఁ దీసికొనవద్దని నేను జెప్పను. నాయాభరణతిలకమగు మీరే పరాధీనులు

కాఁగా నా యొడలి నగలు పరాధీనములగుటకు విచారించుటేల? నాదొక మనవి వినుండు, అగ్నిసాక్షిగను దైవసాక్షిగను బరిణయమైన నన్నిట్లు విడనాడి, ప్రవర్తించుట ధర్మమా? సర్వమును గోల్పోయిన పిదప పశ్చాత్తాపము నిరర్థకము. చేయి కాలిన పిదప నాకులఁబట్టినఁ బ్రయోజనము లేదుకదా? వలదటుపోకుఁడు మీ ప్రవర్తనను జక్క చేసికొనుఁడు" అను నామె దీనాలాపములఁ బెడచెవినిడి, యొకగదుము గదిమి, మెల్లన చోరునికైవడియామె యాభరణములను ముసుకున దాచి యాతఁడు తీసికొని పోయెను.

గండశిలలనైనఁ గరఁగింపఁజాలు నీమె దీనోక్తులు, ఇట్లు పంతులుగారి వజ్ర హృదయమునుఁ గరఁగింపఁజాలనివై, వానిని మంచి మార్గమునకు మఱలింపఁ జాల కుండెను. పంతులుగారి నావేశించియుండు రోగమున ఔషధము, శాంతము తలచినట్లు ప్రథమోపాయము కాదు; చతుర్థోపాయమునే ప్రయోగింపవలెను కాని సాధ్వియగు శాంత మెట్లీచికిత్స జరుపఁగలదు? ఈప్రకారము పెక్కుసారులామెపతికి హితోప దేశములఁ జేయుచుండెనుగాని, పంతులుగారీ నర్మదీనోక్తులఁ బెడచెవినిడుచునే వచ్చిరి. అన్నియెడల విఫలయై యొడలిసొమ్ములునుగూడఁ గోల్పోవుటకు వగచి శాంతము, పిమ్మటఁ దండ్రికినుత్తరము మూలమున సర్వమునుదెల్పెను. కాని శాంతము మాత్రము, ఇప్పటి కొందఱి స్త్రీలవలెఁ జీటికి మాటికిఁబుట్టినింటికిఁ జాబుల నంపు స్వభావముఁగల కాంత కాదు. ఇంతవఱకును, శాంతమనస్తాపమామె తల్లిదండ్రు లెఱుఁగనేయెఱుఁగరు! చంద్రమతి, దమయంతి మొదలగు పుణ్యస్త్రీల చరిత్రలఁ జదువుటే నీమె కిట్టి శాంతము కుదిరినదని చెప్పుట కేమి సందియమును లేదు.

శాస్త్రిగారు తనకూఁతు జాబునుజూచి, శ్రోత్రియుఁడుగావున, వేశ్యాదష్టుఁడగు తనయల్లునికి మంత్రించి విషముండ్రిప్పనెంచి యనేక మాంత్రికులఁ దీసికొని పోయెను గాని, వేశ్యాప్రియత్వమనువిషము పంతులుగారి హృదయమున గాటముగనాటినందున, వారెన్నిమంత్రములు వేసినను పంతులుగారి తలకెక్కక వ్యర్థములయ్యెను. పిమ్మట కూఁతుదీనావస్థ విచారించి, ఆమెను తనగృహమునకుఁ దీసికొనిపోవుటయే యుత్తమ కార్యమని దలఁచి, తల్లినిపిల్లలను దమయింటికి దోడుకొనిపోయెను. ఇప్పటికిని వారిని శాస్త్రిగారే పోషించుచున్నారు.

పంతులుగారు, తన తల్లిదండ్రులీవిషయమునఁ దనకు హితము బోధింపఁ దలఁచినప్పు డెల్లను, వారిని దుర్భాషలఁదిట్టుచు, నొకటి రెండుసారులు గొట్టఁబోయెను.

ఆ వృద్ధదంపతుల విలాపమేమని చెప్పను? పంతులుగారిని జూచినప్పుడెల్లను 'తులసి వనములో గంజాయిమొక్కవలె పవిత్రమైన మావంశము నధోగతికిఁ దెచ్చుటకు, నీవు నాగర్భమున నుంచితివిరా. నాయనా! ఇఁక పెద్దమనుష్యులలో నెట్లు తలయెత్తుకుని తిరుగఁగలనురా కొడుకా! పండువంటి సంసారమును బాడుచేయకురా బాబూ! ఇఁకనైన నీతుచ్ఛ వృత్తిని మానరా, నాయనా!'యని నారాయణసోమయాజులుగారు ఘోషించు చుందురు. కాని, ఏమిప్రయోజనము? మొక్కగా నున్నప్పుడు వంచనిచో, మ్రానై వంగునా? చిన్నతనమున శిక్షలేని బాలురు, పెద్దవారై, రామారావువలె, తల్లిదండ్రుల అవమానింతురుగదా. చిన్ననాటిశిక్ష, బాలురకు చేదుగ నుండినను, గుణాంకురములను నిర్మూలముఁజేయును.

చూచితిరా! చదువరులారా! సాధ్వియగుశాంతమున కెట్టి దురవస్థ సంభవించినదో! ఇట్లు తటస్థించునని శాస్త్రిగారు మొదటఁగ దలఁచినచో, వేశ్యలను వివాహమునకు రావింతురా? మేజువాణి చేయింతురా? శాంతమున కిట్టి దుర్దశ కలుగునా?

ఇప్పుడు శాంతము ప్రాయమిరువదిసంవత్సరములు మాత్రమే. ఇంక జీవితకాల మెల్ల నిట్టి దుర్భరమగు సధవవైధవ్యము నీమె యనుభవించవలసి యున్నదేమో కదా! ఎన్నటికైనను భర్తృకటాక్షవీక్షణములు తనపైఁ బ్రసరించునేమోయని, మనశాంతము, మృదుమధురశైలిని వినయపూర్వకముగా భర్తకు వారమున కొకజాబును వ్రాసియంపు కొనుచు తనకుఁ బూర్వపుసౌఖ్యమును బ్రసాదింపుమని, ఆపన్ని వారకుఁడును దీనబంధుఁడును, దయామయుఁడునునగు, సర్వేశ్వరుని సదాధ్యానించుచున్నది. సరియైన జబాబు రావలయునని కోరుచున్నాను.

చదువరులారా! ఇట్లు మనదేశమున వందలకొలఁది శాంతలును శాస్త్రులునుఁ గలరు. వారికి మనశాస్త్రి శాంతల బాధలు బాగ బోధపడును.

సర్పదష్టుల విషమును ద్రిప్పుటకు మంత్రౌషధములు కలవు. గాని జారకాంతా దష్టునికి మంత్రము లెక్కవు! మహౌధములు గుణము నీయవు!

శ్లో॥ ఏతా హసంతిచ విత్తహేతో ర్విశ్వాసంతి పురుష నతువిశ్వసంతి ।
తస్మాన్న రేణ కులశీలవతా సదైవ వేశ్యాశ్మశాన కుసుమాఇవ వర్జనీయాః ॥

## కథానేపథ్యం ...

ఈ కథ నూట ఇరవై ఏళ్ళనాటిది. ఆ రోజులలో తణుకు నుండి వెలువడే సువర్ణలేఖ పత్రికలో ఈ కథవచ్చింది. కథా వస్తువునుబట్టి ఈ కథను ఆచంట సుందర రామయ్య రాసినట్లు భావించాలేమో! ఎందుకంటే వీరేశలింగం ప్రహసనాల ప్రసక్తి ఈ కథలో మిక్కుటంగా ఉంది. ఆ ప్రహసనాల ప్రభావం, పాత్రల పేర్లనుబట్టి కూడా, కథా సన్నివేశాల దృష్ట్యా కూడా వీరేశలింగం సహచరులు ఎవరో మాత్రమే రాయగల కథ ఇది. ఆ రోజుల్లో రాయసం వేంకట శివుడు, ఆచంటవారూ, కందుకూరి వారికి అత్యంతాప్తులు. ఇంతకన్న దగ్గరవారైన మరి ఒక కథా రచయిత కనపడరు. వేంకటశివుడు వీరేశలింగంగారికి తన కథాసంపుటిని అంకితం చేశాడు. సత్యసంవర్ధని అనే పత్రికకు కందుకూరివారితో సహసంపాదకత్వం నిర్వహించాడు.

రాయసంవారు నడిపిన జనానా పత్రిక అప్పటికి ఆగిపోయింది. రాయసం వారిదే ఈ కథ అనుకుంటే, ఆయన సువర్ణలేఖలో ప్రకటించి ఉంటారనుకోవాలి. ఈ తొలిమలి తెలుగు కథారచయితల సంపుటిలోనే ఈ కథను ఎందుకు చేర్చటం జరిగిందంటే క్రైస్తవ మిషనరీలు, బాలికా పాఠశాలలు స్థాపించటం అప్పుడప్పుడే ప్రారంభమవుతున్నదనే సామాజిక వ్యవస్థ పరిణామం ప్రస్తావించటానికి.

ఆచంట సుందరరామయ్యగారు వీరేశలింగం గారికి పరమాప్తులు. తొలిసారిగా చింతామణి పత్రిక నవలల పోటీ నిర్వహించినప్పుడు సుందరరామయ్య వీరేశలింగంతో పాటు న్యాయనిర్ణేతగా ఉన్నారు.

# 27. అదృష్టము

– *శ్రీనివాస శిరోమణి*

**సు**బ్బయ్యశాస్త్రిది రాజమహేంద్రవరము. తరతరాలనుంచీ అతని పూర్వీకులు అక్కడనే నివసించి పురోహితము చేసి జీవయాత్ర వెళ్ళతీసినారు. సుబ్బయ్యశాస్త్రి కూడా తాత ముత్తాతల మాదిరిగానే పురోహిత వృత్తినే అవలంబించినాడు. ఎన్నడో తాత ముత్తాతల నాడు సంపాదించిన ఇల్లు తప్ప మరి ఏ ఇతర స్థిరవసతీ లేకపోయి నప్పటికిన్నీ సుబ్బయ్యశాస్త్రి సంసారయాత్ర హాయిగానే సాగుతూఉంది.

గోదావరి పుష్కరాలకు శాస్త్రి తోడి అల్లుడు సూరావధానులు అతని భార్య వెంకటమ్మ రాజమహేంద్రవరము వారి ఇంటికి వచ్చినారు. అవధానులు అట్టే చదువుకున్నవాడుకాడు. అయితే అమాంబాపతు పురోహితములోనూ ఆరితేరినవాడు. చుట్టుపక్కల బ్రాహ్మణ్యము లేకపోయినట్లయితే యజ్ఞ యాగాది మహాక్రతువులున్నూ నిరాక్షేపణీయముగా చేయించకల సమర్థుడు. అంత చాకచక్యముఉన్నా స్వగ్రామములో పొట్ట జరగక పుష్కరాలకు రాజమహేంద్రవరము వచ్చినాడు. పుష్కరాలలో అవధానులు నాల్గు డబ్బులు చేసుకొన్నాడు. పల్లెటూరి పురోహితముకన్నా బస్తీ పురోహితమే బాగా గిట్టుబాటు అయ్యేట్టుగా తోచింది. సకుటుంబముగా రాజమహేంద్రవరములో నిలచిపోయినాడు. అందుకు సుబ్బయ్యశాస్త్రి ప్రోత్సాహము చేసినాడు కూడానూ.

తోడిఅల్లుళ్ళు ఉభయులున్నూ అన్నతమ్ములమాదిరిగా జాయంటు పురోహితము ఆరంభించినారు. బాగా సంపాదించటము మొదలు పెట్టినారు. సుబ్బయ్యశాస్త్రికి కరతలామలకము అయిన స్మార్త విద్య సూరావధానుల లోకజ్ఞానమువల్ల రక్తికి ఎక్కింది. ఇకను ఇంట్లో ఉన్నది అక్కచెల్లెళ్ళు అయినందువల్ల ఏ చిక్కూ లేకుండా ఇల్లు గడుస్తూ ఉంది. ఆ నల్గురూ మూడుపూలు ఆరుకాయలుగా సంసారము సాగించినారు.

కాలము ఒక్కమాదిరిగా సాగదు. ఒకనాడు తెల్లవారుతూనే సూరావధానులు తన అంగవస్త్రము పోయింది అంటూ భార్యతో హోరాహోరి పోట్లాడడము మొదలుపెట్టినాడు. ఆ పోట్లాట సర్దుబాటు చేయడానికి అవధానుల వదినెగారు

సోమిదేవమ్మ ప్రమేయము కలగచేసుకొనేసరికి భార్యతో పోట్టాట మానివేసి సోమిదేవమ్మ తోనే పోట్లాడడము సాగించినాడు. పొద్దు ఎక్కిన కొద్దీ పోట్లాట ఎక్కువ చేసినాడు. సోమిదేవమ్మ తగ్గినా సుబ్బయ్యశాస్త్రి సమాధానపరచ పోయినా ప్రయోజనము లేకపోయింది. "ఇకను ఈ ఇంట అమృతమస్తు అనేది లేదు" అంటూ మిట్టమధ్యాహ్నము అప్పుడు భార్యా సహితముగా సూరావధానులు వారి ఇంటిలోనుంచి లేచిపోయినాడు. సుబ్బయ్యశాస్త్రి క్షణలేశము ఖిన్నుడు అయినాడు. అయితే తప్పు అంతా తోడిఅల్లుడిదేను అని తోచగానే మనస్సు కుదుటపడ్డది.

తెల్లవారేసరికి యథాప్రకారముగా సూరావధానులు పురోహిత వ్యవహారానికి సుబ్బయ్యశాస్త్రి దగ్గరకు వచ్చినాడు. శాస్త్రి కొంచెము ఆశ్చర్యపోయినాడు.

"వదినెగారికీ నాకూ తగాదా వచ్చింది. మీతో నాకు ఏ తగాయిదా లేదు. మీరు ధర్మమూర్తులు. మీరు 'కాదు' అంటే చెప్పలేను. మీ చెప్పుచేతలలో మీవెంట ఉంటూ పురోహితము చేయవలసినవాణ్ణేను" అని సూరావధానులు అనేసరికి సుబ్బయ్యశాస్త్రి సంతోషించినాడు. యథాప్రకారముగా జాయంటు పురోహితము సాగుతూనే ఉంది. వదినే మరుదులకు మాత్రము మాటలు లేవు. కాని వెంకమ్మ సుబ్బయ్యశాస్త్రి ఇంటికి వస్తూపోతూ ఉండేది. అదే విధముగా సోమిదేవమ్మ సూరావధానుల ఇంటికి వస్తూపోతూ ఉండేది.

జాయింటు సంసారము మానివేసి సూరావధానులు వేరే కాపరము పెట్టింది మొదలు వెంకమ్మ మెడను నగలు ఎక్కడము మొదలు పెట్టినవి. ఇట్టే అయిదు ఆరు మాసాలు అయ్యేసరికి ఆమె బంగారపు బొమ్మమాదిరిగా అయిపోయింది. ఒంటిమీద ఎక్కడ చూచినా నగలే. పురోహితము అంత లాభసాటి బేరముకాబోలును అని ఇరుగు పొరుగు వాండ్లు అనుకొన్నారు. కాని సుబ్బయ్యశాస్త్రి కొంచెము ఆశ్చర్యపడ్డాడు. ఆయన కన్నా సోమిదేవమ్మ మరీ ఆశ్చర్యపడిపోయింది. ఇంకా రోజులు గడిచేసరికి అవధానులు ఇండ్లు కొనడము మొదలుపెట్టినాడు. చైత్ర వైశాఖ మాసాలు వచ్చేసరికి కొత్తకొత్త మేడలూ, కొత్తకొత్త మిద్దెలూ కట్టించడము మొదలుపెట్టినాడు. అవధానుల ఐశ్వర్యము చూస్తే దొడ్డిలో ఏమయినా రూపాయిల చెట్టు వేసినాడా అనిపించింది. ఇట్టే చూస్తూ ఉండగానే అవధానులు ఒక్క లక్షరూపాయల స్థితిపరుడు అయిపోయినాడు. ఏది ఏమయినప్పటికిన్నీ సుబ్బయ్యశాస్త్రితో జాయంటు పురోహితము మాత్రము అవధానులు మానివేయలేదు.

అవధానుల ఐశ్వర్యానికి సోమిదేవమ్మ ఉండపట్టలేకపోయింది. అంత సొమ్ము వారికి ఎక్కడనుంచి ఎట్లా వచ్చింది అనేదే ఆమె జిజ్ఞాస. రాత్రింపగళ్ళూ అనేక రకాల ఆలోచించింది. అనేక విధాల ఊహలు చేసింది. కాని వాండ్ల ఐశ్వర్యానికి అంతు చిక్కలేదు. చివరకు సి.ఐ.డి. పనికి పూనుకొంది. ఆచూకీలు తీయడము మొదలు పెట్టింది. ఏమీ అంతుచిక్కలేదు. చివరకు ఏమీతోచక చెల్లెలును దబాయిండము మొదలు పెట్టింది. సోమిదేవమ్మ ధాకకు వెంకమ్మ తట్టుకొనలేక పోయింది. ఆ గుట్టు కాస్తా వెంకమ్మే వెళ్ళపెట్టింది.

సోమిదేవమ్మ నివ్వెరపోయింది.

అర్థరాత్రివేళ హఠాత్తుగా సోమిదేవమ్మ సుబ్బయ్యశాస్త్రిని నిద్రలేపింది. అతను కండ్లు నులుముకొంటూ నిద్ర లేచేసరికి "లేవండి, ఇంకా నిద్ర ఏమిటి? తెల్లవారవస్తూ ఉంది. పదండి గోదావరి స్నానానికి" అంటూ తొందరించింది. శాస్త్రి ఆకాశమువంక చూచినాడు. ఇంకా పొద్దు ఉంది. సోమిదేవమ్మ అతనిని నిలవనీయకుండా "పదండి, ఇకను ఆలస్యము చేయడానికి వీలులేదు" అంటూ ఆమె కూడా అతని వెంట గోదావరికి బయలుదేరడానికి సిద్ధము అవుతూ ఉంది. ఆమె ధోరణి అతనికి అర్థము కాలేదు. "ఏమిటి? ఈ గొడవ అంతా" అంటూ శాస్త్రి ప్రశ్నించినాడు. "ఏమీలేదు. కిందటి సంవత్సరము గోదావరి వరదలప్పుడు తెల్లవారుఝామున సూరావధానులు గోదావరిలో స్నానము చేస్తూ ఉండగా ఒక పెట్టె ప్రవాహములో కొట్టుకొని వచ్చింది. ఆ పెట్టెను అవధానులు పట్టుకొన్నాడు. దాని నిండా బంగారము ఉంది. అంతటితో ఆ రోజే మనతో పోట్లాడి లేచిపోయినాడు. ఆ తరువాత ఆ సొమ్ముతో నగలు చేయించడమూ, ఇండ్లూ వాకిళ్ళూ కట్టించడము మొదలుపెట్టినాడు ... ఇది శ్రావణమాసము. గోదావరికి వరద పట్టింది. పదండి" అంటూ సోమిదేవమ్మ శాస్త్రిని ఇంకా తొందరించింది.

సుబ్బయ్యశాస్త్రి ఒక్కనవ్వు నవ్వి "ఓసి వెర్రిదానా, వాడికి పెట్టె దొరికితే మనకూ దొరుకుతుందా" అన్నాడు. "ఇదిగో, ఇల్లాటి వెర్రి వేదాంతాలవల్లనే అంతా పాడుచేసి నారు" అంటూ గోదావరివరదవల్ల ఎంతమంది ఏ విధముగా అదృష్టవంతులు అయిందీ కథలు సోమిదేవమ్మ చెప్పింది. అతని మాట సాగనీయకుండా పెనిమిటిని గోదావరీ స్నానానికి అప్పుడప్పుడు నడిపించింది. తమ అదృష్టము కొద్దీ కొద్దిగానో గొప్పగానో లాభించి తీరుతుంది అనే సోమిదేవమ్మ నమ్మకము. అందువల్ల ఒక రాత్రివేళనే శాస్త్రిని నిద్రలేపి గోదావరీ స్నానానికి తీసుకొని పోవడము మొదలు పెట్టింది. ఒకరాత్రివేళనే గోదావరీ స్నానము చేయలేక శాస్త్రి ప్రాణము విసుగెత్తిపోతూ ఉంది.

శ్రావణమాసము అంతా అయిపోయింది. భాద్రపదమాసము వెళ్ళిపోబోతూ వుంది. గోదావరికి వరదపట్టింది. నదిలో దూలాలు మొదలయినవి కొట్టుకొని రావడము మొదలు పెట్టినవి. ఒక దూలాలే ఏమిటి – అడవులలో ఉన్న చెట్లూ ఆయా చెట్ల మీద నివాసము పెట్టుకొన్న కోతులూ, కొండముచ్చులూ ఇంకా ఆయా గ్రామాల బాపతు గొడ్డూ గోదా అహోరాత్రములూ ఆ అఖండ గోదావరిలో కొట్టుకొని వస్తూ ఉన్నవి. ఈ విధముగా ఆయా గ్రామాల బాపతు గడ్డివాములూ గుడిసెలూ ఆ నదీ ప్రవాహములో ప్రయాణమయి వస్తూ ఉంటే ఏదయినా పెట్టె తమకున్నూ దొరకవచ్చును అనే ఆశ సుబ్బయ్యశాస్త్రికిన్నీ పుట్టింది.

మామూలు ప్రకారము తెల్లవారుఝూమున భార్యాభర్తలు ఉభయులున్నూ గోదావరికి బయలుదేరినారు. దూరపు రేవుకు పోవడము మంచిదని ఇద్దరూ నిశ్చయించుకొన్నారు. ఇంకా తెల్లవారడానికి పొద్దువుంది. గోదావరి ఘడియ ఘడియకూ పొంగుతూ వుంది. మనుష్య సంచారము లేని రేవు వరకున్నూ కొంచెము ఇంచుమించు కోటిలింగాల క్షేత్రము వరకున్నూ ఆ దంపతులు అత్యుత్సాహముతో నడిచినారు.

ఇంకా చీకటి విచ్చిపోకపోయినా చాలా సేపటినుంచీ చీకటిలో ఉన్నందు వల్ల కండ్లకు ఆయా వస్తువులు గోచరిస్తూ ఉన్నవి. ఏమేమిటో వస్తువులు గంతులు వేస్తూ ఎగురుతూ ఆ ప్రవాహములో వస్తూ ఉన్నట్టు కనిపిస్తున్నవి. సోమిదేవమ్మ "ఇంకా ఆలస్యము ఎందుకు" అని శాస్త్రిని నదిలో దిగడానికి ప్రోత్సహించింది.

అతడు అత్యంతోత్సాహముతో అంగవస్త్రము కట్టుకొని గోదావరిలోకి ఒక్క దూకు దూకినాడు. ఒక్కమునుగు మునిగి లేచి నిలుచుని వెయ్యి కండ్లతో గోదావరినంతా చూస్తూ నోటితో "గంగేచ యమునేచైవ" అంటూ శ్లోకము చదువుతూ ఉన్నాడు.

ఒడ్డుకు కొంచెము దూరములో ఏదో నల్లటి పదార్థము మునుగుతూ తేలుతూ నదీ ప్రవాహములో వస్తూ ఉంది. వెయ్యి కండ్లతో గోదావరీ ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఒడ్డున ఉండి చూస్తూ ఉన్న సోమిదేవమ్మ "అదుగో అదుగో, నల్లచందుకా పెట్టె; పోయిపట్టుకోండి" అంటూ అరిచింది. అది అవునాకాదా అని శాస్త్రి చూస్తూ ఉన్నాడు.

"ఏమండోయ్ ఏదో ఆలోచిస్తున్నారు. ఇంకను ఆలస్యము చేయకండి. అది పోతుంది. పట్టుకోండి. పదండి" అంటూ ఆమె గోల పెట్టసాగింది.

"అది చందుకాపెట్టే అయి ఉంటుంది. అయితే అంత లోతుకూ పోగలనా లేదా అని ఆలోచిస్తూ వున్నాను" అంటూనే నదీగర్భములోకి శాస్త్రి చొరుచుకొని పోసాగినాడు.

"అయ్యో త్వరగా పొండి ... పోతూ ఉంది ... ఇంకా త్వరగా పొండి" అంటూ ఉన్న కేకలు మాత్రము శాస్త్రికి వినిపిస్తూ ఉన్నవి. రొమ్ములలోతు నీటిలోకి పోయినాడు. భార్య గొంతు మాత్రము వినిపిస్తూ ఉంది. దూరము అయినందువల్ల సోమిదేవమ్మకు శాస్త్రి విగ్రహము లీలగా కనిపిస్తూ ఉంది.

"ఏమండోయ్ పట్టుకొన్నారా?"

"చిక్కడము లేదు"

"త్వరగా పట్టుకోండి; ఉరవడికి చెయ్యి చిక్కకుండా పోయేను"

"ఇది పెట్టె కాదేమో ..."

"పెట్టే, పట్టుకోండి"

... ... ... ... ... ... ... ...

"పట్టుకొన్నారా  చిక్కిందా"

"ఇది పెట్టె కాదేవ్ ... ఏదో బొచ్చుగా ఉంది"

"బోనామ్ పెట్టెలెండి, తప్పకుండా పట్టుకోండి, లాక్కొని రండి"

"అమ్మ బాబోయ్ ..."

"ఏమిటండి"

"బాబోయ్ ... నేను వదిలినా నన్ను వదలడములేదేవ్ .. ఇక లాభంలేదు"

"ఏమిటండి"

"అణిచివేస్తున్నదేవ్ ... నా మీదికి ఎక్కిందేవ్ ..."

"ఏమిటండీ అదీ"

ఇక శాస్త్రి మాట పలుకు వినపడలేదు. "ఏమండోయ్ మాట్లాడరేమ్" అంటూ అరుస్తూ ఉంది. చీకట్లు విచ్చుతూ ఉన్నవి. ఆ నల్లటి పదార్థము తెప్ప కొయ్యమీద స్వారీ చేస్తున్నట్టుగా సోమిదేవమ్మకు కనిపించదు. ఎంత అరచినా పిలిచినా సుబ్బయ్యశాస్త్రి గొంతులోనుంచి మాటలేదు. క్షణలేశములో సోమిదేవమ్మ కంగారుపడి పోయింది. ఇంతలో పల్లెవాండ్లు వలలతో రేవుకు వస్తూ ఉన్నారు. చూచింది. "ఏమండోయ్ పలకరేమ్" అంటూ దిక్కులు పిక్కటిల్లిపోయేట్లు పొలికేకలు పెట్టి అరిచింది. ఏడ్చింది.

సంగతి సందర్భాలు పల్లెవాండ్లు విచారించినారు. ఒక్కసారిగా పదిమంది గోదావరిలోకి దూకినారు. వాయువేగముతో పోయి, తెప్ప కొయ్యమీద తేలిపోతూ ఉన్నట్టు కనపడుతున్న నల్లటి పదార్థాన్ని ఒడ్డుకు లాగుకొని వచ్చినారు.

అది సజీవముతోవున్న ఎలుగుబంటి. దానికి సుబ్బయ్యశాస్త్రి తెప్పకొయ్య అయినాడు, పాపము!

**కథా నేపథ్యం ...**

ఈ రచయిత అసలు పేరు కరణం శ్రీనివాసరావు. డెబ్బై ఏళ్ళకిందట ఆంధ్రపత్రికలో వాల్మీకి రామాయణం వీరి రామాయణ వచనం వేలాది పాఠకులను ఆకర్షిస్తూ ధారావాహికంగా వెలువడింది. ఈ రామాయణం ఇప్పటికి పదిసార్లు పునర్ముద్రణం పొందింది. ఇట్లా శ్రీనివాస శిరోమణి 20వ శతాబ్ది ఉత్తరార్థంలో పాఠక బాహుళ్యాన్ని సముపార్జించుకున్నాడు. శుద్ధ వ్యావహారిక భాషలో వేగవంతమైన శైలిలో వాల్మీకిని యథాతథానువాదంగా అనువదించినందువల్ల ఈయనకు బాగా పేరు వచ్చింది. ఈయన తొలితరం తెలుగుకథా రచయితలలో ప్రతిభాశాలి అని ఈతరం తెలుగు పాఠకులకు తెలియదు. గిడుగురామమూర్తి పంతులుగారి వ్యవహారిక భాషా సిద్ధాంతాన్ని ఆచరణ పథంలో సృజన రచనలకు వినియోగించి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిలాగా పాఠకుల మెప్పుపొందిన కథారచయిత శ్రీనివాసరావు. పౌరోహిత్యవర్గాల వారి ధనలాలసత, ఆచార, సంప్రదాయ దౌష్ట్యం ఈ కథలో దయనీయంగా వర్ణిత మైనాయి. వేదాంతం వల్లిస్తూ వడ్డీ వ్యాపారం చేసే మనస్తత్వం, ధనాశా, అత్యార్జనా పరత్వం ఈ కథలో శ్రీనివాస శిరోమణి వేళాకోళం చేశాడు.

# 28. యేప్రిల్ ఒకటవతేదీ

– కాళూరి వేంకటరామారావు

### 1

**తూ**ర్పు తీరపు క్రైస్తవ సంస్థలలోకల్లా 'ఫాదిరిగుడి' చాలా పురాతనమైనది. ఈ స్థలం పూసపాటివారి విజయనగరాని కారుమైళ్ళదూరంలో వుంది. క్రీ.శ. 1750 ప్రాంతములందే రెవరెండు జాన్సన్ అనే క్రైస్తవ మత ప్రచారకుడు వచ్చి ఆ సంస్థను నిర్మించాడు.

ఫాదిరిగుడి కట్టబడిన ప్రదేశం బహురమణీయమైనది. ఆ స్థలానికి ఏభైగజాల దూరంలో 'చంపావతి' అనే చిన్న నది ఉంది. నది చిన్నదైనా మండువేసవిలో కూడా మోకాలు లోతు స్వచ్ఛజలం ప్రవహిస్తూ ఉంటుంది. జాన్సన్‌దొర ఆ ప్రదేశ సౌందర్యాన్ని చూసి అక్కడే తన సంస్థకి పునాదిరాయి వేశాడు. చుట్టుపక్కల చిన్న చిన్న పల్లెలు అనేకంగా ఉండడంచేత తన మతప్రచారానికి కూడా అదే మంచి స్థలం అనుకున్నాడతడు.

ప్రస్తుతం మన కథాకాలం నాటికి ఇరుగుపొరుగు గ్రామాల మాలవాళ్ళలో సఖం మందికి పైగా క్రైస్తవులైపోయారు. నూతన మత స్వీకారము వల్ల ఆచార వ్యవహారాలు మారకపోయినా పేర్లు మాత్రం పూర్తిగా మారిపోయాయి. పూర్వపు స్వామి గాళ్ళందరూ ఇప్పుడు 'శామ్యూల్స్' అయినారు.

నాడు మొదలు ఆ సంస్థ దినదినాభివృద్ధిని పొందుతూ వచ్చింది. ఇప్పుడక్కడ ఇరవైమంది మత ప్రచారకులూ, ఒక ప్రధానాధికారీ ఉన్నారు. ఆ ప్రధానాధికారినే ప్రజలు 'ఫాదిరీ' అని పిలుస్తారు. అతన్నిబట్టే ఆ సంస్థకి 'ఫాదిరిగుడి' అనే పేరు వచ్చింది.

సంస్థకి మధ్యగా ఎత్తయిన గోపురాలతో చర్చి ఉంది. దాని చుట్టూ బారులు తీర్చి ప్రచారకుల గృహములున్నాయి. చర్చికి ముందుగా ఫాదిరీగారి మేడ ఉంది. ఆ మేడపక్కనే పాఠశాల. ఉపాధ్యాయులిద్దరికీ రెండు బంగాళాలు ఉన్నాయి. వీరినందరినీ

ఆశ్రయించుకుని ఒక వర్తకుడు చిన్న దుకాణం పెట్టుకున్నాడు. ఈ యిళ్ళన్నీ కలిసి ఒక చిన్న గ్రామమైనది. గ్రామానికంతటికీ కూడా 'ఫాదిరిగుడి' అనే వాడుక నామము.

సుశీల మేనమామ విద్యార్థిగా నున్నప్పుడే క్రైస్తవమతంలో కలిసిపోయాడు. అతని నూతన నామము 'శిఖామణి'. విద్య పూర్తికాగానే మిషన్‌వారు అతన్ని మంచి జీతముపైని ప్రచారకుడుగా నియమించారు. క్రమంగా అతడు ఫాదిరిగుడిలో ప్రధాన ప్రచారకుడైనాడు. మిగిలిన ప్రచారకులంతా అతని ఆజ్ఞప్రకారమే నడిచేవారు. ప్రచారక కార్యక్రమమును అతడే నిర్ణయించేవాడు. ఇది 1910 సం॥ నాటి మాట.

1910 సం॥ నాటికి సుశీలకు పదమూడోయేడు. విజయనగరంలోని మిషన్ బాలికా పాఠశాలలో మూడవఫారం చదువుతూఉండేది. ఆ బడిలో పై తరగతులలో మతబోధ చెయ్యడానికి శిఖామణి ఫాదిరిగుడి నుంచి వారానికి మూడుసారులు విజయనగరం వెళుతూ ఉండేవాడు.

నాటికీ నేటికీ కూడా అగ్రవర్ణాలలో మనుష్యులను క్రైస్తవ మతంలో చేర్చగలిగిన ప్రచారకులకు ఎక్కువ పేరూ ప్రతిష్ఠా ఉంది.

శిఖామణి తన తెలివితేటలవల్ల త్వరలోనే ప్రధాన ప్రచారకుడైపోయాడు. విద్యార్థులకు నచ్చచెప్పడానికి తగిన వాక్చాతుర్యం అతని దగ్గరఉంది. వచ్చీరాని జ్ఞానం గల పిల్లలు అతని మాటలను దివ్యతత్వబోధగా భావించుకునేవారు. మిషన్ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు అతనివల్ల మత స్వీకారమొందినవారే.

తన వాక్చాతుర్యమువల్లనూ, మేనగోడలు దగ్గిర ఉండే చనువువల్లనూ శిఖామణి సుశీలమనసును తిప్పగలిగాడు. హిందూమతం కేవలం మూఢాచారాలపైని ఆధారపడి ఉందనీ, విగ్రహారాధకులకి ముక్తి లేదనీ, క్రైస్తవమతంలో ఎంత పతితులనైనాసరే ఉద్ధరించగలవాడు క్రీస్తు మహానుభావుడు ఉన్నాడనీ అతను ఆ అమ్మాయికి బోధించాడు. పై విషయాలేగాక ఇహలోకంలో కూడా ప్రభుత్వానుగ్రహం సంపాదించి అభివృద్ధి పొందాలంటే క్రైస్తవమతమే శరణ్యమని చెప్పాడు. విద్యాభివృద్ధీ, స్త్రీ స్వాతంత్ర్యమూ హిందూమతంలో దొరకవని వాదించాడు.

మేనమామ మాటలకి సుశీల పొంగిపోయింది. పద్నాలుగు సంవత్సరాలైనా పూర్తిగా నిండకపూర్వమే ఆమె క్రైస్తవమతంలో కలిసిపోయింది. తండ్రి వచ్చి అడిగినప్పుడు 'నేను మామయ్యతోనే ఉండిపోతాను' అని నిశ్చలంగా జవాబు చెప్పేసింది.

నాడు మొదలు ఆమె తండ్రిగారింటికి మరి వెళ్ళనూ లేదు. ఆమెను వారు పిలవనూ లేదు. అత్యనురాగంతో మేనమామ ఆమెను పెంచి పెద్దదాన్ని చేశాడు. ఫాదిరిగుడిలో మేనమామగారింట్లోనే ఆమె ఉండిపోయింది.

ఫాదిరిగుడిలోనే 'పంచానన్' అనే ప్రచారకుడొకడుండేవాడు. విశాఖపట్నం జిల్లాలోనే ఒక పల్లెటూరు కాపురస్థుడతడు. అతడు క్రీస్తు శిష్యుడయి పాతికేళ్ళయింది. అతనికి ముగ్గు కొడుకులు, అందులో చిన్నవాడిపేరు 'గజానన్'.

సుశీల స్కూలు ఫైనలు పూర్తి చెయ్యగానే ఆమెకీ గజానన్‌కీ వివాహం జరిగింది. శిఖామణి బతికిఉండగా అతడు ఈ వివాహం చేశాడు. సంతానహీనుడవడంచేత తన యావదాస్తినీ శిఖామణి మేనగోడలుకే యిచ్చేశాడు. గజానన్ అప్పటికి చెన్నపట్నంలో ఇంజనీరింగు కళాశాలలో విద్యార్థిగా ఉండేవాడు. పెళ్ళి అయిన రెండేళ్లకే శిఖామణి చనిపోయాడు.

మేనమామ చనిపోవడంతోనే అతని స్తానంలో వచ్చిన వేరొక ప్రచారకుడికి ఇల్లు కాళీచేసి సుశీల అత్తవారింటికి పోవలసివచ్చింది. అప్పుడు వేసవి సెలవులగుటచే గజానన్ ఇంటిదగ్గరే ఉన్నాడు. దంపతులకు సెలవురోజులు హాయిగా గడిచిపోయాయి. భర్త మళ్ళీ చెన్నపట్నం వెళ్ళేరోజు సమీపించినకొద్దీ తను ఒంటిగా ఉండవలసి వస్తుందన్న భయం సుశీలకి అధికమైంది. తల్లిదండ్రులకు దూరమైనా మేనమామవద్ద ఆమె సుఖించింది. ఇప్పుడతను కూడా లేడు.

తోడికోడళ్ళందరిలోనూ సుశీలయే ధనవంతురాలూ, విద్యావంతురాలూ, రూపవతీకూడాను. వచ్చిన కొన్నినెలలవరకూ ఇంట్లోవాళ్ళందరూ ఆమెను అధికాదరంతో చూసేవారు. క్రమక్రమంగా తోడికోడళ్ళలో అసూయ బయలుదేరింది. కొత్తగా వచ్చిన సుశీలను అత్తగారు ఎక్కువ ప్రేమతో చూడ్డం వారు సహించలేక పోయారు.

అన్నదమ్ములలో కూడా కొంత విరోధభావం లేకపోలేదు. పెద్దవాళ్ళిద్దరూ సామాన్యవేతనముల మీద మత ప్రచారకులుగా ఉన్నారు. విద్యాధికుడై, కొద్ది కాలములో గొప్ప ఉద్యోగము చేయడానికి సిద్ధంగా ఉన్న గజానన్ యెడల వారిద్దరికీ ఏమంత మంచి అభిప్రాయాలు లేవు.

ఇంట్లో పార్టీలు ప్రారంభమవడానికదే మొదలు. తోడికోడళ్ళిద్దరూ ఒకటీ, సుశీల ఒకర్తే ఒకటీ అయిపోయారు. అత్తగారికీ సుశీలకీ మధ్య మిత్రభేదము

కలిగించడానికి వాళ్ళు విశ్వప్రయత్నమూ చేశారు. ఒకనాడు సుశీల వసారాలోనించి వస్తూ 'మీకు మరదలు మీద అంత ప్రేమ ఉంటే ఇంక మేమెందుకూ! మమ్మలిని పుట్టింటికి పంపించేస్తేసరి' అని రెండో తోటికోడలు భర్తతో అంటూ ఉండగా విన్నది.

ఈ మాటలకామె అదిరిపడినది. తనపైని బావగారు చూపిస్తూ ఉన్న అనురాగ మేమిటో ఆమెకు బోధపడలేదు. ఆమాటలలోని గూఢార్థానికామె గడగడలాడి పోయింది. తోడికోడళ్ళకి తన మీద ఆగ్రహానికి కారణం ఆమె గ్రహించలేకపోయింది.

నానాటికి తోడికోడళ్ళలోని విరోధభావాలు బాహాటంగా పైకి రాసాగినవి. అత్తగారితో కలిపించి నేరాలు చెప్పడమూ, 'ఊ' అంటే చాలు ఇద్దరూ ఏకమై దెబ్బలాటకి రావడమూ మొదలు పెట్టారు. స్నేహంగా ఉండాలని ఆమె చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయిపోయాయి.

చెప్పుడుమాటలు ప్రమాదకరమైనవి. కోడళ్ళు నిత్యమూ చెవుల్లో నూరిపొయ్యడం వల్ల ముసలావిడకి బుద్ధి తిరిగిపోయింది. ఇదివరకల్లా స్వర్గంనుండి దిగివచ్చిన దేవతలాగు కనబడే సుశీల ఇప్పుడు పరమదుర్మార్గులైపోయింది. కోడళ్లతో కూడా అత్తగారు కలియడంవల్ల సుశీల జీవనం దుర్భరమైపోయింది. కష్టసుఖాలు చెప్పు కోడానికి భర్తకూడా దగ్గిరలేకపోవడమామెకు మరీ బాధగా ఉంది.

ఇన్నాళ్ళకామెకు తన దుస్థితి గోచరించింది. తల్లి గతించినలోటు ఆమెకిప్పటికి కనబడింది. అన్యమత స్వీకారమే కారణంగా తండ్రీ తానంటే మండిపడేవాడు. బంధువు లెప్పుడూ తన వేపు చూడనైనా లేదు. కన్నకుమార్తెవలె తన్ను పెంచిన మేనమామని తలుచుకుని ఏడవని రోజే ఆమెకు లేదు. పగటివేళ పనిపాటల్లో పొద్దుపోయినప్పటికీ రాత్రి పడేసరికామెకు తన నిస్సహాయస్థితి వేయిరెట్లు బలవత్తరంగా కనబడి నిద్రపట్టనిచ్చేది కాదు.

తన పరిస్థితులను వివరిస్తూ సుశీల భర్తకొక జాబు రాసింది. తన్ను కూడా చెన్నపట్నం తీసుకుపొమ్మని అందులో భర్తను ప్రార్థించింది.

మరికొన్ని రోజుల్లో క్రిస్మసు సెలవులకి గజానన్ ఇంటికొచ్చాడు. అయిదారు రోజులు సౌఖ్యంగా గడచిపోయాయి. ఈసారి వెళ్ళేటప్పుడు సుశీలను తనతో కూడా తీసుకెళ్ళడానికతడు నిశ్చయించుకున్నాడు. ప్రయాణపుదిన మెప్పుడొస్తుందా అని సుశీల కనిపెట్టుకుని చూస్తూంది. ఇంట్లోవాళ్ళబాధ ఆమెకు నానాటికీ హెచ్చైపోతూంది.

ప్రతిరోజూ అత్తగారు తన మీద నేరాలను భర్తతో చెబుతూ ఉండడమామె చూస్తూనే ఉంది. భర్త సద్భావముపైగల నమ్మికచేతనూ, త్వరలో చెన్నపట్నం పోయి సుఖపడ వచ్చును కదా అనీ ఆమె సహించి ఊరుకుంది.

**2**

ప్రయాణానికింక రెండు రోజులు మాత్రం వ్యవధి ఉంది. అవసరములైన సామానుల నన్నిటినీ సుశీల సర్దుకుంది. ఆమెకాయింట్లో గడియ ఒక యుగములాగు తోస్తూంది.

రాత్రి ఎనిమిదిగంటలవుతుంది. చలి విపరీతంగా వేస్తూంది. ఫాదిరిగుడి అంతటా నిశ్శబ్దము. గాఢాంధకారము కన్ను పొడుచుకున్నా కానరాకుండా ఉంది. తూర్పుగాలినించి జీవకోట్లు వడవడ వణికిపోతున్నాయి.

ఇంట్లోపనులు పూర్తిచేసుకుని సుశీల గదిలోకి వెళ్ళింది. భర్తగదిలో లేకపోవడం చూసి ఆమె ఆశ్చర్యపడింది. 'ఇలాంటి చలిలో ఎక్కడికెళ్ళారో' అనుకుంటూ ఆమె ఒక పుస్తకం పట్టుకుని కిటికీలను మూసేసి దీపం దగ్గిరకూచుని చదువుకుంటూంది.

రమారమీ పదిగంటలయేసరికి గజానన్ తలుపు తెరుచుకుని లోపలకొచ్చాడు. రాగానే బల్లమీది గ్లాసులో మంచినీళ్ళు తాగి తనుకూడా ఒక కుర్చీలో కూచున్నాడు. అతడు సుశీలవంక చూడనైనా లేదు. దీర్ఘాలోచనలో మునిగి అలాగే కూచున్నాడు.

ఆనాటి అతని ప్రవర్తన సుశీలకి వింతగా తోచింది. చదువుకట్టిపెట్టి భర్తని చూసి ఆమె 'చాలా రాత్రి అయింది. పడుకోకూడదూ? ఏమిటా ఆలోచన?' అంది.

ఆ గదిలో ఇంకొకరున్నట్లు అతనికప్పటికి తోచింది. తలయెత్తి సుశీలముఖం వేపు తీక్షణంగా చూశాడు. అతని ముఖం ముణుచుకుపోయి ప్రసన్నతని సూచించడం లేదు. సుశీల కతని వైఖరి చూసేసరికి భయం వేసింది. 'వంట్లో బాగులేదుకాబోలు? పడుకుంటే సరి. అలాంటప్పుడు వీధిలోకి వెళ్లపోతేయేం?' అని మధురంగా అన్నది.

జవాబు లేదు. సుశీలనుండి దృష్టి మళ్ళించుకుని కొంచెం దగ్గాడు. ఏదో మాట్లాడబోతూన్నట్లూ, అందుకు కంఠం సవిరించుకుంటున్నట్లూ స్పష్టపడుతూంది. అది చూసి సుశీల మళ్ళా 'ఏమిటో ఇదంతా చూస్తే నాకు భయం వేస్తూంది. కొంచెం సంగతి తెలియనియ్యకూడదూ?' అంటూ దగ్గిరగా వచ్చి నిల్చుంది.

నేలమీది చూపులని మళ్ళా భార్య వేపు తిప్పి గజానన్ చెప్పడం ప్రారంభించాడు. 'ఇదుగో నే చెప్పేది విను. ఈ సంభాషణ నాకూ కష్టంగానే ఉంది. కాని చెప్పక తప్పదు. నేనింతసేపూ మా అమ్మ దగ్గిరే ఉన్నాను. ఇన్నాళ్ళూ నీ విషయమై ఏమో అనుకున్నాను గాని నేటితో నా సందేహాలు తీరిపోయాయి. మల్లెచెట్టులో కూడా విష సర్పాలుంటాయని అనుభవం చాలకపోవటం చేత నేను ఇంతవరకూ గ్రహించలేదు. మానవులకి గుణం ప్రధానం కాని రూపంకాదన్న పెద్దలమాట వృధాకాదు. నీ దుర్బుద్ధుల వల్ల మా తల్లి దండ్రులకి దుఃఖం కలిగించడానికి నిన్నిక్కడ ఉంచలేదు. నీ సౌందర్యం చూసి మోసపోయినట్లు ఇప్పటికేనా కళ్ళు తెరిచి తెలుసుకున్నందుకు సంతోషిస్తున్నాను. నీ ప్రవర్తన వల్ల కుటుంబానికి కూడా కళంకం వస్తున్నప్పుడు నేను సహించి ఊరుకోలేను".

శూలపుపోటులై బాధించాయి సుశీలను ఈ మాటలు. వాటి అర్థం ఆమెకి తెలియలేదు. ఆమె తల తిరిగిపోతూంది. ప్రపంచకంలో రెండో దిక్కేలేక, ఎన్నడో భర్తవచ్చి తన కష్టాలు గట్టెక్కిస్తాడుకదా అని గంపెడాసతో ఉన్న ఆమె, ఈ మాటలతో ప్రపంచకం ఒక్కసారిగా కూలిపోతున్నట్లయింది.

భర్తకి ఏ జవాబు చెప్పడానికీ ఆమెకు తోచలేదు. ఆమెనోట తడి ఆరిపోయి మాటరాలేదు. నిలువునా నేల మీద పడిపోవడానికి సిద్ధమయింది. పక్కనే ఉన్న కుర్చీని ఆనుకుని ఆమె మెల్లిగా కూచుంది. దీనాతిదీనములై ఆమె దృష్టులు భర్త వేపు తిప్పబడి ఉన్నాయి.

గజానన్ మళ్ళా చెబుతున్నాడు, 'ఈలాగ్గా నిన్ను వదిలిపెట్టిపోవడం నాకూ కష్టంగానే ఉంది. కాని ఇంటికి అప్రతిష్ఠ వచ్చేటప్పుడింకవీల్లేదు. ఈ జన్మంలోనే ఇంక మనకి సంబంధం ఉండకపోవచ్చు. నీమీద నేను పెట్టుకున్న ఆశలన్నీ వ్యర్థములై పోయాయి. నేను రేపే చెన్నపట్నంపోతున్నాను. నువ్వు నీ యిష్టం వచ్చినచోటికి పోవచ్చు. నువ్వీయింట్లో ఉండగా మాత్రం నేను ఇక్కడికి రాను' అంటూ కుర్చీమీదనుంచి లేచాడు.

ఏమేమో చెప్పదల్చుకుంది సుశీల. కంఠం రుద్ధమైపోయి మాటరానియ్యలేదు. బెదురుచూపులతో భర్తవంక చూసింది. ప్రార్థనాపూర్వకంగా చేతులుజాచి అతని కాళ్ళను పట్టుకుంది. ప్రయత్నంమీద ఎలాగో 'అయ్యో! నే చేసిన తప్పేమిటి; నాకేది దారి?' అని మాత్రం అనగలిగినది. ఆ మాటల్లోనే ఆ హృదయగతమైన విషాదభారము

పరిస్ఫుటమవుతూంది. భార్య పలుకులు గజానన్ చెవికెక్కలేదు. నిముషంలో భార్య పట్టువిడిపించుకుని ఏ జవాబూ చెప్పకుండానే అతడు గది అవతలకిపోయాడు. సుశీల అలాగే నేల మీద పడిపోయింది. నాటిరాత్రి ఆమె హృదయాన్ని కలచివేసిన భావాలను వర్ణించడాని కెవరితరం? తల్లిని తలుచుకుని ఆమె యెంతసేపో యేడిచినది. తన ప్రస్తుత కష్టాలకి బుద్ధిపూర్వకంగా కాకపోయినా కొంతవరకు కారకుడైనప్పటికీ తన్ను అంత ప్రేమతో పెంచిన మేనమామ లేనందుకు ఆనిర్మల హృదయము ఎంత క్షోభించి పోయిందో ఊహించలేము.

జరిగినదంతా ఒక భయంకర స్వప్నంలాగు ఆమెకు పొడగట్టింది. లేవబోయింది కాని శక్తి చాలలేదు. 'ఈ అర్ధరాత్రివేళ నేను నిస్సహాయనై ఎక్కడికి పోగలను? నన్నాదరించేవారెవరున్నారు? ఎంత ద్రోహికైనా సరే నేరం తెలియచేసి చెప్పుకోడానికి అవకాశమిస్తారుకదా. ఆ అపరాధమేమిటో తెలియచెయ్యకుండానే, నామాటలేనా వినకుండానే పైకిపోతే నేనేం చేసేది? ఇంత కఠిన ప్రవర్తనను సహించినా గుండెలు బద్దలైపోవేమి? నా ప్రేమకీ, నేను చూపించిన విశ్వాసానికీ ఇదే కాబోలు ప్రతిఫలము? తండ్రీ! ఈ పరీక్షకి నేను ఆగలేను' అని నిట్టూర్పుపుచ్చి అల్లాగే పడుకుంది.

తెల్లవార్లూ ఆమె కళ్ళు తెరుచుకునే వున్నాయి. వెయ్యి ఆలోచనలు ఆ తలలో తిరిగిపోయాయి. నాడు తోడికోడలు భర్తతో అంటూ ఉండగా తాను విన్న మాటల అర్థ మామెకిప్పుడు బోధపడింది. నిరంతరకేంద్రీకృతమవడంచేత మెదడు వేడెక్కి సుశీలకు తలనొప్పి వచ్చింది. భర్త తిరిగీగదిలోకి వస్తే తన నేరం తెలుసుకుని, సాధ్యమైనంతవరకూ తన నిర్దోషిత్వమును రుజువు చేసుకుందామని ఆమె తన భావాలను సవరించుకుంటూ కనిపెట్టింది. కాని ఆమెను నిరాశయే యెదురుకున్నది.

సుశీలకీ తోడికోడళ్ళకీ వివాదము జరిగేటప్పుడు బావగార్లిద్దరూ సుశీలపక్షమే వహించి వాళ్ళనే మందలిస్తూ ఉండేవారు. దానితో అసలు విరోధాలకు తోడు స్త్రీ సహజమైన ఈర్ష్య ఎంతపనికేనా వెనకతియ్యదుకదా!

సుశీలపైని పగతీర్చుకోవాలనే అభిప్రాయంతో వాళ్ళొక పన్నాగమును ఆలోచించారు. సుశీల తమ భర్తలను వశపరిచేసుకుందని వాళ్ళు అత్తగారితో చెప్పి లేనిపోని విచారమును ప్రదర్శించడం ప్రారంభించారు. 'ఏ సంబంధమూ లేకపోతే ప్రతి విషయంలోనూ బావగార్లు మరదలి పక్షమేమిటి? మీరు తగిన కట్టుదిట్టం చెయ్యకపోతే మా కాపురాలకు నీళ్లు వదులుకోవలసిందే' అని నిత్యమూ ఆమె ముందు గోలపెట్టేవారు వాళ్ళిద్దరూను.

బాల్యంనుంచీ సుశీల స్వాతంత్ర్యాభిలాషగల పిల్ల. స్త్రీ స్వాతంత్ర్యమునకు అవకాశముందనే ఆమె క్రైస్తవమతమును స్వీకరించింది.

సుశీల బావగార్ల దగ్గిర అతి చనువుగా తిరుగుతూ ఉండేది. మేనమామ వద్దకు వస్తూ ఉండేటప్పుడు చిన్నప్పటినుంచీ వారినామె ఎరుగును. భయానికీ, ఇతరులేమను కుంటారో అన్న అనుమానానికీ ఆ నిష్కల్మష హృదయంలో తావులేదు.

అందుచేత ఇంటి అందరిదగ్గరా తిరిగినట్లే ఆమె బావగార్లతో కూడా స్వేచ్ఛగా మాట్లాడుతూ, నవ్వుతూ చనువుగా సంచరించేది. కోడళ్ళు చెబుతూవున్న దానికీ సుశీల నడవడికీ సరిపోయిందనుకుంది స్వేచ్ఛావాసన ఎరుగని ముసలావిడ.

నాటి సాయంకాలం నించీ గజానన్‌కీ తల్లికీ ఈ విషయమైన సంభాషణయే జరుగుతూంది. కుమారుడు చెన్నపట్నంనించి రాగానే చెప్పాలని కనిపెట్టుకుని కూర్చుంది ఆవిడ. తను చెప్పబోయే మాటల దుష్ఫలితాన్ని గ్రహించలేకపోయిందామె. 'నీ అన్నగార్లున్న చోట నీ భార్య ఉండకూడదు. అది ఉండే స్థలంలో నీ అన్నగార్లుండ కూడదు. నీతోకూడా చెన్నపట్నం దాన్ని తీసుకుపోకపోతే కుటుంబానికి తీరని అప్రతిష్ఠ రాకమానదు. నీ భార్య ప్రవర్తన బాగులేదు' అని ఆమె గజానన్‌తో చెప్పేసింది.

అందుపైని తల్లికీ కొడుక్కీ చాలా దూరము వాదన జరిగినది. తన వాదన నిలబెట్టుకోవాలని ముసలావిడ ఎన్నెన్నో నిదర్శనాలు చెప్పింది. ఇవన్నీ విని కుమారుడు భార్యని తనతోకూడా తీసుకుపోతాడని ఆమె అభిప్రాయము. కాని ఇంతదూరం జరుగుతుందని కలలోనూ యెరుగదు.

గజానన్ లోతు గుండెగల మనిషి. తల్లిమాటలతో అతని తల తిరిగిపోయింది. అన్నగార్లకూ భార్యకూ ప్రేమ ఏర్పడిపోయిందని అతను పూర్తిగా నమ్మేశాడు. ఆ సాయంకాలమతనికి భోజనం రుచించలేదు. తీవ్రంగా ఆలోచించాడు. సుశీలతో సంబంధం తెంపేసుకోడానికి నిశ్చయించేశాడు. తరవాత సంగతి మనకి తెలిసినదే.

**3**

తెల్లవారిపోయింది. కోడికూత వేళ నించీ దట్టమైన పొగమంచు కమ్మి గజం దూరంలోఉన్న వస్తువులను కూడా స్పష్టంగా కనబడనియ్యడంలేదు. ఉదయం తొమ్మిది వరకూ సూర్య దర్శనం కాలేదు. మామ్మూలుగానే సుశీల గృహకృత్యాలు నిర్వర్తిస్తూంది. తగిన సమయంచూసి భర్తతో మాట్లడ్డానికామె నిశ్చయించుకుంది. కాని అతడు తన్ను

తప్పించుకుని తిరగడం చూసి ఆమె దుఃఖము మితి మీరిపోయింది. సుశీల ఉన్నట్లయితే ఎంత అవసరమైన పనిఉన్నా మానుకునేవాడు కాని అతడా గదిలోకి అడుగుపెట్టేవాడు కాడు.

గజానన్ కూడా పూర్తిగా మారిపోయాడు. అతని సంతోషము మాయమయి పోయింది, ఎవరితోనూ మాట్లాడడు. ఎప్పుడూ దీర్ఘాలోచనే! షికారు కూడా మానేశాడు. భార్యతో చెప్పినట్లు అతడా మర్నాడే చెన్నపట్నం వెళ్ళలేదు. కాని ఉన్న రెండురోజుల్లోనూ ఆమెను తప్పించుకునే తిరిగేవాడు.

చెప్పుడు మాటల విషమతనికి పూర్తిగా ఎక్కిపోయింది. సుశీల గుణవంతురాలని అన్నగార్లిద్దరూ చాలా దూరం చెప్పారు. వాళ్ళు చెబుతూ ఉన్నకొద్దీ అతనికి మరింత కోపం ఎక్కువైపోయింది. వాళ్ళతో మాట్లాడ్డం కూడా మానేశాడు చివరికి.

ఇంత ప్రమాదం సంభవిస్తుందని ముసలావిడ అనుకోలేదు. ఆమె తన తొందర పాటువల్ల వచ్చిన విపరీతమును చూసి హడిలిపోయింది. గజానన్‌తో భార్యను విడిచి పెట్టడం పాపమనీ సుశీలకి చిన్నతనమనీ ఏదో సర్దిచెప్పబోయింది. ఒక్క కసురుతో ఆమె అదిరిపడి దుఃఖపడుతూ మరి చెప్పడం మానుకుంది.

అసలు గజానన్ భావోద్రేకంకల మనిషికాడు. అత్యధిక సంతోషం కానీ, విచారం కాని ప్రదర్శించేతత్వం కాదు. సుశీలనతడు మనసారా ప్రేమించాడు. విచ్ఛిన్న మయిపోయిన ప్రేమతోపాటతని హృదయము బద్దలైపోయింది. ఉన్న రెండురోజులూ అతడు ఒంటిగానే తన దుఃఖాన్ని అనుభవించాడు. నిట్టూర్పులతోనూ, కన్నీళ్ళతోనూ అతని ముఖం వాడిపోయింది. పెదవులు మాత్రం కదిలేవికావు. ఆ రెండురోజుల్లోనూ ఒక్కసారి అగ్నిపర్వతం పేలినట్లుగా 'ఛీ! ఇంకా నాకు అన్నదమ్ములెక్కడ? నా జీవితాన్ని బుగ్గిచేసిన రాక్షసులు వీళ్ళు' అనే మాటలు అప్రయత్నంగా అతని నోటినుండి వచ్చాయి. మళ్ళీ భయంకర మౌనమే.

సుశీల యెడల ఎన్నడూ గజానన్ కఠినుడుగా ఉండలేదు. ఇంతలో భర్త యిల్లా మారిపోయినందుకు సరియైన కారణం ఊహించలేక సుశీల నిస్సహాయురాలై తనలో తనే ఏడ్చుకుంది. చివరికి గజానన్ చెన్నపట్నం వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు కూడా తుదిమాటగానైనా భార్యతో ఏమీ చెప్పలేదు. అంతవరకూ తమ నేరం కనబడకుండా ప్రవర్తించిన తోడికోడళ్ళు మళ్ళా విజృంభించి ఆమెను సాధించడం మొదలెట్టారు.

ఇల్లా పదిరోజులు గడిచాయి. సుశీల గతి రోజుకి రోజూ హీనమయిపోతూంది. చివరకామె భర్తకొక సుదీర్ఘమగు జాబు రాసింది. ఎంత కఠిన హృదయాన్నైనా కరిగించేటంత జాలికరంగా ఉంది ఆ జాబు.

ప్రత్యుత్తరానికి నిరీక్షిస్తూ దినమొక యేడాదిగా సుశీల మరి పదిరోజులు గడిపింది. ఎట్టకేలకు జాబు వచ్చింది. ఉత్తరంపైని సుశీల విలాసమే ఉంది. పోస్టు మనిషి సాయంకాలమే ఉత్తరం ఇచ్చాడు.

వెంటనే జాబును చదవడానికామెకి ధైర్యం చాలింది కాదు. దానిపైనే తన భావి జీవితమాధారపడి ఉన్నట్లామెకు తెలుసును. రాత్రి ఒంటరిగా గదిలో చూడాలని ఆమె నిశ్చయించుకుంది.

సృష్టిశోభ యావత్తూ పశుపక్ష్యాది జీవకోట్ల మీదనే ఆధారపడి ఉంది. క్రమ క్రమంగా సూర్యుడస్తమించాడు. జీవరాసులు విశ్రాంతి నిమిత్తము పట్లు చేరిపోవడంచేత ప్రపంచకం కళారహితమయిపోయింది.

ఇంట్లో పనులు ముగించుకొని సుశీల గదిలో ప్రవేశించేసరికి రాత్రి పదిగంట లయింది. భర్త రాసిన జాబు బల్లమీద ఉంది. చదవడానికి తీసేటప్పుడు ఆమెచేతులు వణికిపోయాయి. జాబు నేలమీద పడిపోయింది. తీసుకోడానికామె వంగినది. కాని కదులుతూ వున్న త్రాచుపాములాగు ఆ కవరు భయము గొల్పడం చేత మళ్ళీ వెనక్కి తప్పుకున్నది.

ఎల్లాగో ధైర్యం తెచ్చుకుని కొంతసేపటికి తలుపులన్నీ మూసేసి, కవరును చింపి ఉత్తరాన్ని చదవడం ప్రారంభించింది. చదువుతూ ఉన్న కొద్దీ ఆమె ముఖం వివర్ణమయిపోతూంది. ఉత్తరం చేతులోనుండి జారిపోయింది. సుశీల పెద్ద నిట్టూర్పు విడిచి కొయ్యబొమ్మయైపోయినది.

అశ్రుధార లామె కపోలములపై కాలువలు కట్టాయి. నిట్టూర్పు గాడ్పులు అగ్ని కొనలవలె దగి నిండిపోయాయి. ఆమె ఆశ కూలిపోయింది. భర్త వైఖరి ఏ మాత్రమూ మారలేదు. ఈ పిడుగుదెబ్బతో ఆమె హృదయము బద్దలైపోయింది. తన దుఃఖమయ జీవితాన్ని తలుచుకుని ఆమె ఎంతోసేపు ఏడ్చినది.

'మనస్ఫూర్తిగా ప్రేమించిన భర్తయే ఇల్లా చేసినపుడు ఇంకా నాకు జీవితాశ యెందుకు? ఝంఝామారుతం చేత ప్రపంచకం కంపించిపోతూ ఉండే రాత్రియందు

చెట్టుచివరనుండే పక్షికేనా ఆశుంది కాని నాకు మాత్రం ఏ వేపుచూసినా నిరాశయే ప్రత్యక్షమవుతూంది'.

'గొడ్డు గోతులో పడితే అందరూ తలొకరాయీ విసిరేవారే అన్నట్లుంది నా బతుకు. నాకు కాస్త ధైర్యమేనా చెప్పేవారు లేరు. చిన్నప్పుడు నిముషమయినా వదిలిపెట్టి ఉండలేని స్నేహితురాలూ, తండ్రీ ఇప్పుడు నన్ను చూసి అసహ్యించుకుంటున్నారు. మతాంతరురాలనైతే మాత్రం నాది కూడా మానవ జీవనమే కదాని కాస్త దయగల మాటాడ్డానికైనా అర్హురాలనుకాను కాబోలు!

'నా చదువూ, అందమూ, అన్నీ విలువలేనివై పోయాయి. అవే నా జీవితానికి కష్టం తెచ్చాయి కూడాను. తోడికోడళ్ళకి పగదాన్నైపోవడానికి కారణం ఎంత ఊహించినా తోచకుండా ఉంది. బావగార్లూ, మామగారూ వాళ్ళకి వ్యతిరేకం చెప్పలేక నా స్థితి కళ్ళారా చూస్తూ ఊరుకున్నారు. ఇంక ఈ యింటిలో ఉండడానికి నాకు పాలుపోవడం లేదు. పై విధముగు విషాదకరములగు తలపులామెను బాధిస్తున్నాయి.

**4**

అప్పటికప్పుడే ఒంటిగంటపైదాటింది. ఫాదిరిగుడి అంతటా నిశ్శబ్దము స్వేచ్ఛా సామ్రాజ్య మేలుతూంది. పుష్యమాసపు చలికాగలేక ప్రజలు త్వరగానే పడకలు చేరుకున్నారు. ఫాదిరి గుడికట్టడములన్నీ మంచుపొరలతో తెప్పతేలుతున్నాయి. శతాబ్దముల నుండీ శీతవాత వర్షాతపములకాగి నిల్చినందువల్ల నలుపెక్కిన గోడలతో మహోన్నతములైన శిఖరాలతో చర్చి ఇళ్లకు మధ్యగా ఉంది. దూరం నుంచి చూసేవారికి చర్చి ఒక పెను భూతము లాగు భయం గొల్పుతూంది. నిరుపేదలు లక్ష్మీదేవికితోడు నిద్రాదేవికి కూడా దూరులై వడవడ వణుకుతూ తమ దౌర్భాగ్యాన్ని నిందించుకుంటూ కూచున్నారు. సుఖనిద్రావశులైన లక్ష్మీపుత్రుల కాదీనుల తలంపే లేదు.

సుశీలకీ నిద్రలేదు. గదిలో ఆమెగాక వేరొకజీవమే లేదు. ఇల్లంతా నిశ్శబ్దమయము. ఆమె దృష్టుల ప్రయత్నంగా పైకిపోయాయి. చేతులు జోడించుకొని ఆ యువతీమణి ధ్యాన నిమగ్నయైపోయింది. ఆ నిశా సమయమున – సమస్త జీవకోట్లూ నిద్రావస్థలో మైమరచి యున్న ఆ నిశా సమయమున – పరమేశ్వర ధ్యానమున మునిగి ఉన్న ఆశోక దేవతను మనోదృష్టియందైనను మూర్తీభవింప చేసుకొనగలిగిన వారు ధన్యులు.

ప్రకాశమానంగా వెలుగుతూవున్న దీపపు కాంతిలో అశ్రుగళితములగు నామె నిమీలిత నేత్రములు మిలమిల మెరుస్తున్నాయి. తరంగ సంక్షుభితమగు సముద్రంలాగు ఆమె వక్షోభాగము పైకి లేస్తూ, కిందికి పడుతూ మనోగత భావోద్రేకాన్ని వ్యక్త పరుస్తూంది. ఆమె పెదవులు మాత్రం కొద్దిగా చలిస్తున్నాయి. భగవంతుని సన్నిధి కల్పించుకుని తన దీనావస్థను విన్నవించుకుంటూంది కాబోలు ఆ పవిత్రహృదయ!

ఆమె మాటలు స్పష్టంగా వినబడడంలేదు. చివరికి మాత్రం 'తండ్రీ! ఇంక నే నీ ఇంట్లో ఉండలేను. నాకొక దారి చూపించి రక్షించవా?' అని గట్టిగా పలికి ఒక నిట్టూర్పు విడిచింది.

ఇంతలో దొడ్లో ఏదో శబ్దమవడం వల్ల ఆమె ధ్యానానికి భంగం కలిగింది. ఎవరైనా తన్ను కనిపెడుతున్నారేమో అని సుశీలలేచి తలుపు తెరచి చూసింది. దొడ్లో ఎవ్వరూ లేరు. చప్పుడుకి కారణం ఆలోచిస్తూ ఆమె నాలుగువేపులా చూసింది.

చీకట్లు దట్టంగా భయంకరంగా వ్యాపించి ఉన్నాయి. దూరాన్నించి ఫాదరీగారి మేడమీది దీపమొకటి మాత్రం ఆ గాఢాంధకారాన్ని భేదించుకుని ఆమెకు కబడ్డాది. తక్షణం ఆ దీనురాలికొక ఆలోచన తోచింది.

అప్పుడు ఫాదిరిగుడి సంస్థలో 'రెవ రొజారియో' అనే వయోవృద్ధుడగు అమెరికా దేశస్థుడు ఫాదరీగా ఉన్నాడు. నిరాడంబరజీవి. ప్రజాసేవయే సర్వేశ్వర సేవ అని నమ్మిన ఉన్నత భావ పూరితుడు. చుట్టు ప్రక్కల క్రైస్తవులే కాక ఇతరులు కూడా ఏదో విధంగా అతని సహాయం పొందినవారే. అతను వచ్చిన తరవాతనే ఫాదిరి గుడి సంస్థకు అనుబంధంగా ఒక వైద్యశాలను కూడా ఏర్పాటు చేశాడు. బాధపడేవారిని చూస్తే అతని హృదయం కరిగిపోయేది.

ఆ దయాహృదయుని దగ్గిరికిపోయి తన అవస్థను చెప్పుకోడానికి సుశీల నిశ్చయించుకుంది. ఆ తలపుతోనే ఆమెకు ఆశాజ్యోతి జనించినది. ధైర్యం తిరిగి వచ్చింది. ఆ కష్టసమయంలో తనకి సహాయం చెయ్యగల సమర్ధుడతడొక్కడే ఆమెకు కనపడ్డాడు. సర్వేశ్వరునికి కృతజ్ఞతా పూర్వకవందనము లర్పించినది.

ఇంట్లో అందరూ నిద్రలో ఉన్నారు. వీధిలో ఎక్కడా సడిలేదు. వెనకముందు లాలోచించకుండా సుశీల ఫాదిరీ బంగాళాకు బయలుదేరింది. బంగాళా చుట్టూ పువ్వుల తోట ఉంది. రెండువేపులా పూల జాతులు నాటబడిన దారిని పోయి ఆమె

ప్రధాన ద్వారాన్ని సమీపించింది. అక్కడ బంట్రోతుతో 'ఫాదిరీగారితో కొంచెం తొందరగా మాట్లాడాలి చెప్పు' అంది.

ఫాదిరి రొజారియో ఆరగుడుల యెత్తు మనిషి. ఆజానుబాహుడు, ముఖము గంభీరము, నిత్యప్రసన్నము. కళ్ళు తేజోమయములు, దయారస భరితములు. సుశీల నమస్కారాన్ని ఆదరపూర్వకంగా అందుకుని రొజారియో ఆమెను మేడమీదికి తీసుకెళ్ళాడు. సుశీలను ముందు కూర్చోమని చెప్పి ఆయన యెదురుగా కూర్చున్నాడు. రొజారియోకి సుశీలయందు మంచి గౌరవభావం ఉంది.

సుశీల కతడా సమయంలో తండ్రికంటె ఎక్కువగా కనిపించాడు. దొరగారూ, అతని భార్య కూడా ఆమె దీన చారిత్రమును విని జాలిపడ్డారు. రొజారియో ఆమెను ఓదార్చి 'అమ్మాయీ! నీకు పరవాలేదు. విచారించకు. నేనిదివరకే మీ మామగారివల్ల నీవు నిర్దోషివని విన్నాను. కాని ఇంట్లో భార్యా కోడళ్ళూ కలిసి చేసే దుర్మార్గము అణచడానికి తనకి శక్తి లేక పోయింది. ఇంక నువ్వాయింటికి వెళ్ళనంటున్నావు గనుక ఇక్కడే ఉండిపో. మిగిలిన సంగతి రేపు ఆలోచించుకుందాం' అన్నాడు. సుశీలకా పలుకులు అమృతప్రాయములైనవి.

ఆ మరునాడు భావికర్తవ్యాన్ని గురించి సుశీలతో దొరగారు చాలా సేపు మాట్లాడాడు. చివరకామె అభిప్రాయాన్ని అనుసరించి దొర విద్యాశాఖాదికారికి రాసి రాజమహేంద్రవరంలోని స్త్రీల ట్రెనింగు స్కూలులో సెకండరీ గ్రేడు ట్రెనింగు విద్యార్థినిగా సుశీలను చేర్పించడానికి ఏర్పాటు చేశాడు.

మళ్ళా సుశీలకి భావిజీవితమునందు కొంత ఆశ జనించింది. ఇప్పుడు స్వతంత్ర జీవనం చేసుకుని ఉన్నతాశయాల ననుసరించి నడుచుకోడానికి తగిన అవకాశమామెకు లభించింది. ఏనాటికైనా తన నిర్దోషిత్వము బయలు పడవచ్చునుకదా అని ఆమె సంతోషించినది. భర్త విడనాడినపుడు తన జీవితమేలాగు గడుస్తుందా అని ఆమె హడిలిపోయింది. ఇప్పుడాభయము తీరిపోయింది.

వేసవికాలపు సెలవులవగానే సుశీల రాజమహేంద్రవరం పాఠశాలలో ప్రవేశించింది. ప్రభుత్వం వారి సహాయానికి తోడు మేనమామయిచ్చిన ధనం కూడా వెచ్చించుకుంటూ ఆమె విద్యార్థినుల వసతి గృహం (హాస్టల్)లో ఉండి తన చదువు సాగించుకుంది.

చదువు వ్యావృత్తిలోపడిపోయి సుశీల తన దుఃఖాలను చాలా వరకు మరిచి పోయింది. ఈ రోజుల్లో 'రాజరత్నము' అనే అమ్మాయి ఆమెకి నమ్మిన స్నేహితురాలైనది. ఈ స్నేహితురాలి యింటికి తప్ప సుశీల రాజమహేంద్రవరంలో వేరొకరి యింటికెన్నడూ వెళ్ళి యెరుగదు. బ్రాహ్మణులైనప్పటికీ తన్ను ఆదరముతో చూసిన రాజరత్నం జననియగు మహలక్ష్మమ్మను చూసి ఆమె తన తల్లిని కూడా మరిచిపోయింది. ఆమెను, అమ్మా అనే పిలుస్తూ వుండేది. తన దీనచారిత్రమును విని సంపూర్ణ సానుభూతిని చూపిన మహలక్ష్మమ్మతోనే ఆమె తన కష్టసుఖాలను వెళ్ళబోసుకుంటూ వుండేది. అంతకీ తన ఒంటిజీవనం తలుచుకున్నప్పుడు దుఃఖం భరించరాకపోతే సుశీల తిన్నగా ఆమె దగ్గిరకే పోయేది. మహలక్ష్మమ్మ ఓదార్పు మాటలతో కాని ఆమె విచారం ఉపశమించేది కాదు.

పాఠశాలలో సుశీల గడపవలసిన రెండేళ్ళూ గడిచిపోయాయి. ఆ పాఠశాలలోనే ఆమె ఉపాధ్యాయినిగాకూడా నియమింపబడినది. రాజమహేంద్రవరంలో మహలక్ష్మమ్మ ఆదరాభిమానములందే తన జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్న పిమ్మటనే సుశీల తన ఉద్యోగాన్ని అంగీకరించింది. ఆ వూళ్ళోనే మహలక్ష్మమ్మగారికి వేరొక యిల్లు వుంది. అందులో సుశీల ఉండడానికి మహలక్ష్మమ్మ యేర్పాటు చేసినది.

## 5

నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ మధ్యకాలంలో సుశీల కబురు భర్తకిగాని, అతని కబురు సుశీలకి గాని లేదు. అసమానలావణ్యవతియగు సుశీలను చూసి తోడివారు 'ఇంత చిన్న వయస్సులో యిల్లా పట్టుదలతో కూచుంటే యెలాగ? నీ సౌందర్యమంతా అడివికాసిన వెన్నెలయిపోవలసిందేనా? నీకిష్టమున్నట్లయితే ఎంతలేసి గొప్ప సంబంధాలైనా వొస్తాయి. మళ్ళా పెళ్ళి చేసుకుని సుఖపడకూడదూ? అని జాలిగా అనేవారు. ఒక్క నిట్టూర్పు తప్ప వేరే జవాబు ఆమె యిచ్చేదికాదు.

ఇప్పుడామెకే సౌఖ్యానికీ లోటులేదు. గౌరవనీయమైన సంఘమూ నలుగుర్లోనూ మర్యాదా, విద్యావ్యాసంగమూ, తగినంత ధనమూ అన్నీ ఆమెకు అనుకూలంగానే వున్నాయి. కాని తన ఒంటి జీవనము జ్ఞాపకానికొచ్చి ఆమెను విచారంలో ముంచిన గడియలు లేకపోలేదు.

ఒక్కొక్కరాత్రి నిద్రపట్టక గతించిన దుఃఖానుభవాలు తలపునకు వచ్చి ఆమె గంటలకొద్దీ ఏడుస్తూ కూర్చునేది. ఇల్లాంటిదని నిర్వచించడానికి వీలులేని దుర్భర

మనోవేదనకుపాలై తెల్లవార్లూ వేగిపోయేది. ఒక్కరాత్రికే చిక్కి వసివాళ్ళు వాడిపోయిన ఆమె ముఖాన్ని చూసి స్నేహితులు కారణమడిగేవారు. వారికేమని చెప్పడానికీ ఆమెకి తోచేదికాదు.

కాని ఈ కారణం మహలక్ష్మమ్మకు తెలియకపోలేదు. 'ఇలా ఉన్నకొద్దీ ఈమె జీర్ణించిపోవడం తప్ప లాభంలేదు. పాపం! ఏం చెయ్యగలదు? ఎన్ని సౌఖ్యాలున్నా భర్త సమీపాన్ని లేనిలోటు ఆమె మెత్తని హృదయాన్ని తినేస్తూంది. అంత అవమాన పరచినప్పటికీ తన భర్త మంచివాడనే వాదిస్తుంది, అమాయకపుపిల్ల. ఇలాటి పవిత్ర హృదయాన్ని సరిగా గ్రహించి ఆమె స్నేహ సౌఖ్యమనుభవించలేని వాని జన్మవ్యర్థము. ముమ్మాటికీ వ్యర్థము, సంతోషంగానూ, విలాసంగానూ పైకి అందరిముందరా తిరిగినా సుశీల హృదంతరాళంలో ఉన్న విషాదవహ్నికీలలను ఎవరు గ్రహించగలరు?' అని కుమార్తెతో చెబుతూ మహలక్ష్మమ్మ ఆ అభాగినిని గూర్చి విచారిస్తూ ఉండేది.

ఈ మోస్తరుగా ఇంకొకయేడాది గడిచిపోయింది. మార్చినెల ఎండలింకా తీవ్రతనందలేదు. శీతోష్ణస్థితి సరిసమానమై మనోహ్లాదకరమై ఉంది. పరీక్ష రోజులవడం చేత విద్యార్థులూ, ఉపాధ్యాయులూ కూడా ఏతత్ప్రయత్నావళిలో మునిగి ఉన్నారు. రాత్రివేళ తేళ్ళు బైటికొచ్చి హడావిడి చేస్తున్నాయి. దినమంతా శ్రమపడి పనిచేసి అలసిన కచేరీ గుమాస్తాలు కాలాతిక్రమణమును లెక్కచెయ్యకుండా గ్రామ పరిసర ప్రదేశాల్లో విశ్రాంతి ననుభవిస్తున్నారు.

ఒకనాటిరాత్రి పదకొండు గంటలవుతూంది. రాజమహేంద్రవరంలో ప్రధాన రాజవీధులు తప్ప ఇతర ప్రదేశములు అలికిడిలేక నిశ్శబ్దములైపోయాయి. మల్లెపూల సౌరభంతో బజారువీధి నిండిపోయింది. అప్పటికప్పుడే కొంతసేపు చదువుకుని నిద్ర ఆవహిస్తూ ఉండడంచేత విద్యార్థులు పుస్తకాలు మూసేసి సిగరెట్లు ముట్టించారు కొందరూ; టీ తాగుతున్నారు కొందరూ; లోకాభిరామాయణం ముచ్చటిస్తున్నారు కొందరూ.

అల్లాంటప్పుడు మహలక్ష్మమ్మగారి వీధితలుపు సుశీల తట్టింది. అంతరాత్రివేళ ఆమె రాకకి కారణం తల్లీ కుమార్తె కూడా ఊహించలేకపోయారు. లోపల ప్రవేశించి సుశీల 'అమ్మా! ఈ ఉత్తరం ఒకసారి చూడండి' అని మహలక్ష్మమ్మతో అంది. ఆ మాటల్లో అపూర్వమైన తొందరా, ఆనందమూ ద్యోతకమవుతున్నాయి. మహలక్ష్మమ్మ ఉత్తరం విప్పి ఇల్లా చదివింది.

'ప్రియురాలవగు సుశీలా,

ఈ జాబు ప్రారంభించడానికి ముందు నేను నీ యెడల చేసిన అపరాధములకు క్షమాపణ కోరవలసి ఉంది. దయాస్వభావురాల వయిన నీవు నన్ను క్షమిస్తావనే ధైర్యంతోనే ఈ లేఖను రాస్తున్నాను.

నువ్వు నిర్దోషివని నాకు రుజువయి చాలా రోజులయింది. కాని నీ యెడల నా అమానుష ప్రవర్తనని తలుచుకున్నప్పుడల్లా నాలో నాకే సిగ్గేసి మళ్ళా ఆమెకు జాబు యెల్లారాయగలను? అని మొహం చెల్లక ఇంతకాలం ఊరుకున్నాను. నా దుర్మార్గత క్షమార్హము కాదని నాకు తెలుసును. ఎన్నివిధాల పశ్చాత్తాపపడినా నేను పై నేరాలకు భగవంతుని ముందు విధిగా జవాబు చెప్పుకొని తీరాలి. పశ్చాత్తాపపడినంత మాత్రంలో నా బాధ్యత తొలగి పోజాలదు. కాని సుశీలా! ఈ యెడబాటు మూలాన్ని నీ నిర్మల హృదయం యొక్క నిజమైన విలువను నేను గ్రహించగలిగినందుకు మాత్రం సంతోషిస్తున్నాను.

మనం విడిపోయిన తరువాత వేసవికాలపు సెలవులకి నేను ఫాదిరిగుడికి వెళ్ళాను. కాని నువ్వులేని యిల్లు శూన్యమై దుఃఖప్రదమై పోవడం చేత అక్కడ రెండు రోజులేనా వుండలేకపోయాను. తక్షణం ఏదో వంక పెట్టుకుని మళ్ళా చెన్నపట్నం వెళ్ళిపోయాను.

నేనూ చెన్నపట్నం వెళ్ళగానే రొజారియోదొరగారి జాబు చేరినది. ఆ మహానుభావుని సదభిప్రాయానికి పాత్రురాలవైన నీ జన్మధన్యము. ఆ దయామూర్తి నీవు కేవలం నిరపరాధివని నాకు బోధపరుస్తూ రాశాడు. దురభిమాన పూరితుడనగు నా కాబోధనలపుడు తలకెక్కలేదు. ఒకవేళ సుశీల నిర్దోషియేమో నేనే తొందరపడ్డాను కాబోలు అనే సందేహము నాకు కలగడానికి మాత్రం అదే మొదలు సుమా.

మరొక్కప్పుడు మా చిన్న సోదరుడూ వదినగారూ మాట్లాడుకుంటూన్నప్పుడు నేను వినడం తటస్థించింది. దానితో నా సందేహాలన్నీ తీరిపోయాయి. నిన్ను చూసి సహించలేక నీకు మా అన్నకీ లేనిపోని సంబంధాలు కలిపించి మా వదెనలు మా అమ్మతో చెప్పారు. ఆమె వాళ్ళ మాటలను విశ్వసించి నన్ను నమ్మించేసింది. ఇంకెవరు చెప్పినా నేను వినేవాణ్ణికాను గాని మా అమ్మయే స్వయంగా చెప్పడంచేత నా మనస్సు చలించిపోయింది.

చెప్పుడు మాటలు విని నీలాంటి పవిత్రురాలిని దుఃఖాలపాలు చేశానుకదా అని ఆనాడు నేను పొందినవేదన నేను రాయలేను. నాటినుంచీ నీ యెదుట నిలబడి నన్ను మన్నించమని ప్రార్థించాలనే అభిప్రాయంతో వున్నాను. నరులు అజ్ఞానులు. పొరపాటులేకుండా నడుచుకోడానికి మానవమాత్రుడికి సాధ్యం కాదు. కాబట్టి నన్ను క్షమించమని ఈ జాబుమూలంగా నిన్ను కోరుతున్నాను.

ఈసరికి పరమ దుర్మార్గుడనైన నన్ను నీవు మరచిపోయావనుకుంటాను. కాని నీవు ప్రతిఘడియా ప్రతిక్షణమూ నా దృష్టిపథంలోనే ఉంటున్నావు. గత సంవత్సరం నుండీ నేను ధవిళేశ్వరంలోనే అసిస్టెంటు ఇంజనీరుగా ఉన్నాను. నీకు సమీపంలో ఉంటాననే ఆశచేతనే ఇక్కడికి బదిలీ చేయించు కున్నాను. ఇంత దగ్గిరగా నేనున్న సంగతి నీకు తెలియదను కుంటాను.

ధవళేశ్వరం వచ్చిన పిమ్మట ఎలాగైనా నిన్ను ఒకసారి చూడాలని నేను చాలా ప్రయత్నించాను. ఎన్నో రోజులవరకూ సాధ్యంకాలేదు. ఎలాగు నిన్ను చూడగలనా అని పరితపిస్తూ ఉన్న రోజుల్లో ఒకనాడు అయాచితంగానే నీ దర్శనం లభించింది. ఏనాడో చెప్పనా? తోటి ఉపాధ్యాయినులూ నీవూ విద్యార్థులను తీసుకుని గోదావరి ఆనకట్ట చూడ్డానికి వచ్చినరోజు జ్ఞాపకం ఉందా?

ఆహా! సుశీలా! ఆనాటి నీ లావణ్యమయమూర్తి ఎన్నడూ నా స్మృతి పథాన్ని బాసిపోదు. చిక్కిసఖమైపోయినా నీ శరీరము సుకుమారమై సాత్విక తేజోయుతమై నాకు కనబడింది. అదివరకెన్నడూ లేని నూతన సౌందర్యము నీలో నాకు గోచరించింది ఆ రోజున. నీతో క్షణం మాట్లాడదామనుకున్నాను గాని ధైర్యం చాలిందికాదు.

ఇంక ఈ వియోగాన్ని నేను సహించలేను. నీ జవాబుకోసం పది రోజులవరకూ చూస్తాను. జవాబిచ్చావా సంతోషమే. లేదా నీ బసను నేనిదివరకే కనుక్కున్నాను గనుక సరిగా ఏప్రిల్ మొదటిరోజున సాయంకాలం అయిదు గంటలకి నేనే నీ దగ్గరికి స్వయంగా వస్తున్నాను. నన్ను హతాశుణ్ణి చెయ్యవద్దని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

**నీ అనురాగముకోరు గజానన్**

మహాలక్ష్మమ్మ ఉత్తరాన్ని చదవడం ముగించి ఒక్క నిముషమాలోచించి సుశీలవేపు చూసి నవ్వుతూ 'నీ అభిప్రాయమేమిటి?' అన్నది.

'మీ అభిప్రాయమే నాదీనీ. అమ్మా! మీకు ఉన్నదివున్నట్లూ పరిస్థితులను వివరించడం నా విధి. నా యెడల కఠినంగా ప్రవర్తించడానికదే మొదలుగాని అంతకు ముందెన్నడూ లేదు. అసలు అమాయకత్వమే కాని కల్మషంకల హృదయంకాదు. ఈ సంగతి ఈ జాబువల్లనే మీకు తెలుస్తుంది'.

సుశీల ప్రతిమాటలోనూ ఉత్సాహము తొణుకులాడుతూంది. ప్రాతఃకాలమున కెందామరలు వికసించిన సరస్సులాగు ఆమె ముఖం ఆనందభరితమై ఉంది. నేత్రాలు భావభరితములై మెరసిపోతున్నాయి. పూర్వపు దీనత్వము మాయమైపోయింది.

మహాలక్ష్మమ్మ ఇదంతా కనిపెట్టి 'సుశీలా! సర్వేశ్వరుడు దయాపరిపూర్ణుడు. ఈ నాటికి నీ కోర్కె సిద్ధించింది. చెప్పుడు మాటలవల్ల నీ భర్త మనస్సు అల్లా మారి పోయింది కాని స్వతహాగా దుర్మార్గుడు కాడు. పశ్చాత్తాపంతో నిన్నంత దీనంగా వేడుకుంటున్నప్పుడు నిరాకరించడం ధర్మం కాదు. కాబట్టి ఏప్రిల్ ఒకటో తేదీ కోసం నిరీక్షిస్తూ ఉండు' అని మందహాసంతో అన్నది. చెక్కిళ్ళయందు నొక్కులేర్పడేటట్టు దరహాసవదనంతో సుశీల సెలవుపుచ్చుకుని వెళ్ళింది.

## 6

అత్యాత్రముతో నిరీక్షస్తూ ఉన్న ఏప్రిల్ ఒకటవ తేదీ వచ్చింది. ఆరోజు సెలవు దినమవడంచేత సుశీల ఇంటివద్దనే ఉంది. భర్త ఉత్తరం వచ్చినప్పటినించీ ఆమెలో కలిగిన మార్పు చూసి మహాలక్ష్మమ్మ తనలో తనే నవ్వుకుంటూ ఉండేది.

పూర్వకంటే వెయ్యిరెట్లు శోభతో ప్రకాశించేటట్లుగా సుశీల ఇంటిని చక్క బరిచింది. మధ్యాహ్నం నాలుగుగంటలకే తను శృంగారించుకోడానికి మొదలు పెట్టింది. గులాబీరంగు సిల్కుచీర ధరించింది. చక్కని లేసు పనిచేసిన రవిక తొడుక్కుంది. తన చాతుర్యమునంతా వినియోగించి, జడ వేసుకుంది. ఆమె ప్రతి అవయవంలోనూ సంపూర్ణమైన జీవకళ తొణుకులాడుతూంది. సహృదయయగు మహాలక్ష్మమ్మ ఆమె అసమాన సౌందర్యాన్నీ, ఉత్సాహాన్నీ చూసి సంతోషభరితురాలై 'సుశీలా! మీ ఆయన్ని మాకు చూపించనే చూపించవు కాబోలు?' అని పరిహాస పూర్వకంగా అన్నది.

'ఇదంతా మీ దయచేతనే కదూ!' అని వినయపూర్వకంగా ప్రత్యుత్తరమిచ్చి వెళ్ళిపోయింది. సాయంకాలం ఆరుగంటలయింది. ఆమె తన గదిలో కూచుని చదువు

కుంటూ నిరీక్షిస్తూంది భర్తకోసం. మనస్సు పుస్తకం పైని లేదు. అయిదు గంటలకే వస్తానన్న గజానన్ అంతవరకూ రానందుకు ఆమె మనసు ఖంగారుపడుతూంది. ప్రతిఘడియా వీధివంక చూస్తూ ఉండేది. వీధి తలుపు బారుగా తెరిచి ఉంచింది. నిముష నిముషానికీ ఆమెకి గాభరా యెక్కువైపోతూంది. 'ఇంక రాకపోతే ఏదిదారి?' అనుకునేసరికి గుండెలు కొట్టుకునేవి.

ఏడుగంటలు అయింది. సుశీల గడియారం వేపు చూస్తూ నిట్టూర్పు విడిచింది. 'నా బతుకు మొదటినుంచీ ఇలాగే ఉంది' అని వీధిలోకి చూసి ఏ అలుకుడూ లేకపోవడం చేత హతాశయై గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడిపోయింది.

మరొక అరగంట గడిచిపోయింది. ఆశాభంగం చేత ఆమె మనస్సు అపరిమిత మైన చిరాకు పడుతూంది. ఇంకొకసారి వీధిలోనికి చూసింది. తన నిర్భాగ్యాన్ని నిందించుకుంటూ గదిలోకిపోయి మంచం మీద బోర్లాపడుకుంది. ఆశాభంగానికి తోడు భర్త వస్తానని మాట నిలుపుకోనందుకు ఉడుకుమోతుతన మెక్కువై ఆమె తన నిస్సహాయతకు తనలో తనే ఏడవడం ప్రారంభించింది. భోజనం మాటే మరిచి పోయింది. ఎనిమిది గంటలయినప్పటికీ ఆమె అలాగే పడుకుని ఉండిపోయింది. ఆ యేడుపులోనే ఆవేశభరమున శ్రాంతురాలైన సుశీలకు కొంచెం నిద్రపట్టినది.

వీధి తలుపులల్లాగే తెరిచే ఉన్నాయి. గదిలో దీపం స్వచ్ఛకాంతులతో ప్రకాశిస్తూంది. ఇంతలో ఇంటిముందొక మోటారుబండి ఆగింది. అందులోనుండి యువకుడొకడు పాశ్చాత్యవేషంలో దిగి డ్రైవరుతో 'మళ్ళీ పొద్దుట తొమ్మిది గంటలకి తీసుకురా మరిచిపోకు' అని చెప్పి కారు వెళ్ళిపోగానే లోపలికి వెళ్ళాడు.

మోటారు రావడమేనా సుశీల ఎరుగదు. ఇంతసేపూ తను ఎవరి కోసం చూస్తూందో అతడే వచ్చాడని మాత్రం ఏం తెలుస్తుందీ?

గజానన్ తిన్నగా గదిలోకి వెళ్ళాడు. మంచం మీద బోర్లాపడుకుని వున్న సుశీలను చూశాడు. గులాబీ కాంతులనీనుతూ ఆమె కంఠప్రదేశము సుపరిచితమై వియోగతప్తుడైన భర్తకి నేత్రపర్వమొనగూర్చినది. ఆమె మృదుహస్తములు తలదిండుపై చలనం లేకుండా పడి ఉన్నాయి. చదువుతూ చదువుతూ ఉన్న పుస్తకము అల్లా బల్లమీదనే ఉంది. చెక్కులపైని జాలువారి అశ్రుబిందువులు దీపపు కాంతిలో ప్రకాశిస్తున్నాయి.

ఇవన్నీ చూశాడు గజానన్. ఒక్క దీర్ఘనిశ్వాసమును విడిచాడు. 'పాపం, అనుకున్న వేళకు నేను రానందుకు ఎంత విచారించినదో కమిలిపోయిన ఆ ముఖ పద్మమే తెలియచేస్తూంది' అనుకున్నాడు నెమ్మదిగా.

స్వచ్ఛమై, మధురమై, ప్రియతమమై కనబడుతూ ఉన్న ఆ మెడను ముద్దు పెట్టుకోవాలని అతని హృదయం తొందరపడుతూంది. నిద్రావస్థలో ఉన్న ఆ సౌందర్య మూర్తి ఉచ్ఛ్వాసనిశ్వాసములు సుదీర్ఘములై గదినంతనూ సౌరభముతో నింపుతున్నాయి. మెల్లిగా భార్యను సమీపించాడు. కాని మళ్ళా వెనక్కి తిరిగి చూశాడు ఏమి ఆలోచించు కున్నాడో కాని.

తలుపులన్నీ తెరవబడి ఉన్నాయి. ఉరకలువేస్తూ ఉన్న మనస్సును నిలుపుకుని అతడు వీధివరకూ వచ్చి ఇటూ అటూ చూసి తలుపులు బిగించుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

✲ ✲ ✲

తెల్లవారిపోయింది. ఏప్రిలు నెల రెండోతేది. ప్రపంచమంతా సుశీలకు సంతోషమయంగా కనబడినది. భర్త తెలిపిన పశ్చాత్తాపానికీ, అతని అనునీయ వాక్యాలకూ ఆమె హృదయము శరత్కాల నదీజలంలాగు కలకదేరి నిర్మలమై పోయినది. మామూలుకంటే శీఘ్రంగా లేచి ఆమె కాఫీ తయారు చేసింది. ఏడుగంటలకే ఇద్దరూ కాఫీ పుచ్చుకున్నారు.

కష్టసమయాన్ని భార్యను ఆదరించిన దయాహృదయురాలగు మహలక్ష్మమ్మ దర్శనం చేసి కృతజ్ఞత చూపించడం తన దర్మమనుకొన్నాడు గజానన్. అందుచేత కాఫీ అవగానే ఇద్దరూ మహలక్ష్మమ్మగారింటికి వెళ్ళారు. చిరవియోగానంతర సమాగమమున సంతోష తరంగమాలికల దేలిపోతూ వున్న ఆ దంపతులను చూసి వారి కుటుంబమంతా ఆనందించింది.

తొమ్మిది అయేసరికి కారు వచ్చింది. భార్యాభర్తలిద్దరూ మహలక్ష్మమ్మకు నమస్కరించి సెలవు తీసుకున్నారు.

బజారుకు పంపి ఒక ఖద్దరు జామారూ, చీరా తెప్పించి, ఇంత పసుపు కుంకమూ పెట్టి హిందూ సాంప్రదాయానుసారముగా మహలక్ష్మమ్మ సుశీలకూ ఆమె భర్తకీ ఇచ్చి బహుమానించినది.

హిందూ సంఘానికి చెందినవారిలో కూడా జాతి మత వివక్షతలను పాటించని భూత దయాపరులు మహలక్ష్మమ్మ వంటివారుంటారు కదా అని తెలుసుకుని తమ సంఘంలో అలాంటి ఆచారం లేకపోయినా ఆమె యిచ్చిన బహుమానాలను సుశీలా గజాననులిద్దరూ నమ్రశిరస్కులై గ్రహించి మోటారు బండి ఎక్కారు.

## కథానేపథ్యం ...

ఈ రచయిత విజయనగరంవారు. కాళూరి వ్యాసమూర్తిగారు విజయనగర సంస్థానంలో ఆధునిక కాలాన గొప్ప విద్వాంసుడు. ఈయన కుమారుడు వేంకట రామారావు. ఈ కథలోని విశేషమేమంటే 20వ శతాబ్ది తెలుగు సమాజాన్ని క్రైస్తవ మత మిషనరీలు, విద్యావ్యాపనంతో ఎంతగా ప్రభావితం చేశారో తెలుసుకోవటానికి ఉపయోగపడుతుంది. సంప్రదాయానికీ, నవీన భావాలకు ఒరిపిడి సమాజంలో ఏయే మార్పులను తెచ్చిందో పాతకొత్తల మేలికలయికను ఏ విధంగా అర్థం చేసుకున్నదో ఈ పెద్ద కథ వివరిస్తుంది. ఈ రచయిత ఉద్యోగం, జీవిత విశేషాలు తెలుసుకొనే ఆధారాలు ఇప్పుడు లభించటం కష్టం.

వేంకటరామారావుగారి సోదరుడు కాళూరి హనుమంతరావుగారు కూడా గొప్ప కథారచయిత. వీరి కథలు ఇటీవల సంపుటాలుగా వచ్చాయి. హనుమంతరావుగారు సాహిత్య విమర్శకులుగా బాగా ప్రసిద్ధులు కాబట్టి వీరు రచించిన చాలా మంచి కథల గూర్చి ఈతరం కథా రచయితలకు, కథాభిమానులకు అట్టే తెలియదు. కరుణరసాత్మకమైన కావ్యం లాంటిది రామారావుగారి ఈ యేప్రిల్ 1వ తేదీ అనే కథ.

# 29. భామ

- దిగుమర్తి రామారావు

నేను గొప్పవాణ్ణి కాను. ఇంగ్లీషు చదువు చదివితే ఏదైనా పెద్ద ఉద్యోగమవు తుందని మా అమ్మ ఎంతో కష్టంతో నన్ను చదివిస్తూంది. నాకు అమ్మ తప్ప ఇంకెవ్వరూ లేరు. ఏలాగో కష్టపడి 'స్కాలర్‌షిప్' సహాయంవల్ల ఇంటరుమీడియెట్ పేసై బి.ఏ.కి ఆ ఊరు వెళ్ళాను. కాలేజీకి సమీపంలోనే ఓ సందులో అద్దె కొంచె తక్కువగా వుండేటట్టు చూసి చిన్న గది అద్దెకు తీసుకున్నా. నేనుండే గది మిగిలిన ఇంటితో అట్టే సంబంధం లేకుండా సదుపాయంగానే కట్టబడ్డది. కాని సందు మహా ఇరుక్కుగ్గానూ, అసహ్యం గానూ వుండేది. ఆ సందులో ముఖ్యంగా ఆ ఇంట్లోవున్నానని చెప్పడానికి చాలా సిగ్గు వేసేది. అయితే ఆ సందు అటువంటిదని మొదట నేనెరుగను. ఆ సందులోనే కాకుండా, నేనున్న ఇంటి వెనకభాగాన్నికూడా భోగం వాళ్ళున్నారని తెలిశాక కూడా నేనా సందు విడిచిపెట్టలేదు. ఆ సందంటే నాకోవిధమైన ప్రీతి అభిమానమూ కలిగింది. ఆ సందు లోని వారందరితోపాటూ నాకూ ఆ సందు దరిద్రమంతా అనుభవించాలెనని బుద్ధి పుట్టింది. భోగంవాళ్ళ మధ్య నివసిస్తే వాళ్ళ సాధక బాధకాలు బాగా తెలుస్తాయని కూడా అనుకున్నా.

రాత్రిక్కూడా సరిపడ్డట్టు పొద్దునే వండుకునేవాణ్ణి మధ్యాహ్నం మట్టుకు ఎక్కడేనా ఓ కప్పు కాఫీ తాగేవాణ్ణి. అంటే బట్టల్లోనూ, టాయిలెట్టుల్లోనూ, సినిమాలకి పోవడం లోనూ, మిగిలిన సరదాలన్నిట్లోనూ చాలా క్లుప్తంగా వుండేవాణ్ణని వేరే చెప్పనక్కరలేదు.

నా గది అంతస్థుమీదది. అక్కడ ఎలక్ట్రిక్ దీపాలు లేవు, సాయంకాలం బడి నుండి రాగానే మొహం కడుక్కుని చొక్కా పంచె తీసి, చిన్నలాగూ బనియను తొడుక్కొని రోడ్డువేపు చూస్తూ నా పడక్కుర్చీలో కూర్చునేవాడిని. భోగంవాళ్ళందరూ, రకరకాలుగా శృంగారించుకుని మేడవసారాలమీదికి క్రింది వసారాలమీదికీ వచ్చి వాళ్ళ సొబగులన్నీ చూపిస్తూండేవారు. భోగంవాళ్ళ నవ్వులతోటీ, వచ్చిపొయ్యేవాళ్ళ కేరింతాలతోటీ, సరస సల్లాపాలతోటీ, వీధెప్పుడూ కలకల్లాడుతూండేది. సందుమలుపులో ఒక సారాయి దుకాణం వుండేదికూడా. ఇంచుమించు ఆ సందులోని భోగంవాళ్ళంతా సారాయి తాగేవారు, సిగరెట్లు కాల్చేవారు.

నేనొక సామాన్యమైన విద్యార్థినని తెలిసినా అప్పుడప్పుడు ఒక్కొక్క సానిఅమ్మాయి నన్ను చూసి కూడా నవ్వేది. అప్పుడేమి చెయ్యాలో బోధపడేది కాదు. చాలా కంగారుపడి గట్టిగా కళ్ళు మూసుకుని నాలో నేనే "ఊహూ' అనుకునేవాణ్ణి. అప్పుడు నా హృదయం జాలితోనో, ప్రేమతోనో నిండిపోయి బరువుగా అయిపోయేది.

భోగంవాళ్ళు, వేషం వేసుకున్న పైడాబులే కాని ఏమీబాగుండరని అంటారు. కాని, వారిలోనూ చాలా మంది అందమైన వాళ్ళుంటారు. వాళ్ళని పాపం ప్రతీవారూ తిట్టేవారే. విద్యార్థులు కూడా వాళ్ళను గురించి అమర్యాదగానూ, అసహ్యంగానూ మాట్లాడతారు. కాని వాళ్ళ జీవితాలెందుకల్లా మారాయో, ఎట్లా గడుస్తూన్నాయో, వాళ్ళ కష్టసుఖాలెట్లా వుంటాయో తెలుసుకుందాం అని కుతూహలం పడరు, సామాజిక సానుభూతి వాళ్ళపట్ల చూపరు.

నేనుండే గది క్రింది అంతస్థులో వెనుకభాగాన్ని ఇద్దరు భోగం వాళ్ళుండేవారు. పెద్దామెకు నలభై సంవత్సరాలలోపు, చిన్నామెకు ఇరవైలోపు వయస్సు ఉంటుంది. తల్లి, పిల్ల అనుకుంటాను. 'భామా' అని పెద్దామె కేకేస్తే 'అమ్మా' అని పలికేది అమ్మాయి. వాళ్ళు శృంగారించుకుని, ఒయ్యారంగా డాబా మీద తిరుగుతూంటే నేను తరుచుగా వాళ్ళకేసి చూసేవాణ్ణి.

వృత్తిచేతా, అలవాటు చేత భోగంవాళ్ళకి స్త్రీలకుండే సహజమైన లజ్జ, మొహమాటం చాలా వరకూ పోతాయి. కాని భామ మట్టుకు నన్ను చూసి కొంచెం సిగ్గుపడేది. ఆమె కళ్ళు మహా అందమైనవి. ఎంతసేపైనా చూడాలనే ఉండేది. కాని నే నామెవైపు చూస్తానని తెలుస్తే మట్టుకు ఆమె తప్పకుండా తలవంచుకునేది. అది చమత్కారమో, అమాయకమో నాకు తెలియదు.

రాత్రులు తాగుబోతులు రావడం, వెళ్ళడం, తలుపులు తియ్యడం వెయ్యడం, సందడిగానూ ఒక్కొక్కప్పుడు అల్లరిగానూ వుండేది. ఏ పక్కనో ఓ పక్కని సంగీతంపెట్టె గాత్రంతో సహ వాగుతూనే వుండేది. ఈ గోలంతటికీ నేను అలవాటు పడిపోయాను.

ఓ రోజు రాత్రి నాకు బాగా నిద్రపట్టక ఏదో ఆలోచిస్తూ పడుకున్నాను. ఇంతలో తలుపు చప్పుడైతే ఏలాంటివాడో చూద్దామని చప్పుడు కాకుండా నా రహస్య స్థలం చేరుకున్నాను. రహస్యస్థలం అంటే మరేంలేదు; నేనుండే అంతస్తునుండి రెండు మెట్లు దిగితే గోడ మీద చిన్న భాగం వెల్తిగా కిటికీ కోసమో మరి దేనికోసమో వదిలివేయబడ్డది. అక్కణ్ణించి చూస్తే భామ, భామతల్లి వుండే రెండు గదులూ నాకు బాగా కనిపిస్తాయి. నాకు తోచినప్పుడు మెట్ల మీద దీపం ఆర్పేసి, ఎవరికీ కనిపించకుండా ఆ స్థలంనుంచి

వాళ్ళ గదుల్లోకి చూస్తూండేవాణ్ణి. అంతమంచి పనికాదు గాని నేనప్పుడు చదువుకుండే కుర్రవాణ్ణి, ఆ రోజు జరిగింది చెపితే నేను తరుచూ, అక్కణ్ణించి ఏమీ చూసేవాడినో తెలుస్తుంది. భామతల్లి కొత్తగా మనిషితో రెండవ గదిలో మాట్లాడుతున్నది. అతడు శుభ్రంగా తయారై బాగానే వున్నప్పటికీ కొంచెం జబ్బు మనిషిలా వున్నాడు. నా దగ్గర గదిలో భామ పడుకున్నది. నిద్రపోతూంది కాబోలు. ఇంతలోకే వాళ్ళమ్మ వచ్చి భామను తట్టి ఏమో చెప్పింది. భామ నిద్రపోవడంలేదు. 'అబ్బా' అని మట్టుకు రెండోవేపు తిరిగి పడుకుంది. ఆ వచ్చిన మనిషిని చూడకుండానే 'అబ్బా' అంటున్నదేమో అనుకున్నాను. ఆ రోజున ఆమె పశుకృత్యానికి నీరసంగానూ బద్ధకంగానూ వున్నదేమో? వాళ్ళమ్మ రెండు మూడుసార్లు చెప్పింది. వినకపోతే అట్టే విసుకోక్కుండానే కొంచెం సవరించుకుని అద్దంలో చూసుకుని రెండో గదిలోకిపోయి తలుపు వేసుకుంది. అలంకరించుకుని పడుకున్న భామవేపు చూస్తూ అల్లా వుండిపోయాను. కొంచెంసేపులోనే ఆమె ఏడుస్తూందని గ్రహించాను. నిండు నేత్రాల భామ! ఎప్పుడూ శృంగారించుకొనే వుండే భామ! భామ ఎందుకేడుస్తూంది? నాకు మహావిచారం వేసింది. నా గదిలోకి వెళ్ళి పోయాను. కాని మనసు పెద్ద ఆందోళనలోపడ్డది. పోనీ వెళ్ళి ఓదారిస్తే! ఏమని ఓదార్చను? అసలేమి మిష పెట్టుకుని వెళ్ళను? ఎప్పుడూ నవ్వు ముఖంతోనే వుండే భామ ఏడుస్తూంది!

ఆ మర్నాడు సాయంకాలం భామ డాబామీదికి రాగానే 'భామా మీదికిరా' అన్నాను. ఎట్లా అనగలిగానో నాకే తెలియదు. ఆమెతోగాని, ఆమె తల్లితోగాని, నేనిది వరకెప్పుడూ మాట్లాడలేదు. కాని తరుచూ చూస్తుండడం నుంచీ, ఒక ఇంటిలోనే నివసించడం నుంచీ, ఒక విధమైన చనువూ స్నేహమూ మా హృదయాల్లో లేకపోలేదు.

వాళ్ళమ్మ నేను భామని పిలవడం విన్నా, ఏమీ అనలేదు. భామ ఆశ్చర్యంతోనూ కొంచె సిగ్గుతోనూ వచ్చింది. కూర్చోమన్నాను. నిజంగా చెబుతున్నాను, నాజూకైన అమ్మాయి! నేను పిలవగానే రావడమూ నాతో చనువుగా కూర్చోవడమూ, నాకు సరదా వేసింది. గర్వంకూడా కలిగింది. అసలు ఎట్లా మాట్లాడడం తెలియక, "ఏం భామా నిన్న రాత్రి ఎందుకేడుస్తున్నావు?" అని తటాలున అడిగేశాను. పాపం ఏమనుకుందో, 'మీకెట్లా తెలుసు" అని అయినా అడగలేదు. మాట్లాడకుండా తలవంచుకుని కూర్చుంది.

"చెప్పవూ? నాకు తెలుసునులే ఇట్లాంటి బతుకు నీకిష్టం లేదుకదూ? పోనీలే. విడిచిపెట్టి వేయకూడదూ?" అన్నాను.

భామ ఏమీ అనలేదు మెల్లిగా ఏడవసాగింది. ఆడపిల్లలందరూ ఆ వయసులో బాగుంటారు. ఆ రోజున భామ నాకు మరీ అందంగా కనబడ్డది. భామ కన్నీళ్ళలో ఎంత దు:ఖమున్నా ఎంతో మాధుర్యం కూడా వున్నది.

అందరూ నిద్రపోయాక చీకటిలో, ఎన్నిరాత్రులు ఎంత మంది ఏడుస్తూంటారో అనుకున్నాను. విపరీతమైన భావాలు పుట్టసాగాయి. ప్రొద్దున్నే లేచి పాఠాలు ఒక్కడ్నీ చదవడం, వండుకోవడం, బడినుండి వచ్చి వూరికే కూర్చోడం, మళ్ళీ రాత్రి ఎంతవరకో ఒక్కణ్ణీ దీపం దగ్గిర చదవడం, శలవుదినాల్లో రోజంతా ఏ పుస్తకమో చదువుతూ, నా పడకకుర్చీలో పడి వుండడం, ఏ సరదాలూ లేకుండా ఏకాంతంగా ఈ భోగం వీధిలో క్లుప్తజీవనం గడుపుతున్న నన్ను చూసి నేనే ఎన్నోమార్లు జాలిపడ్డాను.

భామ! భామ ఏడుస్తూంది. నేనేమో అనబోయేసరికి వాళ్ళమ్మ భామను పిలిచింది. కళ్ళు తుడుచుకుని మాట్లాడకుండానే భామ వెళ్ళిపోయింది. ఆ రాత్రి నాకు బాగా నిద్రపట్టలేదు. మనసులో ఏదో దిగులుగా వుంది. భామ ఏడుపుకి కారణమైనానని నన్ను నేనే దూషించుకున్నాను. నే నడిగినదానిలో తప్పేమేనా వున్నాదా? అయినా ఆమె తల్లితో మాట్లాడాలేకాని ఆమె నడగడమేమిటి? ఎంత జాగ్రత్తగా మాట్లాడాలనుకుంటానో అంత పశువునైపోతుంటాను, ఛీ, ఛీ అనుకున్నాను.

ఆమె తల్లితో మాట్లాడాలెనని, ఒకటి రెండు మార్లనుకున్నాను గాని జంకు వేసింది. ఏమయినా ఆ మర్నాడు చీకటి పడేప్పుడు ధైర్యం చేసి వాళ్ళ గదిలోకి వెళ్ళాను. వాళ్ళప్పుడు శృంగారించుకుంటున్నారు. అదే మొదటిమారు నేనా గదిలోకి వెళ్ళడానికి. వాళ్ళమ్మ చాలా ఆశ్చర్యపడి వుంటుంది. నన్నక్కడ కూర్చోమన్నది. ఏమి చెప్పడానికీ తోచక కూర్చుని వూరుకున్నాను.

"ఏమండీ!" అని ఆమె నా వేపు తిరిగింది.

"నిన్న మీ అమ్మాయితో కొంచెం మాట్లాడాను ..." దాన్ని గురించి వినిపించుకోకుండానే "అవును ఏదో బుద్ధి చెప్పారట. నాకు చెప్పిందప్పుడే! మేం ఒక్కళ్ళమే సానివాళ్ళమనుకున్నారా? చెప్పాలెనని వుంటే అందరినీ పిలిచి లెక్చరివ్వండి. మా పిల్లకి మట్టుకు ఇక మీదట మీ సలహాలవసరం లేదు" అని కఠినంగా అన్నది. "ఏమిటి మాట్లాడా" రని అడుగుతుందనుకున్నాను గాని ఈ ధోరణ చూచి నిర్ఘాంత పోయాను. "అమ్మా" అని భామ మందలించినట్టన్నది. తప్పు పని చేసినవాడిలా నేను మాట్లాడలేకపోయాను. పరాభవపడినట్లు అయిపోయింది. మాట్లాడకుండా నా గదిలోకి

వెళ్ళిపోయాను. ఇది జరిగిన తరువాత నేను మళ్ళీ వాళ్ళతో మాట్లాడలేదు. నా తప్పేమీ లేకపోయినా నన్ను మట్టుకు ఏదో భావము బాధించసాగింది. నాలో పుట్టిన ఈ కలతకి అర్థం ఏమిటీ? భామకూడా ఎప్పట్లాగా డాబా మీద శృంగారించుకుని తిరగడం లేదు. కొద్ది దినాల్లోనే ఎవరి ధోరణిలో వాళ్ళు పడిపోయాము.

రెండేళ్ళు రోజూ ఒక్కలాగే నా జీవితం ఆ సందులో గడిచిపోయింది. నా జీవిత మెంత సుఖదరిద్రమైనదైనా, దినాలెంత త్వరగా గడిచిపోయినయి! భామకళ్ళా? భామేనా నన్నింతగా ఆకర్షించినది! పరీక్షలయిపోయినవి. ఆ ఇరుకు సందు విడిచి మా గ్రామం వెళ్ళిపోడానికి ఎప్పట్లాగా నా హృదయం ఎందుకు ఆతృత పడదు? ఇక్కడ నాకుత్సాహానికీ సంతోషానికి భామేనా కారణం? భామ ఎప్పుడేనా నన్ను గూర్చి తలపెట్టి వుంటుందా? ఈ వృత్తిలో వున్నవాళ్ళకు ప్రేమ వుంటుందా? ఈ వృత్తి ఒక అలవాటు కాదా? హృదయంలో జనించే ప్రేమ, మానవస్వభావంలో ఇమిడివున్న ప్రేమ, ప్రమాద మాత్రమైన అలవాట్లవల్లా, జీవితపు తీరువల్లా చచ్చిపోతుందా? ప్రేమించే స్వభావము ప్రేమించకుండా వుండగలదా? నేను నా పడక కుర్చీలో కూర్చున్నప్పుడు, భామ డాబామీదకి వచ్చినప్పుడు ఎన్నిమార్లు మా చూపులు కలుసుకోలేదు! నేను మేడమెట్లు దిగుతున్నప్పుడు భామ వాళ్ళ రెండ అంతస్థు వసారామీదికి రావడం, ఎన్నిసార్లు తటస్థించలేదు? తటస్థపడ్డప్పుడల్లా ఆమె ఎందుకట్లా తడబడేది? ఆమె చూపుల్లో అర్థం లేదూ? ఆమె కళ్ళల్లో నాకు లేనిదేమున్నది! ...

మా గ్రామానికి దగ్గిరగానే నాకు నలభై రూపాయల ఉద్యోగమయింది. పాపం నా కోసం ఎంతో కష్టపడి చదివించిన మా అమ్మ నాలుగు నెలల క్రిందట చనిపోయింది. అమ్మ వున్నన్నాళ్ళూ అన్నిటికీ అమ్మే అన్న సంగతి నేను తెసుకోలేకపోయాను. "నువ్వు పెళ్ళి చేసుకుని ఒక ఇంటివాడవైవుంటే చూడాలని వుందిరా!" అని బహు ముచ్చట పడ్డది. ఆమె కోర్కె నెరవేర్చలేకపోయాను. ఏమి చెయ్యను? భోగంవాళ్ళ సమస్య నా జీవితంలో ఒక సమస్య అయిపోయింది. ఇదివరకే తీవ్రంగా ఆలోచించాను. ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చానుకూడా. రెండు సంవత్సరాలు, నేనూ భామా ఒక్క ఇంటిలోనే జీవితం గడిపినాము. మా పరిచయము తక్కువైనా ఒకరినొకరు బాగా ఎరుగుదుము. భామలేని నా జీవితం సంపూర్ణమైనది కాదని నాకు తెలుసు. కాని భామను పెండ్లాడడం ఎంత మాత్రం తప్పుపని కాదని అమ్మకు నేను నచ్చచెప్పగలనా? నచ్చచెప్పలేనప్పుడు ఆమెకు ఊరికే బాధకలగ చెయ్యడం ఎందుకు? అందుచేతే ఇంత వరకూ వివాహాన్ని వెనక్కితోస్తూ వచ్చాను. పాపం, అమ్మ కోర్కె నెరవేర్చలేక పోయాను.

లోకంలో వుండేవాళ్ళ మోటుమాటలు తప్ప నా వివాహానికిప్పుడభ్యంతర మేమున్నది? కాని భామతల్లి అంటే నాకింకా జంకు వదలలేదు. భామ బాగా ఈడూ జ్ఞానమూ వచ్చినపిల్లే. అయినా తల్లి ఈ వివాహానికి ఒప్పుకోకపోతే! ఏమయినా, క్రిష్టమస్ సెలవులకి ఆ వూరు వెళ్ళకుండా వుండలేకపోయాను. వెళ్ళిననాడు సాయం కాలమే భామ వద్దకు వెళ్ళాను. నన్ను చూసి చాలా సంతోషపడ్డది. ఆమె తల్లి మరణవార్త విని నేనూ చాలా సంతోషించాను. అయితే భామ అన్నిటికీ తానే పెద్దయి సిద్ధపడవలసి వచ్చినదన్నమాట!

తరువాత మెల్లిగా ప్రసంగం ఎత్తాను. "అవాళ మనం మాట్లాడుకున్నాం. జ్ఞాపకం వుందా?" అన్నాను. భామ ఏమీ అనలేదు. ఎప్పట్లాగ ఏడవనూలేదు. "భామా పెళ్ళిచేసుకుని అందరు సంసారుల్లాగా వుండడం నీకు ఇష్టం కాదూ?" అన్నాను.

"ఇష్టముంటే మట్టుకు మమ్మల్ని పెళ్ళాడేవారెవరున్నారు?" అని విచారంగా నవ్వింది.

"నన్ను పెండ్లిచేసుకోవడం నీకిష్టమేనా?" అన్నాను.

"మీరా! మీరా!" అని మహాశ్చర్యంతో అన్నది.

"భామా, నీ కిష్టమేనా చెప్పు!" అన్నాను ఆతృతతో. భామ నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టమే కాకుండా చాలా సంతోషపడ్డదని కూడా గ్రహించాను. నా సంతోషానికి మేరలేకపోయింది.

నేనా వూర్లో వున్న కొద్దిరోజులూ పొద్దున్నా సాయంకాలమూ కూడా భామ వద్దకి వెళ్ళేవాణ్ణి. ఒకరోజు సాయంకాలం నేనొక స్నేహితుడింటికి వెళ్ళాను. తిరిగివచ్చేటప్పటికి ఆలస్యం అయిపోయింది. ఒకసారి భామను చూసివచ్చేద్దామని వెళ్ళేటప్పటికి తలుపు వేసివుంది. నాకు ఒళ్ళంతా చెమట పోసింది. మెల్లిగా చప్పుడు చెయ్యకుండా మేడమెట్లెక్కి నా రహస్య స్థలంనుంచి చూశాను. భామా ఒక విలాస పురుషుడూ గదిలో వున్నారు. నేను వెంటనే మెట్లు దిగి వీధిలోకి వెళ్ళిపోయాను. కొంచెంసేపు తిరిగి మనసు కాస్త కుదుటపడ్డాక మళ్ళీ వెళ్ళాను. అప్పటికి ఆ పురుషుడు వెళ్ళిపోయాడు. నేను వెళుతూనే భామతో "ఇంకా ఇట్లాంటి పనులే చేస్తున్నావా?" అన్నాను. ఆమె మొదట తెల్లబోయింది. తరువాత ఏడవడం మొదలుపెట్టింది. అట్లాంటప్పుడు నేనేమని ఓదార్చను? అయినా ప్రయత్నించి వూరుకోపెట్టాను. ఆ మర్నాడు పొద్దున్న నేను వెళ్ళినప్పుడు కాఫీ ఇచ్చి, సిగ్గు, విచారము, ముంచుకుని

రాగా నా వెనకాల తలవంచుకుని నిలబడ్డది. నే నామె చెయ్యి పట్టుకుని "అబ్బే మనసునట్లా దుఃఖపెట్టుకోకూడదు. మళ్ళీ అట్లాంటి పనులు చెయ్యకుండా వుంటే సరేలే. చూడు!" అని సముదాయించాను.

నా కోటు జేబులోంచి భామ దొంగతనంగా సొమ్ము తియ్యడం నేనోమారు చూశాను. అట్లాంటిపని చేస్తుందని నేనెంత మాత్రం అనుకోలేదు. చాలా ఆశ్చర్యం వేసింది. కొంచెం కోపం వచ్చింది కూడా. ఏమేనా అంటే మళ్ళీ ఏడుస్తుందేమో అనుకున్నాను గాని చెప్పేయడమే మంచిపని అని తోచి మెల్లిగా మందలించాను. భామ ఏడుస్తూ నా కాళ్ళమీదపడి క్షమాపణ వేడుకున్నది. ఎప్పట్లాగా మళ్ళీ వూరుకోపెట్టాను.

నేను భామవద్ద వున్నప్పుడు రెండుమూడుమార్లు విలాస పురుషులు రావడం తటస్థించింది. ఆమె ఇప్పుడావృత్తిలో లేదని చెప్పడానికి నాకు కష్టంగా వుండేది. ఇదికాకుండా భామ ఇంకా రహస్యంగా సిగరెట్లు కాలుస్తూందని సారాయి తాగుతుందనీ నాకు తెలిసిపోయింది.

కొద్దిరోజులలోనే నా తప్పు నేతెలుసుకున్నాను. ఇన్ని రోజులూ పెళ్ళి చేసుకోకుండా నేనెందుకున్నట్టు? మర్నాడు పెళ్ళి సర్టిఫికెట్టు తెస్తాననీ మూడు రోజుల్లోగా పెళ్ళయి పోతుందనీ, ఆ రాత్రే భామతో చెప్పాను. అప్పుడు రాత్రి తొమ్మి దయింది. భామ సంతోషించడానికి బదులు ఏడుస్తూ నా కాళ్ళమీద పడ్డది. నాకు మహాశ్చర్యం వేసింది. మెల్లిగా లేవదీసి ఎందుకేడుస్తూందో అడగబోయాను. ఆమె ఏడుస్తూనే "నేను పాపాత్మురాలిని మీరు పెళ్ళి చేసుకోడానికి తగను" అని ఏమేమో అన్నది. తుదకి భామ అప్పుడు గర్భవతి అని నాకు బోధపడ్డది. అప్పుడు నా కెట్లా వుండెనో ఇప్పుడు చెప్పలేను. అట్లాంటప్పుడు పెళ్ళిచేసుకోవడమా మానివెయ్యడమా? నా మట్టుకు నాకే చిన్నతనంలా తోచింది. నేనిట్లా కొంచెముసేపు మాట్లాడకుండా వూరుకోవడంచూసి భామ బెంగపెట్టుకుంది. కాని నేను నవ్వుతూ 'అయితేనేమి భామా మనం తప్పకుండా పెళ్ళి చేసుకుందాం' అని ఆమె చెయ్యిపట్టుకుని అనేసరికి ఆమె సంతోషానికీ కృతజ్ఞతకూ మేరలేకపోయింది.

మా ఇద్దరికీ పెళ్లయింది. ఇప్పుడు నేను భామతో కూడా మా గ్రామందగ్గిరే వుంటున్నాను. నాకిప్పుడు యాభైరూపాయలిస్తున్నారు. ఆమె కూతురికి రెండేళ్ళు నిండిపోయాయి. అచ్చు తల్లిపోలిక. ఎంతో అందంగా ఉంటుంది.

నా చిన్నప్పటి పరిచయస్థులూ, ఇప్పటివాళ్ళూ నన్ను చూసినప్పుడు తొలగి పోవటం లేదు. ఏ కొద్దిమందో ... నాకేసి విషపు చూపులు విసరడం తప్ప, మిగిలిన వాళ్ళు చాలా మట్టుకు నాతో చనువుగానూ స్నేహముగానూ వుంటున్నారు. ఏమయినా నా జీవిత మిప్పుడు చాలా సౌఖ్యంగా వున్నది. సిగరెట్టూ సారాయీ మాంసాహారమూ కూడా మానెయ్యడం మంచిదని చెప్పాను. కాని నేను చెప్పవలసిన అవసరం ఏమీ లేదు. ఆమె అంతర్యములోనే పెద్దమార్పు వచ్చింది. ఆ వ్యసనాలన్నిటియందూ ఆమె కిప్పుడు అసహ్యం. ఇది జరిగి రెండేళ్ళు దాటిపోయింది, ఇంకా బిడ్డలకోసం నాకూ విశేష అభిలాషలేదు. కాకపోయినా భామబిడ్డ కొంచెం సుస్తీ అయిన పిల్ల, జాగ్రత్తగా చూడాలని డాక్టరు దొరసాని చెప్పింది, ఇప్పుడా పిల్లకూడా ఆరోగ్యముగా వుంటూంది.

భామ ఇప్పుడు పూర్వపు భామకాదు. అందరు సంసారుల్లాగే నేను భోజనం చేస్తేగాని తాను భోజనం చెయ్యదు. నేను పక్కమీద కూర్చుంటే ఎంతమాత్రం తాను పడుకోదు. వద్దన్నా కాళ్ళు పడతానంటుంది. ఇంత ఆపేక్షగానూ, ప్రేమగానూ వుంటుందా, మళ్ళీ ఎక్కడలేని సిగ్గున్నూ, నా వద్ద ఆమె ఇదివరికేమేనా నేర్చుకున్నా, ఇప్పుడు నేనామె వద్ద లక్ష నేర్చుకోవలసి వున్నాయి. ఒక్కొక్కప్పుడు ఆమె మంచితనానికీ, సరళస్వభావానికీ నేనేమీ తగననిపిస్తుంది.

భామ కూతురు పెద్దకళ్ళతో ఏమో చూస్తూ నిశ్శబ్దంగా నావొళ్ళో కూర్చుంటుంది. పాత సంగతులన్నీ జ్ఞాపకం రాగా నా హృదయం వింత భావాలతో నిండిపోతుంది. బిడ్డను ఎత్తి ముద్దాడతాను. ఆమె హృదయంలో అప్పుడెటువంటి భావాలు పుడతాయో?

ఒక్కొక్కప్పుడు వెనకటి సంగతులన్నీ జ్ఞాపకం వచ్చి నిట్టూర్పు విడుస్తాను. బడి నుంచి వచ్చి వసారాలో కూర్చుని భామ పాట వింటూంటే ఎంత హాయిగా వుండేది? ఆమెది ఎంత చక్కని కంఠస్వరం! నా హృదయం పెద్ద ఆనందంతో, గాఢమైన ప్రేమతో, ఇంకా అనేకమైన వింత వింత భావాలతో నిండిపోయేది. ముందున్న మంచిరోజులన్నీ, ముందున్న సౌఖ్యమంతా, ఆమె పాటలో వినిపించేది. అవి ఎంత మంచిరోజులు! ఇప్పుడు కూడా భామ చక్కగా పాడుతుంది.

నేనామెకేదో పెద్ద ఉపకారం చేశాననీ, నా కెల్లప్పుడూ కృతజ్ఞతగా వుండాలని అనుకుంటుంది కామోసు. నన్నో దేవుడులా చూస్తుంది. అది చూసి ఒక్కప్పుడు నేను మురిసిపోయినా ఒక్కక్కప్పుడు సిగ్గు వేస్తుంది కూడా. "భామా! నువ్వనుకున్నంత ఎక్కువేమీ నాలో లేదు. నువ్వెంత అందమైనదానివో, ఎంత చక్కగా పాడతావో తెలుసా?

నేనెంతో అదృష్టవంతుణ్ణి కాబట్టే నిన్ను పెళ్ళాడే భాగ్యం కలిగింది" అని దగ్గిరగా లాక్కుని గాఢంగా కౌగలించుకుంటాను. భామ ఎంతో ప్రేమతో నాకేసి చూసి నవ్వుకుంది. ఇంక చెప్పడానికేముంది? నేనూ, భామ, మా బిడ్డా సౌఖ్యంగా జీవితం గడుపుతున్నాం.

## కథానేపథ్యం ...

ఈ రచయిత ఒరిస్సాలోని తెలుగు ప్రాంతమైన బరంపురానికి చెందినవారు. ఇప్పటికి కూడా బరంపురంలో తెలుగు మహాసభలు జరుగుతూ ఉన్నాయి. తెలుగు భాషా సాహిత్య సంఘాలు నెలకొని పనిచేస్తున్నాయి. కళ్ళికోట మహారాజా కళాశాలలో స్నాతకోత్తర తరగతులు తెలుగు భాషాసాహిత్యాలను బోధిస్తూ ఉన్నాయి. ఒకప్పుడు తెలుగు వారి సాహిత్య సాంస్కృతిక భాషా కేంద్రం బరంపురం.

ఈ కథ ముద్దుకృష్ణ (వైతాళికులనే కవితా సంకలనం సంపాదకుడిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధుడు) సంపాదకత్వం వహించి నడిపిన జ్వాల పత్రికలో వచ్చింది. ఈ పత్రిక 1927లో మొదలైంది. రెండు మూడు సంవత్సరాలకన్నా వెలువడినట్లు తోచదు. ఈ జ్వాలపత్రికలో విశ్వనాథవారి 'కిన్నెరసాని పాటలు – కోకిలమ్మపెళ్ళి' అనే ఖండకావ్యాలను శ్రీశ్రీ సమీక్షించినట్లు ఇప్పటి తరంవారికి తెలియకపోవచ్చు. మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు రాసినట్లూ తెలిసి ఉండరు. తల్లావఝుల శివశంకరశాస్త్రి 'నీలకంఠం' కథలు ఈ పత్రికలోనే వచ్చాయి.

ఆ రోజుల్లోనే వేశ్యలను ప్రధాన సమాజ స్రవంతిలోకి తీసుకొని రావాలన్న కోరిక చాలామంది యువ రచయితలలో ప్రధానోద్వేగ ఆశయంగా ఉండేది. ఈ కథ కేవలం గొప్ప ఆదర్శంతో రాసినట్లు కనపడుతున్నది. సామాజిక వాస్తవికతకు సమన్వయం దూరాభారంగా కన్పించవచ్చు. దిగుమర్తి రామారావు కథలు రెండు సంపుటాలు ఆ తర్వాత కాలంలో వెలువడినట్లు పత్రికా సమీక్షల వల్ల తెలుస్తున్నది. శ్రీకాకుళం కథా నిలయంలో సంరక్షితమైనాయో లేదో తెలియదు.

# 30. కాలం కల్పించే మార్పు

– ముద్దుకృష్ణ

అస్తమించిపోతూ వున్నా రోజు యాతనపడుతూ ఉన్నది. ఇకను ప్రపంచానికి చీకటే అని భయపడిపోతూ ఉన్నట్టు పక్షులూ, జంతువులూ ఖంగారుగా అరుస్తూ ఉన్నవి. అస్తమింపు తాత్కాలికం, మళ్ళీస్వచ్ఛ కాంతులతో ఉదయం కలుగుతుంది అనే జ్ఞానమున్నట్టు మానవుడు మాత్రం నిర్విచారంగా నడిచిపోతున్నాడు.

ఈ వింత ఆలోచనలలో అర్థం కాని అనేక ప్రశ్నలు స్ఫురిస్తూ ఆకాశం కేసి చూస్తున్నాను. ఇంతలో మెట్లకింద నుంచి 'కో–ఆ–ఆ–మ–అ–య్యా–ఆ–ఆ' అనే వొణుకు గొంతుకు వినవచ్చింది. లేచిచూడడానికి పోబోతూవుంటే ఒక ముసాలిపండు కఱ్ఱ ఊతగా కాళ్ళునట్టుకుంటూ తొందరగా నా పక్కనుంచి తిన్నగా పడమటిగదిలోనికి వెళ్ళిపోయింది. నేను ఆశ్చర్యపడుతూ ఒక అడుగు లోపలకు వేసేప్పటికి, ఏదో క్రింద పెట్టినట్టు ఠక్కుమని చప్పుడైంది. "కామయ్యా, ఇదిగో నీది నీవు తీసుకో, నీది నీకు అప్పగించానబ్బా, ఇంక నాకెందుకూ మరి నేను పోతున్నా, నేపోతాను కామయ్యా, పోతున్నా!" అంటూ గదిలోనుంచి వచ్చి గబగబా మెట్లు దిగి వెళ్ళిపోతూ ఉంది. ఆమె కంటికి నేను అగుపించినట్టే లేదు. ఆ చూపు ఎక్కడనో మరి!

గదిలోకి వెళ్ళి చూస్తే ఒక దంతపునగిషీ పెట్టి మంచం దగ్గరగా నేలమీదను ఉన్నది. ఎత్తుతే చాలా బరువుగా వుంది. దానికే పట్టుతాడుకు కట్టిన బంగారు తాళం వేలాడుతూ వుంది. తెరిచిచూస్తే లోపల వజ్రం ఉంగరాలూ, కమ్మలూ, జహ్వారీ ఉన్నవి. ఇంతలో వీధిలో ధప్పుమని పడినట్టు చప్పుడైంది. వరాండాలోనికి పరుగెత్తి తొంగిచూస్తే వీధిలో మెట్లకింద ఆ ముసలి వెల్లకిలా పడి గుడ్ల తేలవేస్తూ ఉంది. పరిగెత్తుకుని వెళ్ళి, భుజాలు పట్టుకుని లేవదీయబోయాను. 'కామయ్యా, కామయ్యా' అంటూ ప్రాణాలు వొదిలేస్తూ ఉంది. ఎదరింటిలో ఉన్న వెంకటశాస్త్రులుగారు అరుగుమీదకు వచ్చి 'ఆశిరంధా, ఇక్కడకే వచ్చి చచ్చింది!' అంటూ అయ్యా వదలండి వదలండి కులం చెడిన మనిషి అన్నాడు. ఆమె ప్రాణాలుపోయినై. వీధిలో పదిమందీ,

దారిపోయే ప్రజా, శవం చుట్టూ గుమిగూడారు. అందరూ నోటికి ఒక మాటగా అన్నమాటలను బట్టి నాకు తెలిసిన కథ ఇది –

కామయ్య అనే కంసాలి ఒకాయన ఈ వీధిలో కాపురం ఉండేవాడు. ఆయన నగిషీపనిలో చాలా చేతకారి. ముందు నగలషాపు, తరువాత బట్టలషాపు పెట్టి, బంగారం నవరత్నాలు మొదలైనవి వర్తకాలు చేసి అయిదారు లక్షల రూపాయల ఆస్తి సంపాదిం చాడు. ఈ వీధిలో మేడలన్నీ ఆయన కట్టించినవే. రెండు ఇళ్ళు తప్ప ఈ వీధి అంతా కొనేశాడు. వీధికి ఆయన ఇంటిపేరే పెట్టారు. ఉన్నన్నాళ్ళూ మహావైభవం అనుభవించాడు. రెండు గుర్రాలబండీ, ఎందరో నౌకర్లు, మహాఠీవిగా ఉండేవాడు. ఈ చనిపోయిన ముసలిది! భోగంస్త్రీ, కామయ్య ఈవిణ్ణి చిన్నప్పుడే చేరదీశాడు. ఈమె ఆయన భార్యవలెనే జీవించింది. ఆయనతోపాటు జీవితం గొప్పగా అనుభవించింది. రవ్వలజహ్వారీ, గుర్రంబండీ, పెద్దమేడా చాలాదర్జాగా వెళ్ళింది ఆమెజీవితం. ఆ రోజుల్లో అంత అందమైన స్త్రీ మరెవ్వరూ లేరనుకొనేవారట. పదేళ్ళక్రితం కామయ్య చని పోయాడు. మీనాక్షి ఆనాటి నుంచీ నగలన్నీ తీసివేసి వితంతువలె ఉండేదట. మొన్నటి వరకూ తీర్థయాత్రలలోనే జీవితం గడిపివేసింది. ఊరిలోనికి ఎప్పుడు వచ్చిందో కూడా తెలియదు.

ఈ విధంగా ఆమెను కీర్తించనివారులేరు. ఒక్క వేంకటశాస్త్రులే మధ్య మధ్య చెడ్డగా అంటూ వచ్చాడు. విన్న దాన్ని బట్టి ఆమె మీద నాకు చాలా గౌరవం కలిగింది. ఆమె జహ్వారీ సంగతి తొందరపడి బయటపెట్టకూడదని నిశ్చయించుకున్నాను. మేడమీద కెళ్ళి దంతం పెట్టిని జాగ్రత్తగా పెట్టిలో దాచివేసి, కిందకు వచ్చి కూచున్నాను. వొచ్చే జనమూ పోయే జనమూ ఎన్ని కబుర్లు చెప్పినా ఆమె దహనం సంగతి ఎవ్వరూ ఎత్తడం లేదు. వెంకటశాస్త్రుల్ని పక్కకు పిలిచి ఈ సంగతి అడిగితే, వికృతంగా నవ్వుతూ "ఎబ్బే ... మనకెందుకు బాబూ, ఆ మున్సిపల్‌కి కబురుచేస్తే పాకీవాళ్ళని పంపిస్తారు. ఆ వెధవలు కాలికి తాడుగట్టి లాగేస్తారు. నీతీ జాతీ లేని ....' అంటూ బండగా మాట్లాడడం ప్రారంభించాడు. నాకు చాలా కష్టంగా తోచింది, ఇతని ప్రవర్తన. తిన్నగా 'హాస్టల్'కు వెళ్ళి సంస్కరణాభిలాషులమంటూ 'డిబేటింగు సొసైటీ'లో ఉపన్యాసాలిచ్చే మా క్లాసు వాళ్ళని హెచ్చరించాను. చాలా ఉత్సాహంగా హాస్టలంతా, చందాలు పోగుజేసి ఇరవై రూపాయలు సమకూర్చి, నా వెంట బయలుదేరారు. కాని, ఎంత డబ్బు ఇస్తామన్నా మోతకు ఎవ్వరూ రామన్నారు. భోగంవీధికి వెళ్ళి అక్కడి వాళ్ళని అడిగితే 'కంసాలిని ఉంచుకుని కులంచెడినదాన్ని ఎవరుమోస్తారు?' అన్నారు. అప్పటికీ

తొమ్మిది గంటలైంది. మాతోఉన్న నాయుడిగారి అబ్బాయి, ‘ఆలోచించడం ఎందుకు మనమే మోసుకుపోదాం, తప్పేముంది?’ అన్నాడు. అందరమూ అంగీకరించాము. నలుగురు ఏనాదులు డబ్బిస్తే సహాయానికి మాత్రం వస్తామన్నారు. వీధంతా తెల్లబోయి విచిత్రంగా చూస్తున్నారు. వెంకటశాస్త్రి నోరువిడిచి ఒకవోస్తరుగా మాటలు రానిస్తున్నాడు. పైగా, పోలీసు బెదిరింపుకూడా ఒకటిపెట్టారు. నాయుడు సర్కిల్ఇన్‌స్పెక్టరు బంధువు. వెళ్ళి ఆయన్ని తీసుకువొచ్చాడు. ఆయన దగ్గరఉండి పంచాయితీ చేసి ‘మీ ఇష్టం. తీసుకు వెళ్ళవచ్చు’ నన్నాడు. ఆ పరిస్థితుల్లో ఆ శవాన్ని మోసుకువెళ్ళడం ఒక వీరకార్యంలా అనిపించింది మా కందరికీ.

మర్నాడు నేను లేచేప్పటికి చాలా పొద్దెక్కింది. ముఖం కడుక్కుని కాఫీకి బయలు దేరాను. వీధి గుమ్మం తీసేప్పటికి గుప్పుమని వాసన వేసింది. గుమ్మమంతా, గోడలనూ అసహ్యం చేశారు ఎవరో, ఎదర కిటికీలోనుంచి వెంకటశాస్త్రులు కనపడీ కనపడడంగా నన్ను ఓరచూపు చూసి పక్కకు తప్పుకున్నాడు. దారేపోతూ ఉన్న తోటీని పిలిచి ‘ఏమైనా ఇస్తాను బాగుజేయమంటే’, ‘చాలా పని ఉన్నది బాబూ’ అని నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు. నాకు అవగాహన అయింది దీని అర్థం చాలా పట్టుదలగా తోచింది. తిన్నగా ఊరి బయటకు వెళ్ళి అక్కడి చచ్చుడి మనిషికి అర్థరూపాయి ఇచ్చి తీసుకు వచ్చాను. ఆ మనిషి బాగుచేస్తూ వుంటే వెంకటశాస్త్రులు కిటికీలోంచి రెండు మూడు సార్లు తొంగి చూశాడు.

ఆనాడు కాలేజీ అంతా మమ్మల్ని గురించే చెప్పుకున్నారు. నా చర్య అందరికీ వింతగా ఉన్నది. వారు క్రిందట సాంఘిక సంస్కారాన్ని గురించి ప్రొఫెసర్ వెంకయ్య గారు ఉపన్యసిస్తే సనాతన ధర్మాలను పాడుచేయరాదని నేను ఆయనకు వ్యతిరేకంగా తీవ్రంగా మాట్లాడుతూ, వెంకయ్యగారు చెప్పిన సాంఘిక సమస్యలు ఆయన కల్పించు కున్నవే అనీ, హిందూ సంఘం అన్ని సంఘాలకన్నా ఉత్తమ స్థితిలో ఉన్నదనీ, ఆర్య మతాన్ని గురించీ, వర్ణాశ్రమ ధర్మాలనుగురించీ వొళ్ళు తెలియకుండా మాట్లాడాను. నన్ను చూడగానే వెంకయ్యగారు చేయిపట్టుకుని అభినందిస్తూ, “నీవు నిన్న చేసిన పని విన్నాను. నాకు చాలా సంతోషంగా ఉన్నది. మన సంఘంలోని లోపాలను క్రమేణా గ్రహించిన కొలదీ మా దృష్టి నీకు అర్థమౌతుంది” అన్నారు.

నిద్రమత్తుగా ఉండడం వల్ల మధ్యాహ్నానికి సెలవు పుచ్చుకుని ఇంటికి వచ్చి పడుకున్నాను. సాయంత్రం నాలుగుగంటలకు మెలకువ వచ్చింది. టీ తాగుదామని

కిందకు దిగి తలుపు తాళంవేస్తూ ఉంటే రెండు రాళ్ళు నా వెనకనుంచి తలుపుకు తగిలినవి. చప్పుమని తిరిగిచూస్తే ఇద్దరు కుర్రాళ్ళు ఎదరసందులోనుంచి తొంగి చూస్తున్నారు. ఉపేక్షించడం కార్యం కాదని తరమబోయాను. కాని వెంకటశాస్త్రి దొడ్డిగుమ్మం వద్ద సందుమలుపులో వాళ్ళు మాయమైపోయారు. నేను తిరిగివొస్తూంటే మూడవ ఇంటిలో ఉన్న అవధాన్లు "అయ్యా! మాట" అని అరుగుమీద కూర్చోబెట్టి నాకు కొన్ని సంగతులు చెప్పారు. దాని సారాంశం ఇది –

నేను చేసిన పని ఈ వీధిలో బ్రాహ్మలకే కాకుండా అందరికీ కూడా కంటకంగా ఉన్నది. భోగంవాళ్ళే ముట్టుకోడానికి అసహ్యించుకునే పాడు శవాన్ని నేను మోయడమే కాకుండా, శ్రోత్రియ కుటుంబాలలోని ఇంకో ముగ్గురు కుర్రవాళ్ళ చేత కూడా మోయించాను. వాళ్ళని పాడుచేసింది నేనే అని అందరి అభిప్రాయము. అందరికీ నా చర్య కష్టంగానేఉన్నది. దానికి తోడు వెంకటశాస్త్రి ఒక వింత ప్రచారం ప్రారంభించాడు. ఏమనంటే – రాజమహేంద్రవరంలో వీరేశలింగం అని ఒక పంతులూ, ఎవరో ఇంకొక గిరజాల బందరు నాయుడూ ఉన్నారట. ఈ పంతులూ నాయుడూ కలిసి అనేక అభాజనపు పనులు చేస్తున్నారట. మొగుడుపోయిన వితంతు పిల్లల్ని ఎత్తుకు వచ్చి వాళ్ళ ద్వారా కుర్రవాళ్ళని ఆకర్షించి వివాహాలు చేయిస్తున్నారట. చెడిపోయిన ఆడవాళ్ళనీ, కులటల్నీ మంచి మార్గానికి తిప్పుతున్నామని ఏమీ ఎరగని కుర్రాళ్ళకి కట్టబెడుతున్నా రట. వర్ణభేదం అన్యాయమని బ్రాహ్మణ కుర్రాళ్ళచేత నానా మాలకూడూ తినిపిస్తున్నారట. ఈవిధంగా వీళ్ళిద్దరూ పవిత్రమైన హిందూసంఘాన్ని పాడు చేస్తున్నారట.

ఈ నాయుడు చిన్నప్పుడు మిలిటరీ అట. బాగా తాగుతాడట. పంతులు నాయుడుతో లోపాయికారీని మాంసం తింటాడట, కాని తాగుతాడో లేదో మాత్రం తెలియ దట. వీళ్ళని నమ్మివచ్చిన అమాయకపు ఆడప్లిలలగతీ, అసలు చెడిపోయి వీళ్ళ దగ్గర చేరిన కులటల విపరీతాలూ చెప్పనక్కరలేదట. "మిమ్మల్ని అనుసరిస్తాము, ఎక్కడయినా మొగుడు పోయిన పిల్లలు వ్యక్తురాళ్ళయినవాళ్ళుంటే వాళ్ళని లేవదీసుకు వస్తాము" అంటే నెలకు ముప్పై రూపాయల చొప్పున ఇస్తాడట. నేను ఈ విధంగా వాళ్ళ డబ్బు తింటూ వాళ్ళని పతనం చేయడానికి చెడిపోయినవాళ్ళలో ... భోగందాని శవాన్ని ఇలా మోసుకువెడితే నలుగురూ ఎలా అనుకుంటారో చూతామని నేను వేసిన ఎత్తట నిన్నటిపని. కొందరైనా మెచ్చుకుంటే అది అదనుగా తక్కిన కార్యాలకు

ఉపక్రమిస్తానట. నన్ను ఈ వీధిలో ఉండనిస్తే ఆడవాళ్ళకి మానం దక్కదట. ఇప్పటికే ఇళ్ళల్లోని చాలా వితంతువులకు ఉత్తరాలు నడుపుతూ ఉన్నానట. ఇక నేడో రేపో ఒకరొకర్నీ రాజమహేంద్రవరం తరలిస్తానట.

ఈ విధంగా వెంకటశాస్త్రి రహస్యంగా ఆడవాళ్ళతోనూ, మగవాళ్ళలో పెద్దవాళ్ళ తోనూ చెప్పి, సాధ్యమైనంత త్వరలో నన్ను వెళ్ళగొట్టించి తమకు రానున్న ప్రమాదాలను తొలగిస్తాను అంటున్నాడట. తనకు పద్దెనిమిదేళ్ళ వితంతువు కూతురు ఉండడం వల్లను భయపడి ఇంతకు పూనుకోవలసి వచ్చినది అని వంక కల్పించుకుని ఒక ప్రచారం ప్రారంభించాడట. ఇది కొందరు పూర్తిగా నమ్ముతున్నారట. వెంకటశాస్త్రి మాట కేవలం నమ్మకంకాదుగాని, నేను నిన్న చేసినపని నమ్మకానికి అవకాశం కల్పిస్తూఉన్నదట. ఇదంతా సాంతంగా చెప్పి “అయ్యా ఎటునుంచి ఎటువొస్తుందో, ఎందుకువచ్చింది మీరు ఇంకెక్కడైనా బస చూసుకుని, ఇక్కడినుంచి తప్పుకుంటే మంచిది. తరువాత మీఇష్టం. గోలపడడం ఎందుకని మీకు చెప్పుతున్నాను” అని నన్ను పంపించి వేశారు అవధానులుగారు.

అప్పటికి నాకు మహావింతగా ఉన్నది ఈ చరిత్ర వీరేశలింగం పంతులుగారిని గురించిగాని, వెంకటరత్నం నాయుడుగారిని గురించిగాని నాకు విస్తారం తెలియదు, ఏమిటా ఇదంతా అనుకుంటూ గుమ్మంలోనికి వచ్చి, తలుపు తాళం తీయబోతూంటే వెంకటశాస్త్రి అరుగుమీదకు వచ్చి సకిలించి ‘ఒకమాటు ఇలా దయచెయ్యండి’ అన్నాడు. సరే చూతామని వెళ్ళాను. చావడిలో కుర్చీమీద కూచోమని, నా మేలుకోసమే తాపత్రయ పడుతూన్నట్లు, ఈ ఉపన్యాసం ఇచ్చాడు. ఇతని సంగతి కనిపెడదామని మాట్లాడకుండా విన్నాను.

“మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు. ఎంత అభిప్రాయ భేదాలున్నా, మనం ఒక శాఖవాళ్ళమనీ, దూరంగానయినా మీరు బంధువులనీ, మనలో కొంచెం పైకి వచ్చేటట్టు గొప్ప చదువులు చదువబోతున్నారనీ లోపల అభిమానమూ, గర్వమూ ఏడుస్తుంది నాకు. ఇంతకీ మీరేం స్వార్థాన్ని ఎంచుతున్నారు గనుకనూ! సంఘం సరియైన స్థితిలో లేదనీ, ఎలాగైనీ మీరనుకున్నదారికి పట్టించుతే బాగుపడుతుందనీ మీ అభిప్రాయం. ఈ విషయాలు నేనూ ఆలోచిస్తూ ఉన్నవాణ్ణే గనక గ్రహించగలను. మొట్టమొదట ఆ వీరేశలింగంతో చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాను. నేను పత్రికలకు వ్రాశేవాణ్ణి, ఆయన అభిప్రాయాలు నాకు తెలిసినంత బాగా ఇతరులకు తెలియవేమో

కూడా. ఒక విధంగా మహాధీరుడూ, మహానుభావుడూకూడా. లోపల ఈ విషయమై ఆయనంటే నాకు గౌరవం లేకపోలేదు. నా మతం ఏమిటంటే సంఘాన్ని అలా రెచ్చకొట్టడం కన్నా మార్పు నెమ్మది నెమ్మదిగా రప్పించడం ఎక్కువ తెలివైన పని అని. సంఘం మహామూర్ఖం చూడండి! బొత్తిగా బెదరగొడితే లొంగదు.

“ఇంతకూ మీకు చెప్పవొచ్చేదియేమిటంటే; మీరు నిన్న చేసిన పని పెద్ద తప్పేమీ కాదు. కాని, మరిఎంతైనా బ్రాహ్మణసంఘం, అందులోనూ మన వైదీకిశాఖ అంగీకరించ లేదు. ఇక్కడివాళ్ళు మహాఛాందసులు. మీమీద వాళ్ళకి మహాకష్టంగా ఉన్నది. నేను కొంత చెప్పి చూశాను. కాని ప్రయోజనం లేదు. మిమ్మల్ని ఈ వీధిలో ఉండనివ్వడం వాళ్ళ అభిప్రాయం కాదు. ప్రొద్దున్న చూడండి వాళ్ళు చేయించిన పాడుపని, నాకు మనస్సు మహాకష్టం అనిపించింది. కాని ఏం చేయం? సంఘానికి ఎదురువెళ్ళి నిర్వహించడం ఎంతకష్టం! పాపం ఆ వీరేశలింగం పంతులు చూడండి ఎన్ని అవస్థలు పడుతున్నాడో!

“మీరు మరో విధంగా తలుచుకోనంటే చెబుతాను. ఈ విధంగా మీరు ఉంటే ఎలాగైనా ఈ వీధిలో నుంచి మిమ్మల్ని పంపించివేయాలనే ప్రయత్నాలు తీవ్రంగా జరుగుతవి. నేనైనా ఆపలేను. కాని నాది ఒక చిన్న సలహా ఉన్నది. మీకు అంగీకారం కాకపోయినా క్షమించాలి. ఏదో బంధువులమనే అభిమానం ఆపుకోలేక అంటున్నాను. చూడండి! సంఘసంస్కారమైనా అడుగుతీసి అడుగువేయాలి కాని, తొందరపడి పరిగెడితే కాదు. ఇదివరలో మీతో చెప్పాను మా అన్న కూతురు సంగతి. ఇతర సంబంధాలు వొస్తూ ఉన్నవని వాళ్ళు తొందరపడుతూ ఉన్నా, ఆగమని నేను ఆపు జేయిస్తున్నాను. మీరు ఈ సమయంలో సరే అని రేపు తాంబూలాలు అంగీరించారా నా సంగతి చూడండి! నాకు ఆ మాత్రం అవకాశం ఇచ్చారా అది ఆధారంగా తీసుకుని వీధినంతా తిరగదోస్తాను. మీరు గృహస్థధర్మం ఒప్పుకుంటున్నారు; మన శ్రోత్రియ సంబంధమే అంగీకరించారు అంటే నొక్కుకుపోతవి ఈ నోరులన్నీ. ఏదో పెద్దవాణ్ణి, కావలసినవాణ్ణి కనుక వినండి. ఇదీకాక, మీరు ఒంటిగాకన్నా గృహస్థు అయితే నిర్వహించగలుగుతారు ఏ సంస్కారాన్నైనా. నా మాట నమ్మండి. ఇప్పుడే వస్తాను కొంచె కూచోండి” అని లోపలకు వెళ్ళాడు.

నేను మాట్లాడితే కాదు, ఇతని వింతపోకడలు కనిపెడదామనుకుంటున్నాను. ఇంతలో పక్క తలుపులు జాగ్రత్తగా తీసుకుని శాస్త్రులు వితంతు కూతురు బెదురుతూ

నా దగ్గరకు వచ్చి బొడ్డులోంచి ఒక ఉత్తరం తీసి ఖంగారుగా నా జేబులో దోపి "మీరేమీ అనుకోకండి. ఈ ఉత్తరం చదువుతే అంతా తెలుస్తుంది. మా నాన్నకు మాత్రం తెలియ నీకండి, జాగ్రత్త. నాన్న వలలో పడిపోకండి. ఇంకవస్తాడు, ఏమైనా ఇది రహస్యం, కాపాడండి, మీరే క్షమించాలి నన్ను" అని నా చేతులు రెండూ గాభరాపడుతూ నొక్కి ఆ గదిలోనికి వెళ్ళిపోయి తలుపులు వేసుకుంది. ఇంకో నిమిషానికి ఒక ఫోటో తీసుకుని శాస్త్రి వచ్చాడు. అది నా చేతిలో పెట్టి ఆ అమ్మాయిని వర్ణిస్తూ కట్నం ఇంకో వందో రెండు వందలో హెచ్చు చేయిస్తాను అని సోది ప్రారంభించాడు. ఈ పరిస్థితులలో నేను తొందరపడడం మంచిది కాదని ఎటూ చెప్పకుండా తప్పించుకుని వచ్చాను.

తలుపులు జాగ్రత్తగా వేసుకుని, దీపం వెలిగించి, ఉత్తరం తీసి చదువుకున్నాను. దానిలో ముఖ్యమైన విశేషాలు ఇవి – "మా నాన్న దుర్మార్గుడు, దొంగ, మహా స్వార్థ పరుడు. పరాయివాళ్ళూ తనవాళ్ళూ అన్న భేదం కూడా లేదు, కూతురు అనే ఆలోచన అయినా లేదు తన స్వార్థం ప్రయోజనమైనప్పుడు ...

నా ఎనిమిదవయేట నాలుగువేల రూపాయలకు ఆశపడి నన్ను అరవైరెండేళ్ళ ముసలివాడికిచ్చి పెళ్ళిచేశాడు. ఇంతకన్నా అన్యాయం, నాలుగేళ్ళక్రితం రెండు వేల రూపాయలు ఇస్తే నన్ను ఇచ్చివేస్తాను, మళ్ళీ పెళ్ళో ఏదో మీ ఇష్టం వచ్చినట్టు చేసుకో వచ్చును అని వీరేశలింగం పంతులుగారికి వ్రాశాడు. ఆయన మండిపడి మహాచివాట్లు వేస్తూ వ్రాశారు. ఆ ఉత్తరం నేను చూడడం తటస్థించింది. అప్పటివరకూ ఆ వీరేశలింగం గారు ఎవ్వరో తెలియదు. ఆడపిల్లల్ని డబ్బిచ్చి కొనుక్కునేవారు ఎవరో మా నాన్న కన్నా కసాయి అనుకుంటూ వచ్చాను. కాని, నిన్నను మా నాన్న ఆయన్ని గురించి పొరుగింటి శేషమ్మతో చెప్పుతూ వుంటే విన్నాను. మహానుభావుడు మాలాంటి దిక్కులేనివారి యాతనలను తప్పించడానికి అవతరించాడు ... మీరు వారి అనుచరులే అని మా నాన్న అంటే విన్నాను. మీరందరూ ఎంత మహానుభావులు ... నన్ను ఎలాగైనా దయ ఉంచి పంతులుగారి దగ్గరికి చేర్చండి మీకు పుణ్యముంటుంది.

మా పెదనాన్న చచ్చిపోగానే దిక్కులేని ఆయన భార్యను దగాచేసి ఆ ఆస్తి కాజేశాడు. అతని కూతురిపెళ్ళి తన నెత్తిమీద పడిపోయింది. మీకు ఎలాగైనా అంటగడదామని ఎత్తు ఎత్తాడు కాని, మీరు పడలేదు. ఆనాటి నుంచీ మీమీద చాలా కోపంగా ఉన్నాడు. ఏమీ చేయలేక ఇన్నాళ్ళూ ఊరుకున్నాడు. ఇప్పుడు అదను దొరికింది.

మా నాన్న కామయ్య దగ్గర గుమాస్తాగా ఉండేవాడు. కామయ్య ఎన్నో విధాల ఉపకారాలు చేశాడు. ఈ ఇల్లు కట్టించి ఇచ్చాడు. అతనికి తెలియకుండా మా నాన్న అతని వ్యవహారాలలో చాలా డబ్బు దొంగిలించాడు. అప్పటికీ కక్కుర్తి బ్రాహ్మణుడు అని ఊరుకున్నాడు కామయ్య. కాని మా నాన్న అంతలో ఆగలేదు. నెమ్మదిగా మీనాక్షిని స్వాధీనం చేసుకుంటే ఆవిడ డబ్బుకూడా కొంత కాజేయవచ్చునని ఆమెను లొంగదీసుకో పోయాడు. మీనాక్షి చాలా అభిమానం గల మనిషి, పతివ్రత, కోపిష్టికూడా. కామయ్య ఎదరను ఒకనాడు మా నాన్నను చెప్పు తీసుకొని కొట్టి గెంటించివేసింది. అప్పటినుంచీ మీనాక్షిని సాధించవలెనని అనేక ప్రయత్నాలు చేశాడు కాని, మంచి పలుకుబడి ఉన్న మనిషి, ధనవంతురాలు, సాగింది కాదు. చచ్చిన తరువాతను అయినా సాధించి సంతోషించుదామనుకుంటే మీరు అడ్డు వచ్చారు. దాని అదృష్టం, మీలాంటి బ్రాహ్మల చేతుల మీదుగా వెళ్ళిపోయింది. ఆ కారణాలచేత మా నాన్నకు మీమీద మహాకక్షగా ఉన్నది. నీచుడు, ఏం చేయించినా చేస్తాడు. నిన్నటినుంచీ ఛండాలపు పనులన్నీ చేయిస్తున్నాడు. మిమ్మల్ని గురించి ఇరుగుపొరుగు వాళ్ళందరితోనూ అసహ్యంగా చెబుతున్నాడు. ఏదైనా, నాకు మాత్రం ఉపకారమైంది. ఇందువల్ల ఆ మహానుభావులు వీరేశలింగం పంతులుగారిని గురించీ, మిమ్మల్ని గురించీ నాకు బాగా తెలిసింది. వితంతువును కావడం నా తప్పుకాదని ఇదివరకే తెలుసుకున్నప్పటికీ నా గతి ఇంతే అనుకునేదాన్ని. నాలాంటి వాళ్ళు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం తప్పయి ఉండదు, అయితే వీరేశలింగం పంతులుగారూ మీలాంటి వాళ్ళూ పూనుకోరు అని అనిపిస్తూ ఉన్నది. మీరు నన్ను రక్షించాలి ...”

ఈ ఉత్తరం చూడగానే నాకు ఏమీ తోచలేదు. విధవా వివాహాలు అవసరం కాదని ప్రొఫెసరు వెంకయ్యగారి ఉపన్యాసాన్ని ఖండిస్తూ ఇదివరలో బహిరంగంగా వాదించాను. ఈ ఉత్తరం చదువుతూ ఉంటే, వెంకటశాస్త్రుల చరిత్ర తలుచుకుంటూ ఉంటే నా మనస్సు మారిపోతూ ఉన్నది. తిన్నగా వెంకయ్యగారి ఇంటికి వెళ్ళి జరిగిన దంతా చెప్పి ఈ అమ్మాయి ఉత్తరం ఇచ్చాను. బాగా ఆలోచించి, “మనం పంతులుగారి సలహా పుచ్చుకోవడం చాలా అవసరం. నీవువెంటనే బయలుదేరి పంతులుగారి దగ్గరికి మీనాక్షి నగలూ ఈ ఉత్తరం పట్టుకుని వెళ్ళడం ఉత్తమం. ఆయన ఎట్లా చెప్పుతే అట్లా మనం చేద్దాం. ఆయన్ని నీవు ఈ పరిస్థితులలో స్వయంగా కలుసుకోవడం కూడా మంచిది. నన్ను ఆయన ఎరుగరు. నేను నాయుడిగారి శిష్యుణ్ణి. వారి కాలేజీలోనే

చదువుతున్నాను. నాయుడుగారు నన్ను బాగా ఎరగరు. కాని వారు ఏంచేయమన్నా చేస్తానని చెప్పు" అని సలహా ఇచ్చాను.

✲ ✲ ✲

నేను రైలు దిగి తిన్నగా పంతులుగారి తోటలోనికే వెళ్ళాను. చెట్టుకింద కుర్చీమీద కూర్చుని, ఎదర కుర్చీలో కూర్చున్న షరాయి తొడుగుకుని అదో మోస్తరుగా తలపాగా చుట్టుకున్న ఒకాయనతో మాట్లాడుతున్నారు. ఆయనే వెంకటరత్నం నాయుడుగారని తరువాత తెలిసింది. సమస్తం చెప్పాను. మీనాక్షి సంగతి చెప్పుతూ ఉంటే నాయుడుగారు కళ్ళనీళ్ళు ఆపుకోలేకపోయారు. 'గ్రేట్ ఉమన్, గ్రేట్ ఉమన్' అంటూ వచ్చారు. పంతులు గారు గంభీరంగా ఆలోచిస్తూ విన్నారు. ఇద్దరూ నన్ను చాలా మెచ్చుకుని, ఆ రోజు అక్కడనే ఆపుజేశారు. మీకు పరీక్షలు దగ్గరకు వొస్తూ ఉన్నవి. అందుచేత దీనిలో విస్తారం ఇప్పుడు కలిగించుకోవద్దు. నేను వెంకయ్యకు ఉత్తరం ఇస్తాను అని నాయుడుగారు సలహాలు ఇచ్చారు. పంతులుగారు వచ్చి మీనాక్షి నగలను వ్యభిచారవృత్తి మాన్పించే ప్రయత్నాలకే ఉపయోగిస్తాను. ఆ అమ్మాయి విషయంలో చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలి అని పద్ధతులన్నీ చెప్పి "ఇదంతా వెంకయ్యగారితో చెప్పి మీ చదువుకు అభ్యంతరం లేకుండా సహాయం చేయండి. దీనిలో ఏ బాధలు కలిగినా టెలిగ్రాం ఇస్తే వెంటనే వచ్చి చిక్కులన్నీ నేను స్వయంగా పడతాను" అన్నారు.

✲ ✲ ✲

నేను ఇంతపూర్తిగా మారిపోవడానికి కారణం ఇది. ఇంతకు పూర్వం ఈ సంఘం స్థితి నేను ఎరుగను. కూకటివేళ్ళు ఇంత కుళ్ళి ఉన్నవని నాకు తెలియదు. పైపైన చూసి అంతా బాగానే ఉన్నది అనుకునేవాణ్ణి. ఆనాటి నుంచే దృష్టి తారుమారు అయింది. ఇప్పటి హిందూ సంఘమంతా బొల్లినాటకం. పంతులుగారు అన్నట్టు మీనాక్షి ఉత్తమురాలు, పతివ్రత. కడుపు కక్కుర్తికి కాస్సేపు శరీరాన్ని అమ్ముకునే కులటకన్నా వెంకటశాస్త్రే ఎక్కువ నీచపు వ్యభిచారి. పుట్టుక ఏం నిర్ణయించింది. పుట్టుకను బట్టి భేదాలను నిర్ణయించే ఈ సంఘం దుర్మారంగా ఉంది. నా ... తెగినవి. ఇంతకూ ఇదంతా నీతో ఎందుకు చెబుతున్నానంటే ఒక కారణం ఉన్నది. నిన్న నీ నాటకం చదివాను. ఆ అద్భుతమైన ... లలిత చేత నీవు అనిపించిన ఆఖరి మాటలు మహా సత్యాలు అనుభవంలో వాటి విలువలను నేను గ్రహించాను. నాతో కలిగిన మార్పు స్ఫురించింది. నీవు ఎంత అనుభవం మీద ఇంత చక్కగా చెప్పావా అని ఆ

మాటలు అనిపించింది. ఆ వాక్యాలు స్థిరంగా నాలో పడిపోయినై. నిజం, ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క మహానుభావుడు పుడతాడు. దూరదృష్టితో సమస్తాన్నీ తిలకించి ఏ మార్పు కల్పిస్తే ఎక్కువ ధర్మం కలుగుతుందో గ్రహించి అతడు కాలాన్నే సరియైన దారికి తిప్పుతాడు. ఆ తరువాత వ్యక్తులతో నిమిత్తం లేదు. రావలసిన మార్పు దానంతట అదే వచ్చేస్తుంది. ఆ తరువాత నుంచీ తెలివైనవాళ్ళు గ్రహించుకొని మంచి కోరైనా సర్దుకుంటారు. తెలివితక్కువవాళ్ళు ఎదిరించి ప్రయోజనం ఉండదు. కాలం తెచ్చే మార్పు ఇది.

## కథానేపథ్యం ...

1927వ సంవత్సరం 'జ్వాల' పత్రికలో వచ్చిన ఈ కథ ముద్దుకృష్ణ రచించాడంటే చాలా ఆశ్చర్యం కలగక మానదు. అప్పటి బ్రాహ్మణ వర్గంలో కొందరి పరిభ్రష్టత్వమంతా కళ్ళకు గట్టినట్లు చిత్రించిన కథ ఇది. గురజాడ అప్పారావు ప్రభావం కథాశిల్పంలో, భాషలో కనపడకపోయినా అగ్రవర్ణాల పాతిత్యం, అక్రమ ప్రవర్తన, అతిలోభిత్వం పట్ల ఆగ్రహం ఆనాటి చాలా మంది యువ రచయితలను ప్రేరేపించి నట్లుగా ఈ కథ చెపుతుంది. అప్పటి కథా రచయితలకు వీరేశలింగం, రఘుపతి వేంకటరత్నం నాయుడుగార్ల బోధలు అత్యవశ్యాచరణీయాలు, అత్యంతాదర్శ మహితాలు. కథాశిల్పంలో బిగుతు, సన్నివేశ కల్పనలో ఒడుపు లేకపోయినా, సమాజ వాస్తవికతకు నిదర్శనంగా కథ రాయాలన్న, ఉండాలన్న ధ్యేయం ముద్దుకృష్ణ ఈ కథలో పాటించినట్లు స్పష్టపడుతున్నది. తెలుగువారి ఆధునిక సామాజిక పరిశీలన దృష్టికి ఈ కథ ఒక విధంగా ఆకరం అనాలేమో! తెలుగువారు ఆరాధించవలసిన సంఘసంస్కర్తలు ఇందులో సాక్షాత్కరిస్తారు కాబట్టి ఆ దృష్ట్యా ఈ కథ సమాజ పరిణామ అధ్యయన స్ఫూర్తి కలిగించగలదనుకోవాలి.

# 31. ష్!

– మల్లాది రామకృష్ణశాస్త్రి

**నా**కు ఇష్టం లేదు.

ఊఁ ... నేను ఒప్పుకోను – తనంత తా వలచి వచ్చిన అతిలోక మోహినిని – ఇలా ఛాందసంగా నిరాకరించి – బలవంతాన తప్పించుకున్నా – ఆ కలియుగ ప్రవరాఖ్యుడివంక – ఆ అమ్మాయి – చాలా చులకనగా చూసి, ఎకసక్కెపు నవ్వుతో ఏమీ జరగనట్లు – జరిగినది – మరచిపోయినట్లు – చెదరిన పైట అంచులు కొనగోట సరిచేసుకుని – నిదానంగా పూలబుట్ట అందుకుని ఇంటిమెట్లు ఎక్కి – తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

అతడు – కంగారు అణుచుకోలేక – తలఎత్తి చూడలేక – అక్కడనుంచి అడుగు కదపలేక – అలాగే నిలబడిపోయినాడు

✿ ✿ ✿

చంద్రుడు, చాలా అందగాడు కాని, అతని చక్కదనానికి ఆసలూరించడమే కాని, వేరే ప్రతివినియోగము కనబడకుండా ఉంది. ఎందరో అందాల రాసులు చంద్రుడు, తమవైపు ఒకసారి చూస్తే చిరునవ్వు తెరలపొరలు విరజారనిస్తే చాలునని నిరీక్షిస్తున్నా ఏమి చేయకుండా ఎవరికి పనికిరాకుండా అలా అయిపోతున్నాడు.

చంద్రుడు చాలా అమాయకుడు, ఆలోచనలు ఆచారాలు అన్ని ... కోరికలు లేక కాదు. తాను చక్కనివాణ్ణని తెలియక కాదు కాని,

'స్వభార్యాయాంచ యౌవనం' అనే వైదిక శ్లోకవాదం, అతని శృంగార లీలలకు అడ్డుపడినది. ఆ పసిపిల్ల భార్య కాపురమునకు వచ్చేవరకు, 'అనాఘ్రాతం పుష్పం' కు అతడు పురుష రూపలక్ష్యముగా ఉండదలచుకున్నాడు.

ఎందరో ఎన్నివిధాలో చెప్పారు. స్నేహితులందరూ రకరకాలుగా హుషారిచ్చారు. బలవంతపెట్టారు, బలవంతపెట్టించారు. ప్రయోజనం?

✿ ✿ ✿

తన పడుచుతనపు తొలి అనుభవాన్ని భావించుకుంటూ, కంపిస్తూన్న చేతితో ముసలి ముత్తైదువ, గది తలుపులు దగ్గిరా లాగింది. ఒక్కక్షణం ఆగి ... 'లోపల గడియ వేసుకోండిరా' అని వెను దిరిగి చూసి అందరితోబాటు కలసి తానూ నవ్వింది.

పృథక్‌శయ్యకు అలవాటుపడ్డ కాపురానికి ఇంకా వెళ్లని పడుచు పిల్లలు ఆనాడు ఏదో చాలా చెలిమిగా ఒకరి సరసను ఒకరు ఒరిగారు.

గది తలుపు గడియ చప్పుడు కాకూడదనే ఆదుర్దాతో వేసినట్లు చప్పుడైంది।

లైటు – స్విచ్ఛాఫ్ – అయింది –

కొంచెం సేపటికి – చాలా తొందరగానే – మళ్ళా వెలిగింది –

తెల్లవార్లు – అలా వెలుగుతూనే వుంది –

చీకటి విడకముందే – చంద్రుడు పడకగదిని విడిచి ఈవలకు వచ్చి ... వంచిన తల ఎత్తకుండా ... గబగబ మెట్లు దిగి కిందకు వెళ్ళిపోయినాడు.

కాఫీ వేళకు – పెళ్ళికొడుకోసం – ఇంట్లో వాళ్ళు వెదికారు – కాని కనిపించలేదు.

✿ ✿ ✿

వెన్నెల ముదిరిన రాత్రి –

ఆ ... శుభ్రజ్యోత్స్నా పులకితయామిని పులకితునిగా చేయలేక – సిగ్గుపడి – మధ్య మధ్య, మబ్బుతెరల మేలిముసుగు సవరించుకుంటూంది.

చంద్రుడు, దిగులుతో – కూర్చుని ఉన్నాడు.

'ఏం – కొత్త పెళ్ళికొడుకు...?'

మరీ సిగ్గుపడ్డాడు – పలుకరించినా – మారుపలక లేకపోయినాడు –

ఆ అమ్మాయి – లక్ష్మి – అతని సరసకు వచ్చి కూర్చుంది.

ఏం మాట్లాడవేం –

✿ ✿ ✿

ఎందుకు ఈలా వచ్చావు?

✿ ✿ ✿

ఈ వెన్నెలలో – ఆ ... వంటరిగా వదలి – ఏలా రాగలిగావు?

చెప్పవేం?

చంద్రుడు - ఇంతసేపటినుంచి - మాటాడాలని - జవాబు చెప్పాలని - ప్రయత్నం చేస్తున్నాడు - కాని, ఏలా ప్రారంభించాలో, ఏమనాలో తెలియలేదు - దిటవు తెచ్చుకున్నాడు.

'లక్ష్మీ!'

ఆ అమ్మాయి, కనులతో సాభిప్రాయంగా, ఔనని సైగచేసి కొంచెం దగ్గరగా జరిగింది ...

'మరి ...

'ఊ! ...

'ఆ - అమ్మాయి ...

'ఎవరూ

'నా ... భార్య -

లక్ష్మి - అర్థం కాని చూపుతో - ఆదుర్దాతో -

'ఏమి ...

'నా - భార్యా'

'ఊ! - నీ భార్య - ఏమిటి? - చాలా చక్కనిదా - చదువుకున్నదా - చెప్పు - మాట్లాడవేం?

చంద్రుడు కంపించిపోయినాడు - గాద్గదికంతో - కనులనీరు తెచ్చుకుంటూ - పట్టరాని అసహనంతో - అసహ్యంతో ...

'నా భార్య .. ఊహూ ...ఆ ... ఆ అమ్మాయి - ఆడపిల్ల కాదు'

అని తల మరీ వంచుకున్నాడు.

లక్ష్మి ఒకనిమిషం ఊరుకుని - నవ్వేసింది.

'బలే .. చంద్రం! - బలేవాడవు - ఆ అమ్మాయి ఆడపిల్లకాదూ? అయితే నీవు? -

'కాదు, లక్ష్మి - నవ్వవద్దు - నేను చెప్పింది అర్థం కాలేదూ - ఆ పిల్ల - చిన్నతనంలో - నా పెళ్ళినాటికి ఆడదే. కాని, వయసు వచ్చినకొద్దీ - మగవాడుగా మారిపోయింది -

'నిజం'

'అవును – భయపడి మొదట ఎవరితోనూ చెప్పలేదట – తరువాత వాళ్ళ తల్లిదండ్రులకు చెప్పినా – వాళ్ళు అర్థంగాక, బయటికి తెలియనీయలేదు – ఇప్పుడు ఏమీ లాభం లేదనుకుంటాను –

'అంటే?'

'కొత్తలో అయితే – వైద్యసహాయంవల్ల ... పడేది – ఇప్పుడు – మరి ...

'నీవు చెప్పేది చాలా వింతగా ఉంది. అంతా – చంద్రం అలా మారిపోవడానికి వీలున్నదా?

'ఆహా! ఈ మాదిరిగా జరుగుతూన్నట్లు పత్రికల్లో చదవడం లేదూ – మనదాకా వస్తే కాని ...

లక్ష్మి అతని తల నిమురుతూ –

'చంద్రుడూ! నిన్ను చూస్తే – చాలా జాలిగా ఉంది – ఏం చెయ్యను' అని చాలా ఆపేక్షగా అన్నది.

చంద్రం ఆమె రెండు చేతులూ పట్టుకుని, తన దగ్గరకు లాక్కుంటూ –

'లక్ష్మీ! నిన్ను నేను ...

విడిపించుకుని, నవ్వుతూ లేచిదూరాన నిలబడినది.

'ఏమిటి? నీవు నన్ను ప్రేమిస్తున్నావా?

అతడు తల ఊపాడు.

'నేను నీకు కావాలా?'

✿ ✿ ✿

'నేను చాలా చక్కనిదాన్ని కదూ? –

చంద్రుడు ఆప్యాయంగా ఆమెను సమీపించబోయినాడు.

కాని లక్ష్మి ముఖంలో ప్రేమ ఆ ప్రసన్న భావం అటె మాయమైపోయినవి. నిశ్చల నయనాలతో –

'నేను నిన్ను ప్రేమించటం లేదే' అన్నది – రెప్పవాల్చకుండా. అతనికి ముందు అడుగు పడలేదు.

'నా మీద ప్రేమలేదూ – నీకు

‘ఊహు

‘మరి అవాళ

‘అవాళా – ఏవాళ – ఒహెూ అదా!

ఇది – ఇవాళ సంగతి

‘ఇక – ఎప్పటికి

‘ఏమో? ఇప్పటికి

‘అయితే ...

‘– లేదు – గియితే లేదు – నాకు భయం వేస్తూంది బాబూ – నీ గాలి సోకితే నేను కూడా మగవాణ్ణవుతానేమోనని’

అని నవ్వుతూ వెనుతిరిగి, తిరిగి చూసి నవ్వుతూ, ఇంట్లో పారిపోయింది.

వేళకు వికసించకపోవడంచేత, వినియోగపడకుండా, తీవనే మిగిలిపోయిన మల్లెమొగ్గలు.

ఒంటరిగా చంద్రుడు!

## కథానేపథ్యం ...

ఈ కథ ముద్దుకృష్ణ సంపాదకుడిగా వెలువడిన జ్వాల పత్రికలో వచ్చింది. ఈ జ్వాల తెలుగువెలుగు ఇప్పుడెవరూ చూడలేరు.

శిల్పమూ, ఇతివృత్తమూ, భాషా, నడక తీరూ దృష్ట్యా ఇది ఒక అపురూపమైన కథ. మల్లాది రామకృష్ణశాస్త్రి సర్వ కథా సంకలన సంపుటాలలో ఈ కథ చేరినట్లు కనపడదు. ఇప్పటికి తెలుగులో ఉజ్జాయింపుగా రెండు లక్షల కథలు వచ్చి ఉంటాయి. ఒకటిన్నర శతాబ్ది చరిత్ర ఉందికదా ఈ ఆధునిక ప్రక్రియ అయిన తెలుగు కథకు. బహు అల్లరి కథ ఇది. చిల్లరి కథ మాత్రం కాదు. అంతరించిపోతున్న ఒక సాంస్కృతిక ధనికస్వామ్య శృంగారవ్యవస్థకు కొసమెరుపు ఈ కథ.

అయితే అత్యంతాశ్చర్యకరం అప్పటికీ ఇప్పటికీ ఇటువంటి కథా వస్తువు ఎవరికీ అంటే ఏ తెలుగు కథా రచయితకీ తోచలేదు. ప్రముఖ తెలుగు కథా రచయితలు ఇప్పటికి రెండు వందల సంఖ్యను మించవచ్చు.

వేశ్యల సరస శృంగార పాండితి, జాణతనమూ, వరూధినిత్వమూ మల్లాది వారికి సమ్మాన్యమే కాని, వైరాగ్యహేతువు ఏమీ కావు. శ్రీనాథుడికి ఆపాదితమైన కథలన్నీ నిజమైతే మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని కథక శ్రీనాథుడంటే తప్పులేదేమో. శ్రీనాథుడి చాటువులంత కమనీయంగానూ ఉంటాయి శాస్త్రిగారి కథలు కొన్ని. కాని ఇటువంటి ఇతివృత్తంతో కథరాయాలని తొంభైనాలుగేళ్ల కిందటే ఆయనకు ఆసక్తి కలగటం ఆశ్యర్చ హాస్యప్రదమే. తృతీయ ప్రకృతి 'ట్రాన్స్‌జెండర్ ప్రవృత్తి' కథ తెలుగులో ఇంతవరకెవరైనా రాశారా? చూశారా?

ఒక నవ యౌవ్వన విలాసిని అయిన సానిపాప ఒక ప్రవరాఖ్య సంతతి అందగాణ్ణి తనంతతా వలచి అనురాగం చూపుతుంది. అయితే ఈ చంద్ర ప్రవరాఖ్యుడు అందుకు ఒల్లడు. ధర్మశాస్త్రంలో భాషతో మాత్రమే కామకేళీలోలత చూపాలని, నిబద్ధమై ఉందట. అదీ ఈ చాదస్తపు తరుణిడి అభ్యంతరం. కాని అతడి ముఖాన అది రాసిపెట్టి ఉండలేదు. శోభనపు తతంగాన్ని ఎంతో అందంగా వర్ణించారు శాస్త్రిగారు. అయితే ఆ వధువుది తృతీయ ప్రకృతి అని తెలిసి అంతా ఇంతా అని చెప్పలేని ఖేదం అనుభవించాడు. ఆ తరువాత తనంత తావలచి వచ్చిన ముద్దరాలిని తనంతతా చేరబోయినాడు. ఆ పిల్ల ఇతడి శృంగార రసాస్వాదనను పరిహసించి, అరసికత్వాన్ని చూసి జాలిపడింది. అప్పుడతడు తన భార్య ఆడపిల్ల కాదని దిగులు చూపాడు. అయితే నీవు మగపిల్లవాడివా? అని ఆ చపలాక్షి అతణ్ణి దెకారించి వెటకారం చేసింది. రెండందాలా భంగపడ్డాడు ఆ కుర్రనాగమ్మడు పాపం, పసివాడు.

ప్చ్ ... ఇదీ రామకృష్ణశాస్త్రిగారి సహానుభూతో, మరి రసానుభూతో! తీగనే విచ్చిపోతే మల్లెమొగ్గల సొగసేమిటి? అని మల్లాదివారి నిట్టూర్పు తీర్పో, జాలి చూపే పెదవి విరుపో! ఈ కథ చదివితే పాఠకుడికి కూడా అదే సంవేదన కలగవచ్చు. పరువంపు కథకాని పరువైన కథ కాదు ఇది.

# 32. మంచిమనిషి

– తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి

సోడాలు పట్టుకురారా! ........ చెప్పాను. వాడు ..... ..... తాగుతూ రంగారావు వెంకట్రావు ....... రాత్రి కౌసల్యగారింటికి భోజనానికి రావా ....

'నాకూ ఆహ్వానం వచ్చింది. అయితే ఇంట్లో కొంచెం అసందర్భంగా వుండడం వల్ల బహుశా రానేమో అనుకుంటాను' అన్నాడు వెంకట్రావు.

'అసందర్భమేమిటి? భోజనం చేసి వెళ్ళగూడదూ ఇంటికి? రామారావు నువ్వు రాకపోతే ఏమన్నా అనుకుంటాడు. అసలే తప్పులు పట్టే మనిషి. నువ్వు రాకపోతే నేను కూడా వెళ్ళను. ఏమిటో ఆయన పిల్చాడని గాని వాళ్ళిళ్ళకీ వీళ్ళిళ్ళకీ భోజనాలకి వెళ్ళడం అంటే నాకంతగా మనస్కరించదు.

ఆయన్ని చూసి కాదోయ్! ఆవిడేదో మంచిది, పాపం! స్త్రీ సమాజంకోసం పాటుపడుతూ వుంటుంది. దివ్యజ్ఞాన సమాజంలో బాగా ఉపన్యాసం చెప్పింది. ఎంత బాగుంది! ప్రార్థన సమాజంలో పాటలెంత బాగా పాడుతుంది! కాంగ్రెసు మీద కూడా గాఢాభిమానం, మనం వెళ్ళకపోతే ఆవిడేమన్నా అనుకుంటుంది పాపం!'

'ఓ! ఆవిడ మంచిని చూసిట్రా నువ్వు వచ్చేదీ? అంత మంచిదే? నీకు మట్టుకే కనబడేలా వుంది, ఆవిడ మంచి'.

'రంగడూ! నువ్వు ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని వెక్కిరిస్తూ వుంటావురా! స్త్రీలు కాస్త బయటికి వచ్చి ఆ ఉద్యమంలోనూ, ఈ ఉద్యమంలోనూ పాల్గొన్నంత మాత్రాన మంచితనానికేం లోటొస్తుందేం? ఆడవాళ్ళను పరదా వెనకాలనే వుంచాలంటావా?'

'అదిగాదు. ఈ రోజుల్లో అబ్రాహ్మణ స్త్రీలకు పరదా పోయి మన బ్రాహ్మణ స్త్రీల నెత్తిన పడ్డది. అయినా స్త్రీలు కొంచెం హద్దుల్లో వుండడమే మంచిదనుకుంటాను'.

వెంకట్రావు నవ్వి 'హద్దులో వుంచడం అంటావు, హద్దుకు హద్దెక్కడ? మంచివాళ్ళు నాలుగుచోట్లకూ వస్తూ వున్నా చెడిపోరు. చెడిపోయేవాళ్ళు ఎక్కడవున్నా చెడిపోతారు?' అన్నాడు.

'అది గాదబ్బాయి! ఈవిడ నర్సారావుపేటలో వున్న రోజుల్లో ఏదో గ్రంథం చేసిందని వాడుక. అందుచేత –'

రంగారావు మాటలు పూర్తికాకుండానే వెంకట్రావు అడ్డు తగిలి, 'నీవు మంచిదన్న ఆడదాన్ని ఒక్కతెను చూపించు! నీకు లోకమంతా చెడుగానే కనబడుతుంది. ప్రతి వాళ్ళకు ఏదో గ్రంథం ముడిపెడతావు. చాల్లెస్తూ నీ మాటలు!" అన్నాడు.

రంగారావు సిగరెట్టు వెలిగించి వలయాకారంగా పొగవిడుస్తూ "నువ్వు వట్టి వెర్రి వెంకటయివిరా! వేశ్యలకి కూడా పాతివ్రత్యం వుందనే ఘనుడివి. వాత్స్యాయన కామ సూత్రాలు చదివావా?' అన్నాడు.

'ఆదినారాయణ శాస్త్రిదేనా? బాగానే వుంది పుస్తకం. ఆ మధ్య ఎప్పుడో చదివాను'.

'అసలు పతివ్రత అనేది లేదంటాడు. గమనించావా?'

'వాత్స్యాయనుడికి బుద్ధి లేదు'.

రంగారావు సిగరెట్టునుసి యాష్ ట్రేలోకి రాలుస్తూ నవ్వి,

'ఋషిని గూడా దూషిస్తున్నావే! నీ దృష్టికాగలేదేం వాత్స్యాయనుడు! పాతివ్రత్యం వుండడానికి ఇరవైనాలుగు కారణాలు చెప్పాడు. ప్రథమకారణం కామం అన్నాడు. దుర్బలమైన కారణం ఇరవైనాలుగోది ఏమిటో తెలుసా? Chastity for its own sake పాతివ్రత్యం మంచిది గనుక, పాతివ్రత్యం' అన్నాడు.

'ఏడిశావులే! వాడు ఋషి అయితే పెళ్ళి అయినవాడా, కానివాడా? బ్రహ్మచారే గనక అయితే స్త్రీ సంగతి వాడికేం తెలుసు? తెలిసిందంటావా వాడెంత మంచివాడో కనబడుతూనే వుంది. ఈ పుస్తకాల సంగతి నాకు చెప్పకు, వళ్ళు కాలుకొస్తుంది'.

'అదికాదురా వెర్రికుట్టే! శాస్త్రవిషయం కాదు నేనిక్కడ చెప్పదలుచుకుంది. నరసరావుపేట సంగతిరా నాయనమ్మా! నమ్మదగ్గమనిషి చెప్పాడు. ఆవిడ మంచిదైతే నాదేం పోయింది!'

'మంచిదైతే నీబోటివాడికి నష్టం!'

'ఇదంతా ఎందుకు? భోజనానికి వెళ్ళడమా, వెళ్ళకపోవడమా?'

'అడుగో నీలకంఠం వస్తున్నాడు! వాడొస్తే మనం కూడా వెళదాం!'

**2**

నీలకంఠం ఊపుతో నడుస్తూ ముంగురులు సవరించుకుంటూ క్లబ్బు మెట్లెక్కి బిల్లియర్డ్ గదిలోకి వెళ్ళబోతూంటే రంగారావు 'నీలకంఠం' అని కేకేసాడు. అతను వెనక్కి తిరిగి చూసి చిరునవ్వుతో మెట్లు దిగి చింతచెట్టుకిందికి వచ్చి కుర్చీ రంగారావు దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు.

'ఏమిరా! మమ్మల్ని చూడకుండానే లోపలికి వెళ్ళుతున్నావే!' అన్నాడు రంగారావు.

'చూళ్ళేదురా అబ్బీ! ఇప్పుడే వూరినించి వచ్చాను. నువ్వు బిల్లియర్డ్ గదిలో వుంటావని అక్కడికే వెళుతున్నాను'

'ఎక్కడినుంచేమిటి వస్తున్నావు?' అన్నాడు వెంకట్రావు.

'నర్సారావుపేటనుంచోయ్!'

'ఓహో! నర్సారావుపేట నుంచా? అయితే భోజనానికి రావు రాత్రికి?' అని రంగారావు అడిగాడు.

'భోజనానికా? ఎక్కడికి?'

'కౌసల్యగారింటికి'

నీలకంఠం ఫ్రెంచికట్ మీసం దస్తీతో తుడుచుకుంటూ 'అవును. మొన్న రామారావు భోజనంమాట ఎత్తాడు సుమా! నేను మరిచిపోయాను. ఏమిటో అక్కడికి పోవడం అంటే మనస్కరించదు. అతన్ని చూస్తే ఏమిటో ఖాయిలా చేస్తుంది' అన్నాడు.

'రామారావుగాడి మొగం చూస్తే ఖాయిలా చేస్తే ఆవిడమొగం చూసైనా రాగూడదూ భోజనానికి?' అన్నాడు రంగారావు.

నీలకంఠం ఒకక్షణం పరధ్యాన్నంగా వుండి, 'ఆవిడ మొఖం చూసి అక్కడికి వెళ్ళే రోజులు దాటిపోయినైలే' అన్నాడు.

'నీ కెందుకులే ఇలాంటి సంగతులు, శుకమహర్షికి? ఏదో సామాన్య మానవులం మా గొడవలు నీ చెవిని బడ్డం అంత మంచిదికాదు' అని నవ్వాడు నీలకంఠం.

వెంకట్రావుకు కొంచెం సంశయం కలిగింది. కౌసల్యకూ ఇతనికీ సన్నివేశం ఏమైనా జరిగి వుంటుందా అని శంకించాడు.

'అన్నట్టు నీలకంఠం! నువ్వీమధ్య రామారావింటికి వెళ్ళుతున్నట్టు కనబడ దేమోయ్? మరివ్వాళ భోజనానికన్నా వస్తావా?' అన్నాడు రంగారావు.

నీలకంఠం నేలవంక చూస్తూ 'చెప్పలేకుండా వున్నాను' అన్నాడు.

రంగారావు నీలకంఠం భుజం తట్టి 'ఆహ్వానం సరిగ్గా రాలేదనా తటపటా యిస్తున్నావు? అమ్మవారి కబురందితేగాని వెళ్ళవా ఏమిటి?' అని బిగ్గరగా నవ్వాడు.

'అమ్మవారు పిల్చినా – '

'అమ్మవారిమీద ఏమంత శీతకన్ను వేసినట్టున్నావు? మొన్న మొన్నటిదాకా వారింటికి రోజుకొక సారైనా హాజరౌతూ వుండేవాడివి. ఇప్పుడు మారిపోవడానికి హేతుభూతత్వంబైన కారణం బెద్ది?' అని పెద్దపెట్టున నవ్వాడు రంగారావు.

'మారితేనేగాని నీతివేత్త కాడన్నాడు గిరీశం. అదో ఘట్టంలే!'

వెంకట్రావుకు కుతూహలం హెచ్చింది. నీలకంఠం మాటల్లో ఏదో మర్మం వున్నట్లు తోచింది. వాళ్ళు ముగ్గురూ స్నేహితులే కాబట్టి సంగతేమిటో స్పష్టంగా తెలుసుకుందామని.

'నీలకంఠం! నీకు చెప్పడానికభ్యంతరం లేకపోతే మార్పుకు కారణం అడగొచ్చునా నేను?' అన్నాడు.

'అడగొచ్చుగాని చెప్పడానికే నాకు కొంచె సంశయంగా వుంది'

'అయితే ఆవిడ మంచిది కాదనే అంటావా నువ్వు కూడా?' అన్నాడు వెంకట్రావు.

'నీవు కూడా అంటే? ఇదివరకే ఎవరన్నా అన్నారా?

'మన రంగడే అంటున్నాడులే'

'రంగారావు సిగరెట్టు ఒక దమ్ములాగి, నేనల్లా అనలేదు అన్నాడు.

అయితే ఏమన్నావేమిటి?

'వెంకట్రావు ఆవిడ మంచిది. మంచిది అంటుంటే, మా కెవ్వరికీ కనబడని మంచి నీకొక్కడికే ఎట్లా కనబడ్డది' అన్నాను.

'ఏమిటో నర్సారావుపేట – గ్రంథం – అంటాడు' అన్నాడు వెంకట్రావు.

'నీలకంఠం కళ్ళు తేలవేస్తూ 'నర్సారావుపేట? ... నా శృంగభంగానికి కారణం అదే అయింది' అన్నాడు.

వెంకట్రావు మరింత కుతూహలంతో 'అయితే' కౌసల్య నిజంగా మంచిదికాదా ఏమిటి?' అన్నాడు.

నీలకంఠం తన చిటికినవేలితో గోక్కుంటూ, 'ప్రబంధస్త్రీ నడుంలాగుంది వ్యవహారం, మంచిదేమో ... కాదేమో!' అన్నాడు.

స్నేహితులిద్దరూ నవ్వారు. 'అధ్యక్షులుగా వుండవలసిన మనిషివి నువ్వు. ఖచ్చితంగా చప్పున తీర్పు చెప్పడానికి బాగా పనికొస్తావు' అని రంగారావు 'నీ మార్పు సంగతేమిటో అఘోరించవోయ్!' అని ఇంకో సిగరెట్టు ముట్టించాడు.

**3**

నీలకంఠం సోడా తెప్పించి తాగి మొగం తుడుచుకుని ఒకసారి బిగ్గరగా నవ్వి, కథ ప్రారంభించాడు.

'నేను సత్తెనపల్లి వచ్చి అయిదారు నెల్లయిన సంగతి అందరికీ తెలిసిందే. మొదట్లో రామారావును నే నెరుగను. ఏదో సందర్భంలో వాళ్ళింట్లో టీ పార్టీ జరిగితే నన్నూ పిల్చారు. అప్పుడే ఆయనతో ప్రథమ పరిచయం. ఆయన తెలివిగలవాడే కాని వట్టి పెడకట్టె మనిషి. నాకూ ఆయనకూ అనేక విషయాల్లో వివాదం జరుగుతూనే వుండేది. తన కుందేటికి మూడేకాళ్ళమతం. గ్రహించాక ఆయన చెప్పిందల్లా సరేయని చప్పున ఒప్పుకుంటూ వుండేవాణ్ణి. ఎంత ప్రయత్నించినా ఆయన మీద నా కిష్టం కలగలేదు. మనిషి మట్టుకు పూసుకు తిరుగుతాడు.

రంగారావు నవ్వి 'ఆయనమీద నీ కిష్టం కలగలేదేం? పోనీ నూటికి యాభై మార్కుల్లాగా రెండో సగం మీదైనా ఇష్టం కుదిరిందా?' అన్నాడు.

'ఆపవోయ్! నీ వ్యాఖ్యానం' అన్నాడు వెంకట్రావు.

'కన్సొలేషన్ కింద అర్ధభాగాన్నైనా అంగీకరించావా?' అన్నాడు రంగారావు.

నీలకంఠం నవ్వి 'కొంతవరకు నువ్వన్నట్టే అయింది. మొదట ఆవిడమీద నాకేమీ దృష్టిలేదు. ఆడవాళ్ళకేసి చూసినా ఏదో సమిష్టి మీద స్థూల దృష్టితో చూడడమే కాని సూక్ష్మాభినయంలోకి దిగలేదు. ఏ మీటింగులో చూసినా కౌసల్యగారు హాజరు. అయితే పాపం మనిషి చాలా నిదానంగా వుండేది' అన్నాడు.

'అంత నిదానస్థురాలైతే నిన్నెలా ఆకర్షించిందోయ్'! అన్నాడు రంగారావు.

'మరీ నిదానంగా వున్నా ఆకర్షణే, గడబిడగా వున్నా ఆకర్షణే; ప్రార్థన సమాజంలో ప్రతి ఆదివారం సాయంత్రమూ అంతా తయారయ్యేవాళ్ళం'.

'అవును. ఆదివారం సాయంత్రమే మీకు దేవుడు కావాలి. వుత్తప్పుడు బహుశా అక్కరలేదన్నమాట. మాకీ దేవుళ్ళు గీవుళ్ళు నై. టెన్నిసు, బిల్లియడ్సే దేవుళ్ళు' అన్నాడు రంగారావు.

'అంటే తక్కినప్పుడు దేవుడు వద్దని కాదు. వారానికి కాస్సేపైనా మంచి ప్రసంగం చేస్తే తప్పేమీ లేదనుకుంటాను. నేనట్టే భక్తులలో వాణ్ణి కాదు గాని ప్రార్థన సమాజానికి మాత్రం తప్పకుండా వెళ్ళేవాణ్ణి. కౌసల్య వచ్చి మధ్య మధ్య శ్రావ్యకంఠంతో పాటలు పాడుతూ వుండేది. అంతా కళ్ళు మూసుకుని ప్రార్థన చేస్తూంటే నేను కళ్ళు తెరుస్తూ చూస్తూండేవాణ్ణి. కౌసల్య నాకేసి తదేకధ్యానంతో చూస్తూండేది'.

'అవునులే, నీకేసి చూడడం అంటే ఏదో శుభ్రమైన విగ్రహాన్ని చూద్దామని అయివుండవచ్చు' అని నవ్వుతూ అన్నాడు రంగారావు.

'ఇలా నాలుగైదుసార్లు జరిగేవరకు నాకే ఆకర్షణ కలగలేదు, ఆ చక్కని విగ్రహం, ఆ అందమైన చీరా, మరీ ఆ కళ్ళు, దీపాలకాంతిలో మిరుమిట్లు గొలిపినై, ఆవిడకంటే కూడా భర్తే ఆకర్షణకి కారణమయ్యాడు'.

'అదేమిటోయ్, విపరీతం! భర్తని చూస్తే ఇష్టంలేదంటివిగా, ఆకర్షణకి కారణం ఎలా అయ్యాడు? నీదంతా విరుద్ధంగా వుందే?' అన్నాడు రంగారావు.

'అంటే అతగాడు నన్ను మహా అసూయతో చూసేవాడు. వీడెందుకురా యిలా చూస్తాడని జిజ్ఞాస పుట్టి ఈవిడమూలానే గదా అనుకున్నాను. ఈ ఊహ ఏర్పడి పురుగు తొలిచినట్టు తొలవడం ప్రారంభించింది నా మనస్సులో'.

'అమ్మవారు ఏలినవారి హృదయంలో తిష్టవేసిందన్నమాట' అన్నాడు రంగరావు కోరచూపు చూస్తూ వెంకట్రావును గోకుతూ.

'అతన్ని చెప్పనియ్యవోయ్! అడ్డురాకు' అన్నాడు వెంకట్రావు.

'ఓహో! మహాశయులకు సమాధిభంగం అయినట్టుందే పాపం!' అన్నాడు రంగారావు.

'మనస్సులో పురుగు ప్రవేశించినదగ్గరనుంచి నాలో కొంచెం వికారం బయలు దేరింది. దివ్యజ్ఞాన సమాజంలోకి వెళ్ళినప్పుడు కూడా కౌలస్య నా మీదే కటాక్షవీక్షణం చేసి ఉండేది. బహిరంగ సభల్లో కూడా ఆ రెండు కళ్ళూ నా ముఖం మీదే నిలిపివుంచేది. చూస్తుంటే నాకు చాలా ఆనందమే గాని ఒక్కొక్కప్పుడు తికమకగా వుండేది.

అసూయతో చూడ్డం, ఇతరులు అప్పుడప్పుడూ గమనిస్తూ వుండడం నాకేమో ఉక్కిరిబిక్కిరిగా వుండేది'.

'పాపం మునగానాం తేలానాంగా వుందే నీ వ్యవహారం. చాలా అవస్థపడి వుంటావు' అన్నాడు రంగారావు చిరునవ్వుతో.

'అవునోయ్ చెడ్డ అవస్థ అయిపోయింది. వీడేమో ఇల్లు కలిగిన సన్యాసాయెను. మనస్సు బాధిస్తూ వుండెను. చాలా తొక్కిసలాడాను. ఇలా మూడు నెల్లు గడిచింది. ఇంక ఆవిడని చూడందే వుండలేనిస్థితి వచ్చింది!'

'ఫోటోగ్రాపు వకటి మెళ్ళో కట్టుకోకపోయినావా' అన్నాడు రంగారావు.

'రోజూ ఏదో ఒక వంకమీద వాళ్ళింటికి వెళ్ళేవాడిని. భర్త ఇంట్లో వున్నా, లేకపోయినా సమానంగానే ప్రవర్తించేది. ఆ చిరునవ్వు, ఆ ఉత్సాహం చూస్తుంటే కౌసల్యకు వళ్ళు తెలిసేది కాదు! ఆవిణ్ణి చూడ్డానికి వీలులేని రోజు ఉపవాసప్రాయమయి పొయ్యేది. ఒకసారి నీతో చెబుదామని కూడా అనుకున్నాను రంగడూ!'

'ఓరి సన్నాసీ! చెప్పావు కాదేమిరా? హమ్మీ తుమ్మీ తేల్చి పారేసేవాణ్ణి' అన్నాడు రంగారావు ఉద్రేకంతో.

'ఆవిడ భావం ఏమిటో బోధ పడలేదు. చాలా బాధపడ్డాను. ఈ గోలంతా ఎందుకు నాకు? నా ఖర్మాన నేను ఉండిపోదాం అని మనస్సు రహితం చేసుకుని ఒక ఆదివారం ప్రార్థన సమాజానికి వెళ్ళడం మానేశాను'.

'అరేరే! ఎంత పనిచేశావు! ధర్మమా' అన్నాడు రంగారావు వికటంగా.

'తరువాత రెండు మూడు రోజులకు నేను వాళ్ళింటికి వెళ్ళితే మాటల సందర్భంలో ఆవిడ 'ఏమండీ, మొన్న ఆదివారంనాడు ప్రార్థనకు వచ్చారు కాదేం! మీకోసం చాలా చూశాను' అంది. అనేసరికి నాకు తల నోట్లోకి వచ్చేసింది.'

'ఆశాశ పెట్టిందోయ్' అన్నాడు రంగారావు.

'నాకు నిజంగానే ఆశ పుట్టింది. ఏదో ఆ కబుర్లు ఈ కబుర్లు మాట్లాడి నేను వెళు తున్నానండి. మళ్ళీ వస్తాలెండి' అని బయలుదేరాను.

'ఓరి వెఱ్ఱినాయనమ్మ!' అని రంగారావు పెద్ద పెట్టున నవ్వాడు.

'అవునోయ్! నీదేంపోయింది నవ్వుతావు. ఆ స్థితిలో నువ్వక్కడ వుంటే అరికాళ్ళల్లో నరాలు లాగేవే'.

'బ్రహ్మచారి సన్నాసివి. హమ్మీ తుమ్మీ తేల్చుకోకుండా వచ్చావుట్రా' అని నీలకంఠం వీపుమీద తట్టాడు రంగారావు.

'ఇంతలోకే ఆవిడ ఎల్లుండోసారి రండి. మావారు వూళ్ళో కూడా వుండరు. వినుకొండ వెళతారు. ఏదో కులాసాగా కాలక్షేపం చెయ్యవచ్చు, అన్నది నేను ఏదో స్వర్గంలోకి వెళ్ళానంటే నమ్మవూ!'

'అల్లా చెప్పు! అనుభవంలేని ఘటంగావే! అప్పుడేంజేశావు?' అన్నాడు రంగారావు.

'ఆవిడన్నమాటలేనా ఇవి. లేకపోతే ఏమన్నా భావకవిత్వం చెపుతున్నావా?' అన్నాడు వెంకట్రావు హేళనగా.

'మక్కికి మక్కీ ఆవిడ మాటలే. మళ్ళీ ఎప్పుడు వస్తాడు ఆయన? అన్నాను. మూడు రోజులదాకా రారు అన్నది. సంతోషంచేత కెవ్వన కేకేసి వుందును. ఎలాగో అణుచుకుని అచ్ఛా అని ఇంటికి వెళ్ళిపోయాను. మూడోనాడు మధ్యాహ్నం రోజు గడుస్తుందా అని నిమిషాలు లెక్కబెట్టేవాడిని. దాని మొహం ఈడవ నిమిషం రెండు నిమిషాలకి గాని గడిచేదిగాదు. సరే ఎలానైతేనేం మొత్తంమీద మూడో నాడు మధ్యాహ్నం మూడుగంటలకి కౌసల్యగారింటికి వెళ్ళాను.

'మూడు గంటలదాకా ఏం అఘోరించావు? అవున్లే పగలు రాత్రి అనే భేదం పెట్టుకోవద్దని పారదారికాధికరణంలో వాత్స్యాయనుడన్నాడులే' అని రంగారావు ఈల వేశాడు.

'రామారావుగారు రెండుగంటలకోయ్ అసలు ఊరు బయలుదేరింది. అందుకోసం మూడు గంటలకి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఆవిడ ఎదురుగా వచ్చి నన్ను లోపలికి పిలుస్తుందనుకున్నాను. రాలేదు. కొంచెం ఉత్సాహభంగం అయింది. అసలు నాకోసం కనిపెట్టుకునే వుంటుందనుకున్నాను. సరే తలుపువేసి వుంటే తట్టి 'కౌసల్యాదేవిగారూ!' అన్నాడు. ఆవిడ వచ్చి తలుపు తీసి 'రండి' అని చిరునవ్వుతో ఆహ్వానించింది. మళ్ళీ మనస్సులో నాకు కొంచెం చంద్రోదయం అయింది. ఆవిడ లోపలిగదిలోకి గాని, అధమపక్షం హాలులోకిగాని, తీసుకెళ్ళి కూచోబెడుతుందనుకున్నాను. వరండాలో కుర్చీలో కూర్చోమంది'.

'ఆవిడెక్కడ కూర్చుంది?' అని వెంకట్రావు ఆదుర్దాగా అడిగాడు.

'నా కెదురుగా కొంచెందూరంలో కుర్చీలో కూర్చుంది. రామారావు యెప్పుడు వెళ్ళాడు ఊరికి? అన్నాను. ఓ గంట అవుతుంది అంది. మళ్ళీ ఎప్పుడువస్తాడు? అన్నాను. మూడురోజులదాకా రాడు అంది. అలాగా? లోపల ఎవరున్నారు? అన్నాను. మా తమ్ముడున్నాడు అంది. ఓహో! అదా కారణం అంచేత లోపలికి పిలవకుండా ఇక్కడే కూర్చోబెట్టింది అని మనసులో అనుకున్నాను. అయితే మీ తమ్ముణ్ణి కాస్త పిలవండి, కాఫీ తెస్తాడేమో? అన్నాను. కాఫీ ఎందుకు లెద్దురూ! అంది. కాదు, కాస్త కాఫీ పడితేగాని కులాసాగా వుండదు, పిలవండి అని కొంచెం బలవంతం చేశాను. విధిలేక పిలిచినట్టు తమ్ముణ్ణి పిలిచింది. ఎందుకీ గొడవ పోనీ మానేద్దామా? అనిపించింది నాకు. నా వుద్దేశ్యం ఆ కుర్రాణ్ణి పంపించి అసలు సంగతి తేలుద్దామని. వాడు నన్ను చూసి హుషారుగా ఓ నిమిషంలో తెస్తానంటూ ఫ్లాస్కు పుచ్చుకున్నాడు. మూడు కప్పులు పట్రా అన్నాను'.

'భలే ఎత్తు ఎత్తావే, చాణక్యుడంత మనిషివి!' అని రంగారావు నీలకంఠం భుజం తట్టాడు.

నీలకంఠం దస్తీపెట్టి మళ్ళీ ముఖం తుడుచుకుంటూ 'ఇంకో సోడా పట్రారా అబ్బీ!' అని కుర్రాడిని కేకేశాడు.

'నీళ్ళు తాగిస్తోంది నీ చేత వ్యవహారం!' అని రంగారావు ఇంకో సిగరెట్టు ముట్టించాడు. నీలకంఠం సోడా తాగి నాలికతో పెదిమలు తుడుచుకుని 'అవునోయ్ నీళ్ళు తాగించింది వ్యవహారం. మనకు శృంగభంగం అయిందక్కడే. కాస్త మెదడు పయోగించినట్టయితే దూడవేసేవాణ్ణిగాను. మనకు వాటర్లూ యుద్ధమంత దెబ్బ తగిలింది' అని పెదిమి విరిచేడు.

'ఏ జరిగిందేం?' అన్నాడు వెంకట్రావు.

'ఆవిడ ఏదో ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెబుతూ వుంది. కాని కంఠస్వరమేమో మారిపోయింది. మాటికి వీధివాకిలికేసి చూడ్డం మొదలెట్టింది. తన తమ్ముడు తొందరగా వస్తాడేమో అని ఆదుర్దాగా చూస్తోందే' అనుకున్నాను. కంఠస్వరం మారడం లోపల కోరికవల్లనేమో అనుకున్నాను. మధ్య మధ్య ఆవిడ ధోరణి చూస్తే అసలు సంగతి మీద అభిలాష లేదేమో అనిపించింది నాకు.

'ఇంత గ్రంథం జరిగినాక గూడ అభిలాష లేదంటావేమోయ్! ఆవిడకి?' అన్నాడు రంగారావు వికటంగా.

'నాకు కళ్ళు బహుశా ఎర్రబడి వుంటాయి. నా కంఠస్వరం గూడా మారిపోయి వుంటుంది. నేను గూడా గుమ్మంకేసి చూడం మొదలెట్టాను. మేమిద్దరమూ బహుశా నాలుగు నిమిషాల సేపు ఏమీ మాటలాడలేదనుకుంటాను. పోనీ వూరుకుందామా అనిపించింది. వెంటనే, ఇన్ని నెలలనుంచీ పడుతున్న యమయాతనా జ్ఞాపకం వొచ్చింది. ఇహ ఈ బాధపడ్డం ఎందుకు? ఏదో తేల్చేసుకుందామనిపించింది. దురదృష్టవశాత్తు నరసరావుపేట గాథ కూడా జ్ఞాపకం వచ్చింది. ధైర్యంజేసి గొంతు సవరించుకుని అటుఇటు చూసి మీతో వో సంగతి చెప్పాలనుకుంటున్నానండి చాలా రోజుల నుంచి, అని ఆవిడ మొహం కేసి చూశాను'.

'రైటో! షాబాష్!' అని అరిచాడు రంగారావు నీలకంఠం తొడమీద చరుస్తూ.

'నీకేమోయ్! అట్లాగే ఉంటుంది. అప్పటి నా అవస్థ భగవంతుడికే తెలియాలి. ఆవిడ తెల్లబోయి తమ్ముడూ అని కేకవేసింది. నాకు కాళ్ళూ చేతులూ చల్లబడ్డయి. ఖంగారు పుట్టింది. ఎలాగో మళ్ళీ ధైర్యం తెచ్చుకుని ఎబ్బే మరేం కాదండీ! అంత చెప్పదగ్గదేం కాదు, అన్నాను. కుర్చీలోనుంచి లేవబోతున్న ఆవిడ మళ్ళీ కూర్చుంది.'

'అరెరే...!' అన్నాడు రంగారావు.

'చూశావా ఆవిడ ఎంత మంచిమనిషో!' మొదటి నుంచీ నేను చెపుతూనే వుంటినిగా' అన్నాడు సగర్వంగా వెంకట్రావు.

'తర్వాత నేను ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుని తమ్ముడు కాఫీ తెచ్చినాక ఎలాగో తాగి అమ్మా! నమస్కారం, శలవు తీసుకుంటాను, అని చల్లగా తోక ముడిచాను.

'మంచిపని చేశావ్!' అన్నాడు వెంకట్రావు.

'ఏడిసినట్టే వుంది' అని పెదవి విరిచేడు రంగారావు.

'నేను ఇంత బుద్ధిహీనుడినై పోయానే అని చాలా విచారం కలిగింది. అంతటితో వాళ్ళింటికి వెళ్ళడం మానేశాను. ఆ వీధికి వెళ్ళడమే మానేశాను' అన్నాడు నీలకంఠం.

'వీధిమన్నా కూడా అయింది. అయితే ఈ మధ్య మళ్ళీ ఆ వీధినే వస్తున్నావే?' అని ప్రశ్నార్థకంగా మొహం పెట్టాడు రంగారావు.

'ఎన్నాళ్ళని మానగలం మరి? రెండు వారాలు ఊరుకుని మళ్ళీ ఏదో పనివస్తే ఆ దారినే వెళ్ళక తప్పింది కాదు.

'మంచి దోవకి వచ్చావన్నమాట. అలారా!' అని రంగారావు సకిలించాడు.

'ఆ దోవన వెళ్ళడమే మానేసినట్లయితే ఈ సమస్య లేకుండా పోను. ఇప్పుడు మళ్ళీ వక చిక్కులో పడ్డాను. నేనా దారినే పోతున్నప్పుడల్లా ఆవిడ తలుపు గట్టిగా వెయ్యడం, చప్పుడయ్యేలాగా తియ్యడం, కిటికీ దగ్గరనుంచి తోవపొడుగున చూడడం, మధ్య మధ్య చిరునవ్వు విసరడం చేస్తున్నది'.

'అలాగా! క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అన్న మహాకవి వెర్రిపుల్లాయిటోయ్! మొదట నువ్వు తొందరపడేసరికి ఆవిడ బే అంది. తరువాత కాస్త ఆలోచించుకున్న తరువాత నీ మీద ఉన్ముఖంగా వుంటోంది. స్త్రీ హృదయం అంటే ఏమంటున్నావు? బ్రహ్మచారి కట్టెవు నీకేం తెలుస్తుంది?' అని రంగారావు నీలకంఠం బుగ్గమీద చిన్న చిటిక వేశాడు.

'ఆ మీ పిచ్చిమాటలకేం లెస్తురూ? ఆవిడ చాలా మంచిమనిషి. మీరు ఉత్త వెర్రిపీనుగులు' అన్నాడు వెంకట్రావు.

'ఏదీ ఇదమిత్థమని తేల్చడం మనతరం కాదు. మనిషికొక అభిప్రాయం. సరే! ఇవ్వాళ రాత్రికి అందరం భోజనానికి వెళదాము. నువ్వురాక తప్పదోయ్! కొంచెం భావపరీక్ష చేస్తాను' అన్నాడు రంగారావు.

‘నా కాహ్వానం వచ్చిందా?

‘ఇందాక కాగితంలో నీ పేరుకూడా చూశాను. నీ దస్కతుమట్టుకు లేదు’ అన్నాడు రంగారావు.

‘సరే వస్తాను. ఏమవుతుందో చూస్తాను’ అన్నాడు వెంకట్రావు.

‘ఏమయ్యేదేమిటి? ఈ దెబ్బతో పడ్డదన్నమాటే’ అన్నాడు రంగారావు.

‘ఏమిటి పడేది నీ మొహం? పాపం! ఆవిడ చాలా మంచి మనిషి’ అన్నాడు వెంకట్రావు.

## కథానేపథ్యం ...

ఈ కథకూడా ముద్దుకృష్ణ సంపాదకత్వంలో జ్వాలలో వచ్చింది. బహుశా శివశంకర శాస్త్రిగారి పైలాపచ్చీసు వయసు కథ అయి ఉంటుంది. ఈ కథలో శివశంకరుల సందేశమేమిటో ఊహించటం కష్టం. ‘నీలకంఠం కథ’లని ఈయన కథల సంపుటం వచ్చింది, మనకు స్వాతంత్ర్యం ఇంకా ఇరవైఐదేళ్ళకు రాబోతున్నదనగా.

ఇటువంటి కథలు రాయకూడదు. ఇవి అభాసుకథలని శివశంకరశాస్త్రిగారి పరమ మిత్రులైన నోరి నరసింహశాస్త్రి ‘ప్రతిభ’ పత్రికలో (1936–40) శివశంకరులను తప్పు పట్టారు. తరువాత శివశంకరశాస్త్రిగారు వయసుడిగిన తర్వాత సన్యసించి స్వామి అయినారు. శాస్త్రిగారి కథల పునఃప్రచురణ అయినట్లు తోచదు. నీలకంఠంగారి మధుర (ముదురు) శృంగారోహలలో ఆవిర్భవించిన కథలివి.

‘నన్నయ్యయు, తిక్కన్నయు నన్నావేశించిరి’ అని విశ్వనాథవారన్నట్లు గుడిపాటి వెంకటచలంగారి ‘నాన్యఃపంథా’ శాస్త్రిగారికా రోజులలో ఇంపుగొలిపి ఉండవచ్చు. కొంచెం చదువుకొని, సమాజంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా మెలగనేర్చిన మహిళ, క్లబ్బులకూ, స్త్రీజన పురోగామి దృక్పథానికీ, సభలకూ, సమావేశాలకూ చైతన్యవంతంగా హాజరయ్యే ఇల్లాలు స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తుందనీ, ఆ స్వేచ్ఛను తాము

సద్వినియోగం చేసుకోవచ్చుననీ 'సొల్లు' కబుర్లు చెప్పుకునే మగరాయుళ్ళ అతి వాచలత్వపు కథ ఇది.

ఈ కథపేరు పేలవంగా ఉంది. అయినా కవి పండితుడు, బహుభాషాకోవిదుడు, నవ్య సాహితీ సమితి ఆజీవ సభాపతికదా వీరు. అంతేకాదు నవ్య సాహిత్యవేదిక అయిన 'సాహితి'కి కొంతకాలం సంపాదకుడు కూడాను. 'సాహితి' పత్రికవల్లనే కథకు తెలుగునాట గొప్ప ప్రాచుర్యం కలిగిందని కొడాలి ఆంజనేయులుగారు (వీరు ఒకప్పటి విశ్వనాథ జంటకవి) చెప్పారు. అప్పట్లో కథలు ప్రాయికంగా సంఘ సంస్కారోద్బోధకంగా వుండేవి. 'చలం' కూడా గొప్ప సామాజిక చైతన్యోద్బోధకుడే అని ఈనాటికీ కొందరాయనకు నివాళులర్పిస్తూనే ఉన్నారు.

ఇటు గొప్పకవిగానూ, అటు గొప్ప కథారచయితగానూ కూడా తల్లావఝ్ఝుల వారికి కీర్తి రాలేదు తెలుగునాట. అయితే ఆయన సంగీత రూపకానికి మార్గదర్శి అనీ, కవి పండిత సాహితీప్రముఖుల సన్మానితుడనీ, బహుభాషా ప్రజ్ఞాశాలి అనీ పేరు తెచ్చుకున్నారు. శివశంకరశాస్త్రిగారి సంగ్రహ స్వీయచరిత్ర పేరు 'నాలో మార్పు'. ఇందులో ఆనాటి సాహిత్యలోకపు విశేషాలు చాలా చదవొచ్చు.

# 33. అభాగిని

– విక్రమదేవవర్మ

**జ**యపురరాజ్యాంతర్గత రాయగడయందు శర్కరకరణ కర్మాగారము గలదు. దానికిఁ గొంతదవ్వునందు రంగపల్లి యను నొక చిన్న పల్లె యున్నది. అందు నాకర్మాగారమునందుఁ బాటుపడువారె నివసింతురు. ఆ పల్లెనడుమఁ గలబాట గులక ఱాలతోడ నున్నగాఁ గావింపంబడి యున్నను, గొంపలు బిరుసుగల మంటిగోడలతోడనె కట్టఁబడి వాని పెణకలు దబ్బగడ్డితోడఁ గప్పఁబడి యుండును; లోపలి మట్టినూనెగల బుడ్ల యందు వెలుఁగు దివ్వెలవలనఁ గలుగు కఱకులను డెంకులు ఆ పల్లెయందు నున్నవారు. రోజునందు నెనిమిది గంటలు పాటుపడుటవలనఁ గలుగుకష్టమును బాపి కొనుటకు సంజతఱిఁ గొంచెము కల్లుఁద్రాగి యించుక సుఖియింతురు. అప్పుడప్పుడు వారినడుమఁ గలుగు జగడములవలన వారి గొంతుకల నుండు తెమడ సమయు చుండును.

ఆ కర్మాగారమునందుఁ బాటుపడుటకై కమల యను లలన యా పల్లెకు వచ్చి యొక గది యద్దెకుఁగైకొనెను. అది తప్పనందు నద్దె నిచ్చి కాఁపురము సేయువారు మఱేరును లేకుండిరి. అదియె యద్దె నిచ్చునది యగుటవలనదాను లజ్జించుచుండెనో లేక గర్వించుచుండెనో యవ్విషయము దానిమదికె యెఱుక. దానిప్రాయము రమారమి యిరువదియేండ్లు; శరీరము నాతిదీర్ఘమును నాతి హ్రస్వమును; మఱి నాతిపీనమును నాతిక్షీణమును; చాయ పదిరెండు వన్నెల బంగారు, అరాళనీలాలకలు దాని శారద పూర్ణేందు వదనమున కొకింత యావరించి స్వల్పగ్రసిత గ్రహణాకారమును సూచించు చుండెను; కనులు గండు తుమ్మెదలను గలిగిన తెల్లతామరఱేకులను గేలి సేయు చుండెను. దానియంగప్రత్యంగములు కవికల్పనాతీతములు. దానిని జూచు మగవారి చూపులెకాక, యాఁడువారి చూపులుగూడ సూదంటుఱాతికి సూది యంటుకొనునట్లు దానిమేని కంటుకొని కొంతసేపు నిలచుచుండెను. అది యొక్కతియెయైన నొరుల సాయమును గోరక మఱి యొరులజోలిని గలుగఁజేసికొనక తాను మేను వంచి పాటుపడి గడియించు కూలివలనఁ గాలమును గడుపుచుండెను.

ఆ కర్మాగారముయొక్క కర్మపరీక్షకుని పేరు సూర్యమూర్తి. వాఁడవివాహితుఁడు. వాని వయస్సించుమిం చిరువదియేండ్లు, వాని ముఖము ప్రసన్నము; నయనయుగము విశాలము; వక్షము విస్తృతము; వర్ణము కేతకీ కుసుమ సదృశము. వాని మనము కమల యందు లగ్నమయ్యెను. దానంజేసి వాఁడు పనిని బరీక్షించునెపమునఁ గమల కడకుఁ దఱచుగా వెళ్ళుచుండెను. వాఁడు దానికడకు వెళ్ళునపుడది వానిని గ్రేకంటఁగని తన తలను వంచుకొని భయభక్తులతోడఁ దన పనిని జేసికొనుచుండెను. తనకడకె వాఁడు దఱచుగా వచ్చుచుండుటవలన వాని మనోభావము నది గ్రహించినను, దాని మనమునకు నూఱుపాటు గలుగకుండెను. ఇట్లు గొంతకాలము గడచెను.

వసంతఋతువు ప్రవేశించి జగమునకు నాతిశీతలమును నాత్యుష్ణమును గలిగించెను. నవమాలిక పుష్పవతియై మధుపాళి నాకర్షింపఁదొడంగెను. ఫలభరిత రసాలసాలములపైఁ గూరుచుండి పికములు పంచమస్వరమును వెల్లడించి విరహుల యుల్లములను దల్లడిల్లఁజేయసాగెను. ఆరామములు కిసలయ కుసుమ ఫల భరితము లయి జననయనానందకరము లగుచు నొప్పెను.

నాఁడు పూర్ణిమా సాయంకాలము. ఆవులు మేఁత మేసి మఱలుచుండెను. ఖగములు నిజనీడములకుఁ జేరుకొనుచుండెను. చంద్రుఁడైంద్రిశిరముపైని సూర్యుఁడు వారుణిశిరముపైని నిలిచి మూరుఁడేయు హీరకమాణిక్య చక్రములవలె విరాజిల్లు చుండిరి. అప్పటికె కర్మాగార కర్మకరులు దమ పనులను ముగించి నిజనివాసముల కేగిరి. కాని – కమల మాత్రము తనపని ముగియకుండుటవలన దానిని ముగింపఁబని సేయుచుండెను. అవ్విషయమును సూర్యమూర్తి దెలిసికొని కమలకడకేగి దాని మూఁపుపైఁ దనచేతి నిడి “కమలా! నిన్నును నీ పనుల నేర్పును గన నా డెందమున కెంతయో యానందము గలుగును. నీతోడఁ గొన్ని మాటాలాడవలెను. ఇక్కడ మాటలాడ వలనుపడదు. కనుక నీవు సందేహింపక యిప్పుడె నా మందిరమునకు ర”మ్మనెను. యువతీయువకుల యేకాంతమేళన ముపద్రవకర మగునుగదా! కమల వానికోర్కి కియ్యకొని వాని యింటి కేగెను. అది వాని గదియందుఁ బ్రవేశించినంతనె యా ధూర్తుఁడు దానిని గౌఁగలించెను. వేఁడితాఁకుడువలన వెన్న గరఁగకుండునా? అంతనుండి ప్రత్యేకనిశియందు నెవ్వరు నెఱుంగకుండునట్లు కమల సూర్యమూర్తి మందిరమునకు వెళ్ళుచు వచ్చుచుండెను. కొంతకాలము కది గర్భవతి యగుట దెలిసి నంతనె వాని మదికి దిగులుగలిగెను. అంత వాఁడు దానిని బుజ్జగించి గర్భవిచ్ఛేదమును జేసికొనవలె ననియు నట్లు చేసికొననిచో భరింపశక్యముగాని నింద గలుగుననియును

దానికి బోధించెను. అది సమ్మతింపమని నా పాపి బెదరించెను. కాని – కలుగఁబోవు నిందకు నప్పటి బెదరింపున కది సరకుసేయక "నే నాపనిని జేయ" నని దృఢముగాఁ జెప్పెను. మాతృవాత్సల్య మధికతమముగదా! ఆ విశ్వాసఘాతుకుఁడు దానియందు లేనిదోషము నారోపించి దానిని గర్మాగారమునుండి తొలఁగించెను. అది మఱు మాటాడక విదేశమున కేగెను. ఆయభాగిని యెట్టి శిశువును గనెనో యేమయ్యెనో తెలియదు.

## కథానేపథ్యం ...

విక్రమదేవవర్మ వంటి జయపుర సంస్థానాధిపతి, సంస్కృతం, తెలుగు, ఒరియా, ఇంగ్లీషు భాషలలో గొప్ప సమర్థుడు, విద్వత్కవి, ఆశుకవితా ప్రాగల్భ్యంకల మహారాజు తెలుగు కథ పట్ల ఆకర్షితుడుకావటం, 20వ శతాబ్దంలో ఆధునిక రచనా ప్రక్రియగా చిన్న కథకు ఎంత ప్రాధాన్యం వచ్చిందో తెలుపుతుంది. ఈ మహారాజు గ్రాంథిక భాషాభిమాని. అయితేనేం, ఆ రోజులలో కథానిక ప్రక్రియలో కృషిచేసినవారంతా తమకప్పటికి అలవాటైన గ్రాంథికంలోనే వచన రచనలు చేశారు. విక్రమదేవవర్మ సహృదయుడు, గ్రాంథికమే కావాలని పట్టుకొని కూచోకుండా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రాజరాజు నాటకం అంకితంగా స్వీకరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూరివిరాళం ఇచ్చాడు. గిడుగు రామమూర్తి బాల్య సహపాఠి. ఆ రోజులలో కవులను, రచయితలను ఎంతగానో ఆదరించాడు. ఒరియా భాషలో కూడా ఒక నాటకం రచించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చిరకాలం తెలుగు శాఖను తీర్చిదిద్దిన దువ్వూరి వెంకటరమణశాస్త్రి మహాశయుడి స్వీయచరిత్రలో విక్రమదేవవర్మ సాహిత్యప్రీతి, కవిత పండితుల పట్ల ఆదరం తెలిపే సన్నివేశాలున్నాయి. నిజానికి ఇప్పటికి ఈ కథలో వస్తు, శిల్ప, భావుక పరిణతి ఉంది. వర్ణనలు హృద్యం. మానవ మనస్తత్వ నైపుణ్యం ఎంతో ప్రశంసనీయంగా వర్ణితం ఈ కథలో. ఐంద్రి అంటే తూర్పుదిక్కు, వారుణి అంటే సముద్రపు పడమటి దెస అని భావుక మనోహరంగా ఈ మహారాజకవి ఈ కథలో ప్రస్తావించాడు. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు నడిపిన 'ఆంధ్రి' పత్రికలో సుమారు 80 ఏళ్ళక్రితం ఈ కథ ప్రచురితమైంది.

# 34. లీల

- రాయసం వెంకటశివుడు

## దొరసాని దుఃఖము

ఘనులని శ్లాఘింపఁబడు పురుషులకంటెను, పెద్ద పేరు పెట్టుకొను సమాజముల కంటెను, ఏ పాపపుణ్యముల నెఱుఁగక తన పాఠములను తాను జక్కగఁ జదువు కొనుచుఁ జెలికత్తెలతో నాడుకొనుచునుండు నార్య బాలికయే వేయిమడుంగు లెక్కువ మంచి కార్యములను జేయఁగలదని నాయభిప్రాయము. దేశమునకట్టి మహోప కారిణులుగాఁగల చిన్ని బాలికలకు విద్య నేర్పఁబూనిన గురూత్తములు సాధారణముగఁ దమ గొప్ప యుద్యమమును మఱచి నీచపుటూహలకు లోనగుచుండుట మిగుల విషాద కరము. ఈ మధ్య నేను గోదావరీ తీరమునందలి ముకుందపురపు బాలికాపాఠశాలను, బరీక్షించుటకుఁబోతిని. ఆ పాఠశాలాధ్యక్షురాలగు కార్నీలియామేయను కాంత, అమెరికా దేశపు స్త్రీ. ఈమె తన దేశమునందలి యొక మతసంఘము వారి కోరిక చొప్పున మన దేశీయుల యభివృద్ధికై పాటుపడనుద్యమించి, కొన్ని సంవత్సరముల క్రిందట హిందూ దేశమునకు వచ్చెను. అప్పుడీమె యాగ్రామమున స్థాపించిన హిందూ బాలికా పాఠశాల యిపుడు చాలా నభివృద్ధిగాంచి యున్నది. ఈ వనితా రత్నమున కీదేశమున నే బంధువులును లేరు. తానుబూనిన ఘనకార్యమే తన జన్మసాఫల్యమును గావించు పుణ్య కర్మముగను, తన యొద్ద విద్యాస్వీకారముఁజేయు బాలికా మణులే తన బిడ్డలుగను భావించుచు, ఈ సుదతీమణి దినములు గడుపుచున్నది. తన పాఠశాలను వీక్షింప నాకుఁ గుతూహలము గలదని నేను జెప్పినప్పుడామె మిక్కిలి సంతసించి, యొక దినము నేను జేయు పరీక్షకు వలయు ప్రయత్నములు చేసెను.

పాఠశాలలోని బాలికలలోఁ బెక్కండ్రు మిక్కిలి తెలివితేటలును, నీతి సంపద యును గలవారుగ నాకుఁ గానబడిరి. దాదాపుగ నందఱును విద్యయందు మిక్కిలి యాసక్తి గలిగి, పాటుపడునట్టివారు. పరీక్షానంతరము వారిలోఁ గొందఱి కీయదఁదలచుకొనిన కొలఁది బహుమతులనిచ్చి, పాఠశాలలో నిదివఱకుఁ జదువుకొని

వృద్ధిcగాంచిన బాలల సంగతిc దెలిసికొనcగోరి యట్టి సంగతులను దెలుపు పట్టికc జూచితిని. దానిలో మొదటిపేరు 'లీల' యని యుండెను. ఇట్టి పేరు సాధారణముగ హిందూ బాలికలకుండదుగదా. ఈమె క్రైస్తవ బాలికయని తలంచుచుండcగా, ఆ పేరు దగ్గఱనే "హిందూ బాలిక వయస్సు 10 సంవత్సరములు" అని వ్రాయబడి యుండెను. "ఈ బాలికకిట్టి పేరేల కలిగినది? ఇప్పుడెచట నున్నది?" యని నేను బాఠశాలాధ్యక్షు రాలి నడుగcగా ఏమియో గాని యామె నామాట వినిపించుకొనకట్లుండెను. కౌతుకము ప్రేరింపcగా నేనా సంగతి తిరిగియడిగితిని. అప్పుడా స్త్రీ, చిన్నవోయిన ముఖముతో దీనత్వముట్టిపడునట్టు నా వంకcజూచి, సన్నని కన్నీటిబిందువులు నేత్రములc గూడు కొనుచుండcగా, 'మిత్రమా! నా హృదయమును వ్యాకుల పఱిచెడి యీ విషయమును దప్పించి, వేఱొక సంగతిని మనము మాటాడుకొనలేమా' యనెను. 'నలువది సంవత్సరముల నడివయస్సులో నుండి, తన్ను బాధించునట్టి గృహచ్ఛిద్రము లేవియు లేక, ఆరోగ్యము, చిత్తశాంతి మొదలగు సుఖముల ననుభవించుచున్న యిట్టి స్త్రీకే కష్టము కలిగియుండును? ఇట్టి విదేశపు స్త్రీకి కుగ్రామనివాసినియగు బాలిక వలననే దుఃఖమాపాదిల్లియుండును?' అని నేను మనస్సున నాలోచింపసాగితిని. కాని నా యూహకుc దెంపులేనందున నామెను జూచి 'అమ్మా! మీకు దుఃఖకరమగు నీవిషయము నేతెలిసికొన వలయునని నాకు కుతూహలము గలదు. ఒక్కొక్కప్పుడు మన దుఃఖమితరు లకు జెప్పినప్పుడు మనశ్శాంతి గలుగును గదా!' అని నేనంటిని. అప్పుడామె సోదర భావముతో నన్నుc జూచి యిట్లు చెప్పcదొడంగెను.

## దొరసాని పూర్వపు చరిత్రము

'మీరడిగిన లీలయను బాలిక చరిత్రమునకును నా జీవితమునకును గాఢమగు సంబంధముగలదు. కావున నామెను గూర్చి చెప్పునపుడు, నన్ను గుఱించియు, నా సుఖదుఃఖములను గుఱించియును సందర్భవశమునc జెప్పుకొనవలసి వచ్చును. దీనికి మీరు నన్ను క్షమింపవలయును.

నేను అమెరికా ఖండములో సాంఘిక సంస్థానములనుపేరుతో నొప్పుచున్న దేశములోcదమ నివాస మేర్పఱుచు కొనిన యొక ప్రాcత ఇంగ్లీషు కుటుంబములోని దానను. సుగుణాన్వితుcడగు నాభర్త యాకస్మికముగ సంభవించిన యొక యెదరువలన మరణమునొందెను. యౌవన ప్రాయములో నుండిన నా కపుడు గలిగిన దుఃఖమును గొంతవఱకు శమింపc జేయc గలిగినది నా ముద్దుల కొమరిత యొక్కర్తుక తప్ప మఱి

యేదియు లేదు. నాకు లోకమంతయు నంధకారబంధురమయ్యెను. కాని, యా పెను చీcకటిలో నా కనులను గొంతసేదదీర్చి, నడుచుటకు నాకు మార్గమును జూపించుటకు నా పుత్రికయందలి ప్రేమయే మిగుల సహకారియైనది. నా పుత్రికయే లేనియెడల, నేను మతిచెడి, యే వైద్యశాలనో, యే కారాగృహముననో బలవన్మరణము నొందియుందును. కాని కరుణాళువగు దైవమే యే స్థితిలో నున్న వారికాయోదార్పులను గలిగించు చుండును. నా కొమార్తె కొఱకైన నీ ప్రపంచమున నుండవలయుననియును, ఆమెకు జెల్లింపవలసిన కృత్యముల కొఱకైన నేను దుఃఖమును మ్రింగివైచి తలయెత్తి తిరుగ వలయుననియును, నేను నిశ్చయించుకొంటిని.

కాని దైవము నాకీ మాత్రము సౌఖ్యమైనను జిరకాలము ప్రసాదింపలేదు. భర్తృ వియోగము గలిగిన యారునెలలోనే, నా కొమార్తె జ్వరపీడితయై పరలోకముc జెందెను. పరమాత్ముని సన్నిధానమున కేగిన పుణ్యవతిని గురించి దుఃఖింపcగూడదని నేనెన్ని సారులు నా మనసునకు బోధన చేసినను దుఃఖమాగకుండెను. దుఃఖించుచున్నానను స్మృతి నాకుc గలుగకమునుపే, కన్నీరువరదలై వచ్చినన్ను ముంచుచుండును! వెనుకటి యాపదకుc గాకపోయిన దీనికైనc నా మనస్సు చలించి, పిచ్చిదాన నగుదునని నేను అనుకొంటిని.

నా దురవస్థ జూచి, జాలి గొనిన మా యూరి మతగురువు, ఒకనాcడు మా యింటికి వచ్చి నన్నోదార్చుచుc జాలితో మాటాడెను. తుదకు నా దుస్థితిని బాగుగ గ్రహించిన యాతcడు, దేశాంతరగమనముcజేసి, పరోపకార కార్యములందు మనస్సును లగ్నము జేసినcగాని, నాయాత్మకు శాంతి సమకూడదని చెప్పి, తమ మత సంఘము వారి యాజమాన్యముననున్న హిందూదేశములోని యొక ప్రదేశమునకుc బోయి, క్రైస్తవమత వ్యాపనముc జేయుమని నాకు బోధించెను. ఆపద్బాంధవుcడగునట్టి యా సత్పురుషుcడు చేసిన బోధను నేను శిరసావహించి, యోడ ప్రయాణముcజేసి, మీ దేశమువచ్చి యీ గ్రామములో నివాస మేర్పరచుకొంటిని.

## హిందూ బాలికతోడి పరిచయము

జన్మస్థలమును విడిచివచ్చిన నేను, ఆశ్చర్యమును గలిగించెడి యీ క్రొత్త దేశపు ప్రజల యాచారములను గనిపెట్టునపుడును, వారి భాషను నేర్చుకొనునపుడును, ముందు వారికి నా ప్రియమగు పవిత్రమతమును బోధించు టెట్లని తలంచునపుడు గలిగిన యుత్సాహములో, నా వెనుకటి దుఃఖములు మఱచిపోతిని. కొలcది కాలము

లోనే నా యాత్మ కెప్పటికి శాంతి గలిగెను. 'నిజముగా నా భర్తయును, బుత్రిక యును మరణించిరా?' యని నేను సంశయింపఁ దొడఁగితిని. లేదు లేదు, వారు పవిత్ర తరమైన లోకమునకుఁ జనిరనియును, మంచి కార్యములు చేయుచు, దైవచింతతో నేను దినములు గడిపితి నేని నా బంధువులను గలిసికొని, వారితో పఁవర్గ సుఖముల ననుభవింపఁగలననియు నా మనస్సునకు ధైర్యము తోఁచెను.

ఒక దినము నాకుఁ గన్నుల పండువు చేయు దృశ్యమొకటి గానవచ్చెను. నేను బెరటి వసారాలోని కుర్చీలోఁ గూర్చుండి చొక్కా కుట్టుకొనుచుండఁగా, చనిపోయిన నా కొమార్తెను బోలిన యొక హిందూబాలిక యాకారము నాకుఁ గానబడెను. కుట్టుచుండు చొక్కాను చిన్నబల్లమీఁదనునిచి, నేను బెరటిలోనికి వచ్చి చూడఁగా, ఒక పిల్ల పాలు తెచ్చి, వంటలవాని గదిలోనికిఁ గొనిపోయెను. ఆమె తిరిగి వచ్చువఱకును నే నచ్చటనే గనిపెట్టియుండి, చేసైగచేత నా బాలను బిలిచితిని. ఆహా! అనేక విషయములయందు నా కొమార్తె లిల్లీనిఁ బోలిన యా బాలికను జూచినపుడు నా హృదయమునకు గలిగిన సంతోషమేమని చెప్పను! నా కొమార్తెయే, అమెరికాలోని సమాధిలోనుండి లేచి వచ్చినదా యని నేననుకొనజొచ్చితిని! నా ముద్దుల కొమరితకు వలెనే, యీ పిల్లకును సోగకన్నులును, గుండ్రని ముఖమును నుండెను. శరీరచ్ఛాయయందు మాత్రమే బేధము గానిపించెను.

ఇఁక నీబాలను నేవిడుచుటెట్లు? పుత్రికావియోగ దుఃఖముచేఁ బీఁడింప బడుచున్న నాకీవిధమున నూరట గలిగించుటకే దైవము తప్పక నన్నీ దూర దేశమునకుఁ గొనివచ్చెనని నేననుకొంటిని. తన్ను తాకవలదనియు, తల్లి కోపపడు ననియును, ఆ పిల్ల చెప్పుచు వెనుకడుగులు వేయుచున్నను, నేను బుత్రీమోహాము చేత నామె చేయి పట్టుకొని, నా చేరువనున్న చిన్న కుర్చీ మీఁదఁ గూర్చుండఁబెట్టి, దుఃఖా వేశముచేతఁ గ్రమ్మిన బాష్పజలము కనులను మాంద్య పఱుపఁగా బ్రేమాతిశయముచేఁ దొట్రుపడుచుండు చేతులతో నా బాలిక ముఖమును గన్నులను ముంగురులను దడవు చుంటిని! వలదు వలదని వారించుచున్న బాలిక చిన్న పెదవులను, ముఖమును, చెక్కులను, పలుమారు ముద్దుపెట్టుకొంటిని! పోఁగొట్టుకొనిన ధనరాసిని గనుఁగొనిన పేదవలె, నా హృదయము బాలికను జూచి మిక్కిలి యుప్పొంగెను.

నాకుఁ గలిగిన హృదయపారవశ్యమునందు, ఆ బాలిక పరుల బాలికయనియు వారి యింటికామెను వేగమే పంపివేయవలెననియు నాకు స్ఫురింపలేదు. ఐనను, పోయి

వచ్చెదనని కొన్నిసారులు లేచి నిలుచుండిన యా బాలికను జూచి, తీరని మోహమున డెందము తల్లడిల్లుచున్నను, మంచిదని నేను బలికి, యొక ఫలమునామెకిచ్చి 'ఇదినీవు తిని, యిచటికి రేపు పాలు తెచ్చినపుడు, ఈ లోపలికి వచ్చి, నాతోఁగొంచెము సేపు మాటాడితివా, రెండుపండ్లు ఇచ్చెద'నని చెప్పితిని. అంతట నా బాలిక తన యింటికి వెడలిపోయెను.

## హిందూబాలతోడి స్నేహము

ఆ రాత్రి నా కనులకు నిద్దుర రాలేదు. ఒకవేళ భారముచే ఱెప్పలొకింత వ్రాలినను, వెంటనే లిల్లీ యొక్క సుందరాకారము ముందు గానఁబడినట్లుతోఁచి, దిగాలునలేచి కూర్చుందును! ఎట్టకేలకుఁ దెల్లవాఱెను. కాని యెంతసేపు వేచియున్నను, ఆ బాలిక పాలు తెచ్చు సమయము రాకుండెను. బాలిక వచ్చిన తోడనే నాకుఁ దెలియఁజేయుమని వంటలవానికిని, దూరమునఁ గానఁబడఁగనే నాకు వచ్చి చెప్పుమని గృహపరిచారకుని కిని ఆజ్ఞయిచ్చి, యంతటితోఁ దనివితీరక, వచ్చిన వెను వెంటను యామెను బొడఁ గనుటకై ముందలి వసారాలో నిటునటు దిరుగుచుంటిని. మన మెక్కువ యాతురతతోఁ గనిపెట్టుచుండు సంగతియె వెనుకకుఁ బోవుచుండుట సహజముగదా! ఆ దినము గంట దినమైనటులఁగానఁ బడెను!

తుదకాబాలిక మెఱయుచుండు పాలపాత్ర తన చిన్నచేతి కొకవింత యంద మిచ్చు చుండఁగా, బెదరిన ముద్దు చూపులతో మెల్లమెల్లఁగ నడుగులిడుచు మా యింటిని సమీపించెను. తోడనే పరిచారకుఁడు పాలపాత్ర దాని చేతుల నుండి తీసికొని, 'దొరసానమ్మగారు నిన్ను రమ్మనుచున్నారు. ఇంటిలోనికిఁ బొమ్మ'ని యామెను నా యొద్దకుఁ బంపెను.

మొదటి దినము భీతితోఁ బలుకకుండిన యా బాల, రెండవనాఁడు కొంచెము చనవు గలిగి, నేనడిగిన ప్రశ్నములకు మెల్లని కంఠస్వరముతోఁ గొన్ని యుత్తరము లిచ్చెను. ఆ బాలిక వినోదార్థమై చిత్రప్రతిమలను విచిత్ర వస్తువులను ఎన్నిటినో నేను చూపించితిని. సంగీతపు పెట్టె చూచునపుడును, టిక్కుటిక్కుమను చిన్న గడియారమును వీక్షించునపుడును, ఆ బాలిక యాత్యాశ్చర్యముతోఁ దన విశాలనేత్రములను విప్పి చూచెను. అప్పుడామె నా ముద్దుల కొమార్తె లిల్లీని సరిగాఁ బోలి యుండెను! కుగ్రామ నివాసిని గావున, ఆ బాలికకు విదేశపు స్త్రీనైన నా గృహము వివిధ వస్తు ప్రదర్శన శాలవలెఁ గనిపించి యుండును. 'ఇది యేమిటి? దీని ప్రయోజనమేమి?' యని నన్నుఁ

బలుమారడుగఁ జొచ్చెను. ఇంతియెకాక, మెత్తని మెత్తలుగల యచటి కుర్చీలు తన చిన్న చేతులతోఁ దడవుచును, సువాసనలిచ్చు లెవెండరు మొదలగు పరిమళ ద్రవ్యములుండు సీసాల మూఁతలు దీయుచును, కుట్టుయందుపయోగించు సన్నని సూదులను పట్టు వంటి దారమును దనవాలుగన్నులతో నుపలక్షించుచును, ఆ బాలిక నా గదిలో సంతోషమున నుండెను. నాయింటి గోడల వ్రేలుచున్న ఛాయాపటములలో నామె నా చిన్న కొమరిత పటము చూచి, 'ఈమెయెవ్వరు' అని నన్ను బ్రశ్నించినపుడు, నాకుఁ బట్టరాని దుఃఖము వచ్చి 'ఈమెయు నీవలెనే యొక చిన్న బాలిక' యని చెప్పి యంతతో నా ప్రసంగమును మరలించితిని.

పాలు తెచ్చునపుడే గాక పలుమారు తాను నా యింటికి రావచ్చునని నేను జెప్పఁగా, ఆమె వల్లెయనెను. ఇదిగాక, తాను మంచి బాలికగా మెలఁగిన యెడల, తన కంటెనెంత పెద్దదైనను దొరసాని తన చెలికత్తెగ నుండునని విని నపుడాబాలిక కాశ్చర్యమును సంతోషమును గలిగెను! ఆ బాలిక దినదినము ననేక పర్యాయములు నా యింటికి వచ్చుచుఁ బోవుచుండెను. తాను మంచి బాలికగ నుండుటెట్లని నన్నామె యాతురతతో నడిగినపుడు 'నీవు అనుదినమును దేహమును బాగుగఁ దోమి, నీళ్ళు పోసికొని, శుభ్రమగు బట్టలు గట్టుకొని, నిజము పలుకుచుండిన యెడల, నీవు మంచి బాలికవగుదు'వని నేను బలికితిని.

అప్పటినుండియు నెపుడు నేఁజూచినను, ఆ బాలిక చెట్టుననుండు పుష్పమువలె, పరిశుభ్రముగఁ గానిపించుచు వచ్చెను. ఆమె వినోదము కొఱకు నేను చిన్న చిన్న వస్తువులనామెకిచ్చుచుందును. ఏకాకినై వైరాగ్యమును బూని, ఈశ్వర ధ్యానమునందును మత వ్యాపనమునందును దినములు గడపవలయునని సముద్రముల దాఁటి, వేలకొలఁది మైళ్ళ దూరము వచ్చిన నాబోఁటి బోటి, నానాఁటఁ బ్రాపంచిక వ్యాపారములందును, సాంసారిక బంధములందును దిరిగి ప్రవేశించుట యాశ్చర్యముగదా! కాని విధి కృతమున కేమి యడ్డుగలదు? అంతకంతకు నాకాబాలికతోటి సఖ్యము దట్టమయ్యెను. ఒకగంటసేపు నాకాబాల కంటికిఁ గానిపించనియెడల, పిచ్చియెత్తినట్టు తోఁచు చుందును! దానితో సుఖ సంభాషణము చేయని నిమిషము నానాలుక బెరడుగట్టి నటులగును! ఇట్లు మామిడిచెట్టునకును మల్లెతీగకునువలె, అమెరికాదేశపు స్త్రీకిని హిందూబాలికకును నచిరకాలములోనే సఖ్యసంబంధ మేర్పడి, దినదినాభివృద్ధి కాఁజొచ్చెను.

## లీల విద్యాభ్యాసము

"నా నూతన సఖియగు నీ బాలికను లీల యనుపేరుతోఁ బిలుచుట కెపుడా రంభించితినో నాకు జ్ఞప్తిలేదు. గతించిన నా ముద్దుకొమార్తెయగు లిల్లీని బోలియుండుట చేత నీమెను గూడ లిల్లీ యనియును, లీల యనియును, నేను బిలువ నారంభించితిని. లీలా యని పిలుచునప్పుడు, నా హృదయ కుహరమునుండి సాయం సమయమునందలి సముద్ర తరంగములవలె ప్రేమగుణము వెలికిఁ బొంగివచ్చుచుండును. 'లీలా' యని నే బిలిచినతోడనే, ఆ బాలిక కనుగొనలనుండియు, లేఁబగడములను బోలిన ముద్దు పెదవుల నుండియు, సన్నవెన్నెలవంటి మందహాసము ప్రసరించుచుండును! ఇట్టి గాఢ ప్రేమబంధముచేఁ గట్టఁబడి మేమిరువురమును గూడి సంసారయాత్రను జేయఁజొచ్చితిమి.

"లీల విద్యారంభపు దినములు నాకు జ్ఞప్తిలేవు. నేనప్పుడప్పుడే నేర్చుకొను చుండిన తెలుఁగక్షరములు గుణితము మొదలగునవి కొన్ని దినములలోనే లీల నేర్చుకొని నన్నుఁగలసుకొనెను. ఈ చిన్ని బాలతోఁ గలసి నేజదువునప్పుడు, నా చిన్నతనమున నమెరికాదేశమున బడిలో నేఁజదివిన పూర్వపు ప్రియ దినములును సంగతులును జ్ఞప్తికి వచ్చును! కాని, లీలకు నేను సహపాఠకురాలనే కాక, గురువునగుట కూడా సంభవించెను. నా పెద్దపెద్ద యింగ్లీషు పుస్తకములను, చక్కని బొమ్మలతోఁగూడిన గ్రంథములను బలుమారు తీయుచు, లీల 'నాకీయక్షరములును నేర్పవలయును' అని కోరఁగా, ఆమె కింగ్లీషు భాషగూడ నేరుప మొదలుపెట్టితిని. మాదేశపు బాలికల కంటె గూడ హిందూదేశపు బాలికలే విద్య నేర్చు విషయమున నెక్కువ చురుకుఁదనముఁ జూపించెదరని నా యభిప్రాయము. నాకింకను తెలుఁగు భాషలోని చిన్న పుస్తకముల సంగతులనే బాగుగఁ దెలియక పూర్వమే, లీల ఇంగ్లీషు పుస్తకములు చదివి, వానిలోని యంశములను గ్రహింపఁ గలిగియుండెను! నేను లీలతోఁ దెలుఁగున మాటాడుట కంటె, ఆమె నాతో ఇంగ్లీషున ప్రసంగము చేయుట మిక్కిలి చక్కఁగ నుండెను! ఇట్లు దినదిన ప్రవర్ధమానమగుచు వచ్చిన యా బాలికామణి విద్యాబుద్ధులు నా హృదయమున కపరిమిత సంతోషమును కలిగించెను.

## ఉద్యమమునకు విఘాతము

"తెలుఁగు భాషలోఁ జదువను వ్రాయ నేర్చితినని దెలియఁజేయఁగా, నాపై యధికారులగు మా దేశమునందలి మత వ్యాపన సంఘమువారు, క్రైస్తవమతమును

జనులకు బోధింప నారంభింపుమని నాకాజ్ఞనిడిరి. కావున నేనొకదినము లీలను బిలిచి 'ప్రియమగులీలా! ఇన్ని దినములవఱకును మీయూర మీ భాష నేర్చుకొనుటకై స్థిరముగ నుంటిని. ఇఁక చుట్టుపట్టులనుండి గ్రామములఁదిరుగుచు, మా సత్య సంఘము నేను బోధింపవలయునని మా యధికారులాజ్ఞ చేసిరి. నేనచ్చటచ్చటఁ దిరుగుచున్నను, పలుమారిచ్చటికి వచ్చుచుందును. అప్పుడు మనము గలసికొని ముచ్చటింప వచ్చును. మనం ఇన్నిదినములును సుఖసహవాసముఁ జేసితిమి. కాని స్వసుఖముకంటె స్వామికార్యాచరణమే ముఖ్యముగదా" అని పలికితిని.

"సామాన్య బాలికలవలె లీల, యూరక కంటనీరు నించుకొని విలపించునది కాదు. నేనీ సంగతి యామెతోఁ జెప్పుచున్నపుడామె కంట జలకణము లొకటి రెండొలికినవి. కాని వివేకవతియైన యా బాల, వానిని మెల్లఁగఁ దుడిచికొని, నే చెప్పు మాటల యుక్తాయుక్తములను బాగుగఁ దలపోసి, దీర్ఘాలోచనఁజేసి యిట్టులనెను – "అమ్మా! మీ పలుకుల యర్థము బాగుగ గ్రహించితిని. మీ మత సంఘము వారి యాజ్ఞను శిరసావహించుట యవశ్యకమే. ఇదిగాక నిజమని మీరు నమ్మిన మతమును వ్యాపనము చేయుటకూడ ముఖ్య ధర్మము. మీరు చెప్పిన చొప్పున, స్వసౌఖ్యమునకంటె పరోపకారము ప్రధానమైనది.

'కాని, ఒక్కొక్కప్పుడు మనకుఁ దెలియకయే, మన ధర్మము మనము నిర్వర్తింప నారంభించునటుల దైవము సంఘటించుచుండును. మనమారంభించి చేయుచున్న మంచిపని కంటె మంచిదగు వేఱొకపని కొఱకై విడిచి పెట్టుట మంచిదిగాదు. ఈశ్వరోద్దేశ మెప్పుడును మనమనుకొనునట్లుండునది కాదు. మనము సంతోషముతో నేదో ఒక కార్యముఁ జేయఁదలంచు కొనినపుడు, ఎదురుచూడని విఘ్నమో, విపత్తో గలిగి, మనలను దుఃఖమున ముంచివేయుచుండును. అట్టి సమయమునందు దైవము సంభవింపఁజేసిన కలత స్థితియందైనను, శాంతము మొదలగు నియమములను విడువక, కార్యసాధనము చేయుటయే మనకుఁ గర్తవ్యము. ఇటుల మంచి మార్గమున నడచి, యేస్థితిలోనున్నపుడందలి కార్యము పనులు బాగుగ నిర్వర్తించునపుడే, మనుష్యులు స్వామికార్యము నెఱవేర్చిన వారగుదురుగదా!" యని లీల చెప్పెను.

"లీల పలుకు లామెకుఁగల యసాధారణ వివేకమును భక్తిని వెల్లడిచేయు సత్యవాక్యములేయైనను, అవి యెందుచేతనో గాని నన్నెత్తి పొడుచునట్టు మాటల వలె వినిపించెను. ఆలోచించిన కొలఁది, ఆమె నన్ను గుఱించియె యిట్లు పలికినదని నాకు

గోచరించెను. ఇంతియెగాక, ఆమె నా యుద్యమమున ఏదో యొక యాతంకముఁ జెప్పఁబూనినట్టుగ నాకుఁ దోచెను. "లీలా! వట్టి నీతిబోధనలతోఁ బ్రయోజన మేమి గలదు? నీ మాటల సరణి చూడఁగా, నేను మతబోధనా కార్యమును మానుకుండుట నీ యభిప్రాయమని తోఁచుచున్నది! ఆ పవిత్ర కార్యమును జేయుటకే గదా యీ దూరదేశము వచ్చితిని" అని నేను గొంచెము కోపముతోఁ బలికితిని.

దీనికి లీల తన యుద్దేశము, నేను మతబోధనా కార్యమును బొత్తిగ వదలిపెట్టుట కాదనియును, చుట్టుపట్టులకుఁ దిరుగుచు మతబోధనఁ జేయుటకంటె నేను బ్రారంభించిన వేఱొక మంచికార్యమే బాగుగ నెఱవేర్చుట ముఖ్యమనియుఁ జెప్పెను. అది యేదనఁగా, దనకు నేను విద్యఁగఱప నారంభించితిననియును, అట్టి బాలికా విద్యను నేనా గ్రామమున వృద్ధి నొందింపవలయు ననియును, అట్లు చేసిన యెడల, దొరసాని కనేక బాలికలు చెలికత్తెలై యామెకు సహాయము చేసి, యామె యుద్దేశమును నెరవేర్చదరనియును జెప్పెను! కుగ్రామమగు నాయూర నేను పాఠశాలను స్థాపించుట కష్టమనియు, నిరుపయోగమనియును నే జెప్పఁగా నామె దాని కొప్పుకొనక, కొంచెము కోపగించుకొని, చిన్న పోయినట్లుండెను. అప్పుడు నామె నూరడింపఁబూని, 'లీలా! సరే! ఱేపటిదినమె నేను గ్రామమున బాలికా పాఠశాల యొకటి స్థాపించితి ననుకొనుము. దానిలోనికి వచ్చి చదువుకొనువారెందరుందురో నీకుఁ దెలియునా? నీవొకతెవెసుమీ!' యని మేలమాడితిని.

అప్పుడు మిక్కుటమగు కోపముతో దిగ్గునలేచి లీల, నాతోఁ జెప్పకయె యింటికిఁ బోయెను.

"సాధు స్వభావము గలిగియుండు లీల, యా దినము ఏల యిట్లు తగిన కారణము లేకయె కోపించెనా యనియును, ఏల యీ బాల నన్ను మతబోధనా కార్యమును మాని బాలికా పాఠశాలను స్థాపింపుమని బోధించెననియును, నేనాశ్చర్యముతోఁ దలపోయుచు, పడకగదిలోనికిఁ బోయి, మంచము మీదఁ బండుకొని యుంటిని. అదివఱకు బాలికా పాఠశాల స్థాపనమను సంగతియే నా మనసునకు స్ఫురింపలేదు. ఒకవేళ బాలికయగు లీల చెప్పిన మార్గమే దైవసమ్మతమైనది కాదుగదా యని నేనపు డనుకొనఁజొచ్చితిని! కాని పై యధికారుల యాజ్ఞనెట్లుల్లంఘింపఁగలను? ఇంతేగాక, విదేశీయులనిన దగ్గఱకు రాకుండెడి మూఢజనులతో నిండియుండెడి యీ కుగ్రామ మున నేను బాలికా పాఠశాలను బెట్టి, యొక బాలికను దగ్గఱనుంచుకొని, ప్రొద్దుపుచ్చఁ జూచుట నవ్వుల చేటుగదా!

ఇట్టి యూహలు నా మనస్సున సందడించుచుండఁగా, పడక గది వెలుపల మనుష్యుల సందడి వినఁబడెను. ఎవరువారని యడుగఁగా ముసిముసి నవ్వులు నవ్వుచు లీల కానఁబడెను.

'రా రమ్ము!' అని నేను బిలిచి, 'ఇటురమ్ము. ఒక ముద్దుపెట్టుకొని నీ చిన్న కోపమును సాగనంపెదను!' అని దగ్గఱకులాగి, యామెను ముద్దాడఁగా, లీల, గది వెలుపలఁ గొందఱు బాలికలున్నారని చెప్పి, వారు రావచ్చునాయని యడిగెను. అప్పుడు నాకాశ్చర్యము గలుగునట్టుగఁ బదిమంది బాలికలు వచ్చి కిటకిటమని మంచము మీఁదనున్న నన్ను ముట్టడివేసినట్టుగా నా చుట్టును నిలువఁబడిరి! వీరెవరని నే నడుగఁగా వారు నా శిష్యులు కాఁగోరుచున్నారనియు, వారికిఁ గొంచెమక్షరజ్ఞానము గలదనియును లీల చెప్పెను! నేనపుడు వారి చేతులలోనున్న చిన్న పుస్తకములను బుచ్చుకొని వేసిన ప్రశ్నములకు వారు మంచి యుత్తరము లీయఁజొచ్చిరి. 'మీరెక్కడఁ జదివితిరి? మీకెరు నేర్పిరి?' యని యడుగఁగా, కట్టుగట్టినట్టుగ వారిలో నెవ్వరును మాటాడక, తమలోఁ దాము నవ్వుకొనునట్లుండిరి. తప్పక చెప్పవలయునని నే నడుగఁగా, వారింకను మాటాడక, విప్పిన కన్నుగవలతో లీల మొగమువంకఁ జూచిరి. ఆహా! వీరి రహస్యము తెలిసినది! లీలయే వీరిని తమ సంగతి తెలుపవలసినదని చెప్పినది! లీలయే వీరికింటికడ విద్య చెప్పి, యిప్పుడు వీరిని నా యొద్దకుఁ గొనివచ్చి, నన్నాశ్చర్యమున ముంచి వేయుచు, తన పట్టినపట్టును నెఱవేర్చుకొనఁజూచుచున్నది. ఆహా, విద్యనేర్చిన హిందూబాలిక యెంత జిత్తులమారి, యెంత నేర్పరి!

## బాలికా పాఠశాల స్థాపనము

అప్పుడు సంతోషాశ్చర్యములతో నా హృదయముప్పొంగి, 'లీలా! ఇఁక నేనోడి పోతిని. నన్ను వదలిపెట్టుము!' అని బ్రతిమాలుకొంటిని. అప్పుడు, 'ఇక్కడ బాలికా పాఠశాల ఱేపె స్థాపించెదమనినఁగాని మిమ్ము వదలము' అని బాలికలు బిగ్గరగఁ బలికిరి! చలిచీమలు పట్టుకొని బల్లివలె నసహాయనై నేనేమి చేయుటకును తోఁప కుంటిని. ఇంతియెగాక చదువుకొనుటకు బాలికలు రారను భయముచేతనే, నేను బాఠశాలను స్థాపింపఁజాలనని లీలతోఁజెప్పితినిగాన, ఇప్పుడు చదువ సిద్ధముగఁ గొందఱు బాలికలుండుటచేత, నేను నా యాడినమాటను జెల్లింపక తప్పించుకొనుటకు మార్గముగాన లేకుంటిని! కాఁబట్టి ధైర్యముఁబూని, 'సరే! లీలా! నీవును నీ చెలికత్తెలును జయము నొందితిరి. ఱేపె మనము పాఠశాల నారంభింతము. ఇఁక మీ యిండ్లకుఁ బొండు!' అని చెప్పి వారినిండ్లకుఁ బంపివేసితిని.

ఆ మఱునాఁడు, ముకుందపురమునందు గొప్ప యాందోళనము కలిగెను. మేము స్థాపించిన బాలికా పాఠశాలను గుఱించి ప్రజలు విపరీతముగఁ జెప్పుకొనఁ జొచ్చిరి. ఇంగ్లీషు దొరసానియొకతె పాఠశాలను బెట్టి, గ్రామములోని బాలికలను మతాంతర ప్రవిష్టలఁ జేయఁజూచుచున్నదని కొందఱును, ఒక బాలిక క్రైస్తవియైనదని మఱి కొందఱును, బదిమంది బాలిక లన్యమతమును స్వీకరించిరని యిఁకఁ గొందఱును, జెప్పుకొనసాగిరి! క్రూరచిత్తయగు నీ పరదేశపు భామిని కంటికిఁ దమ పుత్రికలను గనఁబడనీయమని యమ్మలక్కలు నీలాటిరేవునఁ జెప్పుకొనిరి. హేతు విమర్శనము చేయఁగల కొలఁది సంఖ్యగల పురుషులు మాత్రము పాఠశాలకు వచ్చి, యచట నేర్పఁబడు పాఠములను జూచి, భయపడవలదని తమ యిండ్లకడఁ జెప్పిరి గాని, వారి మాటలను స్త్రీలు నమ్మకుండిరి.

పాఠశాల స్థాపింపఁబడిన క్రొత్తదినములలో, పాపము లీలకెన్నో కష్టములు గలిగెను. నా యింటికిఁబలుమారు లీల వచ్చుచుఁ బోవుచుండుటఁజూచి, యా బాలిక నాతోఁగూడి భోజనము చేయుచున్నదని పామరజనులు గొందఱు తలఁపఁజొచ్చిరి! అందువలన, లీల, కొన్ని దినములవఱకును తల్లియాగ్రహమునకే పాత్రమయ్యెను. నన్ను గుఱించి ప్రజలు చెప్పుకొనుచుండెడి విపరీతపు పలుకుల కామె సమాధానముఁ జెప్పవలసి వచ్చెను. ఆమె మాటలు రుచింపని స్త్రీలు, లేనిపోని చెడు గుణములామె కారోపింపఁజొచ్చిరి. స్త్రీవిద్య యనునది యా ప్రదేశమునకుఁ గ్రొత్తవిషయమగుటచేత, జనులు దానిననేక విధముల దూషింపసాగిరి. ఇట్టి వారితో శాంతము గలిగి మాటాడు భారము లీలపై బడెను. జనుల విపరీతాభిప్రాయముల వలన, మొదట పాఠశాలకు వచ్చిన బాలికల సంఖ్య తగ్గిపోయెను. కావున లీల, వారివారి యిండ్లకుఁబోయి వారి వారి మనస్సులకు సమాధానమగునట్టి పలుకులను జెప్పి, బాలికల ననుదినమును దన వెంటఁ గొనిరావలసి వచ్చెను! పాఠశాలలో మిక్కిలి పై తరగతిలోఁజేరి, తాను జదువు చుండియు, క్రింది తరగతుల బాలికలకు విద్య నేర్పు విషయమున నాకుఁగూడ సహాయముఁ జేయుచుండును. ఇట్లు వేయి చేతులును, వేయి కాళ్ళునుగల దానివలె నాబాలిక పనులు చేయుచు వచ్చెను. వేయేల? ఆమె సహాయములేనియెడల, నేను వెంటనే పాఠశాలను మూసివేసి వేఱుపనిఁ జూచుకొనియుందును.

లీలను మూఢజనులనేక విధముల బాధించిరి. క్రైస్తవియని కొందఱును, నాస్తికురాలని కొందఱును ఆమెను బాహాటముగఁ బిలుచుచుందురు! నిజము విచారించినచో నిటులామెకుఁ దగని పేళ్ళిడు వారికంటె నామెయే యెక్కువ దైవభక్తి

గలదియై యుండెను. ఒక దినమొక స్త్రీబృందము దగ్గఱనుండి యా బాలిక నడచిపోవు చుండఁగా, వారామెను దూషింపఁజొచ్చిరి. అప్పుడామె వారితోఁ బ్రసంగింపఁ జొచ్చెను. ఆ బాల చెప్పు మాటల సత్యమును జూచి వారిలో ననేకులూరక యుండఁగా ఒక వృద్ధాంగన ముందుకు వచ్చి, 'నీవిన్ని నీతులు చెప్పుచున్నావు! నీపేరేల మార్చుకొంటివి?' యనెను, దీనికి లీల, తాను బేరు మార్చుకొనలేదనియు, తననెంతో ప్రేమతోఁ జూచి, తనకు విద్యాబుద్ధులు నేర్పిన స్త్రీమాత్రమె తన్నీ ముద్దుపేరుతోఁ బిలుచుననియును సమాధానముఁ జెప్పెను. అంతట ఆ ముదుసలి 'ఓ బాలికా! నీకీ పాపపు పరదేశపు పేరిచ్చిన యాదొరసానియే, బలవంతముగఁ బరదేశపు మతములో నిన్నుఁ జేర్చునులే!' అని పరిహాసము చేసెను. అంతటఁ గొంచెము కోపముతో లీల 'అమ్మా! లీలయను పేరు పరదేశపుపేరో, ఈ దేశములోఁగూడఁ బూర్వముండెనో, నీబోటి దురహంకారముగల వారికేల గానఁబడును? భక్తాగ్రేసరుఁడగు ప్రహ్లాదుని తల్లియగు పుణ్యవతిపేరు లీలావతియని నీకుఁ దెలియదుకాఁబోలు!' అని యెత్తిపొడిచెను. అప్పుడా స్త్రీలు 'లీలావతియమ్మవారిని నిందించిన యీ ముసలిదాని కన్నులు పోవు'నని కొందఱును, 'చిన్నపిల్ల చక్కగా చదువుకొనినద'ని మఱికొందఱును జెప్పుకొనుచుఁ తమదారిని దాము పోయిరి.

## లీల గావించిన మహోపకారము

ఇట్లు ఈ గ్రామమునందలి బాలికా పాఠశాల మెల్లమెల్లగ జనుల యామోదము నకుఁ బాత్రమయ్యెను. మొట్టమొదట నెన్నో విఘాతములు వచ్చెను. కాని యన్నియు నా చెవుల సోఁకక మునుపే, లీల, మిగుల నేర్పరితనముతో, సవరించుచుండెను. మొదటిదినములలో, బ్రాహ్మణాద్యగ్రజాతులవారు, తమ బాలికకుఁ బాఠశాలలోఁ బ్రత్యేకముగ నున్న ఆసనము లిచ్చినఁగాని, వారిని బాఠశాలకుఁ బంపమనిరి. లీల సరేయని వారితోఁజెప్పి, యొక ప్రక్క బల్లలు వేయించి, నచట బ్రాహ్మణ బాలికలను గూర్చుండఁబెట్టుచు, ముందు వారికి బాఠములు చెప్పి, పిమ్మటఁ దక్కిన బాలికల కడకు వచ్చుచుండును.

పాఠశాల కొంతకాలము సాగిన పిమ్మట, ఎల్లకాలమును నేను బాలికలను దగ్గఱనుంచుకొని ప్రొద్దుపుచ్చుట యుక్తముగాదనియును, పాఠశాల నే పెద్దమనుష్యుల కైననిచ్చివేసి, యుత్కృష్టమగు మత వ్యాపనాకార్యమునకుఁ బోవలయునని యును, నాపై యుద్యోగస్థులాజ్ఞాపించిరి. వీరి ఉత్తరువు లీలకుఁ జూపించి, 'ఇప్పుడైనను నేను

మిమ్మందరిని విడువవలయునుగదా!' అని చెప్పఁగా, లీల యుద్ధసన్నద్ధుఁరాలైన భటునివలె రోషముతో నిట్లు పలికెను – 'అమ్మా! మీకుఁ గోపము వచ్చినఁ జెప్పలేను గాని, మీ మతసంఘమున కెంతో విపరీతాభిప్రాయములున్నవే! ఊరూరఁదిరుగుచు, మొఱ్ఱో మీ మతము మాకక్కరలేదన్న జనుల కొకయరగంట సేపు బోధన చేయుటయే మత వ్యాపనమనియు ముక్తికలుగు ననియును మీవారు నమ్ముచున్నారు! చల్లని వర్షజల్లుల నపేక్షించు సస్యంపు మొలకలవలె జ్ఞానముకొఱకై ఎదురుచూచు హిందూ బాలికలకు విద్యాబుద్ధులు నేర్పుటయును, అట్టి వారి మూలమున దేశమున కంతటను మెలమెల్లగా జ్ఞానము వ్యాపింపఁ జేయుటయును, పనికిమాలిన పనులని వారభిప్రాయ పడుచున్నారు. అట్టివారి వచనములె మీరు ఈశ్వర వచనములకంటె నెక్కువగ శిరసావహింప వలసివచ్చినదా' యని తెలియఁబలికెను.

ఆమె వాక్యములు నాకు సమంజసముగాఁ దోచెను. కావున వెంటనే నా యుద్దేశము బాలికా పాఠశాల మూలమున హిందూదేశమునఁ బనిచేయవలయునని యును, అది తమకు సమ్మతిగాకున్న యెడల నాకును దమకును నంతటితోనే సంబంధము విడిపోయినదని గ్రహింపవలయుననియును, నేను మా మత సంఘము వారికి జాబు వ్రాసితిని. వారి సహాయము లేకపోయినను, నేను గష్టపడి, ధన సంపాదనము చేసి, పాఠశాలను బోషింపవలెనని నిశ్చయించుకొంటిని! నాకు గుడి బుజమువలె నిలిచి సహాయము చేసెదనని లీల వాగ్దానము చేసెను. అంతఁగొంత కాలమున కమెరికానుండి వచ్చిన జాబులో, నా యిష్టము వచ్చినట్టుగ బాలికా పాఠశాలలను నడిపి దానిని వృద్ధిలోనికిఁ గొని రావచ్చుననియు, వలయు ధనమును దామిచ్చెదమనియును మా యధికారులొప్పుకొనిరి!

ఇంకొక కార్యమునఁగూడ లీల నాకెంతో యుపకారము చేసెను. సామాన్యముగ విదేశీయపు మతగురువులు తలంచునట్టె నాకును మొదట హిందూదేశీయుల మతాచారములు మొదలగువానిని గుఱించి విపరీతాభిప్రాయములుండెను. నేనెఱిఁగిన సత్యమే లోకములో పరమసత్యమనియు, నేను ప్రియముతోఁ జదివిన గ్రంథములే యుద్గ్రంథములనియు, నేనుదలంచి హిందువులకు మత బోధనము చేయుటకుఁ దగి యుంటిననుకొంటిని. కాని యొక దినము మాటల సందర్భమున లీల తాను హిందూమత గ్రంథముల నంతగాఁ చదువలేదనియును, తమ పూర్వులెవరో వ్రాసి యుంచిన భాగవతమను నొక తాటియాకుల గ్రంథమును దాను చదువుచున్నా ననియును నాతోఁ జెప్పెను. అందలి పద్యములు గొన్నిటిని జదివి వాని యర్థము

చెప్పుమని నేను వేడcగా నామె యట్లు చేసెను. ఆమె చదివిన పద్యములవలన, సత్యస్వరూపుcడగు భగవంతుcడన్ని దేశములలోను ప్రసన్నమై కీర్తింపcబడుచున్నాడని నా మనసుకు బోధపడెను. నాcటినుండియు నప్పుడప్పుడు క్రైస్తవ మత గ్రంథములతో హిందూ గ్రంథములను గూడ లీలతో నేను చదువుచు వినోదించుచుందును.

## లీల పరలోకగత యగుట

సౌఖ్యము వేవేగవే యస్తమించును! దుఃఖము మాత్రము గ్రీష్మకాలపు సూర్యునివలె దీర్ఘకాలము తపింపcచేయుచుండును! నాయాత్మనింకను శోధింపనెంచెనో యనునట్టుగ భగవంతుడు నాకిప్పుడు తిరిగి యొక గొప్ప విపత్తును కలుగcజేసెను. ఏలయోగాని, లీలకొక విషజ్వరము సోకెను. ప్రప్రథమమున మంచి యౌషధములు పడక పోవుటచేతనో మఱి యేకారణముచేతనో, యామె వ్యాధి నివారణముగాక యంతకంత కెక్కువయయ్యెను. తుదకొక నిండు వెన్నెలరాత్రి, తీవ్రమగు జ్వరమును సంధియును దన్నుcబీడింపcగా లీల, దయామయుcడగు దేవదేవుని సన్నిధానమునకుc బయనమయ్యెను! చనిపోవుటకుc గొంచెము ముందు నన్ను దన యొద్దకుc బిలిచి, శుష్కించిన తన చేతితో నా చేయి పట్టుకొని 'నాకొక కోరిక గలదు' అని పలికెను. 'ఏదో చెప్పుము, బిడ్డా అది తప్పక నేను జెల్లించెదను' అని నేనంటిని. అప్పుడామె 'పాఠశాల నెప్పుడును జరుపవలయును సుమీ' యనెను. సరే యని నేను జెప్పcగా, సంతుష్టి నొంది లీల కొంతసేపటికి గన్నులు మూసివైచెను.

'నావాగ్దానము చొప్పున నేనింకను బాఠశాలను నడుపుచున్నాను. సుజనులిట్లు గతించి, నా బోటి పాపులు మాత్రము నిలిచియుందురు. హా లీలా!' యని యెలుగెత్తి, యంతవఱకును మాటాడుచున్న కార్నీలియామే దొరసాని దుఃఖపారవశ్యమున బల్లమీcద కొఱిగియుండెను. ఆ వనిత కన్నులనుండి దుఃఖబాష్పములు సంతతధార స్రవింప సాగెను.

నేనీ పాఠశాలను గుఱించియు, దొరసానిని గుఱించియు నాగ్రామములో నడుగగా, ఈమె చెప్పిన సంగతులు నిజమైనవని తెలిసినది. తన జీవితాకాలమంతయు నీదేశముననే యుండి యీ స్త్రీ, బాలికా పాఠశాలాభివృద్ధికై పనిచేయ నుద్యమించిన దనియు, తనకమెరికాలోనున్న ధనములోc జాలభాగము పాఠశాలకై యిచ్చి వేయు ననియు, ఈ పాఠశాలకు ముందు లీల బాలికాపాఠశాల యని పేరిడుననియు, ఈ బాలికపేరు మీదనే దొరసాని యిపుడు కొన్ని బహుమతుల నేటేట నిచ్చుచున్నదనియుc

దెలిసినది. ఈ కాంత యుద్దేశము కరము శ్లాఘనీయమైనది. దైవమీమె చేపట్టిన కార్యమును గొనసాగించునుగాక!

## కథానేపథ్యం ...

కిందటి శతాబ్దంలో తెలుగువారైన విద్యావేత్తలలో సామాజిక వికాసం కోసం కృషి చేసిన ప్రముఖులలో శ్రీ రాయసం వెంకటశివుడు ఒకరు. ఈయన చాలా అభ్యుదయ భావాలుకలవారు. వీరేశలింగం పంతులుగారి శిష్యుడు. ఆయన ఆశయాలను ప్రచారం చేసినవారు. 'తెలుగు జనానా' అనే పత్రికను పన్నెండేళ్ళు నడిపారు. మొదట్లో ఈ పత్రిక మద్రాసునుంచి వచ్చేది. తరువాత కార్యస్థానం రాజమండ్రికి మారింది. 1894 నాటికే మహిళల విద్యావ్యాప్తికి, వాళ్ళ మానసిక వికాసానికి, వాళ్లు చదవటం కోసం ఉత్తమ సాహిత్యాన్ని ప్రచురించటానికీ పూనిక వహించిన మహాశయుడు వెంకటశివుడు. నెల్లూరు, విజయనగరం, పర్లాకిమిడి కళాశాలల్లో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1933లో వీరి ఆత్మచరిత్రం వచ్చింది. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు రాయసంవారి ఆత్మ చరిత్రకు ప్రశస్తమైన పీఠిక రాశారు. రాయసంవారు ఉన్నత పాఠశాల విద్య, కళాశాల విద్య రాజమండ్రిలో సాగించారు కాబట్టి 19వ శతాబ్ది చివరి దశకాలలో 20వ శతాబ్ది ప్రథమదశకాలలో తెలుగునాట సంభవించిన సాంఘిక పరిణామాలు, పోరాటాలు, వాదవివాదాలు, ప్రముఖ వ్యక్తుల వ్యక్తిత్వాల గురించి ఆయన స్వీయ చరిత్ర ఎంతో ఆసక్తికరంగా చెపుతుంది.

గురజాడ అప్పారావుగారికంటే పదిసంవత్సరాలముందుగానే రాయసం వారు కథలు రాసినట్లు ఆయన నడిపిన తెలుగుజనానా పత్రికను బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఆ కథలు కథనధోరణి మాత్రమే సంతరించుకున్నాయి. ప్రాథమిక స్థాయిని మాత్రమే సూచిస్తాయి. వీరి కథల సంపుటి 1925 జనవరిలో వెలువడింది. ఆ కథల సంపుటి పేరు 'చిత్ర కథామంజరి'. రెండేళ్ళలో ఈ కథల సంపుటి మూడు ముద్రణలు వెలువడడం విశేషం. ఆ తర్వాత ఈ కథల సంపుటం మద్రాసు విశ్వవిద్యాలయం ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకంగా కూడా మన్నన పొందింది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి మొట్టమొదటి కథల సంపుటి కూడా 1925లోనే వెలువడింది. దాని పేరు

పూలదండ. కాబట్టి తమ కథలను సంపుటాలుగా తెచ్చిన తొలితరం కథారచయితలు మొదటి ఇద్దరు ముగ్గురిలో రాయసం వెంకటశివుడుగారు ఒకరు. వెంకటశివుడు తమ చిత్రకథా మంజరి కథాసంపుటాన్ని వీరేశలింగం పంతులుగారికే అంకితం చేశారు. "నాకు బ్రియమగు నాదర్శములను, నిశ్చితాభిప్రాయములను గొన్నిటిననుసరించి నా యిచ్చవచ్చిన చొప్పుననే యీ కథలల్లినను ఆంధ్ర దేశమునందలి జనుల పరిస్థితులను ఊహాపోహలను అభివర్ణించుటయే ముఖ్యోద్దేశముగ గలిగి యుంటిని" అన్నారు రాయసం వారు, ఈ కథా సంపుటికి పరిచయ వాక్యాలు రాస్తూ. 'భారతి' ప్రచురణ ప్రారంభమైన తొలి సంవత్సరంలో ఆ పత్రికలో వీరి కథలు నాలుగు ప్రచురితమైనాయి. తన కథా సంపుటిలోని కొన్ని కథలను 20 సం॥ల కిందట తాము నడిపిన తెలుగు జనానా పత్రికలో ప్రకటించినట్లు రాయసం వారు చెప్పారు. అంటే 1905, 1906 ప్రాంతాలలోనే వీరు కథలు రాసినట్లు అవగతమవుతుంది. ఆయన 20 ఏళ్ళ కిందట రాశామన్న కథలలో ఈ 'లీల' కూడా ఉంది. ఆడపిల్లలు పాఠశాలకు వెళ్ళడం, విద్యావంతులు కావడం, పల్లెకూ పట్టణానికీ దేశానికీ ఎంతో మేలు చేస్తుందని ఈ కథ ద్వారా చెప్పారు రాయసంవారు. లీల వంటి పేర్లు ఆ రోజుల్లో హిందూ సంఘంలో ఎవరూ పెట్టుకునే వారుకారన్న ప్రసక్తి ఈ కథలోనే కనపడుతుంది. పాఠశాలకు వెళ్ళడమన్నా, ఇటువంటి పేర్లు పెట్టుకోవడమన్నా మతాంతర స్వీకారం కిందనే పరిగణించేదట ఆనాటి చాదస్తపు సమాజం. చాలా కరుణాత్మకమైన కథ ఇది. మానవత్వపు సున్నిత సుకుమార సంబంధాలలో మతమూ, ప్రాంతమూ దేశమూ పరిగణనలోకి రావు అనే ఆర్ద్రత, అంతరంగ సంస్పందన, హృదయ వాదమూ ఈ కథ వెల్లడిస్తున్నది. నూరేళ్ళ క్రితం భాషాశైలి కాబట్టి గ్రాంథిక వాసనలు తప్పవుకదా!

# 35. ఏరువాక

– రావూరు సత్యనారాయణ

**ఆ** పిల్ల ముఖంలో దివ్యజ్యోతులు వెలిగినాయి. ఆ లేతచెక్కిళ్ళ మీద కుంకుమ పూవు రంగు తళతళలు విరిసినాయి. ఆ పూప పెదవులమీద కెంపుల గిలాబు ప్రకాశించినది. ఆ కళ్ళలో అమృతం నురుగులు కట్టింది. ఆ పిల్ల జీవితమొక స్వర్గం. దేవేంద్రుడెవడో?

ఆనాడు ఏరువాక. ఊరంతా వుత్సవాలు, ఊరేగింపులు. ఏవంక చూచినా కల్యాణ ధ్వనులు. మంగళవాయిద్యాలు. పసిపిల్లల పరుగులు. ముసలివాళ్ళ మురుపులు. ఊళ్ళో అంతా తలంట్లుపోసుకొని క్రొత్తబట్టలు కట్టుకున్నారు. కోడెదూడల్ని, గిత్తల్ని చెరువుకు తోలుకుపోయి స్నానాలు చేయించారు. 'దొరగిత్త నాది దూసుకపోయిందిరా', 'నా గిత్త నాగలోకానికి వెళ్ళినా నన్నిడిచి పెట్టదురా', 'నావులిపిగిత్త 'ఉఫ్' అంటే చెన్నపట్టణంలో వాలుతుంది' అని ప్రశంసిస్తున్నారు కాపుదారులు. ఇంటికి వచ్చిన గోవులకి స్త్రీలు పసుపు, కుంకుమలు రాచి మువ్వలు, పట్టెళ్ళు కట్టి ఆనందిస్తున్నారు. గౌరి కూడా తలంటి పోసుకొని కళ్ళకి కాటుక పెట్టుకొని పెరటిలోనికి వెళ్ళింది. గౌరిని చూచి గోవులన్నీ తలలు వూపినాయి. గౌరి ఒకదూడకు పసుపు రాస్తూ –

ఓ బసవదేవుడా! మా బసవదేవుడా!

నీ పాటుమాకిచ్చి మా బ్రతుకు నిలుపయ్య,
నీ బలుపుమెడపైన పట్టెడలు కట్టిస్త
నీ ముద్దు మూపరము ముత్యాలు చుట్టిస్త
నీ సొగసు కొమ్ములకు బంగారు తాపిస్త

నీపాటు మాకిచ్చి మమ్ము రక్షించయ్య
నీవు నడిచిన చోట నిలువదు దుర్భిక్ష
నీ గోరును తాకిన నిధియౌను భూదేవి

నీయఋ్బపైకాడి నిలిపినంతనెమాకు
ధనధాన్యముల కొరత దరిదాపు నిల్వదు
నీపాటు మాకిచ్చి మమ్ము రక్షించయ్య

అంటూ పాడుకుంటూ ఒక యెద్దు దగ్గర నుంచి మరి ఒక దాని దగ్గరకు పోతూ, వాటిని ముద్దులాడుతూ, గంగడోలు గోకుతూ; వాటిని లాలిస్తోంది. ఇంతలోనే యింట్లో నుంచి "గౌరీ! గౌరీ!' అని కేకలు వినపడినాయి. గౌరి తండ్రి గంపెడు మామిడిపళ్ళు, బుట్టెడు మల్లెపువ్వులు; కొత్త బట్టలు మూటకట్టుకొని వచ్చాడు. గౌరి ఆ పళ్ళూ, అవీ చూచి పొంగిపోయింది. "నాన్నా యీ పళ్ళన్నీ యేం చేస్తావు?" అంది. రామయ్యకి గౌరి ఏకపుత్రి. అందుకని గౌరిని నిజంగా గౌరిలాగా పెంచాడు. గౌరికి పన్నెండు సంవత్సరాలు. బాల్యంలోనుంచి యౌవనంలోకి దూకాలని సాము చేస్తోంది వయస్సు. ఆ వయస్సుకు తగిన అంగసౌష్ఠవం, అభిరుచి వున్నాయి. గౌరి హృదయమెప్పుడూ పరోపకారానికి పరువులెత్తేది. ఆ పిల్ల ప్రశ్నకు తండ్రి సంతోషపడుతూ

'ఇవ్వాళ ఏరువాక పౌర్ణవమ్మ, అందుకని యివ్వి తెచ్చా' నన్నాడు తండ్రి.

'ఏరువాక పౌర్ణమేమిటినాన్న'

'వ్యవసాయం చేసుకునే వాళ్ళకి కొత్త సంవత్సరం మొదలు. పాత పాలేళ్ళంతా వెళ్ళిపోతారు'

'– నాన్న దాసుబావో?'

'– వాడిష్టం. ఉంటే ఉంటాడు. వెళ్ళిపోతే వెళ్ళుతాడు'

'నాన్న ఆ బావని వెళ్ళనియ్యబోక. చక్కగా పనిచేస్తాడు. చక్క చక్కని కథలు పాటలూ చెపుతాడు. నాకెన్ని పాటలు చెప్పాడు బా!'

'వాణ్ణి కనుక్కుందామమ్మా! నేనుండమనే అంటున్నాను'

'తరువాత ఏం చేయాలి నాన్నా?'

'తరువాత ఎడ్లని బళ్ళను నాగళ్ళు అన్నీ శుభ్రం చేసి కడిగి పసుపు కుంకుమతో బొట్లు పెట్టాలి. వాటిని అలంకరించాలి. సాయంత్రంపూట మేళంతో వాటిని వూరేగిస్తూ పాటలు పాడుకుంటూ వెళ్ళాలి'.

'బావ చెప్పిన పాటలు నే పాడతాగా! నాన్నా కొత్తల్లుడా పాటపాడనా? నాగలి పాటపాడనా'

'నీ యిష్టమమ్మా! నీకెన్ని పాటలొస్తే అన్నీ పాడు!'

'నాన్నా! బావపాట పాడనా? ఆ పాట పాడుతుంటే నాకెందుకో నవ్వొస్తుంది. బావ అక్కడ నుంచోకుండా పారిపోతాడు. ఆ పాటపాడనా?'

'– పాడు. తరువాత యీ మల్లెపూవులు అందరికీ పంచిపెట్టుతూ పొలంలోకి వెళ్ళాలి. అక్కడికి అందరూ వస్తారు. కొత్తవిత్తనాలు జల్లాలి. కొత్త పాలేళ్ళు కొత్తగిత్తలతో దున్నాలి. అక్కడికి పేరంటాళ్ళంతా వస్తారు. వాళ్ళందరికీ గంధం పూసి పూవులు కాయలు ధాన్యం పంచిపెట్టాలి'

'నాన్నా! నా చిన్నదూడల్ని కట్టి ఎట్టా దున్నుతుందో చూద్దాం. అప్పుడీ గంతులేమౌతాయో! మా బావచేత దున్నించాలి'

'అట్లాగేలే! ఉంటే దున్నించుతాలే!'

'నాన్నా బావని నే కనుక్కొస్తావుండు –'

రామయ్య యింటివెనుకనే ఒక తోట, ఆ తోటలో ఆవులకు విశ్రాంతి – ఒక ప్రక్క బావి – ఆ బావిపక్క సంపెంగ చెట్లు – ఆ చెట్టుక్రిందనే కూర్చున్నాడు దాసు – అతని చేతిలో కాసిని లేత చిగుళ్ళున్నాయి. ముఖంలో చిరునవ్వు కెరటాలు దొర్లుతున్నాయి. ఏదో ఆలోచిస్తున్నాడు. గౌరి పరుగెత్తుకొని వచ్చింది.

'చిగురుటాకులతోటి స్నేహమెందుకు బావ?'
సంపెంగపూలతో సరసమెందుకు బావ?
నడిబావిగట్టుపై నాట్యమెందుకు బావ?'

అని పాడి 'ఏం బావా! ఏమిటాలోచిస్తున్నావూ' అంది. దాసు ఆలోచనాసక్తుడైనట్లు కనుపించకుండా ముఖలక్షణాన్ని మార్చుకుని –

'ఎందుకు గౌరీ యిలా వచ్చావు?' అన్నాడు.

'ఎందుకా మా బావనెవరైనా ఎత్తుకుపోతారేమోనని'

'గౌరీ! నీకీపాట లెవరు నేర్పారు?'

'నేనే నేర్చుకున్నాను బావ! పోనీ నువ్వు చెప్పిన పాటపాడనా?'

'వద్దులే నేను వెళ్ళిపోవాలి. నీపాటలు వినడానికెవరికీ తీరికలేదు'

‘బావా నువ్వు యీ సంవత్సరం మా యింట్లో వుంటావా?’

‘మీనాన్న వుండమంటే వుంటాను. లేకపోతే మరొకచోట కాళ్ళు పిసుక్కుని బ్రతకాలి. ఎక్కడైనా అంతేగా?’

‘అదేమిటి బావా! అలా అంటావు? నువ్వు మా ఇంట్లో ఎవరికి కాళ్ళు పిసికావు. మా నాన్న వుండమన్నాడు’

‘అలా అయితే వుంటాలే! నీకీ కొత్తపరికిణాఎక్కడిది?’

‘మా నాన్న తెచ్చాడు. నీ కొత్తబట్టలేవి బావా?’

‘నాకెక్కడ నుంచి వస్తాయి. నాకడుపు నిండితే కొత్తబట్టలున్నంత భాగ్యం’

ఆ మాటలనేటప్పుడు దాసు కనుకొలకలోనుంచి కన్నీటి ధారసాగి వచ్చింది. అది చూచి గౌరి నీరయిపోయింది. ఎందుకనో కాసేపు మాట్లాడలేదిద్దరూ. తరువాత గౌరి హృదయం స్వాధీనం చేసుకుని,

‘బావా! మా నాన్నతో చెప్పి నీకు కూడా కొత్త బట్టలు పెట్టిస్తాలే! ఎందుకు బావా నీకింత భయం. పోనీ నా బట్టలు కూడా తీసివేస్తాలే! ఏం బావా?’

‘వద్దు గౌరి! నా కోసం నువ్వు తీసివేయడమెందుకు? అదిగో ఆ గిత్తదూడ ఎలా పరుగెత్తుతుందో? దాన్ని కట్టేసి వస్తా వుంటావా?’

‘నేను కట్టివస్తాలే! నువ్విక్కడ వుండు బావా’ అని వెళ్ళింది గౌరి.

దూడ చంగుచంగున గంతులేస్తూ చెట్లలోకి దూరి గౌరికందలేదు.

గౌరి ముఖాన చెమట పట్టింది. ‘బావోయి నాకీ దూడ అందటంలేదని’ కేకపెట్టింది. దాసు దానిని రెండు నిముషాల్లో పట్టుకు కట్టేశాడు. ‘ఏం బావా నీకింత త్వరగా చిక్కింది’ అంది గౌరి.

‘అదే మీకు మాకూ భేదం’ అన్నాడు దాసు.

‘ఇంత మాత్రానికేనా భేదం – బావోయి! యివ్వాళ బోలెడు పాటలు పాడాలి. నువ్వు కొత్తనాగలి దున్నాలట – నేను పాటలు పాడాలట – పళ్ళు పంచి పెట్టాలిట –”

‘ఎవరు చెప్పారు’

'మా నాన్న చెప్పాడు'

'ఏం పాటలు పాడుతావు'

'నువ్వు చెప్పిన పాటలన్నీ పాడుతా – ముందు నీ మీద పాట పాడుతా విను'

'చింతచెట్టు మీద
చికిలింత పిట్టా
ఎందుకే మా బావనెక్కిరించావు?

జువ్విచెట్టుమీద
గువ్వమ్మతల్లీ
ఎందుకే మా బావనెదిరించినావు?

పొన్నచెట్టుమీద
పోకిరీపిట్టా
ఎందుకే మా బావనెకసెక్కెమాడావు?

మా బావ పలుకులో మాధుర్యమున్నది
మా బావకళ్ళలో మాణిక్యమున్నాది
ఎందుకే మా బావనెక్కిరించావు?

సొగసు చూపులవాడు
షోకైనవాడు
ఎందుకే మా బావనెక్కిరించావు?'

'ఏం బావా బాగుందాపాట?'

'బాగానే వుందిగాని గౌరీ నీ మీదకూడా పాడవా?'

'చేతనయితే పాడుచూద్దాం ఏం పాడుతావోగాని?'

దాసు : ఆకాశమున పోవు
ఓ పాలపిట్టా
మా గౌరిదేవితో మాట్లాడిపోవే!

చిగురుటాకులలోన

చిలకమ్మ తల్లి
మా గౌరిదేవితో మాట్లాడిపోవే!

వాడికొమ్ములతీట
వదలనీదూడ
మా గౌరిదేవితో మాట్లాడిపోవే!'

'ఏమిటిబావా! ఎప్పుడూ కొంటిపాటలు పాడుతావు. ఇకచాల్లే నీ పాటలు, మా నాన్న పిలుస్తాడు. పోవాలమ్మా!'

**3**

సాయంత్రమయింది. అంతా పొలానికి జేరుకున్నారు. కొత్తగిత్తలిని సింగారించారు. కొత్తనాగలికి పసుపు పూశారు. పేరంటాళ్ళు, పెద్దలు, పిన్నలూ అంతా వచ్చారు. రామయ్య దేవుడికి కొబ్బరికాయలు కొట్టి నమస్కారం చేసి నాగలి రెండు కొండ్రలు నడిపారు. తరువాత దాసుచేతికిచ్చారు. ఆ గిత్తలు నాగలి భారం వహించలేక స్వేచ్ఛకోసం పెనుగులాడుతున్నాయి. వాటిని అరికట్టలేక దాసు చెదరిపోతున్నాడు. అతని బెదురుచూపులలో వెలుగు గౌరి కాటుక కంటి చీకటులు మెరిసినాయి. పేరంటాళ్ళందరికీ గంధం పూస్తూపూస్తూ దాసు వంక చూచింది. నవ్వింది. ఆ నవ్వులోనే అతని హృదయోద్రేకం సాక్షాత్కరించింది. ముత్తైదువులంతా పళ్ళు, ఫలహారం పుచ్చుకొని దీవన పాటలు మొదలు పెట్టారు.

'ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ
ఏళ్ళు నదులూ పొంగి
ఎడతెగక పండాలి
మా యిల్లు నిండాలి
మావళ్ళు పొంగాలి ॥ఏరువాక॥

కొత్తగిత్తల దుక్కి
కోటకొమ్ముల బాకు
కొత్తగిత్తల నడక
కోటిసేనలబారు

గౌరి : కొత్తబాల తీరు
కొంగముక్కుల బారు
కొత్త బావల నడక
గోదారిలో పడవ ।।ఏరువాక।।

ఏళ్ళు నదులు పొంగి
ఎడతెగక పండాలి'

అని పాడారు. రామయ్య అందరినీ పంపివేశాడు.

గౌరికూడా యింటికి వెళ్ళింది. దాసు శరీరమంతా చిరుచెమటలు క్రమ్మినాయి. అతని హృదయంలో ఆనంద నిధులు పొంగిపోతున్నాయి. నాగలి వూడదీశాడు. కొంతసేపు చెట్లనీడను కూర్చున్నారు దొరా పాలేళ్ళూనూ. రామయ్య వాళ్ళందరికీ మామిడిపళ్ళు పంచి పెట్టాడు. తిని కాలవలో నీళ్ళు త్రాగారు.

పైనున్న తాటి పిలక 'స్వేచ్ఛాజీవులకే గాని వేరొకళ్ళకి హాయి ఎక్కడిది?' అని తన లేతపత్రాల కవిలి విప్పి చదువుతోంది. నీరెండప్రాకింది. ఇళ్ళకు జారారందరు.

పొన్న కొమ్మలలోనుంచి తొంగిచూస్తున్నాడా చంద్రుడు. ఆ చెట్టుక్రింద ఆవుని విడుస్తున్నాడు దాసు. దూడని పట్టుకోటానికి వచ్చింది గౌరి. దాసు చూపులు శ్రమపడి నట్లు దీనంగా వున్నాయి. గౌరి కళ్ళు చిలిపి చూపులు చూస్తున్నాయి. ఆ పిల్ల నవ్వులో హెచ్చరిక వుంది. గౌరి దూడని లాగి ఆవుకి కట్టింది. దాసు పాలు పితుకుతున్నాడు. గౌరి వెళ్ళి పొన్నపూలు ఏరి తెచ్చింది. ఆ పూవులన్నీ ఒక తడపకు గుచ్చి వేసింది. ఆ దండ చేతిలో పుచ్చుకొని చంద్రుడి వంక చూస్తోంది. ఎందుకో ఆ పిల్ల నోటిలోనుంచి ఒక పలుకన్నా బయటకు పడలేదు. చూపులు మాత్రం చలించిపోతున్నాయి. ఆవుదూడ గౌరి పరికిణీ నములుతోంది. పాలు పితికే శబ్దంతప్ప వేరే శబ్దంలేదు. ఆ శబ్దమే గౌరి హృదయం గిలకరించింది. అంతలో గౌరి మారిపోయింది. దాసు పాలు పితికి వచ్చి 'గౌరీ దూడను విడు' అన్నాడు.

గౌరి పలుకదు. దూడ పాలకోసం గుంజుకుంటోంది. గౌరి చూపు చంద్రుడిమీద కాసేపు, దాసు మీద కాసేపు. దాసు పాలచెంబు అక్కడ పెట్టి దూడను విప్పాడు. చంగున పరుగెత్తింది దూడ. తన బిడ్డ కడుపు కట్టి తన భాగ్యమంతా అనుభవించిన గోపయ్యను

చూచి ఆయాస పడే గోమాత; బంధాల్లోనుంచి విడవడ్డ దూడను చూచి నాలికతో నాకి ఆనందాశ్రువులు రాల్చింది.

'గౌరీ! యీ పూవులెందుకు గుచ్చావు' అన్నాడు దాసు. గౌరి పలుకలేదు. చూపులలో మెరుపులు మెరిసినాయి. సిగ్గుదొంతరలు ఆపుకొని 'నీకోసమే బావ' అన్నది. ఆమె చేతులాదండను మెల్లగా అతని కంఠమలంకరింపజేసినాయి.

'పిచ్చిపిల్లా! నా మీద నీకెందుకింత ప్రేమ' అని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడే చెట్టుమీద నుంచి ఒక పిట్ట 'క్లిక్ క్లిక్' అని లేచిపోయింది. చంద్రుడు దొంగచూపులు చూస్తూనే వున్నాడు. వారిద్దరూ ఏ లోకంలోనో తిరిగి వస్తున్నారు. ఆ స్వర్గాధిపతి దాసు కాబోలు.

*(11-2-53, ఆంధ్రపత్రిక)*

**కథానేపథ్యం ...**

పరిశుభ్రమైన హాస్యాన్ని చిత్రించగల తెలుగు కథా రచయితలలో వీరు పేరు వెంటనే స్ఫురిస్తుంది. 'చక్రపాణి' అనే తెలుగు చలన చిత్రానికి కథ, మాటలు, పాటలు కూర్చిన చమత్కార హాస్య సంభాషణ రచయిత. 'ఏరువాక' అనే వీరి కథ అరవైడెబ్బై ఏళ్ళ కింద తెలుగునాడు గ్రామీణ వాతావరణాన్ని, జానపద సంస్కృతిని, వ్యవసాయ సంస్కృతిని, రైతు కుటుంబాల పడుచుపిల్లల ముగ్ధ మనోజ్ఞ ప్రణయోదంతాలను, పైరు పచ్చలను, పాడిపశువులను అందంగా చిత్రించిన కథ. తెలుగు కథా రచయితలలో రెండుతరాల ప్రాతినిధ్య రచయిత రావూరు వెంకట సత్యనారాయణరావు. ఆంధ్రప్రభ, కృష్ణాపత్రికలవంటి ఒకనాటి ప్రముఖ దిన, వార పత్రికలలో 'వడగళ్ళు' అనే పేరుతో శీర్షికగా చాలా రచనలు వీరివి తెలుగు పాఠకులను అలరించాయి.

# 36. షష్టిపూర్తి

*– గవని వెంకట కృష్ణారావు*

**ఈ** సంగతీ వింటే, సనాతను లేమంటారు? దేవుడు, దైవం అనేది లేకపోబట్టే జీవితం నిస్సారంగా నిరర్థకంగా కనిపిస్తుంది. అందువల్ల ప్రజలంతా ఆత్మహత్యలు చేసికొంటున్నారు. ఇది దుర్భరమంటూ, తీవ్రంగా మతప్రచారానికి పూనుకొంటారు.

సోషలిస్టులు ఏమంటారు?

ఈ రోగం అచ్చంగా కుళ్ళే బూర్జువా వర్గానిది. సోషలిస్టు విప్లవానికి ఇదే సమయమని చెలరేగుతారు.

ఈ రెండు శాఖలవారి ప్రచారాల వల్ల ప్రజల్లో సందిగ్ధావస్థ తప్ప జీవితంలో మార్పు ఏమీ రాదు. అలాంటప్పుడు నేను ఆత్మహత్య చేసుకోవడం వల్ల ప్రయోజనం? అయితే మానుకోవలసిందేనా? ఇలా మొట్టికాయలు తింటూ; సౌఖ్యం, సౌందర్యం, ఆనందం అనేవి యెలా వుంటాయో యెరుగకుండా, చివరికి ఒక్కసారన్నా పేపర్లోకి ఎక్కకుండా జీవించడమంటే … ఎలాంటి అవకాశాలూ లేకుండ వెధవ బ్రతుకు బ్రతకటం! పుణ్యాత్మురాలు కాబట్టి యిదంతా చూడకుండా ముసలిది దాటిపోయింది.

ఏమి చూచుకొని బ్రతకాలి? ఒకవేళ నేను చచ్చిపోయినా, సూర్యుడు తూర్పునే పొడుస్తాడు, పడమటనే అస్తమిస్తాడు. మా అల్లరి చిట్టికి నా మీసాలు లేకపోయినా నా కర్రా చెప్పులూ, ఆడుకోటానికి వుండనేవుంటవి. అప్పుడప్పుడు ఉప్పుప్పుగోను మోయటానికి పెద్దది ఉండనే ఉంది. కాకపోతే, కోడలికి మధ్యాన్నం చుట్టనిప్పుకోసం విసుగుకునే బాధ తప్పుతుంది.

నేను చస్తే తప్పేది చుట్టనిప్పు బాధేనన్నమాట! ఊ! మరచిపోయాను. అంత్యకర్మల కర్చో? అసలే సంసారం ఈదలేక అవస్థబడుతున్నాడు. నేను చచ్చానంటే, 'ఇప్పుడే చావాలీ? వాడికి ఏం పోయేరోగం వచ్చింది? హాయిగా తిని కూర్చోగూడదూ? కరువులో అధికమాసం' అని వాడు చెడామడా తిడతాడు.

పోనీ, యీ అవస్థ అంతాఎందుకు? సత్యాగ్రహం చేసి జైలుకు పోతేనో? పేరుకు పేరూ వస్తుంది, లోకం మీద ఉన్న కసికి కసీ తీరుతుంది. ఈ అవస్థా తప్పుతుంది. సత్యాగ్రహం బాగానే ఉంది. కాని రాయ్ చెప్పినట్టు దేశానికి ప్రయోజనకారి కాదేమో? సత్యాగ్రహ ఫలితంగా ఫాసిజం వస్తే? మరీ దుర్భరం.

ఆలోచించాడు. ఆరిపోయినదనుకొని చుట్ట ఆవలపారేసి ఉమ్మేశాడు.

తన హయాములో శేషయ్య అధికారం నిరాటంకంగా సాగించుకొన్నాడు. ఇంట్లో వాళ్ళంతా పసిపిల్లలతో సహా, తాను కూర్చోమంటే కూర్చునేవాళ్ళు, నిల్చోమంటే నిల్చునేవాళ్ళు. ఒంటేలుకూడా పోసుకునేవాళ్ళు. చేసే పాకం దగ్గరనుంచి సర్వం అతని యిష్టప్రకారమే జరిగేది. తన భార్యా, కొడుకూ రెండు వలస రాజ్యాలుగాను, తానొక సామ్రాజ్యంగాను ఉండేవాడు. కాని పరిస్థితులు పదేళ్ళక్రితం నుంచి మారాయి. ఒక్కడే కొడుకు. పెండ్లైన ఆరేళ్ళకు కోడలు కాపురానికివచ్చింది. అప్పటినుంచి అతని అధికారం పడిపోయింది. ఇది ఎంతమాత్రం గిట్టలేదు. కొడుకునుంచి వేరుపడదామనుకొన్నాడు. లేకలేక ఒక్కడు! వాడితో విభాగాలు పడితే లోకమేమనుకుంటుంది? కడుపుమండి శేషయ్య హిందూ సంఘాన్ని తిట్టిపోశాడు. పాశ్చాత్య సంఘాన్ని పొగడాడు. అందుకనే హిందూదేశాన్ని ఏలుతూ వున్నదన్నాడు.

అసలు ఇంకో రహస్యముంది. కాస్తో కూస్తో ఆ రోజుల్లో ఇంగ్లీషు చదువుకొన్న శేషయ్య లోకాన్ని ఎదిరించైనా కొడుకుతో విభాగాలయ్యేవాడే. వేరుపడటానికి పిత్రార్జితం మిగిలింది ఏమీ లేదు. కాకపోతే ఒక కడవ, చేంతాడు పంచుకోవలసిందే. ఈ ముసలితనంలో సంపాదించే శక్తి ఏమీలేదు. ఇదివరకున్న పిత్రార్జితం, తన సంపాదనా కొడుకు విద్యకోసం, ఉద్యోగం కోసం ఖర్చు పెట్టాడు. అదంతా అతని ఆత్మ సంతృప్తి కోసమననుకోండి.

రోజురోజుకీ ఇంట్లో, అంటే అతని కొడుకింట్లో, జీవితం దుర్భరమనిపిస్తోంది. పూర్వంలాగ అతని ఆజ్ఞ చెల్లకపోతే చెల్లకపోయింది. అతని సలహాలు కూడా ఎవ్వరికీ అక్కరలేకుండా ఉన్నాయి. ముసలిది ఉన్నంతకాలం, అతన్ని అడిగి కూరలు చెయ్యకపోయినా, వేళకు అన్నం పెట్టేది. అలిగితే సాగదీసేది. ఇప్పుడేముంది? ఆకలి లేదని పడుకుంటే మళ్ళా అడిగేవారన్నా లేరు. సాగదీసేవాళ్ళు ఉంటేగా అలగటానికి?

వార్ధక్యంతో ఒకవేళ తనకు చిరాకు ఎక్కువై జీవితం అలా కనిపిస్తున్నదేమోనని శేషయ్య ఒకసారి ఆలోచించాడు. నిజంగా తను కొడుకుకి తాను ఇంకా చాలాకాలం

బ్రతకాలని కోరుకుంటున్నాడేమో? అయినే తేల్చుకుందామని ఒక రోజున కొడుకు పంక్తిని భోజనం చేస్తూవున్నప్పుడు, "పెద్దవాళ్ళంతా రాలిపోతున్నారు. నావంతు కూడా వచ్చేటట్లుంది" అన్నాడు. కొడుకుగాని, కోడలుగాని "అయ్యో అయ్యో! అలా అంటా రేమిటి? మీమీద గంపెడంత ఆశపెట్టుకున్నాము" అని మాటవరసకన్నా అనలేదు. అనకపోతే అనకపోయారు, నవ్వనన్నా నవ్వలేదు. కాబట్టి తేలిపోయింది. తాను బ్రతికినా ఊడినా ఒకటే.

ఎవరికి కొరగాని యీ బ్రతుకు బ్రతకకపోతే నేమీ? అతని గుండె గొంతుకలో కొట్లాడింది. నాలుగు పద్యాలు వ్రాయాలనిపించింది. కాయితాలకోసం తడవుల్లాడాడు. కొడుకు బల్లమీద, ఒక ప్రక్కన తెల్లకాగితాల పొత్తి కనిపించింది. శేషయ్యకంటు కోటానికి బుద్ధిపుట్టలా. కొడుకు సంపాదించుకున్న కాగితాలను ముట్టుకోవటానికి తనకేమి అధికారముంది? కాగితం తియ్యబోయిన చెయ్యి లాక్కొని, వేస్టు పేపరుబుట్ట వెదికాడు. అన్నీ ముక్కలుగా చింపిన కాగితాలే. ఎంతమంచి కాగితాలు! తనకొక్క ముక్క దొరకరాదు? వెతగ్గా వెత్గా ఒక తెల్లనిఉండ కనిపించింది. దాన్ని విప్పి సాఫీ చేశాడు. శ్రమకు దగ్గర ఫలితం దక్కింది. అరటావు, ఒక ప్రక్కనే వ్రాసి వుంది.

పరమానందంతో దాన్ని పట్టుకెళ్ళి కవితా సమాధిలో పడ్డాడు. జిలుగక్షరాల్లో ఏదో వ్రాస్తూ, మధ్య మధ్య చుట్టపీకుతూ ఆలోచిస్తూ కూర్చున్నాడు. చిన్న మనుమరాలు వచ్చి వెనకనుంచుని, 'నీ జుత్తు తెల్లగా బాగావుంది. ఎందుకు దువ్వుకోవు? నేను దువ్వేదీ? బాగుంటావు. వెనకోజడ, ముందోజడ వేస్తాను. ఆ!?" అంది. ఆలోచనలో ఉన్న శేషయ్య తల ఊపాడు. ఆ పిల్ల పరుగెత్తికెళ్ళి, అమ్మను ఏడిపించి, దువ్వెన తెచ్చి, దువ్వి, తాతకు తనకు మల్లేనే ముందోజడ, వెనకోజడ వేసింది. అతడు కవిత్వ ధోరణిలో వున్నాడు. అమ్మాయి తాత తల అటూ ఇటూ తిప్పి చూచి, "భలే, భలే! ఎంత చక్కనాగ్గావుంది!" అంటూ గంతులేయ మొదలెట్టింది. "ఫో! అల్లరిపిల్లా" అని కవితాసమాధిలోవున్న శేషయ్య మనుమరాల్ని కసిరాడు. ఆ అమ్మాయి అక్కడినుంచి గెంతింది. చరణంలో యతికోసం ఆలోచించే శేషయ్య తలగోకాడు. చేతికేదో తగిలింది. తడివి చూచుకొని, "ఓసి నీ సిగగొయ్యా, ఎప్పుడేశావే జడ? ఒకటికాదే, రెండు" అంటూ విప్పుకుని మళ్ళీ రాతలో పడ్డాడు. పెన్సిలు శరపరంపరగా పోతూ వుంది. పొడుం పీల్చాలనిపించి బొడ్లో చూచుకున్నాడు. కనిపించలా, ప్రక్కన పెట్టానేమోనని వెతికాడు. కనపడలా "ఆ కొంటెకోణంగే తీసివుంటుంది. అందుకే నవ్వింది" అని

తేల్చుకుని వంటయింట్లోకి వెళ్ళి, తల్లి ప్రక్కన ఉన్న చిన్న మనుమరాల్ని, "ఏదో నా పొడుంకాయ!" అని అడిగాడు. "నాకేం తెలుసు?" అంది పిల్ల.

"అదే నవ్వుతున్నావులే, ఇలాతే". "నిజంగా నేను తియ్యలేదు తాతయ్యా! దాని సంగతి నాకేం తెలుసు" అంది. తల్లి ఎందుకో చిఱ్ఱుబుఱ్ఱాడుతూ పిల్లను వీపుమీద నాలుగు చరిచింది.

శేషయ్య హృదయం చివుక్కుమంది. గిరుక్కున మళ్ళి హాల్లోకి సోఫాలో కూలబడ్డాడు. ఇదంతా ఏమిటి, తన మీద కోపం కాకపోతే? తాను ఎందుకు బ్రతకాలి? తన యింట్లో తాను సంపాదించి తింటూ వుంటే కోడలు యిలా ప్రవర్తించగలుగు తుందా? ఇలా అవమానం పొందేకంటే చావటం మేలు. ఆరు నూరయ్యేది తప్పక చచ్చిపోవలసిందే.

ఆ రాత్రి మామూలుకంటె శేషయ్య పెందలాడె భోజనం చేశాడు. తన సామానంతా సద్దాడు. అంతా నిద్రపోయిం తరువాత ఉరిపెట్టుకోడానికి చేంతాడు, ముక్కాలిపీట తెచ్చాడు. ఎందుకో ఆ సమయానికి కొడుకు గుర్తుకు వచ్చాడు. ఉరి పెట్టుక చచ్చిపోతే కొడుకు గొంతుక్కు వస్తుందని స్పృహకు వచ్చింది. అయితే యేమి చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు. చివరికి ఎలాగైతేనేం, ఉత్తరం వ్రాసి పెట్టి చచ్చిపోదామనుకున్నాడు.

కాని చిన్న మనుమరాలు జ్ఞప్తికి వచ్చింది. దాని మూలాన్నే తాను చనిపోయానని దాని ఒళ్ళు ఊనం చేస్తారు కామాలే? అసలు తాతయ్య కనిపించకుండా క్షణంసేపు బ్రతుకుతుందీ? ఇక మీద ఎవరితో ఆడుకుంటుంది? ఎవరితో మారాం చేస్తుంది? బెంగతో మంచం పడుతుంది.

అలా నవ్వుతూ ప్రేలుతూ వుండే ముఖం వాడిపోయి వ్రాలిపోతే ... శేషయ్యకు ఇది దుర్భరమైపోయింది. కోడలిమీద కోపం కొందికీ చచ్చిపోవాలనిపించినా, పసిదాని కోసం బ్రతకక తప్పదు. మళ్ళీ ఎక్కడ తాడక్కడ, ఎక్కడ పీటక్కడ చప్పుడు లేకుండా పెట్టి నిద్రపోయాడు.

ఒకరోజు సాయంత్రం "తాతోయ్! అక్కయ్య పెళ్ళి" అన్నది చిన్నపిల్ల.

"ఎవరన్నారు?"

"అమ్మే చెప్పింది"

"పెద్దనాపసానివి బయల్దేరావని నీ చెవిలో ఊదిందిలే"

"కాకపోతే నాలుగు సిల్కుగౌన్లు ఎందుకు కుట్టిస్తుందమ్మా మరి" అని తాతయ్య మెడ కావులించుకొంది.

"అక్కయ్యకంటె నువ్వే ముందు పెళ్ళికూతురువయ్యేట్టున్నావే"

"ఏమమ్మా!"

"సరే నీకు నాల్గుగౌన్లు, నాకో మరి!"

"వెండిపొడుంకాయ"

ఆలోచనలో పడ్డ శేషయ్య వినిపంచుకోలేదు. రెండు నిమిషాలు గడిచిం తరువాత "పెళ్ళి ఎన్ని రోజులుందట?"

"పది రోజులు, అరిసెలు వండుతున్నారు. నేనొకటి తెచ్చుకుంటా; నీకు పెట్టనులే" అంటూ పరుగెత్తుకెళ్ళింది.

"మాటమాత్రం నాతో అనగూడదూ! పరాయివాడ నయిపోయాను. ఎలాంటి సంబంధమో, ఏమిటో; నా యిష్టప్రకారం కాకపోతేమానె, ఊరికే మాటవరసకన్నా అనగూడదా? అయినా నేనెవర్ని? పెట్టేవాణ్ణా, పోషించేవాణ్ణా? నాతో ఎందుకు చెప్పాలి? పిల్లకు తెలిసినంతమాత్రం నేను తెలుసుకోవటానికి నోచుకోలేదు.

ఛీ, వెధవ బ్రతుకు! ఇలా అందరికీ పరాయివాణ్ణయి బ్రతకకపోతే, ఏ దేవుడేడ్చాడు? నేను మోయరాని బరువైపోయాను. ఇలాంటి అవమానం సహించేకన్నా ముక్కు మూసుకుంటే మూడు గడియలు పట్టదు.

ఆ రాత్రి అందర్నీ పండుకోనిచ్చి, శేషయ్య బయలుదేరాడు. తప్పకుండా చచ్చిపోవాలనే దృఢనిశ్చయంతో కఱ్ఱమాత్రం వెంట తెచ్చుకున్నాడు లేకపోతే దారిలోనే పడిపోడూ?

నడుస్తూ ఆలోచనలో పడ్డాడు.

చచ్చిపోవలసిందే. ఇంకా ఎందుకు బ్రతకాలి; సాధించేదేముందు పురుషార్థాలు నాలుగూ చెల్లాయి. ఇప్పుడే చచ్చిపోతే పిల్లదాని పెళ్ళి ఆగిపోతుందేమో! నాయెదానబడి ఏడుస్తుందే! కొడుకు "చచ్చే వెధవ ఈ పదిహేనురోజులూ గడిచిం తరువాత ఛస్తే ఏమిపోయింది?" అంటాడు కామాలె!

నడక కొంచెం మందగించింది దీర్ఘాలోచనలో పడ్డాడు.

ప్రతితడవా ఇలాగే పోతున్నది. ఈ లగ్నం కాకపోతే ఇంకోలగ్నం పెట్టుకుంటారు. పెళ్ళి ఆగుతుందాఏమిటి?... ఊరంతకూ ఈ మంచినీళ్ళ బావి

ఒక్కటేనే. ఇందులో పడిచస్తే మంచినీళ్ళు పనికిరాక తిడతారు. చస్తూచస్తూ వీళ్ళందరి చేత తిట్టించుకోవడం ఏమీ బాగాలేదు. నేను చస్తే ఉపకారం లేకపోగా ఊరంతకూ అపకారం జరుగుతూంది.

శేషయ్య నిలబడిపోయాడు.

మరచాను. నేను వ్రాస్తూవున్న 'ముదిజోదు''అనే కావ్యం ఏంకావాలి? పూర్తికాకుండా లోకానికివ్వకుండా చావటం బాగుంటుందీ? తప్పక ముగించి, అచ్చు వేయించాలిసిందే! ఈ కావ్యంతోనన్నా, నాకు లోకం షష్టిపూర్తి చెయ్యవచ్చును. నేనేం చేశానని షష్టిపూర్తి? కనీసం ఏమీ చెయ్యలేదైనైనా షష్టిపూర్తి జరపవచ్చును. ఈలోగా పిల్లదాని పెళ్ళి వగైరాలు జరిగిపోతాయి. తరువాత తీరిగ్గా చావొచ్చును.

శేషయ్య ఇంటివేపు మళ్ళాడు. అవును, ఒకటికాదు, రెండుకాదు, పిడుగుల్లాంటి నాలుగు కారణాలుంటే శేషయ్య ఎలా ఆత్మహత్య చేసికొంటాడు?

*(మార్చి, 1942, చైత్రరథం)*

## కథా నేపథ్యం ...

20వ శతాబ్ది తెలుగు సాహిత్యంలో మేధావి రచయితగా ప్రసిద్ధులైనవారిని వేళ్ళమీద లెక్కించవలసివస్తే అందులో ప్రముఖుడు గవని వెంకట కృష్ణారావు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, పురాభారతీయ తత్త్వజ్ఞుడు. బౌద్ధమత దార్శనికుడు. తెనాలి కళాశాలలో కొంతకాలం పనిచేసి తరువాత విజయవాడ ఆకాశవాణికేంద్రంలో ప్రయోక్తగా పనిచేశారు. ప్రపంచ ప్రసిద్ధ అగ్రేసరుడైన ప్లేటో రాజనీతి శాస్త్రాన్ని జేగంటలు పేరున తెలుగులో అనువదించిన ప్రతిభావంతుడు. బౌద్ధ దర్శనమైన మాధ్యమిక వాదాన్ని, విగ్రహవ్యావర్తినిని తెలుగు చేశారు. ఈయన నవలలో 'కీలుబొమ్మలు' చాలా ప్రాముఖ్యం పొందింది. 'పాపికొండలు' అనే నవల అసంపూర్ణం.

భారతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రభావితం చేసిన రాజకీయార్థిక మతనైతిక సాహిత్య ఉద్యమాలను మేధావిగా ఆకళించుకున్న మేధోనైశిత్యం ఈ రచయితది. షష్టిపూర్తి అనే వీరి ఈ కథ వ్యంగ్య పరిహాసంతో జీవనాడంబరాన్ని వ్యాఖ్యానిస్తుంది.

# 37. అంతఃపురోపన్యాసము

- పానుగంటి లక్ష్మీనరసింహారావు

**నా**థా! నల్లమందు పట్టిచ్చినదాయేమి? మాహుషారీగావుంది. సంజ కునుకు కాసినారు. మీకేఁ యిఁకనెంతసేపయిన మేలుకొంటారు. అబ్బా! నాకు నిద్దుర వచ్చు చున్నదమ్మా.

అప్పుడేనా! అంటున్నారా? పోనీ కొంచెము సేపు మేలుకొంటాను లెండి ఇదుగో! మీతల యీమాటు మా బాగుంది సుమండి. ఇది విశాఖపట్టణపు పంపిణీయా నేనుంచు కొమ్మన్నానని చెప్పేరుగిప్పేరు సుమీ మీవారితో నెవరితోనైనా, వాళ్ళంతా నా ప్రాణానికి పడియేడుస్తారు.

నా ప్రాణానికి పడి యేడవడంయెందుకా? వాళ్ళదిపడిపోయింది, మనము సుఖముగా కాపురం చేస్తూవుంటే చూచి యోర్వలేక అంతకంటె యేముంది? నేను మిమ్ములను జేబులో వేసుకొన్నానట, వేసుకొంటె వీళ్ళదేమిపడిపోయిందో వాళ్ళకేమి మీరు పెట్టడం మానితిరా పొయ్యడం మానితిరా? మీరు మీరు వక్కటే కాదు! నేనే పయినుంచి కొట్టుకొని వచ్చినాను.

దానికేమిగాని యిలాచూడండి. మీమీసాలకు నిజముగా నల్లరంగు వేసినారా యేమి? మొన్న తమాషాకు అన్నాను. యిది కూడా ఒక మోస్తరుగా బాగానే వుంది. కాని మొగము ముడతలు యెల్లాపోతాయి. మీ దేహమును మీరు బాగుచేసుకోలేనివారు ఇతరులనేమి సంతోషపెడతారు?

ఎందుకా జరగడం కొంచెము దూరముగా కూర్చోండి. దగ్గరకు రాకండి. ఏదోకాని కంపుకొడుతోంది.

అత్తరవు రాసుకున్నానే అంటున్నారా? (నెమ్మదిగా) ఆ అత్తరవు రాసుకున్నా అంతే. మొత్తుకున్నా అంతే ముసలికంపేమవుతుంది? ముండాకంపు దాని పరపతి కూడా పోతుంది దానికేమి లెండి. రేపు నన్ను కూడా బండిలో నెక్కించుకొని సముద్రపు ఒడ్డునకు షికారు తీసుకొని వెళ్ళాలి. పదిమంది మొగము నేను మాత్రము చూడ కూడదాయేమిటి? నేనేమి పాపము చేసుకున్నాను?

నలుగురు నవ్వుతారే అంటారా? నవ్వెందుకు మన దాంపత్యము చూచియా? పసిపిల్లలను పెళ్ళాడిన ముసలివాళ్ళు లోకములో, ఇకనెవ్వరూ లేనేలేరా యేమిటి? అందులో మీరొకరు. నాకులేనిసౌఖ్యము లేనేలేదు. యీలాగైనా సౌఖ్యపెట్టండి. వాళ్ళు నవ్వుతారని మనకభిజాత్యమెందుకు? మనము చేసినపని మాబాగా వుందా యేమిటి?

కొర్నాడచీర తెచ్చి పెట్టిలో పెట్టుకున్నారేమి? నేను గట్టుకొనిపోతాననా? ఎవ్వరి కోసమది. నాకోసమేనా?

రాత్రిళ్ళు కట్టుకోమంటున్నారా? రాత్రిళ్ళు కట్టుకుంటేయేమి. పగలు కట్టుకుంటే యేమి? నీతియుండవలెనుకాని. విధంచెడితిరిగేవాళ్ళను మీరు పట్టుకుంటారా యేమిటి? ఇది మిమ్ములను పట్టుకున్న పాపమే కాదు. ఈ రెండో పెళ్ళి వాళ్ళందరికయితే సాజ సాయింత్రమూ పెళ్ళాన్ని కనిపెట్టుకొని కూచోవడమే అంట. మీమాట కాదు సుమండి. మిమ్ములను అన్నాననుకుంటారేమో! మాట వరసకు చెప్పినాను.

కుట్టుదానవు నీకేమి లోపము వచ్చిపోతుందో అని కూడా కూడా తిరుగుచున్నానే అంటున్నారా? నేనుమాత్రము ఎరగను? ఎంత ఎత్తే! మావారు చాంతాడు కోసం వెదుకుచున్నారన్నదట. అలాగున నేనెరుగను.

ఓయ్‌నిద్దరా ఏమిటి? ఇదుగో! చూడండి వినపడుతోందా?అదుగో వాకట్లో యెవరో పిల్చుచున్నారు పాపము! ఎవరో పిలుస్తున్నారంటే మెలుకువవచ్చింది. నేనే అంత పాపము చేసుకున్నాను.

నామాటలన్నా, నామొగం చూచినా అల్లానిద్దరవస్తుందికాబోలు. నామొగం మీద ఏమి దెయ్యం వుందా! పగలస్తమానము గణించుచున్నారు చాలదు. రాత్రిళ్ళు కూడా అదే ఆలోచనా వల్లకాటి ఆలోచన. ఈ వున్నదంతా ఎవరుతిననూ?

కట్టుకాసులపేరు తయారయినదా? తయారయితేనేమి? నామొగాన వేసి కొట్టుకోనాయేమిటి? ఇవివరలో చేయించిన నగలొకటి మనసుదీర పెట్టుకోనిచ్చినారు కనకనా? ఇది పెట్టుకోనియ్యడానికి. అరిగిపోతాయి కాబోలు పోనీ మీరే కూడా పట్టుకొని వెదుదురుగాని లెండి.

నేను బ్రతికిపోయినానని యేడుస్తున్నావా అంటారా? ఎందుకు? ఈ అవకరపు మాటలు. మిమ్ముల నెవరన్నారు? నన్ను నేనే అనుకుంటాను. అదికూడా యెందుకు? ఈ పసుపుబొట్టు వుండిపోయిందునా యేమిటి?

వెధవపెళ్ళి చేసుకుందుగాని అంటున్నారా? వెధవపెళ్ళి యెవరిక్కావాలి? ఆ పెళ్ళి యెవళ్ళయినా ఒళ్ళు కరచుకొని తిరిగేవాళ్ళు చేసుకుంటే చేసుకోనియ్యండి. మీచేత మీ వాళ్ళచేత పడిపడి నా వంట్లో రక్తమాంసాలు అన్ని హరించినాయి ఇంక నావంట్లో యేముంది? నాయెముకలు ఈలాటి పెళ్ళిళ్ళు మీరు చేసుకోగాలేంది ఒళ్ళు పట్టలేనివాళ్ళెవళ్ళయినా వుంటే వాళ్ళుమాత్రం చేసుకుంటే తప్పు వచ్చిందా యేమిటి?

అబ్బా! రెక్కలు నొప్పులుగానున్నవి. రెక్కలెందుకు నొప్పులుగానున్నవా? ఆ వంట బ్రాహ్మడు ముండాకొడుకు యిట్టెయిట్టె పోతూ వుంటాడు. ఈ వేళ యెక్కడికో పోయినాడు. అందుచేత సాయింత్రము దాకా రెక్కలు పడేటట్టుగా నీళ్ళు తోడడం తోనే సరిపోయింది.

పాపము పడుదునా అంటున్నారా! చాలు!చాలు! రక్తమాంసాలు లేని మీ యెముకలు నామీదవేసి మరింత నొప్పి కలుగచేస్తారా ఏమిటి? అబ్బా! యివెక్కడి కొయ్య చేతులో? యిల్లా రానియ్యకండి.

అయ్యో! ఇదేమి! మీచెయ్యి తగిలేనా నా ముత్యాలపట్టెడ తెగిపోయింది? చూడండి! యీ పక్కలో కొన్ని ముత్యాలు పడిపోయినట్లున్నాయి! పాపము మీకు కనబడదు కాబోలు!

సులోచనాలు తెచ్చుకుంటానే అంటున్నారా! సులోచనాలు జోడు మీరు కూడా పడచుతనంలో కన్నులు లేనివాళ్ళు పెట్టుకుంటారే అల్లాంటిది తెప్పించుకోండి. అబ్బే! ఇదేమి సులోచనాలజోడు. ముసలితనం అంతా దీనిమొగాన్నే వుంది. ఇదేమిబాగున్నది కాదు. ఇది బద్దలు కొట్టి వేస్తేనే కాని మీరు మంచిది తెప్పించుకోరు మీరు ఏమి చేసినా సరే! యిదుగో! బద్దలు కొట్టుచున్నాను (అని బద్దలు కొట్టుచున్నది).

ఎందుకు గ్రుడ్లెఱ్ఱచేస్తున్నారు! కొట్టెదరా యేమిటి? కొట్టండి. ఏ పాపము ఎఱుగని నావంటి దాన్ని పట్టుకొని కొడితే పైన పాలించేవాడు లేడు?

నిన్ను కొట్టి బ్రతుకడముకూడానా అంటున్నారా? పాపము! కొట్టక ముద్దు బెట్టుకుంటున్నారు! మొన్నరాత్రి మంచినీళ్ళచెంబు కొంచెముయిల్లా పెట్టమన్నందుకే కాదు మల్లెపువ్వుల బంతి పుచ్చుకొని వీపు బద్దలుకొట్టినారు. ఆనొప్పి యింకను పోలేదు.

దిక్కుమాలినగుఱ్ఱు అప్పుడే గుర్రువచ్చిపడ్డది? చూడు! ఆ మొగము ఏలాగున్నదో ప్రేతకళపడి. లేవండి! ఏమా నిద్దర. మాట్లాడుచూ మాట్లాడుచూ నిద్రపోతారేమిటి?

నేనెంత స్వచ్ఛముగానున్నను నా బ్రతుకంతా అడుగడుగుకు అనుమానం బ్రతుకే అయిపోయింది. నా గ్రహచారము ఇల్లా యెన్నాళ్ళు వుందో అన్నాళ్ళు నా తల్లిదండ్రుల

ప్రాణాలకు వుసూరుమంటూ యేడుస్తూ వుంటాను. కాలం యిలా ఒడ్డు విరుగుకొని వచ్చింది. పాపము పుణ్యము పాలించడమునకు భగవంతుఁడు లేడు. ఉంటే యీ కన్నులు తెరవని పసికూనలను ముసలివాళ్లకు కట్టిపెట్టే వాళ్ళందరి కడుపులు కాల్చి వెయ్యడు.

ఇదేమిటి? గుఋ్ఱుతో యిల్లెగిరిపోతూ వున్నది. ఇంక నాకేమి నిద్ర. నాకేమి సౌఖ్యము.

సైగ చేయుదమన్నను సగము గ్రుడ్డి; చేరి మాటాడుదమన్న చెవిటిగోడ ముద్దు బెట్టుదుమన్నను ముసలికంపు; ఇట్టి మగనితో జవ్వనికేటి సుఖము.

*(సువర్ణలేఖ, మార్చి 1905, సంపుటి 1, సంచిక 1)*

## కథానేపథ్యం ...

తెలుగువారి షేక్స్పియర్‌గా పేరుతెచ్చుకున్న పానుగంటి లక్ష్మీనరసింహారావు రచన ఇది. పిఠాపురం మహారాజా ఆస్థానంలో సుప్రసిద్ధ హాస్య, కరుణ, భక్తి, తత్త్వజ్ఞాన, చారిత్రకేతివృత్త నాటక రచయితగా ఇరవైయ్యో శతాబ్ది తెలుగు సృజన రచనలను ఎంతో ప్రభావితం చేసిన రచయిత. 'సాక్షి' రచన ద్వారా తెలుగునాట గొప్ప ప్రసిద్ధినార్జించిన వాడు. వీరు మొత్తం పౌరాణిక, సాంఘిక, చారిత్రకేతివృత్తాలలో 36 నాటకాలు రచించినట్లు ప్రసిద్ధికెక్కారు.

ఈ నాటకాలలో రాధాకృష్ణ, కంఠాభరణం, పాదుకాపట్టాభిషేకం, నర్మదా పురుకుత్సీయం మొదలైన తెలుగు నాటకరంగస్థలంపై గొప్ప ఆకర్షకమైనాయి. పానుగంటివారు రచించిన కథలలో 'కానుగుచెట్టు' చాలా ప్రసిద్ధం. తెలుగు వచన రచనకు ఆధునిక కాలాన జవసత్త్వాలు చేకూర్చిన, వివాద రచనలలో అత్యంత ప్రసిద్ధుడైన రచయితలలో ముందు చెప్పవలసినవారు పానుగంటి లక్ష్మీనరసింహారావు. ఈ కథ అంతఃపురోపన్యాసం – ఒకనాటి తెలుగునాట సంప్రదాయ అగ్రవర్ణాల దురన్యాయాన్ని కరుణార్ద్రంగా, వ్యంగ్య హాస్య విలసితంగ ఇతివృత్తీకరించిన భాణప్రక్రియ. ఏకపాత్ర సంభాషణాత్మకం, వృద్ధభర్త నల్లమందు సేవించి నిద్రలో తూగుతుంటే అభంశుభం తెలియని పడుచు ముద్దరాలు తన అక్కసును దెప్పిపొడుపుగా వ్యక్తీకరిస్తున్న సంబోధన సంభాషణాత్మకం ఈ ఏకపాత్రాభివ్యక్తి.

# 38. పశ్చాత్తాపము

- *గుమ్మిడిదల దుర్గాబాయి*

"నేను మిక్కిలి చిరుతప్రాయముననే యత్తవారింట నడుగిడితిని. అజ్ఞానమింకను నన్ను పూర్తిగా వీడలేదు. ఇతరులతో మాటలాడు టెట్టులో గూడా నాకు తెలిసెడిదికాదు. తలయెత్తి యొరులను చూడజాలకుండెడి దాననిక భాషించుటెట్లు! స్త్రీల యొద్దకు వెళ్ళునప్పుడు కూడా సిగ్గునందెడిదానను. నేను కొలదిగ తెలుగు మాత్రము చదివితిని. ఉపన్యాసములు, నవలలు మొదలగువాని యందణుమాత్రము నిష్టముండెడిది కాదు. తీఱిక యున్నపుడెల్ల రామాయణము చదివెడిదానను. రామాయణము మనుజకృతమని యెంచెడిదానను కాను. ఏ దేవతయో దాని రచియించి యుండనోపునని నా నమ్మకము. పవలంతయు నేనింటియందేదేని యొకపని చేయుచునే యుండుదానను. పనిలేనప్పుడు రాట్నము మీద నూలు వడకెడిదానను. అత్తమామల యెడ మిక్కిలి భయభక్తి విశ్వాసములతో మెలగెడుదాన. ఒకనాడు మామగారు కూరలో నుప్పు కొంచెము తక్కువగా నుండవలెననిరి. ఆ మాట వినుట తోడనే నా హృదయము కంపించె. మిన్ను విరిగి మీదబడినట్లాయె. ఇంతకన్న నెక్కుడు వేదన నిక నేభరింపజాలనని భావించితిని.

ఈ నా యజ్ఞానము నా భర్త కిష్టముండెడిది కాదు. వారు న్యాయవాదవృత్తికి గడంగి యెన్నో దినములు కాలేదు. వారు గొప్పగొప్ప చదువులు చదివి యెన్నియో బిరుదము లందినారు. నన్ను వారు మిక్కిలి ప్రేమించెడివారు. కానీ వారి ప్రేమయందు విశేష భాగము జాలి. స్త్రీ విద్యాభ్యుదయము వారికి మిక్కిలి మక్కువ. వారి మనోనుకూలముగ నే మెలగజాలకుండుట చూచివారు విచారమానసులై యుండువారు. అది నా యపరాథము కాదనియు, హైందవజాతి యాచార వ్యవహార ప్రభావమే ననియు నెంచువారు. వారికి నాతో ప్రేమాలాపములు సల్పుటలో నిసుమంతేని యానంద ముండెడిది కాదు. రాత్రి నిద్రింపబోవునప్పు డేఇంగ్లీషు నవలనో వెంట గొనివచ్చి నిదురించు వరకు దాని జదువుచుండువారు. ఎప్పుడేని నేను "ఏమి చదువుచున్నారు?" అని ప్రశ్నింప కరుణరసమొల్క నన్ను దిలకించి "యిది 'అస్కర్ వయిల్డ్' అను నాంగ్ల

గ్రంథకారుని సర్వోత్కృష్టమగు నవల" యని మాత్రము చెప్పెడివారు. ఆ మాటలు వినినంత నా యయోగ్యతను నిందించుకొనుచు "విద్యాప్రవీణుడగు నిట్టి పురుషవతంసు నకు దగుయోగ్యత నాకడ లేదాయెనే" యని విచారించెడిదానను. ఏ మూర్ఖునికో పత్నిగ నుండవలసిన దానననని తలపోయుచుండుదాన. నా భర్త నన్ను దయార్ద్రదృష్టి గనుచుండువారు. అయ్యదియే నా సౌభాగ్యము.

అది సంధ్యాసమయము. ఇంటి ముంగలి వసారయందు కూర్చుని నేను రామాయణము జదువుచుంటిని. రాముని రాజ్యమునకు మరలిరమ్మని కోరుటకు భరతుడు వెడలెనని యా కథా సందర్భమున జదివితిని. భరతుని కరుణాలాపములు, దీనభాషణములు భ్రాతృవాత్సల్యము నా మనసును కరగించి వైచినవి. నేత్రముల నుండి యశ్రుధారలు స్రవించుచుండెను. ఇంతలో నా భర్త గదిలో నడుగిడెను. వెంటనే నేను పుస్తకము మూసి వైచితిని. వారి ముందర నా యీ యజ్ఞానము ప్రకటనము కాకుండునట్లు ప్రయత్నింప సాగితిని. వారు నా చేతనున్న పుస్తకమును గాంచి "రామాయణమా?" యని ప్రశ్నించిరి.

అపరాధినివలె జూచుచు నేను. "పుస్తకము మంచిది; అందులో సందేహము లేదు. సద్భావములు కొల్లలుగ నుండును. అయిన నేమి? ఇంగ్లీషు భాషయందు వర్ణింపబడి యున్నంత బాగుగ మన పుస్తకములలో పాత్రలు వర్ణింపబడవు. నీకు నేను చెప్పిన ఆశ్చర్యముగ నుండును. ఆంగ్లకవులు మనోభావాధిక్యము నెంతో చక్కగా చిత్రించెదరు. మన కవులో పదపదమునకు పూర్వ ధర్మములనియు, నీతియనియు జెప్పి యేమేమో చొప్పించుచుందురు. అందుచే మనవారి భావము లస్వాభావికములై కన్పట్టును."

నేను – "ఇంగ్లీషు పుస్తకముల జదివి వాటి భావముల గ్రహించుటెట్లు?"

నా భర్త – "అంత దుష్కరము గాదు. అనుదినమొక గంట చొప్పున చదివినచో కొలది దినములలోననే ఆంగ్ల భాషయందు మంచి జ్ఞాన మలవరచుకొనగలవు. అదెట్లు! నీవు నా మాట వినకుండుటకు నిశ్చయించుకొంటివిగా? నా యొద్ద సిగ్గేలని యెన్నియో మారులు చెప్పితిని. నీవు చెవి యొగ్గనైన లేదు. శుభ్రముగా నుండుమనియు, పరమాత్ముడొసగిన సౌందర్యము వమ్ముజేసి కొనకుమనియు నెన్నియో సారులు బోధించితిని. నా మాటలు నీకు లెక్కలేదు. నాబోటి కురూపి భార్యగా నున్నపుడెట్లుండిన నేమియని యాలోచించుచుంటివా? దివారాత్రములు పరిశ్రమ చేసి యింటికి వచ్చుసరికి

నీ క్రీగంటిచూపు, నీ మృదులహాసము ప్రేమాలాపముల నా శ్రమ వాయునని ఎంతును. కాని నీ మౌనము నాయాశల నడియాసల నొనర్చుచున్నది. స్త్రీలు జన్మించుట వంటవండుటకు, బిడ్డలగని పోషించుటకు, భర్తృసేవ సేయుటకు, ఏకాదశి మొదలగు పర్వదినముల నుపవసించుటకునే కాదు. వారి పుట్టుకకు మహత్కారణము కలదు.

ఆడుది భర్త సాంఘిక మానసిక విషయముల నన్నిట పాల్గొనుట కధికారిణి. పురుషునివలె ఆమెకును స్వాతంత్ర్యమున కధికారమున్నది. నీయస్వతంత్రత గాంచ నాకు జాలి వొడముచుండును. స్త్రీ పురుషున కర్ధాంగి యని మన పెద్దల సుద్ది. కాని నీవు నా మానసిక సామాజిక విషయములలో పాల్గొనజాలవు. నా ధర్మములు వేరు, నీ యాలోచనలు వేరు. సుఖ సంతోషములా వేరు. నీవలన నా కేవిధమగు సహాయము, సానుభూతియు లేదు. ఇట్టి పరిస్థితులలో నానందాబ్ధి నోలలాడదగు నా జీవితము నెట్టి నిరానందముగా నడుపుచున్నానో నీవే యోచింపుము.

నా భర్త చెప్పినది యథార్థము. నేను వారి ఇచ్ఛా జీవితమునందొక కంటకము వలె నుంటిని. 'ఇక నేటినుండి మావారు చెప్పినటుల నడచుకొందు'నని దృఢముగా ప్రతిజ్ఞ గావించుకొంటిని. నా భర్త ప్రసన్నచిత్తుని చేయగల్గుదునే!

నగలన్నను, బట్టలన్నను మొదట నాకు నిష్టముండెడిదికాదు. నా పుట్టినింట ఆబాల వృద్ధము స్వయముగ నూలువడకి బట్టలు నేయించి యిచ్చెడి యాచారము. విదేశ వస్త్రముల వాడెడి వారము కాము. నేనెన్నడేని గ్లాసుగోమల్లు అద్దకములకు ముచ్చట పడిన మాయమ్మ వారించుచుండెడిది. సింగారించుకొనుటకు మనసుపడిన 'మనకిట్టి పల్పోక శృంగారములు తగవమ్మా' యని బోధించెడిది. అంతవరకెందుకు? ముకురమునకు ఎదుటనిల్చి ముంగురులు సవరించుకొనబోవ విసుకొనెడిది. ఇప్పుడు భర్తను సంతోష పెట్టుటయే నా విధి యనుకొంటిని. నా హావభావవిలాసములు మా అత్తాడు బిడ్డలకు కష్టముగ నున్నవి. వారియందు నాకొక యలక్ష్య భావమేర్పడ జొచ్చెను. మెల్లమెల్లగ భార్యాభర్తల మనోభావములు కలియుచున్నవి. మావారి యందు పూర్వ విచారములేదు. మిగుల సంతోషముతో గనబడుచు వారు నాకు విలువగు చీరలు, అందమగు జాకెట్లు, సున్నితములౌ స్లీపర్సు కొని తెచ్చుచున్నారు. కాని వాని నే ధరించి నల్గురిలోనకు వెళ్ళుట కింకను జంకెడిదానను. వానిని కేవలము నా భర్త యొద్దకు బోవునపుడే ధరించుకొనుటకు నిశ్చయించుకొంటిని. నా శృంగారము జూచి నా భర్త యెంతయో సంతసించెడివారు. తన భర్త సుఖమునకు స్త్రీ యెట్టి శృంగారముల

నొనర్చుకొనదు! ఇంక నింటి కార్యములయందు నాచిత్తము చొచ్చుట లేదు. నా సమయమంతయు నన్ను నే సింగారించుకొనుటలోను పుస్తకావలోనమునందును వెచ్చింప దొడగితిని. నవలలయందు రుచి మిక్కుట మాయె.

ఇంతవరకు నా అత్తమామల నేను మిగుల గారవించెడిదానను. వారికెదురుగ 'జాకెట్లు' 'స్లీపర్సు'తో వెళ్ళుటకు భయము సంకోచము నుండెడివి. "ఇక నా భర్త వందల కొలంది రూప్యముల సంపాదించుచుండ నింట దాసినై యెంతకాల మిట్లు నేనుండుట!" అను అభిమానము హెచ్చెను. 'ఇంటి యాజమానురాలైన నేనుండ అత్తమామలెవ్వరు నన్నా జ్ఞాపింప' అను అహంభావము వృద్ధి కాదొడగె. అత్తగారేదేని పనిచేయుమని చెప్పిన ఆ మాట విని విననట్లూరకుంటిని. కొంతవరకామె నా రాకకెదురుచూచి తుదకు ప్రాణము విసిగి గట్టిగ కేకలువేయ నారంభించెను. ఆమె చాలా కోపిష్ఠిది. చిఱ్ఱుగొట్టు స్వభావము కలది. మరికొంతసేపటికామె నా గదిలోనికి వచ్చి, "నేను ఫలహారము కేమైన చేయమని చెప్పితినే, చేసితివా" యని గద్దించెను. క్రోధారుణిత నేత్రనై నేను – "తీఱిక లేనందున చేయలేదు" అని ప్రత్యుత్తర మిచ్చితిని. అప్పుడామె – "ఏమి? దిన మంతయు కూర్చుండియుండుట తప్ప నీకు వేరు పనియేమున్నది? ఇంత గర్వమా! 'నా భర్త సంపాదించుచుండ నేనేల పని చేయవలయు'నని విఱ్ఱవీగుచుంటివేమో! అట్టి పొరపాటు పడకుము. నీ భర్త లక్షలు సంపాదింపనిమ్ము. ఈ యింట నా యధికారమే చలాయించును. నేడు నాల్గుడబ్బులు గడించునంతనే యూసత్కార్యములకు నే యజమానురాల నైతినని కుల్కుచున్నావేమో! విద్యాబుద్ధులు గఱపి పెంచి పెద్దవాని జేసిన మేము మన్నుకొట్టుకొని పోవలసినదేనా! ఎంత గర్వించుచున్నావే! ఆహా! కాల వైపరీత్యము! నిన్న మొన్నటి పిల్లలకెట్టి స్వతంత్రాలోచనలు!" అని నన్ను తూలనాడెను.

నేనేడ్వసాగితిని. నా నోటమాట రాలేదు. నా పెనిమిటి వారి కచ్చేరీగదిలో కూర్చుని వార్తాపత్రిక చదువుచుండిరి. ఈ మాటలు వారి చెవినిబడె కాబోలు. రాత్రి నిదురింప వచ్చినపుడు నన్ను చేరబిలిచి, "చూచితివా మా అమ్మగారి క్రోధపూరిత వాగ్బాణ పరంపరలు! స్త్రీ జన్మ యిట్టి కఠోర వాగ్బాణముల సహించుటకేనా! ఇట్టి మాటలు నాలకించినపుడు నే బొందు మనోవేదన దుస్సహము. జీవితము భారముగ దోచును. హృదయము కంపించును. జలవాయు ప్రకాశములు లేక శుష్కించు మొక్కవోలె మనుజుని విద్యాజ్ఞానములడుగంటుచున్నవి. ఇంతేల? నేనామె ముందు నోరెత్త నేరనైతి. తల్లిదండ్రులు నాయెడ సర్వాధికారులై యుండుటచే నానోట మాటేని రాలేదు. నావలన నీకు నట్టిగతియే కల్గుచున్నందులకు విచారముగ నున్నది. నీవు వారిమాటల వినజాలక

ప్రత్యుత్తర మొనర్చి ప్రాణత్యాగ మొనర్చుకొనవలె నను బుద్ధి వొడమును సరే. ఇప్పుడు మనకు రెండే మార్గములున్నవి. ఒకటి వారి సూటిపోటు మాటల నన్నిటి విని సహించి యూరకుండుట, రెండవది మన మార్గము మనము స్వతంత్రముగా జూచుకొనుట. చెప్పుము, ఇందేది నీకిష్టమో. అమ్మగారి స్వభావమిక నెన్నటికేని మాఱునని యూఱకొనుట మాత్రమిక అసంభవము. నీ యిష్టమేమి?"

నేను భయపడుచు భయపడుచు "మీకేది సమ్మతమో నాకు నదియే సమ్మతమగు. ఆమె నన్ను చదువు వలదనిన మానివైతును. నేనెటుల ప్రవర్తించిన నామె ప్రసన్నచిత్త యగునో యటులనే ప్రవర్తింతును. నేను చదివి యేమి చేయవలయు" నని ప్రత్యుత్తర మిచ్చితిని.

నా భర్త – "నీవు చెప్పునది నాకెంత మాత్రమును నచ్చలేదు. అవిద్యాంధకారమున బడి యెంతకాల మిట్టీదులాడుట? అమ్మనేడు దూషించుట ప్రారంభించినది. అనుదినము దూషణము హెచ్చునే కాని యిక తగ్గదు. నేను నిన్నెంత విద్యావతిగ చేయదలచిన నన్నామె యంత యడ్డును. చిన్ననాటి పరిస్థితులు మారిన వనియు, నేను భారతమాతకు సత్పుత్రిరత్నముల యవసరము ముఖ్యమనియు, స్త్రీలు చేతగాని పిరికిపందలవలె నింట గూర్చుండి దేశమందలి యాందోళన మెఱుంగక, దేశస్థితి దెలియనేరక వృథాలాపముల కాలము పుచ్చ సమయమిది కాదనియు నామె యెన్నటికి నెరుగనేరదే. కాన నామాట బాగుగ నాలోచింపుము. మన మే పట్టణమునకైన బోయి యొకరి యొత్తిడి లేక స్వతంత్రముగా జీవింతుము. 'ఇక్కడ ప్రాక్టీసు బాగుండలే'దను మిషమీద ఇంటనుండి మెల్లగ దాటిపోవచ్చును.

నా పెనిమిటి పలుకులన్నియు విని నేను వారికి విరుద్ధముగ నేమియు జవాబు నీయలేకపోతిని. ఒంటరిగ నుండవలయునే యనుజంకు కల్గెను కాని అచ్చట నేను పోరులేక సుఖముగ కాలయాపన మొనర్పవచ్చుననుద్దేశ్యము మదీయమానసమును వికసింపజేసెను.

నాటినుండియు నాయత్తగారు నాతో మాటలాడుట మానివేసినది. ఇరుగుపొరుగు అమ్మలక్కల పరిహాసములకు నేగురియైతిని. ఇదంతయు నాకు మిగుల కష్టముగ నుండెడిది కాని వారందరి మాటలు సహించి యూరకుండుట కంటే నాయత్తగారి తిట్లే మేలని తోచెను. ప్రపంచమునకు నా భర్తగారియెడ గూడ గౌరవ మర్యాదలు తగ్గ నారంభమయ్యేను. నేను నా భర్తను మందుమాకుల వశీకరణ మొనర్చుకొంటినను వదంతి ప్రబలెను.

శ్రావణమాసము, కృష్ణాష్టమి, లోకరక్షకుడగు కృష్ణభగవానుని పుట్టుకదినమునాడు మా యింట నందఱును ఉపవాసముండిరి. నేను నుపవసించితిని. పరాత్పరుడగు మాధవుడు రాత్రి పండ్రెండుగంటలకు జనించెను. మేమందర మొక్కచో గుమిగూడి యాసర్వేశ్వరుని మీద పాటలు పాడుచుంటిమి. ప్రార్థన సేయుచుంటిమి. నా భర్త యిట్టి మూఢాచారములన్న మండిపడువారు. ఇట్టి దినముల వారు స్నానము కూడా మానెడువారు. ఆనాటి రాత్రి యుత్సవమంతయు ముగిసిన పిమ్మట నిదురించుటకు నేను గదిలో కాలిడితిని. అప్పుడు వారు – "ఎందులకిట్లు శరీరము శోషింప జేసి కొనెదవు? కృష్ణుడు తప్పక మహానుభావుడే. అతని పూజించుటయు మన కర్తవ్యమే కాని యిట్లు పస్తుండుట వలన కల్గు లాభమేమియో నాకు తెలియకున్నది. ఇదియొక నటన. భక్తియన పవిత్రత, విశ్వాసము, సత్యము" అని బోధింప దొడగిరి.

నా భర్త భగవద్గీతల విశేషముగ కొనియాడుచుండువారు. పఠించుటెప్పుడు నే గనలేదు. ఉపనిషత్తుల ప్రశంసించునపుడు నోట పుష్పవృష్టి కురిసెడిది. వారుపనిషత్తుల ముచ్చరించుట నా చెవులనెన్నడు బడలేదు. వేదాంతమే భారతదేశ పునరుద్ధరణ. మనకు నేడు శౌర్యనిధులగు పుత్రపుత్రికా రత్నముల యావశ్యకత యెక్కువగా కలదు. ఇది ముక్కుమూసుకొని కూర్చుటకదనుగాదు"

నా భర్త వాక్యములకు ప్రత్యుత్తర మొసంగు సామర్థ్యము నాకెక్కడ? వీరు కేవల పాశ్చాత్యమార్గానుసరుణులై యుండిరే యని తలపోసితిని.

మేము చెన్నపురి జేరితిమి. రెండంతస్థుల మేడ నొకదాని బాడుగకు తీసి యందు వసింప నారంభించితిమి. ఆ భవనమెంతయో శృంగారముగా నుండెను. విద్యుద్దీప ప్రకాశమున తద్భవన శృంగారము ద్విగుణీకృతమగు చుండెను. ఇరు పార్శ్వముల నున్న తరులతాగుల్మాదులు పథికులకు తమ నీడచే విశ్రాంతి గలుగ జేయుచు సృష్టి వైచిత్ర్యమును విశేషముగ జాటుచున్నవి. మాయొద్ద అయిదుగురు నౌకరులుండిరి. స్త్రీలిద్దరు, ముగ్గురు పురుషులు. ఎల్లప్పుడొక నవల చేతగొని పడక కుర్చీలో పరుండి చదువుచుండుట దప్ప యింటపని యేమి నాకు లేదు. కంచు, ఇత్తడి, మొదలగు పాత్రలింట మచ్చుకేని గానవచ్చుట లేదు. గాజుప్లేట్లు, సాసర్లు, కప్పులు మొదలగు విదేశ వస్తు సామగ్రి వాటిస్థానమాక్రమించెను. భోజనము సేయురీతియు పాశ్చాత్య దేశజులనే యనుసరించితిమి. అట్లు తినుటయందు మావారికెంతేని యానందము. కొలది దినముల వరకు నాకట్లు తినుట సిగ్గుగనుండెడిది. క్రమేణ నేనును ఆ పద్ధతికే యలవడితిని.

మాయొద్ద నొక మోటారు, జోడు గుఱ్ఱముల బగ్గీయు కలవు. కాలినడక బొత్తుగ మఱచితిమి. ఎవరినేని చూచుటకు పదియడుగుల మేరపోవలయునన్న బండి సిద్ధముగ నుండవలె. నా భర్త 'అప్‌టూ డేట్ ఫేషన్ అన నిదే' యనెడి వారు.

మెల్లగ మాకు రాబడి దినములు తగ్గె. ఇంటిఖర్చు గూడ సరియగు మార్గము త్రొక్కలేదు. మధ్యమధ్య వారి ముఖమండలము విషాద మేఘాచ్ఛన్న మగుట గనెడిదాన. రాబడి తక్కువగ నున్నపు డీవ్యయవేల తగ్గింపరాదు? ఇంత పెద్దభవనము మనకేల? ఏ చిన్నయిల్లో తీసుకొన్న మనకు చాలదా? అయిదుగురు సేవకులవసరము మనకేమి? ఇద్దఱున్న కాలక్షేపమగునే? యని యెన్నియోసార్లు వారికి చెప్పుచుండెడిదాన. నా మాటలు విని చాటుకొందుమా? దారిద్ర ప్రకటనము దారిద్ర్యానుభవముకన్నను దుఃఖ కరము. మనము నిర్ధనుల మనుమాట మఱచిపొమ్ము. లక్ష్మియనతికాలముననే మన యెడ మరల ప్రసన్నయగు. వ్యయము వృద్ధియగుట, అవసరములు పెంపొందుట ద్రవ్యోపార్జనముకు ప్రథమ సోపానములని నమ్ముము. కష్టములకు కిందపడుచు నొక్కచో గూర్చున్న నడుగు ముందుకు పడునే! సుఖానుభవమునకు యోగ్యుల మగుదుమే!"

ఏది యెటులైనను మా వ్యయము దైనందినాభివృద్ధి నందుచునే యుండెగాని తగ్గుదల సూపలేదు.

క్రమేణ నేనును ఆ పద్ధతికే యలవడితిని. మేము వారమునకు నాలుగైదు మారులు 'సినీమాలకు, నాటక ప్రదర్శనమునకు' వెళ్ళెడివారము. వారమునకు రెండు మూడు పర్యాయములైన మా యింట ఇతరులకు విందు జరుగుచుండెడిది. జీవిత ముఖ్యాదర్శము సుఖభోగానుభవమే యనుభావము నాకుకూడా పొడకట్టెను. మన మనుభవింపనే భగవంతుడు ఉత్తమ వస్తుజాలముల ప్రసాదించినాడు. అనుభవించుటె మన వంతు"

ఒక క్రైస్తవ స్త్రీ నాకు నాంగ్లభాషను నేర్పను, సంగీతము చెప్పను వచ్చుచుండెడిది. 'పియానో' నొకటి కొంటిమి. ఈ కృత్రిమ మహదానంద సాగరమున మున్గి నేను రామాయణ భారత భాగవత పఠనమునకు స్వస్తి జెప్పితిని. ఇప్పుడు నాకా పుస్తకములన్న మిగుల నేవగింపు జనించె. దేవతలయందు నాకుండెడి భక్తి విశ్వాసములు తొలగ దొడగె.

నానాట ఇక్కడి పెద్ద మనుష్యులతో స్నేహము కుదిరె. నూత్నముగ స్త్రీ సంఘ మొకటి మేముండు ట్రిప్లికేనులో స్థాపింపబడె. ఈ సంఘసభ్యురాంధ్ర నడకలు, పోకడలు

నాకు మొదటిలో ఆశ్చర్యము గొల్పెడివి. ఈ సంఘమున నేను చాల దినముల వరకు కేకిమూక మధ్య కాకివలె నుంటిని. ఈ సంఘపు స్త్రీలు గుఱ్ఱపుస్వారి, టెన్నీసు ఆటలు, ఈతలు నేర్చి నేర్పుచు కేరింతలు గొట్టుచుండువారు. స్త్రీ విద్యాభివృద్ధి, స్త్రీ స్వాతంత్ర్యముల గూర్చి చర్చలు, వార్తా పత్రికలు ముందిడుకొని యందలి వ్యాసముల దోషాదోషముల చర్చించి నిరూపించుతఱి వారుచూపు బుద్ధికుశలత, చాకచక్యము వాగ్వివాద పటిమ నాకచ్చెరువు గొల్పెడివి. అపర సరస్వతుల వలె నాకు దోచెడివారు. సంకోచ సంభ్రమముల వీడి బీచియొడ్డున పురుషులతో చేతుల గల్పి యటునిటు నడయాడుచుండుట గాంచి మొదటిలో వారి సాహసమున కాశ్చర్యపడుదాన. వారు నన్ను తమ వెంట రమ్మనెడివారు. నేను లజ్జావశమున వెళ్ళజాలకుండెడిదానను. ఆ స్త్రీల మోములెప్పుడు సంతోష వికసితములై యుండెడివి. వ్యాకులచిత్తలై వారెప్పుడు నాకు కానరాలేదు. మిస్టర్ కృష్ణారావ్ జబ్బుగా నున్నప్పటికి మిసెస్ రావ్ మోమున చింతారేఖ కానరాదు. మిస్టర్ రావ్ హృద్రోగమునకు లండను నగరమున చికిత్స నందుచు మిసెస్ పూర్ణ నిత్యము టెన్నిసు ఆటకు వచ్చుచునే యుండిరి. ఇట్టి నాగరికతా మూర్తుల నడుమ నా యవస్థ యెట్లుండెనో నాకే యెఱుక.

ఈ స్త్రీల సంభాషణముల నెట్టి యాకర్షణ కలదో కాని, మెల్లమెల్లగా నాకు గూడ వారి ఆ ప్రమోదములలో పాల్గొనవలయునను కోర్కి జనింపమొదలిడెను. వారి బోలె స్వాతంత్ర్యము గలిగియున్న నిచ్చ ప్రబలమగుచుండె. ఇంగ్లీషున వారు సంభాషించు కొనుచుండ, నెన్నడు నాకట్టి భాగ్యమబ్బునాయని తలచుచు సుఖస్వప్నముల గాంచు చుండుదాన.

ఇట్లుండ నాస్థితి ఖేదజననకమగుచు వచ్చె. నా భర్తనన్ను 'మైలవ్', 'మైడియర్', 'మైడార్లింగ్' అని సంబోధించువారు. ఆ మాటలు హృదయమునుండి వచ్చినవి కావనియు, నందు కృత్రిమత యున్నదనియు తలపోయుదాన. వారికి నా యెడ నున్న స్నేహములో హార్దిక భావములకు మాఱు అలంకారము లెక్కువగా నున్నటుల కన్పట్టుచు వచ్చినది. అన్నిటికంటె నెక్కుడు నాకు గూడ నా భర్తయెడ నుండి శ్రద్ధాభక్తులు తొలగిపో నారంభించె. వారికి శిరోవేదన కల్గిన తొల్లిటియట్ల నాకిపుడు హృదయవేదన కల్గుట లేదు. నాయందు ఆత్మాభిమానము, స్వార్థపఱత హెచ్చె. ఇప్పట్టున నేను సింగారించు కొనుట కూడా నా కర్తవ్యమునకే గాని నా భర్త నానందింపజేయుటకు గాదు. నా సౌందర్యమందు నాకు గర్వము. నేను జీవించుట గాదు. నేను జీవించుట యొరుల కొఱకు గాదనియు, నా కొఱకే యనియు భావింపదొడగితిని. త్యాగము, సేవ హృదయము నుండి దూరములయ్యె.

నల్గురిలో మాత్రము తిరుగుటకు నా కింకను సంకోచముగనే యున్నది. పలువురి నోట నా సౌందర్యాధిక్యము వినవలయునని కుతూహలము. ఒకనాడు మిస్టర్ రావ్ ప్రభృతులతో మావారు కూర్చుండిరి. నాకును వారికిని మధ్య కేవలమొక తెఱయడ్డు. నేను వారియెదట స్వేచ్ఛగా కూర్చుండలేదని నా భర్తకు కష్టముగా నుండెను. నేనిట్లుండుట వారి గొప్పతనమున కేమొ లోపమని నా భర్త భావించువారు. "నా భార్య వస్త్రభూషణ సౌందర్యమూలమున గాదు ఈవలకు రాకుండుట, లజ్జావశమున" అని వారలకు జెప్పువారలకు జెప్పువారు. నా నగలు, నా బట్టలు, నా అందము వారికి కనబడుటకు మాటిమాటికి నన్ను తెఱయొద్దకు బిల్చువారు. ఎట్టకేలకు నా భర్త యిష్టమే నెరవేఱెను. రెండు సంవత్సరములగు సరికి నేను సంభ్రమ సంకోచముల వీడి నా భర్తతో కలిసి 'షైర్' చేయమొదలిడితిని. ఆ 'షైర్' వెనుక 'టెన్నిసు' వంతు వచ్చెను. 'క్లబ్బులో మెంబరు'నైతిని. మొదట నాకీ 'టెన్నిసు' 'క్లబ్బు'లన తలనొప్పిగా నుండునవి.

క్లబ్బునందు ఇంతకన్నను చిత్రము. జనులు ఇంగ్లీషు మాటల తమ భాషలో దొర్లించుచు వెకిలినవ్వుల నవ్వుచు, సారహీన సంభాషణముల కాలము బుచ్చువారు. స్త్రీల యీ నిర్లజ్జత, పురుషుల భావ శూన్యత మొదటిలో నాకాశ్చర్యము గొల్పెడివి. నలు దెసల నీ పాశ్చాత్య పద్ధతులు హాస్యజనకములుగ నుండెను. ఏమైననేమి? నేనును వారి ననుసరించితిని. నా కిప్పుడు నిత్యము క్రొత్తక్రొత్త దుస్తులు, సింగారములు, క్లబ్బునందు టెన్నీసు ఆడునపుడు అందఱి దృష్టులు నా మీద ప్రసరింపవలయునను ఉత్సాహము. నా భర్తకు జేయు సేవా సత్కారములందు అశ్రద్ధ కలుగజొచ్చెను. అంతేకాదు, పరులనోటి నుండి నా సౌందర్య ప్రశంస వినవలెనను కుతూహలము, ఏ సౌందర్యమన్న, నెట్టి శృంగారములన్న నా శరీరమున రోమరోమము హేయభావమున కంపించుచుండెడిదో, యెట్టి హాస్య కటాక్ష వీక్షణములు విషతుల్యములై నన్ను మృత్యుముఖమున జొర ప్రేరేపింపచెడివో యట్టి యిహలోక సౌఖ్యములందు నాకిపుడొక యున్మాద పూర్ణమౌ హర్షము కలుగుచుండెను. కాని యెన్నడేని నా పూర్వస్థితి దలచుకొన్న మనమున మాత్ర మొకవిధమగు భీతి జనించుచుండును. ఈ నావ యే యొడ్డున జేరునో యను తలంపు. కొన్ని సమయముల క్లబ్బునకు పోగూడదనియు, స్వేచ్ఛాపరలగు నీయువతులతో స్నేహము వలదనియు ననుకొనుదాన. అయిననేమి, సమయ మగుటతోడనే క్లబ్బునకు సిద్ధపడుచుంటిని. నేను నా వశమున లేను. మనమందలి సత్కల్పనలన్నియు మంట గలియుచుండు సద్భావములన్నియు నశించు.

నా భర్త స్వభావమున మార్పు కల్గుచుండెను. వారు విచారమానసులై కనబడు

చున్నారు. ఏదో కఠినమగు చింతచే కృశించుచున్నట్లు పోట్లాడనారంభించిరి. బయటకు వెళ్ళుటకూడా తగ్గించిరి.

ఇంతకొకమాసము క్రితము వారెన్ని పనులున్నను క్లబ్బునకు మాత్రమవశ్యము వెళ్లువారు. క్లబ్బునకు వెళ్ళని దినమున వారికి మతిపోయినట్లుండెడిది. కాని వారిప్పు డధికముగ వారి గదియందే పడక కుర్చీమీద పరుండి వార్తాపత్రికనో, పుస్తకమునో చదువుకొనుచుండువారు. ఇట్లుండుటకు కారణమెద్దియో మాత్రము నేనూ హింపజాల కుండుదాన.

ఒక దినమున వారు జ్వరపీడితులై యెట్లున్న వారట్లనే స్మృతిలేక మంచము మీద పడియుండిరి. వారియొద్దకు బోవలెనను బుద్ధియే నాకు కలుగలేదు. సభలు, ఉపన్యాసములు వీనియందు నా మనస్సు తగిలి యుండెను. వారి యొద్దకు వెళ్ళు చుందును; క్షణములో మరలి వచ్చి 'టెన్నీసుకు టైమ్ అయ్యెను. వెళ్ళనా, వద్దా' యను సంశయములో మునుగుచుంటిని. తుదకు 'ఎక్కడునున్న నేమిలాభము? నే నిచ్చటనున్న మాత్రాన వారి జ్వరము తగ్గునా? ఆగుటవలన ప్రయోజనమేమి? వెళ్ళిననే బాగుండు' నని నిశ్చయించుకొంటిని. నేను దుస్తుల తొడిగికొని 'రేకట్' తీసుకొని క్లబ్బునకు వెళ్ళితిని. అక్కడి చెలికత్తెలు మిసెస్ రంగనాథఅయ్యర్, మిసెస్ రావ్, మిసెస్ పూర్ణలతో నా భర్త యవస్థ జెప్పి సజల నయనములతో కూర్చుంటిని. టెన్నీసు కోర్టునకు మిస్ పూర్ణ నన్ను కేకవేయ నొక దీర్ఘ నిశ్వాసము మాత్రము వదలి వారివెంట వెళ్ళి యాడితిని.

నేటికి మూడుసంవత్సరములకు పూర్వము! నా భర్త యిట్టి విషజ్వరముచే పీడితులై యున్నప్పుడు రాత్రియంతయు నిద్రలేక వారికడ కూర్చుని విసరుచునే యుంటిని. వ్యాకుల హృదయనైతిని. 'వారికేల రావలె ఆ జ్వరము, నాకేల రాదు' అని తలపోసితిని. ఆహా! కాల వైపరీత్యము. ఇప్పుడా హృదయము స్నేహశూన్యమయ్యె; పాషాణ ప్రాయమయ్యె. నేనెప్పటివలె రాత్రి తొమ్మిది గంటలకే యిల్లు జేరితిని. నా భర్త మంచి స్థితి నున్నట్లే కాన్పించిరి. వారు కేవలమొక్కపరి దీనదృక్కులు నాపైబఱపి యటు ఒత్తిగిలి పరుండిరి. నేను భోజనమొనర్చి పరుండునెడ నా యంతరాత్మ నా స్వార్థపరత్వమునకు ఈ లీలావినోదములకు నన్ను నిందించె.

ఇప్పుడు నేను ఆంగ్లోపన్యాసములను, నవలలను అవలీలగా గ్రహించుచున్నాను. మా సంభాషణ తరచు ఇంగ్లీషు ననే. మాకన్న తక్కువవారితో మాటాడుట హేయముగ భావించుచుంటిమి. హైందవ స్త్రీలు నాగరికతాశూన్యులని తలపజొచ్చితిమి.

మరుసటి దినమున గూడ నా భర్త జ్వరము చూచి మిసెస్ కే.ఎస్.రావ్ 'డాక్టరు తిరుమల్‌కు కబురు పంపరాదా' యని సలహానిచ్చెను. నేనట్లు చేయ నంగీకరించితి. మరునాటి నుండియు డాక్టరు వచ్చుచు పోవుచుండెను. నా భర్త శుశ్రూషలకు 'నర్సు' ఒకతె నియమింపబడెను. నాకు గూడ భర్తకు సేవచేయు అవసరము తప్పెగదాయను సంతుష్టి కల్గెను. రెండు దినములు నేను క్లబ్బునకు వెళ్ళుట పడకపోయినప్పటికి మనస్సు అక్కడనే యుండెను.

ఒకనాటి మిట్ట మధ్యాహ్నమున నేను పడక కుర్చీలో కూర్చుని ఇంగ్లీషు నవల నొకదాని చేతగొని చదువుచుంటిని. ఆకస్మికముగ నా మనమున 'భర్త రోగము తిరుగుట దుస్సాధ్యమయిననెట్లు?' అనుభావము జనించెను. ఈ శోకమయ కల్పనవలన నాకు దుఃఖము కల్గుటకు మారు ఆనందము కల్గెను. మిసెస్ రావ్, మిసెస్ రంగనాథయ్యర్, మిస్ పూర్ణ నాయెడ సానుభూతి ప్రకటింతురు. వారిని చూచుటతోడనే నే నశ్రుపూరితనై నిలిచి 'సోదరీమణులారా! నా జీవనమిప్పుడు భయానక శ్మశాన దీపమువలె క్రుంగి యంధకారభూయిష్టమై పోయినది. నన్ను జూచి జాలినందనేల?' అని మనమునందొక శోకపూరిత నుపన్యాస రచన గావించుకొంటిని. పాపము శమించుగాత! శవము వెంట పోవునాడెట్టి బట్టల కట్టుకొనవలయునో యను నిర్ణయము కూడా మనమున చేసి కొంటిని. వీరి మృత్యువార్త పట్టణమెల్లెడ వ్యాపించును. ప్రతిసంఘము నుండియు, పరిచయముగల ప్రతి వ్యక్తికడ నుండియు నాకు సానుభూతి లేఖలు కొల్లలుగ వచ్చును. వానికి నేను ప్రతియుత్తరమునకు ప్రత్యుత్తరమునీయ నసమర్థను. శోక సంతప్త హృదయకు నాకు సమయమెక్కడ? 'అందరకు కృతజ్ఞురాల. మృతాత్మ శాంతికి సర్వేశ్వరుని బ్రార్థింప మిమ్ము వేడెద' నని పత్రికా ముఖమున ప్రకటింతును. ఇట్టి యాలోచనలలో మునిగి తేలుచుండ నర్సు వచ్చి "అమ్మా! అయ్యగారు పిల్చుచున్నారు" అనెను.

అది నాకు క్లబ్బుటైము. వారప్పుడు నన్ను పిలుచుట నా కాటంకము. ఏమి చేయను? ఎటులనో వెళ్ళితిని. నా భర్త మంచము నెక్కి నేటికి రమారమి మాసము దినములు కావచ్చినది. వారు నావైపు దీన నేత్రముల చూచుచుండిరి. ఆ కనుల నీరు నిండి యుండె. వారిని చూడ నాకు జాలిపొడమె. కూర్చుని ధైర్యము జెప్పుచు "ఏమి చేయను? మరియొక డాక్టరును బిలతునా?"

"నేనిచ్చటనున్న నాకీరోగము మరలదు. నన్ను మాయమ్మ యొద్దకు గొంపొమ్ము"

"ఏమీ! ఇక్కడకన్న నెక్కువ చికిత్స జరుగునా యక్కడ?"

"జరుగనిమ్ము, జరుగకుండనిమ్ము. నామనమేలనో మాతృదర్శనము గోరి వేగిరపడుచున్నది. ఔషధసేవ వలన గాకున్నను మాయమ్మ దర్శనముననే జీవింపగలను అను ధైర్యము నాకు కల్గుచున్నది"

"ఇది వట్టి భ్రమ సుమండీ"

"భ్రమే కానిమ్ము. నా ప్రార్థన నాలకింపుము. ఈ రోగమువలన గాదు. మన ప్రస్తుత జీవిత మార్గమునుండియే నాకు దుఃఖము కల్గుచున్నది"

ఆశ్చర్యచకితనై నేను నా భర్తను తిలకించితిని.

వారంత "ఈ జీవనమునుండి నేను మిగుల విసిగితిని. నిర్మల జల స్రవంతులచే పవిత్రమగు భూమి మన మాతృభూమి యేయని నేనీనాడు గుర్తింప కల్గితిని. నేనింతకు పూర్వము ఈ హేయజీవనమును మిగుల ప్రేమించితిని. ఇప్పుడు నాకు దాని యాంతరంగికావస్థలు బాగుగ బోధపడినవి. ఆద్యంతము కంటకావృతమైన జీవిత మందు నేటివరకు తిరుగాడుచుంటిని. ఈ జీవనమున హృదయానందము గాని, యాత్మకు శాంతిగాని లేదు. ఇది యొకయున్మత్త, అశాంతిమయ, స్వార్థపూరిత, విలాసయుతమైన జీవితము. దీనియందు నీతి, ధర్మము, సహానుభూతి సహృదయత శూన్యములు. పరమాత్మ ప్రీతికొరకైన నీవు నన్నీ యగ్నినుండి రక్షింపుమా! ఉపాయాంతర మేమియు లేనిచో మాయమ్మకొక లేఖనైన బంపుము. ఆమె తప్పక వచ్చును. ఆమె మమతాపూర్ణదృష్టి, ఆ ప్రేమయుత శుశ్రూష నా కమృతోపములగు. నే జీవింతును. ఆమె వచ్చును. ఆమె తప్పక వచ్చును. వచ్చి యీ నిర్భాగ్యుని యవస్థ గాంచును. ఈ నీచాతినీచమగు నవనాగరికతా సంఘములగాలి ఆమెకింకను సోకలేదు. ఆమె వచ్చును; వచ్చును; తప్పక వచ్చును. నా కన్నులు ఏ ప్రకాశమాన పవిత్ర దివ్యజ్యోతికి నై తహతహలాడుచున్నవో ఆ జ్యోతి యింకను ఆమె మొగమందే తాండవ మాడియుండును. ఆమె హృదయమున స్నేహము, సత్యము, విశ్వాసము పాదుకొని యున్నవి. ఆ పవిత్ర మాతృమూర్తి యంకముననే చనిపోయినను నా యాత్మకు శాంతి కల్గును. మోక్షము కరతలామలకమగు. స్వర్గలోక సంతోషమందగల్గుదును".

జ్వరతీవ్రతచే వాగ్ధోరణి హెచ్చెనేమో 'టెంపరేచరు' తీసి డాక్టరు యొద్దకు బోదునని 'నర్సు' థర్మామీటరు తీసుకొని వారి యొద్దకు వెళ్ళెను. నా భర్త యామె చేతిలోనుండి యీ జ్వరమాన యంత్రమును దీసి నేలగొట్టిరి. అది ముక్కముక్కలయ్యెను. వారు నన్నంత హాస్యమయ దృష్టి నవలోకించి "దుస్తులు దాల్చితివి. క్లబ్బునకు పోదువు గాబోలు. ఆ దారిని పోవునపుడు డాక్టరుగారిని కలిసికొని, మావారి టెంపరేచరు తుద డిగ్రీకి యెక్కెనని మాత్రము చెప్పుము" అనిరి.

నేనంత భయభీతనైతి. హృదయమున కరుణా విచారములు ముప్పిరిగొనె, కంఠము రుద్ధమయ్యె. నా భర్త తమ నేత్రములు మూసిరి. వారి యుచ్ఛ్వాస నిశ్వాసములు తీవ్రములయ్యె. డాక్టరును పిలుచు తలంపుతో నేను ద్వారముకడ కేగునంతలో వారు లేచి కూర్చుని నా వైపు దీనముగ జూచుచు "కమలా! నేను నీతో కొంచెము సేపు మాటాడవలెనని చాలాకాలము నుండి యోచించుచుంటిని. కాని సాహసము కలుగదు. నేను తప్పక నా హృద్గతములగు నుద్దేశముల చెప్పి వేయదలచితిని. పూర్వజీవనము నందే సుఖమునందవలయునని యాశించుచున్నాను. ఈ జీవితమన్న నా కసహ్యము కల్గుచున్నది. ఇదే నా రుగ్మతకు ముఖ్య కారణము. శరీర కష్టమున కాదు. మానసిక కష్టమున గృశించిపోవుచున్నాను. నిన్ను తిరుగ అజ్ఞానవర్తివిగ, భగవదారాధనా తత్పరవుగ, రామాయణ పఠానాసక్తవుగా గాంచవలెనని యూహ. గృహకార్య నిర్వహణమున శ్రద్ధాభక్తులు కల్గి రాట్న పరిశ్రమ మొనర్చుచు సర్వేశ్వర సంసేవనను కాలముగడుపు నీయానాటి మూర్తి మరల గాంచవలెనను నాయాశ వృథ కాజనదు. నన్ను నీవానినిగా గైకొమ్ము; నీవు నాదానవు కమ్ము. వంచనారహితమగు నా పరిశుద్ధ జీవితమందే వాస్తవిక సుఖము కలదని నేనీనాడు గ్రహింపగల్గితిని. చెప్పుము. నీకేది యంగీకారమో? నీవెన్నడు నా మాట జవదాటలేదు. నా ముద్దు చెల్లింపకున్న ఈ నికృష్టజీవనమెట్లు పరిణమించునో! ఏమి? కమలా! నా ముద్దు చెల్లింపవా? చెప్పుము, చెప్పవా?" యని బ్రతిమాల దొడంగిరి.

వెంటనే నేనేమియు ప్రత్యుత్తర మొసగజాలనైతిని. ఈ స్వాతంత్ర్య జీవితమందున్న సుఖమును గూర్చి యాలోచింపదొడగితిని. ఈ యానందమెక్కడ అది ఎక్కడ! ఇన్ని దినములు స్వతంత్ర రాజ్యమునందు స్వేచ్ఛాభ్రమణ మొనర్చిన పిదప మరల నస్వతంత్రతా జాలముల చిక్కుపడుటెట్లు? నా భర్తయేగా నాకీ స్వాతంత్ర్య పాఠముల

నేర్పినది. పవిత్ర పురాణ పఠనమందనిష్ఠత గలుగజేసినది వారే గదా! నేను వారి యిచ్చానుసారము మెలగితినే. ఏమి యపరాధమొనర్చి యుంటిని? అని ఆలోచించ దొడిగితిని. కాని నా భర్త దీనతా పూర్వ దృక్కుల నవలోకించినంత నేనేమియు చేయ జాలనైతిని. "ఇక్కడ మీకేమి కష్టముగా నున్నది" అని మాత్రమంటిని.

నా భర్త తిరుగలేచి కూర్చుని నావైపు కఠినముగ జూచుచు, "ఈ ప్రశ్న నన్నడుగుటకు పూర్వము నీ హృదయమునే యడిగిన బాగుండును. నేటికి మూడేండ్ల క్రితము నీకుగల ప్రేమ నేడున్నదా? నీకన్న నన్నివిధముల యుత్తమునిగ తలచిన నా యెడ నీవు నేడెట్టి యనాదరణ జూపుచున్నావు. ఈ యర్వాచీన నాగరికత నారీజనమును సర్వనాశన మొనర్చుచున్నదని నేనిప్పుడు గ్రహింపగల్గితిని. మూడు వత్సరములకు పూర్వము నేనిట్టి దశయందున్నప్పుడు నన్నువదిలి యీ రీతి యిరుగు పొరుగిండ్లకు వెళ్ళెడి సాహసము నీకుండెడిదా? నేను రోగపీడితుడనై మంచముమీద బడి యున్నప్పుడు నోరార నెవ్వరి తోడనైన మాటలాడెడి బుద్ధి నీకు పొడమెనా? ఇతరుల నెన్నడేని కంట జూచితివా? స్త్రీల హృదయపేటికా రత్నము ప్రేమ. ఈ నవనాగరికత దాని నాశనమొనర్చుచున్నది. నాకిప్పట్టున పూర్వాచారములే పవిత్రములుగ గన్పట్టుచున్నవి. వారి జీవితోద్దేశము ఆత్మికశారీరకాభ్యుదయము, హృదయపవిత్రత. ఈ హేయాతిహేయమగు జీవితోద్దేశము నిర్లజ్జ, స్వేచ్ఛాప్రవృత్తి, మాయవేషము ఏమి కమలా – అట్లు చూచెదవు? నా ప్రస్తావన నీకిష్టము లేదా?"

నా హృదయమున వజ్రపాతమయ్యె. అందుదాగియున్న లజ్జ పునరుజ్జీవతమయ్యె. నా యంతరాత్మ నీవానాటి పవిత్రాత్మవు కావని బోధింపదొడిగె. ఆనాటి సౌశీల్యము, నేటి నిర్లక్ష్యత, విలాసము, స్వార్థపరత కన్నులకు గట్టినట్లాయె! నీ కర్తవ్యమును నీవు మరచితివి సుమా!' యను అంతరాత్మ ప్రబోధములకు మేల్కొనియు కొండొకవడి నిశ్చేష్టనై నిల్చితి.

అంత ముకుళితకరకమలనై భర్తృ చరణములు శిరముసోక నేల వ్రాలితిని. కంఠావరోధమున నోటమాట రాదయ్యె. నయనము లశ్రుధారాపూరితము లయ్యె. నా భర్తగారు నన్ను గాఢాలింగనమున గారవించిరి. మా హృదయము లొక్కటియయ్యె. ఇల్లు జేరితిమి. మా యత్తగారి గౌరవపాత్రనైతిని. మావారు సంతుష్ట హృదయులైరి. ప్రాతపుస్తకములకు స్వస్తి జెప్పి భగవద్గీత పారాయణమున, సంధ్యావందనాది

పూజార్చనముల శ్రద్ధ కల్గియున్నారు. నేనును భారత భాగవత రామాయణాది పురాణముల మిగుల శ్రద్ధతో జరుపుచున్నాను. ఈ మధ్య రాట్న ప్రచారము విరివిగ జరుగుచుండుట జూసి రాట్నము తొల్లిటికంటె శ్రద్ధతో వడుకుచున్నాను.

## కథానేపథ్యం ...

స్వశక్తితో, స్వయంకృషితో ఒక మహిళ తన జీవితంలో సాధించగల మహెూదాత్త వ్యక్తిత్వానికి ప్రథమోదాహరణం దుర్గాబాయి దేశ్‌ముఖ్. స్వాతంత్ర్యోద్యమకాలం దేశనాయకులు మాన్యతను సముపార్జించుకున్న తెలుగు మహిళ దుర్గాబాయి. స్వతంత్ర భారత రాజ్యాంగ సంరచన సంఘంలో సభ్యత్వం పొందిన మాన్యురాలు. ధైర్య సాహసాలకు, విజ్ఞతకు, కార్యసాఫల్యదీక్షకు మారుపేరు ఈమె. ఆంధ్ర మహిళాసభా సంస్థ నిర్మాత, ఆంధ్రమహిళా పత్రిక సంపాదకత్వం నిర్వహించారు.

ఈ కథ ఆధునిక తెలుగుసాహిత్య ప్రసిద్ధ పత్రిక భారతిలో ప్రచురితం. అప్పటికామె వయసు పాతికేళ్ళు. కుటుంబ సంప్రదాయం, భారతీయ వైవాహిక జీవిత సంస్కారం, జాతీయ సంస్కృతిపట్ల అభినివేశం ఈ కథలో ఆమె వర్ణించారు. భారత స్వాతంత్ర్యోద్యం ప్రథమదశలో పాశ్చాత్య నాగరకత తిరస్కృతి, జాతీయ సంప్రదాయాను రక్తి భారతీయ రచయితలకు ధ్యేయంగా ఉండేవి. కుటుంబ జీవితాన్ని నిర్లక్ష్యం చేయటం, భర్తపట్ల నిరాదరణ, ఆంగ్లేయ నాగరకత అంధానురక్తి తన జీవితంలో చోటు చేసుకోగా, కథానాయిక, సంసారంలో సంభవించిన పర్యవసానాలకు పశ్చాత్తాపం చెందిన ఇతివృత్తంతో ఈ కథ రచించింది దుర్గాబాయి. ఆమె పదేళ్ళ వయసు నుంచీ సమాజసేవకు అంకితమైంది. కుటుంబ జీవనానికి దూరమైంది. ఆమెలో ఈ ఆలోచనలు తరుణ వయసున ఈ కథ రాయటానికి ప్రేరకమై ఉండవచ్చు. ఆమె సంస్థాగత కుటుంబిని. వయసు మీరిన తరువాత చింతామణి దేశ్‌ముఖ్‌ను వివాహమాడి, కుటుంబ జీవితాన్ని కూడా ఎంతో దక్షతతో నిర్వహించుకున్నట్లు ఈ ఆలుమగల స్వీయచరిత్ర జీవన వృత్తాంతాలు తెలియజేస్తున్నాయి.

# 39. దరిద్రనారాయణుడని ఆ జగద్రక్షకుడికి బిరుదైతే!

– కనుపర్తి వరలక్ష్మమ్మ

**పి**ల్లవాడు కొంచెం పెద్దవాడైనాడు. పొరలు తీయించడం వల్ల నా భర్తకు మరల నేత్రాలు ఎప్పటిరీతిగా వచ్చినవి. ఇప్పుడు మళ్ళీ ఇద్దరం పాటుపడుతున్నాము. అన్న వస్త్రాలకు కరువులేకుండా రోజులు గడుపుకుంటున్నాము. కాని అప్పుడు ఆయనకు బొత్తిగా కళ్ళు కనిపించకుండాపోయి, నేను పసిబిడ్డ తల్లినై బిడ్డ సంరక్షణ నిమిత్తమూ, ఇల్లు కదలటానికి వీలులేకుండా ఉన్న ఆ రోజులలో ఏ పూటకాపూట ఎంత కష్ట పడ్డాము! నిజంగా ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు కన్నుల గట్టినట్టవుతుంది ఆ దృశ్యం.

అది జ్యేష్ఠమాసం; ఎండలు గాడ్పులు బహుజాస్తిగా వున్నవి. ఆ ఎండ గాడ్పులెంత అధికంగా వున్నవో అంతకంటే అధికంగా ఉన్నవాయేడు ఇంటింటా వడుగులూ, పెండ్లిండ్లూ; దినదినమూ ఇరవై ముప్ఫై శుభకార్యాలైనా జరుగుతున్నాయి ఊళ్ళో. నిత్యమూ మంచి వస్త్రాభరణాదులు ధరించిన పురుషులూ, స్త్రీలూ మేళతాళాలతో పిలుపులకు తిరుగుతూనే వున్నారు. తెల్లవారితే ఆవూళ్ళో ఇరవై శుభముహూర్తాలైనా ఉన్నవట; అందువల్లనే పిలుపు మేళాలానాటి సాయంత్రం మరీ అధికంగా వినవచ్చినవి. ఆ మేళములు వినవచ్చినది మొదలు నేను మా కుటీర ప్రాంగణంలోనే నిలబడ్డా, ఏ తల్లియైనా రవ్వంత నొసట బొట్టుపెట్టి రమ్మంటుందేమోనని. రాత్రి ఎనిమిది గంటలైంది. నిలబడి నిలబడి కాళ్ళు గుదురుపట్టిపోయినాయి. ఒక్కరూ పిలిచిన పాపానపోలేదు, ఆ గొప్పవారి కళ్ళనూ కొద్దివారి కళ్ళనూ గొప్పగొప్ప మేడలూ భవంతులే ఆక్రమించు కొన్నవి. ఇక వాటిలో ఈ పూరి గుడిసెలకు తావెక్కడా? ఎంతసేపు చూచినా అన్నము ఉన్నవాళ్ళను పిలిచేవాళ్ళే గాని అన్నంలేని వాళ్ళను పిలిచేవాళ్ళెవరూ కన్పడలేదు. ఈ శుభకార్యాలు చేసేవాళ్ళలో ఇదేమి నీతో, ఇదేమి ధర్మమో తెలియదు. గొప్పవాళ్ళు గొప్పవాళ్ళనే పిలిచి మేపుతారు. కొద్దివాళ్ళూ గొప్పవాళ్ళనే పిలిచి మేపుతారు. కాని పెట్టడము యొక్క సార్థకత ఎక్కడున్నదో ఆలోచించినవారులేరు. ఆ భాగ్యవంతులకేమి?

దినానికి రెండుమార్లు కాఫీ ఫలహారాలూ, రెండుమార్లు వేపుడు కూరల భోజనాలూ. అటువంటి వారిని వీరు పిలిచినా ఒకటే, పిలవకపోయినా ఒకటే నిర్లక్ష్యం – పైగా పిలుపు అంతేనా అనీ, గౌరవించడం ఇంతేనా అనీ, పాటలు చిన్నవనీ, ఆకులు కుట్టుడాకులనీ, కూరలు రెండేనని, పిండివంటలు నాలుగేననీ, పెరుగు కటికి పులుపనీ, ఏవేవో వంకలు ఆదినుంచి అంతము దాకా పెట్టుతూనే ఉంటారు, తిన్నంతసేపు. అయితేనేమి? వాళ్ళను పిలిచి పెట్టి వాళ్ళ చేత నాల్గు మాటలు పడితేనే గాని ధన్యులము కామనుకుంటారు గదా ఈ లోకులు. దీనులనూ, దరిద్రులనూ పోషించాలి, రక్షించాలి అని ఎన్ని యుగాలనుంచో చదువుకుంటున్నదీ మనుష్యలోకం. కాని ఇది ఎప్పటికీ చదువుగానే ఉన్నది. ఆచరణలోకి మాత్రం రాలేదు. ఆచరణలోనే వచ్చినట్లయితే, ఆ గొప్పవారికి చేసే విందులు బీదవారికి చేసి వారిచేత దీవనలందకపోయినారా?

## 2

'నిద్ర సుఖమెరుగదు; ఆకలి రుచిఎరుగదు' అంటారుగాని, నిజంగా ఆకలి అభిమానం ఎరుగదంటే బాగుంటుంది. గొప్పవారిని పదిమార్లు పిలిచినా పోవడానికి బెట్టుచేసే ఆ భోజనాలకు మావంటి దరిద్రులు 'రావద్దూ రావద్దూ' అని నెట్టేస్తున్నా పోవడమెందుకు? ఈ ఆకలిచేతనేగా. ఈ మాయ ఆకలే మనుష్యులను పీక్కు తినకపోతే, ఈ లోకంలో ఇంత నైచ్యమూ, ఇంత దైన్యమూ ఉండకపోవడమే కాకుండా ఒకరితో ఒకరికి పనీ, ఒకరినొకరు అనుసరించుకొని ఉండడమూ ఒకరికొకరు లొంగి ఉండడమూ, ఈ కరవులూ, కలహాలూ, సమ్మెకట్లూ ఏమీ ఉండవు. అసలు బీదలు, భాగ్యవంతులూ అనే విచక్షణే ఉండదేమో అనుకుంటా లోకంలో.

ఆ రాత్రి ఇంట్లో గింజలు లేనందున కాళ్ళు కడుపులో పెట్టుకుని పడుకున్నాము, నేనూ నా పెనిమిటీ. అన్నం తినని తల్లివద్ద పాలెక్కడ నుంచి ఊరుతాయి? పాలులేక పిల్లవాడు తెల్లవార్లు ఏడుస్తూనే వున్నాడు. ఏడ్చినప్పుడల్లా కాసిని కుండలో మంచినీళ్ళు దాహం పట్టి తెల్లవార్చా. పొద్దున లేవగానే పిడికెడు నూకలుంటే గంజికాచి ఉప్పురవ్వ వేసి పిల్లవాడికి పట్టి పదకొండు గంటలైతే ఎక్కడికైనా భోజనానికి వెళ్ళడానికని పొద్దుచూస్తూ కూర్చున్నాము. ఎట్లాగో భోజనాల వేళైంది. పిల్లవాడినొకచేత నెత్తుకొని, ఆయన చేతికర్ర నొకచేత బట్టుకొని దోవచూపుతూ బయలుదేరాను పెండ్లిండ్లూ, వడుగులూ జరుగుతున్న ఇండ్లవెంట. మొదట తాసిల్దారుగారి ఇంటికి వెళ్ళాము, వారి

అమ్మాయి పెండ్లి అని. చాలా గొప్పవారితో సంబంధం చేసి మహావైభవంగా పెండ్లి చేస్తున్నారనీ విని ఉండడం చేత.

మేమింకా అల్లంత దూరంలోనే ఉన్నాము. యమభటుల వంటి జవానులు "ఏమమ్మోయి, ఎక్కడికీ గుడ్డివాడిని గూడా తీసుకుని బయలుదేరి వస్తున్నావు? వెనక్కు పద, ఇక్కడ వీలుగాదు" అని కేకలు పెట్టారు. "మీరే కోప్పడకండి నాయనా. అమ్మ గారితో మనవి చేసుకుంటాము. వారే పొమ్మంటే పోతా"మన్నాను నేను.

"అమ్మగారి ఉత్తరువే ఇది" అన్నారు ఆ జవాన్లు. "పోయి చూస్తాము. కాస్త పోనీండి బాబూ" అని మళ్ళీ వేడుకున్నాను. 'వల్లగాదు, పో" అన్నారు వాళ్ళు. వల్లగాదని వాళ్ళూ, కాస్త పోనీండని నేనూ ఇట్లా అనుకుంటూ ఉండగా, వారిలో ఒకడు "వల్ల గాదంటే వాదన చేస్తావేమి, తాకితే మళ్ళీ ఏడుస్తావు. పోపో; మాచేత తోపిళ్ళు తినకుండా మర్యాదగాపో. కోపం వచ్చెనా అంటే మీ బాపనోళ్ళమడి చూచేవాళ్ళంగా" దన్నాడు. "ఇస్, ఊరుకోరా; బీదవాళ్ళు పాపం" అని ఇంకోడు తిన్నగా మందలించాడు. ఇంతలో పైమేడమీదునుంచి జవాన్లను పిలుస్తున్నట్టుగా కేక వినబడ్డది. "అయ్యా అయ్యా" అన్నారు బంట్రోతులు మాతో వాదన చాలించి. "ఏమోయి, వీరాస్వామీ, రాఘవులూ, కోటయ్యా మీకిదే చెప్పడం. ఈ దరిద్రపు మూకను మాత్రం వాకిట్లో అడుగు పెట్టనీయకండి. ఇదుగో, కరణాలు, మునసబులు పంపిన కావలివాళ్ళు పీడించుకు తింటారు. ఈ దరిద్రపు సంచుకంతా ఎవరు పెట్టుతారు? ఎక్కడివాళ్ళను అక్కడ తరిమేయం" దన్న మాటలు వినబడ్డవి. చెప్పేదెందుకు, ఆయనే తాసిల్దారుగారు. గృహ యజమాని ఉత్తరువు అట్లా ఉన్నప్పుడు జవానులు మాత్రం ఏమి చేస్తారు? ఇక లోపలికి పోవడం అనవసరమని వెనుకకు తిరిగాను.

త్రోవలో "పిలవని ఇండ్లకు పోతే ఇంతే ఉదాసీనం" అన్నాను నేను నా భర్తతో. "నరులు మనలను పిలుస్తారా? నరులు పిలిస్తే వెళ్ళేవాళ్ళు ఊళ్ళో శ్రీమంతులు. మనం భగవంతుడు పంపిన అభ్యాగతులము" అన్నాడు నా భర్త.

## 3

ఇంజనీరుగారి బంగాళా ఊరివెలుపల ఎంతో దూరాన ఉన్నది. ఆరోజున వారి అబ్బాయి ఉపనయనమని వినివుండడం చేత అక్కడకన్నా పోదాం పదమన్నాడు నా భర్త. "అక్కడా జవాన్లు ఉంటారుగా. ఎక్కడికైనా జవాన్లు లేని ఇంటికి పోతే బాగుంటుం"

దన్నాను నేను. "జవాన్లు ఉంటే మాత్రం ఏమి చేస్తారు? యజమానిని బట్టే వాళ్ళూనూ. ఇంజనీరుగారు మహామంచివారట. అక్కడ జవాన్లు బహుశా ఏమీ అనరులే" అన్నాడు నా పెనిమిటి. ఎండ అధికంగా ఉండడమే కాకుండా, వేడిగాడ్పు కూడా సాగింది. కాళ్ళు కాలుతున్నవి. నెత్తి మాడుతున్నది. పిల్లవాడు ఎండకు వసివాడిపోతున్నాడు. ఎండ తగలకుండా పమిటకొంగు కప్పి నెమ్మదిగా ఆయనను కఱ్ఱ పట్టుకుని నడిపిస్తూ నడుస్తూ ఉంటే పమిటకొంగులో ఉన్న రాము గుడ్డ తొలగించి తొంగిచూస్తూ, మరల గుడ్డలో దూరి కిలకిలా నవ్వుతూ నాతో దోబూచిలాడటం మొదలుపెట్టాడు. దారిద్ర్య దుఃఖదావాగ్నిలో మాడిపోతున్న నా హృదయానికి శీతల తుషార బిందువు సోకినట్లైనదా దోబూచి.

బంగాళాకు చేరేటప్పటికి అరగంటకు పైగా పట్టింది. ఇంజనీరుగారు వాకిట్లోనే పచారు చేస్తున్నారు. ఆ చల్లని ప్రభువును చూస్తే కడుపు నిండినట్లుగానే ఉన్నది. జవానులు ఏమీ అనలేదు. చూస్తూ ఊరుకున్నారు. మహద్భాగ్యమనుకొని, రోడ్డుదిగి, సైడు కాలవ దాటించి తిన్నగా నా భర్తను దొడ్డివాకిట వంట పందిట్లోకి చేర్చాను. వడ్డన యత్నంలోనే ఉన్నారందరూ. ఏదోమూల నా భర్తను కూర్చోపెట్టుదామనుకుంటూ అటూ ఇటూ చూస్తున్నా. ఇంతలో ఒకామె ఇంట్లోంచి వచ్చింది. ఆమెకు ఒంటిమీద ఎక్కడ చూచినా రవ్వా కెంపు మెరుస్తున్నది. మెడ తిరగకుండా ఉన్నవి బంగారపు గొలుసులూ, నానుత్రాళ్ళూ, కాసుల పేరు, చుట్టు జరీపట్టుచీర కట్టుకోని ఉన్నది. నన్ను చూడగానే "ఎవరమ్మా నీవు? సరాసరి వంటపందిట్లోకే జొరబడ్డావు! ఈ గ్రుడ్డివాడెవడు? మీ తాలూకు మనిషేనా? ఆయనను తీసుకు పదా అవతల"కన్నది. "అమ్మా! ఏదో పేద వాళ్ళము" అన్నాను. "ఈ పేదతనానికేమిలే; కాస్త శుభకార్యం తలుచుకుంటే సరి, ఎక్కడనుంచో పుట్ట పగిలినట్టు తయారవుతారు" అన్నదామె.

"ఏమో అమ్మా, తాము లక్ష్మీకటాక్షం పొందిన వాళ్ళు గనుక తమ వాకిట పచ్చని తోరణం కట్టితే మావంటి దీనులకు సంబరం" అన్నాను.

"ఆ! ఈ ముఖస్తుతులకేమిలే, పదా" అన్నదామె. "అకాలమైపోయింది; అవిటివాడు; కరుణించండి" అన్నాను నేను.

"ఓహో! మాటలు చాలా నేర్చావే! ఆయన అవిటివాడైతే నీవేమి చేస్తున్నావు. దుంగలాగు? ఏమోయి, పాపయ్యా! మీకేమీ బుద్ధిలేదూ; ఈ సంచునంతా ఇట్లా వదిలేసి

ఊరుకున్నావు?" అన్నదామె. వెంటనే జవాను ప్రత్యక్షమై వంటపందిరిగావడం చేత కాబోలు. దూరంగా నిలబడి "రాండమ్మా ఇవతలికి" అన్నాడు. ఇంతలో ఇంజనీరుగారు లోపలికి వచ్చి, "ఏదో బీదవాళ్ళు అన్నమంటూ వచ్చారు, కాస్త పెట్టి పంపించూ" అన్నారు. "ఆ! మీకేమీ, అట్లాగే అంటారు. సాయంత్రం ఉద్యోగస్తుల బంతి పెందలాడే భోజనాలైతేగాని సాయంత్రపు పని చేసుకోడానికి ఉండదు. వచ్చిన వాళ్ళందరికీ పెట్టుకుంటూ కూచుంటే పని తెవులవద్దూ? పోనీండి; ఎక్కడో అక్కడ తింటారు. పోవమ్మా, పో" అన్నది. పాపము ఆయన మళ్ళీ మాట్లాడలేదు. ఆయనకు ఊళ్ళో పలుకుబడేగాని ఇంట్లో పలుకుబడి లేనట్టనిపించింది. రౌతు మెత్తనైతే గుర్రం మూడుకాళ్ళ నడుస్తుందిట. ఆమె మణిమయాభరణాలు బయటికే గాని లోపలికి వెలుగును ప్రసారించేవి కావు. లోపలగూడా వెలుగునిచ్చే మణి ఏదైనా ఆమె హృదయంలో ఉన్నట్లైతే పరిపక్వాన్నాలు దగ్గిర పెట్టుకొని అన్నము, అన్నము అని అల్లాడే ఆతురులకు లేదంటుందా? భాగ్యవంతుల రాత్రిబంతి భోజనాలకోసం బీదవాళ్లకు ప్రొద్దుటినుంచే అన్నము శూన్యం చేస్తుందా? ఏమైతే నేమి. మొగుడి మాటైనా పాటించకుండా నిర్దాక్షిణ్యంగా ఆమె మమ్మల్ని త్రోసేయించింది. మేము ఏ ఒక్కక్షణం ఆలసించినా అన్నం పెట్టవలసి వస్తుందని భయం కాబోలు. క్షణం నిలువనీయలేదు.

కళ్ళవెంబడి నీళ్ళు కారుస్తూ మళ్లీ రోడ్డుమీద నిలబడ్డాము. ఎండదెబ్బకాగలేక పిల్లవాడు చేతిలో నిలవకుండా ఏడవటం మొదలుపెట్టాడు, ఏమి చేయాలో తోచదు. ఎక్కడికి పోవాలో తోచదు. జగత్తంతా నిరాలంబంగా, నిరాశ్రయంగా, సర్వశూన్యంగా కనపడ్డది.

"ఏమే, ఎందుకే నిలబడడం? కాళ్ళు కాలుతున్నాయి. పోదాము పదా" అన్నాడు నా భర్త.

"ఎక్కడికి?" అన్నాను.

"ఓసి పిచ్చిదానా! ఎక్కడకంటావేమిటి? మన అన్నం ఎక్కడున్నదో అక్కడికీ"

"మీ వేదాంతం నాకర్థంకావడం లేదు. మనకు అన్నం ఎక్కడా లేదు. ఉంటే ఇటువంటి సంపన్న గృహాలలో మనకు పట్టెడన్నము దొరకక పోయ్యేదా" అన్నాను.

"నీకు తెలియదు, పదా ఇంకో ఇంటి"కన్నాడు నా పెనిమిటి.

"అక్కడా ఇంతే అయితే"

"అయితే ఇంటికే పోదాము" అన్నాడు.

"ఇంట్లో ఏమున్నదీ? ఇంట్లో ఏమన్నా ఉంటే ఇట్లా బయలుదేరుతామా?" అన్నాను.

ఇద్దరమూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాము. "ఓ భగవంతుడా! ఆ అదృష్టవంతులకు ఇంతటి ఐశ్వర్యమిచ్చాడు, బాగానే ఉన్నది. ఈ దరిద్రుల విషయంలో వీరి కష్టాలు ఇతరులు గ్రహించే అనుగ్రహమన్నా చూపగూడదా? ఒకరిపైన నీ దయారసం పొంది పొరలించి ఒకచోట పొడి తడియకుండా విరవిరలాడిస్తావే. ఏమి స్వామీ! ఈ దీనులు చేసుకున్న పాపం" అని కాసేపు క్షుదాక్షుభిత హృదయాలతో ఆ దేవుని గూర్చి మొర పెట్టాము. ఎంత మొత్తుకుంటే ఏమున్నది? ఊ! అంటాడా, ఆ! అంటాడా ఆ దేవుడు!

**4**

అదొక ప్లీడరుగారి ఇల్లు. వారి ఇంట్లోనూ పెళ్ళే. వాకిటినిండా పరజాలు కట్టి ఉన్నాయి. వడ్డన జరుగుతున్నది. అందరూ విస్తళ్ళ ముందరకూర్చుని ఉన్నారు. మేము గూడా ఎక్కడో ఒకచోట కూర్చుని భోజనం చేద్దామనే ఉద్దేశంతో పరజా ఒత్తిగించి లోపల నలువైపులా పరికించి చూచాను. అంతా నిండి ఉన్నారు. మరోవైపువెళ్లి చూచాను. అదృష్టవశాత్తు నాల్గు వడ్డించి ఉన్న విస్తళ్ళు కనపడ్డాయి. ఎవరైనా అక్కడ కూర్చున్నట్టు చెంబులైనా పెట్టి ఉండలేదు. ఇక ఇక్కడ అన్నం దొరికినట్టేనని సంతోషించి మా ఆయనను తీసుకొచ్చి ఒక విస్తరి ముందు కూర్చోబెట్టి, నేనూ ఒక విస్తరిముందు కూర్చున్నాను. విస్తట్లో అన్నం చూచి కేకిసలు కొట్టుకుంటూ దానిమీదకు దూకబోతున్నాడు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చిందో ఒక వితంతువు, సన్నగా మెరికెలా గున్నది. హృదయంలోని కాఠిన్యం పొడుచుకువచ్చినట్టు కనపడుతున్నది ఆమె ముఖాన. ఆమె గొంతు చించుకోడం చూస్తే ఆ యింట్లో ఆమెదే సర్వం సహాధిపత్యంగా కనపడు తున్నది. ఆమె మళ్ళీ జవాబుకైనా అవకాశం ఇవ్వకుండా, "ఎవరమ్మో నీవు, ఈయనొకా యనను దగ్గిర పెట్టుకొని కూర్చున్నావు. లే, లే, లే. అవతల పెద్దమనుష్యుల భార్యలు కూర్చునే తావులేక నిలబడి వున్నారు. లే, లే, తొందరగా" అని తొందరించింది. ఇక అక్కడ నిలవడానికి ఆదరువు లేక మా ఆయనను లెమ్మని, నేనూ లేచి, ఆయనను చేయి పట్టుకుని ఇవతలకు తీసుకొచ్చి, మరెక్కడైనా వీలుంటే కూర్చుందామని నలువైపులా చూస్తున్నా. "ఏమిటమ్మో, చూస్తున్నావు. మళ్ళీ ఎక్కడైనా కూర్చుందామనా? అసలిక్కడ

వీలుగాదు పదా బయటికి. గడప పచ్చన చేసుకోడం భయం, సిద్ధమౌతారు మాయగుంపు. ఎవరు పిలిస్తే వచ్చినట్టో, సిగ్గు, బిడియం లేకుండా. పదా బయటికి" అన్నదామె, మళ్ళీ వెంట తరిమి వచ్చి.

ఇంతమంది శ్రీమంతులు ఇన్ని శుభకార్యాలు జరుపుతుంటే ఒకచోట కాకపోతే ఒకచోటైనా మాకింత అన్నం దొరకక పోతుందా అన్న ఆశ అంతకు పూర్వం రెండు ఇళ్ళల్లో జరిగిన అనుభవం వల్లా నశించలేదు గాని ఈ వితంతువు చేసిన పరాభవంతో పూర్తిగా పోయింది. ఆమె మాటాడిన వీమాటలే అయినా పలుగుపోట్ల వల్లనైనా కలుగనంత బాధ కలిగింది. అసలే దారిద్ర్యం చేతా, ఆకలి చేతా, ఎండచేతా, దుఃఖం చేతా చివికి శిథిలమైపోయి ఉన్న మా జవసత్వాలు ఆమెగారి మాటలతో మరీ నశించి పోయినాయి. ఆమెగారి మాటలకేదో సమాధానం చెప్పవలెనని మనసు పీకులాడింది. కాని నోట్లోనుంచి మాట రాలేదు. ఆ పందిరిలో నుంచి తక్షణమే బయటికి రావలెనని ఎంత ప్రయత్నించినా కాళ్ళు తడబడడం చేత ఎంతసేపో పట్టింది. చంకలోనున్న నా బిడ్డ ఆ విస్తళ్ళలోని అన్నం వంక చేయిచాపి ముందుకు ఒరగబడ ఏడుస్తూనే వున్నాడు. ఏ ఉదాసీనపడైనా ఆ అన్నం తిని ఈ కడుపుమంట చల్లార్చుకుంటే బాగుండునని మా ప్రాణమూ పీకుతూనే ఉన్నది. కాని ఆ ఐశ్వర్యమదోన్మత్తులను, ఆ లోకానుభవ శూన్యులను, ఆ దాక్షిణ్యరహిత చిత్తులను 'ఆకలిగొన్న మాకు అన్నం పెట్టకుండా ఈ గొప్పవాళ్ళకు పెట్టడమే'మని నిలువదీసి అడగడానికి మాకేమి అధికారమున్నది. ఏడుస్తున్న బిడ్డను అక్కున అదుముకొని, నిర్విణ్ణుడై నిలబడిన భర్తను చేతబట్టుకొని, కనుల నిండిన కన్నీళ్ళు త్రోవను కనబడకుండా చేస్తుండగా, రెప్పలతో అప్పళించు కుంటూ బయటికి వచ్చాను. తిని పారవేసిన విస్తళ్ళలోని మెదుకులను కాకులు గుంపులు గూడి తింటున్నవి. ఆ ఎంగిలాకులు నాకడానికే కాబోలు కవ్వుకవ్వు మని కాట్లాడు కుంటూ అయిదారు కుక్కలు కూడా అక్కడే వున్నవి. ఆ ప్రహారీగోడకు ప్రక్కగానున్న చెట్టునీడను ఇకను తిని పారవేసే ఆకుల కోసం ఎదురుచూస్తూ యేనాది వాళ్ళయిదా రుగురు పిల్లజెల్లాతో పేలు చూసుకుంటూ కూర్చున్నారు. మేము బయటికి రాగానే ఒక యేనాదివాళ్ళ కుర్రాడు, పదహారేళ్ళవాడు మాకెదురుగా వచ్చి ''అమ్మగారూ! భోజనాలైనాయా?" అన్నాడు.

నేను కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ "లేదు ఇప్పుడే చేయబోతున్నారు" అన్నాను.

"అయితే మీరు వెళ్ళిపోతున్నారేమమ్మా" అన్నాడు.

"మాకు అన్నం పెట్టం అన్నా"రన్నాను.

"అయితే ఏమి జేస్తా"రన్నాడా పిల్లవాడు ఆత్రంతో. "చేసేదేమున్నది? ఇంటికి వెళ్ళుతాము" అన్నాను.

"వెళ్ళి ఇంట్లో అన్నం వండుకుంటారా?" అన్నాడు.

"వండుకోటానికి గింజలుంటే ఇట్లా ఎందుకొస్తాము నాయనా?" అన్నాను నేను.

"అయితే ఇంట్లో బియ్యము లేవూ? ఈ ఎండలో తిరిగి తిరిగి వెళ్ళి ఇంట్లో తిండి లేకుండా పడి వుంటారా?"

పాపం ఆ అనాగరీక బాలుడికళ్ళు నీళ్లతో నిండిపోయినాయి. నావంక మహాజాలిగా చూస్తూ మాతోనే నడుస్తూ "పాపం, ఆయనేమో గుడ్డివాడు, నీవేమో ఆడదానివి. ఈ పిల్లవాడి మూలంగా పనికీ పాటుకూ పోలేవు. అన్నం ఎట్లా వస్తుంది పాపం. ఆ బాపనోరు కలిగినోరికి పెట్టకపోతే మీవంటి అన్నంలేనివాళ్లకి పెట్టరాదూ" అని ఉపచార వాక్యాలు పల్కుతూ మా ఇంటిదాకా వచ్చి "ఇదేనా మీ ఇల్ల"ని వెళ్ళిపోయినాడు.

**5**

ఇంటికొచ్చి తలుపుతీసి చూసుకునేటప్పటికి పుట్టెడు దుఃఖం వచ్చింది. సర్వవస్తు సంపూర్ణంగా ఉన్నట్లయితే అదే భూతల స్వర్గం అనుకోవచ్చును గాని శూన్యగృహం చూస్తే ఏమి ఆనందంగా ఉంటుంది. పిల్లవాడు ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి త్రోవలో భుజం మీదనే నిద్రపోవడం చేత వాడినొక నులకకుక్కిమీద పడుకోబెట్టి, తాపం తీరేటట్టుగా కాళ్ళూ చేతులూ కడుక్కుంటారు గదా అని ఆయనకు చేదెడు నీళ్ళు తెచ్చి ఇచ్చి, నేనూ కాళ్ళూ మొఖమూ కడుక్కొని, ఆయనను లోపలకు తీసుకొని వచ్చి కూర్చోబెట్టి, నట్టింట కొంగు పర్చుకుని పడుకున్నాను నేను. మా దరిద్రావస్థ, ఆ భాగ్యవంతుల ధన మదాంధతలో పడి నిజంగా అన్నమని అడిగే వాళ్ళకు పెట్టకుండా భాగ్యవంతులకు విందులు చేసుకుంటూ ఆ శుభకార్యాలు చేసుకోడం, అన్నీ తలపుకు రావడం మొదలుపెట్టినాయి. అవి తలచుకున్న కొద్దీ మనస్సులో ఒకప్పుడు ఆశ్చర్యమూ, ఒక్కప్పుడు విచారమూ ఒకప్పుడు ఆగ్రహమూ, ఒకప్పుడు ద్వేషమూ సందడి చేయడం మొదలుపెట్టినవి. ఇంతకూ ఒకరిని పోయి అడగడం వల్లనే గదా ఇవన్నీ వచ్చినవి.

ఆహార విషయంలో నరులంత నిస్సహాయమైన జంతువులేవీ లేవు. ఇన్ని జీవరాసులను చూస్తున్నాము గదా. ఏవైనా ఆపూటకాహారము లేదని పస్తు పడుకోటం గాని, రేపటికని నిల్వ చేసుకోడం గాని చూస్తున్నామా? మానవులకే వచ్చింది యీ దురవస్థ. ఈ నిస్సహాయత. మానవులు వివేక సంపన్నులని కాబోలు వాళ్ళ విచక్షణకు వదిలిపెట్టాడు ఆహారం విషయం దేవుడు. మానవుల విచక్షణ ఇట్లు దుర్వినియోగం అవుతున్నది. అందుకు భగవంతుడేమి చేస్తాడు; వీళ్ళ బుద్ధి లోపంగాని. అబ్బా ఎంత భారమైంది ఈ మానవజన్మ! ఉండటానికి కొంప, తినడానికి తిండి, పక్వం చేసుకోడానికి పాత్రలు, కట్టుకోడానికి బట్టలూ, పడుకోడానికి పక్కలూ, ఒకటేమిటి. ఎన్నో కూర్చుకుంటేనే గాని ఈ మానవజన్మ వెళ్ళిపోదు. కుక్క తన బిడ్డయొక్క పోషణభారం నెలరోజులలో వదిలించుకుంటుంది. కాకి రెక్కలొచ్చిన వారం రోజులలో నీ ఆహారం నీవు తెచ్చుకోమని పంపేస్తుంది తన పిల్లను. ఈ మానవుడికో ఎన్నేళ్ళకూ రాదు, పోషించుకునే సామర్థ్యం. అందులో బీదవాళ్ళ పిల్లవాడైతే పదేళ్ళకైనా అక్కరకు వస్తాడు. భాగ్యవంతుల బిడ్డయితే పాతికేళ్ళకే. ఆ యేనాది పిల్లవాడు పాపం ఎంత ఆదరణగా వెంటాడి వచ్చి మాట్లాడినాడో! వాడి మాటలు చూస్తే కడుపు నిండినట్లయింది. ఇందుకే గదూ అన్నరసం కంటే ఆదరణరసం గొప్పదంటారు.

అని ఈ విధంగా పిచ్చిపిచ్చిగా ఆలోచించుకుంటూ నడుమనడుమ పరాభవాగ్నికి కుమిలిపోతూ, క్షుద్బాధకు కన్నీళ్ళు విడుస్తూ ఏదోలోకంలో ఉన్నా. అవతల పైపంచతో మొఖం తుడుచుకుంటూ, 'నారాయణ, నారాయణ' అంటున్నాడు నా భర్త. ఆ మాట చెవులబడగానే నాకు చుర్రుమన్నట్లయింది. "ఇకను ఆ నారాయణ పేరెత్తవద్దు. రాత్రింబవళ్ళు ఇంతగా తన్ను స్మరించబట్టే నానాటికీ కూటికీ గుడ్డకూ దూరం చేస్తున్నాడు. పెట్టీపోయని ఈ పక్షపాతపు దేవుణ్ణి స్మరించి ఏమిలాభం" అన్నాను.

నా పెనిమిటి ఒక్క నవ్వు నవ్వాడు, నా మాటవిని.

"నవ్వెట్లా వస్తున్న"దన్నాను నేను కోపంతో. "నీ పిచ్చి మాటలకు నవ్వక ఏమి చేయను! కష్టకాలంలో ఆ నారాయణమూర్తిని కాకపోతే మరెవ్వరిని తలుచుకుంటే శాంతి కల్గుతుంది? పాలముంచినా వాడే, నీటముంచినా వాడే" అన్నాడు నా పెనిమిటి.

"చాల్లెండి మీమాటలు! తినా, కుడవా ఉన్నవాళ్ళు కృతజ్ఞతగా ఆయనను తలుచుకున్నా బాగుంటుంది. మనమేమని ఆయనను స్మరించడం? నిర్దయుడై

మనలనంత కటిక దరిద్రులునుగా చేసిందేగాక ఊళ్ళో ఇన్ని శుభశోభనాలు జరుగుతుంటే ఏ ఇంటా పిడికెడన్నము దొరకకుండా చేసిన ఆ భగవంతుణ్ణి ఇంకా స్మరించు కోవాలనా? కంటికి కన్పడి చేతికి చిక్కితే ...” అని పండ్లు పటపటా కొరికాను కోపంతో.

“సరే అది మన కర్మం” అన్నాడు నా భర్త మరల.

“ఏమిటీ! మనకు సర్వసౌఖ్యాలు ఉంటే అది భగవంతుడి అనుగ్రహమా! మనకు ఏమీ లేకపోతే మన కర్మమా! కర్మమైతే రెంటికీ కర్మమే అనుకోరాదూ. మీరేమన్నా చెప్పండి, అసలు భగవంతుడు లేనేలేడు, ఉన్నట్లయితే ఇటువంటి ఆపన్నులను చూచి సహింపనే సహింపడు. లేడు, ముమ్మాటికీ లేడు” అన్నాను నేను. “ఛీ అట్లా అనబోకు దరిద్రనారాయణుడని ఆ జగద్రక్షకుడికి బిరుదైతే” అన్నాడు నా పెనిమిటి దృఢంగా.

“బిరుదులకేమి? మీవంటి అమాయకపు భక్తులు ఎన్ని బిరుదులైనా ఇస్తారు, వెర్రివెర్రిగా. గాని దేవుడూ లేడు, గీవుడూ లేడు. ఒకవేళ ఉంటే దయారసం గలవాడు కానేకాడు” అన్నాను, నా కడుపుమంట కొద్దీ.

ఇంతలో ఎవరో వస్తూ వున్నట్టుగా వాకిలి వైపు కాళ్ళ చప్పుడు వినబడ్డది. ఎవరో అని ఆలకిస్తూ ఉండగా,

“అమ్మగారూ” అన్న పిలుపు వినిపించింది.

‘ఎవర’ని చివాలున లేచి తలుపు తీశా.

యేనాది కుర్రవాడు.

“ఏమిరా?” అన్నాను.

“ఇదిగో బియ్యం తెచ్చా, చేట పట్టండి”

“ఎక్కడివి?” అన్నాను.

“బజారు నుంచి కొనుక్కొచ్చా” నన్నాడు.

“డబ్బో?” అన్నాను.

“నా దగ్గిర ఉంటే తెచ్చా” నన్నాడు.

“పాపం, నీకు మాత్రం ఎక్కడి” దన్నాను.

"పొద్దున దొరవారి గుఱ్రానికి గడ్డి చెక్కుకొస్తే పావలా ఇచ్చారండీ" అన్నాడు.

"మాకు ఇవ్వాళ ఎంగిలాకుల్లో అన్నం దొరుకుతుందిగా" అన్నాడు.

"ఇవ్వాళ వెళ్ళితే సరా, రేపో" అన్నాను.

"రేపు మళ్ళీ గడ్డి చెక్కుకొచ్చి పావలా సంపాదించనా" అన్నాడు. ఏమి ధైర్యం. వందలు వేలు సంపాదించిన ఆ శ్రీమంతులకైనా లేకపోయిందే ఈ ధైర్యం అనిపించి, "అయినా అబ్బాయీ, మీరైనా బీదవాళ్ళే, మీ కష్టార్జితం మాకెందుకు నాయనా?" అన్నాను.

"బీదవాళ్ళకే బీదవాళ్ళ కష్టాలు తెలిసేది; మీకెందుకు పట్టం"డన్నాడు.

ఇదేదో భగవత్ప్రేరితం అనుకున్నాను. ఒళ్ళు జలదరించింది. మాట్లాడకుండా చేట తెచ్చి ముందు పెట్టాను. చెరుగులో బియ్యం చేటలో పోశాడు. ఒకడుగు ముందు వేసి మళ్ళీ వెనక్కు తిరిగి, "అమ్మా, అన్నంలోకి ఏమైనా ఉన్నదా?" అన్నాడు. "కుండలో గోగుపచ్చడి ఉన్నదిలే" అన్నాను. క్షణం నిలవలేదు. రివ్వున వెళ్ళిపోయినాడు. నాకేమో భయమైంది. గుండెలు జల్లుజల్లుమన్నవి. శరీరం గగుర్పొడిచింది. ఆ అనాగరిక బాలుడి ముఖంలో ఏదో దయారసంతో గూడిన అపూర్వతేజం కనిపించింది. అదే గాబోలు భగవత్తేజం అనిపించింది. ఇంకాకాసేపు ఆ ముఖారవిందం సేవించకపోతినే అనుకున్నాను. కాని ఆ బాలమూర్తి ఒక్కక్షణం సేపైనా నిలిస్తేగా చూచేది? మా సంభాషణలంతా జాగ్రత్తగా వింటూవున్న నా భర్త "నే చెప్పలేదుటే, భగవంతుడు దరిద్ర నారాయణుడని" అన్నాడు.

"ఔనౌను" అని చెంపలు వేసికొని చేతులు జోడించాను.

## కథానేపథ్యం ...

మన స్వాతంత్ర్యోద్యమంలో సంఘ సంస్కరణం కూడా ఒక ప్రధానమైన ప్రబోధం. సమాజంలో వివిధ సాంఘిక వర్గాల మధ్య సమానత్వం రాకపోతే స్వాతంత్ర్యోద్యమం ఫలప్రదంకాదనీ, స్వాతంత్ర్యం వచ్చినా సాంఘికాసమానతలు హానికరంగా పర్యవసిస్తాయనీ, ఐకమత్యమూ, సమానత్వమూ మాత్రమే ప్రజాస్వామ్యానికి ఉద్దీపకరం కావాలని మన దేశనాయకులు, ఉద్యమకర్తలు రాజకీయ ప్రబోధంతోపాటు, సంస్థాగతమైన కార్యాచరణతో సామాజిక వర్గాలను ఆ కాలంలో ప్రబోధించేవారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో హరిజనులను గూర్చి, అంటే అంటరానివారని అప్పటిదాకా వెలిబెట్టినవారిని ప్రధాన స్రవంతిలో కలుపుకోవాలని ముమ్మరంగా ప్రయత్నించారు. వారికి చదువు సంధ్యలు, జీవనోపాధి సమకూర్చటానికి కవులు, రచయితలు, సాంఘిక ప్రబోధకులు ఉపన్యాసాలు, రచనలు ఆదర్శంగా నిర్వహించేవారు. హరిజన సమస్యవంటిదే మహిళల విద్యావికాసాభివృద్ధి కూడా ఆనాడు. పురుషుడు స్వాతంత్ర్యోద్యమంలో కుటుంబాన్ని త్యజించి, జైలుపాలై, ఉద్యమశీలతతో దేశ సంచారం చేస్తున్నప్పుడు మహిళ విద్యా వికాసాలతో, స్వయంశక్తి, పరిస్థితుల గూర్చిన అవగాహన పెంచుకోవడానికి మహిళకు మానసిక వికాసం., స్థైర్యం, అవసరమని ముందుచూపుతో కొందరు మహిళలు సేవా సదనాలు స్థాపించి, కథలు, జీవిత చరిత్రలు, లేఖా శీర్షికలు రాసి మహిళాభ్యుదయానికి తోడ్పడ్డారు. ఇటువంటివారిలో కనుపర్తి వరలక్ష్మమ్మగారు ముఖ్యులు. వీరి నివాసస్థానం బాపట్ల.

# 40. సుదర్శనరావు పంతులు

*– చిలకమర్తి లక్ష్మీనరసింహారావు*

ఈయన మాధ్వ బ్రాహ్మణుడు, రమారమి డెబ్బది సంవత్సరముల క్రిందట యీయన గోదావరి జిల్లాలో నరసాపురమున డిప్యూటీ కలెక్టరుగ నుండిరి. ఈయన మిక్కిలి న్యాయమైన ఉద్యోగస్థుడు. ఇటువంటివారినే మనవారు అగ్నిహోత్రమందు ఒక కాలును, మంచి గంధమందు ఒక కాలును పెట్టి పరిపాలించిరని చెప్పుదురు. ఈయన కలలోనైన లంచమెరుగరు. సిఫార్సులు విని న్యాయం తారుమారు చేయుట జన్మ మధ్య మందు లేదు. ముక్కుకు సూటిగ పోయి న్యాయమెట్లో అట్లు చేసెడివారు. అజమాయిషీ నిమిత్తం గ్రామములో వెళ్ళినప్పుడు సరుకులు పంపుమని గ్రామస్థులను పీడించక తన సొంత డబ్బుతో కావలసిన వస్తువుల నన్నిటిని క్రయమునకు తీసుకొని ఎవరైన దర్శనమునకు వచ్చి నప్పుడు హిందువుల మర్యాదయగుటచే నొక్క నిమ్మపండు పుచ్చు కొనుటయే గాని చక్కెరకేళీ అరటిపండ్లు గెలలు గాని, మామిడి పండ్లబుట్టలుగాని స్వీకరించుటలేదు. సవారి బోయలను గ్రామస్తులు వెట్టికిగాను బంపినప్పుడు వారి యెడల జాలిగొని పంతులుగారు కష్టమునకు తగిన కూలివారికిచ్చి పంపుచుండెడివారు.

మన హిందువులలో శ్రార్ధములు మూడు విధములు. మొదటిది అన్నశ్రార్ధము; అది పితృదేవతల తృప్తికై బ్రాహ్మణులను బిలిచి పిండివంటలతో వారికి భోజనం పెట్టుట. రెండవది ఆమశ్రార్ధము, ఆమమనగా పచ్చివస్తువు అనగా బ్రాహ్మణులకు పొత్తర లిచ్చుట. మూడవది హిరణ్యశ్రార్ధము; ఇది అన్నశ్రార్ధముగాని, ఆమశ్రార్ధముగాని చేయుటకు వీలులేని పక్షమున బ్రాహ్మణులకు కొంత సొమ్మిచ్చి శ్రార్ధము పెట్టుకొనుట. ఈ శ్రార్ధము పితృదేవతల విషయముననేగాక ఉద్యోగస్తుల విషయమున గూడ మన దేశమున జరుగుచున్నది. గొప్ప ఉద్యోగస్తుడు గ్రామములోనికి వచ్చినప్పుడు తాబేదారులు వీనిని మిక్కిలి గౌరవించి ఆ ఉద్యోగస్తునకు భోజనం చేయుట కిష్టము లేనప్పుడు బియ్యము, పప్పులు, కూరలు, నెయ్యి, పెరుగు, పాలు, పండ్లు మొదలయిన సరుకులు పంపుదురు. యిది ఆమశ్రార్ధమని చెప్పవచ్చును. ఇదిగాక కొంతధనం గూడ

గ్రామస్తులు సమర్పించుకొందురు. ఇది హిరణ్యశ్రార్ధమని చెప్పవచ్చును. సుదర్శనరావు పంతులుగారు పై మూడు విధములయిన శ్రార్ధములలో భోక్తగా యుండలేదు. ఈయన పరిపాలనను గురించి కొన్ని చిత్రకథలు గలవు.

ఈయన రైతులు మాట్లాడినట్లు, పంచములు సంభాషించునట్లు, తురకలు వచించినట్లు, శుద్ధవైదికులు మాట్లాడినట్లు మిక్కిలి చమత్కారముగ మాట్లాడగలరట. అట్టి పరిస్థితులకు దగినట్లే దుస్తులు గూడ ధరింతురట. ఆ కాలముననొక తహసీల్దా రుండెనట. ఆయన పెద్ద లంచగొండి. ఆయన రెండు చేతులతో వ్రాయగలడు. రెండు చేతులా లంచము పుచ్చుకొనగలడు. ఆయన వేలకొలది యార్జించి చాలా భూములు సంపాదించెను. మేడలు, మిద్దెలు కట్టెను. డిప్యూటీ కలెక్టరుగారి భార్యకు పట్టుమని వెయ్యి రూపాయల నగలయిన లేవు. తహసీల్దారు వారి ధర్మపత్నికి నాలుగువేల రూపాయల నగలుండెను. తహసీల్దారువారు నేరములు విచారించినప్పుడు ఫిర్యాది వద్దను, ముద్దాయి వద్దను గూడ లంచము తీసుకొనును. ఒక నేరములో ముద్దాయికి శిక్ష వేయుదునని ఫిర్యాది వద్ద నూరు రూపాయలు లంచము తీసుకొనెను. నేరం కొట్టి వేయుదునని ముద్దాయి వద్ద రెండు వందల రూపాయలు తీసుకొనెను. చివరకు తీర్పులో ముద్దాయికి పాతిక రూపాయలు జరిమానా విధించెను. అప్పుడు ఫిర్యాది వచ్చి “ఏమండయ్యా, ముద్దాయికి ఖైదుశిక్ష విధిస్తానని నా వద్ద నూరు రూపాయలు తీసుకొన్నారుగదా? వట్టి పాతిక రూపాయలు జరిమానా విధించి ఊరుకొన్నారేమి” అని యడిగెను. అందుకు తహసీల్దారువారు యిట్లు బదులు చెప్పిరి –

“ఓయి మూర్ఖుడా! ఖైదయితేనేమి? జరిమానా ఐతేనేమి? రెండూ శిక్షలే! జరిమానా చెల్లించకపోతే పదిహేను దినములు ఖైదు అనుభవించవలెనని తీర్పు వ్రాసినాను. జరిమానా మచ్చ యావజ్జీవముండును గదా?”. ముద్దాయి వచ్చి “కేసు కొట్టి వేయుదునని నా వద్ద రెండువందల రూపాయలు పుచ్చుకొన్నారుగదా? మరల నాకు యిరువది ఐదు రూపాయలు జరిమానా విధించినారేమి” యని యడిగెను. “ఓయీ! యీ నేరము నాలుగైదు మాసములు ఖైదు విధించవలసిన నేరము. రెండు వందలిచ్చినావు గనుకనే పాతిక రూపాయలతో తీర్చివేసినాను. అది నీవియ్యనక్కర లేదు” అని చెప్పి వానిని పంపి తానే జరిమానా వానికి బదులు కచ్చేరీలో కట్టివేసెను. ఆయన నిరతాన్నదానం చేసెడివారు. భోజనం వేళల పంక్తిని కూర్చున్నవారితో నిష్ఠాగోష్ఠి సంభాషణ జేయుచు ఆ కరణము ధాన్యము పంపుతానని పంపలేదు. ఈ మునసబు ఆవులను బంపలేదు అని ముచ్చటించుచుండెడివాడు. ఆ ముచ్చటలు వినుటకై

సుదర్శనరావు పంతులుగారు పేద బ్రాహ్మణుని వేషము వేసుకొని వారి పంక్తికి రెండుమూడుసార్లు భోజనం జేసిరట. సుదర్శనరావుగారు పల్లెటూరు రైతు వేషము వేసుకొని కలెక్టరుగారి గుమాస్తాల యిండ్లకుపోయి అరుగులపై గూర్చుండి ఆ గుమాస్తాల గుట్టుమట్టు తెలుసుకొనుచుండును. ఒక గుమాస్తాతో ఒక రైతు "బాబూ! పాతిక రూపాయిలు యిచ్చుకొంటాను. అంతకన్న నేనిచ్చుకోలేను" అని మొఱ పెట్టుకొనుచుండెను. "ఛీ! యాబది రూపాయిలకు తక్కువ పుచ్చుకొనను, లేని యెడల నీకు శిక్షపడు"నని కఠినముగ జెప్పెను. సుదర్శనరావు పంతులుగారు ఆ యరుగు మీద గూర్చుండి యా సంభాషణ యంతయు విని మరునాడు కచ్చేరీకి వెళ్ళి ఆ నేరములో నున్న రైతును బిలిచి "నీకు భయము లేదు, నిన్నరాత్రి గుమాస్తాగారి యింటివద్ద జరిగిన సంభాషణ ఏమిటో చెప్పుము" అని యాజ్ఞాపించెను. కలెక్టరుగారి యండజూచుకొని యతడు నిర్భయముగ యా సంగతినంతను జెప్పివేసెను. అప్పుడు పంతులుగారు ఆ గుమాస్తాను బిలిచి ప్లీడరు యెదుట తక్కిన గుమాస్తాల యెదుట వానిని గట్టిగ చీవాట్లు పెట్టెను. అతడు సిగ్గుపడి తలవంచుకొనెను.

ఈయన మారువేషము వేసుకొని గ్రామమంతయు తిరిగి యీ రహస్యములు తెలుసుకొనుచున్నాడన్న సంగతి యెరుగక ప్రజలీతని యొద్ద కర్ణపిశాచియో, మరియే శక్తియో కలదని తలంచుచుండిరి. నరసాపురములో మాలపల్లెలో నొక నరహత్య జరిగెనట. మేజిస్ట్రేటు, పోలీసువారు మిక్కిలి శ్రమపడినను నేరస్థుడు దొరకలేదట. ఆ సత్యము కనిపెట్టవలెనని పంతులుగారొక చమత్కారము చేసిరట. ఆ మాలపల్లెలో నొక చుట్టల దుకాణముండెనట. రాత్రి బదిగంటప్పుడు పంతులుగారు మాలవాని వేషము వేసికొని చుట్టలకై వెళ్ళినట్లు ఆ దుకాణము వద్దకు వెళ్ళి కూర్చుండి, యక్కడ జేరిన వారి సంభాషణలు వినుచుండెను. ఆ సంభాషణలలో నక్కడ జేరిన మూర్ఖులు చెడత్రాగి యొడలు తెలియక ఫలానివాడు ఫలానివానిని చంపినాడుగదా? ఎవరు పట్టుకొనగలిగిరి? అని వారిలో వారు చెప్పుకొనజొచ్చిరి. అది విని యా పేరు జ్ఞాపకముంచుకొని పంతులుగారు పోలీసువారిని బిలపించి, యా రహస్యం చెప్పి నేరస్తుని పట్టుకొమ్మని చెప్పిరి. ఈ విధముగ సుదర్శనరావు పంతులు సత్యం తెలుసుకొనుటకై బహు శ్రమలు పడిరి.

ఆ కాలములో నిప్పటి రాజోలు తాలూకా నరసాపురం తాలూకాలో ఒక భాగముగ నుండెను. అంతర్వేది పుణ్యక్షేత్రము నరసాపురం తాలూకాలో జేరి యుండెను. ప్రతి సంవత్సరము మాఘమాసమందు శుక్ల పక్షమున నేకాదశీ దినమున నచ్చట ప్రధాన

దేవతయైన నరసింహస్వామివారి కళ్యాణం జరుగుచుండును. నేరములు జరుగకుండ జేయుటకును ప్రజల సౌఖ్యములకును నరసాపురము నుండి పోలీసు సిబ్బందియు, తహసీల్‌దారువారును, డిప్యూటీకలెక్టరును నాలుగు దినములు అక్కడ మకాము జేసియుందురు. అంతర్వేది చిన్నగ్రామం. పట్టుబడ్డ దొంగలను బంధించుటకు స్టేషను మొదలయినవి లేవు గనుక దొంగలను, నేరస్తులను పట్టుకొని తాటియాకు పందిళ్ళ కింద పొడుగుపాటి దూలములకు కన్నములు పొడిపించి దొంగల కాళ్ళు అందులో పెట్టి బొండవేసి యుంచి ఉత్సవములయిన తరువాత వారిని నరసాపురము తీసుకొని పోయి శిక్ష విధించుచుండెడివాడు.

జనసమ్మర్దము ఎక్కువగా నుండుటచే గ్రామములోను నదీ స్నానమునకు పోవుదారిలో నున్న మైదానములోను తీర్థవాసులిష్టము వచ్చినచోట కాలకృత్యములు తీర్చుకొనరాదని కలెక్టరు వారాజ్ఞాపించిరి. దుర్వాసన బయలుదేరకుండుటకై వారీపని జేసిరి. యాత్రస్తులలో యెవరో యొకడు తెలివితక్కువగా చేయకూడనిచోట అల్పాచమానము అధికాచమానము చేసినప్పుడు కానిస్టేబులు వానిని పట్టుకొని పావలోబేడో లాగి వదులుంచుచుండెడివాడు. ఒకనాడు సుదర్శనరావు పంతులుగారు భుజము మీద దర్భాసనము వేసుకొని చిన్న యంగవస్త్రము కట్టుకొని తలకొక ప్రాత శాలువ చుట్టుకొని మొగమున వీబూది పిండికట్లు పెట్టి ఇత్తడి బుడ్డి చెంబు యొక యంగవస్త్రమునకు ముడివైచి నడుముకు జుట్టుకొని ఒక కానిస్టేబులు చూచుచుండగా నొకచోట లఘుశంకకు కూర్చున్నట్లభినయించెను. అప్పుడా పోలీసు భటుడు పేద బ్రాహ్మణుడనుకొని చేయి బట్టుకొని లేవదీసి సుదర్శనరావు పంతులుగారిని ఆనవాలు పట్టలేక 'పద పోలీసు ఇన్‌స్పెక్టరు గారి వద్దకు పద' యని నెట్ట నారంభించెను. అప్పుడు సుదర్శనరావుగారు 'బాబు బాబు! బుద్ధిలేక చేసినాను క్షమించండి' యని బ్రతిమాలు కొనెను. అప్పుడు కానిస్టేబులు 'అలాగు పనికిరాదు. డిప్యూటీ కలెక్టరుగారు చండ శాసనుడు; అసాధ్యపు ముండాకొడుకు, నిన్ను విడిచిపెట్టుటకు వీలులేదు" అని చెప్పెను. సుదర్శనరావుగా రొంటినుండి యొక అర్ధరూపాయి తీసి కానిస్టేబులు చేతిలో బెట్టెను. అప్పుడు దైవవశమున ఇనస్పెక్టరుగారు ఆ దారిని బోవుచు సుదర్శనరావు పంతులుగారి మొగము ఆనవాలు పట్టి దగ్గరకు బోయి దండము పెట్టి నిలువబడెను. అప్పుడు సుదర్శనరావుగారు 'చూడవయ్యా నేను పొరబాటుచే లఘుశంక చేసినందుకు అర్ధరూపాయి యిచ్చినను వదలనంటున్నాడు మీ కానిస్టేబులు'. ఆ పలుకులు విని యినస్పెక్టరు 'కలెక్టరురా, నీయమ్మ కడుపుకాలా' అని మందలించెను. అప్పుడు

కానిస్టేబులు కలెక్టరుగారి రెండు కాళ్ళూ పట్టుకొని క్షమింపుమని బ్రతిమాలుకొనెను. కాని కలెక్టరు వారు వాని నడతను గురించి పోలీసు అధికారులకు తెలియజేసిరి. అంతట నాబంటు ఉద్యోగము పోయెనట.

నరసాపురం తాలూకా తహసీల్‌దారువారు ఘోరముగ లంచములు పుచ్చుకొనుటచే సుదర్శనరావు పంతులుగారు అతనిని గురించి పై యధికారులకు తెలియజేసి తాలూకా నుండి మరియొక తాలూకాకు బదలీ చేయించిరట. ఆయన తురకభాష మాటాడినప్పుడు విన్నవారు ఆయనను అచ్చముగ తురకయే యనియు, శూద్రుని మాట మాట్లాడినప్పుడు శూద్రుడే యనియు అనుకొనవలసినదే. ఇటువంటి ప్రతిభాశాలియు, సత్యాన్వేషణ ప్రియుడును, న్యాయమార్గ ప్రవర్తకుడును తరుచుగ నుండడు. అట్టి వారెచ్చట అధికారము చేయుదురో యా ప్రజల యదృష్టము మంచిది. సుదర్శనరావు పంతులుగారు నరసాపురము నుండి వెళ్ళి పింఛను పుచ్చుకొన్నప్పటికి, వారి చిత్ర చరిత్రలు జనులు చిరకాలము చెప్పుకొనసాగిరి.

## కథానేపథ్యం ...

గ్రాంథికానికీ వ్యవహారికానికీ ఉన్న సరిహద్దును సాధ్యమైనంతవరకు ఆయన తొలగించారు. సాహిత్యం సమాజ ప్రయోజనాన్ని, ప్రబోధాన్ని లక్ష్యం చేసుకోవాలని ఆశించిన వీరేశలింగం పంతుల సాహిత్య కృషిని మరింత కళాత్మకంగా సాధించినవాడు చిలకమర్తి లక్ష్మీనరసింహం. ఈ కథ ఒక చిత్రకథ. దేశమాత పత్రికలో ప్రకటితమైనట్లు స్వీయచరిత్ర సాక్ష్యాధారాల వల్ల తెలుస్తున్నది. అప్పట్లో ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనం సహజహక్కు అన్నంతగా చలామణీ అవుతుండేది. ఆ దుర్మార్గాన్ని చాకచక్యంగా వెల్లడించేవారు వీరేశలింగంపంతులుగారు. ఆ అడుగుజాడలే అనుసరించారు చిలకమర్తి ఈ కథలో. సుమారు నూరేళ్ళక్రితం రాసినదీ కథ. 1910–15 మధ్య కాలంలో వెలువడి వుండవచ్చు. ఈ కథలో అప్పుడే కొత్తగా ఏర్పాటైన కోర్టులు, పోలీసు వ్యవస్థ, పరిపాలన పద్ధతులు ఏ విధంగా ప్రజలను వంచిస్తూ వచ్చేవో హాస్య, వ్యంగ్య ధోరణిలో చిత్రించారు చిలకమర్తి.

# 41. కరుణకము

– వేటూరి ప్రభాకరశాస్త్రి

కృష్ణాజిల్లా మొవ్వ అని ఒక గ్రామమున్నది. ఆంధ్రదేశమందు వేణుగోపాల పదాలు వినని, విని ఆనందించని, రసికులు అరుదుగా ఉంటారు. సంగీత సాహిత్యములు ఆ వూరి నీరు తాగితే పట్టుపడునని పూర్వము పెద్దలు చెప్పుకునేవారు. ఇప్పుడట్టి దేమీ తెలియరాదు. కృష్ణకాలువ వచ్చి ఆ భూమి మాగాణి కావడము చేత నీటి గుణము మారినదని అక్కడి వారంటారు. కాబోలును! పూర్వకాలమక్కడ సంగీత విద్వాంసులనేకులు ఉండేవారట.

ఆ ఊరికి చేరుకునే కూచిపూడి అని ఒక గ్రామమున్నది. ఆ వూరి వారందరు భాగవతము లాడుదురు. వీధినాటకాలలో వారిది పెట్టిన పేరు. సిద్ధేంద్రులని యోగీంద్రు లొకరు ఆ వూరివారికి ఆ విద్య నేర్పినారట! పారంపర్యముగా ఆ విద్యనే వారభ్యసించి నట్లు కూడా విధించినారట. ఇప్పటికీ అక్కడ అట్లే జరుగుతున్నది. పయి రెండు గ్రామములు చేరువగా ఉండటముచేత ఆవూరివారి విద్య ఈ వూరివారికి, ఈ వూరివారి విద్య ఆవూరివారికి అంటుతూ కూడా ఉండేదట పూర్వకాలమున. నేనిప్పుడు చెప్పబోయే కథలోనివారు హరి రామయ్యగారొక్కరు తప్ప ఈ మధ్యకాలములో మొవ్వలో సంగీత విద్వాంసులు మరెవ్వరూ లేరు. హరి రామయ్యగారని అక్కడ ఒకరున్నారన్న సంగతి, ఆయన గొప్ప సంగీత విద్వాంసుడన్న సంగతి, ఈ కథ ముగిసిన తర్వాతనే ఇప్పటి వారికయినా తెలుస్తుంది.

రామయ్యగారు 1860 ఆ ప్రాంతముల జన్మించి ఉందురు. ఆయన పసితనము నాటికి తెలుగుదేశమున త్యాగరాజకృతులంతగా వ్యాపించలేదట. అప్పుడు అష్టపదులు, తరంగాలు, తాళ్ళపాకవారి పదాలు, తంజావూరి పదాలు మొదలయినవి హెచ్చుగా పాడేవారట! మనము విని యెరుగముగాని హరి రామయ్యగారు బాల్యములో బహు ప్రఖ్యాతిగా వీణ వాయించేవారనీ, పాడేవారనీ, ఎరిగిన వారివల్ల విన్నాను. దీనికి నమ్మకముగా ఈ క్రింది కథ కూడా విన్నాను. మైసూరు నుంచి వీణ సాంబన్న గారని ఆ

కాలములో ఒక మహా విద్వాంసుడు ఆంధ్రదేశమునకు వచ్చి బందరు మొదలయిన చోట్ల శిష్యబృందముతో కొన్ని మాసములుండి, అనేక గాన సభలు జరిపి బహుకీర్తిని, బహుధనమును సంపాదించుకొని వెళ్ళినాడట! ఆయనను గూర్చి అద్భుతముగా చెప్పుకొంటారిప్పటికీ కొందరు. బందరులో ఒకసారి ఆయన గానసభ జరుగుతూ వుండగా ఒక డిప్టీకలెక్టరు మీసములు మెలుపుతూ నడుమ అందుకొని "అయ్యా! ఫలాని రాగము వాయించండి" అని అడిగినాడట! అమృతవర్షమన్నట్లు నేనీ రాగము హాయిగా వాయిస్తూ ఉంటే అనుభవించి ఆనందించలేక ఇంకేదో రాగము వాయించమంటాడేమి అజ్ఞానుడు అని కోపించుకొని వీణ శ్రుతి తప్పించి క్రిందపెట్టి "ఈ సాంబడి పాట ఆ సాంబడు వినవలెగాని నీవు వినేదేమిటి, పో, పో"మన్నాడుట ఆ సాంబన్న గారు. అటువంటి సాంబన్నగారు మన హరి రామయ్యగారి వీణాగానము విని ఆనంద పరవశుడై కౌగిలించుకుని "అసాధారణమైనది నాయనా నీ పాండిత్యము" అని అభినుతించి నాడట! ఆ సాంబన్నగారే రామయ్య గారిని మైసూరికి పిలుచుకొని పోయి మహారాజు గారి దర్బారులో పాట కచ్చేరీ పెట్టించి గొప్ప సత్కారము జరిపించినాడట! మహారాజుగారప్పుడు రత్నాంకితములైన కడియములు, దుశ్శాలువలు, జిలుగు బంగారు సరిగెపనిగల తలగుడ్డ, అంగీ, వగైరాలు ఇచ్చి సమ్మానించినారట! ఇది మన పుట్టుకకు పూర్వపు ముచ్చట.

ఇటీవల దారిద్ర్యముచేత మురుగుల జత కరిగించుకొన్నారట. కాని పెట్టె చీకుళ్లయి చిమటపోట్ల తూట్లతో ఉన్న శాలువులను, అంగీ తలగుడ్డలను అప్పుడప్పుడు రామయ్యగారు ఎండలో ఆరబెట్టుతూ చక్క పరుస్తూ ఉండడం అనేకులెరుగుదురు. ఇంత ప్రఖ్యాత విద్వాంసుడయిన రామయ్యగారి కథ యిర్వైయైదేండ్ల నుండి తార్మారు కాజొచ్చింది.

ఆయనకొక్కర్తే కుమార్తె. మంచి గారాబముతో కూతుర్ని పెంచినాడు. తన పాండిత్య గౌరవమునకు తగినట్టు ఉండవలెనని తాహతుమించి మంచి కట్నమిచ్చి గొప్ప సంబంధము కుదిర్చినాడు. పెద్ద వైభవముతో పెండ్లి చేసినాడు. ఆ పెండ్లికి చెన్నపట్నమునుంచి గొప్ప సన్నాయిపాటగాళ్ళు వచ్చినారు. ఇంకా సంగీత విద్వాంసు లనేకులు వచ్చినారు. వారి వారికి ఆయన గొప్ప సమ్మానములు జరిపినాడు. ఇంతయెత్తుతో వివాహము జరపడమునకు తగినంత ద్రవ్యము ఆయన చేతిలో లేదు. మూడెకరాల మాగాణే ఆయనకున్న భూవసతి. తన పాండిత్య ప్రాభవమును విశ్వసించి, అప్పు చేసి ఆయన అంత గొప్పగా పెండ్లి చేసెను. పెద్దపెద్ద చోట్ల నాల్గు కచేరీలు జరిపి

అవలీలగా అప్పు తీర్చుగలుగుతానని అనుకున్నాడు. ఆయన తలపు అట్లావుంటే దైవము తలపు అన్యథాగా ఉండెను. పెళ్ళి అయి నెల తిరగకముందే ఆ అల్లుడు అంతరించి నాడు. అయ్యో! ఆయన కథ అడ్డము తిరగడానికిదే ఆరంభము! కూతురి దుఃఖము పెద్ద కడుపుకోతగా ఆయన కేర్పడ్డది. ఆ కష్టముతో మనస్సు చీకాకై చెడగా ఆయన రెండు మూడేళ్ళు ఇల్లు విడిచి పదచలనము చేయలేదు. చింతతో చివికి పోయినాడు. అప్పు పెరిగినది. పొలముమీది రాబడి బువ్వకు అంటీ అంటకుండా వున్నది. చిక్కులలో చిక్కుకొన్నాడు. ఆ కాలమున ఆయన ఘనత ఎరిగినవారు సంగీత స్వారస్యము బాగా తెలిసినవారు పలువురు ఉండేవారు. ఆయనకు కలిగిన ఆపదను గూర్చి చింతిస్తూ తగిన తోడ్పాటు జరుపుటకు యత్నిస్తూ ఉండేవారు.

ఇట్లా ఉండగా ఆ కాలమున బందరులో ఒక గొప్ప షాహుకారింట్లో వివాహము వచ్చినది. జమీందారీ యెత్తున ఆ వివాహపు యేర్పాట్లు జరిగినవి. ప్రాజ్ఞులందరు ఆలోచించి ఆ పెండ్లికి హరి రామయ్యగారి పాట కచ్చేరీ నిర్ణయించినారు. అప్పుల వాళ్ళు ఒత్తిళ్ళచేత రామయ్యగారందుకు ఒప్పుకున్నారు. మూడు నూటపదహార్లు ఇచ్చేటట్లు ఏర్పాటు జరిగినది. అప్పటికింకా గ్యాసులైట్లు ఆ ప్రాంతముల వ్యాపించలేదు. మదరాసునుండి అప్పుడే ఆ పెండ్లికి తొలిసారి వాటిని తెప్పించినారు. ఆ పెండ్లినాటి సాయంకాలము హరి రామయ్యగారి పాట కచ్చేరికి అనేకులు వచ్చిరి. గ్యాసులైట్లను వెలిగించిరి. రామయ్యగారు వీణశ్రుతి దిద్ది వాయింప నారంభించినారో లేదో వెలిగించడములో ఏదో అసందర్భము జరిగి అంతలో గ్యాసులైటు ఒకటి పగిలినది. పందిరికి మంటలు అంటుకొన్నవి. పెండ్లికుమార్తెకు, మరికొందరికి ఒళ్ళు కాలి అమంగళము జరిగినది. దానితో రామయ్యగారి పాట అమంగళపుపాట అని దుప్ప్రతీతి పుట్టినది. రామయ్యగారి ప్రఖ్యాతి ముందర పేరెత్తజాలని వారెవరో సంగీత విద్వాంసులు యీ దుప్ప్రతీతిని చాటించినారని కొందరంటారు. ఎవరు చాటించినా ఆ ప్రతీతి మాత్రము ఆ వైపుల బాగా అల్లుకున్నది. నాటినుండి సంగీత కచేరీలకు ఆయన మాట తలపెట్టేవారు తక్కువయినారు. ఈ దుప్ప్రతీతి చేతనేకాక కాలపు మారుపాటుచేత కూడా ఆయనకు సమ్మానము సన్నగిల్లినది. ఇప్పుడు నేను చెప్పేది పదిహేనేండ్ల క్రిందటి మాట. పారసీఖత్తు పాటలు గల నాటక రంగాలు, జావళీలు, టప్పాలు మొదలయిన క్రొత్త రకపు సంగీతము, ఫిడేలు, హార్మోనియము మొదలయిన క్రొత్త రకపు జంత్రములు వెలసినవి. వాటిమీద మోజు యెక్కువయి ప్రాచీనపు జంత్రముల మీద ప్రాచీన గాన ఘణుతుల మీద ఆదరము బీదపడినది. 'క్రొత్త వింత, పాత రోత' అన్నమాట ఉన్నది గదా!

రామయ్యగారు అది, పిదప కాలపు సంగీతమని చాటుచేయక చాటి చెప్పుతూ ఉండేవారు. సంగీత స్వారస్య మెరిగినవారు ఆయన మిత్రులు ప్రాచీనులు పలువురు అంతరించిరి. క్రొత్తకారు కుఱ్ఱరకమునకు ఈయన మాటలు హేయములుగా తోచు చుండెను. అందుచేత కూడా ఈయన గౌరవము కొంత అంతరించినదని చెప్పవచ్చును. ఏది యెట్లున్నా ఆయన తన పాండిత్య విశ్వాసమును కోల్పోలేదు. వయసు మీరిన వాడయినా తాను ప్రతిదినము సాయం ప్రాతస్సమయములందు సంగీత సాధన మానేవాడుకాడు. ఊరి బయటికి పోయి వృక్షాలకు, పక్షులకు, పుట్టలకు గట్టులకు, శిశువులకు, పశువులకు, దినదినము తన పాట వినిపిస్తూ ఉండేవాడు. అప్పటికి యాభై, యాభైయయిదేండ్ల వాడయినా ఆయనకు పలువరుస తీరువాయక గొగ్గి లేక తీరుగా ఉండేది.

దైవము ప్రతికూలకముగ ఉంటే బంగారము కూడా పాడవుతుందంటారు. ఒకనాటి తెల్లవారు జామున వీణసాధనకు గౌసెన ఊదదీస్తూండగా ఆయన కుడిచేతి చూపుడు వ్రేలికి, నడిమి వ్రేలికి, మంద్రగబ్బ కుట్టెను. ఆయన వారమురోజులు దానితో అవస్థ పడ్డాడు. ఆ రెండు వ్రేళ్ళూ చివరకు బండబారి వంకర పోయినవి. ఆయన వీణావాదన శక్తి అంతటితో అంతరించినది. ఆయనకు దురదృష్టపరంపర మిక్కిలి దుర్భరముగా సాగుచున్నది గదా! అప్పుల క్రింద ఇల్లూ వాకిలి, భూమి పుట్ర, చెల్లిపోయినవి. ఆలుమగడు కూతురు ఈ ముప్పురికి, మొవ్వలో బువ్వకు గడవడమే కష్టసాధ్యమైనది. దారిద్ర్య దేవత పూనినదంటే అన్ని యోగ్యతలును మన్నయి పోతవి గదా! ఆయన సంగీతమన్నా, ఆయన మాటలన్నా ఆ చుట్టుపట్టుల వారందరికి వేళాకోళము క్రిందికి వచ్చినది. ఆయనచేత మైసూరు ప్రయాణపు కథలు అప్పటి పాట కచ్చేరీ కథలు పనిపాటలు లేని సమయములందు యెప్పుడైనా చేస్తూ వారు వేళాకోళపు పొగడ్తలు పొగడుతూ ఉండేవారు. ఆత్మ వైదుష్యమందు అతివిశ్వాసముగల ఆ అమాయకుడు, నిజముగానే తనను సంభావిస్తున్నారని సంతోషిస్తూ ఉండేవాడు. పదిపండ్రెండేళ్ళ క్రిందటి మాట చెప్పుతున్నాను. ఆంధ్రదేశమందు నాటక సమాజములు పేట్రేగినవి. నాటకులలో అభినయమును గురించి, గానమును గురించి, స్పర్థలు, పోటీ పరీక్షలు జరుగుతున్నవి. టాలాటోలీ అభినయములు టప్పాపాటలు, సంకర సంగీతములు రూపుమాపి శాస్త్రీయ పద్ధతుల మీద సంగీతకళను నాటకకళను సాగించవలెనని కొందరు గందరగోళము చేస్తున్నారు. పత్రికలలో వారు వీరు ఈ విషయముల మీద వ్యాసములు వ్రాయ నారంభించినారు. ఈ వార్తలు మొవ్వ

రీడింగురూములో కుఱ్ఱవాళ్ళు చదువుతూ ఉండగా రామయ్యగారు వింటూ ఉండేవారు. నిజముగా అటువంటి విమర్శనము పుట్టితే తన పాండిత్యము ప్రఖ్యాతికి రాగలదని ఆయన బులపాటపడుతూ ఉండేవాడు.

బెజవాడలో నూజివీటి రామారాయణంగారు క్రొత్తగా ఒక సంగీత సభ నెలకొల్పి నారనిన్నీ అందులో శాస్త్రీయమైన కర్ణాటగానమేగాని పార్సీ పాటలు మొదలయిన సంకర సంగీతములు ఉండవనిన్నీ. వారు నాటకకళ కూడా పెంపొందించేటందుకు యత్నిస్తున్నారనిన్నీ, ఆ సంగీత విద్వాంసులు అభినయవిద్యకూడా ఎరిగినవారై ఉంటే మరీ మంచిదనిన్నీ అట్టి వారు బెజవాడలో శ్రీ రాజావారిని దర్శింపదగుననిన్నీ ఒకనాడు పత్రికలో ప్రకటన ఉండగా రీడింగురూములోని కుఱ్ఱలు రామయ్యగారికి తెలిపిరి. సంగీతమందు, అభినయమందు తనకంటె సమర్థుడు వేరొకడు లేడనిన్నీ తాను వెళ్ళితే తప్పక గౌరవిస్తారనిన్నీ ఆయన తలచెను. మర్నాడే సకుటుంబముగా బెజవాడకు ప్రయాణమయి వెళ్ళెను. సంసార సామగ్రి వారికి అట్టే లేదు. వండుకొనే గిన్నె, త్రాగే చెంబు మొదలయినవి నాల్గయిదు పాత్రలు, మైసూరులో ఇచ్చిన తలగుడ్డ, అంగీశాలువులు, ఇదే సామాను. మాట యెరుకగల ఒక పేదరాలు పెద్దమ్మ ఇంట్లో వారు బస చేసిరి.

మంచిరోజు చూసుకొనే వచ్చినారు గనుక రామయ్యగారు బెజవాడ చేరిన మర్నాడే ప్రొద్దుటిపూట శ్రీరాజాగారి దర్శనము చేయబోవడముకు ముస్తాబు అయినారు. ఆయన కెప్పుడో ఇరవై యేళ్ళ ప్రాయమప్పుడు మైసూరు సంస్థానమున ఇచ్చిన దుస్తులు అప్పటి ఆయన ఆకారపుష్టికి సరిపడే ఉండును గాని అరవైయేళ్ళ ప్రాయమపుడు ధరించబోతే ఎవరివో పాతవి యెరువు తెచ్చుకున్నాడు కాబోలును అనిపించేటట్టు వున్నవి. వదుళ్ళయి వ్రేలాడుతున్న ఆ దుస్తులలో ఆయన మునిగి పోయినాడు. అందులో బహువత్సరముల నుంచి పెట్టెచీకుళ్ళయి చిమటపోట్లు బడి రంగు వెలిసి ఉండడముచేత మరీ వికారముగా ఉండెను. ఈ సంగతి ఆయనకు తోచలేదు. ఆయన దృష్టికి అవి ఆనాటి మైసూరు సమ్మానమును స్మరింపజేస్తూ ఉత్సాహ జనకముగానే ఉండెను. మైసూరుకి వెళ్ళినప్పటి తీరుగా ఒక నిమ్మపండు, కుంకుమాక్షతలు పుచ్చుకొని శకునపరీక్ష చేసి ఎంత సేపటికీ మంచి శకునము కుదరకపోగా, పట్నవాసాలలో శకునాల పాటింపు పని లేదనుకొని ఆలస్యమైతే వర్జ్యము వస్తుందన్న తొందరచేత సాహసించి ఆయన బైలుదేరెను. శ్రీరాజాగారి బంగాళా చేరి బంట్రోతులను బతిమాలుకొని లోనికి పోయి రాజాగారిని దర్శించి తన కథ విన్నవించుకొనెను. రాజుగారు మంచి రసికులు, సరసులు; అయినా

ఆ బ్రాహ్మణుని వయస్సు వేషము ప్రథమ దర్శనమునందే వారికి పరిహాస్యతను కూర్చెను. ఆ పైని ఆయన చెప్పిన మాటలున్నూ అందుకు తగినట్టే ఉండెను. పిదపకాలపు సంగీతమని సంకర సంగీతమని అప్పటి గాయకుల సంగీతము నాయన గర్హించెను. ఫిడేలు, హార్మోనియము, మొదలయిన జంత్రములను చెడనాడెను. తాను ప్రాచీనమైన శుద్ధకర్ణాటమును పాడగలనిన్నీ, తన తోడ్పాటుచేత శ్రీవారు స్థాపించిన గాయకసంఘము నాటకసంఘము ప్రఖ్యాతికి రాగలవనిన్నీ అమాయకముగా చెప్పెను. రాజాగారదివిని వెడనవ్వు నవ్విరి. 'సరే నేడో రేపో మీరు మా సంగీతశాలకు పోయి అక్కడ గాయకులు, నటులు ఉంటారు. వారిని కలుసుకొని మాటాడండి. తర్వాత మీ విషయము ఆలోచించి చెప్పుతాము' అని చెప్పిరి. వృద్ధ బ్రాహ్మణుడు వచ్చినాడుగదా అని మూడు రూపాయలు తెచ్చి యియ్యబోయిరి. దారిద్ర్యపు బరువు తల మీద ఉన్నప్పటికీ, ఒక్కపూట పస్తయినా పండుకొన్నాడుకాని ఆయన యింతవరకూ బిగలాపడి యెవ్వరినీ యాచించి యెరుగడు. అయితే పెద్ద సభ కావలెను. పెద్ద సమ్మానము జరుగవలెను. అనియే ఆయన తలపోత; కాని చిలిపి యాచనలకాయన చేయి ఒగ్గేవాడుకాడు. అవసరము మాత్రము అర్థణా ఇచ్చినా అదే పదివేలని పుచ్చుకోదగినదిగానే ఉన్నది. ఆపూట భుక్తికి ఉన్నదో లేదో! "సంగీతశాలలోని వారిని కలుసుకొంటానుగదా! తమరు వారితో సంప్రతించి సంగీత పండితస్థానము దయ చేయిస్తామన్నారుగదా! ఇంతలో ఇదియెందుకు లెండి? నేనిందుకోసం వచ్చిన వాణ్ణికాను" అని విన్నవించి లేచి వచ్చినాడు. నాడే రాజాగారు సంగీతశాలకు వచ్చి యీ కథను నవ్వుతూ చెప్పి అక్కడి వారిని నవ్వించిరి.

మర్నాడు రామయ్యగారు ఆ వేషముతోనే సంగీతశాలకు వెళ్ళిరి. అక్కడివారు తనకు హద్దుమీరి చేసిన ఆదరము నిశ్చయముగా తన గౌరవము గుర్తించి చేసినదిగానే ఆయన తలచుకొన్నాడు.

అయ్యా మీకు మైసూరు మహారాజుగారిచ్చేటప్పుడే ఉన్నయ్యా దుస్తులకీ చిమటపోట్లనీ, వారు కుట్టించేటప్పుడు మీ శరీరము కొల్త తీసుకోలేదు కాబోలుననీ, పెద్దలైనారు గనుక శరీరము కృశించినదిరా అని, అయితే అప్పటి పాటకు కూడా కృశింపే ఉంటుందేమోనని, కొంచెము పాడించి చూస్తే తెలుస్తుందనీ, తలకొకమాట చొప్పున నలుగురూ పగలబడి మాటలాడిరి. ఒకడు "చిత్తము మైసూరు విద్వాంసులు! ఒక కీర్తన పాడండి బాబూ!' అంటూ హార్మోనియము శ్రుతి సాగించెను. 'ఇస్సీ! నేను పాడను. మంచి తంబురా శ్రుతి ఉండవలెనుగాని పాడు మ్రోత హార్మోనియము శ్రుతి

పనికిరాదని ఆయన గర్హించెను. వారందరు ఆయనచే పాడించి తాళం పట్టించదలుచు కొన్నారు గాని తంబూరా లేకపోవడము చేత అది సాగలేదు. "తాతగారు మరొకనాడు దయచేయండి. తంబూరా తెప్పించి పెట్టుతాము" అనిరి.

'మోటు శ్రుతిహార్మని సన్నవడి గాత్రపాటకు పనికిరాదు నాయనలారా! ఆ శ్రుతి మానివేయండి. మీకు దివ్యమైన కర్ణాటగానము నేర్పుతాను. మీరు కుఱ్ఱవాళ్ళు, కాగలవాళ్ళు. నేను పెద్దవాణ్ణయినాను. నా విద్య మీదగ్గర నాటిపోవలెనని ఆశ ఉన్నది. శ్రీ రాజాగారితో మనవి చేస్తే మీతో ఆలోచించి సెలవిస్తామన్నారు. నావల్ల మీకు ప్రఖ్యాతి వస్తుంది. అనుకూలంగా చెప్పండి. నా సంగతి నా పాట ఒకసారి వింటే మీకే తెలుస్తుంది" అని చెప్పి రామయ్యగారు మరొకనాడు తంబురా శ్రుతిమీద పాడుటకు నిశ్చయించుకొని యింటికి వచ్చిరి. తర్వాత రెండు మూణ్ణాళ్ళకు రాజాగారి దగ్గరకు సంగీతశాలకు తిరిగినారు. కాని రామలక్ష్మణులు శూర్పణఖను త్రిప్పినట్లు అక్కడినుండి యిక్కడికి యిక్కడినుండి అక్కడికి త్రిప్పుటే గాని పాట వినే యేర్పాటు వారు చేయలేదు.

బెజవాడ తూర్పువైపున బందరు రైలు దారిపక్కనున్న పెద్ద పువ్వుల తోటలో ఒకనాడు సాయంకాలము నాలుగుగంటల వేళ పది పన్నెండేళ్ల ప్రాయముగల బాలికలిద్దరు పూలుకోస్తూ చెళ్ళు కొట్టుకొంటూ ఉండిరి. ఆ తోటలో పెద్ద సంపెంగపొద జీబుగా అల్లుకొని ఉన్నది. సన్నని త్రోవ ఒక్కటే దాని దగ్గరకు ఇరుకుగా ఉన్నది. దూరానికి కూడా గమగమలాడుతూ వెలగపళ్ళవాసన పోలిక గలిగి ఆ సంపెంగ పువ్వుల సుగంధము ముసురుకొని ఉన్నది. ఆ చెట్టునే కొందరు మనోరంజితమనీ, సకలఫల సంపెంగ అనీ, పొద సంపెంగ అనీ పేర్కొంటారు. ఏ పండు తలపుకు వస్తుందో ఆ పండు వాసన ఆ పువ్వుకు ఉంటుందంటారు. కవులు నాసికోపమానముగా వర్ణించే చంపక పుష్పము అదికాదు. ఆ పువ్వుచెట్టు పెద్ద వృక్షముగా పెరుగును. విశాఖపట్టణము జిల్లాలో అది హెచ్చుగా ఉన్నది. వాల్తేరు స్టేషనులో దాని పూవులు అనటిపొత్తులలో పెట్టికట్టి అమ్ముతారు. ఈ పరిశీలనమిక విడుస్తాను. ఆ కన్యలిద్దరు పుష్పపు లోభముచేత ఆ పొద దగ్గరకు వెళ్ళిరి. ఒక పూవురెమ్మ కదల్చినారో లేదో రెండు త్రాచుపాములు పొద క్రిందనుండి ఆ కన్యల కిరుప్రక్కలా ఎదుర్కొని పడగలెత్తి బుసకొట్ట సాగించెను. వాటిని చూచి ఆ కన్యలు గగ్గోలుపడి అరచిరి. సంగీత సాధనకు రామయ్యగారప్పుడా ప్రక్కకే వచ్చి ఉండిరి. అరపువిని ఆయన చేరబోయి భయపడవద్దని వారికి చెప్పుతూ అట్టె కూర్చుండి పున్నాగరాగము ఆలాపన చేయనారంభించెను. బుసకొట్టుతూ ఆ కన్యల మీదికి దుముకుతూ ఉన్న త్రాచులు రెండూ పడగలార్చి హాయిగా ఆడుతూ రామయ్య

గారిని చేరబోయెను. అపాయము తప్పి ఆ కన్యలిద్దరూ అటునుండి తొలగిపోయి దూరాన రామయ్యగారి నేర్పు తిలకిస్తూ ఉండిరి. ఆనందపరవశుడై రామయ్యగారు అరగంటసేపు నాగరాజుల యెదుట రాగాలాపన చేసిరి. ఆ కన్యలున్నూ సంగీతము నేర్చుకొంటున్నవారే గనుక ఆయన గాన మాధుర్యమును ఆప్యాయముగా ఆస్వాదించిరి.

రామయ్యగారు నాడు మైసూరు మహారాజుగారి దగ్గర పాడి ఎంత ఆనందించిరో నేను నాగరాజుల దగ్గరపాడి అంత ఆనందించిరి. అటు తర్వాత షడ్జ శ్రుతిమీద ఏదో ఆలాపన చేయనారంభించగా సర్పములు సరసర దూరముగా పారిపోయెను. ఆ కన్యలు చేరవచ్చి, "తాతగారూ! మీరు మహానుభావులు! మీ పాట అద్భుతమైనది! కాటువేయ నున్న పాములను పాటచేత మెప్పించి మా ఆపద తప్పించినారు" అని మెచ్చుకుని తామంతకు ముందు కట్టిన పెద్ద పూవుల చెండును ఆయనకు బహుమానముగా ఇచ్చి నమస్కరించి ఇంటికి కొనిపోవుటకు మరికొన్ని పూవులను కోసుకోబోయిరి.

"నేడు నాకు శుభదినము. జమీందారుగారు నాకీవేళ ఉద్యోగము ఏర్పాటు చేస్తారు. ఇప్పటికథ దానికి సూచకమే" అని ఆనందించి తాను బహుమానముగా వడసిన పూవుల చెండును జమీందారుగారికి కానుకగా అర్పించుటకాయన వడివడిగా బయలుదేరెను. వారు వెళ్ళేసరికి జమీందారుగారు ఎవ్వరితోనో మాట్లాడుతూ ఉండిరి. రామయ్యగారిచ్చిన పూవుల చెండును పుచ్చుకొని "సరే! సంగీతశాలకు పొండి. మీ విషయము నేడు ఫయిసలవుతుంది. అక్కడి సభికులు తెలుపుతారు" అనిరి. మరి మాటాడుటకు ఎడమియ్యలేదు. "మరొక పెద్దమనిషితో మాట్లాడుతున్నారు కనుక అవకాశము లేదు అధికము ప్రస్తావించడానికి" అనుకొని రామయ్యగారు బైటికి వచ్చిరి. లేకుంటే తోటలో జరిగిన నాటి కథను చెప్పే ఉండేవారు. జమీందారుగారన్న మాటను బట్టి తనకు జీతము వగైరాల విషయము సంగీతశాలకు వెళ్ళి తెలుసుకొమ్మన్నా రని అనుకొని కాలాచకుండా ఆదరాబాదరా ఆయన అక్కడికి వెళ్ళెను. సభికులను సందర్శించెను. అక్కడివారానాడు వ్యంగ్యపు వేళాకోళమును విడిచి బాహాటపు పరిహాసములే ఆరంభించిరి. "వెఱ్ఱి బ్రాహ్మడా! నీవు వచ్చి మాకిక్కడ గురుత్వము నెరపుతావుగా … తాతవు! నీపాట ఎవరికి కావలెను! నీకు హార్మోనియము పనికిరాదు గద! ఎవళ్ళ యిళ్ళలోనయినా అటకలమీద పాత తంబురాలు వ్రేళ్ళాడగట్టి ఉంటవి. అలాంటిదేదో ఒకటిన్నీ దానితో పాటు పెద్దది అక్షయపాత్ర ఒకటిన్నీ సంపాదించు కొంటివా భేషయిన వుద్యోగమవుతుంది నీది. నీకిక్కడ ఉద్యోగమేమిటికి గనుక! చక్కగా మేము చెప్పినది సాగించుకో. పో, పాపము, చాలాసార్లు తిరిగినావు" అని అందులో ఒక

మొనగాడనెను. అందరు అట్టే అవహేళనము చేసిరి. రామయ్యగారు అల్లుడు అంతరించి నప్పటికంటె వేయిరెట్లు హెచ్చుగా విరిగిపోయినారు. నోరు తడబడెను. కాళ్ళు గడగడ లాడెను. కన్నులనీరు క్రమ్మెను. అడుగానలేదు. మొగాన ముసుగు వేసుకొని కాళ్ళీడ్చు కుంటూ ఇంటికి కదలినారు. తోటనుండి జమీందారు గారింటికి, అక్కడనుండి సంగీత శాలకు, సరసర నడిచి వచ్చిన రామయ్యగారిప్పుడు ఇల్లు చేరుకొనేది యేలాగో దైవమా అని తల్లడిల్లుతూ తప్పటడుగులు వేస్తూ నడుస్తున్నారు.

ఇంతకుముందు పూలతోటలో త్రాచుబాముల బారినుండి రామయ్యగారు సంగీతముపాడి సంరక్షించిన కన్యలు మన జమీందారుగారి కుమార్తెలే. ఆ తోటలో వారు మరికొన్ని పూలు కోసుకొని చెళ్ళుకట్టుకొని ఇంటికి వచ్చిరి. తోటలో జరిగిన ఆపద కథను వారు తండ్రిగారితో చెప్పిరి. జమీందారుగారాశ్చర్యము చెంది అట్టి గట్టి విద్వాంసుడు ఉంటే మన సంగీతసభలో ఉద్యోగమిత్తునుకదా! అని ఉప్పొంగిరి. ఆయనను విచారించి తప్పక సత్కరించవలసినదని ఆ కన్యలు తండ్రిగారిని వేడుకొనిరి. మరిన్నీ ఆయన పున్నాగరాగపు పోకడలు అద్భుతముగా ఉన్నవని తామూ సంగీతము నేర్చుకొంటున్నవారే గనుక వివరించి చెప్పిరి. జమీందారుగారు వారిని గూర్చి విచారించి సత్కరిస్తానని చెప్పి ఆపదతప్పి వచ్చిన కుమార్తెలను ఆదరముతో ఒడిలోనికి చేరదీసు కొనిరి. చేరబోయి ఆ బాలికలు టేబిలుమీద పెట్టివున్న పూలచెండును జూచి యిదియెట్లు వచ్చినదని అబ్బురముతో అడిగిరి. "ఒక వెఱ్ఱి బ్రాహ్మడు తాను పెద్ద సంగీత విద్వాంసుడ నని తనకు ఉద్యోగమిప్పించవలసినదని వారము రోజుల నుండి వచ్చి చెప్పు కొంటున్నాడు. నేడీ పూలచెండును కొనుక్కొని వచ్చినాడు గాబోలును కానిక తెచ్చినాడు. సంగీతశాలకు పొమ్మన్నాను. అక్కడ సాంఘికులతో ఆశపెట్టుకోవద్దని చెప్పినాను. చేదస్తపు బ్రాహ్మడు" అని జమీందారుగారనిరి. "నాన్నగారూ! ఈ చెండు మీకు తెచ్చిన వారే మమ్మీవేళ సంరక్షించినవారు. ఈ చెండు మేమే యిచ్చినాము. ఆకారము అట్లా ఉన్నదిగానీ ఆయన అఖండ విద్వాంసుడు" అని ఆ కన్యలు సర్వము సవిస్తరముగా తెలిపిరి. జమీందారుగారు నాలుక కొరుక్కున్నారు. అయ్యో! వేషము చూచి వేళాకోళము చేసినాము గాని పాటతీరు ఒకతూరి అయినా పరికింపక పోతిమే అనుకొన్నారు. కుమార్తెలు తొందరపరచగా, "కోచిబండి మీద సంగీతశాలకు వెళ్ళి ఇన్నూరు రూపాయ లిప్పుడు బసకర్చుకింద వారికి ఇచ్చి రేపటెల్లుంట పాటకచ్చేరీ పెట్టిస్తున్నామనిన్నీ, చెప్పిరావలసి"దని కుమార్తెలతో ననిరి. నూరు రూపాయిల నోట్లు రెండువారి చేతికిచ్చిరి. వెంటనే కోచి కట్టించి ఆ కన్యలు సంగీతశాలకు వచ్చినారు గాని అప్పటికే జరుగ వలసిన

మర్యాదలు జరగడము, కాళ్ళీడ్చుకుంటూ ఆయన అక్కడనుండి కదలివెళ్ళడము అయెను. సంగీత సభికులకా కన్యలు యావద్వృత్తాంతము చెప్పిరి. ఎల్లరు తెల్లమొగాలు పెట్టిరి. రామయ్యగారి బస యెరిగిన వారందులో ఒకడు మనసు నీరై ఆ కన్యలతో కోచిబండిమీద బయలుదేరెను. వడివడిగా వచ్చి గడెవేసి వున్న రామయ్యగారి బస తలుపును వారు తట్టిరి.

గుండెదడ, దప్పి, కడుపులో మంట, నాలుక పొడారిపోవడము, కళ్ళు చీకట్లు కమ్మడము మొదలయిన వికారములతో అతికష్టపడుతూ అప్పటికి నాలుగు మూడు నిముషములక్రిందనే ఆయన యిల్లు చేరెను. "అమ్మా! నాలుక ఈడ్చుకొని పోతున్నది. సత్తుగిన్నెడు తేటమజ్జిగ దాహానికిస్తావా!" అని గోడకు చేరగిలబడి కూర్చుండి కుమార్తెను పిలిచి రామయ్యగారడిగిరి. ఆమె ఆయన అలసటను చూచి తొందరలో తేట మజ్జిగ తేబోయెను. పాపము! పండు ముత్తైదువ ఆయన భార్య చింపి విసనకఱ్ఱ చేతపుచ్చుకొని చెమట కక్కుతూ ఉన్న ఆయన శరీరమును సేదతీరేటందుకు విసురుతూ ఉండెను. తొందరపాటుతో తలుపుతట్టుతూ "రామయ్యగారూ! రామయ్య గారు!" అని పిలుస్తూ ఉన్న బైటివారి పిలుపును విని ఆయన భార్య "యెవరువా"రని అడిగెను. "సంగీత సభనుండి జమీందారుగారు పంపితే వచ్చినామండీ" అని బైటివారు చెప్పిన బదులు విని ఇస్సీ అని విసుగుకొనిరి. అంతలో, లోనుండి తేటమజ్జిగ తెచ్చి తండ్రి దగ్గర పెట్టి బైట యెవరో పిలుస్తున్నట్లు విని కుమార్తె వెలుపలనున్న వారిని పలుకరించెను. ఆ కన్యలతో వచ్చిన సంగీత సభ్యుడు "అమ్మా! వీరు జమీందారుగారి కుమార్తెలు. జమీందారుగారు రామయ్యగారికి ఇప్పటి కర్చుకింద ఇన్నూరు రూపాయలిచ్చి రమ్మన్నాడు. వెంటనే ఉద్యోగము ఏర్పరుస్తామన్నారు. ఇది విన్నవించి పోవచ్చినాము!" అని చెప్పెను. పాపమామె తన తండ్రికి కష్టకాలములో భగవంతుడు కన్ను తెరిచినాడని సంతోషించి లోపలికి రండని వారిని పిలిచి తలుపుబార్లాగా తెరచెను. అప్పుడు రామయ్యగారు మజ్జిగ త్రాగుటకు సత్తు గిన్నె ఎత్తి పట్టుకొని ఉన్నారు. ఇంకా త్రాగలేదు. అంతలో ఆ కన్యలు చేరబోయి నమస్కరించి "అయ్యా! పూలతోటలో మీరు రక్షించినది మమ్మే. మేము జమీందారుగారి కుమార్తెలము. ఆ కథంతా విని వారు నొచ్చుకున్నారు. మీకు ఇప్పటి కర్చు క్రింద ఇన్నూరు రూపాయలు ఇచ్చి రమ్మన్నారు. పాటకచ్చేరీ పెట్టించి వెంటనే ఉద్యోగం ఏర్పాటు చేస్తామన్నారు" అంటూ ఆ నోట్లు, తాము తర్వాత కట్టుకు తెచ్చుకున్న పూలచెండు, రామయ్యగారి ఒడియందుంచిరి. రామయ్యగారది తీరవిన్నారో లేదో గాని "ఆ! ఆ!" అని నోరు తెరచి అట్టె జేరబూని కన్నులు తేలవేసిరి. సత్తుగిన్నె చేతినుండి జారి నేలబడెను. గోడకు చేరగిలబడి ఉన్న శరీరము నేలకు బోరగలిబడెను. తల్లి కూతుళ్ళు

తొందరపడి మళ్ళీ మజ్జిగ తెచ్చి తెరచుకొని ఉన్న నోటిలో పోసి చూచినారు గాని గుటక పడలేదు. ఒళ్ళు పట్టి చూచి సంగీత సభ్యుడు కళ్ళనీళ్ళు విడిచెను. "అయినదమ్మా రామయ్యగారి కథ అయిన" దనెను. అంతలో ఆవురుమనుచున్న రాజకన్యల నాదుకొని అతడు బైటికి తెచ్చెను.

ఆ యిన్నూరు రూపాయలు రామయ్యగారికి అపరకర్మమునకయి ఉండును.

## కథా నేపథ్యం ...

1924 నాటి కథ ఇది. పారసీఖత్తు పాటలుగల నాటకరంగాలు, జావళీలు, టప్పాలు మొదలయిన క్రొత్తరకపు సంగీతము, ఫిడేలు, హార్మోనియము మొదలయిన క్రొత్తరకపు జంత్రములు వెలసినవి. వాటిమీద మోజు యెక్కువయి ప్రాచీనపు జంత్రముల మీద ఆదరము బీదపడినది అని ఆవేదన వ్యక్తం చేస్తారు ప్రభాకరశాస్త్రి. ఎనభైదశకం తొలినాళ్ళలో వచ్చిన శంకరాభరణం సినిమాకు ఈ కథ ప్రేరణ అంటారు.

20వ శతాబ్ది తెలుగుసాహిత్యంలో చిన్నకథ (షార్టుస్టోరీ) కు వచ్చిన ప్రాచుర్యం మరే ఇతర సాహిత్య ప్రక్రియకు లభించకపోవటం ఒక విశేషం. నూరేళ్ళలో తెలుగులో ఒక ఇరవైవేల కథలైనా వచ్చి వుంటాయి. ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా ఇందులో వేయి కథలనైనా గొప్ప కథల శ్రేణిలో చేర్చవచ్చు. ఇతర సమకాలీన భారతీయ భాషలకు దేనికీ లేని ఘనగౌరవం, సమ్మానం తెలుగు కథకు లభించింది. అంతర్జాతీయ కథల పోటీలో తెలుగుకథ ద్వితీయ బహుమానం గెల్చుకుంది.

విశేషమైన సంగతి ఏమంటే వేదవేదాంగవిదులు, షట్ఛాస్త్రపండితులు కూడా కథా రచనపట్ల అభిమానం చపటం. కవులు, విమర్శకులు, వ్యాఖ్యాతలు, పండితులు కూడా కథా రచనపట్ల ఆసక్తి చూపారు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గొప్ప పండితులు, పరిశోధకులు, విమర్శకులు, కవులు, పురాచారిత్రకులు, శాసన విశ్లేషకులు. గత శతాబ్దుల తెలుగు సాహిత్యాన్ని ఆయనంతగా సమీక్షించినవారు ఎక్కువమంది కనపడరు. వేలూరి శివరామశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి గొప్పరచయితలు తెలుగుకథను పండించటం చూసి ప్రభాకరశాస్త్రిగారు కూడా కథా రచనపట్ల ఆకర్షితులై వుంటారు.

# 42. ధనత్రయోదశి

– భండారు అచ్చమాంబ

ధనత్రయోదశి నాటి సాయంత్ర మేడుగంటల వేళ నెటు చూచినను నానందోత్సవములతో బొంబాయి పట్టణము నిండియుండెను. నాఁడు దీపావళి దినమున నగునంత దీపోత్సవము లేకుండినను బ్రతిగృహము నందును ఆ గృహము యొక్క యాకారమును సౌందర్యమును నితరులకు జూపఁగలిగిన దీపమాలికలు వెలుగుచునే యుండెను. ఎటు విన్నను టపాక్కాయల ఫటఫట ధ్వనులు వినవచ్చు చుండెను. ఇంటింటను పళ్ళెరములలో స్వర్ణాలంకారముల నుంచి లక్ష్మీపూజలను జేయుచుండిరి. కాని, యొక యింటమాత్ర మిట్టి యుత్సవ చిన్హము లేవియుఁ గానచ్చుట లేదు. దీనిని ఇల్లనుట కంటెఁ గుటీరమనిన బాగుండును. ఈ కుటీరము గొప్ప సాహుకార్ల రెండు మేడల నడుమ నుండి చెల్లెలగు లక్ష్మీదేవి యుత్సవముఁజూడ వచ్చిన జ్యేష్ఠాదేవియే యనునటుల నుండెను. ఈ యింటి వలన ఆ బజారునకుఁగల శృంగారమొక్కింత తగ్గినను దీనియందలి పరిశుభ్రతను వ్యవస్థను గనిన వారి మనములకు నుల్లాసము గలుగుచుండెనని మాత్రము చెప్పవచ్చును. ఇట్టి గొప్ప పట్టణమునందీ యుత్సవసమయమునందే ధనికుని వృత్తాంతమును జెప్పక మాకొక దరిద్ర కుంటుంబ వార్తను చెప్ప మొదలు పెట్టినదని నా ప్రియ సోదరీమణులు నాపైఁ గోపగించెదరేమో? అక్కలారా మీరట్లు విసువక నేను జెప్పఁబోవు కథను సావధానులరై వినినచో మీకీ గృహవార్తయే విశేషయుత్తమయినదని తోఁచకపోదు.

నేనుఁ జెప్పిన కుటీరము యొక్క రెండు ప్రక్కలను గొప్పగొప్ప మేడలుండి నటుల నేనిదివరకే చెప్పితిని. వానియందనేక దీపములు వెలిగింపఁబడి యుండెను. అయితే మధ్యగల కుటీరమునందొక్క దీపమే వెలుఁగు చుండెను. దానిసమీపమునందు విజయలక్ష్మమ్మ కూలికిఁ గుట్టఁదెచ్చిన పరుల రెవికను గుట్టుచుఁ గూరుచుండెను. ఆమె సమీపమున నాఱు సంవత్సరముల బాలికయు, మూడు సంవత్సరముల ముద్దు బాలుఁడును గూర్చుండి తమ బాలికలఁజూపుచుఁ దెలిసియుఁ దెలియని ప్రశ్నలచేఁ

దమ తల్లి మనమున కానందము కలుగఁజేయుచుండిరి. విజయలక్ష్మి సాయంత్రపు వంటచేసి పెనిమిటి రాక కెదురు చూచుచుండెను. ఆమె భర్త వెంకట సెట్టియను నొక గొప్ప సాహుకారు నింట గుమాస్తాగా నుండెను. నేఁడు ధనత్రయోదశిగాన, సెట్టిగారి యింట లక్ష్మీపూజకానిదే భర్త రాఁడని యెఱిఁగిన దగుటవలన నామె పిల్లలకు భోజనములు పెట్టి మైలఁబడి రెవిక కుట్టుకొనుచు భర్త యాగమనమున కెదురు చూచుచుండెను.

ఆహా! గ్రామమునందుఁ జరుగుచుండిన యుత్సవము వైపెంత మాత్రమును జిత్తము లేక తదేకాయత్తచిత్తయై పెనిమిటి రాకను గోరుచున్న యా వనిత మొగమెంత మనోహరముగా నుండెనో? అట్టి స్త్రీలను గన్నులారఁ గనుఁగొన్నవారలకేకాని యితరులకుఁ దెలియనేరదు. ఇట్లామె తన బాహ్యచక్షువులను మాత్రము కుట్టుచున్న రెవిక పైనుంచి యంతశ్చక్షువులతోఁ బెనిమిటి రాకను జూచుచుం గూర్చుండెను. ఇంతలో ముద్దుల బాలుఁడగు నామె కొమారుఁడామెను సమీపించి మెడను గట్టిగాఁ గౌగిలించుకొని నందువలన నామె తన మనసును వానివైపునకుఁ ద్రిప్పవలసిన దయ్యెను. ఇంతవఱకామె వాఁడడిగిన ప్రశ్నలకెల్ల హూ యనుచు నేదో యొక జవాబు చెప్పుచుఁదన పనినిఁ జేసికొనుచుండెను. గాని, బాలుఁడు తన ముద్దు హస్తములతో మెడకు బంధము వేయఁగా నామె వెంటనే కుట్టుపనిని నవతల నుంచి పిల్లవానినిఁ దగ్గిర నుంచుకుని బుజగరించి ముద్దు పెట్టుకుని 'నన్నుగన్న నాయనా! నీకేమి కావలెను? నీవక్కతో నింతవఱకాడుకొనుచుంటివే అట్లే యింక కొంచెమాడుకొనుము. నేను పరుల రెవికను గుట్టుచున్నాను. ఇది త్వరగాఁ గుట్టవలెను' అనెను. తల్లినోటినుండి మాట వచ్చిన వెంటనే యా సుగుణవంతుండగు బాలుఁడు లేచి యావలి కరిగెను. ఇంతలోఁ బొరుగింటఁ గాల్చిన చిచ్చుబుడ్డి వెలుగు వాని కగుపడినందున వాఁడు మిక్కిలి సంతోషముతోఁ జేతులతో వెలుతురుఁ జూపుచు, గంతులు వేయుచు 'అమ్మా! అత్తల తమాసాగా యున్నది అక్కతో జూలపోతా'నని తన ముద్దుమాటలతోఁ దల్లి నడిగెను. వాఁడు పోదునన్న స్థలము సమీపమైనందున విజయలక్ష్మమ్మ వెంటనే బిడ్డను బిలిచి 'రుక్మిణీ! నీవీ రామునినిఁ దీసికొని పొరుగింట నగుచుండిన వేడుక చూపి తీసికొనిరా. భద్రము సుమా దీపము నొద్దకుఁ దీసికొనిపోకు. అచట నెవరితోనేని తగువులాడకు' అని చెప్పి పంపెను. వెంటనే యా బాలకులు పొరిగింటి వాకిటికిఁ బోయిరి. ఇట్లు పిల్లలు పోవుచుండఁగా వారితల్లి కమిత దుఃఖము కలిగి యామె యశ్రుపూర్ణ నేత్రముల వారినిఁ జూచుచుండెను.

పాపమామెకు దొలిదినము సంగతి జ్ఞాపకము వచ్చినది కాఁబోలు, తొలి దినము వారు టపాక్కాయల నడుగఁగా నెటులనో యామె వారిని సమాధానపఱచెను. అప్పటి నుండి యా పిల్లలును మరల తల్లిని నడుగనేలేదు. తుదకు పొరుగింట టపాక్కాయలు పిల్లలు కాల్చుచున్నను నడుగక యూరక చూచి వచ్చెదమాయని యడిగిన వారి సద్గుణమును గని యిట్టి మంచి బాలుర కోర్కెలు తీర్చుటకుఁ దగినంత యైశ్వర్యము మనకు లేకపోయెనుగదా యని తల్లికి మరింత దుఃఖము హెచ్చెను. ఉండుటకిల్లు మంచిదిలేదనిగాని, కట్టుటకుఁ గొప్ప వస్త్రములేదనిగాని, పండుగనాఁడు పిండివంటలు చేసికొనుటకు వీలులేదనిగాని యెన్నడును నామెకుఁ జింత కలుగలేదు. ప్రతిదినము నష్టకష్టములతో గడుచుచున్నను నామె సద్గుణవంతుఁడగు భర్త సహవాసము వలన సంతోషముగానే కాలము గడుపుచుండెను. గాని, కడుపున గన్న బిడ్డల కష్టములను దలచుకొనినంత మాత్రమున నామె కపరిమిత దుఃఖము కలుగుచుండెను. ఆమె తాను విశేషవైభవము ననుభవించిన దగుటవలన దన సంతానమున కిట్టి కష్టములు వచ్చెనని పొక్కుచుండెను.

నిజముగా విజయలక్ష్మమ్మయు వెంకటరత్నమును జిన్నితనమునందు చాలా యైశ్వర్యమనుభవించిరి. కలకలూరు మల్లయ్యయను నొక యగ్రహారీకునకు వెంకట రత్నమొక్కఁడే కొడుకు. అందువలన నాతని వివాహము పదవయేటనే విశేష యుత్సవముతో జరిగెను. తనకొక్కడే పుత్రుఁడైనందునను, తాను గ్రామమునందఱి కంటె నధిక ధనవంతుఁడని పేరొందినందునను మల్లయ్యగారీ వివాహమునకు విశేషధనము వ్యయపఱచిరి. ఆ వివాహమునకు బదునేనువేల రూపాయిలు ఖర్చయ్యెను. అయ్యెయ్యో వివాహమునకు బదునేను వేల రూపాయలు ఖర్చయిన దంపతులకిప్పుడు పదునేను రూపాయిలు కండ్ల కగుపడుట బంగారమైనది. అయితే యీ కాలములోఁ గొందఱి యగ్రహారీకుల యగ్రహారములు పాడగుటఁ జూచిన వారికిది యొక విచిత్రముగా నుండదు. మల్లయ్యగారి యగ్రహార మదివఱకే కొంత తాకట్టు పెట్టఁబడి యుండెను. అయినను వారి యింట జరుగు కార్యములు పూర్వము వలెనే జరుగు చుండినందున దినదినమునకు నప్పులు హెచ్చుచుండెను. ఇట్టి సమయమున నొక్కగాని యొక్క కొమారుని వివాహము చేయవలసిన సమయము మించిపోవునని తలఁచి యతఁడింకను గొంత ఋణము చేసి వివాహము చేసెను.

ఈ ఋణము వలననే వెంకటరత్నముగారికిప్పు డన్నము దొరుకుట సహితము దుస్తరమై చిన్న పిల్లల కష్టములకు వారు విచారపడవలసినంత దుర్దినము వచ్చినది.

మల్లయ్యగారి జీవితమునందు మాత్రము ఋణస్తులెవ్వరును విశేష తొందర చేయలేదు. కాని ఆయన ప్రాణము పోయిన వెంటనే యందఱు నొక్కసారిగా వచ్చి కలదానిలో రూపాయికి నర్ధరూపాయి చొప్పున దమతమ బాకీలను దీర్చికొనిరి. పాపము, యుక్త వయస్సు రాకమునుపే వెంకటరత్నముగారికి దమ పెద్దల చాతుర్యము వలననో తెలివి తక్కువవలననో గలిగిన ఫలము ననుభవింపవలసి వచ్చెను. వెంకటరత్నము మిక్కిలి సద్గుణుండు. ఆయన పసితనము నందగ్రహారీకుల వైభవము ననుభవించినను వారి యందుండు దురభిమానము, ఉన్మాదము, సోమరితనము మొదలైనవా యన్నంటినవి కావు. ఆయనకుఁ దగినటుల భార్యయు సద్గుణవతియే దొరికినందునఁ దరిద్రతకై యొకప్పుడాయ్నకుఁ జింత గలిగిన భార్య యనుకూలతను జూచి దుఃఖము నాచు చుండెను. తండ్రి చచ్చువఱకాయన ప్రవేశపరీక్ష యందు మాత్రము కృతార్థుఁడయ్యెను. ఇంకను జదువుకుని విద్యాభివృద్ధి చేసికొనుటకు వయసున్నను ధనము లేనందున నాఁతఁడు వెంటనే యుద్యోగములోఁ బ్రవేశించెను. ఉద్యోగములీ కాలములోఁ దొరుకుటయే మిగుల దుర్ఘటము. ఇట్టి స్థితిలో నెటులనో వెంకటసెట్టియను నొక గొప్ప సాహుకారు దగ్గిర పదిరూపాయిలు వేతనముగల గుమాస్తాగిరి దొరికెను. ఆ పదిరూపాయీలతో వారెటులనో దినములు గడుపుచుండిరి. ఇట్టి స్థితిలో వారికిఁదమ బిడ్డలను గూర్చి విచారము కలుగుట సహజమే.

విజయలక్ష్మమ్మకుఁ దన బిడ్డల స్థితినిఁ గూర్చి విశేష దుఃఖము కలిగినదని పైనఁ జెప్పితిని. అప్పుడామె కన్నులయెదుట పూర్వపు వైభవము, అది నాశనమైన విధమును బ్రస్తుతస్థితి వల్లఁ బిల్లలనుభవింపుచున్న కష్టములును గానుపించెను. ఈ సంగతులన్నియుఁ దలఁపునకు వచ్చినందున నామె దుఃఖము పొరలిపొరలి యాపుకొన శక్యము కాక వచ్చుచుండెను. ఇంతలో రాముని యేడుపామెకు వినఁబడినందున నామె దిగ్గున లేచి పొరుగింటి వద్దకిఁ బోయెను. అచటికీమె పోవునంత కచటనొక స్త్రీ రామునిఁ గొట్టుచుండెను! ఆ చిన్నవాని తప్పిదము విచారింపగా నచట నొత్తిలేని టపాకాయ నొకదానిని వాఁడెత్తికొని విరిచి యటనున్న నొక దీపము దగ్గిర పెట్టెను. అందువలన నా దీపమారిపోఁగా నా యింటిపిల్లవాఁడు రామునిఁగొట్టి వాని యేడుపు వినఁబడినఁదల్లి తనను గొట్టునను భయముచే వాఁడే తనను గొట్టెనని పెద్దపెట్టున నేడువసాడెను. వాని యేడుపు విని వాని తల్లి పరుగెత్తివచ్చి తన పిల్లవానిని రాముఁడే కొట్టెనని తలఁచి వాని సుకుమారతనైనను జూడక గొడ్డును బాదినట్టుల బాదసాగెను. తమ పిల్లలను తామధికముగా గొట్టు తల్లులయినను వారి నితరులు కొట్టుచుండఁగాఁ

జూచి సహింపఁజాలరు. ఇఁక తానెన్నఁడును బిల్లల నొక దెబ్బయినను వెయ్యని విజయలక్ష్మమ్మవంటి మాతకుఁదన పిల్లని నితరుల గొట్టుచుండఁగాఁ జూచుట యెంత కష్టముగా నుండునో యట్టి తల్లులకే తప్ప యితరులకుఁ దేలియుట కష్టము. ఆ సమయమునందామెకుఁ బట్టరాని కోపము వచ్చెను. గాని వివేకవతి యగుటచే నాస్వాధ్వి కోపమునంతను దిగమ్రింగి రుక్మిణి, రామునినిఁ దీసుకొని యింటికి వచ్చెను. ఆమె గృహమునకు వచ్చి పిల్లలను బుజ్జగించి సమదాయించెను. గాని యామె తన దుఃఖము నాపుకొన నశక్తురాలు కాదయ్యెను. నోరెఱుఁగని తన పాపని నితరులు నిష్కారణముగా దండించుటకుఁ దమ దారిద్ర దేవతయే కారణముగదా యని తోఁచి యామెకధిక దుఃఖము కలిగెను. ఆమె తన ముద్దుపాపని శరీరమునందలి దద్దులను దడివి చూచి కన్నుల నుండి భాష్పధారలు గార్పఁజొచ్చెను. అప్పుడామెకు సమాధానము చెప్పు వారచట నెవ్వరును లేకయుండిరి. వెంకటరత్నము గారచట నుండినచో నామెకు సమాధానము చెప్పియుందురు. చూడుడు ప్రస్తుతము సహితము నామె దుఃఖము నాయనయే తగ్గించుటకుఁ గారకుఁడయ్యెను.

ఆమె భర్త యలికిడిని వినిన వెంటనే తన దుఃఖమునంతను నడచుకొని సంతోషము ముఖమునందోపఁ జేసెను. ఆహా! విజయలక్ష్మీ! నీ సుగుణములిన్నియని వర్ణింప నా తరమా? పనిచేసి యలసి వచ్చిన పతికి నీ దుఃఖము తెలిసినచో విశేష వ్యసనము కలుగునను తలంపు చేతఁగదా నీవు నీ దుఃఖమును మ్రింగి సంతోషమును ముఖమునందుఁ దెచ్చుకొని ముద్దుపాపని నెత్తుకొని భర్త నెదురుకొంటివి! ఇట్టి సత్ప్రవర్తనమును స్త్రీలందఱు నవలంబించినచో మన దేశమునకెంత మేలు కలుగును. వెంకట రత్నము గృహమునకు వచ్చెనుగాని నిత్యమువలె నేఁడాయన ముఖము సంతోషముగాలేక మిగులు చిన్నవోయి యుండెను. ఆయన శరీరము నిండను చెమ్మటపట్టి యుండెను. నిత్యము నాతఁడు తనకెదురుగా వచ్చిన భార్యను నవ్వుచుఁ బలకరించిగాని, కొమారుని ముద్దిడుకొనిగాని లోపలికిఁ బోవుచుండును. నేఁడా గృహస్థుదెదురైన సతిసుతుల నూరకఁ జూచుచు మౌనముగా లోపలికి వచ్చెను. భర్తను గాంచిన వెంటనే విజయలక్ష్మమ్మ నేఁడధికముగా పనియుండి నందున నలసెనని తలఁచి యీవేళ నిత్యము కంటెను శ్రమ విశేషమైనది గాబోలు, ఏమీ యీ చెమటయని తన పమిట చెఱుఁగుతో నాతని చెమటను దుడిచెను. ఇంతలోఁజంకనున్న పిల్లదానికి నిదుర వచ్చినందున వానిం బరుండఁ బెట్టి వచ్చి యామె భర్తకు దుస్తులు విడుచుటలోఁ దోడుపడెను. దుస్తులు విడిచి పత్ని చేతికినిచ్చి యాయన మిక్కిలి చింతాక్రాంతుఁడై

యచటనున్న పక్కచుట్ట నానుకొని కూర్చుండెను. విజయలక్ష్మమ్మయు నాదుస్తులను నియమిత స్థలముల నుంచి వచ్చి పతిచెంతఁ గూర్చుండెను.

కొంతసేపటివఱకు భర్త మాటలాడనందున వింతపడి విజయలక్ష్మమ్మ యాయనకుఁ దల నొచ్చుచున్నదని తలఁచి 'యిదేమి? నేఁడు మాటలాడరు? తలనొప్పిగా నున్నదా?' యని సమీపమున కరిగి తలపట్టి చూచెను. తలనొప్పి లేదని వెంకటరత్నమనెను. గాని యంతతో నా సాధ్వికి సమాధానము కానందున, తలనొప్పి లేనిచో నేఁడిట్లుదాసీనముగా నుండుటకుఁ గారణమేమి, ఈ ముఖమింత చిన్నబోయి యుండుటకు హేతువేమి యని భర్త నడిగెను. పత్ని నోటినుండి వచ్చు మాట వినిన తోడనే వెంకటరత్నముగారికి మిగుల విచారము కలిగి, 'నీకు మన యీ దుస్థితినిఁ దలఁచుకొనిన విచారముగా నుండదా?' యని యడిగెను. భర్త వాక్యము చెవినబడిన వెంటనే విజయలక్ష్మమ్మకి గడియ క్రిందటి దుఃఖము జ్ఞాపకము వచ్చి విశేష విచారము కలిగి భర్తకు నట్టి దుఃఖమే యేదయినఁ గలిగి యుండునని యూహించి తన దుఃఖము నంతను మహా ప్రయత్నమున నాపుకొని, ముఖమునందు సంతోషమంకురింపఁ జేసికొని 'ఇదేకద? ఇంత మాత్రమునకు విచారమేల? నాకిందున గూర్చి విచారమే మాత్రమును లేదు'. 'ఆహా! నీవిట్టిదానివే, కాని మునుపటి వైభవమును బ్రస్తుతపు స్థితియుఁ దలఁచుకొనినచో నాకుఁ జాల విచారముగా నుండును. దివ్య మందిరము నందష్టైశ్వర్యము లనుభవించిన వారికి గుడిసెల నష్టదరిద్రముల ననుభవింపవలసి వచ్చెనుగదా! నేఁడు లోకులందఱనేక యమూల్యములగు నలంకారముల నొకచోట నుంచి పూజింపు చుండఁగా రత్నాభరణములనేకములు దాల్చిన నీ శరీరమున నొక్క బంగారపు గుండయినను బూజించుటకు లేకుండుట చూచి నీకెంత మాత్రము విచారముగా నుండదా?'

విజ : నాకెంతమాత్రమును విచారముగా నుండదు. మనకు సంపదలేదనిగదా మీరు విచారపడుట. సంపన్నులగు కొందఱికిఁగల గర్వమును, విచార శూన్యతయుఁ జూచినపుడెల్ల మన స్థితియే నాకు నుత్తమమైనదిగాఁ గానుపించుచుండును. ఇట్టి స్థితిలో మనము సత్యమార్గమును విడువక నడుచుచుండుట వలన మనకగు నమితానందము ధనవంతులమైనచోఁ గలుగనేరదు. నేనన్ననో తమ ప్రేమ యొక్కటి కలిగిన నితర సంపద లేమియు నొక లెక్కగాఁ గొనను.

పత్ని పలుకు లాలకించి వేంకటరత్నము కొంత యులికిపడెను. ఆయన చిత్తము బెదరినట్లు ముఖచర్య కానుపించెను. సత్యప్రవర్తకుఁడగు నాతని ముఖమునందొక

విధమైన భయము కానుపించెను. అప్పుడాతఁడు టిచ్చవడి భార్యకేమి సమాధానము చెప్పవలయునో తోఁచకయుండి తుదకెటులనో ధయిర్యమవలంబించి 'ప్రియే పొడి ప్రీతినిఁ దీసికొని నీవేమిచేసెదవు?' విజయలక్ష్మమ్మ కాయన ముఖమునందుఁ గలిగిన ఖేదమేమియు దెలియలేదుగాని పతి మాటవలన నామెకు దుఃఖము మాత్రము కలిగెను. అప్పుడామె 'మీరిట్టి మాటల వలన నా మనసునకు దుఃఖమే గలుగఁజేయుచున్నారు' అనెను.

వేంక : అట్లయిన నేను మాటలాడనులే. నీకు మన పిల్లల దుస్థితిని గూర్చియైనను విచారముగా నుండదా? పరుల పిల్లలీ దీపావళి పండుగకు మంచి దుస్తులను ధరియించుకొని మృష్టాన్నములను దిని సాయంకాల మానందముగా టపాక్కాయలను గాల్చుచుండఁగా వారినిఁజూచి మన బిడ్డలు దీనముఖులై యుండఁగాఁ జూచియైనను నీకు దుఃఖముగా నుండదా?

విజ : ఇందుకు దుఃఖమేమి? నాకెంత మాత్రము విచారము లేదు. సరేగాని నేఁడీ లేనిపోని ప్రసంగములు చేసి విచారించుచు లేని దుఃఖము నేల కల్పించుకొన మొదలు పెట్టితిరి. మనపిల్లలేమయిన మననా వస్తు వాహనములు తెమ్మని యడిగిరా?

వేం : 'ఇందువలననే కదా నా దుఃఖము విస్తరిల్లుట.

ఈ మాటయని యతఁడొకింత యూరకుండి గద్గద ధ్వనితో నేను నీకొకమాట చెప్పినట్లైన నీవు... ఏమీలేదు' అని యాయన నాలుక గరచుకొని యేదో భయంకరమగు సంగతినిఁ జెప్పఁ బోయి శంకించువానివలె ముఖచర్యను చేసెను. విజయలక్ష్మి పాపమాయన చేష్టలను గని చేష్టలు దక్కియుండెను. కొంతవడికామె తెలివి తెచ్చుకొని 'మీరు నాకేమి చెప్పవచ్చితిరి'యని యడిగెను.

వేంకటరత్నము చర్యను స్థిరపఱచుకొని 'ఏమియులేదు, పోనివ్వు. నీవన్నదే సత్యము. లేనిపోని సంగతులు ముందిడుకొని వ్యసనమేల పడవలెను' అనెను. గాని యీ వాక్యముల నుచ్చరించునపుడు డాయన చెప్పఁబోవు నొక గుప్తమైన సంగతిని దాచుచుండినట్లాయన ముఖచర్యవలనఁ దెలియుచుండెను. గాని, కపటమేమియుఁ దెలియని విజయలక్ష్మి కాతని కపటమేమియుఁ దెలియలేదు. ఆమె తన భర్త వాక్యములనే నమ్మెను. ఇంతలో నాయన 'సరె నాకాకలియైనది. నేఁడు విశేష శ్రమ చేయుట వలన విసుకుగా నున్నది. త్వరగా భోజనము చేసి పరుండుదము!'

భర్తనోటి నుండి యీ వాక్యములు బయలువెడలిన తోడనే విజయలక్ష్మి మడి కట్టుకొని భర్తకు వడ్డించి, యాతఁడు తినిన పిమ్మట తాను భోజనము చేసి యింటి పని దీరిన వెనుక పరుండఁబోయెను. అంతకు మునుపే వేంకటరత్నము నిదురపోవు చుండెను. విజయలక్ష్మియు ప్రొద్దుపోయినందున కుట్టుపనిని చేయుచుం గూరుచుండక తాను పరుండెను.

విజయలక్ష్మి కపటహీనయగుట వలన పక్కకి జేరిన వెంటనే నిదురపట్టెను. గాని విచారగ్రస్తుఁడగు వేంకటరత్నము పైకి నిదురపట్టిన వానివలె నభినయించినను నిజముగా నాఁటిరాత్రి యాతనికి నిదురపట్టనే లేదు. నాఁటి సాయంకాలమున వేంకట సెట్టి గారింటఁ జరిగిన సంగతియే రాత్రి యాతనికి సుఖనిద్రకు భంగము కలిగించెను.

నాఁటి సాయంకాలపు సెట్టిగారింట లక్ష్మీపూజగుట వలన వేంకటరత్న మచటనే యుండి యందుకు గావలసిన వస్తువు లన్నియు జతపర్చుచుండెను. ఇంతలో నచటి పెద్ద గుమాస్తా వేంకటరత్నము నేకాంతముగా నొక చోటికిఁ దీసికొనిపోయి రహస్యముగా 'వేంకటరత్నమా నీవధిక బుద్ధివంతుఁడవని నేను నిన్ను నాకు సహాయునిగా గోరెద. నేను నీకుఁ జెప్పు సంగతిని నీవితరులతోఁ జెప్పనని ప్రతిన చేయుము?' ఆ ముసలి గుమాస్తా మిక్కిలి మంచివాఁడును, నమ్మదగినవాఁడును అని యది వఱకెఱిఁగినవాఁడు గాన, నీవు చెప్పునది యొరుల కెఱిఁగింపనని వేంకట రత్నము నమ్మఁబలికెను. అప్పుడా ముసలి గుమాస్తా 'వేంకటరత్నమా! నేఁడు లక్ష్మీ పూజనమునకై తీసిన యనేకములైన యమూల్యాభరణములను జూచితివా? ఇవియొక లెక్కలోనివి కావు. వీనికంటె వేయిరెట్లెక్కువ విలువ గలవి వీరి దుకాణమునందున్నవి. ఇది నీవెఱుఁగనే యెఱుఁగవుగదా?' ఈ మాటల ధోరణి యేమియుఁ దెలియక వేంకటరత్నము అవును. నాకుఁ దెలియుననియెను.

పెద్ద గుమాస్తా – ఇది తెలిసినటులనే యీ ధనమంతయు నా నమ్మకముననే యున్నదనియును నీకుఁ దెలిసియే యుండును.

వేంకటరత్నము – అవును. సెట్టిగారికి మీయందధికముగా నమ్మకముండినందున వారు తమ పెట్టెల తాళపు చేతులన్నియు మీకే యిచ్చిరి.

పెద్ద గుమాస్తా – ఇట్టి విశ్వాసము నాయందుంట వలననే కదా నేను తలచిన కార్యము నిర్విఘ్నముగా నెరవేరునని నేను బూనినది.

గుమాస్తా మాటలను విని వేంకటరత్నమునకు కొంచెమనుమానము కలిగెను. గాని యాతఁడింకను నేమిచెప్పునో యని తలచి వినుటకు నుండుకుండెను.

పెద్ద గుమాస్తా – ఇంత సంపత్తిలోనిది మనమొక కొంత తీసికొనిన నదియొక తప్పిదము కాదు. అందువల్ల సెట్టిగారికిని నష్టము రాదు. మనకన్ననో దాని వలన మన దరిద్రదేవత తొలఁగిపోవును. ఇంత పెద్ద గుమాస్తాను నాకేబది రూపాయిలు గద, జీతము నీకన్నననో పదియే. ఇంత స్వల్పజీతములో మన కుటుంబములను భరించుట మనకు దుస్తరము గదా? ఈ సంగతి వెలికి వచ్చుచున్న భయము నీకక్కరలేదు. ఆ పూచీ నాది. నేను జెప్పిన యీ సంగతి సంవత్సరాంతము లెక్కలకులోగా కావలెను. సాలాకరింకను రెండే దినము లున్నది. నీవేమనియెదవు?

పెద్ద గుమాస్తా యీ మాటలు చెప్పునప్పుడు వేంకటరత్నమునకుఁ గోపము వలనఁ గన్ను లెఱ్ఱనగుచుండెను. అందువలన నాతఁడు మాటల మధ్యనే గుమాస్తా నోరు మూపింప వలెనని చూచెను. గాని యాయన తన యధికారియు, వృద్ధుఁడును నగుట వలన కోపమును మ్రింగి యూరకుండెను. ఆ వృద్ధుని మాటలయిన వెంటనే వేంకటరత్నము నిర్మొగమాటముగా –

'అయ్యా! కృష్ణమూర్తిగారూ! మీరు నన్నిట్లు వేళాకోళముల కడిగినఁ జింత లేదు. కాని యిది వాస్తవమేయైనచో తమ నిశ్చయము నాకెంత మాత్రము సమ్మతము కానేరదు. మీకు మాట యిచ్చినందువలన గావలసిన నేనీ సంగతి నితరుల కెఱింగింపను' అనెను.

ఈ దృఢవాక్యములను విని కృష్ణమూర్తిగారికిఁ గల యుత్సాహమంతయుఁ దగ్గినటులాతని చర్య వలనఁ దెలియుచుండెను. అయినను ధైర్యము విడువక ముసలి గుమాస్తా తియ్యని మాటల వలన వేంకటరత్నమును వశపఱచుకొనఁ జూచెను. సెట్టిగారికిఁగల యమిత ధనమును జూపినను వేంకటరత్నము తన నిశ్చయమును విడువకుండెను. అంత నా గుమాస్తా తన చాతుర్యమువలన వేంకటరత్నగారి దరిద్రమును నాతనికిఁ గానుపించునటుల వర్ణించి యాతని భార్య పిల్లల కందువలనఁ గలుగుచున్న కష్టములను వక్కాణించెను. సదా వాణిజ్యములో మెలఁగి నిపుణుఁడైన వృద్ధుఁడు తన దరిద్రస్థితిని హృదయ ద్రావకముగా నుడువునప్పుడు వేంకటరత్నము కన్నుల నుండి నీరు కారఁజొచ్చెను. ఆ కన్నీటిఁగని గుమాస్తా 'ఏమి? వేంకటరత్నమా? నేనన్నటులనే నీ కుటుంబ స్థితి యున్నదా లేదా?'

వేంకటరత్నము – కన్నులు దుడుచుకొనుచు అవును అటులనే యున్నది.

పెద్దగుమాస్తా – అయితే నీ యిష్టము. నేనన్నమాటకు సమ్మతించవు?

వేంకటరత్నము – ఛీ! కృష్ణమూర్తిగారూ! నాతో మీరిఁక మాటలాడకుఁడు. మీ మాటల వలన నా మనసేమయినఁ జెడునేమో.

ఆ వృద్ధునకు మనుష్య స్వభావ లక్షణములు చక్కఁగా దెఁలిసి యుండినందున మనుష్యుల మనసొకసారి యించుక దుర్మార్గము వైపునకుఁ దిరిగినచో మరల సన్మార్గమునకుఁ దిరుగుట దుస్తరము. గాన నీతనికీ సంగతినిఁ గూర్చి కొంత విచారణ చేయుటకు వ్యవధి కలిగించినచో మన కార్యము సఫలీకృతమగునని తలఁచి యాతఁడు

"మంచిది అటులనే కానిమ్ము. నేనిప్పుడు నీతో మాటలాడను. నీవే యీ రాత్రి యంతయు నాలోచించుకొని ఱేపు ప్రొద్దున నా యింటికి వచ్చి నీ నిశ్చయమును దెలుపుము. ఈ దినములు దీపావళి దినములు. మీ యింట పండుగ కేమియు లేకుండును. గాన నీ నూఱురూపాయిల నోటు నీకిచ్చెదను. వీనిని నక్కఱ లేదనక తీసికొనుము' యని యాతఁడొక నోటును వేంకటరత్నము జేబులో నుంచెను.

దుకాణము నుండి యింటికి వచ్చు త్రోవలో నా గృహస్థుని మనము నందనేక విధముల విచార తరంగములుద్భవింపు చుండెను. వృద్ధుఁడగు నా గుమాస్తా చెప్పిన చొప్పునఁ జేయవలెనా చేయఁగూడదా? యన్న ప్రశ్న యాతని మనమును తొందర పెట్టసాగెను. అట్లు చేయుట వలనఁ దనవంశము యొక్క కీర్తికి భంగము కలుగునని యా మానవుని యంతరాత్మ తెలుపుచుండెను. ఇంతలోఁ జతురుఁడగు కృష్ణమూర్తి బోధ జ్ఞప్తికి వచ్చి యాతఁడనినటులఁ జేయుటకుఁ బురికొల్పుచుండెను. ఇట్టి స్థితిలో వేంకటరత్నమింటికి వచ్చెను. గాన పై నుదహరించినటుల నాతని స్థితి యుండెను. ఈ సంగతినే భార్యకుఁ జెప్పఁబోయి యతఁడు తడబడి చెప్పకుండెనని బుద్ధిమంతులగు చదువరులిది వఱకే గ్రహించి యుండెదరు.

ప్రస్తుతమాయన పరుండి కన్నుల మూసికొని నిదురఁ బోయినవాని వలె నభినయించినను నిదురపట్టక వెనుక నుదహరించి నటులాతని మనస్సునందనేక

విధముల యాలోచనలు వచ్చుచుఁ బోవుచు నుండెను. గానియేమి చేయుటకును నింకను దృఢనిశ్చయము కానందున నిదురరాకుండెను. ఆ సమయమునం దదాటున నాతనికి గుమాస్తా యిచ్చిన నోటు సంగతి తలఁపునకు రాఁగా వెంటనే దానినిఁ దీసి దీపము వెలుతురున నొక జాము చూచి యాలోచింపుచుండెను. అంత నాతని చిత్తము నందేదో యొక దృఢనిశ్చయమయినటుల ముఖమునందగుపడెను. వెంటనే యాయన 'అవును ఇటులనే చేయవలెను. కృష్ణమూర్తిగారన్నది మన లాభమునకే కద?' ఇంతలో నాతని దృష్టి నిదురించియున్న భార్య ముఖము వైపునకుఁ బాఱును. గడియ క్రింద నా సాధ్వి పలికిన పలుకులాతనికిఁ దలఁపునకు వచ్చిన తోడనే యదివఱకైన నిశ్చయమంతయు మఱచి యా పురుషుఁడు 'నేనట్టి చెడు కార్యము జేసినచో సద్గుణ రాశియగు నీమెకు మొగమెట్లు చూపఁగలను? ఛీ, ఇట్టి కార్యమే చెయ్యను'. వెంటనే యాతనికామె వెనుక ముందఱ పరుండి నిదురించుచున్న బిడ్డలగుపడి యది వఱకు వచ్చిన వివేకమును బాఱఁదోలఁగా నతడు, ఈ చిన్నిపాపల కష్టములను జూడనోప నిదియునుగాక నేను జేయఁదలఁచిన కార్యమితరులకుఁ దెలియుట సంభవింపదు? అని మరల నాతఁడు నోటును జూచుచుఁ గూర్చుండెను. ఈ సమయమునందే కారణమువలననో విజయలక్ష్మికి మెలకువ వచ్చి లేచినందున నామెను గని వేంకటరత్నము నిశ్చేష్టితుఁడై గోడకొరిగెను. ఆయన చేతిలో నున్న నోటు క్రిందపడెను.

విజయలక్ష్మి నిదుర నుండి లేచు వఱకామెకీ సంగతులగుపడుట వలన నా సాధ్వి మిగుల నాశ్చార్యమును, విచారమును గలదియై పతిని సమీపించి 'ఇదేమిటి? అర్ధరాత్రి లేచి నేఁడేమి చేయుచున్నారు, సాయంకాలము నుండి యేమిటో నాకుఁ జెప్పఁ గూడదా?' అనునంతలో నామె కచటఁబడియున్న నోటు కానుపించెను. దానింగనిన వెంటనే యామె హృదయము ఝల్లన రోదన స్వరముతో 'అయ్యా! ఈ నోటెచటిది? దీని నెట నుండి తాము తెచ్చితిరో నాకుఁ జెప్పకూడదా? నేఁడన్నియు దుశ్శకునములగానే యున్నవి. మీకు నమస్కరించెదను నాకీ సంగతి నించుక వినిపింపుడు'.

వేంకటరత్నము ముదుసలి గుమాస్తా మాటల వలనఁ గొంత తెలివి కలవాఁడయి నందున నాతఁడు తన భార్య మనసును ద్రిప్ప యత్నించెను గాని, యాతని ప్రయత్నము వలన లేశమైనను లాభము కలుగలేదు. మీదు మిక్కిలి యాతని మాటలను వినినప్పటి నుండియు విజయలక్ష్మి మనమున దిగులొందినందున నామె శరీరము వడఁకసాగెను.

కోపాతిశయమువలనఁ గన్ను లెఱ్ఱబాఱి వానిలో నుండి జలము రాఁదొడఁగెను. అట్టి కోపావేశమునందును నామె యితఁడు నా పతి, యితనిని దండించుట యుక్తముకాదను సంగతి మఱచినదికాదు. కాని, యిట్టి సమయమున మనముపేక్ష చేసినచో నీతఁడు దుర్నడవడిలోఁ బ్రవేశించి చెడిపోవునుగాన, నట్లు కాకుండఁ జేయుట కర్తవ్యమని తెలిసినది గాన నామె యూరకుండక కొంచెమావేశము తెచ్చుకొని, 'ఈనోటు తమరు న్యాయముగా సంపాదించి యుండరని నేనిదివఱకే యనుమానపడితిని. మీరిట్లు చేయుటకు హేతువేమి? నేనెన్నఁడైన నగలకనిగాని, బట్టలకనిగాని మిమ్ముల నిబ్బంది పెట్టితినా? పిల్లలయిన దబానేదేని తెచ్చుటకై కచ్చ చేసిరా? అందువలననే మీకీ దుర్బుద్ధి పుట్టెనా? అందువలననే మీకీ బుద్ధిపుట్టి యుండిన నేను మీ పాదాల సాక్షిగాఁ జెప్పెదను. నేనెన్నడిక యడుగను. పిల్లలనేమయిన నడుగనివ్వను. మాయందను గ్రహించి మీరిట్లు చేయవలదు. ఈ సంగతి యొరులెఱుఁగ జాలరని మీరనెదరు. గాని సర్వసాక్షియగు పరమేశ్వరుని మోసపుచ్చి మీరీ కార్యము చేయఁగలరా? ఇట్లు చేసిన పిదప మీ మనసైనను బూర్వము వలె స్వస్థముగా నుండునా? కష్టపడి సంపాదించుకొనిన పది రూపాయిలను సుఖముగాఁ దినినటుల నీ దొంగసొమ్మును దినఁగలమా? దానిని మనము ముట్టినపుడెల్లనిది మీరు విశ్వాస ద్రోహము వలన సంపాదించితిమని మన మనోవేదన మనను దెప్పుచుండదా? ఓ పరమేశ్వరా! తండ్రీ! ఈ కార్యమును మానుపుటకు నేను శక్తురాలనుగాకున్నాను. నాకీ దరిద్రములోఁ గలుగుచున్న పరమానంద మిక దొరుకఁజాలదుగదా!' యని యామె దుఃఖము నాపుకొనలేక యేడువసాగెను.

దానింగని తెలివి తెచ్చుకొని వేంకటరత్నము దుఃఖింపుచున్న తన సతిని దగ్గఱకుఁ దీసికొని యక్కునఁ జేర్చుకొని 'సతీతిలకమా! నీ సద్బోధ వలన నా మనమునందలి యజ్ఞానాంధకారము తొలఁగెను. నేనికఁ దుష్కార్య మెన్నటికినిఁ జేయను. మనము దరిద్రములో నుండియు సద్గుణముచేత గలుగు నానందము ననుభవించెదము. ఆహా! నాకిట్టి సచ్చరితయగు కాంత లభించినందుననే కదా నేనొక గొప్ప పాపము నుండి విడుదలఁగంటిని. మత్ప్రాణసమానమా! నీకు విజయలక్ష్మి యనిన నామమెంతయుఁ దగియున్నది. నీవు నిజముగా నేఁడు విజయము బొందితివి. లోకులందఱు లక్ష్మీపూజ చేయుచుండఁగా నా దగ్గిర పూజించుటకు లక్ష్మి లేదని గడియక్రింద నేను జింతింపు

చుంటిని. నా దగ్గిర నీ రూపముతోఁ బ్రత్యక్షలక్ష్మియే యుండఁగా నాకా లోహమయ లక్ష్మితోఁ బ్రయోజనమేమి? నేఁడు నేనీ లక్ష్మినే పూజించెదను' అని వేంకటరత్న మా స్వర్ణాలంకారహీనయైన సద్గుణాలంకారయగు విజయలక్ష్మినిఁ దనయాలింగనము చేతం బూజించెను.

ఆ సమయమునందు విజయలక్ష్మి కత్యానందము కలిగినందున నామె దేహము తెలియక భర్త భుజము పై నొరిగెను. తాను తన పతిని నిష్కారణముగా తూలనాడితినని యామెకధిక దుఃఖము కలిగెను. కొంతవడికా సాధ్వీమణి తెలివి తెచ్చుకొని మీరట్లు చెయ్యరుగదా? ఇది నిజమేనా? యని యడిగెను. వేంకటరత్నము వెంటనే నిజముగాఁ జెయ్యనని మరల యామెను గౌగలించుకొని నమ్మఁబలికెను. అపుడామె లేఁచి యాతని పాదములను గట్టిగాఁ బట్టుకొనియెను. తన భర్తయేదో యొక గొప్ప సంకటమునుండి విడువఁబడి తనకు లభించినట్లామెకుఁ దోఁచెను. వేంకటరత్నమామెను లేవనెత్తఁగా శుద్ధాంతఃకరణులగు నా దంపతులు మిగతా రాత్రిని సుఖ నిద్రలోఁ గడిపిరి.

రెండవ దినము నరక శతుర్దశి యగుటవలన నా కుటుంబీకులు తెల్లవారుజాము ననే లేవవలసిన వారలైరి. అప్పుడు విజయలక్ష్మి రుక్మిణిచేత భర్తకును గుమారునకును మంగళహారతులిప్పించి మంగళస్నానములు చేయించెను.

ఇంతలోఁ దెల్లవారినందున వేంకటరత్నము భార్య ప్రేమతో తన చేత నుంచిన బెల్లపుముక్కను దిని దుస్తులను ధరించుకొని మొదట కృష్ణమూర్తిగారింటి కరిగెను. అచటికిఁబోయిన వెంటనే వేంకటరత్నము నోటు నాతనిముందరవేసి 'మీ యాలోచనకు నేను సమ్మతింపను, దయచేయుఁ' డని తన పనికిఁబోవుచుండెను, గాని కృష్ణమూర్తి యాతనినిఁ బోవనియ్యక కూర్చుండఁబెట్టి నేను లోపలి నుండి వచ్చువఱకిచటనే యుండుమని చెప్పియతఁడు లోపలికిఁ బోయెను. ఆయన యట్లు చేయుటకు హేతువేమో తెలియక వేంకటరత్నము విచారించుచుండెను. ఇదియునుగాక తొలిదినము వేంకటరత్న మిందులోఁ బ్రవేశించనని చెప్పునప్పటివలె కృష్ణమూర్తి నిరుత్సాహుఁడుగాక ప్రస్తుత మధిక హర్షమును బొందినటులఁ గానుపించెను.

దీనినన్నిటినిఁ గూర్చి విచారింపుచు వేంకటరత్న మా గుమాస్తా రాఁక కెదురు చూచుచుండ నంతలోఁ దన యజమానుఁడగు వేంకటసెట్టియుఁ కృష్ణమూర్తియుఁ దన

దగ్గిరకు వచ్చుచున్నటు లాతనికిఁ గనుపించెను. వెంటనే యజమానునకు నెదురు వోవుట కాతఁడు లేవఁగా నింతలో సెట్టిగారే యాయనను సమీపించి 'వేంకటరత్నమాఁ శాబాస'ని వీపు తట్టెను. అందుపై సెట్టి వేంకటరత్నమును గని 'నీవు మిక్కిలి తెలివికల వాఁడవు. పాటుపడు స్వభావము గలవాఁడవని తెలిసికొని యట్లే నీవు సత్య ప్రవర్తకుఁడవో కావో పరీక్షింపనెంచి నేనీ కృష్ణమూర్తిగారికిఁ జెప్పి యిటులఁ జేయించితిని. నీవు నా కఠిన పరీక్షలో నుండియు దుర్ఘటమగు దరిద్రము నుండియుఁ దేరితివి. నిన్న నీ మనసొకింత మెత్తనయినటులఁ గానుపించెను. గాని యది నీ దోషము కాదు. నీ దరిద్రదేవత దోషమే యగును. చెడుకార్యమెన్నఁడును జేయనివాని కంటెను జెడు కార్యముల వైపులకొకింత మనసు తిరిగి వివేకియైనవాఁడే యుత్తముఁడు. మొదటివానిచేత తప్పిదము జరుగును, గాని రెండవానిచేత బొత్తిగా తప్పిదమగుటయే సంభవింపదు. నిన్న నీకిచ్చిన నూఱురూపాయలును నీవే. వానిని నీవు నీ యుదాత్త గుణముల వలనఁ బడిసితివి, రెండవది నిన్ను నేఁటి నుండియు నిఱువది రూపాయిల వేతనమునిచ్చి కృష్ణమూర్తిగారికి సహాయునిగా నుంచెదను. ఇది యంతయు విని వేంకటరత్న మూరకుండఁజాలఁడయ్యెను. ఆయనకుఁ దన స్తుతి వినుటకు నిష్టము లేక తొలిరాత్రి జరిగిన దంతయు నచట సవిస్తరముగా వినిపించెను. దానిని విని వేంకట సెట్టి పరమానందభరితుఁడయ్యెను. ఆయన వెంటనే తన భార్యకుఁ జెప్పి విజయ లక్ష్మినిఁ బిలిపించి 'అమ్మా! నీవు నిజముగా విజయలక్ష్మివే. ఇట్టి నీవు నా ధర్మకన్యక' వని మన్నించెను.

నాఁటి నుండి నిజముగా వేంకటసెట్టి విజయలక్ష్మిని స్వకన్యకగా భావింపు చుండెను. వేంకటరత్నమామె నొక దేవతనుగా నెంచి ప్రేమించుచుండెను. ఆ దంపతు లట్లు తమ ధైర్యము చేత వడసిన సంపద నధికానందముగా ననుభవింపుచున్నవారు.

## కథానేపథ్యం ...

కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారి అక్కగారు. ఆంధ్రదేశంలో స్త్రీవిద్యా, విజ్ఞానాలపట్ల సమాజ దృష్టిని మళ్ళించిన మాన్యచరిత. సంస్థాగతమైన కృషి ఆధునికాంధ్రదేశంలో ఈమెతోనే ప్రారంభమైందని చెప్పాలి. తన భర్త ఉద్యోగరీత్యా చాలాం నాగపూరులో వుండడంబట్టి ఈమె మహారాష్ట్రభాషలో విద్వత్తు సముపార్జించింది. మాతృభాష తెలుగు, ఆనాటి పండిత భాష సంస్కృతం, విజ్ఞాన వ్యాపనభాష ఇంగ్లీషులో తమ్ముడిసాయంతోనూ, మార్గదర్శనంతోనూ ప్రజ్ఞ నలవరచుకున్నది. భారతీయ సంస్కృతిని, సంప్రదాయాన్ని, వేదోపనిషత్తులను గౌరవిస్తూనే మహిళాభ్యుదయం కోసం సమాజ పురోగతిని, స్త్రీవిద్యను, జాతీయవాద దృక్పథంలో ప్రోత్సహించింది. స్త్రీ పురుషు సమానత్వాన్ని ప్రబోధించింది. ఆధునిక కాలంలో తొలితరం మహిళా రచయిత్రులలో ఈమె ప్రథమగణ్యురాలు. మహిళా మండలులను, స్త్రీ సమాజాలను ప్రోత్సహించింది. గురజాడ అప్పారావుగారికి ముందే చిన్న కథకు ఆద్యురాలు. అచ్చమాంబగారి 'అబలా సచ్చరిత్ర రత్నమాల' గ్రంథంనుంచి కొమర్రాజు లక్ష్మణరావు తన చరిత్ర గ్రంథాలలో భారతీయ మహిళ ఉదాత్త చరిత్రలను ఉదాహరించాడు. అప్పటి తెలుగు పత్రిక 'హిందూసుందరి'లో ఈమె రచనలు చేశారు.

ఆధునిక కథాలక్షణాలు సంతరించుకుని కొసమెరుపుతో కూడిన కథ.

పొరపాటు ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్న భర్తను సరి అయిన మార్గంలో మళ్ళేలా ప్రోత్సహించిన స్త్రీమూర్తి ఈ కథలో కనిపిస్తుంది. ఆ రోజులలోని ఆర్థిక పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు తీర్చిదిద్దారు. కథలోని ఆర్థిక పరిస్థితికి వందరూపాయలు చాలా పెద్ద మొత్తం. అతని సమస్యలను దూరం చేయగలిగే పరిస్థితులలో అతని ఆలోచనలు అపసవ్యమార్గంలోకి మళ్ళే ఆలోచనను తిరిగి సవ్యమార్గంలోకి మళ్ళించింది ఈ కథలోని స్త్రీ. ఈ కథలోని కథానాయకుడు ఎంతో ఉన్నతుడు, బాగా బ్రతికి చెడినవాడు. నీతి నియమాలు మెండుగా కలవాడు. కాని ఆర్థిక ఇబ్బందులు ఎంతటి వారినైనా మార్చే అవకాశం వుందనేది ఈ కథ ద్వారా తెలుస్తుంది.

# 43. తీరని సమస్య

– కొడవటిగంటి కుటుంబరావు

ద్రౌపది రంభ అని ఎవరూ ఎన్నడూ అనలేదు గాని, పదేళ్ళక్రితం కూడా ఎరిగినవాళ్ళు 'దానికేం? చక్కగా కనుముక్కు తీరుగా ఉంటుంది' అనుకునేవాళ్ళు. ఇప్పుడెవరన్నా దాని పెళ్ళివిషయం మాట్లాడేప్పుడు 'ఆఁ, ఏం చూసి చేసుకుంటారు, బాబూ? వాళ్ళ నాన్న ఇచ్చే కట్నం చూశా; దాని అందచందాలు చూశా?' అని చప్పరిస్తున్నారు. ద్రౌపది మారిపోయింది.

ఎందుకు మారదూ? ఇరవైతొమ్మిదికూడా వెళుతుంది, ఇంతవరకూ పెళ్ళికాలేదు; అయేటట్టు కూడా లేదు, బియ్యే పాసయింది. ఉద్యోగం లేదు. అన్న కామేశ్వర్రావు రెక్కల మీద సంసారం నానా అగచాట్లుగా వెళుతున్నది. అతనికి అప్పుడే ఆరుగురు పిల్లలు, రోగిష్టి పెళ్ళాం. పిల్లల్ని కనటానికి తప్ప మిగతా అన్ని పనులకీ ఆవిడకి రోగమే. ఆ రోగిష్టి పెళ్ళాన్ని కనిపెట్టుకుని ఉండేటందుకు రోగిష్టి అత్తగారు. ఒక జల్లుపడ్డా, కాస్సేపు నీళ్ళల్లో నానినా ఆవిడకి కాళ్ళు పట్టుకుపోయి యమబాధపడుతుంది. ఆచారవంతురాలు గనక నీటిలో నానటం రోజూ ఉంటుందనే చెప్పొచ్చు. ముసలాయనకి – అంటే ద్రౌపది తండ్రికి – ఆస్తి పోయిన నాటినుంచి మతిసరిగా లేదు. అస్తమానం ఇంట్లోనే కూచుంటాడు. ఇంటి ఇబ్బందులన్నీ ఆయన్ని పాపం బాధిస్తూంటాయల్లే ఉంది. వాటిని గురించే మననం చేస్తూ వుంటాడు. ఎప్పుడన్నా కామేశ్వర్రావు తండ్రిమీద విసుక్కుంటాడు.

"ఆర్చేవాడివా, తీర్చేవాడివా? నీకెందుకయ్యా? ఏం రోగాలో, ఏం బాధలో, ఏం దరిద్రమో మేం పడుతున్నాంగా? వేళకింత తిని హాయిగా కూచో, ఏ బాధ లేదనుకో"

ముసలాయనకి అది యిష్టంలేదు. ఎద్దు దున్నితే జోరీగ రొప్పిందన్నట్టు, నిజమైన శ్రమంతా కామేశ్వర్రావు పడుతుంటే, అతనికి సానుభూతిగా కాబోలు, కర్మ ముసలాయన మూలుగుతూ ఉండేవాడు. అటువంటి పరిస్థితిలో కామేశ్వర్రావే తనని కోప్పడేసరికి ఆయనకి కష్టం వేసేది. వెంటనే ద్రౌపది మీద విరుచుకుపడేవాడు.

"నీ మొహం తగలెయ్యా, నీ చదువు చట్టుబండలుగానూ! నా ఆస్తంతా నీ చదువు కిందే ధారపోసానే! నీ చదువంతా పెట్టి ఒక్క రూపాయి సంపాదించగలవుటే? ఆ డబ్బంతా వాడికింద ఖర్చు పెట్టి ఏ ఇంగ్లండో పంపిస్తే వాడికి వేలకు వేలు జీతం వచ్చి ఉండును గదే! వేలకువేలు! నీ మొహాన దేవుడేంరాత రాసాడోగాని నిన్నెవడూ పెళ్ళయినా చేసుకోడేమే? కుంటివాళ్ళకీ, గుడ్డివాళ్ళకీ క్షణంలో పెళ్ళవుతుంది గాని నీకు మటుకు కాదే! నీకసలు మొగుడంటూ పుట్టి ఉంటేగా?"

వీటన్నిటికీ ద్రౌపది సమాధానం చెప్పగలదు. కాని ఏమిటి లాభం? ఒక్కోసారి ఈ మాటలకు ద్రౌపది ఏడిచేది. కాని పైవాళ్ళు "ఛీ, ఊరుకో. మతిలేనివాడి మాటలు పట్టించుకుంటారా?" అని సముదాయించేవాళ్ళు. సముదాయింపు సులభం. గురి లేనివాడు రాయి విసిరినా తగిలితే నొప్పెత్తుతుంది. మతిలేనివాడితో కలిసి ఉంటూ మతి గలిగిన మనిషల్లే ఏళ్ళ తరబడి ఉండటంచాలా కష్టం. పిచ్చీ, హిస్టీరియా మొదలైనవి మానసిక అంటు వ్యాధులు ... ద్రౌపదికి అనేకసార్లు సందేహం కలిగింది, తనకు మతి సరిగా ఉందా అని ...

ఇంటిల్లిపాదికీ పనిచెయ్యటానికి ఆరోగ్యంగా ఉన్న మనిషి ఇంటికంతకీ ద్రౌపది ఒకతే. ఆమె ఆ యింట్లో చేసేపని ఎవరన్నా సంపన్నులకి చేస్తే నెలకొక వంద రూపాయిలిస్తారు. కాని, కామేశ్వర్రావేం ఇవ్వగలడు. అతను తెచ్చుకునేది నూటపాతిక. అందుచేత ద్రౌపది ఈ చాకిరీ యావత్తూ తన సొంతానికనుకునే చెయ్యాలి.

దురదృష్టవశాత్తూ ఈ కొంపలో ఈ చాకిరీ తప్పిస్తే ద్రౌపది సొంతం ఇంకేమీలేదు. ఈ ఇల్లు తనదనీ, ఈ ఇంట్లో తనకు సహజమైన స్థానం ఉందనీ ద్రౌపది విశ్వసించటం మానేసి అయిదారేళ్ళయింది.

ముసలాయన మతిపూర్తిగా చెడకముందే "దీని పెళ్ళయితేనేగాని నాకు మంచి రోజులు రావు. చక్రం చూసినవాడల్లా ఆ మాటే అంటున్నాడు" అని ప్రారంభించాడు. కాలక్రమేణ ఈ పాటకి చాలా సంగతులు చేరాయి. "రోజూ లేచి దీని మొహం చూసి బయటికెళ్ళితే ఎవరూ ఎర్రఏగానీ చేతిలో పెట్టడుగదా!" ... దీనికి పెళ్ళయేదేమిటి? నా అదృష్టం తిరిగేదేమిటి?" ... ముసలాయన అట్లా ఎడమైపోయాడు.

కామేశ్వర్రావు మరోరకంగా ఎడమై పోయినాడు. అతను చెల్లెల్ని పోషించలేక పోవటం గాని, ఎట్లాగైనా ఆమె పెళ్ళి అయిపోయి కాపరానికి వెళ్ళిపోతే తన భారం కొంత తగ్గుతుందనుకోవటం గాని అయితే ద్రౌపది అంతగా విచారించి ఉండదు. ఆమె

కూడా చదువుకున్నదే, అర్థం చేసుకోగలదే. కాని కామేశ్వర్రావు అచ్చగా అంతటితో ఆగలేదు; ఆమెకు వొట్టి చచ్చు సంబంధాలు తెచ్చి ముడిపెట్టాలని తొందరపడ్డాడు. అందమూ, గుణము లేనిచోట డబ్బుకోసం గడ్డి తినేవాళ్ళనే మనం ఎంతో నీచంగా చూస్తాం. అందమూ, గుణము డబ్బూకూడా లేని దిక్కుమాలిన వెధవలకి తన చెల్లెల్ని అంటగట్టాలని చూశాడు కామేశ్వర్రావు. ఆ సంబంధాలను గురించి ద్రౌపదితో అబద్ధాలాడి దొరికిపోయినాడు. ఆమె ఒదిలిపోతే చాలు, అవతల ఆమెగతి ఏమైనా సరే అనే స్థితికి అతను వచ్చాడని తెలిసినాక ద్రౌపది అన్నని పరాయివాడికంద కట్టేసింది. అంత అసమర్థపుస్థితిలో ఉన్న ద్రౌపది అన్నని పరాయివాడికంద కట్టటంకంటే ఇంకే విధంగా శిక్షించగలదు?

అతనికి తన మీద సోదర ప్రేమ లేకపోతే లేకపోయింది; తన పిల్లలకీ, పెళ్ళానికీ, చివరకి అత్తగారికీ కూడా చచ్చేట్టు చాకిరి చేస్తున్నందుకు కామేశ్వర్రావు తన మీద ఆపాటి కృతజ్ఞత చూపగూడదా? ఏ భ్రష్టుణ్ణో, అతనిమాట చొప్పునే, పెళ్ళాడి తన దారిన తాను కాపరం వెళ్ళిపోతే మర్నాడు ఈ కుటుంబం గతి ఏంకాను? ఆ సంగతి అతను ఆలోచించలేడా?

తన తండ్రీ, అన్నా దూరమైనాక ఆ ఇంటో ద్రౌపదికి దగ్గిరవాళ్ళెవరు? ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పుకుంటుంది? బయటికి అనుకోవటానికి లేని ఈ బాధ ఆమె మనస్సును తొలిచి డొల్ల చెయ్యసాగింది. ఇది ఆమె జీవితానికి తెగని సమస్య. ఇందులో పెళ్ళీ, డబ్బూ, స్వేచ్ఛా ఈ మూడిటి తాలూకు పోగులూ చిక్కుపడి ఉన్నై.

ద్రౌపది తనకు పెళ్ళి కాలేదని మనోవ్యాధి పాలుకావటం ఇతరులకెంత సహజంగా కనిపించినా, ఆమె విషయంలో అది కృత్రిమంగా తయారయిన సమస్య. ఎందుకంటే ఒకప్పుడు ఈ తండ్రే ఆమె జీవితానికి చదువే ముఖ్యమైన విషయంగానూ పెళ్లి అముఖ్యంగానూ మాట్లాడాడు. ఒకప్పుడామెను చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తోసేసి అవమానించాడు. అది ఆయనకు జ్ఞాపకం లేదు. ద్రౌపదికి జ్ఞాపకం వుంది. అదికాక మొగుడులేడనే చింతే అయితే ఏ ఆడదాన్నీ కుంగదీయదు; మొగుళ్ళుపోయి వైధవ్యం మీదపడి రాళ్ళల్లే ఉన్న వితంతువులు చాలామంది వున్నారు.

కాని ఆ వాతావరణంలో ఇప్పుడు ద్రౌపది మామూలు మనిషి కాదు. ఆమెకిప్పుడు పెళ్ళి తప్ప గత్యంతరం లేదు. ఈ ఇల్లూ, వాతావరణమూ వొదిలించుకోవాలంటే పెళ్ళి తప్ప మరో మార్గం లేదు. పెళ్ళయితే తన మిగతా సమస్యలన్నీ తీరుతాయి. ఎంతకీ ఆ పెళ్ళే కాకుండా ఉంది.

"నేను మబ్బుల్లో కూచుని నిజం తెలుసుకోకుండా వున్నానా? కామేశ్వర్రావు నన్ను చేసుకోమన్న సంబంధాలకంటే నాకు మంచివి రాగలవా? అతను నా యోగ్యత సరిగానే అంచనా కట్టాడా? నన్ను గురించి నాకు ఎంత అధమమైన అభిప్రాయం తెచ్చి పెట్టుకున్నా, ఇతరులకు నా మీద ఇంకా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుగా తోస్తుందే! ఏమిటి కారణం? ఇంకా ఎంతని కుంగను? దానికి అంతెక్కడ?" అనుకునేది ద్రౌపది. ఒక్కసారి ఆమెకి ఆత్మవిశ్వాసం ఏమీ లేకుండా పోయి, 'ఈసారి ఎవడన్నా పెళ్ళి చేసుకుంటానని వస్తే కళ్ళు మూసుకుని ఒప్పేసుకుంటాను, నేనవసరంగా ఎందుకు మథనపడాలి? నిండా మునిగినవాడికి చలేమిటి? ఏ పెళ్ళి చేసుకున్నా ఇంతకన్నా దరిద్రంగానూ, నిర్బంధంగానూ, మనోవ్యాధిగానూ ఉండదుగదా? ఏదైనా ఉన్నవాళ్ళకి పోతుందని భయంగాని, ఏమీ లేని నాబోటి దానికి పొయ్యేదేమిటి? ఈసారి ఎవరు వచ్చినా చేసుకుంటాను. ఇది నిశ్చయం' అనుకునేది.

ద్రౌపదికి పరీక్షగా ఒక సంబంధం వచ్చింది. వరుడికి యాభైఅయిదేళ్ళు. ఇటీవలే భార్య పోయింది. అయిదారుగురు సంతానం. ఆయనకి తల్లిదండ్రులున్నారు. తండ్రికి పిచ్చి, తల్లి వ్యాధి పీడితురాలు. ఆచారవంతురాలైన విధవ చెల్లెలొకతె ఉంది. చిన్న పిల్లని చేసుకోమని ఆవిడ గోలట. ఈయన కాస్త లోకజ్ఞాని. పెద్దదాన్నే చేసుకుంటానని వచ్చాడు. ద్రౌపదిని చూసి వెళ్ళాడు.

ఆయన విషయాలన్నీ వినగానే ద్రౌపదికి ఆపుకోలేకుండా నవ్వొచ్చింది. ఈ పెళ్ళయితే తన జీవితంలో ఏమీ మార్పుండదు. ఇక్కడ ఉన్న మనుషులకు నకళ్ళే వాళ్లూనూ. వీళ్ళు చూసినట్టే తనని వాళ్ళూ పరాయిగా చూస్తారు. ఎందుకీపెళ్ళి?

'నాకక్కర్లేదీ సంబంధం?' అందామని నోటిదాకా వచ్చింది. కాని బలవంతాన నోరు నొక్కేసుకుంది.

మర్నాడు కామేశ్వర్రావు కబురు తెచ్చాడు. ఆ పెద్దమనిషికి ద్రౌపది మరీ సన్నగా, జబ్బుగా కనిపించిందట. ఆయన ఇంకో సంబంధం పద్ధెనిమిదేళ్ళ పిల్లని స్థిరపరుచు కున్నాడుట.

**కథానేపథ్యం ...**

కొడవటిగంటి కుటుంబరావు తన యాభై ఏళ్ళ రచనా జీవితంలో పది పన్నెండువేల పేజీలకు మించిన రచనలు చేసాడు. చందమామ పత్రికను చందమామగా తీర్చిదిద్దిన ప్రముఖులలో ఆయన అగ్రగణ్యుడు. సమకాలీన మానవ జీవితాన్ని పరామర్శించి విమర్శించి, సుసంపన్నం చేసేదే సరైన సాహిత్యంగా ఆయన భావించాడు. ఇతను కొ.కు అనే పొడి అక్షరాలతో ప్రసిద్ధి చెందినవాడు. ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు, జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణకాదు, జీవితంలోని ప్రతీకోణాన్ని చూపించలేనిది సాహిత్యమే కాదనేవి ఆయన అభిప్రాయాలు.

ఉన్నతమైన విద్యనభ్యసించి కూడా, కట్నకానుకలను ఇచ్చుకోలేని మధ్యతరగతి యువతిపాత్రని ఆయన తీరని సమస్యకథలో చక్కగా వివరించారు. ఎక్కువకాలం పెళ్ళికాకుండా ఇంట్లోనే మిగిలిన యువతికి ఇంటిపనిమిషికి మించిన గౌరవం వుండదనే విషయాన్ని సూచించారు. ఈ కథలోని కథానాయిక పెళ్ళికాకుండా మిగిలి పోవడంవల్లనే అన్నగారి కుటుంబానికి సేవచేస్తూ గడపవలసి వచ్చింది. ఏదో ఒక సంబంధం చేసుకుందామని నిశ్చయించుకున్నా, రెండోపెళ్ళి వాడికి కూడా పద్దెనిమిదేళ్ళ ప్రాయమున్న కన్య కావలసి వచ్చింది. కథలోని యువతి సమస్య తీరని సమస్యగానే మిగిలిపోయింది.

# వందేళ్ల తెలుగు కథకు వందనం

– అక్కిరాజు రమాపతిరావు

**నా**సికాత్రయంబకం దగ్గర గోదావరి ఒక చిన్న మడుగు. ధవళేశ్వరం దగ్గర మూడు మైళ్ల మహానది. అలాగే తెలుగు కథ కూడా విశ్వరూపం దాలుస్తోంది. 20వ శతాబ్ది ప్రథమ దశకం నాటికి రచయితలు పట్టుమని పదిమందే. శతాబ్ది చివరి దశకానికి ఆ సంఖ్య పది పదులను మించిపోయింది. తెలుగుకథా శతజయంతి సందర్భంగా ఇదో విహంగవీక్షణం...

ఆధునిక స్వరూప స్వభావాలతో తెలుగు కథ పుట్టి ఇప్పటికి నూరేళ్లయ్యింది. ఈ నూరేళ్లలో ఒక లక్ష కథలైనా వచ్చి ఉంటాయి. ఒక నూరుగురినైనా మంచి కథకులను, ఒక ఏభైమందినైనా గొప్ప కథకులను ఆధునిక తెలుగు సాహిత్యంలో లెక్కించవచ్చు. మంచి కథ అంటే ఏమిటి? అది ఎట్లా ఉంటుంది? గొప్ప కథ తీరుతెన్నులను ఎట్లా నిర్ణయిస్తాము అని చర్చలకూ, వాదవివాదాల జోలికీ పోకుండా వస్తువు, శిల్పము, భాషాశైలి, లోక పరిశీలన అనే అంశాలలో ఒకటి రెండైనా హృద్యంగా నిర్వహించినప్పుడు అది మంచి కథ అవుతుందనీ, అన్ని అంశాలూ ప్రకృష్టంగా రూపొందినప్పుడు అది గొప్ప కథ అవుతుందనీ నిర్ణయించవచ్చు.

కథ లేదా చిన్న కథ (కథానిక) ప్రపంచ సాహిత్యాంలోనే ఆధునిక ప్రక్రియ అన్నాడు వి.ఎస్.నయపాల్. ఆయన సాహిత్యానికి నోబెల్ పురస్కారం లభించింది. ఈయన పూర్వులు భారతదేశానికి చెందినవారు. పందొమ్మిదో శతాబ్దానికి పూర్వం కవిత్వం సాహిత్యంలో ఎటువంటి స్థానం పొందిందో ఆ తర్వాత కథ ఆ స్థానాన్ని వశీకరించుకుంది అని నయపాల్ అభిప్రాయం. లోకవృత్త పరిశీలనకూ, మానవ జీవిత సహజాతాలకు, భావోద్విగ్నతలకూ, అంతరంగ బహిరంగ సంస్పందనలకూ కథారచన సమర్థమైన మాధ్యమం.

కథారచనలో స్వీకరించి నిర్వహించలేని లేదా కథ రచనకు అనువుగాని ఇతివృత్తం అంటూ ఉండదు. ఒక నాటకానికి, కావ్యానికీ, వ్యాసానికీ స్వీకృతం కాని ఇతివృత్తం

కాలేని వస్తువు కూడా కథారచనకు చక్కగా పనికివస్తుంది రచయిత ప్రతిభ ద్వారా. మానవ జీవిత సమస్తాన్ని ఆవిష్కరించగలిగేది ఒక కథానిక మాత్రమేనేమో! మానవ జీవితానికి అది అక్షర ప్రాతినిధ్యం వహించగలదు. తక్కిన ప్రక్రియలకు లేని సౌకర్యం మానవుడి బాహ్యాంతర సంఘర్షణలను ప్రతిస్పందింపచేగల, ప్రతిబింబింపచేయగల సామర్థ్యం ఒక్క కథానికకు మాత్రమే ఉందనటంలో ప్రత్యాఖ్యానించవలసింది ఏమీ లేదు. కావ్యం కాని, నాటకంకాని, విమర్శకాని మానవజీవితంలోని అన్ని సంవేదనలను యథార్థీకరించలేవు. కథ ఆ పనిచేయగలదు. ఆధునిక సాహిత్యంలో కథానికకు అందుకే ఇంత ప్రాముఖ్యం కలిగిందనాలి.

తెలుగు కథ 20వ శతాబ్ది ప్రారంభంతోనే ప్రభవించింది. 21వ శతాబ్ది ప్రారంభానికి విశ్వరూపం ధరించింది. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర రాసేవాళ్ళంతా తెలుగు కథా రచనకు ఆద్యుడు గురజాడ అప్పారావు అంటారు. కాని నూటికి నూరు పాళ్ళు ఈ అభిప్రాయం యథార్థం కాదు. సమ్మతం కావాల్సిన పనిలేదు.

గురజాడ అప్పారావుగారికంటే ముందే కథారచనకు పూనుకొన్నవారు నలుగురైదుగురున్నారు. ఆయనతోపాటు అదేకాలంలో కథారచన చేసినవారు నలుగురైదుగురున్నారు. అయితే గురజాడనే తెలుగు కథా రచయితగా చెప్పడం ఎందుకు? ఇతివృత్తంలో, శిల్పంలో, శైలిలో, నవీన భావావిష్కరణంలో, నాజూకుతనంలో తనదైన మౌలికతను చూపాడు కాబట్టి గురజాడ అప్పారావును ఆద్యుడు అనడంలో తప్పులేదు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యానికి ఆద్యుడు నన్నయ్య అనటం ఎటువంటిదో, తెలుగు కథకు ఆద్యుడు గురజాడ అప్పారావే అనడం కూడా అటువంటిదే. నన్నయ్య కన్నా ముందే తెలుగులో పద్యరచన ఉంది. అయినా భాషకు, శైలికి ఒక చక్కటి వ్యవస్థను, పరిణతిని తెచ్చినవాడు కాబట్టి ఆయనను ఆదికవి అని గౌరవించాం. నన్నయ కన్నా ముందు ఏ కొంచెమో కావ్య సాహిత్యం ఉన్నా మతకలహాలలో, సామాజిక సంక్షోభాలలో, రాజుల యుద్ధాలలో అది నశించి ఉండవచ్చునని కొమర్రాజు లక్ష్మణరావు శివతత్త్వసార పీఠికలో చెప్పారు.

ఇక గురజాడ అప్పారావు కన్నా ముందే కథా రచన చేసిన వారెవరు? 1895లోనే 'తెలుగు జనానా' అనే పత్రిక మొదలైంది. సమకాలీన చారిత్రకమూ, సంఘ సంస్కరణ విషయకమూ అయిన కథలు ఇందులో వెలువడ్డాయి. దీని సంపాదకుడు రాయసం వెంకటశివుడు వీరేశలింగంగారి శిష్యుడు. విద్యావేత్తగా ప్రసిద్ధుడు. సంఘసంస్కరణం

పట్ల, మహిళాభ్యుదయం పట్ల ఆసక్తి ఉన్నవాడు. 1905, 06 సంవత్సరాలలో 'తెలుగు జనానా' పత్రికలో ఆయన కథలు వచ్చాయి.

'నాకు ప్రియమగు నాదర్శములను, నిశ్చితాభిప్రాయములను గొన్నిటిననుసరించి నాయిచ్చ వచ్చిన చొప్పున నేయీ కథలల్లినను, ఆంధ్రదేశమునందలి జనుల పరిస్థితులను ఊహాపోహలను అభివర్ణించుటయే ముఖ్యోద్దేశముగ గలిగియుంటిని. నా యుద్దేశ మెంతవరకు సఫలీకృతమయ్యెనో రసజ్ఞులగు పఠితలే గ్రహింతురుగాక' అని చిత్రకథా మంజరి అనే తమ కథల సంపుటి పీఠికలో చెప్పారు వెంకటశివుడు. ఆయన కథల పేర్లు లీల, శారద, కృష్ణవేణి, గౌతమి ఆయన కథారచనలో కొత్తదనం స్వీకరించినట్లే చెపుతున్నాయి.

'తెలుగు జనానా' లో కథలు ప్రకటించినవారిలో ఇవటూరి కనకాచలం పేరు కనపడుతుంది. కొన్ని సంచికలు 'తెలుగు జనానా' ఇప్పుడు లభిస్తాయి కాని వరుస సంచికలు దొరకవు. కాబట్టి వీరి కథలు సమీక్షించడం కుదరదు. 1912 ఏప్రిల్ 26 కృష్ణాపత్రికలో కనకాచలంగారి కథ ఉంది. గురజాడకన్నా ముందే కథలు రాసినవారు వెదురుమూడి శేషగిరిరావు. 1905లోనే తణుకు నుంచి 'సువర్ణలేఖ' అనే వారపత్రిక ప్రారంభమైంది. 15 సం॥లు ఈ పత్రిక వెలువడినట్లు తోస్తుంది. ఇందులో శేషగిరిరావు కథలు రాశారు. ఇవి 1911 నాటికే 'మదరాసు కథలు' అనే సంపుటంగా వెలువడ్డాయి. "మన పద్ధతుల నితరులెట్లు భావించుచున్నారు" అనే కథ ఇంచుమించు నూరేళ్ళ తర్వాత మళ్ళీ మార్చి, 2007 సంచిక 'విపుల' లో పునఃప్రచురితమైంది. ఇద్దరు ఇంగ్లీషు కలెక్టర్లు నూరేళ్ళనాడు తాము చూసిన తెలుగువారి సమాజాన్ని, వాళ్ళ అంధ విశ్వాసాలను, మూఢాచారాలను ఏవగించుకోటం, విద్యాధికులైనా భూతాలు, దయ్యాలు, మంత్రాలూ, మాయలూ, మూఢనమ్మకాలూ ఆ రోజుల్లో సమాజాన్ని ఎట్లా పట్టి పీడించేవో నిరసించడం దీని ఇతివృత్తం. ఈ విషయాలపై వాళ్ళు లేఖలు కూడా రాసుకుంటారు. ఈ కథలో 1909 జూన్ 20 తేదీ ఒక లేఖలో ప్రస్ఫుటమవుతుంది. అందువల్ల ఆ సంవత్సరంలోనో, కొంచెం అటు తర్వాతనో ఆ రచయిత ఈ కథ రాసి ఉండవచ్చునని ఊహించవచ్చు. గురజాడ అప్పారావుకి ముందే రాయకపోయినా కచ్చితంగా ఆయన సమకాలీన రచయిత అనుకోవాలి. ఇప్పుడాయన కథల సంపుటాలెక్కడా దొరక్కపోవడం దురదృష్టం. మాడపాటి హనుమంతరావుగారి కథలు 1915లో 'మల్లికాగుచ్ఛము' పేర ప్రచురితమయ్యాయి. 1920 ప్రాంతాలలో పానుగంటి లక్ష్మీనరసింహరావు 'సువర్ణలేఖ' లో కథలు రాశాడు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే గురజాడ కన్నా పదేళ్ళ ముందే భండారు అచ్చమాంబ కథ రాయడం. 'ధనత్రయోదశి' పేరుతో ఆమె దాంపత్య లాలిత్యాన్ని గూర్చి 'హిందూ సుందరి' పత్రికలో 1901-02 ప్రాంతాలలోనే కథ రాసినట్లు తెలిసింది. ఆ కథే ఇప్పుడు లభ్యమవుతోంది. అచ్చమాంబ కొమర్రాజు సోదరి. కొమర్రాజు కూడా 'ఏబదివేల బేరము' అనే పేరుతో 1910 నాటికే ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో ఒక కథ రాశారు. ఇది సామాజికేతివృత్తమే. ఆ మరుసటి సంవత్సరం కోటంరాజు పున్నయ్యగారి కథ ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో వచ్చింది. ఈ కథ పేరు 'వంశపావనుడైన తనయుడు'. పున్నయ్యగారు గొప్ప ప్రతిభావంతుడు. అప్పట్లో కరాచీ నుంచి వచ్చే 'సింధ్ అబ్జర్వర్' - పత్రికకు సంపాదకుడీయన. ఆంధ్రపత్రికలో పనిచేస్తున్నప్పుడు ఉగాది సంచికలో ఈ కథ ప్రచురించాడు. గురజాడకన్నా ముందే తెలుగు కథకు రూపురేఖలు చేకూర్చినవారిలో ఆచంట సాంఖ్యాయనశర్మ చెప్పుకోవలసిన వారు. 1903 నాటికే తాము నడుపుతున్న 'కల్పలత' పత్రికలో 'అపూర్వోపన్యాసం' కథ రాశారు. గొప్ప విద్వాంసుడైనా కథా రచనపట్ల ఆయన ఆసక్తి చూపడం ఆశ్చర్యకరం.

1913వ సంవత్సరం తెలుగునాట గొప్ప పుస్తక ప్రచురణ సంస్థగా ఖ్యాతికెక్కిన వావిళ్ళవారు 'త్రిలింగ' పేరుతో మాసపత్రిక ప్రారంభించారు. అర్ధశతాబ్దంపాటు వెలువడిన త్రిలింగలో కథలు వచ్చేవి. తొలి సంవత్సరాల (స్థాపక) సంపాదకుడు అక్కిరాజు ఉమాకాంతం. 1913, 14 సంవత్సరాలలో త్రిలింగలో ఉమాకాంతంగారివి 10 కథలదాక కనపడతాయి. కొన్ని అనువాదాలు, అనుకరణలు కూడా వీటిలో ఉన్నాయి. వావిళ్ళ వారు 'త్రిలింగ' చిన్నకథలు పేర ఈయన కథల సంపుటి ప్రచురించారు. ఈయన కలకత్తాలో ఇంటర్మీడియట్ చదివాడు. రవీంద్రనాథ్ టాగూర్ 'కాబూలీవాలా' కథ తెలుగులో మొట్టమొదటిసారి అనువదించింది ఉమాకాంతమే. ఈ కథ 'త్రిలింగ'లో వచ్చింది. నవద్వీపపండితుడైన ఉమాకాంతం చిన్నకథపట్ల మక్కువ చూపడం గొప్ప సంగతి. ఉమాకాంతం రాసిన 1913 నాటి కథ 'విపుల' 2007 డిసెంబర్ సంచికలో వచ్చింది. ఈ కథ పేరు 'ఎదగనిబిడ్డ'. (1903 నుంచి 1940 దాకా వచ్చిన తొలితరం తెలుగు కథలు సెప్టెంబర్ 2005 నుంచి డిసెంబర్ 2007 దాకా విపులలో వచ్చాయి.) ఉమాకాంతం కథలలో స్త్రీలలో విద్యా విహీనత, దాంపత్యాలలో సుఖం లేమీ వర్ణించాడు. ఈవిధంగా గురజాడ కన్నా ముందే నలుగురైదుగురు కథారచయితలూ, ఆయనకు సమకాలికులైన నలుగురైదుగురు కథారచయితలు ఉన్నారు.

1900 నుంచి 1920 వరకు ఒక ఇరవై కథలు వచ్చి ఉంటాయేమో! పదిమంది కథా రచయితలను మాత్రమే లెక్కపెట్టవచ్చు. 1919లో 'సాహితి' పత్రిక ప్రారంభమైంది. దీన్ని పూర్తిగా కథల పత్రికగానే తేవాలని నిర్వాహకులు సంకల్పించిన వైనం ఆ పత్రిక పాతసంచికలు చూస్తే తెలుస్తుంది. అయితే విశ్వనాథ, నాయని, కొడాలి వంటి ఆనాటి గొప్ప కవుల కవితలు అప్పుడప్పుడు కన్పించేవి వీటిలో. చలం తన మొదటి కథ ఈ పత్రికలోనే రాశాడు. ఈ పత్రిక మొదట్లో తెనాలినుంచి ఆ తర్వాత విజయవాడ నుంచి వచ్చినట్లుగా ఊహించాలి. మూడు నాలుగేళ్ళ కన్నా ఈ పత్రిక రాలేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలు ఈ పత్రికలో కన్పించవు. ఏమంటే 1922కే ఆయన తన పత్రిక ప్రబుద్ధాంధ్ర ప్రారంభించాడు. అంతకుముందే ఆర్నెల్లో ఏడాదో ఆయన 'అభ్యుదయ' అనే పత్రికను నడిపాడు. శ్రీపాదను కూడా గురజాడ సమకాలీన కథారచయితలలోనే చెప్పాలి. కోటంరాజు పున్నయ్య ఆంధ్రపత్రిక సంపాదకవర్గంలో పనిచేస్తుండగా ఆయన ప్రోత్సాహంపై తాను కథారచన కుపక్రమించినట్లు శ్రీపాద స్వీయచరిత్రలో చెప్పుకున్నాడు.

'సాహితి' పత్రిక ప్రారంభమైన తర్వాత తెలుగు కథ తారుణ్యం పొందిందని చెప్పాలి. భాషలో, ఇతివృత్తంలో నవ్యత, నాజూకుతనం సంతరించుకుంది తెలుగు కథ. గురజాడ అప్పారావుతో సమస్కంధుడైన రచయిత చింతా దీక్షితులు. దీక్షితులుగారి కథలు సుమారు పదిదాకా 'సాహితి' లో వచ్చాయి. మునిమాణిక్యం నరసింహారావు ఇందులోనే కథా రచనకు శ్రీకారం చుట్టాడు. కొడవటిగంటి కుటుంబరావు అన్నగారైన వెంకటసుబ్బయ్య సాహితిలో కథలు రాశాడు. వర్ఝ్యు బాబూరావు, శ్రీనివాస శిరోమణి, వేలూరి శివరామశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ సాహితిలో కథలు రాశారు. అప్పటికే తెలుగు కథ ఇతివృత్త వైవిధ్యం సంతరించుకున్నది. గిడుగు రామమూర్తి పంతులుగారి ధర్మమా అని భాషలో కూడా సారళ్యం, వ్యవహారికపు నుడికారం తేటతనం మొదలైనాయి. తొలితరం తెలుగు కథా రచయితలు అంటే ఇంచుమించు 20 శతాబ్దం ప్రథమ పాదం. వారు కథ ముగింపులో ఒక ఒడుపు, ఒక విడుపు ఆశించినట్లు కనపడుతుంది. పొడుపుకథ విడుపుకథ లాంటి ఒక కొసమెరుపు ఉంటే కాని అది మంచి కథ అనిపించుకోదు అని భావించినట్లుగా కూడా అనిపిస్తుంది. ముడి విప్పినట్లు అన్న మాట. విస్మయకారకమైన ఏదో వైలక్షణ్యం కథలో ఉండాలని వారి ప్రయత్నంలాగ కనపడుతుంది. తల్లావఝ్ఝుల శివశంకరస్వామి, కొడాలి ఆంజనేయులు, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామి సాహితి పత్రికను నిర్వహించారు. అప్పట్లో అంటే 20వ శతాబ్ది మొదటి పాదం ముగిసినదాకా 10 పత్రికలు కూడా ఉండేవి కావు.

1921-1922 ప్రాంతంలోనే మచిలీపట్నం (బందరు) నుంచి 'శారద' పత్రిక ప్రారంభమైంది. కౌతా శ్రీరామశాస్త్రి, నడింపల్లి లక్ష్మీనరసింహరావు ఈ పత్రిక సంపాదకులు. కలకత్తా నుంచి రామానంద ఛటర్జీ నడిపిన 'మోడరన్ రివ్యూ' లాంటి పత్రిక తెలుగులో ఉండాలని 'శారద' పత్రికను నడిపినట్లుగా ఆ పత్రికను చూస్తే తెలుస్తుంది. ఈ పత్రికలో కళ, సంస్కృతి, కవిత్వం, చిత్రలేఖనం, స్వాతంత్ర్యోద్యమం, సంవాద రచనలతోపాటు కథలు కూడా ఉండేవి. చిల్లరిగె శ్రీనివాసరావు, నిడుమోలు కనకసుందరం వంటి కథా రచయితలు 'శారద'లో కనిపిస్తారు. ప్రమోదకుమార చటర్జీ లిఖించిన సరస్వతీదేవి చిత్రం ముఖచిత్రంగా ఉండేది. తరువాత భారతి పత్రికకు ఇదే స్ఫూర్తిదాయకమైంది. శారద పత్రికను నడపలేక ఆ పత్రికను నడపవలసిందని నిర్వాహకులు కోరినా, కాశీనాథుని వారు తమ స్వంత పత్రికను ప్రారంభించినట్లు తెలుస్తున్నది. 1924 జనవరి సంచికగా 'భారతి' పత్రిక ప్రారంభ సంచిక వెలువడింది. 'భారతి' ఇంచుమించు 60 ఏళ్ళు వచ్చింది. అరవై ఏళ్లు అంటే 720 సంచికలు. ఒకరకంగా చూస్తే భారతి తెలుగు కథను ఆధునీకరించింది. 20వ శతాబ్దపు కళా సాహిత్య సాంస్కృతిక వైజ్ఞానిక ప్రాతినిధ్య ప్రతిభా సమగ్రమైన పత్రిక 'భారతి'. భారతిలో వెలువడ్డ రచనా ప్రక్రియలన్నిటా అధికసంఖ్యలో వెలువడ్డవి కథలే. అరవై ఏళ్ళు వెలువడ్డ భారతి పత్రికలో నూట ఇరవైమంది కన్నా ఎక్కువ సంఖ్యలోనే కథారచయితలు కనపడతారు. రెండు వందల పైనే కథలు వచ్చి ఉండవచ్చు. తెలుగు కథా సాహిత్యానికి భారతి ప్రోత్సాహం ఇంతా అంతా కాదు. ఎన్నో మంచి కథలూ, కొన్నైనా గొప్ప కథలూ భారతిలో వచ్చాయి. అనంతర కాలంలో ప్రసిద్ధులైన కథా రచయితలందరూ భారతిలో కనబడతారు. పట్టికీకరించివలసి వస్తే ఒక వంద పేర్లైనా తలచుకోవలసి ఉంటుంది.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో తన కౌమారదశకు చేరుకుంది కాబట్టి స్వాతంత్ర్యోద్యమం, ఆర్థిక సాంఘిక సమస్యలు, సమకాలీన ప్రపంచ సాహిత్య ప్రభావం, ప్రయోగాలూ, సామ్యవాద సిద్ధాంతాలూ, తెలుగు కథను ఇతివృత్త వైవిధ్యభరితం చేశాయి. ఒక పక్కన భావకవిత్వం కూడా ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఒక మోజులాగా అనుశాసిస్తున్నది కాబట్టి అటువంటి రీతులు కూడా సకృత్తుగానైనా కథా రచనలో ఆ కాలంలో కనపడతాయి. అడవి బాపిరాజు లాంటి రచయితలు ఇందుకుదాహరణ. స్వాతంత్ర్యం రాకపూర్వం సమాజాన్ని ప్రతిబింబింపచేస్తున్న కథలు, అవశేషించిపోతున్న వేశ్యా వ్యవస్థ, ఆకలి, దారిద్ర్యం, సామాజిక సంఘర్షణలు, సమస్యలు తెలుగు కథను ఇతివృత్తం దృష్ట్యా వైవిధ్యీకరించాయి.

స్వాతంత్ర్యం రాకపూర్వం రచయితలలో కళాకారులలో ఒక భావోద్వేగం, ఒక ఆర్తి, ఒక వేదన నెలకొని ఉండేవి. 'దేశమును ప్రేమించుమన్నా' అన్న గురజాడ ఉద్బోధ విద్యావంతులలో దేశం పట్ల ఒక మమతను, ఉత్సుకతను రేకెత్తించాయి. గతకాలపు సామాజిక వ్యవస్థలో లోపాలున్నా ఈ నీరు, ఈ గాలి, ఈ పచ్చటి పొలాలూ, గత స్మృతి చిహ్నాలైన విద్యలు, వంకలు, వాగులు, పడిపోయిన పాడుగోడలు, ఎప్పుడు పుట్టాయో తెలియని మహావృక్షాలు, కులవృత్తులు, గుళ్లు, గోపురాలు, సంస్థానాలు, రాజరికాలు నా పూర్వుల జీవితాలలో మమేకమైపోయి ఉండేవి అనే భావం ఉండేది. అందువల్ల కథారచయితల కథల్లో అవి కనపడేవి. వేలూరి శివరామశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మల్లాది రామకృష్ణశాస్త్రి ఆధునిక జానపద కథలు రాశారు. వాళ్ళ సృజనాత్మకతకు కథా ప్రక్రియ మాధ్యమం ఉత్తేజం కలిగించింది. ఆరు శాస్త్రాలు చదువుకున్న శివరామశాస్త్రి పిత్తల్ కా దర్వాజా లాంటి కథలు ఎందుకు రాస్తాడు లేకపోతే! శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి వడ్లగింజలు, గులాబి అత్తరు, విమానం ఎక్కబోతూనూ లాంటి కథలు రాయడానికి కారణమేమిటి కాకపోతే, కవికొండల వెంకటరావు, పెనుమంచిలి జైనదేవుడు ఈ నేపథ్యంతో రాసిన కథే. వీళ్ళతో పోల్చినప్పుడు పాలగుమ్మి పద్మరాజు ఆ రోజుల్లో యువ రచయిత, అతడు కోట గోడలు లాంటి కథలు రాశాడు. భారతి పుట్టిన 1924 నుంచి స్వాతంత్ర్యం వచ్చిన 1947 వరకు ఒక ముప్పై మంది కథా రచయితలను సమీక్షిస్తే వీళ్ళంతా కొంతవరకైనా భావోద్విగ్నతకు, సంప్రదాయ వారసత్వానికి, పాండిత్యానికి ఆకృష్టులైనవారే. నోరి నరసింహశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, మొక్కపాటి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజు వంటి తొలితరం, మలితరం కథా రచయితలు జాతీయాభిమానంతోనే రచనలు చేసినట్లు కనపడుతుంది. మునిమాణిక్యం నరసింహారావుది కిందటి శతాబ్ది పూర్వార్ధంలో ఒక ప్రత్యేకమైన బాణి. రెండు ప్రపంచయుద్ధాలకు మధ్య నిదాఘం లాంటి సామాజిక సంబంధాలలో, ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, సత్యాగ్రహాలు, జైళ్ళు వంటి సాంఘిక వాతావరణంలో ఉపశమనమూ, మృదుహాస్యమూ, దాంపత్య జీవిత అన్యోన్యమూ కనపరచే కథలు రాశాడు మునిమాణిక్యం. అందువల్లనే ఆయన కథలు అప్పట్లో అందరూ మెచ్చారు. భమిడిపాటి కామేశ్వరరావుగారిది కూడా ఇదే ధోరణి అనిపిస్తుంది. నవ్యాంధ్ర సాహిత్య వీధులలో కురుగంటి సీతారామయ్య భమిడిపాటి కథలను గూర్చి ఇట్లా రాశాడు.

"మునిమాణిక్యం, మొక్కపాట్లతో సమానమైన వ్యక్తి ఈకాలంలో బయటపడ్డాడు. భమిడిపాటి కామేశ్వరరావు గారి కథాకథనం ఒక విశిష్టమార్గం. అందులో మంచి ప్రకృతి

పరిశీలనం, చక్కని వ్యవహారికం, హృదయరంజకమైన హాస్యం వుంటై. నవ్యాంధ్ర సాహిత్యవీధులు 1942 నాటికే వచ్చింది. విశ్వనాథ వారి జీవుడి ఇష్టము వంటి కథలలో చిక్కేమంటే భారతీయ తత్త్వచింతనం, పౌరాణిక పాత్ర పరిచితి వుంటే గాని ఆ కథలను అర్థం చేసుకొని ఆనందించలేము.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 20వ శతాబ్ది పూర్వార్థపు తెలుగు కథా రచయితలలో విలక్షణ శైలి, విశిష్ట భావాలూ ఉన్నవాడే కాని శిల్పం కన్న భావోద్వేగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. సజీవ పాత్రలు, ఆహ్లాదకరమైన కథనమూ ఉన్నా వీరి కథలు చాలా నిడివితో ఉంటాయి. ప్రకరణ విభాగంతోనూ ఉంటాయి. హావ భావ విన్యాసంతో ప్రత్యక్షంగా తన కథలు తానే చదివి విన్పిస్తున్నట్లుంటాయి ఆయన కథలు. తెలుగులో గొప్ప కథా రచయితలను ఐదారుగురిని చెప్పమంటే ఎవరి అభిరుచులకైనా ఆయన అందులో ఒకడిగా ఉంటాయి. 'మనిషి దీర్ఘ జీవితంలో రసవత్తరమైన ఒక ఘట్టం – జటిలమైన వొక అనుభూతి, హృదయాల మీద అచ్చుగుద్దుతుంది చిన్నకథ' అని శాస్త్రిగారంటారు.

"చిన్నకథ అంటే మూర్తిమంతాన్ని బట్టి కాదు పరిగణన, ఆత్మనుబట్టి కొండంత ఉంటుంది ఏనుగు. మరి సింహం? చిన్న కథకున్న యీ వైశిష్ట్యం గుర్తుంచుకోక మంచి చిన్నకథ రాయటం అసాధ్యం అంటాడు శాస్త్రిగారు. శ్రీపాదవారు భావంలో, భాషలో సంప్రదాయపరులలో అతి నవ్యుడు, నవ్యులలో అతి సంప్రదాయపరుడు. 'పురుషుల భాషలో కంటే స్త్రీల భాషలో మాధుర్యమూ, హృదయాలను పట్టివేసే జాతీయతా కనపడింది నాకు' అన్నారు శాస్త్రిగారు. చాలా అభ్యుదయ భావాలూ, ముందుచూపు, స్త్రీల మనోవికాసమూ, హార్దిక, ఆర్థిక స్వాతంత్ర్యమూ సర్వాత్మనా కోరుకున్న రచయిత శ్రీపాదవారు. జాతీయోద్యమకాలంలో అట్టడుగు వర్గాల దయనీయ జీవితాలను, చాలాకాలంగా వారనుభవిస్తున్న దురన్యాయాన్ని, దుర్భర క్లేశాలనూ కథా రచయితలు వర్ణించారు. తెన్నేటి సూరి, మాగోఖలే, కరుణకుమార ఇటువంటి కథలు రాశారు. తొలితరం మహిళా రచయితలలో కనుపర్తి వరలక్ష్మమ్మగారు ఒకరు. వారి కథలు భారతిలో వచ్చేవి. 'శైలి మాధుర్యం, వర్ణనా చాతుర్యం, కల్పనా సౌందర్యం' రసౌచితి, నైతిక ధర్మం గలవే ఉత్తమ కథలు. వీటికే స్థిరస్థానం, ప్రజాదరణ. వీటికి పాతబడి పోవటమంటూ ఉండదు. రవీంద్రుని కథలు ఇటువంటి శ్రేణికి చెందినవే. అతడు ఏ నీతినీ, ఏ ధర్మాన్నీ వెల్లడిగా ఏకరవుపెట్టడు. అయినా ప్రతి కథా ఏదో ఒక ఉత్తమాదర్శాన్ని వ్యక్తీకరిస్తూనే ఉంటుంది. అన్ని గుణాలూ ఉండి నైతికాదర్శం లేకపోతే అవి ఉత్తమ

కథలు కాలేవు. మధ్యమ కథలవుతాయి... కథారచన ఒక కళావిశేషమే... కాని ప్రయోజనం లేని కథ రాయడం తగని పనే.... అంటారు కనుపర్తివారు. తొలితరం రచయిత్రులలో దుర్గాబాయి, యల్లాప్రగడ సీతాకుమారి, ఇల్లిందల సరస్వతీదేవి వస్తారు. తమకు తెలిసీ, తాము చూచిన సమాజాన్ని మానవ స్వభావ వైచిత్రినీ ఈ రచయిత్రులు కథలుగా రాశారు.

చలం కథలలో స్త్రీ, పురుష సంబంధాలలో స్వేచ్ఛనూ, హృదయ వాదాన్ని, ఉద్వేగాకాంక్షలను చిత్రించాడు. ఆయన భావాలను మెచ్చుకొనేవాళ్ళే ఆయన శైలిని కూడా మెచ్చుకుంటారు. కాగా ఆయనలో భావవైరుధ్యం కూడా కనపడుతుంది.

ఈ ప్రక్రియకు కథానిక అనే పేరు వాడుకలోకి తెచ్చినవారు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. ఆయన కథల్లో కవితాశైలి, వర్ణనలు, ప్రకృతి సౌందర్యం, సామాజిక రుగ్మతలు వర్ణితమైనాయి. ఆధునిక కవిత్వంలో శ్రీశ్రీ కన్నా ముందే వస్తునవ్యత భావవిప్లవమూ తీసుకొనివచ్చిన శిష్ట్లా ఉమామహేశ్వరరావు మంచి కథలు రాశారు. ఆయన కవితా ప్రయోగాలైన 'నవమి చిలుక', 'విష్ణుధనువు'కు వచ్చిన గుర్తింపు ఆయన సిపాయి కథల కెందుకు రాలేదో ఆశ్చర్యమే. రెండో ప్రపంచ యుద్ధకాలంలో శిష్ట్లా సైనికపటాల సంబంధమైన ఉద్యోగం కొన్నాళ్ళు చేసినట్లున్నది. సిపాయిల జీవితాలకు సంబంధించిన ఇతివృత్తాలతో ఆయన కొన్ని మంచి కథలు రాశాడు. కవిత్వంలో లాగానే కథలలో కూడా విడ్డూరపు భావ విన్యాసం, ప్రవర్తన వైపరీత్యం పాత్రగతంగా చిత్రించడం శిష్ట్లాకు ఒక మోజు కావచ్చుననిపిస్తుంది, ఈ కథలు చదువుతున్నప్పుడు, సృజన ప్రతిభ పుష్కలంగా ఉన్నవాడు శిష్ట్లా ఉమామహేశ్వరరావు. తన కథలలో సన్నివేశాలు, సంఘటనలు చక్కగా కూర్చాడాయన. ఈ రచయితకు సంగీత పరిజ్ఞానమూ, అభిరుచీ ఉన్నట్లు ఈ కథలు చెబుతాయి. భాష మాత్రం కొంచెం పాత కొత్తల శైలిని, ఇంకా చికిలితనం చేకూర్చుకొన్న దశను కొన్ని కథలు సూచిస్తాయి. కె.వి. రమణారెడ్డి ఈ సిపాయి కథలు పాతికేళ్ళ కిందట ద్వితీయ ముద్రణ తెస్తూ (1984) శిష్ట్లాను ఉన్మత్తభావశాలి స్వైరవిహారధీరుడు అని కితాబు ఇస్తాడు. 1946లోనే మొదటిసారి పుస్తకరూపంలో యువప్రచురణగా వచ్చాయట ఈ కథలు. సైన్యంలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల జీవితాలలోని అభద్రతను, తెగింపు వల్ల కలిగిన నిర్లక్ష్య స్వభావాన్ని, క్రమరాహిత్య క్రమబద్ధ జీవితాలను అల్పసంతోషాలను కరుణార్ద్రంగానూ ముతక హాస్యంతోనూ చిత్రించిన కథలివి. స్వాతంత్ర్యం రావడానికి ఒక దశాబ్ది పూర్వాపరాలలో గోపీచంద్, బుచ్చిబాబు, కొడవటిగంటి కుటుంబరావు గొప్ప కథకులు. ముగ్గురి మార్గాలూ

వేరు వేరు. ముగ్గురి ప్రతిభలూ, కథావస్తుశిల్ప నిర్వహణలూ వేరువేరుగా ఉంటాయి. సాహిత్య సంవేదనలు కూడా భిన్నం. సామాజిక తత్త్వ చింతకుడు గోపీచంద్. ఆయన సాహిత్యంలో ప్రవేశించిన నేపథ్యం వేరైనది. సామ్యవాద అభిమాని కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యాదర్శాలు, పాఠకులలో ఆయన కలిగించాలనుకొనే చైతన్యం పూర్తిగా వర్గదృక్పథమూ, శ్రమదోపిడి మానవ జీవితంలో స్వార్థపరత్వమూ, సంప్రదాయా చారాభిమానంలో బోలుతనమూ, ధనస్వామ్య దాష్టీకమూ వెల్లడిస్తాయి. ఫాక్టరీ ఉత్పత్తికి (యాంత్రికతకు), చేతివృత్తి నైపుణ్యానికీ ఉండే వ్యత్యాసమే కుటుంబరావు, గోపీచంద్‌ల దృక్పథంలో వెల్లడవుతుంది. వ్యవసాయ నాగరికత గోపీచంద్‌ది. పారిశ్రామిక నాగరికత, మానవ సంబంధాలు కుటుంబరావువి. ఇక బుచ్చిబాబు సౌందర్యవాది, కళాశీలి, చిత్రకారుడు, భావుకుడు. మానవ జీవిత యథార్థ తత్త్వాన్వేషి. సినిమా తీసిన రంగస్థల నాటకం ఛాయలు కనపడతాయి ఆయన కథలలో. ఆంతరంగిక స్పందనలను, పాత్రల బహిరంతర చిత్తవృత్తులను ఆయన కథలు ప్రతిభావంతంగా ఆవిష్కరిస్తాయి. ప్రకృతిని కథీకరిస్తాడు బుచ్చిబాబు. 1960లో వచ్చేప్పటికి మరో ముగ్గురు ప్రతిభావంతులైన కథారచయితలు కనపడతారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు, దేవరకొండ బాలగంగాధర తిలక్‌లు వాళ్ళు. సమాజంలో దోపిడి వ్యవస్థను, వర్గ ప్రయోజనాలను, న్యాయ, చట్ట, కార్యనిర్వాహక శాఖల అవినీతిని, స్వలాభపరతను, క్రూరమైన స్వార్థాన్ని చిత్రించే కథలు మొదటి ఇద్దరివి. మానవ జీవితంలోని స్వాదుత్వాన్ని, సౌందర్యాన్ని చిత్రించే కథలు వీళ్ళు అసలు రాయలేదని కాదు. కాని నియంతృత్వ సామ్యవాదం ఉద్ధరించగలదని వీళ్ళ విశ్వాసం. తిరుగుబాటు పోరబాటు కాదని సిద్ధాంతం. ఇక బాలగంగాధర తిలక్‌కు బుచ్చిబాబుతో కొంతవరకు సామ్యం ఉంది. కవిత్వమూ కథా ఆయనలో కలసిపొయినయ్.

1970లో వచ్చేసరికి తెలుగు కథకు వన్నెలద్దిన మరో ముగ్గురు ప్రతిభావంతులైన కథా రచయితలు కనపడతారు. వారు – మధురాంతకం రాజారాం, బలివాడ కాంతారావు, వాకాటి పాండురంగారావులు. ఆ కథలు ఏ రాజకీయ సిద్ధాంతాల జోలికీ పోవు. మానవ సమాజ సంబంధాలు, విలువలు, మూలకాలను వారు కథీకరించారు. ఆర్. ఎస్. సుదర్శనం మేధావి. హృదయం, మేధా సమన్వయించిన కథలు రాశారు. ఆయన ఇల్లాలు వసుంధరాదేవి కూడా ప్రతిభావంత కథారచయిత్రి. అవసరాల రామకృష్ణారావు, మునిపల్లె రాజు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, శీలా వీర్రాజు, శ్రీపతి, పోలాప్రగడ సత్యనారాయణమూర్తి స్వాతంత్ర్యానంతరం మొదటి తరానికి చెందిన ప్రతిభావంతులైన

కథా రచయితలు. సాహిత్య అకాడమి పురస్కారాలు పొందిన ఇల్లిందల సరస్వతీదేవి, భమిడిపాటి రామగోపాలం, అబ్బూరి ఛాయాదేవి, మునిపల్లె, కేతు విశ్వనాథరెడ్డి, మధురాంతకం రాజారాం, బలివాడ కాంతారావు. కథావస్తువు శిల్ప నిర్వహణలు, కథా కథన ప్రతిభ సమీక్షించాలంటే ప్రతి ఒక్కరిపై ఒక పుస్తకం రాయాల్సివుంటుంది. సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, భాస్కరభట్ల కృష్ణారావు, సురమౌళి రచనా పాటవం వర్ణించడానికి మాటలు చాలవు. తెలుగునాట నాలుగు ప్రాంతీయ విభాగాలున్నాయి. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలవి. అక్కడి సమాజ జనజీవన పరిణామాలను, సాహిత్య సంవేదనలను సమీక్షించడానికి నూరేళ్ల తెలుగు కథ విహంగావలోకన పరిధి చాలదు. ఈ నూరేళ్ల తెలుగు కథ పుట్టు పూర్వోత్తరాల చారిత్రక నేపథ్య సమీక్షలో ప్రధాన ఘట్టాల, మైలురాళ్లవంటి సన్నివేశాల ప్రస్తావన మాత్రమే ఉంది. 1970, 1980 లలో కథా రచన ప్రారంభించి ఇప్పుడు నలభై, ఏభై ఏళ్ల వయసు మధ్య ఉన్న యువ, నవ, నడిమి వయస్కులైన రచయితలు సమాజాన్ని ప్రతిబింబింపచేస్తున్నవారు శతాధికంగా ఉన్నారు.

తొలి మలితరం **తెలుగు కథలు**

డా॥ అక్కిరాజు రమాపతిరావు

2010 సంవత్సరంలో తెలుగుకథ శతజయంతి జరిగింది. కాని అప్పటికి ఇరవై సంవత్సరాలకు ముందునుంచే కథారచన ఉందంటున్నారు తత్త్వవివేచకులు. సమాజంతో పాటు తెలుగుకథ కూడా ప్రభావితమైంది. అప్పటి ఆచారవ్యవహారాలు, సామాజిక జీవితం, సమస్యలు, సంఘర్షణలు, కష్టాలు, కన్నీళ్ళు ఇప్పటివారికి వింతగా తోచవచ్చు. తెలుగుకథ ఈ సామాజిక పరిణామ పర్యవసానాలను బలంగా ఇతివృత్తీకరించింది. బహుశా ఈ నూరు నూటయాభై ఏళ్ళలో ఈ ప్రక్రియను అభిమానించిన, అలరించిన విశిష్ట రచయితలు మరే ఆధునిక సాహిత్య తెలుగు ప్రక్రియకూ లేరనే చెప్పాలి. ఇంత సంఖ్యలో మరే ప్రక్రియా సంబంధి రచనలు వెలువడలేదు.

అంతేకాదు, సమకాలీన సమాజపు పోకడలను, పరిణామాలను, పర్యవసానాలను మంచిచెడ్డలను ఈ సాహిత్యప్రక్రియ చిత్రించినంత విస్తారంగా, బలంగా, ప్రతిభా శీలంగా మరే ప్రక్రియా చిత్రించగల అవకాశం లేదు కదా! తక్కిన ప్రక్రియలు ఏవైనా సమాజపు ఒడిదుడుకుల ఒక పార్శ్వాన్ని, ఒక ప్రబల సమస్యను మాత్రమే చిత్రించగల సామర్థ్యం మాత్రమే చూపగలవు. కథ విషయం అటువంటిది కాదు. సమగ్ర, సంపూర్ణ మానవసమాజాన్ని కథ ఆవిష్కరించగలదు. కథలో పల్లె జీవ సాక్షాత్కార పాత్రలు నాటకం, నాటిక, నవల వంటి వచన ప్రక్రియలలో చూపగలిగినా అవి వస్త్వాశ్రయాలు మాత్రమే కాగలవుకాని, ఆత్మాశ్రయాలు కావు. హృదయదఘ్నమైన అనుభూతులను కథ ఆవిష్కరించినంతగా మరి ఏ ఇతర సృజనాత్మక సాహిత్య ప్రక్రియ ఆవిష్కరించటం కుదరదేమో!

ఈ కథా సంకలనం వల్ల తెలుగు కథ వస్తు రూప శిల్ప వికాసం, పరిణామ క్రమం కూడా అవగతమవుతుంది. నూరేళ్ళనాటి కథా రచనా వస్తువు లేవిధంగా ఉండేవో ఈ సంకలనం స్పష్టం చేస్తుంది.

**బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్**
గుంటూరు